వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఉద్యోగ పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఉద్యోగ పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ- మూర్తి

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

ఉద్యోగ పర్వం - 1

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి 2010)

18 సంపుటాల వెల : రూ. 720/-

C 27461
సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A.C.No. 96357
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, పోలకంపాడు,
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

ఉద్యోగ పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ, డాక్టర్ ఎం.టి. ఆళ్వారు, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని

మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇరతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. సేనోద్యోగపర్వము - 19	
1.	విరాటరాజసభలో శ్రీకృష్ణభగవానుని భాషణము. (26)*	15
2.	బలరాముని భాషణము. (15)	17
3.	సాత్యకి వీరోచిత సంభాషణము. (23)	19
4.	ద్రుపదుని అంగీకారము. (26)	20
5.	శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్లుట, విరాటాది రాజులు పాండవ పక్షమున చేరుట. (18)	22
6.	ద్రుపద పురోహితుని హస్తినాపుర ప్రయాణము. (19)	23
7.	శ్రీకృష్ణుడు దుర్యోధనునకు, అర్జునునకు సహాయము చేయుట. (39)	24
8.	శల్యుడు దుర్యోధనునకు మాట ఇచ్చి, ధర్మరాజు దగ్గరకు వచ్చుట. (54+5)	26
9.	ఇంద్రుడు త్రిశిరుని వధించుట, వృత్రాసురుని ఉత్పత్తి. (59+6)	29
10.	ఇంద్రునికి బ్రహ్మహత్యాదోషము సంక్రమించుట. (50)	33
11.	నహుషుని ఇంద్రపదవి - శచీదేవి దుఃఖము - బృహస్పతి ఓదార్పు. (26)	36
12.	ఇంద్రాణి నహుషుని వద్దకు వెళ్లుట. (32)	37
13.	నహుషుడు ఇంద్రాణికి గడువు ఇచ్చుట, ఇంద్రుడు బ్రహ్మహత్యనుండి విముక్తు డగుట. (27)	40
14.	ఇంద్రాణి ఇంద్రుని కలిసికొనుట. (18)	41
15.	నహుషుడు ఋషులను బోయీలుగా చేయుట - బృహస్పతి అగ్నిదేవుల సంవాదము. (34)	42
16.	ఇంద్ర వరుణాదుల సంవాదము. (34+$\frac{1}{2}$)	45
17.	నహుష పతనమును అగస్త్యుడు ఇంద్రునకు తెలుపుట. (22)	47
18.	ఇంద్రుడు స్వర్గమున కేగుట. శల్యుడు దుర్యోధనుని చేరుట. (25)	48
19.	ఉభయసేనల వివరణము. (33)	50

* బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	2. సంజయయాన పర్వము - 13	
20.	ద్రుపద పురోహితుడు కౌరవసభలో మాట్లాడుట. (21)	51
21.	ద్రుపద పురోహితుని మాటను భీష్ముడు సమర్థించుట. (21)	53
22.	ధృతరాష్ట్రుడు పాండవుల కడకు సంజయుని పంపుట. (40+1)	54
23.	సంజయుడు యుధిష్ఠిరుని కలిసి మాట్లాడుట. (28)	58
24.	యుధిష్ఠిరుని ప్రశ్నలకు సంజయుడు సమాధాన మిచ్చుట. (10)	60
25.	సంజయుడు ధృతరాష్ట్రుని సందేశమును యుధిష్ఠిరునికి వినిపించుట. (15)	61
26.	తనరాజ్యమిచ్చినచో శాంతి లభించునని యుధిష్ఠిరుడు చెప్పుట. (29)	63
27.	సంజయుని వచనములు. (27)	66
28.	సంజయునికి యుధిష్ఠిరుడు సమాధాన మిచ్చుట. (14)	68
29.	శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి సందేశ మిచ్చుట. (58)	70
30.	యుధిష్ఠిరుని సందేశము. (49+1)	75
31.	యుధిష్ఠిరుడు ఆతిముఖ్యులైన కురువంశీయులకు సందేశ మిచ్చుట. (23)	80
32.	సంజయుడు హస్తినకు చేరుట. (32+7 $\frac{1}{2}$)	81
	3. ప్రజాగర పర్వము - 8	
33.	ధృతరాష్ట్ర విదుర సంవాదము. (123+6)	84
34.	విదురుడు నీతి నుపదేశించుట. (86)	94
35.	విదురుడు నీతి నుపదేశించుట. (77)	100
36.	విదురుని నీతి వాక్యములు. (74)	106
37.	విదురుడు ధృతరాష్ట్రునకు హిత ముపదేశించుట. (64)	112
38.	విదురుడు ధృతరాష్ట్రునకు నీతి నుపదేశించుట. (47)	117
39.	విదురుడు ధృతరాష్ట్రునకు నీతి నుపదేశించుట. (85)	120
40.	విదురుడు ధర్మమహత్త్వమును చెప్పుట. (32)	127
	4. సనత్సుజాత పర్వము - 6	
41.	అధ్యాత్మవిద్య నుపదేశింపుమని విదురుడు సనత్సుజాతుని కోరుట. (12)	129

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
42.	ధృతరాష్ట్రుని ప్రశ్నలు - సనత్సుజాతుని సమాధానము. (46)	130
43.	గుణదోష నిరూపణము. (63)	135
44.	బ్రహ్మచర్యమును, బ్రాహ్మణుని నిరూపించుట. (31)	140
45.	గుణదోషముల లక్షణము, బ్రహ్మవిద్యా నిరూపణము. (21)	143
46.	పరమాత్మ స్వరూపము - సాక్షాత్కారము. (31)	145
	5. యానసంధి పర్వము - 25	
47.	కౌరవసభలోనికి సంజయుడు ప్రవేశించుట. (17)	149
48.	అర్జునుని మాటలు సంజయుడు కౌరవ సభలో చెప్పుట. (109)	150
49.	భీష్ముడు సభలో కృష్ణార్జునులను ప్రశంసించుట. (48)	160
50.	సంజయుడు ధర్మరాజుసహాయులను వర్ణించుట. (50)	162
51.	ధృతరాష్ట్రుడు భీముని బలమును తలచుకొని పరితపించుట. (61)	166
52.	ధృతరాష్ట్రుడు అర్జునుని పరాక్రమమును గురించి విలపించుట. (20)	170
53.	పాండవ బలమును గూర్చి ధృతరాష్ట్రుని విలాపము. (16)	171
54.	సంజయుని మాటలు. (22)	172
55.	దుర్యోధనుడు తన శక్తిని గూర్చి చెప్పుకొనుట. (69)	174
56.	సంజయుడు పాండవుల దివ్యశక్తులను వర్ణించుట. (17)	178
57.	సంజయుడు పాండవుల బలమును ధృతరాష్ట్రునికి తెలుపుట. (62)	179
58.	దుర్యోధనుని అభిప్రాయము - ధృతరాష్ట్రుని భయము. (29)	183
59.	కృష్ణుని మాటలను సంజయుడు చెప్పుట. (31)	185
60.	ధృతరాష్ట్రుడు కౌరవ పాండవుల బలములను వివేచించుట. (23+2 $\frac{1}{2}$)	187
61.	పాండవులకు దైవబలము లేదని తనబలమే అధికమని దుర్యోధనుడు చెప్పుట.(29)	188
62.	కర్ణ - భీష్మ సంవాదము. (18)	190
63.	విదురుని ఉపదేశము. (24)	192
64.	జ్ఞాతివిరోధము తగదని విదురుడు బోధించుట. (27)	193
65.	సంధికి అంగీకరింపుమని ధృతరాష్ట్రుడు పుత్రునకు చెప్పుట. (16)	195

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
66.	అర్జునుని మాటలను సంజయుడు ధృతరాష్ట్రునకు చెప్పుట. (15)	196
67.	వ్యాస గాంధారుల రాక. (10)	197
68.	ధృతరాష్ట్రుని ప్రశ్నకు సంజయుని సమాధానము. (15)	198
69.	వ్యాస సంజయుల బోధ. (21)	199
70.	కృష్ణుని వాసుదేవాది నామముల నిర్వచనము. (15)	201
71.	ధృతరాష్ట్రుని వచనములు. (7)	202
	6. భగవద్యాన పర్వము - 79	
72.	ధర్మరాజు శ్రీకృష్ణుని దౌత్యము చేయుమని అర్థించుట. (93+5 $\frac{1}{2}$)	202
73.	శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని యుద్ధమునకు పురికొల్పుట. (42)	210
74.	భీమసేనుడు సంధిని గురించి ప్రస్తావించుట. (23)	212
75.	శ్రీకృష్ణుడు భీమసేనుని ఉత్తేజపరచుట. (23)	214
76.	భీమసేనుని సమాధానము. (18)	216
77.	శ్రీకృష్ణుడు భీమసేనుని ఓదార్చుట. (20)	217
78.	అర్జునుని మాటలు. (19)	219
79.	శ్రీకృష్ణుడు అర్జునునకు ప్రత్యుత్తర మిచ్చుట. (21)	220
80.	నకులుని మాటలు. (18)	222
81.	సహదేవుడు, సాత్యకి యుద్ధమునకు ఇష్టపడుట - యోధులు సమర్థించుట. (9)	223
82.	ద్రౌపది శ్రీకృష్ణునితో తన కష్టమును చెప్పుట. (49)	224
83.	శ్రీకృష్ణుడు హస్తినకు బయలు దేరుట - దారిలో మహర్షులను చూచుట. (72+5 $\frac{1}{2}$)	227
84.	శ్రీకృష్ణుడు హస్తినకు చేరి విశ్రమించుట. (29)	231
85.	శ్రీకృష్ణుని మార్గమున విశ్రాంతి స్థానముల నేర్పరచుట. (18)	233
86.	ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణభగవానుని స్వాగతించుట. (21)	234
87.	శ్రీకృష్ణుని ఆజ్ఞను పాటింపుమని విదురుడు ధృతరాష్ట్రునకు జెప్పుట. (17)	235

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఉద్యోగ పర్వం - 1

1. విరాటరాజు సభలో శ్రీకృష్ణభగవానుని భాషణము.

వైశంపాయనుడు ఇలా అన్నాడు. జనమేజయా! అభిమన్యుని వివాహం చేసి పాండవులూ, వారి పక్షంలో ఉన్నవారూ (యాదవ పాంచాలాదులు) చాలా ఆనందించారు. వారు ఆ రాత్రి విశ్రాంతి తీసుకొని ఉషఃకాలంలో నిద్రలేచి, విరాటుని సభకు చేరుకొన్నారు. మత్స్యదేశాధిపతి అయిన విరాటుని సభ ఎంతో సమృద్ధిగా ఉంది. దానిలో ఉత్తమ మణులు పొదిగి ఉన్నాయి. ఈ అలంకారాలతో ఆ సభ చిత్రంగా శోభిస్తోంది. తగిన ఆసనాలను ఆయా స్థానాలలో వేసి ఉంచారు. సుగంధభరితమైన పూల దండలు కట్టారు. పెద్దపెద్ద రాజులు అందరు అక్కడకు చేరుకొన్నారు. ఆ సభలో అందరికి ముందు విరాటరాజు, ద్రుపదుడు ఆసనాలపై కూర్చున్నారు. వారు రాజులందరిలో వృద్ధులు, పూజ్యులు. తమ తండ్రి వసుదేవునితో కలసి బలరామ కృష్ణులు కూడా ఆసనాలపై కూర్చున్నారు. ద్రుపదుని ప్రక్కన సాత్యకి, బలరామునితో కలిసి కూర్చున్నాడు. మత్స్యరాజైన విరాటునికి మరింత దగ్గరగా శ్రీకృష్ణుడు, ధర్మరాజు కూర్చున్నారు. ద్రుపదరాజు పుత్రులు, భీమార్జునులు, నకుల సహదేవులు, ప్రద్యుమ్నుడు, సాంబుడు, విరాటుని పుత్రులతో కలిసి అభిమన్యుడు, ద్రౌపది పుత్రులు... అందరు అందమైన బంగారు ఆసనాలపై కూర్చున్నారు. ద్రౌపదిపుత్రులు అయిదుగురు సౌందర్య బలపరాక్రమాలలో తమ తండ్రులతో సమానంగా ఉన్నారు. వారు ఎవరికివారే శూరులు, వీరులు.

రాజులతో నిండుగా ఉన్న ఆ సభ కాంతిమంతమైన గ్రహాలు, నక్షత్రాలతో నిండిన ఆకాశంవలె ప్రకాశించింది. ఆ వీరపురుషులందరు సమయోచితమైన చిత్ర

సంభాషణలు చేస్తూ కృష్ణుని వైపు చూచి ఆలోచనలో మునిగి మౌనంగా ఉన్నారు. సంభాషణలు ఆపిన తరువాత పాండవుల ప్రయోజనం కోసం ఒక చోటికి చేరిన రాజోత్తము లందరు సారగర్భితమూ, శ్రేష్ఠఫలదాయకమూ అయిన కృష్ణునిమాట విన నారంభించారు.

శ్రీకృష్ణుడు ఇలా ప్రారంభించాడు. "జరిగినది అంతా మీకు తెలుసు. సుబలపుత్రుడైన శకుని జూదంలో మోసం చేసి ధర్మాత్ముడైన యుధిష్ఠిరుని ఓడించి, రాజ్యాన్ని అపహరించి, పన్నెండేళ్లు అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసానికి షరతు విధించాడు. పాండవులు ఎప్పుడూ సత్యంపైనే ఉంటారు. సత్యమే వీరి రథం. చిటికెలో సమస్త భూమండలాన్ని జయించే శక్తి వీరిలో ఉన్నా ఈ పాండుకుమారులు సత్యవ్రతాన్ని పాటించటం కోసం పదమూడేళ్లు అరణ్యవాసం, అజ్ఞాతవాసం కఠోరమైన దీక్షతో పూర్తి చేశారు. ఈ పదమూడవ సంవత్సరం పూర్తి చేయటం మరీ కష్టం. కాని ఈ మహాత్ములు మీవద్ద అజ్ఞాతరూపంలో ఉంటూ సహింపరాని అనేకక్లేశాలను సహించారు. పన్నెండేళ్లు అడవులలో బాధలు పడ్డారు. వంశపారంపర్యంగా రావలసిన రాజ్యం కోసం ఈ వీరులు ఇప్పటివరకు అజ్ఞాతవాసంలో మరొకరిసేవలో నిమగ్నులై, పదమూడవ సంవత్సరాన్ని పూర్తి చేశారు. ఈ పరిస్థితిలో యుధిష్ఠిరునికీ, దుర్యోధనునికీ ఏ ఉపాయంతో మేలు జరుగుతుందో మీరు ఆలోచించండి. మీరు చూపే ఏ మార్గమైనా కురుశ్రేష్ఠులైన ఈ వీరులకు ధర్మానుకూలం, న్యాయోచితం, కీర్తికరం కావాలి. ధర్మరాజు ధర్మ విరుద్ధంగా దేవతల రాజ్యాన్నయినా కోరడు. ధర్మానికీ, అర్థానికీ అనుకూలంగా ఉన్న చిన్నగ్రామమైనా రాజ్యంగా స్వీకరించటానికి వీరు సిద్ధంగా ఉన్నారు. ధృతరాష్ట్రపుత్రులు పాండవులకు పైతృకంగా రావలసిన రాజ్యాన్ని ఎలా అపహరించారో రాజులందరికీ తెలుసు.

కౌరవులు చేసిన ఈ కపటవ్యవహారం కారణంగా పాండవులు ఎంతటి కష్టాన్ని అనుభవించారో మీకు తెలియనిది కాదు. ధృతరాష్ట్రపుత్రులు తమ బలపరాక్రమాలతో కుంతీపుత్రుడైన యుధిష్ఠిరుణ్ణి ఏ యుద్ధంలోనూ ఓడించలేదు కదా! అయినా స్నేహితులతో కూడిన ధర్మరాజు వారి క్షేమాన్నే కోరుతున్నాడు. రాజులందరినీ జయించి స్వయంగా సంపాదించిన ధనాన్ని మాత్రమే కుంతీసుతులు, మాద్రీసుతులు అయిన పాండవులు కోరుతున్నారు. వీరు బాల్యంలో అభం శుభం తెలియని వయస్సులో ఉన్నప్పుడే వీరి

రాజ్యాన్ని అపహరించడానికి ఉగ్రస్వభావులైన దుష్టులతో కలిసి కుట్రలు పన్ని, వీరిని చంపటానికి ఎన్నో ఎత్తులువేసిన సంగతి మీకు అందరకు తెలిసినదే. అందువలన సభాసదులందరు కౌరవుల అతిలోభాన్ని, యుధిష్ఠిరుని ధర్మజ్ఞతను, ఇరుపక్షాలవారి బంధుత్వాన్ని, పరిశీలించి, విడివిడిగాను, అందరు కలిసి ఆలోచించి, ఒక నిర్ణయం చేయండి. ఈ పాండవులు సదా సత్య పరాయణులు కావటం వలన చేసిన ప్రతిజ్ఞను అనుకొన్నట్లు పూర్తిచేశారు. ధృతరాష్ట్రపుత్రులు వీరిపట్ల విపరీత వ్యవహారం చేయ దలచుకొంటే, (వీరికి రాజ్యం తిరిగి ఈయకపోతే) పాండవులు వారిని చంపేస్తారు. కౌరవులు పాండవుల కార్యానికి విఘ్నాలు కల్పిస్తారు. అపకీర్తిని తేవటానికి సిద్ధపడతారు. ఈ విషయాన్ని నిశ్చయంగా తెలుసుకొన్న మిత్రులు, బంధువులు వారిని ఆపాలి.

ధృతరాష్ట్రపుత్రులు ఈ విధంగా పాండవులను బాధిస్తారు. వారిచే బాధింపబడిన వీరు యుద్ధంలో వారిని సంహరిస్తారు. అయినా తక్కువ సంఖ్యలో ఉన్న వీరు వారిని జయించడానికి సమర్థులు కారని మీ అభిప్రాయం అయి ఉండవచ్చు. అయినప్పటికీ వీరి శ్రేయోభిలాషులు, మిత్రులు అందరు కలసి వారి వినాశనానికి ప్రయత్నం చేసి తీరుతారు. దుర్యోధనుని అభిప్రాయం ఏమిటి? అనేది ఇప్పటికీ స్పష్టంగా తెలియక పోవడం వలన వారు ఏం చేయబోతున్నారో తెలియటం లేదు. శత్రుపక్షం ఆలోచన తెలియకుండా మీరు 'ఇది ఇలా చెయ్యాలి' అని ఎలా నిశ్చయించగలరు? కార్యం ఎలా పరిణమిస్తుందో తెలుసుకోవలసిన అవసరం ఉంది. కనుక ధర్మశీలుడు, పవిత్రాత్ముడు, కులీనుడు, సావధానుడు అయిన ఒక వ్యక్తి దూతగా అక్కడకు వెళ్లాలి. ఆ దూత కౌరవుల అహంకారాన్ని, ఆవేశాన్ని శాంతింపచేసి, యుధిష్ఠిరునకు అర్ధరాజ్యాన్ని ఇచ్చేటట్లుగా చేయగలవాడై ఉండాలి." శ్రీకృష్ణుడు ధర్మబద్ధంగా, అర్థయుక్తంగా, మధురంగా, ఇరుపక్షాల వారికీ తగిన విధంగా పలికిన ఆ పలుకులను బలరాముడు విని, బాగా ప్రశంసించి, తాను మాట్లాడటం ప్రారంభించాడు.

2. బలరాముని భాషణము.

'సుజనులారా! ధర్మరాజుకు, దుర్యోధనునకు హితమైనదీ, ధర్మానుకూలమూ, అర్థ శాస్త్రసమ్మతమూ అయిన శ్రీకృష్ణుని సంభాషణను మీరు అందరూ విన్నారు. మహావీర్యులైన పాండవులు సగం వదులుకొని అర్ధరాజ్యానికి ప్రయత్నిస్తున్నారు.

దుర్యోధనుడు వారు అడుగుతున్న అర్ధరాజ్యాన్ని ఇచ్చి, మనతోపాటు తాను కూడా సుఖంగా, సంతోషంగా ఉండాలి. శ్రేష్ఠులైన పాండవులు అర్ధరాజ్యాన్ని పొంది తమ వారి యందు, పరులయందు సమానమైన ప్రశాంతతతో సుఖం పొందుదురు గాక! వారి ప్రశాంతత ప్రజలకు మేలు కలిగిస్తుంది. దుర్యోధనుని అభిప్రాయాన్ని తెలుసుకోవడానికీ, యుధిష్ఠిరుని పలుకులను అతనికి తెలియజేయటానికీ, కౌరవపాండవులకు శాంతి కలిగించటానికీ ఎవడైనా ఒకడు రాయబారిగా వెళ్లాలి. ఈ ప్రయత్నం నాకు చాలా ప్రియమైనది. ఆ దూత భీష్ముణ్ణీ, ధృతరాష్ట్రునీ, ద్రోణునీ, అశ్వత్థామనూ, విదురుణ్ణీ, కృపాచార్యునీ, శకునినీ, కర్ణునీ, కౌరవులందరినీ, ఆ సభలోని పౌరులనూ ఉద్దేశించి వినయపూర్వకంగా పాండవులకు ప్రయోజనకరమైన విధంగా మాట్లాడాలి. ఏ దశలోనూ వారికి కోపం తెప్పించకూడదు. ఎందుకంటే వారు బలవంతులై రాజ్యంపై అధికారం పొంది ఉన్నారు. జూదంపై ఆసక్తితో ఆటకు వెళ్ళిన యుధిష్ఠిరుని రాజ్యాన్ని వారు అపహరించారు.

జూదం ఆడటం సరిగా ఎరుగని యుధిష్ఠిరుని హితులు అందరు నివారించారు. అయినా అతడు జూదానికి సిద్ధమై కర్ణుని, దుర్యోధనుని తాను గెలువగలిగిన వేలమంది జూదరులను వదలి గాంధార రాజకుమారుడు, జూదంలో నిపుణుడు అయిన శకునినే ఆటకు పిలిచి, అతనిచేతిలో ఓడిపోయాడు. జూదం ఆడుతున్న యుధిష్ఠిరుడు ఆటలో పాచికలు తిరగబడి ఓడిపోతూ, రోషావేశంతో జూదాన్ని కొనసాగించి ఓడిపోయాడు. దానిలో శకుని తప్పు ఏమీ లేదు. అందువలన ఇక్కడినుంచి వెళ్లేదూత ధృతరాష్ట్రునికి వినయపూర్వకంగా నమస్కరించి మాత్రమే సామనీతి యుక్తంగా మాట్లాడవలసి ఉంటుంది. అలా అయితేనే అతడు దుర్యోధనుని తన ప్రయోజనం సిద్ధంచేటట్లు నియోగించటం సాధ్యమౌతుంది. కౌరవపాండవుల మధ్య యుద్ధం జరగకుండా ఉండాలని కోరుకోండి. సంధి ప్రయత్నం, సామోపాయంతో మాత్రమే దుర్యోధనుని పిలవండి. ఆ మార్గంలో సిద్ధించిన ప్రయోజనమే లాభదాయకం అవుతుంది. యుద్ధం వలన ఉభయపక్షాలకు నష్టం, అన్యాయం జరుగుతుంది. అది ప్రయోజనకారి కాదు.' బలరాముడు ఇలా పలుకుతూ ఉండగా సాత్యకి తటాలున లేచి అడ్డుకొన్నాడు. బలరాముని పలుకులను వ్యతిరేకిస్తూ కోపంతో ఇలా మొదలు పెట్టాడు.

3. సాత్యకి వీరోచిత సంభాషణము.

సాత్యకి ఇలా అన్నాడు. "బలరామా! మనుష్యునకు ఎలాంటి హృదయం ఉంటే అలాంటిమాటలే అతని నోటినుండి వస్తాయి. మీకు కూడా ఎటువంటి అంతఃకరణ ఉన్నదో అటువంటి మాటలే మీరు మాట్లాడుతున్నారు. పురుషులలో శూరులూ ఉన్నారు. అలాగే కుత్సితులూ/ సోమరులూ ఉన్నారు. మానవులలో ఈ రెండురకాల వారూ కనిపిస్తూ ఉంటారు. ఒకే చెట్టు కొమ్మల్లో ఒకటి పండ్లు ఉన్నదీ మరొకటి లేనిదీ ఉన్నట్లే ఒకే వంశంలో పిరికివాడూ, మహావీరుడూ కూడా జన్మిస్తూ ఉంటారు. బలరామా! నీవు మాట్లాడిన మాట నేను తప్పు పట్టడంలేదు. ఆ మాటలను మౌనంగా వింటూ కూర్చున్న వారిని తప్పుపడుతున్నాను. ఎవడైనా సభలో నిర్భయుడై, ధర్మరాజుపై ఏ చిన్న దోషమైనా ఆరోపించటానికి ఎలా సాధ్యమౌతుంది? ఆసక్తి లేనివాడు, జూదం ఆడటం సరిగా చేతకాని వాడు, మహాత్ముడు అయిన ధర్మరాజును జూదంలో నిపుణులైన వారు తమ ఇంటికి పిలిచి, ఆడించి, గెలిస్తే అది ధర్మజయం ఎలా అవుతుంది? సోదరులతో కలసి తన ఇంటిలో జూదమాడుతున్న ధర్మరాజు వద్దకు వచ్చి, ఆడి, గెలిచి ఉంటే అది వారికి ధర్మజయం అవుతుంది. క్షత్రియధర్మాన్ని అనుసరించే యుధిష్ఠిరుని జూదానికి పిలిచి, మోసం చేసి, గెలిస్తే వారు చేసింది మంచిపని ఎలా అవుతుంది? పైగా ధర్మరాజు ప్రతిజ్ఞను పూర్తిచేశాక వచ్చి, వారికి ఎలా తలవంచుతాడు?

వనవాసం నుండి విముక్తుడు కాగానే ధర్మరాజు పైతృకమైన రాజ్యాన్ని పొందటానికి అర్హు డైనాడు. అతడేమైనా అన్యాయంగా తన రాజ్యాన్ని పొందగోరుతున్నాడా? అలా అయినా దీనుడై అతడు శత్రువులను యాచించటం తగదు. నియమం ప్రకారం వనవాసాన్ని పూర్తిచేసుకొని వచ్చిన పాండవులకు రాజ్యాన్ని తిరిగి ఇవ్వకుండా, అపహరించిన కౌరవులు ధర్మయుక్తులు ఎలా అవుతారు? వారిని విజ్ఞులని ఎవరు అంటారు? భీష్ముడు, ద్రోణుడు, విదురుడు అనునయంతో చెప్పినా పాండవులకు పైతృకమైన సంపదను ఇవ్వటానికి కౌరవులు సిద్ధపడటం లేదు. నేనైతే కౌరవులను యుద్ధంలో పదునైన బాణాలతో లాక్కువచ్చి మహాత్ముడైన ధర్మరాజు పాదాలపై పడేస్తాను. కౌరవులు ధర్మజుని పాదాలపై పడ కూడదనుకొంటే మంత్రులతో కలిసి యమలోకానికి పోతారు. మహాపర్వతాలైనా వజ్రాయుధం వేగాన్ని తట్టు కోలేనట్టు

వీరావేశంతో యుద్ధంచేసే ఈ సాత్యకి దెబ్బలకు వారెవరూ ఆగలేరు.

గాండీవియైన అర్జునుని, చక్రాయుధుడైన కృష్ణుని, భయంకరుడైన భీముని, నన్నూ యుద్ధంలో ఎవడు ఎదుర్కొన గలడు? విలువిద్యలో ఆరితేరిన నకుల సహదేవులు, విరాటద్రుపదులు కాలయముల వంటివారు. వారినీ, ధృష్టద్యుమ్ననీ ఎదుర్కొని ఎవరు బ్రతుకుతారు? ఉపపాండవులు ఉత్సాహవంతులు. అయిదుగురూ పాండవులతో సమానమైన బలం గలవారు. సుభద్రకొడుకు అభిమన్యుడు దేవతలకు కూడా అసాధ్యుడు. గదుడు కాలునివంటివాడు. ప్రద్యుమ్నుడు సూర్యుని వంటివాడు. సాంబుడు నిప్పువంటివాడు. వీరందరినీ ఎదుర్కొని ఎవరయినా బ్రతుకగలరా? దుర్యోధనుని, శకునిని, కర్ణుని మేము యుద్ధంలో చంపి ధర్మరాజుకు పట్టాభిషేకం చేస్తాము. దుర్మార్గులైన శత్రువులను చంపటంలో కొంచెం కూడా అధర్మం లేదు కాని శత్రువులను యాచించటం అధర్మమూ, అపకీర్తికరమూ అవుతుంది. ధర్మరాజు హృదయంలో ఉన్న కోరికను అలసట లేకుండా తీర్చండి. ధృతరాష్ట్రుడు ఇచ్చిన రాజ్యాన్ని ధర్మరాజు పొందుగాక! పాండునందనుడైన యుధిష్ఠిరుడు రాజ్యాన్ని అయినా పొందాలి లేదా కౌరవులను యుద్ధరంగంలో చంపి అయినా నిద్రపోవాలి."

4. ద్రుపదుని అంగీకారము.

ద్రుపదుడు ఇలా అన్నాడు. "సాత్యకీ! నీవు అన్నట్లుగానే జరుగుతుంది. సందేహం లేదు. దుర్యోధనుడు రాజ్యాన్ని మృదుపద్ధతిలో ఇవ్వడు. కొడుకును ప్రేమించే ధృతరాష్ట్రుడు అతనినే అనుసరిస్తాడు. భీష్మద్రోణులు నిస్సహాయతతోనూ, కర్ణ శకునులు మూర్ఖత్వంతోనూ అతనితోనే ఉంటారు. బలరాముని సూచన సరికాదు అని నాకనిపిస్తోంది. న్యాయాన్ని, నీతిని కోరే మహాపురుషుడు ఈ పని సాధించాలి. దుర్యోధనుడు ఎన్నటికీ మెత్తని మాటలతో చెప్పదగినవాడు కాదు. ఆ పాపబుద్ధి మెత్తదనానికి లొంగేవాడు కాదని నా అభిప్రాయం.

పాపాత్ముడైన దుర్యోధనునితో మృదువుగా మాట్లాడాలనుకొనేవాడు గాడిదపట్ల మెత్తదనాన్ని, ఆవుపట్ల కఱుకుదనాన్ని చూపేవాడు. పాపాత్ముడు మెత్తగా మాట్లాడేవానిని అశక్తుడుగా భావిస్తాడు. మూర్ఖుడు ఎదుటివారి మృదుత్వం చూచి తాను గెలిచానుకొంటాడు.

ఇలాగే చేద్దాం. దానికి తగిన ప్రయత్నం చేయండి. మన మిత్రుల వద్దకు వెళదాం. మన బలాలను సమకూర్చండి. మహారాజా! శల్యుడు, ధృష్టకేతువు, జయత్సేనుడు, కేకయులు మొదలైనవారందరి వద్దకు త్వరగా వెళ్లగలిగిన దూతలను పంపండి. దుర్యోధనుడు కూడా తప్పకుండా అన్నివైపులకు దూతలను పంపుతాడు. సజ్జనులు ముందుగా వచ్చినవానికే సహాయం చేస్తారు. అందువలన ముందుగానే రాజు లందరికీ ఆహ్వానాలు పంపేటందుకు త్వరపడాలి. ఇక్కడ ఉన్న వారందరూ చాలా పెద్ద కార్యభారాన్నే మోయవలసి ఉందని నా అభిప్రాయం. శల్యుని వద్దకు, అతనిని అనుసరించే రాజుల వద్దకు, పూర్వసముద్రతీరనివాసియైన మహారాజు భగదత్తుని వద్దకు వెంటనే దూతలను పంపండి. భగవాన్ ! అలాగే అమితౌజసుడు, ఉగ్రుడు, కృతవర్మ, అంధకుడు, దీర్ఘప్రజ్ఞుడు, శూరుడు, రోచమానుడు - వీరందరి వద్దకు కూడా దూతలను త్వరగా పంపాలి.

బృహంతుని పిలిపించండి. రాజులు సేనాబిందువు, సేనాజిత్తు, ప్రతివింధ్యుడు, చిత్రవర్మ, సువాస్తుకుడు, బాహ్లికుడు, ముంజకేశుడు, చైద్యరాజు, సురారి, నదీజుడు, కర్ణవేష్టుడు, నీలుడు, వీరధర్ముడు, పరాక్రమవంతుడైన భూమిపాలుడు, దుర్జయుడు, దంతవక్త్రుడు, రుక్మి, జనమేజయుడు, ఆషాఢుడు, వాయువేగుడు, పూర్వపాలి, భూరితేజుడు, దేవకుడు, పుత్రులతో సహా ఏకలవ్యుడు, కారూషక రాజులు, బలవంతుడైన క్షేమధూర్తి, కాంబోజ, ఋషిక, పశ్చిమద్వీపరాజులు, జయత్సేనుడు, కాశ్యుడు, పంచనదరాజులు, క్రాథపుత్రుడు, దుర్ధర్షుడు, పార్వతీయ రాజులు, జానకి, సుశర్మ, మణిమంతుడు, యౌతిమత్సకుడు, పాంశురాజ్యాధిపతి, పరాక్రమ వంతుడైన ధృష్టకేతువు, తుండుడు, దండధారుడు, బృహత్సేనుడు, అపరాజితుడు, నిషాదుడు, శ్రేణిమంతుడు, వసుమంతుడు, బృహద్బలుడు, మహౌజుడు, బాహువు, పుత్రులతో సహా సముద్రసేనుడు, ఉద్భవుడు, క్షేమకుడు, వాటధానుడు, శ్రుతాయువు, దృఢాయువు, శాల్వపుత్రుడు, యుద్ధతీవ్రుడు, కళింగరాజు మొదలైన ముఖ్యులందరి వద్దకు త్వరగా దూతలను పంపి యుద్ధంలో సహాయానికి ఆహ్వానించాలి. ఇదే నా అభిప్రాయం. మత్స్యరాజా! విద్వాంసుడైన ఈ బ్రాహ్మణుడు నా పురోహితుడు. మన మాటలు ఇతనికి చెప్పి ధృతరాష్ట్రుని వద్దకు దూతగా పంపండి. దుర్యోధనునికి, భీష్మునికి, ధృతరాష్ట్రునికి, ద్రోణునికి ఎవరెవరికి ఎలా చెప్పాలో వివరంగా చెప్పండి."

5. శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్లుట, విరాటాది రాజులు పాండవ పక్షమున చేరుట.

వాసుదేవుడు ఇలా అన్నాడు. "సభాసదులారా ! ద్రుపదమహారాజు చెప్పిన మాటలు సముచితంగా ఉన్నాయి. యుధిష్ఠిరునకు కార్యసిద్ధిని కలిగించేవిధంగా ఉన్నాయి. చక్కని నీతిమార్గాన్ని అనుసరించే మనకు ఇదే ముందు చేయవలసిన పని. కౌరవులు, పాండవులు వారికి ఇష్టమైన రీతిలో మనతో ప్రవర్తిస్తున్నా మనకు మాత్రం వారిరువురితో సమానమైన సంబంధం ఉంది. మనం అందరమూ పెండ్లికని వచ్చాం. వివాహం అయింది. ఆనందంగా మన ఇళ్లకు వెళ్లిపోదాం. ద్రుపదమహారాజా ! వయస్సుచేత, జ్ఞానంచేత రాజులందరిలోనూ నీవు పెద్దవాడివి. మేము అందరమూ నీకు నిస్సందేహంగా శిష్యులవంటివారం అవుతాం. ధృతరాష్ట్రుడు కూడా ఎప్పుడూ నిన్ను గౌరవిస్తాడు. కౌరవపాండవులకు గురువులైన ద్రోణాచార్య కృపాచార్యులు ఇద్దరికీ నీవు స్నేహితుడివే. కనుక పాండవులకు ప్రయోజనకరమైన సందేశాన్ని నీవే పంపతగినవాడివి. నీవు పంపే సందేశం ఏదయినా మా అందరికీ సమ్మతమే.

దుర్యోధనుడు శాంతియుతమైన మార్గంలో సౌభ్రాత్రంతో న్యాయం చేస్తే కురుపాండవ కుటుంబాలు నాశనం కాకుండా ఉంటాయి. దర్పంతో మూడుడై ఉన్న దుర్యోధనుడు సంధిప్రయత్నాన్ని అంగీకరించకపోతే ముందుగా ఇతరులకు ఆహ్వానాలు పంపి, తరువాత మమ్మల్ని పిలవండి. గాండీవధారి యైన అర్జునునకు కోపంవచ్చినపుడు మూర్ఖుడు, మందబుద్ధి అయిన దుర్యోధనుడు బంధుమిత్రులు, మంత్రులతో సహా నాశనమై పోతాడు." ఇలా వాసుదేవుడు మాట్లాడిన తరువాత విరాటరాజు బంధుమిత్ర పరివారసమేతంగా శ్రీకృష్ణుని సత్కరించి వీడుకోలు చెప్పాడు. శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్లగానే ధర్మరాజు, అతని సోదరులు, విరాటరాజూ యుద్ధ ప్రయత్నాలు అన్నీ ప్రారంభించారు. విరాటరాజు, ద్రుపదరాజు తమ బంధువులతో రాజులందరికీ ఆహ్వానాలు పంపారు.

పాండవులు, విరాట ద్రుపదమహారాజులు పంపిన ఆహ్వానంతో ఆనందించిన బలపరాక్రమసంపన్నులైన రాజులందరు వచ్చేశారు. పాండవపక్షానికి చాలామంది రాజులు చేరుకొన్నారని విన్న దుర్యోధనుడు తానుకూడా రాజులను రప్పించాడు. కురుపాండవుల కారణంగా భూమి కలత పడింది. చతురంగ బలాలతోకూడిన

రాజుల ప్రయాణాలతో బాటలన్నీ నిండి కిటకిటలాడాయి. వెంటవెంటనే ఆ వీరుల బలగాలన్నీ పర్వతాలతో, వనాలతో కూడిన భూదేవిని కంపింపచేస్తున్నట్లుగా కదలివస్తున్నాయి. అప్పుడు బుద్ధిలోను, వయస్సులోను పెద్దవాడై; ధర్మరాజు అభిప్రాయం తెలిసిన తన పురోహితుణ్ణి ద్రుపదుడు కౌరవులవద్దకు పంపాడు.

6. ద్రుపద పురోహితుని హస్తినాపుర ప్రయాణము.

ద్రుపదుడు తన పురోహితునితో ఇలా అన్నాడు. "పుట్టిన ప్రాణులలో జంగమ ప్రాణులు శ్రేష్ఠం. వానిలో గుట్టం, కుక్క మొదలైన బుద్ధి జీవులు శ్రేష్ఠం. బుద్ధి జీవులలో మానవులు శ్రేష్ఠులు. మానవులలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు శ్రేష్ఠులు.

ద్విజులలో విద్యావంతులు శ్రేష్ఠులు, విద్యావంతులలో సిద్ధాంతవేత్తలు, వారిలో సిద్ధాంతాలను ఆచరించేవారు, వారిలో బ్రహ్మవాదులు శ్రేష్ఠులు. పూజ్యా ! కృతబుద్ధులలో నీవు ప్రధానుడ వని నా అభిప్రాయం. వంశం, వయస్సు, విద్యలచే నీవు విశిష్టుడవు. నీవు బుద్ధిలో బృహస్పతికి, శుక్రునికి సమానుడవు. దుర్యోధనుని నడవడిక కూడా మొత్తం నీకు తెలుసు. ధర్మరాజు నడవడిక కూడా నీకు తెలుసు. ధృతరాష్ట్రునికి తెలిసిన స్థితిలోనే పాండవులు శత్రువులచే వంచింపబడ్డారు. విదురుడు ఎంత వినయంగా చెప్పినా ధృతరాష్ట్రుడు కొడుకునే అనుసరిస్తాడు. శకుని తాను జూదంలో నిపుణుడై, జూదం సరిగారాని ధర్మరాజును బుద్ధిపూర్వకంగా జూదానికి పిలిచాడు. ధర్మరాజు పరిశుద్ధుడు. క్షత్రియ ధర్మాలను పాటించేవాడు. ఆ విధంగా ధర్మరాజును మోసగించినవారు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాన్ని స్వయంగా తిరిగి ఇవ్వలేరు.

నీవు ధర్మోక్తులు చెపుతూ ధృతరాష్ట్రునీ , అతని వెంట ఉన్నయోధుల మనస్సులనూ తప్పక మార్చగలవు. విదురుడు కూడా నీ మాటలను సమర్థిస్తాడు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు మొదలైన వారికే భేదం పుట్టిస్తాడు. మంత్రులలో భిన్నాభిప్రాయాలు ఏర్పడినప్పుడు, యోధులు యుద్ధవిముఖులు అయినప్పుడు వారందరినీ ఒక త్రాటిమీదకు తేవటమే పెద్దపని అవుతుంది. ఇంతలో ఏకాగ్రచిత్తులైన పాండవులు సైన్యాన్ని ద్రవ్యాలను సమకూర్చుకొనే పనులను సులువుగా చేయగలుగుతారు. వారి జనమూ, నీవూ అక్కడ ఉండి ఆలస్యం చేస్తుంటే వారు పాండవులు చేసినంత చక్కగా యుద్ధ ప్రయత్నాలు చేయలేరు. నీవు దూతగా వెళ్లటంలో ఇది ప్రధానప్రయోజన

మౌతుంది. ధర్మబద్ధమైన నీ మాట విని ధృతరాష్ట్రుని మనసు మారే అవకాశమూ ఉంది. ధర్మపరాయణుడ వైన నీవు అక్కడ ధర్మానుకూలంగా ప్రవర్తించు. కృపాళువులైన పెద్దలకు పాండవుల క్లేశాలను వివరించి చెప్పు. వారి పూర్వులు అనుష్ఠించిన కులధర్మాలను గుర్తుచెయ్యి. వీటి ద్వారా వారి మనస్సులు మారి దుర్యోధనునితో తప్పక విభేదిస్తారు. సందేహం లేదు.

నీవు బ్రాహ్మణుడవు. వేద పండితుడవు. వృద్ధుడవు. విశేషించి దూతగా వెళుతున్నావు కనుక వారి నుండి నీకు భయంలేదు. నీవు పుష్యనక్షత్రంలో కూడిన జయముహూర్తంలో బయలు దేరి ధర్మరాజ కార్య సిద్ధికోసం కౌరవసభకు చేరుకో." ఆ విధంగా మహారాజు సూచనలు అందుకొన్న సదాచార సంపన్ను డైన పురోహితుడు హస్తినాపురానికి బయలుదేరాడు. విద్వాంసుడు, నీతి శాస్త్రకోవిదుడూ అయిన ద్రుపద పురోహితుడు శిష్యులతో కలసి పాండవుల హితం కోసం కౌరవుల వద్దకు వెళ్లాడు.

7. శ్రీకృష్ణుడు దుర్యోధనునకు, అర్జునునకు సహాయము చేయుట.

ద్రుపదపురోహితుని హస్తినాపురానికి పంపిన తరువాత పాండవులు (సాయంకోసం) రాజుల వద్దకు దూతలను పంపారు. ఇతర రాజుల వద్దకు దూతలను పంపి నరోత్తముడైన అర్జునుడు ద్వారకకు తానే స్వయంగా వెళ్లాడు. కృష్ణుడూ, బలరాముడూ, ఇంకా వృష్ణి, అంధక, భోజ వంశాల వారంతా ద్వారకకు వెళ్లాక పాండవుల కదలిక లన్నింటిని దుర్యోధనుడు నమ్మకమైన గూఢచారుల ద్వారా తెలుసుకొన్నాడు. శ్రీకృష్ణుడు విరాటనగరం నుండి ద్వారకకు వెళ్లాడని తెలుసుకొన్న దుర్యోధనుడు వాయువేగం గల గుఱ్ఱాలపై కొద్దిసైన్యాన్ని వెంటబెట్టుకొని, ద్వారకాపురానికి బయలు దేరాడు. దుర్యోధనుడు బయలు దేరిన నాడే అర్జునుడు కూడా వేగంగా ద్వారకకు బయలు దేరాడు. ద్వారకకు బయలుదేరిన దుర్యోధనుడు, అర్జునుడు శ్రీకృష్ణుడు నిద్రిస్తున్న సమయంలో అక్కడకు చేరుకొన్నారు. ముందు ప్రవేశించిన సుయోధనుడు గోవిందుని తలవైపున ఉన్న ఉన్నతాసనంపై కూర్చున్నాడు. తరువాత మనస్వి అయిన అర్జునుడు శ్రీకృష్ణుని శయనాగారంలోనికి ప్రవేశించి, వినయంగా చేతులు కట్టుకొని, ఆయన పాదాల వద్ద నిలబడ్డాడు. నిద్రమేల్కొన్న శ్రీకృష్ణుడు మొదట అర్జునుని చూశాడు. అర్జున దుర్యోధనులకు యథావిధిగా అతిథి మర్యాదలు చేశాడు. వారి రాకకు కారణం

అడిగాడు. అపుడు దుర్యోధనుడు నవ్వుతూ కృష్ణునితో ఇలా అన్నాడు. 'మాధవా ! ఈ యుద్ధంలో నీవు నాకు సాయం చెయ్యాలి. నీకు నేనూ, అర్జునుడూ సమాన స్నేహితులమే కదా ! అలాగే బంధుత్వం కూడా సమానమే. నీ దగ్గరకు ముందుగా నేను వచ్చాను. సజ్జనులు ముందు వచ్చినవారికి తోడ్పడతారు. జనార్దనా ! నీవు సజ్జనోత్తముడివి. ఎప్పుడూ సంప్రదాయాన్నే పాటిస్తావు. ఇప్పుడు కూడా సత్పురుషుల మార్గాన్నే అనుసరించు.'

కృష్ణుడు ఇలా అన్నాడు. 'మహారాజా ! ముందుగా నీవే వచ్చావు. సందేహం లేదు. కానీ మొదట నేను **అర్జునుని** చూశాను. సుయోధనా ! నీవు ముందుగా రావడం వలన, నేను మొదట అర్జునుని చూడడం వలన ఇద్దరికీ సాహాయ్యం చేస్తాను. ముందు చిన్నవారి కోరిక తీర్చాలి అని శ్రుతి చెపుతోంది. అందువలన మొదట కోరుకోవడానికి అర్జునుడే అర్హుడు. నాతో సమానమైన బలిష్ఠులు, మహాయోధులు, నారాయణులుగా పిలువబడే గోపాలకులు లక్షల మంది సైన్యం ఉన్నారు. యుద్ధంలో తిరుగులేని వీరులైన ఆ సైన్యం అంతా ఒకవైపు, ఆయుధం విడిచి, యుద్ధం చేయని నియమంతో నేను ఒకవైపు ఉంటాం. పార్థా ! ఈ రెండింటిలో నీకు ఏది ఇష్టమో దానిని కోరుకో. ధర్మం ప్రకారం నీవే ముందుగా కోరుకోవాలి.' కృష్ణుడు ఇలా అనగానే యుద్ధంలో ఆయుధం ధరించనన్నప్పటికీ శ్రీమన్నారాయణుడు, దుష్టసంహారుడు, భగవంతుడైన శ్రీకృష్ణునే అర్జునుడు కోరుకొన్నాడు. దుర్యోధనుడు పదిలక్షల సైన్యాన్ని కోరి తీసుకొన్నాడు. పాండవులు కృష్ణుని కోరుకొన్నందుకు సంతోషించాడు. తరువాత దుర్యోధనుడు బలరాముని వద్దకు వెళ్లి తనరాకకు కారణాన్ని ఆయనకు నివేదించాడు. అపుడు బలరాముడు ఇలా బదులిచ్చాడు.

"దుర్యోధనా ! ఇంతకు మునుపు నేను విరాటుని యింటిలో వివాహమహోత్సవంలో విరాటరాజుతో పలికిన పలుకులు నీకు తెలిసే ఉంటాయి. కురునందనా ! ఇరు పక్షాలతోనూ మనకు బంధుత్వం ఉన్నదని, నేను శ్రీ కృష్ణునితో నీ శ్రేయస్సు కోసం పదే పదే చెప్పి, బాధ్యత గుర్తు చేశాను. ఆ మాటను శ్రీకృష్ణుడు స్వీకరించ లేదు. అతనిని విడిచి నేను ఒక్కక్షణం కూడా ఉండలేను. వాసుదేవుని మనస్సును గమనించిన నేను నీకు కాని, అర్జునునకు కాని సహాయపడకూడదని నిశ్చయించుకొన్నాను. పురుషపుంగవా! రాజులందరిచే పూజింపబడే భరత వంశంలో పుట్టావు. వెళ్లు. క్షత్రియు

ధర్మంతో యుద్ధం చెయ్యి". బలరాముడు తన నిర్ణయాన్ని ఇలా చెప్పగానే దుర్యోధనుడు అతనిని కౌగిలించుకొన్నాడు. కృష్ణుడు ఒక్కడే పాండవపక్షానికి వెళ్లటంతో తనకు జయం లభించినట్లేనని భావించాడు దుర్యోధనుడు. దుర్యోధనుడు కృతవర్మ వద్దకు వెళ్లాడు. అతడు ధృతరాష్ట్రపుత్రునికి ఒక అక్షౌహిణి సైన్యాన్ని ఇచ్చాడు. భయంకర మయిన ఆ సైన్యాన్ని తీసుకొని, సంతోషించి దుర్యోధనుడు స్నేహితులకు సంతోషం పంచుతూ బయలుదేరి వెళ్లాడు.

దుర్యోధనుడు వెళ్లిన తరువాత శ్రీకృష్ణుడు అర్జునునితో 'అర్జునా! యుద్ధం చెయ్యనని చెప్పిన నన్ను ఏ ఆలోచనతో కోరుకొన్నావు' ? అన్నాడు. అర్జునుడు ఇలా బదులిచ్చాడు. 'పురుషోత్తమా! వారందరినీ సంహరించటానికి నీవు సమర్థుడి వనటంలో సందేహం లేదు. నేను ఒక్కడినైనా సరిపోతాను. లోకంలో నీవు కీర్తిమంతుడివి. వారిని చంపితే కీర్తి నీకు చెందుతుంది. నేను కూడా కీర్తిని పొందాలనుకొంటున్నాను. నిన్ను ఎంచుకోవటానికి అదొక కారణం. నాకు సారథ్యం నీవే చేయాలని చిరకాలంగా నా మనసులో ఉన్న కోరిక. ఆ కోరికను నీవు తీర్చాలి.' అన్నాడు. కృష్ణుడు 'పార్థా! నాతో పోటీపడటం సబబుగానే ఉంది. నీకు సారథ్యం చేస్తాను. నీ కోరిక తీరుస్తాను.' ఇలా అర్జునుడు శ్రీకృష్ణునితో, ఇతర దశార్హవంశ ప్రముఖులయిన యాదవులతో కలిసి, సంతోషంగా ధర్మరాజు వద్దకు తిరిగి వచ్చాడు.

8. శల్యుడు దుర్యోధనునికి మాట ఇచ్చి ధర్మరాజు దగ్గరకు వచ్చుట.

పాండవుల దూతల ద్వారా వారి సందేశాన్ని విన్న శల్యుడు పెద్ద సైన్యంతో, మహారథులైన పుత్రులతో కలిసి, పాండవుల వద్దకు బయలుదేరాడు. ఒకటిన్నర యోజనాలు వ్యాపించిన విపులమైన సైన్యంతో శల్యమహారాజు పాండవుల వద్దకు కదిలాడు. శల్యుడు అక్షౌహిణీ సైన్యానికి అధిపతి. స్వదేశవేషాభరణాలు ధరించిన మహావీరులు, సుక్షత్రియులు వందలూ, వేల సంఖ్యలో శల్యునికి సేనాపతులుగా ఉన్నారు. నెమ్మదిగా సైన్యానికి అక్కడక్కడ విశ్రాంతినిస్తూ, శల్యుడు తన సైన్యంతో ధర్మరాజువద్దకు వెళుతున్నాడు. శల్యుడు సైన్యంతో పాండవుల వద్దకు వెళుతున్నాడని విన్న దుర్యోధనుడు వేగంగా అతనికి ఎదురువెళ్లి, మార్గమధ్యంలోనే విశేషమైన సేవా సత్కారాలు చేశాడు.

మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే రకరకాల నీటి చెలమలు, బావులు, చలివేంద్రాలు ఏర్పరిచారు. శల్యుడు ఆయా ప్రదేశాలకు చేరినప్పుడు దుర్యోధనుని మంత్రులు, ఉద్యోగులు, దేవతలను పూజించినట్లు శల్యుని పూజించి మర్యాదలు చేశారు. ఇలా ముందుకు సాగుతున్న శల్యుడు అలౌకికాలయిన భోగాలతో అలరారుతున్న ఒక సభా ప్రాంగణానికి చేరుకొన్నాడు.

శల్యుడు ఆ వైభవంతో ఇంద్రుని కన్నా తానే అధికుడ నని భావించాడు. ఆ ఆనందంతో సేవకులను ఇలా ప్రశ్నించాడు. "ఇంత చక్కని సభలు నిర్మించిన యుధిష్ఠిరుని ఉద్యోగులు ఎవరో వారిని పిలవండి. వారిని సత్కరించా లనుకొంటున్నాను. నా ఆనందానికి తగినట్లు వారిని అనుగ్రహిస్తాను. దీనిని ధర్మరాజు ఒప్పుకొంటాడు." శల్యుని ఈ మాటలకు ఆశ్చర్యపడిన సేవకులు ఇదంతా దుర్యోధనునికి విన్నవించారు. శల్యుడు తన ప్రాణాలు ఇవ్వటానికి కూడా సిద్ధమైనంత సంతోషంతో ఉన్నాడు. అప్పుడు దుర్యోధనుడు మేనమామ ఎదుటికి వచ్చాడు. దుర్యోధనుని చూడగానే శల్యుడు అతని ప్రయత్నాన్ని అర్థం చేసుకొన్నాడు. ప్రేమతో కౌగిలించుకొని 'నీకు ఏం కావాలో కోరుకో ! ఇస్తాను' అన్నాడు.

దుర్యోధనుడు ఇలా అన్నాడు. 'మహాత్మా! సత్యవాక్కువై నాకు మాట ఇవ్వు. నీవు సర్వసైన్యానికి అధ్యక్షుడివి కాదగినవాడవు.

(నీకు పాండవులు ఎలాంటివారో నేనూ అంతే. నేను నీ భక్తుణ్ణి. ఆదరింపదగినవాణ్ణి. సహాయం పొందతగినవాణ్ణి. కనుక నా అభ్యర్థనను అంగీకరించు.' శల్యుడు ఇలా అన్నాడు - 'దుర్యోధన మహారాజా! నీవు అడిగినట్లే జరుగుతుంది. సంతుష్టుడనై నీవు అడిగింది ఇస్తున్నాను. అలాగే జరుగుతుంది.' అన్నాడు.)

దుర్యోధనుడు 'నా కోరిక పూర్తిగా తీరింది' అన్నాడు.

శల్యుడు ఇలా అన్నాడు - 'దుర్యోధన మహారాజా! నీవు నీ హస్తినాపురానికి వెళ్లు. నేను శత్రువిజేత అయిన ధర్మరాజును చూడటానికి వెళతాను. యుధిష్ఠిరుని చూచి, నేను వెంటనే వచ్చేస్తాను. మహాపురుషుడైన అతనిని తప్పక చూడాలి.' దుర్యోధనుడు ఇలా అన్నాడు - 'మహారాజా! ధర్మరాజును చూచి త్వరగా రావాలి. మేము నీ అధీనంలో ఉన్నాం. మాకు మాట ఇచ్చిన సంగతి గుర్తుపెట్టుకో.' శల్యుడు ఇలా అన్నాడు. "దుర్యోధనా! త్వరగా వచ్చేస్తాను. నీ నగరానికి నీవు వెళ్లు. నీకు శుభమగుగాక" ఆపై శల్యదుర్యోధనులు ఇద్దరూ కౌగిలించుకొన్నారు. దుర్యోధనుడు

శల్యునికి వీడ్కోలు పలికి హస్తినాపురానికి చేరాడు. శల్యుడు తాను చేసిన పనిని చెప్పటానికి పాండవుల వద్దకు వెళ్లాడు.

శల్యుడు ఉపప్లావ్యం చేరుకొని, సైనిక శిబిరంలోకి ప్రవేశించి, పాండవులందరిని చూసి యథావిధిగా పాద్యం, అర్ఘ్యం, గోదానం మొదలైన అతిథి మర్యాదలను అందుకొన్నాడు. అప్పుడు శల్యుడు పాండవుల యోగక్షేమాలు అడిగి, పరమ ప్రేమతో ధర్మరాజును, ఆలింగనం చేసుకొన్నాడు - అలాగే భీమార్జునులనూ, మేనల్లుళ్లు నకుల సహదేవులనూ కౌగిలించుకొన్నాడు. శల్యుడు బంగారు సింహాసనం మీద కూర్చున్నాడు. ధర్మరాజు శల్యుని కుశలప్రశ్నలు అడిగాడు. ధర్మాత్ములైన పాండవులందరూ తన చుట్టూ ఉండగా శల్యుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "రాజశ్రేష్ఠా! నీవు, నీవారు క్షేమమే కదా! దైవానుగ్రహం వల్ల అరణ్యవాసం నుండి బయటపడ్డావు. నిర్జనమైన అడవిలో తమ్ముళ్లు, ఈ ద్రౌపదితో కలిసి నీవు ఎన్నో కష్టాలు పడ్డావు. ధర్మరాజా! కష్టభరితమూ, భయంకరమూ అయిన అజ్ఞాతవాసాన్నికూడా పూర్తిచేశావు. రాజ్యం కోల్పోయిన వానికి దుఃఖం కాక సుఖం ఎలా లభిస్తుంది? వీరాగ్రణీ! దుర్యోధనుడు కల్పించిన ఈ మహాదుఃఖానికి తగిన సుఖాన్ని శత్రుసంహారం చేసి పొందుతావు. లోకం తీరు నీకు బాగా తెలుసు. అందు వలన లోభచింతన నీలో కొంచెం కూడా కనిపించటం లేదు.

ప్రాచీన రాజఋషుల మార్గాన్ని అనుసరించు. దానం, తపస్సు, సత్యం వీనియందు లగ్నమైన బుద్ధితో ఉండు. క్షమ, ఇంద్రియ నిగ్రహం, సత్యం, అహింస, అద్భుతమైన ముందుచూపు - అన్నీ నీయందు ప్రతిష్ఠితమై ఉన్నాయి. రాజా! నీవు మృదుస్వభావుడవు, ఉదారుడవు, బ్రహ్మణ్యుడవు, దాతవు, ధర్మపరాయణుడవు. లోక సమ్మతమైన ఎన్నో ధర్మాలు నీకు తెలుసు. నాయనా! ఈ జగత్తు తీరు అంతా నీకు తెలుసు. అదృష్టవశాత్తు నీవు ఈ పెద్దకష్టం నుండి బయటపడ్డావు.

రాజేంద్రా! అదృష్టవశాత్తు ధర్మనిలయుడవు, ధర్మాత్ముడవైన నిన్ను సోదరసహితంగా చూడగలుగుతున్నాను. దుష్కరమైన ప్రతిజ్ఞలను నీవు పూర్తిచేయగలిగావు." తరువాత శల్యుడు - దుర్యోధనుడు వచ్చి తనను కలవటం, అతను చేసిన సేవలు, తాను ఇచ్చిన మాట - అన్నీ ధర్మరాజుకు చెప్పాడు.

యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "శల్యమహారాజా! ప్రసన్నచిత్తంతో నీవు

దుర్యోధనునికి సహాయం చేస్తానని వాగ్దానం చేయటం చాలా మంచిపని అయింది. నీవు చేయదగిన మేలు ఒకటి నీనుంచి కోరుతున్నాను. అది చేయరానిదే అయినా చేసిపెట్టాలి. ఆ పని నీకు తెలియజేస్తాను. విను. నా పరిశీలనను బట్టి యుద్ధరంగంలో రథం నడపటంలో వాసుదేవునితో సమాన మైన వాడివి నీవే. కర్ణార్జునులు ఇద్దరికీ ద్వంద్వయుద్ధం వచ్చినపుడు నిస్సందేహంగా నీవు కర్ణునికి సారథ్యం చేయవలసి ఉంటుంది. నీవు మా మేలుకోరే వాడివైతే అర్జునుని రక్షించాలి. మాకు జయం కలిగేటట్లు నీవు సూతపుత్రునికి ఉత్సాహభంగం చేస్తూ ఉండాలి. మామా! ఇది చేయతగని పని అయినా మాకోసం చెయ్యాలి."

శల్యుడు ఇలా అన్నాడు. "ధర్మరాజా! నీకు శుభమగుగాక! మహావీరుడైన కర్ణుని నిరుత్సాహపరచమని నీవు పలికిన విధంగా యుద్ధంలో అతనికి నేనే సారథిని అవుతాను. నేను వాసుదేవునితో సమానమైన సారథి నని కర్ణుడు అనుకొంటూ ఉంటాడు. యుద్ధరంగంలో నేను కర్ణునికి తప్పకుండా ప్రతికూల, నిరుత్సాహకర వాక్యాలు పలుకుతాను. అతని పొగరు, తేజస్సు అణిగిపోతాయి. అతనిని తేలికగా చంపవచ్చు. నేను నీకు సత్యం చెపుతున్నాను. ధర్మరాజా! నీవు నాకు చెప్పింది చెప్పినట్లు చేస్తాను. ఇంతకంటె ఎక్కువగా నయినా నేను చేయగల ప్రియం నీకు చేస్తాను. యుధిష్ఠిరా! జూదంలో నీవు ద్రౌపదితోపాటు పొందిన దుఃఖం, అప్పుడు కర్ణుడు పలికిన పరుష వాక్యాలు, జటాసురుని వలన, కీచకునివలన ద్రౌపది దమయంతివలె పడిన ఈ కష్టాలు అన్నీ సుఖదాయకాలు అవుతాయి. జరిగినదానికి నీవు దుఃఖించ నవసరంలేదు. విధియే బలవత్తరమైనది. యుధిష్ఠిరా! మహాత్ములైనా దుఃఖాలను పొందుతారు. దేవతలు కూడా దుఃఖాలను అనుభవించారు. భారతా! దేవతల రాజైన ఇంద్రుడు భార్యతోసహా మహా దుఃఖాన్ని అనుభవించినట్లు వింటున్నాం."

9. ఇంద్రుడు త్రిశిరుని వధించుట, వృత్రాసురుని ఉత్పత్తి.

యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "శల్యరాజా! ఇంద్రుడు భార్యతో సహా గొప్ప దుఃఖాన్ని ఎలా పొందాడు? ఇది తెలుసుకోవా లనుకొంటున్నాను." శల్యుడు ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! ఇంద్రుడు భార్యతో సహా దుఃఖాన్ని పొందిన వృత్తాంతం - పూర్వం ఎప్పుడో జరిగిన పురాతనమైన ఇతిహాసం విను. దేవశ్రేష్ఠుడు, మహాతపస్వి

అయిన త్వష్ట ప్రజాపతి అయినాడు. ఇంద్రుని మీద ఉన్న ద్రోహబుద్ధితో అతడు మూడుతలలున్న కొడుకును సృష్టించాడు. భయంకరమైన మూడు ముఖాలతో సూర్య, చంద్ర, అగ్ని తేజస్సులతో వెలుగొందుతున్న విశ్వరూపుడు అనే పేరుగల ఆ కుర్రవాడు ఇంద్రపదవి కావాలని కోరాడు. వాడు ఒక ముఖంతో వేదాలు చదివాడు. మరొక ముఖంతో సురాపానం చేశాడు. ఇంకొక ముఖంతో దశదిశలనూ జాఱ్ఱుకొంటున్నట్టుగా చూస్తున్నాడు. మహావీరా! ఆ విశ్వరూపుడు ధర్మ, తపస్సులయందు దీక్షపూని, మృదుస్వభావుడై ఇంద్రియనిగ్రహంతో కష్టసాధ్యమూ, తీవ్రమూ అయిన తపస్సు చేశాడు. ఇంద్రుడు మహాతేజస్వి అయిన విశ్వరూపుని తపశ్శక్తిని చూచి 'ఇతడు ఇంద్రుడు కాకూడ' దని దుఃఖపడ్డాడు. ఈ త్రిశిరుడు ఎలా భోగాసక్తుడు అవుతాడు? తపస్సు ఎలా మానుకొంటాడు? ఇతడు ఇలా వృద్ధిచెందితే ముల్లోకాలనూ మింగేస్తాడు."

బుద్ధిశాలి అయిన ఇంద్రుడు ఇలా ఆలోచించి విశ్వరూపుని ఆకర్షించటానికి అప్సరసలను నియమించాడు. "త్రిశిరుడైన విశ్వరూపుడు కామభోగాలలో త్వరగా పూర్తిగా మునిగేటట్లు చెయ్యండి. అతనిని ఆకర్షించండి. త్వరగా వెళ్లండి. సుందరీమణులారా! శృంగారవేషాలు, అందమైన హారాలు ధరించి, సౌందర్యశోభితలై చక్కని హావభావాలతో అతనిని లొంగదీసుకోండి. నా భయం పోగొట్టండి". అప్సరసలు ఇలా అన్నారు. "దేవేంద్రా! నీకు భయం తొలగిపోయేటట్లు మేము విశ్వరూపుడిని వశపరచుకొనే ప్రయత్నం చేస్తాం." అని ఇంద్రుని అనుమతితో అప్సరసలు అందరూ త్రిశిరుడైన విశ్వరూపుని అనేక శృంగారభావాలతో ఆకర్షించటానికి అతనివద్దకు వెళ్లారు. నిరంతరంగా అతనికి తమ శరీరసౌష్ఠవాన్ని చూపించారు. అయినా మహాతపస్వి త్రిశిరుడు వారిని చూచి ఆకర్షితుడు కాలేదు. సాగరగంభీరుడై ఇంద్రియాలను అదుపులో పెట్టుకొన్నాడు. అప్సరసలు చాలా ప్రయత్నం చేసి, ఇంద్రుని వద్దకు తిరిగివచ్చి నమస్కరించి ఇలా అన్నారు. 'ప్రభూ! ధీరుడు, మహాతపస్వి అయిన త్రిశిరుని కదిలించటం మా వల్ల కాలేదు. వేరే మార్గం అనుసరించండి.'

మేధావి అయిన ఇంద్రుడు అప్సరసలకు వీడ్కోలు పలికి, విశ్వరూపుని సంహరించే ఉపాయం ఆలోచించాడు. ఇంద్రుడు కొద్దిసేపు ఆలోచించి, త్రిశిరుని చంపటానికి స్థిరనిశ్చయానికి వచ్చాడు. 'ఇప్పుడే వజ్రాయుధాన్ని విసురుతాను. క్షణంలో త్రిశిరుడు

మరణిస్తాడు. శత్రువు ఎంత బలహీనుడైనా ఉపేక్షించరాదు.' ఇంద్రుడు శాస్త్రబుద్ధితో త్రిశిరుని చంపటానికి గట్టి నిశ్చయం చేసుకొన్నాడు. ఘోరాకారమూ, భయంకరమూ, అగ్నితుల్యమూ అయిన వజ్రాయుధాన్ని కోపంతో అతనిపైకి విసిరాడు. వజ్రాయుధం దెబ్బకు కూలిన పర్వతంలా పడిఉన్న త్రిశిరుని చూచి, కూడా అతని తేజస్సును గమనించి ఇంద్రుడు శాంతిని పొందలేకపోయాడు. తేజశ్శాలి యైన విశ్వరూపుడు మరణించినా సజీవంగానే కనబడుతున్నాడు. వజ్రపు దెబ్బ తగిలిన అతని మూడుతలలు బ్రతికిఉన్నట్లు అనిపిస్తున్నాయి. దానితో మిక్కిలి భయపడిన ఇంద్రుడు విచారమగ్నుడయ్యాడు. అప్పుడు గండ్రగొడ్డలి బుజాన పెట్టుకొని విశ్వకర్మ అక్కడకి వచ్చాడు. త్రిశిరుని చంపిన అడవిలోకి తక్షుడనే విశ్వకర్మ రావటం చూచి ఇంద్రుడు భయపడ్డాడు. 'ఇతని తలలు తెగనరుకు, నేను చెప్పినట్లు చెయ్యి!' అని ఆజ్ఞాపించాడు. తక్షుడు ఇలా అన్నాడు. "ఇతడు చాలా బలమైనవాడు. ఈ దేహాన్ని నరకటానికి ఈ గొడ్డలి సరిపోదు. సజ్జనులు నిందించే ఈ పనిని నేను చేయలేను". ఇంద్రుడు ఇలా అన్నాడు. "విశ్వకర్మా! భయపడకు. నా మాటను వెంటనే ఆచరించు. నా అనుగ్రహంవలన నీ ఆయుధం వజ్రసమానం అవుతుంది." తక్షుడు ఇలా అన్నాడు. "ఘోరమైన హత్యచేసిన నీవు ఎవడివో నాకు ఎలా తెలుస్తుంది? నేను ఈ సత్యాన్ని తెలుసుకోవాలనుకొంటున్నాను. చెప్పు."

ఇంద్రుడు ఇలా అన్నాడు. "విశ్వకర్మా! నేను దేవతల రాజును, ఇంద్రుడిని, తెలుసుకో. నేను చెప్పినట్లు చెయ్యి, విచారించకు." తక్షుడు ఇలా అన్నాడు. "దేవరాజా! ఋషికుమారుని చంపి క్రూరమైన పనిచేసిన నీకు సిగ్గు, బ్రహ్మహత్యాభయం ఎలా లేకుండా పోయాయి?" ఇంద్రుడు ఇలా అన్నాడు. "ముందు బలవంతుడైన శత్రువును వజ్రంతో చంపేశాను. తరువాత పాపవిముక్తుణ్ణి కావటానికి ఎవరూ చేయలేనంతగా ధర్మానుష్ఠానం చేస్తాను. విశ్వకర్మా! ఇతను మరణించినా ఇప్పటికీ నేను భయపడుతూనే ఉన్నాను. త్వరగా ఇతని తలలు నరుకు. నేను నీకు మేలు చేస్తాను. మనుష్యులు చేసే హింసాప్రధానమైన కామయజ్ఞాలలో పశువు తలను నీకు భాగంగా ఇస్తాను. తక్షా! ఇది నేను నీకు ఇస్తున్న వరం. త్వరగా నేను చెప్పిన పని చెయ్యి." మహేంద్రుని మాటలు విన్న విశ్వకర్మ త్రిశిరుని మూడుతలలను గండ్రగొడ్డలితో నరికేశాడు. విశ్వరూపుడు ఏ ముఖంతో వేదాధ్యయనం, సోమరసపానం చేశాడో ఆ ముఖం

నుండి కపింజల పక్షులు తటాలున వెలుపలికి వచ్చాయి. విశ్వరూపుని తలలను విశ్వకర్మ నరుకగానే ఇంద్రుడు చల్లబడ్డాడు. స్వర్గానికి వెళ్లాడు. విశ్వకర్మ కూడా సంతోషంగా తన యింటికి చేరుకున్నాడు.

(విశ్వకర్మ ఇంటికి వెళ్లి జరిగిన సంగతి ఎవరికీ చెప్పలేదు. ఎవరికీ తెలియకుండా ఒక సంవత్సరం గడిచింది. అప్పుడు పరమేశ్వరుని భూతగణాలు "మా ప్రభువైన ఇంద్రుడు బ్రహ్మహంత" అని ఆక్రోశించాయి. దానితో ఇంద్రుడు తీవ్రమైన వ్రతం చేశాడు. దేవతలు, మరుద్గణాలతో కలిసి తపస్సు ప్రారంభించాడు. బ్రహ్మహత్యాదోషాన్ని సముద్రాలకు, భూమికి, వృక్షాలకు, స్త్రీలకు పంచి వారందరికీ వరాలు ఇచ్చాడు. తన బ్రహ్మహత్యాదోషాన్ని పోగొట్టుకొన్నాడు. పరిశుద్ధుడై, దేవతలు, మహర్షులు, లోకాలన్నింటి పూజలు అందుకొని సింహాసనాన్ని అధిరోహించాడు.)

రాక్షసనాశకుడైన ఇంద్రుడు తన శత్రువైన విశ్వరూపుని చంపి కృతార్థుడ నయ్యానని ఆనందించాడు. త్వష్టప్రజాపతి తనకొడుకు ఇంద్రునిచే చంపబడ్డాడని విని కోపంతో కళ్లెఱ్ఱజేసి ఇలా అన్నాడు. "ఓర్పు, నిగ్రహం, కలిగి, ఇంద్రియాలను జయించి, ఎల్లప్పుడూ తపస్సు చేస్తూ ఏ తప్పూ చేయని నా పుత్రుని ఎందుకు హింసించాడు? అందువలన ఇంద్రుని నాశనం కొరకు నేను వృత్రుని సృష్టిస్తాను. లోకాలన్నీ నా పరాక్రమాన్నీ, తపస్సు యొక్క మహాబలాన్నీ చూస్తాయి" అంటూ ఆచమనం చేసి త్వష్ట క్రోధంతో అగ్నిలో హోమం చేసి, ఘోరమైన వృత్రుని సృష్టించి "నా తపః ప్రభావంతో ఇంద్రశత్రువు వర్ధిల్లుగాక" అన్నాడు. వృత్రుడు సూర్యాగ్నిహోత్రసమానుడై వెలుగొందుతూ ప్రళయకాల సూర్యునివలె ఆకాశాన్ని ఆక్రమించి "నేను ఏం చెయ్యాలి?" అని అడిగాడు. "ఇంద్రుని చంపు" అని పలికి త్వష్ట స్వర్గానికి వెళ్లాడు. అప్పుడు వృత్రునికీ, ఇంద్రునికీ పెద్దయుద్ధం జరిగింది.

నూరు యజ్ఞాలు చేసిన ఇంద్రుని వీరుడైన వృత్రుడు బంధించాడు. తీవ్రమైన కోపంతో దేవేంద్రుని పట్టుకొని నోరుతెరిచి మ్రింగేశాడు. వృత్రుడు ఇంద్రుని మ్రింగగానే దిక్పాలాది ముఖ్యదేవతలు కంగారు పడ్డారు. శక్తిసంపన్నులైన దేవతలు వృత్రాసురుని చంపటానికి జృంభికను సృష్టించారు. ఆవులించటానికి తెరిచిన వృత్రాసురుని నోట్లోనుండి అవయవాల పరిమాణాన్ని తగ్గించుకొని ఇంద్రుడు బయటికి వచ్చేశాడు. ఆ నాటి నుండి ప్రాణుల ఆవులింత ప్రాణాలతో ముడిపడి ఉంది. వృత్రాసురుని నోట్లోనుండి బయటపడిన ఇంద్రుని చూచి దేవతలంతా ఆనందించారు. మళ్లీ వృత్రునికీ, ఇంద్రునికీ యుద్ధం కొనసాగింది. ఆ యుద్ధంలో వృత్రుడు బలసమన్వితుడై వృద్ధిచెందుతున్నాడు.

త్వష్టతేజోబలంతో దెబ్బతిన్న ఇంద్రుడు ఓటమితో వెనుదిరిగాడు. అదిచూచి దేవతలందరు చాలా దుఃఖపడ్డారు. వృత్రాసురుని దెబ్బకు కలతచెందిన ఇంద్రుడు, దేవతలు, మహర్షులు అందరూ సమావేశమై ఏం చెయ్యాలో ఆలోచించి, వృత్రాసుర సంహారం కోసం మనోరూపంగా శ్రీమహావిష్ణువును ఆశ్రయించి మందరపర్వత శిఖరంపై కూర్చున్నారు.

10. ఇంద్రునికి బ్రహ్మహత్యాదోషము సంక్రమించుట.

ఇంద్రుడు ఇలా అన్నాడు. "దేవతలారా! వృత్రాసురుడు మొత్తం జగత్తును ఆక్రమించాడు. అతనిని సంహరించటానికి తగిన అస్త్రశస్త్రాలు లేవు. ఇంతకుమునుపు నేను సమర్థుడినే, ఇప్పుడు అసమర్థుడి నయ్యాను. వృత్రుడు అజేయుడని నా అభిప్రాయం. మనకు ఎలా క్షేమం కలుగుతుంది? వృత్రుడు తేజస్వి, మహాకాయుడు. యుద్ధంలో అతని పరాక్రమం అంతులేనిది. అతడు దేవతలను, రాక్షసులను, మానవులను, మూడులోకాలను జయించగలడు.

కనుక నా నిశ్చయాన్ని వినండి. మనం శ్రీ మహావిష్ణువు నివాసానికి వెళ్లి మాట్లాడి ఈ దుర్మార్గుని చంపే ఉపాయాన్ని తెలుసుకుందాం." ఇంద్రుడు ఇలా పలికి దేవతలు, మహర్షులతో కలిసి శ్రీమహావిష్ణువునివాసానికి వెళ్లాడు.

వారంతా విష్ణువును చేరి ఇలా అన్నారు. "దేవా! పూర్వం నీవు మూడు వైపులా పెరిగి త్రివిక్రముడవై మూడులోకాలను ఆక్రమించావు. విష్ణూ! నీవు మోహినీరూపాన్ని ధరించి రాక్షసులనుండి అమృతాన్ని కాపాడావు. యుద్ధంలో రాక్షసులను సంహరించావు. రాక్షసశ్రేష్ఠుడైన బలిని బంధించి ఇంద్రుని దేవతల రాజుగా చేశావు. దేవతలందరికి నీవే ప్రభువువు. నీవే అంతటా వ్యాపించి ఉన్నావు. మహాదేవా! అన్నిలోకాలూ నమస్కరించే దేవుడివి నీవేకదా! ఇంద్రాదిదేవతలందరికీ నీవే దిక్కు. అసురసంహారకా! వృత్రాసురుడు జగత్తు అంతా వ్యాపించి ఉన్నాడు." విష్ణువు ఇలా అన్నాడు- "దేవతలారా! మీ అందరికీ గొప్ప మేలు తప్పక చెయ్యాలి. దానికి వృత్రాసురుడు నశించే ఉపాయం చెపుతాను. మీరు అందరు విశ్వరూపధారి అయిన ఆ వృత్రుడు ఉన్నచోటికి వెళ్లండి. సంధి చేసుకొనే ఉపాయాన్ని ప్రయోగించండి. తరువాత వానిని గెలుద్దాం. నా తేజస్సుతో ఇంద్రునికి జయం లభిస్తుంది. నేను వజ్రాయుధంలోనికి అదృశ్యరూపంలో

ప్రవేశిస్తాను. త్వరగా వృత్రుని దగ్గరకు వెళ్లండి. ఇంద్రునితో సంధి కుదర్చండి." శ్రీ మహావిష్ణువు ఇలా అనగానే ఋషులు, దేవతలు అందరు కలసి దేవేంద్రుని ముందుంచుకొని వృత్రాసురుని వద్దకు వెళ్లారు.

తన తేజస్సుతో పది దిక్కులనూ వెలిగిస్తూ, వేడెక్కిస్తూ సూర్యచంద్రులవలె మూడులోకాలను వెలుగులతో నింపుతున్న వృత్రుణ్ణి ఇంద్రునితో సహా దేవతలందరు దగ్గరకు వెళ్లి, చూశారు. అప్పుడు ఋషులు వృత్రుని ముందుకు చేరి 'దుర్జయా! నీ తేజస్సు ఈ జగత్తు అంతా వ్యాపించి ఉంది. "మహాబలా! ఇప్పటివరకు నీవు ఇంద్రుణ్ణి గెలవలేకపోయావు. మీ ఇద్దరికీ యుద్ధంతో చాలా కాలం గడిచిపోయింది. దేవతలు, రాక్షసులు, మానవులు మొత్తం ప్రజలు మీ వలన బాధపడుతున్నారు. వృత్రా! ఇంద్రునితో నీకు శాశ్వతమైన సఖ్యం కుదరాలి. నీవు సుఖాన్ని, శాశ్వతమైన ఇంద్రలోకాలను పొందుతావు." అంటూ ప్రియమైన మాటలు మాట్లాడారు. ఋషుల మాటలను విని మహాబలుడైన వృత్రుడు వారందరికీ తలవంచి నమస్కరించి, ఇలా అన్నాడు.

"మీరు చెప్పినదంతా విన్నాను. పుణ్యాత్ములారా! నా మాట కూడా వినండి. నాకూ, దేవేంద్రునికీ సంధి ఎలా కుదురుతుంది? ఇద్దరు పరాక్రమవంతులకు మైత్రి ఎలా సాధ్యమౌతుంది?" ఋషులు ఇలా అన్నారు. "వృత్రా! సత్పురుషులు ఎప్పుడూ మొదట మైత్రిని కోరుకోవాలి. దాని వలన క్షేమమే జరుగుతుంది. సజ్జనులు ఎన్నడూ మైత్రిని కాదనకూడదు. అందువలన సాధుజనులు మైత్రినే కోరుకోవాలి. సజ్జనుల మైత్రి దృఢంగా, చిరస్థాయిగా ఉంటుంది. వారు ధీరులై కష్టకాలంలో ప్రయోజనకరమైన కర్తవ్యాన్ని ఉపదేశిస్తారు. సాధుజనులతో స్నేహం గొప్పలాభాలను సమకూరుస్తుంది. అందువలన ధీరుడు సత్పురుషుని చంపుకో కూడదు. ఇంద్రుడు సత్పురుషులచే గౌరవింప బడుతున్నాడు. మహాత్ములకు ఆశ్రయమిస్తున్నాడు. సత్యవాది, మెచ్చదగినవాడు. ధర్మజ్ఞుడు, సూక్ష్మంగా ఆలోచించి, నిశ్చయించగలవాడు. అంతటివాడైన ఇంద్రునితో నీకు శాశ్వతమైన సంధి అగుగాక! మా మాటపై విశ్వాసం ఉంచు. దీనికి విరుద్ధమైన ఆలోచన చేయకు." మహర్షుల మాటలు విని వృత్రుడు వారితో ఇలా అన్నాడు. "మహాత్ములారా! తపశ్శక్తిసంపన్నులైన మీరు నాకు పూజనీయులు.

దేవతలారా! నేను ఇప్పుడు చెప్పబోయేది మీరు జరిగేటట్లు చేస్తే తరువాత

బ్రహ్మర్షులు నాకు చెప్పినదంతా చేస్తాను. విప్రోత్తములారా! ఎండినది, తడిసినది, రాతితో, కొయ్యతో చేసినది అయిన ఏ వస్తువుతోనూ, శస్త్రంతో, అస్త్రంతో పగలుకాని, రాత్రికాని ఇంద్రాది దేవతలు నన్ను చంపకూడదు. ఇలా అయితే ఇంద్రునితో శాశ్వతమైన సంధిని నేను కోరుతున్నాను." అనగానే ఋషులు అలాగే నని అతనికి అంగీకారాన్ని తెలిపారు. ఈ విధంగా సంధి కుదిరినందుకు వృత్రుడు చాలా సంతోషించాడు.

ఇంద్రుడు ఆనందంగా వృత్రునితో కలిసి ఉంటున్నప్పటికీ అతనిని చంపటానికి తగిన ఉపాయాలు ఆలోచిస్తూనే ఉన్నాడు. ఇంద్రుడు ఎల్లప్పుడూ వృత్రుని చంపటానికి అవకాశాలను ఆరాటంతో వెతుకుతూనే ఉన్నాడు. ఒకనాడు వృత్రాసురుని సముద్రం ఒడ్డున చూశాడు. అప్పుడు దారుణమైన ముహూర్తంతో సంజవేళ అయింది. మహర్షులు వృత్రునికి ఇచ్చిన వరాలను ఇంద్రుడు గుర్తుచేసుకొన్నాడు. "ఇది భయంకరమైన సంధ్యాకాలం. పగలూ కాదు. రాత్రీకాదు. నా సర్వస్వాన్ని దొంగిలించిన శత్రువైన ఈ వృత్రుని వెంటనే చంపాలి. మహాబలుడు, మహాకాయుడు అయిన వీణ్ణి ఇప్పుడు మోసంతో చంపకపోతే నాకు శ్రేయస్సు కలుగదు." ఇలా ఆలోచిస్తూ ఇంద్రుడు విష్ణువును తలుచుకొంటూ ఎదురుగా సముద్రంలో పెద్దకొండలా ఉన్న నురుగును చూశాడు. 'ఈ నురుగు పొడిదికాదు, తడిదికాదు, అలాగే ఆయుధమూ కాదు. దీనిని వృత్రునిపై విసురుతాను. క్షణకాలంలో నశిస్తాడు.' అలా అనుకొంటూ ఇంద్రుడు వజ్రాయుధంతో కూడిన ఆ నురుగును వృత్రునిపైకి తటాలున విసిరాడు. విష్ణువు దానిలో ప్రవేశించి వానిని చంపేశాడు. వృత్రుడు చావగానే అన్ని దిక్కుల చీకట్లు తొలగిపోయాయి. చల్లని గాలి వీచింది. ప్రజలందరూ సంతోషించారు.

అప్పుడు దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, మహాసర్పాలు, మహర్షులు అందరు మహేంద్రుని వివిధస్తోత్రాలతో స్తుతించారు. శత్రువును సంహరించి ఇంద్రుడు దేవతలతో సహా సంతోషించాడు. తనకు నమస్కరించిన ప్రాణు లన్నిటిని ఆదరించాడు. ధర్మజ్ఞుడైన ఇంద్రుడు దేవభయంకరుడు అయిన వృత్రుని చంపిన తరువాత త్రిభువన శ్రేష్ఠుడైన విష్ణువును పూజించాడు. అసత్యదోషంతో ఇంద్రుడు మనసులో చాలా క్రుంగిపోయాడు. అతడు పూర్వం ఇలాగే త్రిశీర్షుని చంపి బ్రహ్మహత్యాదోషంతో బాధపడ్డాడు. అతడు లోకాల చివరకు వెళ్లి, స్పృహ, కదలిక కోల్పోయాడు. తన

పాపాలతో కించపడిన దేవేంద్రుడు ఎక్కడ ఉన్నాడో ఎవరికీ తెలియదు. ఇంద్రుడు బురదపాములాగా నీటిలో దాగి ఉన్నాడు. బ్రహ్మహత్యాభయంతో దేవేంద్రుడు కనపడకుండా పోయేసరికి భూమి తేజస్సును కోల్పోయింది. చెట్లులేవు, అడవులు ఎండిపోయాయి. నదుల ప్రవాహాలు ఆగిపోయాయి. చెరువులలో నీరు లేదు. ప్రాణులన్నిటికి అనావృష్టి కారణంగా సంక్షోభం ఏర్పడింది. దేవతలు, మహర్షులు అంతా అలాగే మిక్కిలి భయపడ్డారు. మొత్తం జగత్తు అరాజకం కావటంతో పెద్ద ఉపద్రవం ఏర్పడింది. దాంతో 'మనకు ఇప్పుడు రాజు ఎవడు అవుతాడు' అని దేవతలు భయపడ్డారు. దేవేంద్రుడు లేనందుకు దేవఋషులు భయపడ్డారు. దేవతల రాజ్యమైన స్వర్గంలో ఏ ఒక్కనికీ బుద్ధి పని చేయడం లేదు.

11. నహుషుని ఇంద్రపదవి - శచీదేవి దుఃఖము

ఇంద్రుడు కనబడని అరాజకస్థితిలో ప్రముఖులైన ఋషులు, దేవతలు అందరు సమావేశమై "తేజస్వి, యశస్వి, నిత్యధార్మికుడు, శ్రీమంతుడు అయిన నహుషుడు, దేవరాజ్యానికి రాజు కాదగినవాడు" అని నిర్ణయించారు. నహుషుని చేరి ఋషులు, దేవతలు 'నీవు మాకు రాజుగా ఉండాలి' అని పలికారు. నహుషుడు తనహితాన్ని కోరుకొంటూ ఇలా అన్నాడు. 'నేను బలహీనుణ్ణి. మిమ్మల్ని రక్షించే శక్తి నాకు లేదు. బలవంతుడు మాత్రమే రాజు కావాలి. ఇంద్రుని లోనే కదా బలం శాశ్వత మైనది'. నహుషుని మాటలు విన్న దేవతలు, ఋషులు అతనితో ఇలా అన్నారు. 'రాజేంద్రా ! నీవు మా అందరి తపశ్శక్తితో స్వర్గాన్ని పరిపాలించు. మేము ఒకరిని చూచి మరొకరం నిస్సందేహంగా భయపడుతున్నాం. నీవు పట్టాభిషిక్తుడవై స్వర్గానికి రాజువు కమ్ము. దేవతలు, దానవులు, యక్షులు, ఋషులు, రాక్షసులు, పితరులు, గంధర్వులు నీ కంటికి గోచరించే ప్రాణులు అన్నింటి తేజస్సును చూస్తూ ఉండగానే నీవు గ్రహించి బలవంతుడివి కాగలవు. నీవు ఎల్లప్పుడూ ధర్మాన్ని ముందు నడిపిస్తూ సర్వలోకాధిపతివి అగుము. నీవు స్వర్గంలో ఉండి బ్రహ్మర్షులను, దేవతలను రక్షించు." ఆ మాటలు విని నహుషుడు ఇంద్రపదవిలో పట్టాభిషిక్తుడయ్యాడు. అలా ధర్మాన్ని ముందుంచుకొని నహుషుడు స్వర్గలోకాధిపతి అయ్యాడు. అంత నహుషుడు తేలికగా లభించని వరాన్ని, స్వర్గరాజ్యాన్ని పొంది నిరంతరం ధర్మాత్ముడై ఉండికూడా కామాత్ముడయ్యాడు.

దేవరాజైన నహుషుడు అన్ని దేవోద్యానవనాలు, నందనవనోపవనాలలో అప్సరసలు, దేవకన్యలతో కలసి పలువిధాలుగా క్రీడించాడు. అనేక విధాలుగా వీనులవిందైన కథలను, మధురమైన పాటలను, విని ఆనందించాడు. విశ్వావసువు, నారదుడు, గంధర్వులు, అప్సరసలు,ఆరు ఋతువులు రూపుదాల్చి దేవేంద్రుడైన నహుషుని సేవించారు. నహుషుని కోసం సుగంధభరితమూ, సుఖశీతలమూ, మనోహరమూ అయిన గాలి వీస్తోంది. ఈ విధంగా క్రీడిస్తున్న దురాత్ముడైన నహుషునికి దేవేంద్రుని భార్య శచీదేవి కంటపడింది.

దుష్టాత్ముడైన నహుషుడు శచీదేవిని చూచి సభాసదులతో "నేను దేవతలకు ఇంద్రుణ్ణి, అధిపతిని. ఇంద్రుని భార్య శచీదేవి నా సేవకు ఎందుకు రాదు? నా నివాసానికి శచీదేవి వెంటనే రావాలి" అన్నాడు. నహుషుని మాటలు విని దుఃఖపడిన శచీదేవి బృహస్పతితో ఇలా అన్నది. "బ్రహ్మన్ ! నేను నీ రక్షణ కోరి వచ్చాను. నన్ను నహుషుని బారినుండి రక్షించు. దేవరాజు భార్యనైన నన్ను సర్వలక్షణసంపన్న, సుఖభాగిని, సుమంగళి, ఏకపత్ని, పతివ్రత అని అంటూ ఉంటావు. భగవన్ ! పూర్వం నీవు పలికిన పలుకు లన్నింటినీ నిజం చెయ్యి. గురూత్తమా ! నీ నోటినుండి వచ్చినది ఏదీ అసత్యం కాదు. బ్రాహ్మణోత్తమా ! అందువలన నీవు అన్న మాటలన్నీ సత్యం కావాలి." శచీదేవి భయంకంపితురాలై పలికిన మాటలన్నీ విన్న బృహస్పతి "దేవీ ! నేను పలికినవన్నీ తప్పక సత్యం అవుతాయి. త్వరలో తిరిగివచ్చిన దేవేంద్రుని నీవు చూస్తావు. నహుషుని వలన నీకేమీ భయం లేదు. నేను సత్యం చెపుతున్నాను. కొద్దికాలంలోనే నేను నిన్ను ఇంద్రునితో కలుపుతాను" అన్నాడు. శచీదేవి బృహస్పతిని శరణువేడిన సంగతి విని, నహుషుడు కోపించాడు.

12. ఇంద్రాణి నహుషుని వద్దకు వెళ్లుట.

క్రోధ పూరితుడై ఉన్న నహుషుని చూచి దేవతలు ఋషులను ముందుంచుకొని అతని వద్దకు వెళ్లారు. అప్పుడు అతని చూపు చాలా భయంకరంగా ఉంది. దేవతలు, ఋషులు ఇలా అన్నారు. "దేవరాజా ! క్రోధాన్ని విడిచిపెట్టు. ప్రభూ ! నీవు కోపిస్తే అసురులు, గంధర్వులు, కిన్నరులు, మహానాగగణంతో సహా జగత్తు అంతా భయపడి పోయింది. నీవు క్రోధాన్ని విడిచిపెట్టు. నీవంటి ఉత్తములు మరొకరిపై కోపించరు.

సురేశ్వరా ! ప్రసన్నతతో శాంతించు. శచీదేవి మరొకని భార్య. పరస్త్రీలను తాకటం పాపం. దానినుండి మనస్సు మరల్చుకో. నీవు దేవతల రాజువు. ధర్మపూర్వకంగా ప్రజలను పరిపాలించు. నీకు శుభమగు గాక !" వారందరు ఇలా చెప్పినప్పటికీ కామమోహితుడైన నహుషుడు వారి మాటలను లెక్కపెట్టలేదు. ఇంద్రుని గూర్చి దేవతలతో ఇలా అన్నాడు. "దేవతలారా ! పూర్వం ఇంద్రుడు ప్రసిద్ధురాలైన ఋషిపత్ని అహల్యను భర్త బ్రతికి ఉండగానే పాడుచేశాడు. అప్పుడు మీరు అతనిని ఎందుకు ఆపలేదు ? గతంలో ఇంద్రుడు చాలా క్రూరకార్యాలు చేశాడు. అధార్మికమైన మోసాలు, అన్యాయాలు ఎన్నో చేశాడు. అప్పుడు మీరు అతనిని ఎందుకు ఆపలేదు ? శచీదేవి నా దగ్గరకు రావాలి. దానివలన ఆమెకు మేలు జరుగుతుంది. దేవతలారా ! మీ అందరికి ఇలా శుభం కలుగుతుంది." దేవతలు పలికారు. "స్వర్గాధిపతీ ! దేవేశ్వరా ! వీరా ! నీవు కోరినట్టుగానే శచీదేవిని నీవద్దకు తీసుకువస్తాం. క్రోధాన్ని విడిచిపెట్టు. సంతోషంగా ఉండు."

దేవతలు, ఋషులు నహుషునితో ఇలా పలికి శచీదేవికి ఈ చెడువార్తను చెప్పటానికి బృహస్పతి దగ్గరకు వెళ్లి "దేవర్షి సత్తమా! శచీదేవి నిన్ను శరణువేడి, నీ దగ్గరే ఉన్నదనీ, నీవు ఆమెకు అభయం ఇచ్చావనీ మాకు తెలుసు. తేజశ్శాలీ ! దేవతలు, గంధర్వులు, ఋషులు నిన్ను ప్రార్థిస్తున్నారు. శచీదేవిని నహుషునికి ఇయ్యి. ఇప్పుడు తేజస్వి అయిన నహుషుడు దేవతల రాజు. ఇంద్రుని కన్న గొప్పవాడు. అందమైన రంగు, రూపు ఉన్న శచీదేవి ఇతనిని వరించుగాక!" అన్నారు. దేవతల మాటలు విన్న శచీదేవి కన్నీటితో వెక్కి వెక్కి ఏడుస్తూ, దీనురాలై బృహస్పతితో "బ్రహ్మన్ ! నేను నహుషుని భర్తగా ఇష్టపడటం లేదు. నేను నిన్ను శరణువేడాను. ఈ మహాభయం నుండి నన్ను రక్షించు" అంది.

బృహస్పతి పలికాడు. "ఇంద్రాణీ ! నన్ను శరణువేడిన వారిని నేను విడిచిపెట్టను. ఇది నా ప్రతిజ్ఞ. సాధ్వీ ! ధర్మం తెలిసినదానివి, సత్యశీలవు అయిన నిన్ను విడిచిపెట్టను. బ్రాహ్మణుడైన నేను ఈ చెడ్డపని చేయలేను. విశేషంగా ధర్మాలను విని ఉన్నాను. సత్యపాలన చేస్తున్నాను. శాస్త్రాలలో చెప్పిన ధర్మాలు తెలిసి ఉన్నాను. దేవోత్తములారా! నేను ఈ పని చేయలేను. వెళ్లండి. ఈ సందర్భంలో పూర్వం బ్రహ్మ గానం చేసిన ఈ గీతాన్ని వినండి. భయంతో రక్షణకోసం ఆశ్రయించిన వానిని శత్రువుకు ఇచ్చే

వానికి మొలకెత్తవలసిన కాలంలో విత్తనం మొలకెత్తదు. కురవవలసిన కాలంలో వర్షం కురవదు. వాడు రక్షణ కోరినప్పుడు రక్షకుడు దొరకడు. భయంతో రక్షణకోరి వచ్చిన వానిని శత్రువుకు అప్పగించే హీనచిత్తునికి తిన్న అన్నం వ్యర్థం అవుతుంది. ఆ దుష్టుడు స్వర్గం నుండి పతన మౌతాడు. వాడు వేసిన హవ్యాన్ని దేవతలు స్వీకరించరు. భయంతో రక్షణకోరి వచ్చిన వానిని శత్రువుకు ఇచ్చిన వాని సంతానం చిన్నతనంలో మరణిస్తారు. వాని పితృదేవతలు నరకంలో పడి ఉంటారు. ఇంద్రాది దేవతలు వానిపై వజ్రాయుధాన్ని ప్రయోగిస్తారు. ఈ విధమైన బ్రహ్మోపదేశం తెలిసిన నేను ఇంద్రుని పట్టమహిషి, జగత్ ప్రసిద్ధురాలు, అయిన శచీదేవిని ఇవ్వను. సురశ్రేష్ఠులారా! ఈమెకు ఏది హితం అవుతుందో అది నాకూ హితం అవుతుంది. మీరు ఆ పని చెయ్యండి. శచీదేవిని నేను ఇవ్వను." అప్పుడు దేవతలు, గంధర్వులు బృహస్పతితో "బృహస్పతీ ! ఎలా చేస్తే బాగుంటుందో నీవే మాకు సలహా చెప్పు" అన్నారు.

బృహస్పతి ఇలా అన్నాడు. "దేవతలారా ! శుభలక్షణసంపన్న అయిన శచీదేవి నహుషుని కొంతకాలం గడువు అడగాలి. దానితో ఆమెకూ, మనకూ కూడా మేలు జరుగుతుంది. కాలం అనేక విఘ్నాలతో నిండి ఉంటుంది. ఇప్పుడు నహుషుడు మీరిచ్చిన వరప్రభావంతో బలవంతుడు, గర్వితుడు అయి ఉన్నాడు. కాలుడే కాలాన్ని నడిపిస్తాడు". బృహస్పతి ఇలా పలికేసరికి సంతోషించిన దేవతలు ఇలా అన్నారు. "బ్రహ్మన్ ! నీవు పలికింది బాగుంది. ఇది దేవతలందరికీ మేలు చేస్తుంది. ఈ మాటలతో శచీదేవిని కూడా ఒప్పించండి" అన్నారు. తరువాత దేవతలందరు అగ్నిని ముందు పెట్టుకొని శచీదేవి వద్దకు వెళ్లి లోకహితంకోసం శాంతియుతంగా ఇలా పలికారు. "దేవి ! ఈ సమస్తచరాచరజగత్తుకు నీవే ఆధారం. నీవు పతివ్రతవు. సత్యపరాయణవు. నీవు నహుషుని వద్దకు వెళ్లు. నిన్ను కోరుతున్న ఆ పాపాత్ముడు త్వరలోనే నశిస్తాడు. దేవీ ! ఇంద్రుడు స్వర్గాధిపత్యాన్ని పొందుతాడు." కార్యసిద్ధికోసం ఇలా నిశ్చయించుకొని శచీదేవి సిగ్గుపడుతూ, క్రూరంగా చూస్తున్న నహుషుని వద్దకు వెళ్లింది. అందమైన రూపంతో, వయస్సుతో అలరారుతున్న శచీదేవిని చూచి కామంతో వివేకం చచ్చి, దుష్టాత్ముడైన నహుషుడు సంతోషించాడు.

13. నహుషుడు ఇంద్రాణికి గడువు ఇచ్చుట, ఇంద్రుడు బ్రహ్మహత్యనుండి విముక్తు డగుట.

అప్పుడు దేవరాజు నహుషుడు ఇంద్రాణిని చూచి ఇలా అన్నాడు. "చక్కని నగుమోముదానా! నేను మూడులోకాలకు అధిపతినైన ఇంద్రుడను. సుందరీ ! నన్ను నీ భర్తగా స్వీకరించు." నహుషుని పలుకులు విని పతివ్రత అయిన శచీదేవి పెనుగాలిలో అరటిచెట్టువలె భయంతో వణికిపోయింది. ఆమె బ్రహ్మదేవునికి చేతులు జోడించి నమస్కరించి, కఱుకు చూపులు చూస్తున్న నహుషునితో "సురేశ్వరా ! నీ నుండి కొంతకాలం గడువు కోరుతున్నాను. ఇంద్రుడు ఏ స్థితిలో ఉన్నాడో ఎక్కడికి వెళ్లాడో ఇప్పటికీ తెలియరావటం లేదు ప్రభూ ! ఆయన ఆచూకీని స్పష్టంగా తెలుసుకొని, ఒకవేళ తెలియకపోతే అప్పుడు నేను నీ దగ్గరకు వస్తాను. నేను సత్యం చెపుతున్నాను" అని పలికింది. శచీదేవి ఇలా పలుకగానే నహుషుడు ఎంతో సంతోషించాడు. నహుషుడు ఇలా అన్నాడు. "సుందరీ ! నీవు నాతో అన్నట్లుగానే కానియ్యి. దీని ప్రకారం ఇంద్రుని సమాచారం తెలియగానే నీవు నా దగ్గరకు వచ్చేయాలి. ఇచ్చిన మాటను గుర్తుపెట్టుకోవాలి. నహుషుని అనుమతితో శుభలక్షణ, యశస్విని అయిన శచీదేవి బృహస్పతి నివాసానికి వెళ్లింది.

రాజోత్తమా ! ఇంద్రాణి మాటలు విని అగ్ని మొదలైన దేవతలందరు ఏకాగ్రతతో ఇంద్రుని కొఱకు వెదికారు. విష్ణువును కలిసి దేవతలు కలతపడుతూ ఇలా పలికారు. "దేవదేవా ! సురపతి అయిన ఇంద్రుడు బ్రహ్మహత్యతో దోషి అయినాడు. జగత్తుకు మూల పురుషుడవు, ప్రభువువు అయిన నీవే మాకు దిక్కు. అన్ని ప్రాణులను రక్షించటానికి నీవు విష్ణుత్వాన్ని పొందావు. నీ పరాక్రమంతో వృత్రుడు మరణించగా ఇంద్రునికి బ్రహ్మహత్యాదోషం చుట్టుకొంది. సురశ్రేష్ఠా ! అతనికి దానినుండి బయటపడే మార్గం చూపించు." దేవతలు చెప్పినది విని విష్ణువు ఇలా అన్నాడు. "ఇంద్రుడు నన్ను పూజిస్తే నేను ఆ వజ్రిని పవిత్రుని చేస్తాను. పుణ్యప్రదమైన అశ్వమేధయాగంతో పాకశాసనుడు నన్ను అర్చించి, నిర్భయుడై దేవేంద్రపదవిని తిరిగి పొందుతాడు. దుర్మతి అయిన నహుషుడు తన పనులతో తానే నాశనం అవుతాడు. దేవతలందరు కొద్దికాలం ప్రశాంతంగా ఓపిక పట్టండి." శుభప్రదం, సత్యం, అమృతసమానం అయిన విష్ణుమూర్తి వాక్కును విని, బృహస్పతిని, మహర్షులను

వెంటబెట్టుకొని దేవతలు అందరూ కలసి, భయంతో ఇంద్రుడు దాగిఉన్న చోటికి వెళ్లారు.

అక్కడ మహేంద్రుని పవిత్రుని చేయటానికై బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టే అశ్వమేధయాగం పెద్దఎత్తున జరిపించారు. ఇంద్రుడు చెట్లు, నదులు, కొండలు, భూమి, స్త్రీలకు బ్రహ్మహత్యా దోషాన్ని పంచి ఇచ్చాడు. ఈ విధంగా అన్నిభూతాలకు బ్రహ్మహత్యను పంచి ఇచ్చి, దేవేంద్రుడు పాపరహితుడై, నిశ్చింతుడై మనసును చక్కబరుచుకొన్నాడు. బలాసురుని సంహరించిన మహావీరుడైన దేవేంద్రుడు తన పదవిని పొందటానికి స్వర్గానికి వచ్చి, అక్కడ వర ప్రభావంతో తనదృష్టి సోకిన ప్రాణులన్నిటి తేజస్సును వశ పరుచుకొని, విజృంభిస్తున్న నహుషుని చూచి, వణికి పోయాడు. శచీపతి ఎవరికీ కనబడకుండా అదృశ్యుడై తగినకాలంకోసం ఎదురుచూస్తూ తిరుగసాగాడు. ఇంద్రుడు అదృశ్యుడు కాగానే శచీదేవి దుఃఖితురాలై "హా ! ఇంద్రా! హా ! ఇంద్రా !" అంటూ ఏడ్చింది. "నేను దానాలు, హోమాలు చేసి ఉంటే, పెద్దలను సంతోష పెట్టి ఉంటే, నాలో సత్యం ఉంటే నా పాతివ్రత్యం నిలుచుగాక ! ఉత్తరాయణంలో ఒకనాడు వచ్చే పుణ్యదాయిని, దివ్యస్వరూపిణి అయిన రాత్రిదేవికి నమస్కరిస్తున్నాను. నా కోరిక తీరుగాక !" అలా భావించి శచీదేవి మనస్సును ఇంద్రియాలను నిగ్రహించి రాత్రిదేవిని ఉపాసన చేసింది. పాతివ్రత్యం, సత్యవ్రతంతో ఉపశ్రుతి అనేపేరుగల రాత్రిదేవిని ఆవాహన చేసింది. ఆమెతో "దేవి! దేవరాజు ఇంద్రుడు ఎక్కడ ఉన్నాడో ఆ చోటు నాకు చూపించు. సత్యం సత్యంతోనే కనబడుతుంది." అని పలికింది.

14. ఇంద్రాణి ఇంద్రుని కలసికొనుట.

అప్పుడు ఉపశ్రుతి శచీదేవికి ప్రత్యక్షమైంది. యౌవనంతో, చక్కని రూపంతో ప్రకాశిస్తున్న అమ్మవారిని చూచి ఇంద్రాణి ఆనందంతో ఆమెను పూజించి "సుముఖీ! నీవు ఎవరో తెలుసుకోవా లను కొంటున్నాను. ఎవరు నీవు ? చెప్పు" అని అడిగింది. ఉపశ్రుతి పలికింది. "సద్భావం కల దేవీ ! నీ దగ్గరకు వచ్చిన నేను ఉపశ్రుతిని. నీ సత్యనిష్ఠతో నా దర్శనం నీకు లభించింది. నీవు పతివ్రతవు. యమ నియమాలతో కూడి ఉన్నావు. కనుక వృత్రాసురుని చంపిన దేవేంద్రుని నీకు చూపిస్తాను. నీకు శుభమగుగాక ! నీవు త్వరగా నాతో రా నీకు దేవేంద్రుని దర్శనం అవుతుంది."

అని పలికి బయలు దేరింది ఉపశ్రుతి. వెనుక ఇంద్రాణి వెళ్లింది.

అనేక దేవారణ్యాలను, పర్వతాలను దాటివచ్చి హిమాలయ పర్వతాన్ని దాటి, ఉపశ్రుతి ఆ పర్వతం ఉత్తరంవైపుకు నడిచింది. తరువాత ఎన్నో యోజనాల దూరం వ్యాపించిన సముద్రాన్ని చేరుకొని దాని మధ్యలో పలురకాల చెట్లు, తీగెలతో నిండిన ఒక పెద్దదీవిలో అడుగుపెట్టింది. ఆ దీవిలో నూరుయోజనాల విస్తీర్ణం, అంతే లోతు కలిగి పలురకాల పక్షులతో నిండిన మంగళకరమైన దివ్యసరస్సును చూచింది. ధర్మరాజా! ఆ సరస్సులో చక్కగా వికసించి, తుమ్మెదల గానంతో, దివ్యకాంతితో నిండిన అయిదు రంగుల తామరపూలు వేలసంఖ్యలో ఉన్నాయి. ఆ సరస్సు మధ్యలో ఒక సుందరమైన పెద్ద కమలం రంగు, పాడవు, వైశాల్యం గల కాడతో కనిపిస్తోంది. ఉపశ్రుతిదేవి ఆ పద్మనాళాన్ని చీల్చి, శచీదేవితో సహా దానిలోపలికి వెళ్లింది. అక్కడ తామర తూడులో దాగిఉన్న ఇంద్రుణ్ణి చూచింది.

మిక్కిలి సూక్ష్మరూపంలో ఉన్న ప్రభువైన ఇంద్రుని చూచి, ఉపశ్రుతి, ఇంద్రాణి కూడా సూక్ష్మరూపాన్ని ధరించారు. పూర్వం ఇంద్రుడు చేసిన గొప్పపనులను గుర్తుచేస్తూ శచీదేవి ఇంద్రుని స్తుతించింది. ఆ స్తోత్రాలు విని పురందరుడు ఆమెతో ఇలా అన్నాడు. 'దేవీ ! నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు ? నేను ఇక్కడ ఉన్నట్లు నీ కెలా తెలిసింది ?' అని అడిగాడు. ఇంద్రాణి నహుషుని దుష్ప్రవర్తనను వివరించి చెప్పింది. 'శతక్రతూ ! ముల్లోకాల ఆధిపత్యమైన ఇంద్రత్వాన్ని పొంది, మహాబలుడై గర్వంతో నిండి, దుష్టబుద్ధి అయిన నహుషుడు తనతో ఉండమంటున్నాడు. దానికి గడువుకూడా పెట్టాడు. నీవు నన్ను రక్షించకపోతే వాడు నన్ను స్వాధీనం చేసుకొంటాడు. ఆ కారణంగా నీ దగ్గరకు పరుగెత్తుకొని వచ్చాను. భయంకరుడు, పాపబుద్ధి అయిన నహుషుని సంహరించు. ప్రభూ! నీవే వెలుపలికి రా ! తేజస్సును పొందు. దేవరాజ్యాన్ని పరిపాలించు" అంది.

15. నహుషుడు ఋషులను బోయీలుగా చేయుట - బృహస్పతి అగ్నిదేవుల సంవాదము.

శచీదేవి చెప్పింది విని ఇంద్రుడు ఆమెతో ఇలా అన్నాడు. 'దేవీ! ఇది పరాక్రమానికి తగిన సమయం కాదు. ఇపుడు నహుషుడు నాకంటె బలవంతుడు. హవ్యకవ్యాలతో

ఋషులు అతనిని బలవంతుణ్ణి చేశారు. దేవీ ! నేను ఇప్పుడు ఒక రాజనీతిని ప్రయోగిస్తాను. ఇది రహస్యం. నీవే చెయ్యాలి. ఎక్కడా చెప్పగూడదు. నహుషుని వద్దకు వెళ్లి ఏకాంతంగా 'జగత్పతీ ! ఋషులు మోసే దివ్యమైన వాహనంపై నా దగ్గరకు వస్తే నేను సంతోషంగా నీ దానిని అవుతాను.' అని చెప్పు."

దేవేంద్రుని ఆదేశాన్ని ఆ కమలాక్షి విని, అలాగేనని నహుషుని దగ్గరకు వెళ్లింది. నహుషుడు శచీదేవిని చూచి చిరునవ్వుతో 'సుందరీ! నీకు స్వాగతం. శుచిస్మితా ! నీకోసం ఏం చెయ్యమంటావు?' అన్నాడు. "కల్యాణీ ! నేను నీ భక్తుణ్ణి. నన్ను నీవాణ్ణి చేసుకో. మనస్వినీ ! నీకు ఏం కావాలి ? సుమధ్యమా ! నీవు ఏం చేయమంటే అది చేస్తాను. సుశ్రోణీ! నీవు నా దగ్గర సిగ్గుపడనక్కరలేదు. నన్ను నమ్ము. నిజం చెపుతున్నాను. నీవు ఏది చెపితే అది చేస్తాను." ఇంద్రాణి పలికింది. "జగత్పతీ ! నీవు నేను చెప్పినట్లు చేస్తే నేను ఇచ్చిన మాట పూర్తి చేస్తాను. సురేశ్వరా ! అప్పుడు నీవు నా భర్తవు అవుతావు. దేవరాజా ! నా హృదయంలో ఉన్న మాట చెపుతాను విను. నాకు ఇష్టమైన ఆ పని నీవు చేస్తే నేను నీ దానిని అవుతాను. సురాధిపా ! ఇప్పటివరకు ఇంద్రునికి గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు వాహనాలుగా ఉన్నాయి. హరిహరులకు, దేవతలకు, రాక్షసులకు ఎవరికీ లేని కొత్త వాహనం నీకు ఉండాలని నా కోరిక. ప్రభూ ! మహాత్ములైన సప్తఋషులు అందరూ కలిసి నీవు కూర్చున్న పల్లకీ మొయ్యాలి. ఇదీ నా కోరిక. నీవు నీ పరాక్రమంతో, కంటిచూపుతోనే ఎవరి తేజస్సునైనా పొందుతావు. దేవతలలో, రాక్షసులలో నీతో సమానమైన వాడు లేడు. నీ ఎదుట నిలబడగల వీరుడు ఎవ్వడూ లేడు." ఇంద్రాణి మాటలకు నహుషుడు చాలా సంతోషించాడు. ప్రసన్నుడైనాడు. ఆ సాధ్వితో ఇలా అన్నాడు.

"సౌందర్యవతీ ! నీవు చెప్పిన వాహనం ఇంతకుమునుపు లేనిది. సరికొత్తది. దేవీ! నీ కోరిక నాకు నచ్చింది. నేను నీకు వశమయ్యాను. అల్పశక్తిగలవాడు ఋషులను వాహకులుగా చేసుకో లేడు. నేను తపస్విని, బలవంతుణ్ణి, భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు ప్రభువును. నేను కోపిస్తే జగత్తు లేకుండా పోతుంది. అంతా నాపైనే ఆధారపడి ఉంది. మొలక నవ్వులదానా ! కోపించిన నన్ను దేవతలు, రాక్షసులు, గంధర్వులు, కిన్నరులు, సర్పాలు, దానవులు, పధ్నాలుగు లోకాలు ఏమీ చేయలేవు. కంటితో చూస్తే చాలు ఎదుటివారి తేజస్సును నేను లాగేస్తాను. దేవీ! నిస్సంశయంగా

నీవు చెప్పిన ప్రకారం చేస్తాను. సప్తర్షులే కాదు బ్రహ్మర్షులు కూడా నన్ను మోస్తారు. వరవర్ణినీ! నా గొప్పతనాన్నీ, ఐశ్వర్యాన్నీ చూడు". సుందరముఖి అయిన శచీదేవితో నహుషుడు ఇలా పలికి ఆమెను పంపాడు. బ్రాహ్మణద్వేషి, బలవంతుడు, మదోన్మత్తుడు, కాముకుడు, దుష్టాత్ముడు అయిన నహుషుడు యమనియమాలతో తపోదీక్షలో ఉన్న ఋషులను పిలిచి అవమానకరంగా తన పల్లకికి వాహకులుగా నియమించాడు.

ఇంద్రాణి నహుషుని దగ్గర నుండి బృహస్పతి వద్దకు వెళ్లి ఇలా పలికింది. "దేవగురూ! నహుషునితో నేను కుదుర్చుకొన్న ఒప్పందంలో కొద్ది సమయం మాత్రమే మిగిలింది. నీవు త్వరగా ఇంద్రుణ్ణి వెదకాలి. నీ భక్తురాలినైన నాపై దయ చూపించు' అన్నది. అప్పుడు బృహస్పతి ఆమెతో 'అలాగే' అన్నాడు. "శచీదేవీ ! దుష్టాత్ముడైన నహుషునికి నీవు భయపడనవసరం లేదు. ఆ నరాధముడు ఎక్కువకాలం ఉండడు. పోయాడు అనుకో. అమ్మా ! ధర్మం తెలియని ఈ పాపాత్ముడు మహర్షులను వాహకులుగా కోరి త్వరలోనే పతనం కాబోతున్నాడు. ఆ దుర్మార్గుని నాశనం కోసం నేను కూడా యజ్ఞం చేస్తాను. ఇంద్రుని జాడ కూడా తెలుసుకుంటాను. భయపడకు. నీకు శుభం జరుగుతుంది." అని అనునయించాడు. రాజా ! తరువాత మహాతేజస్వి అయిన బృహస్పతి ఇంద్రుని జాడ తెలుసుకోవటానికి యథావిధిగా అగ్నిహోత్రం వేల్చి, హవిస్సులు ఇచ్చి, ఇంద్రుని వెతుక్కొని రమ్మని అగ్నిదేవుని ప్రార్థించాడు.

ఆ యజ్ఞకుండం నుండి అగ్నిదేవుడు అద్భుతమైన స్త్రీవేషంతో ప్రత్యక్షమై అదృశ్యమయ్యాడు. అగ్నిదేవుడు మనోవేగంతో దిక్కులు, మూలలు, పర్వతాలు, అడవులు, భూమి, ఆకాశం మొత్తం వెదికి రెప్పపాటు కాలంలో తిరిగివచ్చి బృహస్పతిని చేరుకొన్నాడు. అగ్ని "నాకు దేవేంద్రుడు ఎక్కడా కనపడలేదు. నీటిలో మాత్రం వెదకలేదు. దేవగురూ! నేను నీటిలో ప్రవేశించలేను. నీ కోసం ఇంకేం చేయమంటావు ?" అన్నాడు. అప్పుడు బృహస్పతి 'తేజోమూర్తీ ! నీటిలో ప్రవేశించు' అని అగ్నితో అన్నాడు. అగ్ని పలికాడు. "నేను నీటిలో ప్రవేశించలేను. నీటిలో నేను క్షీణించిపోతాను. మహాతేజస్వీ ! బృహస్పతీ! నిన్ను శరణు వేడుతున్నాను. నీకు శుభమగు గాక ! నీటి నుండి అగ్ని, బ్రాహ్మణుని నుండి క్షత్రియుడు, రాతి నుండి లోహం పుట్టాయి. కనుక ఇతరత్ర అంతటా ఉండే వాటిశక్తి పుట్టినచోట చల్లారుతుంది" అన్నాడు.

16. ఇంద్ర వరుణాదుల సంవాదము.

బృహస్పతి ఇలా స్తుతించాడు. "హవ్యవాహనా! నీవు దేవతలందరికీ ముఖం. అన్ని ప్రాణుల లోపల రహస్యంగా నీవు సాక్షివలె ఉండి సంచరిస్తూ ఉంటావు. కవులు నిన్ను ఒక్కడిగానూ చెపుతారు. మూడు రూపాలు కల (త్రేతాగ్నులు) వానిగానూ చెపుతారు. నీవు దూరమయితే ఈ లోకమంతా వెంటనే నశించిపోతుంది. ధర్మపత్నితోను, పుత్రులతోనూ కలిసి విప్రులు నీకు నమస్కరించి, తాము చేసిన సత్కర్మల వలన శాశ్వతమయిన పదం పొందుతున్నారు. అగ్నీ ! నీవు హవ్యం మోసుకువెడతావు. నీవే మళ్లీ ఉత్తమ హోమద్రవ్యానివి. నిన్నే యాగాలలో పూజిస్తారు. పరమమైన అధ్వరంలో యజ్ఞాలతో పూజిస్తారు. నీవే ఈ మూడు లోకాలనూ సృష్టించి సమయం వస్తే పక్వం చేస్తావు. సర్వలోకాలూ నీనుండి పుడతాయి. మళ్లీ వాటికి స్థితి కారణం నీవే. నీవే నీటినిచ్చే మేఘు మని అంటారు. ధీమంతులు నిన్నే విద్యుత్తు వనీ అంటారు. నీ నుండి మంటలు వెలువడి సర్వప్రాణులను దహించి వేస్తాయి. నీ యందే జలం ఉంది. లోకమంతా నీ యందే ఉంది. మూడు లోకాల్లోనూ నీకు తెలియనిది లేదు.

భూతాలన్నీ జన్మస్థానాన్ని పొందుతాయి. అందుచేత శంకించకుండా నీటిలో ప్రవేశించు. నేను సనాతనమైన బ్రాహ్మమంత్రాలతో నిన్ను వృద్ధిపరుస్తాను." ఉత్తమ కవి అయిన అగ్నిభగవానుడు ఈ ప్రశంస విని సంతుష్టుడై బృహస్పతితో "నేను నిజం చెపుతున్నాను. నీకు ఇంద్రుని చూపిస్తాను." అన్నాడు. అపుడు అగ్ని నీటిలో ప్రవేశించి ఇంద్రుడెక్కడ ఉన్నాడా అని సముద్రాలూ, సరస్సులు, గుంటలూ కూడా వెదికాడు. అందులోని పద్మాలు కూడా వెదికాడు. ఆందులో ఒక తామరతూడులో దేవేంద్రుని చూశాడు. అగ్ని వెంటనే వచ్చి "ఇంద్రుడు ఒక తామర తూడులో సూక్ష్మ శరీరంతో ఉన్నాడు" అని బృహస్పతికి చెప్పాడు. బృహస్పతి దేవతలతో, ఋషులతో, గంధర్వులతో కలసి వెళ్లి పూర్వకృత్యాలను ఇంద్రుని ఇలా ప్రశంసించి సంతృప్తి పరచాడు. "మహేంద్రా! మహాసురు డయిన నముచిని నీవు సంహరించావు. ఘోర పరాక్రములయిన శంబరుని, బలుని సంహరించావు. ఇక ముందు కూడ సర్వశత్రువులనూ సంహరించు. లేచి వృద్ధి పొందు. ఇంద్రా ! నీకడకు వచ్చిన దేవతలనూ, ఋషులనూ చూడు. మహేంద్రా! పూర్వం నీవు దానవులను వధించి

లోకాలను రక్షించావు. దేవేంద్రా ! నీటి నురుగులో ప్రవేశించి, విష్ణుతేజంతో వృద్ధి పొంది, వృత్రుని సంహరించావు. అన్నిప్రాణులకూ నీవు శరణ్యుడవు. స్తుతింపదగిన వాడవు. నీవంటి భూతం మరొకటి లేదు. పంచభూతాలనూ నీవే నిలుపుతున్నావు. నీవు దేవతలకు మహిమను చేకూరుస్తావు. మహేంద్రా ! బలం పొందు. లోకాలన్నిటినీ రక్షించు" బృహస్పతి యొక్క ఈ ప్రశంస వింటూ ఇంద్రుడు మెల్ల మెల్లగా వృద్ధి పొందాడు. తన పూర్వరూపంతో బలవంతుడై, ఇంద్రుడు ఎదుట ఉన్న బృహస్పతితో ఇలా అన్నాడు. "మహాసురు డయిన త్వాష్టుడు చనిపోయాడు. మహాకాయుడై లోకాలను నశింపజేసిన వృత్రుడు హతు డయ్యాడు. ఇంక మనం ఏంచెయ్యాలి ?" బృహస్పతి ఇలా చెప్పాడు. "మానవుడైన నహుషుడనే రాజు దేవ, ఋషి గణాల తేజస్సుతో నీ తరువాత దేవరాజ్యం పొందాడు. అతడు మమ్మందరినీ బాగా బాధిస్తున్నాడు." ఇంద్రు డిలా అడిగాడు. "దుర్లభమైన దేవరాజ్యాన్ని నహుషుడు ఎలా పొందాడు? అతని తపస్సు ఎంతటిది? శక్తి ఎంతటిది ?"

బృహస్పతి ఇలా అన్నాడు. "మహేంద్ర పదవిని నీవు విడిచి వెళ్ళాక దేవతలు భయపడి ఇంద్రుని కోరుకొన్నారు. అపుడు దేవతలు, పితృదేవతలు, మహర్షులు, గంధర్వులు. అంతా కలసి... వెళ్లి నహుషునితో 'శక్రా ! నీవు మాకు రాజువు అయి, లోకాలను రక్షించు' అన్నారు. వారితో నహుషుడు 'నాకు అంత శక్తి లేదు. తపస్సుతోను, తేజస్సుతోను నాకు పుష్టి కలిగించండి' అన్నాడు. అపుడు దేవతలంతా వానిని వృద్ధిపరచారు. ఘోరశక్తి కల నహుషుడు రాజయ్యాడు. అలా ఆ దురాత్ముడు త్రైలోక్యరాజ్యం పొంది, మహర్షులను వాహకులుగా (మోసేవారు) చేసికొని, లోకాల్లో తిరుగుతున్నాడు. ఘోరమైన, విషంలాంటి అతని చూపు ఎదుటివారి తేజస్సును లాగి వేస్తుంది. అతనిని నీ వెన్నడూ చూడకు. దేవతలంతా మిక్కిలి దుఃఖితులై అతని కంటపడకుండా రహస్యంగా మెలగుతున్నారు."

బృహస్పతి ఇలా చెపుతూ ఉండగానే లోకపాలకు డయిన కుబేరుడు, యముడు, చంద్రుడు, వరుణుడు అక్కడకు వచ్చారు. వారు వచ్చి "శక్రా! అదృష్టవశాత్తు త్వాష్టుడు, వృత్రుడు కూడ చనిపోయారు. మా భాగ్యవశాన క్షేమంగా గాయపడకుండానే శత్రుమర్దనుడ వైన నిన్ను చూశాము." ఇంద్రుడపుడు ప్రీతితో వారిని కలిసి పలుకరించి, నహుషునితో భేదం కల్పిస్తూ ఇలా అన్నాడు. "ఆ నహుషుడు భయంకర రూపుడు.

అక్కడ నాకు మీరు సహాయం చేయాలి" అన్నాడు. అపుడు వారు 'ప్రభూ ! ఆ నహుషుడు ఘోర రూపం కలవాడు. వానిది విషదృష్టి. అందుచే వానికి మేము భయపడుతున్నాము. నహుషుని నీవు ఓడించ గోరితే అందులో మాకూ భాగం ఇయ్యి" అన్నారు. అపుడు ఇంద్రుడు "అలాగే నీవూ యముడూ, కుబేరుడూ అభిషేకం పొందుతారు. దేవతలతో కలిసి ఇపుడే ఘోరదృష్టి కల నహుషుని గెలుద్దాం" అన్నారు. అపుడు అగ్ని కూడా ఇంద్రునితో "నాకు భాగం ఇయ్యి. నేనూ నీకు సాయం చేస్తాను" అన్నాడు. ఇంద్రుడు "అగ్నీ ! నీకూ భాగం ఉంది. మహాయజ్ఞంలో ఇంద్రాగ్నులకు ఒకటే భాగం కదా!" అన్నాడు. శల్యుడు చెపుతున్నాడు. 'ఇలా ఆలోచించి మహేంద్రుడు యక్షు లందరికీ, సంపద లన్నిటికీ కుబేరుని ప్రభువుగా చేశాడు. అలాగే యముని పితృదేవతలకు రాజును చేశాడు. వరుణుని అధిపతిగా చేశాడు.

17. నహుష పతనమును అగస్త్యుడు ఇంద్రునకు తెలుపుట.

ధీశాలి అయిన ఇంద్రుడు నహుషుని వధోపాయం గురించి దిక్పాలకులతో, దేవతలతో ఆలోచిస్తున్నాడు. అపుడక్కడికి తపస్వి అయిన అగస్త్యమహర్షి వచ్చాడు. అతడు దేవేంద్రుని పూజించి " అదృష్టవశాత్తు నీవు విశ్వరూపునీ, వృత్రాసురునీ చంపి వర్ధిల్లుతున్నావు. మహేంద్రా! భాగ్యవశాన ఇపుడు నహుషుడు దేవరాజ్యంనుండి పతన మయ్యాడు. పురందరా! దైవవశాత్తు ఈ నాటికి నిన్ను శత్రు రహితునిగా చూస్తున్నాను" అన్నాడు. అపుడు ఇంద్రుడిలా అన్నాడు. "మహర్షీ ! స్వాగతం. నీ దర్శనం నాకు చాలా సంతోషదాయకం. ఇవిగో మీకు పాద్యం, ఆచమనోదకం, గోవు, అర్ఘ్యమూ. గ్రహించండి."

అలా ఇంద్రుని పూజను గ్రహించి ఆసనం మీద కూర్చున్నాడు అగస్త్యుడు. అపుడు ఇంద్రుడు అగస్త్యుని ఇలా ప్రశ్నించాడు. "ద్విజోత్తమా ! పాపనిశ్చయు డయిన నహుషుడు స్వర్గం నుండి ఎలా పతనమయ్యాడు? అనే విషయాన్ని మీ నుండి వినాలని కోరుతున్నాను."

అగస్త్యుడు ఇలా చెప్పాడు. "దేవేంద్రా ! ప్రియమైన మాట విను. దుష్ట డయిన నహుషుడు స్వర్గం నుండి పతన మయిన తీరు చెపుతున్నాను. పాపి అయిన నహుషుని మోస్తూ శ్రమ చెందిన పుణ్యాత్ములు, దేవర్షులూ, బ్రహ్మర్షులూ నహుషుని ఒక సంశయం అడిగారు. బ్రహ్మ చెప్పిన గోప్రోక్షణ మంత్రాలు నీకు

ప్రమాణాలా? కాదా ?" అని అడిగారు. నహుషుడు అజ్ఞానంతో మూఢుడై "కావు" అని సమాధానం చెప్పాడు. అపుడు ఋషు లిట్లా అన్నారు. "నీవు అధర్మమార్గంలో నడుస్తున్నావు. ధర్మం నీకు తెలియటం లేదు. పూర్వం మహర్షులు చెప్పిన యీ విషయం మాకు ప్రమాణం". ఇంద్రా! అలా మునులతో వాదిస్తూ అధర్మావిష్టుడై నహుషుడు నా నెత్తిమీద కాలితో తన్నాడు. దానితో అతని తేజస్సు చచ్చిపోయింది. సంపద పోయింది. అలా అజ్ఞానాంధకారంలో పడి ఏడుస్తున్న నహుషునితో నేనిలా అన్నాను.

రాజా ! ప్రాచీన బ్రహ్మర్షులు ఆచరించినదాన్ని నీకు తెలియక దూషిస్తున్నావు. పైగా నన్ను కాలితో తన్నావు. బ్రహ్మతుల్యులూ, ఉన్నతులూ అయిన మహర్షులను వాహనాలుగా చేసికొని మోయించుకొంటున్నావు. కాబట్టి నీవు తేజస్సు, పుణ్యమూ నశించి భూమిమీద పడు. పదివేల ఏళ్లు పాము రూపం దాల్చి భూమిపై ఉంటావు. ఆ కాలం పూర్తయ్యాక మళ్లీ స్వర్గం పొందుతావు. ఇంద్రా ! ఇలా ఆ దురాత్ముడు దేవరాజ్యం నుండి భ్రష్టు డయ్యాడు. అదృష్టవశాత్తు మాకు వృద్ధియే కలుగుతోంది. బ్రాహ్మణ కంటకుడు నశించాడు. శచీపతీ ! స్వర్గం పొందు. ఇంద్రియాలను, శత్రువులనూ (లోపలి, బయటి శత్రువులను) జయించి మహర్షుల స్తుతులు పొందుతూ లోకాలను రక్షించు." శల్యుడిలా అన్నాడు. "దానితో దేవతలు, మహర్షులు, పితృదేవతలూ, యక్షులూ, నాగులూ, పర్వతాలూ, సముద్రాలూ అన్నీ సంతోషించాయి. అందరూ వచ్చి ఇంద్రునితో 'శత్రుమర్దనా! మా భాగ్యవశాత్తు నీవు వర్ధిల్లుతున్నావు. పాపి అయిన నహుషుడు ధీమంతుడయిన అగస్త్యునివలన నశించాడు. ఆ దురాచారుడు భూమి మీద పామై పడ్డాడు.

18. ఇంద్రుడు స్వర్గమున కేగుట - శల్యుడు దుర్యోధనుని చేరుట.

గంధర్వాప్సరోగణాలు ప్రశంసిస్తూ ఉన్నాయి. శుభచిహ్నాలు కల ఐరావతాన్ని ఎక్కాడు దేవేంద్రుడు. తేజస్వి అయిన అగ్ని, బృహస్పతి, యముడు, వరుణుడు, కుబేరుడు మొదలయిన దేవతలందరితో కలిసి ఇంద్రుడు స్వర్గానికి వెళ్లాడు. దేవతలకు రాజయిన శతక్రతుడు శచీదేవితో కలసి పరమానందంతో స్వర్గాన్ని పాలింపసాగాడు. అక్కడ అంగిరసుడు ప్రత్యక్షమయి, దేవేంద్రుని, అథర్వవేద మంత్రాలతో స్తుతించాడు. ఆ స్తుతితో దేవేంద్రుడు చాలా సంతోషించి అథర్వవేద మంత్రవేత్త అయిన అంగిరసునికి ఒక వరం ఇచ్చాడు. ఈ స్తుతి అథర్వ వేదంలో అథర్వాంగిరసమనే పేర ప్రసిద్ధి

నొందుతుంది. నీకు యజ్ఞభాగం కూడా లభిస్తుంది. దేవేంద్రుడు అలా అథర్వాంగిరసుని సత్కరించి వీడ్కొలిపాడు. అలాగే దేవతలనూ, ఋషులనూ, సన్మానించి దేవేంద్రుడు ఆనందించాడు. ధర్మపూర్వకంగా ప్రజాపాలనం సాగించాడు.

ఇలా భార్యతో సహా ఇంద్రుడు దుఃఖం అనుభవించడమే కాదు. శత్రు సంహారంకోసం అజ్ఞాతవాసం కూడా చేశాడు. అందుచేత రాజేంద్రా ! మహాత్ములయిన తమ్ములతోనూ, ద్రౌపదితోనూ అడవిలో యాతనపడ్డామని ఇపుడు దుఃఖించకు. ఇంద్రుడు వృత్రాసురుని చంపి రాజ్యం ఎలా పొందాడో అలాగే నీవూ రాజ్యం పొందుతావు. దుష్టకృత్యాలు చేస్తూ బ్రహ్మద్వేషి, పాపాత్ముడూ అయిన నహుషుడు అగస్త్యుని శాపం తగిలి చాలా ఏళ్లు పతితు డయ్యాడు. ఇలాగే దుష్టులయిన కర్ణదుర్యోధనాది శత్రువులు త్వరలోనే నశిస్తారు. తరువాత ద్రౌపదితోను, తమ్ములతోనూ కలిసి ఈ భూమి నంతటినీ అనుభవిస్తావు. జయం కోరే రాజు సేన సమకూర్చుకొనేటప్పుడు దేవతుల్యమయిన ఈ "ఇంద్ర విజయం" అనే కథ వినాలి. అందుచేత నీకే విజయ గాథ వినిపిస్తున్నాను. ఇది విన్న మహాత్ములు ప్రశంసనీయులై వర్ధిల్లుతారు. ధర్మజా! దుర్యోధనుని అపరాధం వల్లనూ, భీమార్జునుల బలం వల్లనూ మహాత్ములయిన క్షత్రియులకు ఇపుడు వినాశం దాపురించింది.

నియమంతో ఈ ఇంద్రవిజయ కథను పఠించిన వాడు పాపాలు పోయి స్వర్గం పొందుతాడు. అంతేకాదు ఇహపరాలు రెండిట ఆనందం పొందుతాడు. వానికి శత్రుభయం ఉండదు. సంతానం లేక పోవడం అనేది ఉండదు. ఏ ఆపద కలగదు. దీర్ఘాయువు కలుగుతుంది. ఎప్పుడూ జయమే కలుగుతుంది. అపజయం కలగదు."

శల్యుడు ధర్మరాజును ఇలా ఓదార్చాడు. ధార్మికోత్తము డయిన ధర్మరాజు శాస్త్రోక్తంగా శల్యుని సత్కరించాడు. శల్యుని మాట విని ధర్మరాజు మద్రరాజుతో ఇలా అన్నాడు. "మీరు కర్ణునికి సారథ్యం చేస్తున్నారు. సందేహంలేదు. అందునా అర్జునుని ప్రశంసిస్తూ కర్ణుని తేజోవధ చెయ్యాలి." శల్యుడన్నాడు. "నీ వన్నట్లే చేస్తాను. నేను చేయగలిగినది ఇంకా ఏమయినా ఉంటే అది నీకు తప్పక చేస్తాను." వైశంపాయనుడు అన్నాడు. తరువాత మద్రరాజైన శల్యుడు ధర్మరాజును వీడ్కొని బలగంతో సహా దుర్యోధనుని చేరాడు.

19. ఉభయ సేనల వివరణము.

వైశంపాయనుడు ఇలా చెప్పాడు. సాత్వతులలో మహారథుడైన సాత్యకి గొప్ప చతురంగ బలాలతో యుధిష్ఠిరుని దగ్గరకు వచ్చాడు. వివిధ దేశాలనుండి అనేక ఆయుధాలతో వచ్చిన మహావీరులంతా ధర్మరాజు సైన్యానికి శోభ చేకూర్చారు. గొడ్డళ్లు, భిందిపాలాలు, శూలాలు, తోమరాలు, ముద్గరాలు, పరిఘలు, కర్రలు, పాశాలు, పదునైన కత్తులు, ఖడ్గాలు, ధనుస్సుల సమూహాలు నూనెతో తెల్లగా ప్రకాశించే వివిధ బాణాలు - వీటితో ఆసేన అంతా చక్కగా శోభిస్తోంది. బంగరు ఆభరణాలతో నల్లగా ఉన్న ఆ సైన్యం మెఱుపులతో కూడిన మేఘంలా ఉంది. సాత్యకి తెచ్చిన ఆ అక్షౌహిణిసేన యుధిష్ఠిరుని సేనలో కలిసింది. అప్పు డది సముద్రంలో కలిసిన చిన్న నదిలా అదృశ్యమై పోయింది. అలాగే ఒక అక్షౌహిణి సేనతో మహాబలు డయిన చేదిరాజు - ధృష్టకేతువు పాండవులను చేరాడు.

జరాసంధుని కొడుకు, మహాబలుడు, మగధరాజు అయిన జయత్సేనుడు అక్షౌహిణి సేనతో వచ్చి ధర్మరాజును చేరాడు. అలాగే సముద్రద్వీప వాసులతో, వివిధ యోధులతో కలిసి పాండ్యరాజు యుధిష్ఠిరుని చేరాడు. ఆ పాండ్యరాజుసేన చాలా ఉంది. ఆ సేన కలిసేసరికి పాండవసేన బలిష్ఠమూ, వేషయుతమూ అయి చూడముచ్చటగా ఉంది. వివిధ దేశాల నుండి వచ్చిన శూరులతో, మహారథు లయిన పుత్రులతో కలిసి ద్రుపదుని సేన శోభిల్లింది. అలాగే వాహినీపతి అని పేరొందిన విరాటుడు పర్వతరాజులతో కలిసి పాండవులను చేరాడు. ఇంకా అక్కడక్కడనుండి వచ్చిన సేనలు వివిధ ధ్వజాలతో మొత్తం పాండవులలో చేరిన సేనలు ఏడు అక్షౌహిణులయ్యాయి. కౌరవులతో యుద్ధం చేయటానికి వచ్చి వారు పాండవులను సంతోష పెట్టారు.

అలాగే దుర్యోధనునికి సంతోషం కలిగిస్తూ భగదత్తుడనే రాజు ఒక అక్షౌహిణి సేనను ఇచ్చాడు. చీనులతో, కిరాతులతో కలిసి ఎదిరింప శక్యంకాని ఆ సేన సంపెంగపూలతో కూడిన కొండగోగు పూల తోట వలె ప్రకాశించింది. శూరుడయిన భూరిశ్రవుడూ, శల్యుడూ ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో దుర్యోధనుని చేరారు. భోజులు, అంధకులు, కుకురులతో కలసి కృతవర్మ అక్షౌహిణి సేనతో దుర్యోధనుని చేరాడు. వనమాలలు ధరించిన పురుషసింహాలతో కూడిన సైన్యం విహరించే మదపుటేనుగులతో

A.C.No. 96357

మత్తెక్కిన అడవిలా ప్రకాశించింది. సింధు, సౌవీరదేశస్థులయిన జయద్రథుడు మొదలయిన రాజులు కొండలను కంపింపజేస్తూ ఉన్నట్లు అక్షౌహిణి సేనతో వచ్చారు. గాలికి చెల్లా చెదరై అనేక రూపాలు దాల్చే మేఘంలా కాంభోజరాజు సుదక్షిణుడు యవనులతో, శకులతో కలసి ఒక అక్షౌహిణి సైన్యంతో దుర్యోధనుని చేరాడు. వాని సేనా సముదాయం మిడతల దండులా ఉంది. ఆ సేన వచ్చి దుర్యోధనుని సేనలో లీనమయి పోయింది.

అలాగే మాహిష్మతీపురరాజు నీలుడు నీలాయుధాలతో కూడిన దక్షిణ దేశస్థులతో వచ్చాడు. అవంతి రాజులైన విందానువిందులు ఇద్దరు మహాబలంతో కూడి ఒక్కొక్క అక్షౌహిణి సేనతో వచ్చి సుయోధనుని చేరారు. నరోత్తములయిన అయిదుగురు కేకయ రాజులు దుర్యోధనుని ఉప్పొంగ జేస్తూ ఒక అక్షౌహిణి సేనతో పరుగున వచ్చారు. ఇంకా ఇతర రాజుల సేనలన్నీ కలసి మూడు అక్షౌహిణు లయ్యాయి. ఇలా దుర్యోధనుని కోసం పాండవులతో యుద్ధం చేయటానికి వచ్చిన పదకొండు అక్షౌహిణులు ఎన్నో రకాల ధ్వజాలతో నిండి పోయాయి. ఆయాసేనల్లో ముఖ్యులయిన వారికి, ప్రాధాన్యాన్ని బట్టి నిలబడటానికి కూడా హస్తినలో చోటు చాలటం లేదు. పంచనదం, కురుజాంగలం అంతా, రోహితకారణ్యం, మరుభూమి, అహిచ్ఛత్రం, కాలకూటం, గంగాతీరం, వాటధానం, యామునపర్వతం - ఈ ప్రదేశాలున్న ధనధాన్యపూర్ణమయిన విశాల ప్రదేశమంతా కౌరవసేనతో నిండిపోయింది. అలా నిండిన సైన్యాన్ని కౌరవుల దగ్గరకు వచ్చిన ద్రుపదపురోహితుడు చూశాడు.

20. ద్రుపద పురోహితుడు కౌరవసభలో మాట్లాడుట.

ద్రుపదుని పురోహితుడు కురురాజును సమీపించాడు. అప్పుడు ధృతరాష్ట్రమహారాజు, భీష్ముడు, విదురుడు అతనిని సన్మానించారు. ముందుగా తమ పక్షంవారి క్షేమసమాచారాన్ని చెప్పి, తరువాత ధృతరాష్ట్రాదుల క్షేమసమాచారాన్ని అడిగి, సేనానాయకులందరి సమక్షంలో ద్రుపద పురోహితుడు ఇలా చెప్పాడు.

"సనాతనమైన రాజధర్మం మీకందరికీ తెలుసు. మీకు తెలిసినప్పటికీ మీ అభిప్రాయం తెలిసికోవాల్సి ఉంది కాబట్టి, నేను చెప్తున్నాను. ధృతరాష్ట్రుడు, పాండురాజు- ఈ ఇద్దరూ ఒకే తండ్రి కొడుకులు. పిత్రార్జితమైన సంపదపై ఇద్దరికీ సమానమైన

అధికారం ఉంది. ఇందులో సందేహం లేదు. ధృతరాష్ట్రుని పుత్రులు తమ తండ్రి సంపదను పొందారు. కాని పాండు కుమారులు మాత్రం ఎందువల్ల పిత్రార్జితాన్ని పొందలేకపోయారు? పిత్రార్జితసంపదంతా ధృతరాష్ట్రుని అధీనంలో ఉండటం వల్ల, పాండవులు తమ పిత్రార్జితమైన సొత్తును పొందలేకపోయారు. ఈ విషయం ముందునుండీ మీకు తెలుసు. పైగా ధృతరాష్ట్రుని కుమారులైన దుర్యోధనుడు మున్నగువారు ప్రాణాంతకాలైన ఉపాయాలచేత పాండవులను చంపడానికి చాలామార్లు ప్రయత్నించారు. కాని వాళ్లకు ఆయువు మిగిలి ఉండటంచేత మరణం పొందలేదు. మళ్లీ మహాత్ములైన పాండవులు తమ బాహుబలంచేత నూతన రాజ్యాన్ని స్థాపించి, వృద్ధి చేశారు. క్రాని శకునితో కలిసి ధృతరాష్ట్రకుమారులు జూదంవంకతో దాన్నికూడా అపహరించారు.

ధృతరాష్ట్రుడు కూడా ఆ జూదాన్ని అనుమతించాడు. వారు నిర్ణయించినట్లుగా పాండవులు పదమూడు సంవత్సరాలు వనవాసమూ, అజ్ఞాత వాసమూ చేశారు. కౌరవసభలో భార్యతోపాటు పాండవులు చాలాకష్టాలు పొందడమే కాదు, అరణ్యంలో కూడ దారుణమైన కష్టాలు ఎన్నో అనుభవించారు. అదే విధంగా విరాటనగరంలో మహాత్ములైన పాండవులు మరోజన్మ ఎత్తిన పాపాత్ములవలె మిక్కిలికష్టాన్ని అనుభవించారు. మునుపటి తప్పులన్నింటిని వెనుకకునెట్టి కురుశ్రేష్ఠులైన పాండవులు కౌరవులతో సంధినే కోరుకొంటున్నారు. ఆ పాండవుల నడవడిని, దుర్యోధనుని ప్రవృత్తిని బాగా తెలిసికొని, ఉభయుల క్షేమాన్నీ కోరే స్నేహితులు దుర్యోధనుని అనునయించడం మంచిది. వీరులైనప్పటికీ పాండవులు కౌరవులతో యుద్ధం చేయరు. జననష్టం లేకుండా తమ రాజ్యాన్ని తాము పొందా లనుకొంటున్నారు.

ఏ కారణంతో దుర్యోధనుడు యుద్ధం చెయ్యా లనుకొంటున్నాడో, దాన్ని నిజమైన కారణంగా భావించవద్దు. ఎందుకంటే పాండవులు కౌరవులకంటె బలవంతులు. కౌరవులతో యుద్ధం చేయడంకోసం ధర్మరాజు దగ్గరకు చేరిన ఏడు అక్షౌహిణుల సేనలు అతని ఆజ్ఞకై ఎదురు చూస్తున్నాయి. వారితోపాటు ఇంకా వేయి అక్షౌహిణులతో సమానులూ, పురుషశ్రేష్ఠులూ ఐన సాత్యకి, భీమసేనుడు, మహాబలవంతులైన నకుల సహదేవులూ కూడా ఉన్నారు. కౌరవపక్షంలోని పదకొండు అక్షౌహిణులసేనలు ఒకవైపు ఐనా అర్జును డొక్కడూ మరొకవైపు ఉన్నా, ఆ సేనలకు అర్జును డొక్కడూ చాలు.

అర్జును డొక్కడూ అన్ని సేనలను మించి ఉన్నట్లే, వాసుదేవుడు కూడా అందర్నీ మించినవాడు. సేనా బాహుళ్యాన్ని, అర్జునుని పరాక్రమాన్ని, శ్రీకృష్ణుని తెలివి తేటల్నీ తెలిసి కూడా ఎవడు యుద్ధం చేస్తాడు? అందువల్ల మీరు మీ ధర్మాన్ని అనుసరించి, మునుపు చేసిన ప్రతిజ్ఞలను అనుసరించి, పాండవులకు ఇవ్వదగిన రాజ్య భాగాన్ని ఇవ్వండి. ఇంకా మీకు సమయం మించిపోలేదు."

21. ద్రుపద పురోహితుని మాటను భీష్ముడు సమర్థించుట.

ద్రుపద పురోహితుని మాటలను విని ప్రజ్ఞావృద్ధుడు, భీష్ముడు సమయోచితంగా అతనిని గౌరవించి ఇలా అన్నాడు. "అదృష్టవశాత్తు అంతా కుశలంగా ఉన్నారు. అలాగే కృష్ణునితో వారు సహాయవంతులయ్యారు. భాగ్యవశాత్తు వారు ధర్మమందు ఆసక్తి కలిగి ఉన్నారు. పాండవులైదుగురూ కురువంశానికి ఆనందం కలిగిస్తూ సంధిని కోరుకోవడం అదృష్టం. బంధువులతో కూడిన పాండవులు యుద్ధం చేయకూడ దనుకోవడం చాలా అదృష్టం. నీవు చెప్పినదంతా యథార్థమే. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. కాని నీ మాట చాలా కఠినంగా ఉంది. ఇది బ్రాహ్మణ స్వభావం వల్ల నని నేననుకొంటున్నాను. రాజ్యంలోను, అరణ్యంలోను కూడ ఆ పాండవులు బాధలు పడ్డారు. అందులో సందేహం లేదు. ధర్మంగా పిత్రార్జితాన్నంతా పొందే అధికారం వాళ్లకు ఉంది. ఇందులో కూడ సందేహం లేదు. మహారథుడు, అస్త్రవిద్యా నిపుణుడూ ఐన అర్జునుడు గొప్ప బలవంతుడు. పాండు కుమారుడైన అట్టి అర్జునుని యుద్ధంలో ఎవడు సహింపగలడు? సాక్షాత్తు ఇంద్రుడు కూడ అర్జునుని ముందు నిలువలేడు. ఇక తక్కిన ధనుర్ధారుల సంగతి ఏమి చెప్పాలి. ఈ మూడులోకాలకు సర్వ సమర్థుడు అర్జునుడే అని నా అభిప్రాయం."

భీష్ముడా విధంగా మాట్లాడుతూ ఉండగా, కర్ణుడు దుర్యోధనుని వైపు చూసి, కోపంతో పాగరుగా ఆక్షేపిస్తూ ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! గతంలో జరిగినదంతా అందరికీ తెలియనిది కాదు. దాన్నే మళ్లీ మళ్లీ చెప్పడం వల్ల ఉపయోగం ఏమిటి? దుర్యోధనుని కోసం శకుని ధర్మరాజును జూదంలో ఎపుడో ఓడించాడు. జూదపు నియమం ప్రకారం యుధిష్ఠిరుడైన ధర్మరాజు అరణ్యానికి వెళ్లాడు. యుధిష్ఠిరుడు ఆ నియమానుసారంగా తన పిత్రార్జితమైన రాజ్యాన్ని కోరడంలేదు. మత్స్య, పాంచాల

దేశీయులబలాన్ని చూసికొని మూర్ఖునివలె కోరుతున్నాడు. విద్వాంసుడా! దుర్యోధనుడు భయం వల్ల అర్ధరాజ్యాన్ని కాదు, చివరికి నాల్గవవంతుకూడా ఇవ్వడు. కాని ధర్మం వల్లనైతే శత్రువుకు ఐనా రాజ్యాన్నంతటినీ ఇవ్వగలడు. తాత తండ్రులనుండి వచ్చే రాజ్యాన్ని వారు కోరుకొంటున్నట్లయితే మళ్లీ ప్రతిజ్ఞానుసారంగా సమయం ముగిసే వరకూ వనవాసం చేయాలి. అటు తరువాత దుర్యోధనుడి దగ్గర నిర్భయంగా ఉండెదరుగాక! అంతే కాని కేవలం మూర్ఖంగా తమ బుద్ధిని అధర్మం పాలు చేసికోవద్దు. ఇక వారు ధర్మాన్ని విడిచిపెట్టి యుద్ధాన్ని కోరుతున్నట్లయితే పాండవులు ఈ కురుశ్రేష్ఠులను కలిసినపుడు నా మాటను స్మరింపగలరు."

వెంటనే భీష్ముడన్నాడు. "రాధేయా! నీ మాటలతో ఏం జరుగుతుంది? పార్థుడు ఒక్కడే యుద్ధంలో ఆరుగురు రథికులను జయించాడు. నీవా విషయాన్ని గుర్తుంచుకో. పలుమార్లు అతనితో తలపడి ఓడిపోయిన నీ పరాక్రమం ఏమిటో అప్పుడే చూశాం. ఈ బ్రాహ్మణుడు చెప్పినట్లు చేయకపోతే, మనం యుద్ధంలో ఆ అర్జునుని చేతిలో దెబ్బలు తిని, మట్టి కరుస్తాం."

పిమ్మట ధృతరాష్ట్రుడు భీష్ముని భక్తితో గౌరవించి, అనునయించి కర్ణుని నిందించి, పురోహితునితో ఇలా అన్నాడు. "భీష్ముడు మాకు హితమైన వాక్యాన్ని చెప్పాడు. అది పాండవులకూ, సకల జగత్తుకూ కూడ హితమైనదే. నేను ఆలోచించి పాండవుల వద్దకు సంజయుని పంపిస్తాను. నీవు ఆలస్యం చేయక పాండవుల వద్దకు తిరిగి వెళ్లు". పిమ్మట ధృతరాష్ట్రుడు ఆ ద్రుపదపురోహితుని సత్కరించి, పాండవుల దగ్గరకు పంపాడు. సంజయుని సభలోకి పిలిపించి, ఇలా పలికాడు.

22. ధృతరాష్ట్రుడు పాండవుల కడకు సంజయుని పంపుట.

ధృతరాష్ట్రుడు చెపుతున్నాడు. "సంజయా! పాండవులు ఉపప్లావ్యనగరానికి చేరినట్లు చెపుతున్నారు. నీవు అక్కడకు వెళ్లి వారిని తెలుసుకో. అజాతశత్రువైన ధర్మరాజును గౌరవించు. 'భాగ్యవశం వల్ల మీరు మీకు తగినస్థానానికి చేరుకొన్నారు' అని చెప్పు. సంజయా ! మనమంతా కుశలమని వారందరికీ చెప్పు. కపటం లేనివారు, పరోపకారులూ సత్పురుషులూ ఐన పాండవులు కష్టమైన అరణ్యవాసం చేయదగ్గవారు కాదు. అయినా వాళ్లు నియమం ప్రకారం వనవాసం పూర్తి చేశారు. నీవిలా చెప్తే

వారికి మనపట్ల ఉన్న కోపం త్వరగా శాంతిస్తుంది. సంజయా! పాండవులు అసత్య మాడడం నేనెప్పుడూ చూడలేదు. వారు తమ పరాక్రమంతో సంపాదించిన సంపదనంతా నా అధీనం చేశారు. నేను నిత్యం వెతుకుతూ ఉన్నా, నిందింపదగిన దోషం ఒక్కటీ పాండవులలో కనబడటం లేదు. వారు నిత్యం ధర్మార్థాలతో కూడిన పనినే చేస్తారు. కామంతో సుఖాన్ని, ప్రియాన్ని అనుసరించరు. పాండవులు శీతోష్ణాలు, ఆకలిదప్పులు, నిద్రాలసతలు క్రోధహర్షాలు, ప్రమాదం అనేవానిని ధైర్యంతో, వివేకంతో జయించి, ధర్మార్థాలకోసం ప్రయత్నిస్తూ ఉంటారు.

వారు తగిన సమయంలో మిత్రులకు ధనాన్ని ఇస్తారు. వాళ్లు ప్రవాసంలో ఉన్నా వారిమైత్రి క్షీణించదు. పాండవులు అందరిని వారికి తగినట్లుగ సత్కరిస్తారు. మందబుద్ధి అయిన దుర్యోధనుడు, మిక్కిలి నీచుడైన కర్ణుడూ తప్ప ఈ కౌరవ పక్షంలోని ఇంకెవరూ పాండవులను ద్వేషించేవారు కారు.

(సంజయా! నా కొడుకు దుర్యోధనుడు కామానికి లొంగిపోయి మృత్యువుకు వశమయ్యాడు. మూర్ఖుడైన దుర్యోధనుడు తేజస్వులూ, మహాత్ములూ, అయిన పాండవుల రాజ్యభాగాన్ని హరించాలనుకొంటున్నాడు.)

ఈకర్ణ సుయోధను లిద్దరూ సుఖానికీ, ఇష్టమైనవారికీ దూరమైన పాండవులకు కోపం కలిగిస్తున్నారు. ఎగిసే పరాక్రమం గల దుర్యోధనుడు సుఖంలో పెరిగినవాడై పాండవులు జీవించి ఉండగానే వారి భాగాన్ని బాలునిలా హరించగల ననుకొంటున్నాడు. దాన్నే మంచిపనిగా భావిస్తున్నాడు. అర్జునుడు, శ్రీకృష్ణుడు, భీమసేనుడు, సాత్యకి, నకుల సహదేవులు, సృంజయ వంశవీరులు కూడా అజాతశత్రువైన యుధిష్ఠిరుని మార్గాన్ని అనుసరిస్తున్నారు. కావున యుద్ధప్రసక్తి మాని ముందు రాజ్యభాగ మివ్వడం మంచిది. గాండీవాన్ని ధరించిన అర్జును డొక్కడూ రథాన్ని అధిరోహించి ఈ భూమినంతా జయింపగలడు. అదే విధంగా జయశీలుడు, త్రిలోకాధిపతి, మహాత్ముడూ ఐన శ్రీకృష్ణుడు కూడా ఎదిరింప శక్యంకానివాడు. మేఘంలా గర్జిస్తూ పక్షుల సమూహంలా శీఘ్రవేగంతో వచ్చే బాణాలను కురిపిస్తూ, సర్వలోకాలలో ఏకైక వీరుడైన అర్జునుని ఎదిరించి ఎవడు నిలబడగలడు?. గాండీవాన్ని ధరించిన అర్జును డొక్కడూ రథాన్ని అధిరోహించి ఉత్తరదిక్కును, ఉత్తర కురురాజ్యాలను కూడా జయించాడు. వారి సంపదనంతా స్వాధీనం చేసికొన్నాడు. సవ్యసాచి ద్రవిడులను జయించి, వారు తన

సేనను అనుసరించేటట్లు చేశాడు. గాండీవాన్ని ధరించిన అర్జునుడు ఖాండవవనంలో ఇంద్రునితో బాటు దేవతలందర్నీ జయించాడు. పాండవుల కీర్తిని, గౌరవాన్ని పెంపుచేస్తూ, ఆ వనాన్ని అగ్నిదేవునికి ఉపహారంగా ఇచ్చాడు.

భీమసేనుడు బాహుబలంలో పదివేల ఏనుగుల బలం కలవాడు. గదాధరులలో అతనితో సమానమైనవాడు లేడు. అలాగే ఏనుగుపై స్వారీ చేయడంలోనూ అతనితో సమానమైన వాడు ఈ భూతలంమీద లేడు. రథారూఢుడై యుద్ధం చేయడంలో కూడా ఇతడు అర్జునుని కేమీ తీసిపో డంటారు. అస్త్రవిద్యలో సుశిక్షితుడైన భీముడు కౌరవుల పట్ల గల వైరంతో వేగంగా నీచులైన కౌరవులను దహించివేస్తాడు. నిత్యం అసహనంతో ఉన్న భీముడు యుద్ధంలో బలం వల్ల ఇంద్రునిచే కూడ జయింపశక్యం కానివాడు. మాద్రి కొడుకులు నకులసహదేవులిద్దరూ మంచి మనస్సు కలవారు, బలవంతులు, అస్త్రప్రయోగంలో శీఘ్రవేగం కలవారు. స్వయంగా అర్జునుడు వారికి అస్త్రవిద్యలో శిక్షణనిచ్చాడు. డేగలు పక్షి సమూహాన్ని నష్టపరిచినట్లుగా వారిద్దరూ ఇక శత్రువులను మిగల నివ్వరు. మన బలం పరిపూర్ణమైనప్పటికీ, పాండవుల కెదురైనపుడు వారితో సమానం కాదనిపిస్తోంది. పాండవుల పక్షంలో ధృష్టద్యుమ్నుడనే యోధు డున్నాడు. అతడు సోమవంశంలో శ్రేష్ఠుడు. పాండవులకోసం అతడు తన శరీరంమీద ఆశ వదులుకొన్నాడు. శ్రీకృష్ణుడు ముందుండి నడిపిస్తూ ఉండగా, ధర్మరాజాధాటికి ఎవడు తట్టుకొనగలడు? మత్స్యదేశాధిపతి ఐన విరాటరాజు వృద్ధుడైనప్పటికీ తన పుత్రులతో కూడ పాండవులకు సహాయంకోసం సదా సిద్ధంగా ఉంటాడు. అతడు యుధిష్ఠిరునికి గొప్ప భక్తుడని విన్నాను. కేకయదేశంనుండి బహిష్కరింపబడిన కేకయ రాజ కుమారు లైదుగురూ గొప్ప ధనుర్ధారులు, రథికులు, వీరులూను. వారు కేకయరాజులనుండి రాజ్యాన్ని పొందగోరి యుద్ధం చేయాలనే తలంపుతో పాండవులతోపాటు ఉంటున్నారు.

పాండవ పక్షాన వచ్చిన భూపతులందరూ శూరులూ, వీరులూ, ధర్మరాజు పట్ల భక్తితో, ప్రీతితో ఆశ్రయించిన వారూ అని నేను విన్నాను. కొండలలోనూ, అడవులలోనూ నివసిస్తున్నవారూ, తమ వంశంచేత, జాతిచేత పరిశుద్ధులైన యోధులూ, అనేక విధాలైన ఆయుధాలూ, బలమూ కలిగిన మ్లేచ్ఛులు పాండవులకోసం సిద్ధంగా వచ్చి ఉన్నారు. యుద్ధంలో ఇంద్రునితో సమానమని, లోకప్రసిద్ధి పొందిన, ఎదురులేని

పరాక్రమం కలవాడు పాండ్యరాజు. అతడు యోధ వీరులతో కలిసి పాండవుల కోసం వచ్చి సిద్ధంగా ఉన్నాడు. ద్రోణుడు, అర్జునుడు, వాసుదేవుడు, కృపుడు, భీష్ముడు మున్నగువారి నుండి అస్త్రవిద్యను నేర్చి, ప్రద్యుమ్ననితో సమానమైన సాత్యకి కూడ పాండవుల కొరకు సిద్ధంగా ఉన్నాడు. యుధిష్ఠిరుని రాజసూయ యాగానికి చేది కరూషదేశాల రాజు లందరూ అన్ని విధాలైన ప్రయత్నాలతో కలిసి వచ్చారు. వారి మధ్యలో చేదిరాజు సూర్యునివలె ప్రకాశించాడు. యుద్ధంలో అతనిని నిలువరించడం సాధ్యం కాదని భావించి శ్రీకృష్ణుడు ఆ క్షత్రియుల ఉత్సాహాన్ని హరిస్తూ, ఈ భూమండలం మీది ధనుర్ధారులలో మిక్కిలి శ్రేష్ఠుడైన ఆ శిశుపాలుని సంహరించాడు.

ప్రముఖులైన కరూష రాజులందరూ ఎవని గర్వాన్ని పెంపొందిస్తున్నారో, ఆ శిశుపాలుని ముందుగానే చంపి, శ్రీకృష్ణుడు పాండవుల కీర్తి గౌరవాలను పెంపొందించాడు. సుగ్రీవాది అశ్వాలు పూన్చబడిన రథాన్ని ఎక్కి ఉన్న కృష్ణుని ఎదిరింపలేక, శిశుపాలుని అక్కడనే వదిలి, సింహాన్ని చూసి పరుగెత్తే చిన్న మృగాల్లా తక్కిన రాజులంతా అక్కడనుండి పారిపోయారు. ద్విరథయుద్ధంలో ద్వేషంతో శ్రీకృష్ణుని మీదికి దాడి చేసిన శిశుపాలుడు గాలిచేత పెకలించబడిన కర్ణికారవృక్షం వలె శ్రీకృష్ణుని దెబ్బకు మరణించాడు. సంజయా! పాండవులకొఱకు శ్రీకృష్ణుడు చూపిన పరాక్రమ వృత్తాంతమంతా నాకు తెలిసింది. ఆ శ్రీకృష్ణుని పనులను తలచుకొంటూంటే నేను శాంతిని పొందలేక పోతున్నాను. శ్రీకృష్ణుడు అగ్రనేతగా ఉంటే, ఆ పాండవులను ఎదిరింపగల శత్రువు వేరొకడుండడు. ఒకే రథం మీదున్న కృష్ణార్జునులను గురించి వింటేనే నా హృదయం భయంతో వణికిపోతోంది. సంజయా! తెలివితక్కువవాడైన నా కుమారుడు వారిరువురితో యుద్ధానికి వెళ్ళకపోతే శుభాన్ని పొందుతాడు. వెడితే ఇంద్రుడు, విష్ణువూ, రాక్షససేనను సంహరించినట్లుగా వారిరువురూ కౌరవుల నందర్నీ దహించి వేస్తారు.

అర్జునుడు ఇంద్రసమానుడు. వృష్ణివీరుడైన శ్రీకృష్ణుడు సనాతనుడైన శ్రీమహావిష్ణువు. వినయమూ, బలమూ కల అజాతశత్రువు ధర్మరాజు ధర్మాచరణంలోనే ఆనందిస్తాడు అని నా అభిప్రాయం. అలా కాకపోతే అభిమానధనుడైన యుధిష్ఠిరుడు తనను దుర్యోధనుడు ఎంతగానో అవమానించి నందులకు, క్రుద్ధుడై కౌరవులను

ఎపుడో దహించివేసేవాడు. సంజయా! క్రోధంతో ఉడికిపోతున్న యుధిష్ఠిరుని కోపానికి భయపడినంతగా, అర్జునుడి వల్లగాని, వాసుదేవుని వల్లగాని, భీమునివల్లగాని, నకుల సహదేవుల వల్లగాని నేను భయపడను. బ్రహ్మచర్యంతో ఉన్నవాడు, మహాతపస్వి అయిన ధర్మరాజు యొక్క మనస్సంకల్పం సిద్ధిస్తుంది. సంజయా! అతనికోపం చూసి ఇపుడు నేను భయపడడం యుక్తమే. నీవు త్వరగా రథంపై పాంచాలరాజు యొక్క సైన్యం విడిది చేసిన చోటికి వెళ్లు. అజాతశత్రువైన ధర్మరాజును కుశల మడుగు. మళ్లీ మళ్లీ ఇచ్చకంగా మాట్లాడు. నాయనా! ఆ జనార్దనుని కలిసి నా మాటగా కుశలమడుగు. ధృతరాష్ట్రుడు పాండవులతో శాంతిని కోరుకొంటున్నాడని చెప్పు. సంజయా! ధర్మరాజు వాసుదేవుడు చెప్పిన మాటనే తప్పక ఆచరిస్తాడు. శ్రీకృష్ణుడు వారికి ఆత్మసముడైన ఇష్టుడు. పండితుడు. ఎల్లపుడూ పాండవులకు హితం చేస్తాడు. సంజయా! నీవు అక్కడున్న పాండవులను, సృంజయవంశీయులను, శ్రీకృష్ణుని, సాత్యకిని, విరాటరాజును, ఉపపాండవులనూ నామాటగా క్షేమసమాచారం అడుగు. ఇంతేకాక ఇంకా నీకు భరత వంశీయులకు హితమని తోచిన మాటలను పాండవులకు చెప్పు. క్రోధానికి కాని, యుద్ధానికి గాని కారణమయ్యే మాటలనేమో మాట్లాడవద్దు."

23. సంజయుడు యుధిష్ఠిరుని కలసి మాట్లాడుట.

ధృతరాష్ట్రుని మాటను విని సంజయుడు అమిత బల పరాక్రమాలు గల పాండవులను చూడటానికి ఉపప్లవ్యానికి వెళ్లాడు. అతడు ముందుగ కుంతీపుత్రుడైన యుధిష్ఠిరుని సమీపించి, నమస్కరించి ఇలా అన్నాడు - "రాజా! మహేంద్రుని వంటి నిన్ను నీ సహాయకులతో బాటుగా క్షేమంగా ఉండగా నా భాగ్యవశాత్తు చూస్తున్నాను. వృద్ధుడైన ధృతరాష్ట్రుడు నీక్షేమాన్ని గురించి అడుగుతున్నాడు. భీముడు, పాండవశ్రేష్ఠుడైన అర్జునుడూ, నకుల సహదేవులూ కుశలమే కదా! వీరపత్ని, అభిమానవతి ఐన ద్రౌపది తన కుమారులతో కుశలమే కదా! నీకు ఇష్టులైన వారంతా తమతమ అభీష్టభోగాలతో కుశలమే కదా!"

యుధిష్ఠిరుడు పలికాడు. "సంజయా! నీకు స్వాగతం. నీ దర్శనం చేత మేము ఆనందిస్తున్నాము. నేను నా సోదరులతో కుశలంగా ఆరోగ్యంగా ఉన్నాను.

సంజయా! చాలాకాలం తర్వాత కురువృద్ధుడైన ధృతరాష్ట్రమహారాజు కుశల సమాచారాన్ని విని, నీ ప్రేమవల్ల నిన్ను చూస్తూ ఉంటే సాక్షాత్తుగా ఆ ధృతరాష్ట్రునే చూసినట్లు అనిపిస్తోంది. సంజయా! మాకు పెద్ద దిక్కు, మనసు గలవాడు, సర్వధర్మాలూ తెలిసిన మా తాత భీష్ముడు కుశలమేనా! మా పట్ల వారి అభిమానం పూర్వం వలే ఉంది గదా! సంజయా! ధృతరాష్ట్ర మహారాజు తన కుమారులతో బాటు కుశలమేనా! విద్వాంసుడైన బాహ్లిక మహారాజు కుశలమేనా! నాయనా! సోమదత్తుడు, భూరిశ్రవసుడు, శలుడు, పుత్రునితోబాటు ద్రోణాచార్యుడు, విప్రశ్రేష్ముడైన కృపాచార్యుడు – ఈ మహాధనుర్ధారు లంతా క్షేమమేనా!

సంజయా ! ఈ భూమండలంలోని ప్రధాన ధనుర్ధారులు, మిక్కిలి బుద్ధిమంతులు, సమస్త శాస్త్రజ్ఞానం కలవారూ, కౌరవులతో స్నేహభావంతో ఉన్నారా? మహాధనుష్కుడు అయిన అశ్వత్థామ నివసించే దేశంలో తక్కిన విలుకాండ్రు గౌరవాన్ని పొందుతున్నారా? వారంతా కూడా క్షేమమే కదా. మహాజ్ఞాని యుయుత్సుడు కుశలమేనా! మూర్ఖుడైన దుర్యోధనుడు, విధేయు డయిన ఆ కర్ణుడు కుశలమేనా! సంజయా! భరతవంశీయుల వృద్ధస్త్రీలు, తల్లులు, వంటకత్తెలు, దాస భార్యలు, కోడండ్రు, కొడుకులు, మేనల్లుళ్లు, తోబుట్టువులు, దౌహిత్రులు కపటం లేకుండా సంచరిస్తున్నారా? సంజయా! దుర్యోధనుడు బ్రాహ్మణులపట్ల మునుపటిలా తగినవిధంగా ప్రవర్తిస్తున్నాడా! బ్రాహ్మణుల జీవనంకోసం నేనిచ్చిన గ్రామాదులను దుర్యోధనుడు లాగుకొన లేదుకదా!

పుత్రులతో బాటు ధృతరాష్ట్రుడు కూడ బ్రాహ్మణుల పట్ల జరిగిన అపరాధాలను ఉపేక్షించటం లేదు కదా! స్వర్గానికి మార్గం లాంటిది బ్రాహ్మణులకు వృత్తి కల్పించటం. దాన్ని రాజూ ఉపేక్షించడు కదా! బ్రాహ్మణులకు జీవికను కల్పించడమనేది పరలోకాన్ని చూపే గొప్ప వెలుగు. బ్రహ్మ ప్రజలకోసం ఈ తెల్లని జ్యోతిని ఏర్పరచాడు. మూర్ఖులైన కౌరవులు బ్రాహ్మణులపట్ల జరిగే దోషాల్ని నియంత్రించకపోతే, కౌరవులకు సర్వనాశనమే అవుతుంది. పుత్రులతో కూడిన ధృతరాష్ట్రుడు మంత్రివర్గానికి తగిన విధంగా జీవించడానికి కావలసిన వృత్తిని కల్పిస్తున్నాడా! వారు శత్రువులతో కలిసి మిత్రులుగా ఉంటూనే రాజుకు వ్యతిరేకంగా జీవింపగోరటం లేదు కదా! నాయనా ! సంజయా! కౌరవులంతా కలిసి పాండవులపై దోషాన్ని చెప్పుకొనటం లేదుకదా! పుత్రునితో బాటు ద్రోణుడు, వీరుడైన కృపుడు మా విషయంలో దోషాలను చెప్పటం లేదుకదా!

కురువంశీయులంతా వెళ్లి ఎప్పుడైనా దుర్యోధనుడితో ఉన్న ధృతరాష్ట్రునితో (మాకు రావలసిన) రాజ్యాన్ని గూర్చి మాట్లాడుతున్నారా! వారెప్పుడైనా రాజ్యంలోని దోపిడీ మూకల్ని చూసి యుద్ధ నిర్వాహకుడైన అర్జునుని స్మరిస్తున్నారా! సంజయా! అల్లెత్రాడు భుజాల వరకు లాగి ప్రయోగింపబడేవి అర్జునుని బాణాలు. వింటి నారిని కంపింపజేస్తూ, గాండీవం నుండి వెలువడి, మేఘం వలె ధ్వనించే అర్జునుని ఆ బాణాలను వారు స్మరిస్తున్నారా! ఒక్కసారిగా మంచిపిడులు గల అరవైయొక్క తీక్ష్ణబాణాలను ప్రయోగింపగల అర్జునుడితో సమానుడిని కాని, అంతకంటె గొప్ప యోధుని గాని ఈ భూమిమీద నేను చూడలేదు. వాని చేతి నేర్పు ప్రశంసనీయం. దట్టమైన అడవుల్లో నిర్భయంగా సంచరించే మదపుటేనుగులా యుద్ధరంగంలో శత్రుమూకలను వణికిస్తూ చేతిలో గదతో వేగంగా తిరిగే భీమసేనుని స్మరిస్తున్నారా! యుద్ధంలో కుడి, యెడమ చేతులతో బాణాలను విసురుతూ తనకెదురైన కళింగ రాజులను జయించిన సహదేవుని స్మరిస్తున్నారా!

మునుపు రాజసూయయాగ సందర్భంలో శిబిని, త్రిగర్త దేశరాజులను జయించడానికి వెళ్లిన నకులుడు పశ్చిమ దిక్కునంతా నా అధీనంలోకి తెచ్చాడు. అతనిని స్మరిస్తున్నారా! దురాలోచనతో ద్వైతవనంలోకి ఘోషయాత్రకు వచ్చిన ధృతరాష్ట్రకుమారులు పరాభవం పొందారు. శత్రువుల అధీనం అయిపోతున్న మందబుద్ధులను భీమార్జునులు బంధవిముక్తుల్ని చేశారు. ఆ సంగతిని స్మరిస్తున్నారా.! అప్పుడు నేను యజ్ఞం ద్వారా వెనుకనుండి అర్జునుని రక్షించాను. భీమసేనుడు నకుల సహదేవులను రక్షించాడు. గాండీవధారి అర్జునుడు శత్రువులను పారద్రోలి క్షేమంగా తిరిగి వచ్చాడు. ఈ విషయాన్ని కౌరవులు స్మరిస్తున్నారా! సంజయా! మేము దుర్యోధనుని దాన, భేద, దండా లనే ఉపాయాలతో జయింపలేకపోతే, సామోపాయంచేత అతనిని అసలే జయింపలేము, ఇది నిశ్చయం."

24. యుధిష్ఠిరుని ప్రశ్నలకు సంజయుడు సమాధానమిచ్చుట.

సంజయుడు పలికాడు. "కురుశ్రేష్ఠా! నీవు నన్ను అడిగినట్లుగా అక్కడంతా అలాగే ఉన్నారు. కౌరవులూ, జనులూ కూడ కుశలంగా ఉన్నారు. అభిమానవంతులైన కురుశ్రేష్ఠులంతా నీవడిగినట్లుగా కుశలంగా ఉన్నారు. దుర్యోధనుని దగ్గర సత్పురుషులైన

వృద్ధులూ ఉన్నారు. పాపాత్ములైన వారూ ఉన్నారు. దుర్యోధనుడు శత్రువులకైనా దానం చేస్తాడు. ఇక బ్రాహ్మణుల మాన్యాలను ఎలా హరిస్తాడు? దుర్యోధనుడి పట్ల ఎప్పుడూ ద్రోహం చెయ్యని మీ పట్ల ధృతరాష్ట్రుడు ద్రోహచింతన చేస్తే అది వానికే మంచిది కాదు. మీవంటి మంచినడవడిక కలవారిని ద్వేషిస్తే ధృతరాష్ట్రుడు మిత్రద్రోహి, చెడ్డవాడు కాగలడు. అజాతశత్రూ! ధృతరాష్ట్రుడు తనకొడుకుల్ని మీ పట్ల ద్రోహం చెయ్యడానికి అనుమతించటంలేదు. పైగా మీపట్ల వారి ద్రోహచింతనకు మనస్సులో మిక్కిలి బాధ పడుతున్నాడు. మిత్రద్రోహం అన్ని పాతకాలకంటే పెద్దది అని చెపుతున్న బ్రాహ్మణుల మాటలను శ్రద్ధగా వింటున్నాడు. రాజా! కౌరవులు యుద్ధ ప్రసంగంలో మీ గురించి, వీరాగ్రేసరుడైన అర్జునుని గురించి స్మరిస్తున్నారు. యుద్ధ సమయంలోని దుందుభి, శంఖధ్వనులు వినబడుతూ ఉన్నపుడు గదాపాణి భీమసేనుడు గుర్తుకు వస్తాడు. శత్రువులు దండెత్తినపుడు మహారథులైన నకుల సహదేవులు, ఎడతెగకుండా బాణవర్షం కురిపిస్తూ అన్ని దిక్కులకూ సంచరిస్తూ ఉండేవారు. వారిని కౌరవులు స్మరిస్తున్నారు. అజాతశత్రూ! అన్నిధర్మాలూ తెలిసిన నీవు కూడా ఇంతటి కఠినమైన కష్టాన్ని పొందావంటే, మానవునికి భవిష్యత్తులో జరుగబోయేది ఏమీ తెలియదనుకొంటున్నాను. ఇంతటి కష్టంలో ఉన్నప్పటికీ నీవే నీ ప్రతిభతో శాంతికి ఉపాయాన్ని ఆలోచించాలి. అజాతశత్రూ! ఇంద్రునితో సమానమైన పాండవులు తమ కోరికలకోసం ధర్మాన్ని ఎన్నడూ విడిచిపెట్టరు. కౌరవులు, పాండవులు, సృంజయులు ఇంకా ఇక్కడ ఉన్న రాజన్యులు అంతా క్షేమంగా ఉండే విధంగా నీ ప్రతిభతో నీవే ఈ సమస్యను పరిష్కరించాలి. అజాతశత్రూ! నీ తండ్రి ధృతరాష్ట్రుడు రాత్రి నాతో చెప్పిన ఈ మాటలను నీవు నీ మంత్రులకు, సోదరులకు, పుత్రులకు తెలియజెప్పు."

25. సంజయుడు ధృతరాష్ట్రుని సందేశమును యుధిష్ఠిరునికి వినిపించుట.

ఆ మాటలు విని ధర్మరాజు ఇలా అన్నాడు. "సంజయా! పాండవులు, సృంజయులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, విరాటరాజూ..... అందరూ ఇక్కడ ఉన్నారు. ధృతరాష్ట్రమహారాజు నీచే పంపిన సందేశాన్ని వినిపించు." సంజయుడు పలికాడు. "అజాతశత్రూ! భీమసేనా! అర్జునా! నకుల సహదేవులారా! వాసుదేవా! సాత్యకీ!

చేకితానా! విరాటరాజా! పాంచాలాధిపా ద్రుపదమహారాజా! ధృష్టద్యుమ్నా! ద్రౌపదీ! మిమ్మందరినీ ప్రార్థిస్తున్నాను. కురువంశీయుల క్షేమాన్ని కోరి నేను చెప్పే మాటలను మీరంతా వినండి. ధృతరాష్ట్రమహారాజు శాంతిని కోరుతూ నన్ను అభినందించి, శీఘ్రంగా రథాన్ని ఏర్పాటు చేసి, ఇక్కడకు పంపాడు. సోదరులతో, పుత్రులతో, స్వజనులతో కూడియున్న ధృతరాష్ట్రుని ఈ శాంతి సందేశం పాండవులకు కూడా రుచిస్తే శాంతి ఏర్పడుతుంది. కుంతీపుత్రులారా! మీరు మీ శరీరం చేత, మృదుస్వభావం చేత, ఋజువర్తనం చేత అన్ని ధర్మాలతో కూడి ఉన్నారు. ఉన్నత వంశంలో పుట్టిన మీరు దయాళురు, ఉదారులు, బిడియం కలవారు, కార్యనిశ్చయం తెలిసినవారూను.

పాండవులారా! నీచమైన పని మీకు యుక్తం కాదు. మీ యొక్క సత్వగుణం (బలం) అటువంటిది కదా! మీ యొక్క చిన్నదోషమైనా అది తెల్లని వస్త్రం మీద నల్లని మరకలా స్ఫుటంగా కనబడుతుంది. యుద్ధం అందరికీ నాశనం కలిగిస్తుంది. పాపాన్ని కల్గిస్తుంది. చివరికి శూన్యాన్ని మిగులుస్తుంది. సుఖం లేనిది. గెలుపూ, ఓటమీ కూడ సమానమైన యుద్ధాన్ని తెలిసి తెలిసి ఎవడు చేస్తాడు? జ్ఞాతులకు హితమైన పనిని చేసేవారే ధన్యులు. వారే స్నేహితులు, బంధువులూను. కురువంశానికి తప్పనిసరిగా అభ్యుదయం కలగాలంటే, కురువంశీయులు నిందితమైన జీవనాన్ని (తమలో తాము కలహించుకోవడం) విడిచిపెట్టాలి. కుంతీనందనులారా! మీరు శత్రువులైన కురువంశీయులను శాసించి యుద్ధమే నిశ్చయించుకొని వారిని బంధించినా, వధించినా, ఆ తరువాత మీ జీవితం మరణంతో సమానమే. జ్ఞాతివధ చేస్తే మీరు జీవింతురుగాక! కాని అది మంచిది కాదు. ధృష్టద్యుమ్నుడు మిమ్మల్ని రక్షిస్తూ ఉండగా, భగవంతుడైన శ్రీకృష్ణుడు, చేకితానుడు, సాత్యకి, సహాయకులుగా ఉండగా, ఇంద్రునితో బాటు దేవతలంతా దండెత్తినా మిమ్మల్ని ఎవడూ నిలపలేడు.

అదే విధంగా యుద్ధంలో ద్రోణుడు, భీష్ముడు, అశ్వత్థామ, శల్యుడు, కృపుడు, కర్ణుడు, మున్నగు వారిచే రక్షింపబడుతూ ఉన్న కౌరవులను ఎవడు జయింపగలడు? దుర్యోధనుని వద్ద చాలాపెద్ద సైన్యం ఉంది. తాను తరిగిపోకుండా ఎవడూ దాన్ని నశింపజేయలేడు. కాబట్టి జయమైనా, అపజయమైనా నాకేమీ మంచి కనబడటం లేదు. చెడువంశంలో పుట్టిన నీచుల వలె పాండవులు ధర్మరహితమైన పనిని ఎలా చేస్తారు? వాసుదేవునకు ద్రుపదునకూ నమస్కరించి, కురుసృంజయ వంశీయులకు

క్షేమం ఎలా కలుగుతుందో చూడమని చేతులు జోడించి మిమ్మల్ని శరణువేడుతున్నాను. వాసుదేవుడు, అర్జునుడు నా మాటను లక్ష్యపెట్టరని నేననుకోవడం లేదు. ఇంతే కాదు, నేనడిగితే అర్జునుడు ప్రాణాలైనా ఇవ్వగలడు. ఇక ఇతర విషయాల సంగతి చెప్పడమెందుకు? విద్వాంసుడవైన ధర్మరాజా! కార్యం సాధించడంకోసం ఇదంతా చెపుతున్నాను. భీష్మ ధృతరాష్ట్రుల అభిమతం కూడా ఇదే. దీనివల్ల మీ అందరికి గొప్ప శాంతి లభిస్తుంది."

26. తనరాజ్యమిచ్చినచో శాంతి లభించునని యుధిష్ఠిరుడు చెప్పుట.

యుధిష్ఠిరుడు పలికాడు. "సంజయా! నేను యుద్ధాన్ని కోరుతున్నట్లు ఏమైనా అన్నానా ? నీవు యుద్ధాన్ని గురించి ఎందుకు భయపడుతున్నావు? నాయనా! యుద్ధం కంటె యుద్ధంలేకపోవడం (సంధి) శ్రేష్ఠమైనదే. అదే లభిస్తే ఎవడు యుద్ధం చేస్తాడు ? సంజయా! పని చెయ్యకుండానే తాను మనస్సులో కోరుకున్నది సిద్ధించితే ఏ మనిషీ ఇక పని చెయ్యడు. ఆ విషయం నాకు బాగా తెలుసు. యుద్ధం లేకుండా లభించినది చిన్నదైనా దాన్ని నేను పెద్దదిగానే భావిస్తాను. మానవుడు ఎప్పుడైనా ఎందుకు యుద్ధాన్ని కోరుకొంటాడు? విధివంచితుడెవడో యుద్ధాన్ని కోరుతాడు. సుఖాన్ని కోరుకునే పాండవులు లోకానికి హితమై, ధర్మం తప్పని పనినే చేస్తారు. మేము ధర్మం వల్ల కలిగే సుఖాన్ని మాత్రమే కోరుకొంటాము. ఇంద్రియాల కిష్టమైన విషయానందాన్ని కోరుకొనేవాడూ, దుఃఖాన్ని పారద్రోలి సుఖాన్ని పొందా లనుకొనేవాడూ, కష్టమైన ఉపాయాలతో కూడిన పనిని చేస్తాడు. వాస్తవానికది చివరకు దుఃఖాన్నే కలిగిస్తుంది. కోరికలమీది ధ్యాస తన శరీరాన్ని బాధిస్తుంది. ఆ చింతన లేకపోతే దుఃఖమే కలుగదు. మండుతున్న అగ్నిలో ఇంధనం వేస్తే దానిబలం ఎక్కువౌతుంది. నేతివల్ల అగ్ని ప్రజ్వలించినట్లుగా కోరుకొన్న భోగాలను పొందేకొద్దీ మానవుని తృష్ణ అధిక మవుతుంది. మాతోపాటుగ ఆ ధృతరాష్ట్రమహారాజు దగ్గరకు చేరిన ఈ భోగాల సముదాయాన్ని చూడు. అయినా ఆయనకింకా తృప్తి కలుగలేదు కదా.

పుణ్యాత్ముడు కానివాడు యుద్ధాల్లో విజయం పొందలేడు. తన కీర్తి గానాన్ని వినలేడు. గంధ మాల్యాలను ధరింపలేడు. మంచి గంధాన్ని పూసుకోజాలడు. మంచి వస్త్రాలను ధరింపలేడు. ఈ భోగాలన్నీ ఉన్న ధృతరాష్ట్రుడు పుణ్యాత్ముడే. అతడు

పుణ్యాత్ముడు కాకుంటే మమ్మల్ని కురుదేశాలనుండి ఎలా దూరం జేయగలడు? సాధారణంగా ఎదుటివారి శరీరంలోని హృదయాన్ని బాధించే అజ్ఞానియైన దుర్యోధనుడి వంటి వానికే ఈ భోగతృష్ణ ఉంటుంది. రాజు స్వయంగా విషమస్థితిలో ఉండి ఇతరులు సమస్థితిలో ఉండాలని కోరుకోవడం యుక్తం కాదు. తాను వంకరగా ఆలోచిస్తూ ఇతరులు సవ్యంగా ఆలోచించాలనడం యుక్తం కాదు. తన స్థితిలాగానే ఇతరులస్థితిని కూడా చూచే వాడే యోగ్యుడు. శిశిరం గడిచాక వేసవిలో గడ్డితో నిండిన దట్టమైన అడవిలో అగ్గిని పడేసి, గాలివల్ల మంట చెలరేగితే తరువాత తన క్షేమంకోసం దుఃఖించే వాడిలా, ధృతరాష్ట్ర మహారాజు సమస్త రాజ్య సంపదమీద ఆధిపత్యంతో, దుర్బుద్ధి, కుటిలుడు, భాగ్యహీనుడు, మూర్ఖుడూ ఐన తనకొడుకును అనుసరిస్తూ ఇపుడు దుఃఖపడుతున్నాడు. తనకొడుకు ఇష్టాన్ని కోరుకొంటున్న ధృతరాష్ట్రుడు తమకందరికంటె ఆప్తుడైన విదురుని ఆప్తునిగ గుర్తింపక, అతని మాటలను లక్ష్యపెట్టక, అత డెంత చెప్పినా అధర్మాన్నే ఆశ్రయిస్తున్నాడు. పుత్రునిమీది మోహంతో ధృతరాష్ట్రుడు మేధావి, విద్వాంసుడు, కౌరవుల అభీష్టాన్ని కోరుకొనేవాడు, బాగా చదువుకున్న విద్వాంసుడు, మంచిమాటకారి, శీలవంతుడూ ఐన విదురుని కౌరవులకోసమైనా ఆదరించలేదు. దుర్యోధనుడు ఇతరుల అభిమానాన్ని దెబ్బతీస్తూ, స్వాభిమానాన్ని కోరుకొంటాడు. ఈర్ష్యాళువు. క్రోధంతో ధర్మార్థాలను అతిక్రమిస్తాడు. దుర్భాషలాడుతూ, క్రోధవివశుడై ప్రవర్తిస్తాడు. భోగాసక్తుడు, పాపాత్ములచే గౌరవింపబడేవాడు, నేర్వదగినవాడు, భాగ్యహీనుడు, దీర్ఘకోపి, మిత్రద్రోహి, పాపబుద్ధి. అటువంటి కుమారుని ప్రియాన్ని కోరుతూ ధృతరాష్ట్రమహారాజు ధర్మకామాలను విడిచి పెట్టాడు. సంజయా! జూదం ఆడుతున్నప్పుడు విదురుడు చెప్పదగినట్లు చెప్పినా, దుర్యోధనుడు విదురుని ఏమాత్రం ప్రశంసించలేదు. అపుడే **'కౌరవులకు వినాశకాలం దగ్గరపడిం'**దని నేను అనుకొన్నాను.

కౌరవులు విదురుని బుద్ధిననుసరించి ప్రవర్తించినంతకాలం వారి రాజ్యం వృద్ధి చెందింది. వారు విదురుని మాటను వినడం మానేసి నప్పటినుండే వారికి ఆపదలు వచ్చాయి. సంజయా! ధనలోభియైన దుర్యోధనుడి దగ్గర దుఃశాసనుడు, శకుని, సూతపుత్రుడు కర్ణుడు మంత్రులుగా ఉన్నారు. వాని మోహం, అజ్ఞానం ఎంతటిదో తెలిసికో. ఎంత పరీక్షించినా కురు సృంజయ వంశీయులకు క్షేమం ఎలా

కలుగుతుందో నాకు తెలియటం లేదు. ధృతరాష్ట్రుడు ఇతరుల రాజ్యసంపదను పొంది, దూరదృష్టిగల విదురుని దేశంనుండి వెళ్లగొట్టి, తన కుమారులతో కలిసి ఈ భూమిమీద తన మహారాజ్యం నిష్కంటకం కావాలనుకొంటున్నాడు. మేము అడవికి వెళ్లగానే మా రాజ్యం కూడా తనదే అని భావించే ఇటువంటి లోభితో సంధి కూడా పొసగుతుందని నేను భావించడం లేదు. యుద్ధంలో ధనుర్ధారి ఐన అర్జునుని జయించవచ్చని కర్ణుడు భావిస్తున్నాడు. కాని అది అతని భ్రమ. ఇంతకు మునుపు అనేక యుద్ధాలు జరిగాయి. మరి అపుడు కర్ణుడు కౌరవులను ఎందుకు రక్షించలేక పోయాడు? అర్జునుని వంటి మరొక విలుకాడు లేడన్న సంగతి కర్ణసుయోధనులకు తెలుసు. భీష్మద్రోణులకూ తెలుసు. అక్కడున్న తక్కిన కురురాజు లందరికీ తెలుసు.

అర్జునుడు లేనపుడు దుర్యోధనుని రాజ్యం ఎలా తయారయిందో కౌరవు లందరికీ తెలుసు. అక్కడకు చేరిన రాజులందరికీ తెలుసు. అర్జునునితో యుద్ధరంగంలో తలపడిన దుర్యోధనుడు రాజ్యంమీద పాండవులకున్న మమకారాన్ని (అధికారాన్ని) అంత సులభంగా హరించగల ననుకొంటున్నాడా! అర్జునుని గాండీవధనుష్టంకారాన్ని విననంతవరకే యుద్ధరంగంలో కౌరవులు జీవించి ఉండేది. కోపించిన భీమసేనుని చూడనంతవరకు దుర్యోధనుడు తన రాజ్యకాంక్ష సిద్ధించిందనుకోవచ్చు. నాయనా! సంజయా! మా భీమసేనుడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు జీవించి ఉన్నంతవరకు ఇంద్రుడు కూడా మారాజ్యసంపదను హరించడానికి ప్రయత్నింపడు. సూతా! సంజయా! తన కుమారులతో బాటు ధృతరాష్ట్రుడు పాండవులకు రాజ్యం ఇవ్వకపోతే క్షేమం కాదనే సంగతిని బాగా తెలుసుకోవాలి – అపుడే యుద్ధరంగంలో ధృతరాష్ట్రకుమారులు పాండవుల కోపాగ్నిచే దహింప బడకుండా ఉంటారు. సంజయా! కౌరవుల కారణంగా మేముపడ్డ కష్టం నీవు ఎరుగుదువు. నిన్ను గౌరవిస్తూ ఆ అపరాధా లన్నింటిని నేను క్షమించగలను. ఇంతకుమునుపు కౌరవులు మాపట్ల ఎలా ప్రవర్తించారో, అపుడు మేము వారి పట్ల ఎలా ప్రవర్తించామో కూడ నీకు తెలుసు. ఇపుడు కూడ వారంతా అక్కడ పూర్వం లాగే ఉందురుగాక. నీవు చెప్పినట్లు నేను కూడా శాంతిని వహిస్తాను. ఇంద్రప్రస్థంలో నా రాజ్యం ఉండుగాక. దుర్యోధనుడు అక్కడ నారాజ్యం నాకు తిరిగి ఇవ్వాలి."

27. సంజయుని వచనములు.

సంజయుడు పలికాడు – "పాండునందనా! నీ పనులన్నీ ధర్మాన్ని అనుసరించే ఉంటాయి. ఈ విషయం లోకానికంతటికీ తెలిసిందే. అలాగే కనబడుతోంది కూడ. జీవితం అనిత్యమైనదయినా దీనివల్ల మంచికీర్తిని పొందవచ్చు. పాండునందనా! అనిత్యమైన శరీరం మీది దృష్టితో శాశ్వతమైన కీర్తిని నష్టపరచకు. అజాతశత్రూ! యుద్ధం లేకుండా కౌరవులు మీకు రాజ్యభాగం ఇవ్వకపోవచ్చు. అయినప్పటికీ అంధక వృష్ణి రాజ్యాలలో మీరు భిక్షావృత్తిచే జీవించటం మేలు. యుద్ధం చేసి రాజ్యం పొందటం మేలు కాదని భావిస్తున్నాను. మానవుని జీవితకాలం చాల తక్కువ. ఇది క్షీణించేది, నిత్యం దుఃఖమయమైంది. చంచలమైనదీ కూడా. పాండునందనా! నీవు యుద్ధరూపమైన పాపాన్ని చేయవద్దు. అది నీకీర్తికి తగినదికాదు. రాజా! ధర్మానికి విఘ్నం కలిగించే మూలకారణం కోరికలు. అవి తమ వైపు మానవుని ఆకర్షిస్తాయి. బుద్ధిమంతుడైన మానవుడు ముందుగానే ఆ కోరికలను కట్టడిచేసి, లోకంలో స్వచ్ఛమైన ప్రశంసను పొందుతాడు. ఈ లోకంలో ధనదాహం మానవుని బంధనంలో పడవేస్తుంది. దాన్ని కోరుకునే వారి ధర్మాన్ని అది బాధిస్తుంది. ధర్మాన్ని కోరుకొన్న వాడే తెలివైనవాడు. భోగలాలసుడైన వాడు ధనాసక్తుడై ధర్మభ్రష్టు డౌతాడు. కర్మలలో ముఖ్యమైన ధర్మాన్ని ఆచరించినవాడు ప్రచండ సూర్యునిలా ప్రకాశిస్తాడు. ధర్మహీనుడైనవాడు ఈ భూమండలాన్ని పొందినా పాపబుద్ధియై నశిస్తాడు. వేదాధ్యయనం చేశావు. బ్రహ్మచర్యం పాటించావు. యజ్ఞాలు చేసి, బ్రాహ్మణులకు దానమిచ్చావు, పరలోకాన్ని విశ్వసించావు. అక్కడ అనేక సంవత్సరాల సుఖాల కోసం నిన్ను నీవు అర్పించుకొన్నావు.

సుఖాన్ని, ప్రియాన్ని హద్దుమీరి సేవించేవాడు, యోగాభ్యాసంలో కర్మ చేయనివాడు, ధనం క్షీణించాక, సుఖాలకు దూరమై, కోరికల తాకిడికి లోనై అంతులేని దుఃఖాన్ని పొందుతాడు. ఇదే విధంగా బ్రహ్మచర్యం పాటింపక, ధర్మాన్ని విడిచి అధర్మాన్ని ఆచరించేవాడు పరలోకంపట్ల శ్రద్ధ లేనివాడై, మూఢుడై ఈ దేహాన్ని విడిచి పరలోకంలో మిక్కిలి బాధపడతాడు. **పుణ్యకర్మలైనా, పాపకర్మలైనా ఈలోకంలో నశించవు. ముందుగా కర్తయొక్క పుణ్యపాపాలు పరలోకం చేరతాయి. తర్వాత కర్త వాటిని అనుసరించి వెళ్తాడు.** మీరు ఉత్తమ దక్షిణలతో కూడిన మాసిక శ్రాద్ధాది

కర్మలలో బ్రాహ్మణులకు న్యాయంగా సంపాదించిన ధనాన్ని; శ్రద్ధచే పవిత్రమై, మంచి గంధరసాలతో రుచిగా ఉన్న అన్నాన్ని దానమివ్వటం ఈ భూమిపై ప్రసిద్ధమైందే కదా! కుంతీనందనా! ఈ శరీరంతో ఉండగానే ఏదైనా సత్కార్యం చేయగలం. మరణించిన తర్వాత ఏమీ చేయలేము. సత్పురుషులచే ప్రశంసింపబడిన పరలోకంలో సుఖాలనిచ్చే మహాపుణ్య కార్యాలు నీవు చేశావు. పుణ్యాత్ముడైన మనుష్యుడు పరలోకానికి వెళ్లి మృత్యువును, ముసలితనాన్ని, భయాన్ని విడిచిపెడతాడు. మనస్సుకు ఇష్టంలేని ఆకలిదప్పులు అక్కడ ఉండవు. పరలోకంలో ఇంద్రియ భోగాల ననుభవించడం తప్ప ఇక కర్తవ్యమంటూ ఏమీ ఉండదు.

నరేంద్రా! మనస్సుకు ఇష్టమైన విషయ భోగాలచేత ఇటువంటి కర్మఫలం పొందలేం. పాండునందనా! నీవు క్రోధం వల్ల కలిగే నరకానికి కాని, ఆనందంవల్ల కలిగే స్వర్గానికి గాని వెళ్లజాలవు. జ్ఞానం చేత కర్మల అంతానికి చేరుకున్న నీవు సత్యం, ధర్మం, ఋజువర్తనం, దయ మున్నగు సద్గుణాల్ని విడిచి పెట్టకు. అశ్వమేధం, రాజసూయం, యజ్ఞం మున్నగు వాటిని విడవకు. యుద్ధంవంటి పాపకార్యంజోలికి మళ్లీ వెళ్లకు. కుంతీకుమారులారా! చిరకాలముండే ద్వేషంతో మీరు యుద్ధరూపమైన పాపం చేసేటట్లైతే, దానికన్న అనేక సంవత్సరాలు దుఃఖమయమైన ఈ వనవాసం చేయడమే మీకు ధర్మం. ఇపుడు నీ అధీనంలో ఉన్న ఈ బలమంతా మునుపు కూడా మీవెంటే ఉన్నా, మీరు వనానికి వెళ్లారు. ఇపుడున్న ఈ మంత్రులు, శ్రీకృష్ణుడు, వీరవరుడైన సాత్యకి అప్పుడు కూడా మీతోనే ఉన్నారుగదా. దెబ్బకొట్టడంలో కుశలులైన వీరసైనికులతో, పుత్రులతో కూడి బంగారు రథం మీద వచ్చే మత్స్యదేశాధీశుడు విరాటుడు, మీరింతకు మునుపు జయించిన రాజు లందరూ యుద్ధంలో మీ పక్షమే వహిస్తారు. గొప్పసహాయసంపత్తితో నీవు బలవంతుడవై శ్రీకృష్ణార్జునులు ముందు వెళుతుండగా, యుద్ధరంగంలో శత్రుశేష్మలను వధిస్తూ, అప్పుడే దుర్యోధనుడి గర్వాన్ని పోగొట్టగలవాడవు. పాండునందనా! శత్రువుల బలాన్ని పెరగనిచ్చి, నీ సహాయకులను దుర్బలులను చేసి, పన్నెండేళ్లు వనవాసం చేసి, కాలం కలసిరానపుడు ఎందుకోసం యుద్ధం చెయ్యాలనుకొంటున్నావు?

పాండునందనా ! మనుష్యుడు అజ్ఞాని అయినా, పాపి ఐనా యుద్ధం చేసి సంపదను పొందుతాడు. కాని జ్ఞాని, ధర్మజ్ఞుడూ అయినవాడు దైవసంబంధమైన

బాధకారణంగా పరాజితుడై ఐశ్వర్యాన్ని వదులుకొంటాడు. ధర్మజా! నీబుద్ధి అధర్మం వైపు ఎప్పుడూ వర్తించదు. కోపంవల్ల (పూర్వం) ఎపుడూ పాపకర్మను నీవు చెయ్యలేదు. మరి ఇపుడు ప్రజ్ఞావిరుద్ధమైన ఈపాపపు పని (యుద్ధం) చెయ్యాలని ఎందుకనుకొంటున్నావు? దీనికి కారణం ఏమిటి? మహారాజా! **క్రోధం వ్యాధిలేకుండా పుడుతుంది, చేదుగా ఉంటుంది. శిరస్సును బాధిస్తుంది, కీర్తిని నాశనం చేస్తుంది. పాపపు పనిని చేయిస్తుంది. అది సత్పురుషులు మ్రింగగలిగింది, దుర్మార్గులు మ్రింగలేనిది, అటువంటి క్రోధాన్ని శాంతింపజేసి మింగెయ్యి.** పాపంతో కలసి వచ్చే కోపాన్ని ఎవడు కోరుకొంటాడు? **నీకు సహనమే మంచిది.** భోగాలు కావు. భీష్ముడూ, అశ్వత్థామా, ద్రోణుడూ చనిపోయే భోగం నీకు వద్దు. ధర్మజా! కృపుడు, శల్యుడు, భూరిశ్రవుడు, వికర్ణుడు, వివింశతి, కర్ణ దుర్యోధనులు-వీరందిరినీ చంపి నీవేం సుఖం పొందుతావు? చెప్పు. రాజా! సాగరపర్యంతం వ్యాపించిన ఈ భూమండలాన్ని పొందినా నీవు జరా మృత్యువులను, ప్రియా ప్రియాలను, సుఖ దుఃఖాలను విడిచి పెట్టలేవు. నీవు విద్వాంసుడవు. నీవు యుద్ధం చేయవద్దు. నీమంత్రుల కోరికవల్ల నీవిటువంటి పని చెయ్యాలనుకొంటూంటే, వారికి ధనమిచ్చి పంపి, వానప్రస్థాన్ని స్వీకరించు, అంతేకాని దేవయాన మార్గం నుండి మాత్రం తప్పుకోకు."

28. సంజయునికి యుధిష్ఠిరుడు సమాధాన మిచ్చుట.

యుధిష్ఠిరుడు పలికాడు. "సంజయా! సందేహం లేదు. కర్మలలో ధర్మం శ్రేష్ఠమైన దనటం సత్యం. నేను ధర్మంగా నడుస్తున్నానో, అధర్మంగా నడుస్తున్నానో బాగా తెలిసికొని నన్ను నిందించు. ఒక్కొక్క చోట అధర్మం ధర్మరూపంలో కనబడుతుంది. మరొక చోట ధర్మం అధర్మంగా కనబడుతుంది. ఇంకొకచోట ధర్మం తన సహజమైన ధర్మరూపాన్నే ధరిస్తుంది. విద్వాంసులు తమ బుద్ధిచేత దాని అసలు రూపాన్ని చూడ గల్గుతారు. **ధర్మాధర్మాలు నిశ్చయరూపంలో ఉండే వైనా ఆపత్కాలంలో భిన్నలక్షణాన్ని పొందుతాయి.** ఏ వర్ణానికి మొదట ఏ లక్షణం (ధర్మం) చెప్పబడిందో దాని కదే ప్రమాణం. **కాని ఆపద్ధర్మం యొక్క స్వభావం వేరే ఉంటుంది. ముందు దాన్ని బాగా తెలిసికో. స్వాభావిక జీవనంలో ఉండి తనకర్మ తాను చేయలేని వాడు సత్కర్మాచరణం కోసం వేరేవృత్తిని**

ఆశ్రయించకపోయినా, స్వాభావిక జీవనంలో జీవిక కలిగినవాడు కూడా ఆపద్ధర్మాన్ని స్వీకరించినా వారిద్దరూ కూడ నిందింపదగినవారే ఔతారు. సూతుడా! అందుకే బ్రాహ్మణుల వినాశం కాకూడదనే బ్రహ్మ వారికి ప్రాయశ్చిత్తాన్ని విధించాడు. ఆపత్తికాలంలో కూడ మా విహిత కర్మలలో మేమున్నామా లేక ఆపత్కాలం కాకుండానే ఇతరుల విహితకర్మను స్వీకరిస్తున్నామా అనేది బాగా గమనించి మమ్మల్ని నిందించు. బుద్ధిమంతులైనవారు భవబంధాలను ఛేదించడానికి సత్పురుషుల నాశ్రయించి జీవితాన్ని నిర్వహించుకోవడం శాస్త్రీయ విధానం. బ్రహ్మవిద్యపట్ల నిష్ఠలేనివారు, అబ్రాహ్మణులు మాత్రం వారి వారి వర్ణాశ్రమ ధర్మాలను అనుసరించి ఎవరి దగ్గరయినా జీవనం సాగించవచ్చు. పూర్వీకులైన నా తండ్రులు, తాతలు, ముత్తాతలు అంతకంటె ముందువారు యజ్ఞేచ్ఛతో కర్మ చేశారు. ఆ మార్గంలోనే నేనూ నడుస్తాను. మరో మార్గంలో వెళ్లడానికి నేనేమీ నాస్తికుణ్ణి కాదు.

సంజయా! ఈ భూమండలం మీదున్న సమస్తధనవైభవం కలిగినా, దేవతా సంపత్తి లభించినా, దానికంటె గొప్పదైన ప్రజాపతివైభవం లభించినా, దానికంటె గొప్పదైన బ్రహ్మలోకవైభవం లభించినా సరే, నేను అధర్మాన్ని స్వీకరించను. ఇక్కడ ధర్మానికి అధినాయకుడు, నీతిజ్ఞుడు, కుశలుడు, బ్రాహ్మణ భక్తుడు, మనీషి, క్షత్రియులను శాసింపగల కృష్ణు డున్నాడు. నేను సామమార్గాన్ని విడిచిపెట్టి నిందింపదగిన వాణ్ణి అవుతున్నానా, లేక యుద్ధానికి ప్రయత్నించి ధర్మోల్లంఘన చేస్తున్నానా అనే విషయాన్ని వసుదేవనందనుడే చెప్పగలడు. అతడు రెండు పక్షాల హితాన్ని కోరేవాడు కదా! సాత్యకి, చేది రాజులు, అంధక, వృష్ణి, భోజ, కురు, సృంజయ వంశ రాజులు, శ్రీకృష్ణభగవానుని అభిప్రాయాన్ని ఆదరించి, వారి శత్రువులను అణచి, స్నేహితులకు ఆనందాన్ని కలిగిస్తారు. శ్రీకృష్ణుడు చెప్పే నీతిని అనుసరించడం వల్లే ఉగ్రసేనాది క్షత్రియులు ఇంద్రునితో సమానమైన శక్తిగల వారయ్యారు. యాదవులంతా దయగలవారు, సత్యపరాయణులు, గొప్పబలవంతులు, భోగసంపత్తి గల వారయ్యారు. కాశీరాజైన బభ్రువు శ్రీకృష్ణుని సోదరునిగా చేసికొని , ఉత్తమ రాజ్య సంపదను పొందాడు. వర్షాకాలంలో జనులకోసం మేఘం వర్షించినట్లుగా, శ్రీకృష్ణుడు బభ్రువు కోసం కోరిన కోరిక లిస్తున్నాడు. నాయనా సంజయా! శ్రీకృష్ణుడు ఇంతటి ప్రభావం కల విద్వాంసుడని తెలుసుకో. అతడు కర్మాచరణం యొక్క

నిశ్చయాన్ని ఎరిగినవాడు. ఇతడు మా అందరికి మిక్కిలి ప్రీతి పాత్రుడు, శ్రేష్ఠుడు కూడ. ఇతని ఆజ్ఞను నేను ఉల్లంఘింపలేను."

29. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి సందేశమిచ్చుట.

వాసుదేవుడు చెప్పనారంభించాడు. "సంజయా! ఈ పాండవుల క్షేమాన్ని ఐశ్వర్యాన్ని, ప్రియాన్ని కోరుకొంటున్నాను. అదే విధంగా బహుపుత్రులుగల ధృతరాష్ట్రుని అభివృద్ధినీ కాంక్షిస్తాను. సూతా! నేను ఇద్దరినీ శాంతించమనే చెప్తాను. నా కోరిక కూడ అదే. మరొకటి నే చెప్పను. ధర్మరాజు నోటివెంట కూడ పాండవుల సమక్షంలో ఈ ప్రియవచనాన్నే వింటున్నాను. ఇది మంచిదనే భావిస్తున్నాను. సంజయా! పాండునందనుడైన ధర్మరాజు చెప్పింది చూస్తే శాంతిని సాధించడం కష్టం. ఇది నిశ్చయం, ఎందుకంటే పుత్రపక్షపాతి అయిన ధృతరాష్ట్రుడు తన పుత్రులతో బాటు ఈ రాజ్యాన్ని ఆశిస్తూ ఉంటే, ఇక వీరికి యుద్ధం రాకుండా ఎలా ఉంటుంది? సంజయా! నావల్లకాని, యుధిష్ఠిరుని వల్లకాని ధర్మలోపం జరుగదు. ఈ విషయం నీవు బాగా ఎరుగుదువు. యుధిష్ఠిరుడు ఉత్సాహంతో స్వధర్మాన్ని ఆచరిస్తాడు. శాస్త్రవిధానంలో గృహస్థధర్మం పాటిస్తాడు. అట్టివాడు ధర్మలోపం చేస్తా డేమోనని నీవు ముందుగానే ఎందుకు శంకిస్తున్నావు? గృహస్థాశ్రమవిషయంలో వేదజ్ఞులైన బ్రాహ్మణులలోనే భిన్నాభిప్రాయా లున్నాయి. కొందరు కర్మయోగం ద్వారా పరలోక సిద్ధిని పొందవచ్చని చెప్పారు. మరికొందరు కర్మత్యాగం చేసి జ్ఞానంచేత మోక్షం పొందవచ్చన్నారు. విద్వాంసుడు కూడ ఈ లోకంలో భక్ష్యభోజ్యాలు తినకుండా తృప్తినొందలేడు. అందువల్లే బ్రహ్మ విద్యానిష్ఠ కలవారికి కూడా ఆకలి తీరటం కోసం భోజనవిధిని శాస్త్రం చెపుతోంది. కర్మను సాధించే విద్యలకే ఈ లోకంలో ఫలం కనబడుతోంది. ఇతర విద్యలకు కాదు. విద్యాకర్మలలో కర్మయొక్క ఫలమే ప్రత్యక్షంగా కనబడుతుంది. దప్పికతో బాధపడేవాడు నీటిని త్రాగితేనే దప్పిక తీరుతుంది. సంజయా! జ్ఞానమార్గం కూడా కర్మతోబాటు ఉండవలసిందే. జ్ఞానంలో కూడ కర్మ ఉంటుంది. కర్మ కంటె కర్మత్యాగమే గొప్పదని భావించేవాడు దుర్బలుడు. అతని మాటలు నిరర్థకాలు.

కర్మ చేతనే ఈ దేవతలు స్వర్గలోకంలో ప్రకాశిస్తున్నారు. కర్మవల్లనే ఇహలోకంలో

గాలి వీస్తోంది. రాత్రింబవళ్లను ఏర్పరిచే సూర్యుడు కూడా కర్మ వల్లనే అలసత లేకుండా ప్రతిరోజూ ఉదయిస్తున్నాడు. చంద్రుడు కూడ కర్మచేతనే అలసత్వం లేక మాసాలను, పక్షాలను, నక్షత్రాలతో కలయికను పొందుతున్నాడు. అగ్నికూడ అలసత్వం లేకుండా ప్రజలకోసం కర్మచేస్తూనే ప్రజ్వలిస్తున్నాడు. కర్మచేతనే ఈ భూదేవి అలసత లేకుండా ఇంతటి మహాభారాన్ని మోస్తోంది. నదులు కూడ కర్మవల్లనే అలసత్వం లేకుండా సర్వభూతాలను తృప్తి పరుస్తూ, నీటితో వేగంగా ప్రవహిస్తున్నాయి. మేఘం కూడా అలసత్వం లేకుండా అంతరిక్షాన్నీ, దిక్కులనూ ఆనందింపజేస్తూ వర్షిస్తోంది. ఇంద్రుడు కూడ అలసత్వం విడిచిపెట్టి బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నాడు. సుఖాన్ని, మనస్సుకిష్టమైన వాటిని విడిచిపెట్టి ఇంద్రుడు కర్మచేతనే శ్రేష్ఠత్వాన్ని పొందాడు. అప్రమత్తుడై సత్యధర్మాలను రక్షిస్తూ, ఇంద్రియనిగ్రహాన్ని, సహనాన్ని, సమత్వాన్ని, ప్రేమను సేవిస్తూ, ఇంద్రుడు ముఖ్యమైన దేవరాజ్యాన్ని పొందాడు. ఇలాగే బృహస్పతి ఏకాగ్రమైన సంయత చిత్తంతో, సుఖాన్ని విడిచిపెట్టి, ఇంద్రియాల్ని నిరోధించి, బ్రహ్మచర్యాన్ని పాటించి, దేవతల గౌరవాన్ని (గురుస్థానాన్ని) పొందాడు. అదే విధంగా నక్షత్రాలు, రుద్రాదిత్యులు కర్మ చేతనే ఈ విశ్వంలో ప్రకాశిస్తున్నారు. యమధర్మరాజు, కుబేరుడు, గంధర్వులు, యక్షులు, అప్సరలు, ఋషులు, వీరంతా బ్రహ్మవిద్యనూ, బ్రహ్మచర్యాన్నీ, కర్మలనూ సేవిస్తూ ప్రకాశిస్తున్నారు.

సంజయా! శ్రేష్ఠులైన బ్రాహ్మణుల, క్షత్రియ, వైశ్యుల యొక్క సర్వ లోక ధర్మాన్ని తెలిసికొని కూడ, జ్ఞానులలో శ్రేష్ఠుడవై కూడా కౌరవుల స్వార్థంకోసం ఎందుకు ప్రయత్నిస్తున్నావు ? యుధిష్ఠిరుడు వేదశాస్త్రాలతో, అశ్వమేధ రాజసూయాలతో, నిత్యసంబంధం కలవాడు. ధనుస్సు, కవచం నిత్యం ధరిస్తూ ఉంటాడు. ఏనుగు, గుర్రం మొదలగు వాహనాలతోను, రథశస్త్రాలతోను నిత్యసంబంధం గలవాడు. ఈ పాండవులు కౌరవుల వధలేకుండగా రాజ్యప్రాప్తికి ఏదైనా ఉపాయం కనుక్కోగలిగితే, ఆర్యవర్తనమయిన అహింసలో భీమసేనుని ప్రవృత్తిని కట్టడిచేసి, ధర్మరక్షణ చేసి, పుణ్యాన్ని పొందుతారు. పాండవులు తమపితృసంబంధమైన క్షాత్రధర్మంలో ప్రవర్తిస్తూ యథాశక్తిగా తమ కర్తవ్యాన్ని పరిపాలిస్తూండగా, దైవవశం చేత మృత్యువును కూడా పొందవచ్చు. అటువంటి మృత్యువు కూడ వారికి మంచిదే. అలా కాక శాంతిని వహించడమే యుక్తమని నీవు భావిస్తూంటే, యుద్ధం చేసే రాజుల ధర్మతంత్రం

యుక్తంగా ఉంటుందో, యుద్ధాన్ని వదిలి శాంతిని వహించే వారి ధర్మతంత్రం యుక్తంగా ఉంటుందో నీవే చెప్పు. నీ మాటనే నేను వింటా.

సంజయా! నీవు ముందుగా బ్రాహ్మణులు మొదలయిన నాలుగు వర్ణాలను, వారి వారి ధర్మాలను గూర్చి బాగా తెలుసుకో. అపుడు పాండవులు చేసే ఇప్పటి పనిమీద దృష్టి సారించు. అటు తరువాత ఆలోచించి వారిని ప్రశంసించడం కాని, నిందించడం కాని చెయ్యి. బ్రాహ్మణుడు అధ్యయనం, యజ్ఞం, దానం, తీర్థయాత్రలు, శిష్యులకు చదువు చెప్పడం, యజమానులచే యజ్ఞం చేయించడం, శాస్త్ర విహితమైన ప్రతిగ్రహం (తీసికోవడం) అనేవి చేయాలి. ఇక క్షత్రియుడు అధ్యయనం చెయ్యాలి. దానం చెయ్యాలి. యజ్ఞం చేయించరాదు. అధ్యాపనం చేయరాదు. ప్రతిగ్రహం చేయరాదు. యాచించరాదు. ఇది క్షత్రధర్మం. క్షత్రియుడు ధర్మాన్ని అనుసరిస్తూ అప్రమత్తుడై, ప్రజలను రక్షించాలి. దానం, యజ్ఞం, సంపూర్ణ వేదాధ్యయనం చేసి, వివాహం చేసికొని పుణ్యకర్మానుష్ఠానం చేస్తూ గృహస్థాశ్రమంలో ఉండాలి. ఇలా ఉండే ధర్మాత్ముడైన క్షత్రియుడు పుణ్యాన్ని సంపాదించి, తన ఇచ్ఛానుసారం బ్రహ్మలోకాన్ని చేరుతాడు. వైశ్యుడు అధ్యయనం చేసి కృషి, గోరక్షణ, వ్యాపారాలతో ధనాన్ని సంపాదించి అప్రమత్తుడై, దాన్ని రక్షిస్తూ, బ్రాహ్మణ క్షత్రియులకు ప్రియాన్ని చేకూరుస్తూ, ధర్మశీలుడై గృహస్థాశ్రమంలో ఉండాలి. శూద్రుడు బ్రాహ్మణులను సేవించాలి, నమస్కరించాలి. వేదాధ్యయనమూ, యజ్ఞమూ అతనికి నిషిద్ధం. నిత్యం కృషీవలుడై అలసత లేకుండా తన అభివృద్ధికి పని చెయ్యాలి. ఇది పురాతనమైన శూద్రధర్మం. వీరందరినీ రాజు అప్రమత్తుడై పాలించాలి. అన్ని వర్ణాలవారిని వారి వారి ధర్మాలలో నియోగించాలి. భోగాసక్తి లేకుండా ప్రజలపట్ల సమభావంతో ప్రవర్తించాలి. అధార్మికాలైన కోరికల్ని ఎపుడూ అనుసరించకూడదు. కాబట్టి తన రాజ్యంలో సర్వధర్మాలూ తెలిసిన శ్రేష్ఠమైన వ్యక్తి ఎవరైనా ఉంటే, అతనిని ప్రజల గుణదోషాలను తెలిసికోవడానికి నియోగించాలి. అతని ద్వారా తన రాజ్యంలో పాపకర్మ చేసే వాడెవడూ లేడని తెలిసికోవాలి.

ఇతరుల సొత్తుపై ఆశపడి, దాన్ని సంగ్రహించే ప్రయత్నంలో విధిప్రేరితుడై కోపంతో సొంతసైన్యాన్ని కూర్చుకోవడం ప్రారంభించే క్రూరుడైన రాజుకూ, ఇతరులకూ యుద్ధం ఏర్పడినప్పుడు అందులోంచి పుట్టినవే ఈ ధనుస్సు, శస్త్రం, కవచమూను.

ఇటువంటి దోపిడీ దారుల్ని చంపడంకోసమే ఇంద్రుడు కవచాన్ని, శస్త్రాన్ని, ధనుస్సును తయారు చేశాడు. అటువంటి యుద్ధంలో దొంగలను చంపడం వల్ల రాజులకు పుణ్యం వస్తుంది. సంజయా! ఇతరుల సొత్తు నపహరించడ మనే దోషం కౌరవుల పక్షంలో తీవ్రరూపంలో ప్రకటితమైంది. అధర్మమే తెలిసి, ధర్మాన్ని తెలియని కౌరవులు చేసినపని మంచిది కాదు. ఆ ధృతరాష్ట్ర మహారాజు పుత్రులతో కలిసి పాండవులకు ధర్మంగా చెందవలసిన రాజ్యాన్ని అకారణంగా హరించాడు. అతనిని అనుసరించే కౌరవు లంతా పురాతనమైన రాజధర్మాన్ని గమనించటం లేదు. దొంగ ఎవరూ చూడకుండా ఇతరుల ధనాన్ని అపహరిస్తాడు. ఒకవేళ ఇతరుల కంటబడితే, వారిని బంధించి, అపహరిస్తాడు. ఈ రెండు దశల్లోనూ కూడ దొంగ దోపిడీదారుగా నిందింపదగినవాడే అవుతాడు. సంజయా! వారిద్దరూ నీ దృష్టిలో నిందింపదగిన వారే కదా! మరి ధృతరాష్ట్రునికీ, ఆయన పుత్రులకూ తేడా ఏముంది? దుర్యోధనుడు లోభంవల్ల తానా రాజ్యాన్ని కోరుకోవడం ధర్మమే అనుకొంటున్నాడు. అతడు క్రోధం త్రిప్పినట్లు తిరుగుతున్నాడు. పైగా పాండవుల భాగం కౌరవుల దగ్గర న్యాసంగా ఉంచినది. సంజయా! పిత్ర్యమైన రాజ్యభాగాన్ని పొందడం కోసం యుద్ధం చేస్తూ పాండవులు మరణించినా, అది వారికి గొప్పదే. ఇతరుల రాజ్యం కంటె పిత్ర్యమైన రాజ్యం విశిష్టమైంది కదా! పురాతనమైన ఈ ధర్మాలను నీవు రాజులందరి సమక్షంలో కౌరవులకు చెప్పు.

యుద్ధంకోసం దుర్యోధనుడు సమావేశపరిచిన ఈ రాజులందరూ మూడులై మృత్యువశు లవుతారు. సంజయా! సభామధ్యంలో కౌరవులు చేసినపని ఎంతటి పాపంతో నిండిందో! ఒకసారి వారి దురాచారాలపట్ల దృష్టి సారించు. ద్రౌపది పాండవులకు ప్రియమైన భార్య. యశస్విని, శీలవతి, సదాచార సంపత్తిగలది. అట్టి ద్రౌపదిని రజస్వలావస్థలో ఉండగా సభలోకి లాక్కువచ్చారు. భీష్మాది కౌరవముఖ్యులు కూడా దానిని ఉపేక్షించారు. కౌరవులంతా కలిసి ఆ దుఃశాసనుని అప్పుడు నివారించి ఉంటే, ధృతరాష్ట్రుడు నాకెంతో ప్రియాన్ని చేసి యుండేవాడు. అతని కుమారులకూ ప్రియం కలిగేది. వదినగారనే మర్యాద లేకుండా దుశ్శాసనుడు అక్రమంగా ద్రౌపదిని మామగార్ల సభామధ్యంలోకి లాగుకొని వచ్చాడు. ఆమె దీనంగా నలుదిక్కులూ చూసి, విదురుడు తప్ప తన్ను రక్షించేవాడు లేడని గ్రహించింది. అక్కడ సమావేశమైన

రాజులంతా దైన్యంవల్ల ఆ అన్యాయాన్ని వ్యతిరేకించలేకపోయారు. విదురు డొక్కడే తన ధర్మాన్ని గుర్తించి, మందబుద్ధియైన దుర్యోధనుడికి ధర్మసహితమైన మాటలు చెప్పి, ఆ అన్యాయాన్ని వ్యతిరేకించాడు.

సంజయా! నాటి ద్యూత సభలో జరిగిన ఈ అన్యాయం గుర్తులేక ధర్మరాజుకు ధర్మోపదేశం చేయా లనుకొంటున్నావు. ద్రౌపది ఆ రోజు సభలోకి వెళ్లి మిక్కిలి కష్టసాధ్యమైన, పవిత్రమైన పని చేసింది. సముద్రం నుండి నావను ఉద్ధరించినట్లు, పెద్దకష్టం నుండి పాండవులనూ, తన్నూ ఉద్ధరించింది. మామగార్ల సమక్షంలో ఉన్న ద్రౌపదిని సభలో సూతపుత్రుడు కర్ణుడు ఇలా అన్నాడు - 'యాజ్ఞసేనీ! నీకు వేరే దిక్కులేదు. దాసిగా దుర్యోధనుని భవనంలో ప్రవేశించు. పాండవులు జూదంలో ఓడిపోయారు. అందువల్ల నీకు భర్తలేడు. ఇకపై నీవు వేరొకభర్తను వరించుకో.' కర్ణుని నోటినుండి వెలువడ్డ ఘోరమైన, పరుషమైన, తీక్ష్ణమైన ఆ మాటలబాణాలు అర్జునుని చెవుల ద్వారా లోనికి ప్రవేశించి, ఎముకలను పిండిచేసి, హృదయంలో నాటుకొని ఆయువుపట్టులను బాధిస్తున్నాయి. అడవికి వెళ్లడంకోసం కృష్ణాజినాలను ధరించాలను కొంటున్న పాండవులను దుఃశాసనుడు 'వీరంతా నపుంసకులు. చచ్చుదద్దమ్మలు - చాలాకాలం నరకంలో పడిపోయారు' అని పరుషంగా మాట్లాడాడు. గాంధారరాజైన శకుని ధర్మరాజుతో వెటకారంగా 'నీవు నీ చిన్న తమ్ముడితో సహా అందర్నీ ఓడిపోయావు. ఇక ఇపుడు నీదగ్గరేముంది? యాజ్ఞసేని ఐన ద్రౌపదిని ఒడ్డి జూదమాడు' అని అన్నాడు. సంజయా! జూదంలో వాళ్లు అన్న భరించరాని మాటలన్నీ నీవెరుగుదువు. అయినా ఈ విపత్కరమైన కార్యాన్ని సాధించటానికి నేను స్వయంగా హస్తినాపురం వెడతానని పాండవులను ప్రార్థిస్తాను. పాండవుల ప్రయోజనం సిద్ధించి, కౌరవులతో ఈ సంధిని చేసికోవడంలో నేను సఫలుడినయితే, నా ద్వారా పరమపవిత్రమై, శ్రేయోదాయకమైన పని జరిగినట్లే. కౌరవులుకూడ మృత్యుపాశం నుండి విముక్తులైనట్లే. నీతిసమ్మతమై, ధర్మయుక్తమై, అర్థవంతమై, అహింసాయుతమైన, నామాటను కౌరవులు ఆలకించుదురు గాక - ఈవిషయమై వెళ్లిన నన్ను ఆదరింతురుగాక.

సంజయా! ఆలా కాని పక్షంలో యుద్ధరంగంలో అర్జునునిచేత, భీమునిచేత పాపాత్ములైన ధృతరాష్ట్రకుమారులు పరాజితులై, స్వయంకృతాపరాధాలతో దహింపబడతారని గ్రహించు. జూదంలో ఓడిపోయిన పాండవులను దుర్యోధనుడు

ఘోరమూ, కఠినమూ అయిన మాటలన్నాడు. యుద్ధకాలంలో గదాహస్తుడైన భీముడు ఆ మాటలను తలచుకొంటాడు కదా! సుయోధనుడు క్రోధమయమైన మహావృక్షం. కర్ణుడు దాని స్కంధం. శకుని దాని కొమ్మలు. దుఃశాసనుడు దానికి సమృద్ధమైన పుష్పాలూ, ఫలాలూ. అజ్ఞానియైన ధృతరాష్ట్రుడు దానికి మూలం. ధర్మరాజు ధర్మమయమైన మహావృక్షం. అర్జునుడు దాని స్కంధం. భీమసేనుడు కొమ్మలు. నకుల సహదేవులు సమృద్ధములైన పుష్పాలూ, ఫలాలు. నేను, వేదం, బ్రాహ్మణులు దానికి మూలం. సంజయా! పుత్రులతో కూడిన ఆ ధృతరాష్ట్రుడు ఒక మహారణ్యం. పాండుపుత్రులు దాంట్లో సంచరించే పులులు. సింహంచేత రక్షింపబడే వనం నశించదు. వనంచేత రక్షింపబడే సింహమూ నశించదు. వనం నుండి బయటపడ్డ పులి చంపబడుతుంది. పులిలేని వనం నరకబడుతుంది. అందువల్ల పులి వనాన్ని రక్షించాలి. వనం పులిని రక్షించాలి. సంజయా! ధృతరాష్ట్రకుమారులు లతల వంటివారు. పాండవులు సాలవృక్షాల వంటివారు. పెద్దచెట్ల ఆశ్రయం లేకుండా లతలు వృద్ధి పొందలేవు. పాండవులు శుశ్రూషచేయడానికీ సిద్ధంగా ఉన్నారు. శత్రుసంహారకులై యుద్ధానికీ సిద్ధంగా ఉన్నారు. రాజయిన ధృతరాష్ట్రుడు చేయవలసినదేదో అది చేయాలి. విద్వాంసుడవైన సంజయా! ధర్మంగా నడుచుకొనే పాండవులు (సంధికి) శాంతికి సిద్ధంగా ఉన్నారు. యుద్ధం చేయడానికైనా సమర్థులైన యోధులే. ఈ రెండు పరిస్థితులను గ్రహించి నీవు ధృతరాష్ట్రునికి ఉన్నదున్నట్లుగా చెప్పు."

30. యుధిష్ఠిరుని సందేశము.

సంజయుడు పలికాడు. "రాజశ్రేష్ఠా! నీకు శుభమగుగాక! ఇక వెళ్లివస్తా. నా మాటలు నీకు కష్టం కలిగించి ఉంటాయి. కాని నేను మానసికావేగంతో అలా మాట్లాడాను కాని నిన్ను కష్టపెట్టాలనే కోరిక నాకే మాత్రం లేదు. శ్రీకృష్ణుని, భీమార్జునుల్ని, నకులసహదేవుల్ని, సాత్యకి చేకితానుల్ని వీడ్కొని వెళుతున్నాను. మీకు శుభమగుగాక. క్షత్రియులారా! మీరంతా నన్ను సౌమ్యంగా ప్రసన్నంగా చూడండి." యుధిష్ఠిరుడు 'సంజయా! శుభమగుగాక! నీవిక వెళ్లవచ్చు. విద్వాంసుడా! నీవు మాకు అనిష్టాన్నెప్పుడూ తలపెట్టవు. కౌరవులు, మేము కూడా నిన్ను చిత్తశుద్ధిగల, తటస్థ సభ్యుడ వని భావిస్తాం. సంజయా! నీవు మాకు విశ్వసింప దగినవాడవు. మిక్కిలి ప్రీతిపాత్రుడవు.

మంచిగా మాట్లాడతావు' శీలవంతుడవు. తృప్తిగలవాడవు. నీ బుద్ధి ఎప్పుడూ వ్యామోహానికి లోనుకాదు. కటువుగా మాట్లాడినా నీవు కోపించవు. సూతా! మర్మఘాతాలూ, క్రూరాలూ అయిన మాటలెప్పుడూ నీవు పలుకవు. నీరసాలూ, అసందర్భాలూ ఐన మాటలు కూడా నీనోట రావు. నీమాటలు ధర్మానుకూలంగా, అర్థయుక్తంగా, మనోహరంగా, అహింసా యుతంగా ఉంటాయని మాకు తెలుసు. నీవు మాకు మిక్కిలి ఇష్టుడవు. నీవు కాకుంటే విదురుడే ఇక్కడకు దూతగా రాదగిన రెండవ వ్యక్తి. నీవు ఇంతకు మునుపు కూడ తరచుగ మమ్మల్ని చూసేవాడివి. అర్జునునికి ప్రాణమిత్రుడవు.

సంజయా! నీవు ఇక్కడనుండి వెళ్లినవెంటనే సత్త్వశక్తి సంపన్నులై, బ్రహ్మచర్యం పాటిస్తూ, వేదాధ్యయనం చేస్తున్న కులీనులు, సర్వ ధర్మాలు తెలిసిన బ్రాహ్మణులకు మా నమస్కారాలు చెప్పు. వేదాధ్యయనశీలురైన బ్రాహ్మణులు, సన్యాసులు, తపస్సులు... వీరికి నామాటగా నమస్కరించు. అలాగే వృద్ధులను ఇతరులను కూడ నా మాటగా కుశలం అడుగు. నాయనా సంజయా! ధృతరాష్ట్రమహారాజుయొక్క పురోహితుని, ఆచార్యులను, ఋత్విజులను కలిసినపుడు మామాటగా వారి కుశలాన్ని అడిగి తెలుసుకో.

(తరువాత శాంతంగా ఏకాగ్రతతో మనస్ఫూర్తిగా మామాటగా చేతులు జోడించి నమస్కరించు.)

సంజయా! శ్రోత్రియులు కాని వృద్ధులు, మనస్వులు, శీలం, బలం కలిగి, నాక్షేమాన్ని కోరుతున్న వారందరికి మా క్షేమాన్ని తెలియజెయ్యి. వారి క్షేమాన్ని కూడా మామాటగా అడిగి తెలుసుకో. కౌరవరాజ్యంలో వ్యాపారంతో, పశుపాలనతో, వ్యవసాయంతో జీవిస్తూ ప్రజలపోషణభారాన్ని వహిస్తున్న వైశ్య లందరినీ మామాటగా కుశలమడుగు. మాకు ఇష్టుడు, నీతిజ్ఞుడు, విధేయుడు, బ్రహ్మచర్యంతో వేదాధ్యయనం చేసినవాడు, మంత్ర-ఉపచార -ప్రయోగ - ఉపసంహారాలనే నాలుగు పాదాలతో కూడిన అస్త్రవిద్య నభ్యసించినవాడు, ప్రసన్న చిత్తుడూ ఐన ద్రోణాచార్యునకు మా నమస్కారాలను తెలియ జెయ్యి. అశ్వత్థామ వేదాధ్యయన సంపన్నుడు. సదాచారపరుడు, నాలుగు పాదాల అస్త్రవిద్యనూ నేర్చినవాడు. గంధర్వ కుమారునివలె అసమానమైన వేగం కలవాడు. మా మాటగా అతని క్షేమాన్ని అడుగు. సంజయా! కృపాచార్యుడు ఆత్మజ్ఞానం కలవారిలో శ్రేష్ఠుడు, మహారథుడు, మమ్మల్ని ఎప్పుడూ స్మరిస్తూ ఉంటాడు. నీవు ఆయన ఇంటికి వెళ్లి నా పేర పాదాభివందనం చెయ్యి. శౌర్యం, దయ, తపస్సు, ప్రజ్ఞ, శీలం, శాస్త్రజ్ఞానం, సత్త్వం, ధైర్యం, మున్నగు సద్గుణాలు కలవాడు

భీష్మపితామహుడు. ఆయనకు మా పాదాభివందనాలు, చెప్పు.

సంజయా! ఆ ధృతరాష్ట్ర మహారాజు ప్రజ్ఞాచక్షువు, కౌరవులందరికి నాయకుడు. బాగా చదువుకొన్నవాడు. వృద్ధులను సేవించే బుద్ధి శాలి. ఆ వృద్ధరాజుకు నమస్కరించి మా క్షేమాన్ని తెలియజెయ్యి. సంజయా! ధృతరాష్ట్రుని పెద్దకొడుకు దుర్యోధనుడు తెలివితక్కువవాడు, మూర్ఖుడు, పొగరుబోతు, పాపశీలుడు. అతని అపకీర్తి భూమి అంతటా వ్యాపించింది. అతణ్ణి మా మాటగా కుశలమడుగు. నాయనా! ఆ దుర్యోధనుని తమ్ముడు కూడ తెలివితక్కువవాడే, అతనివంటి స్వభావం కలవాడే. ఎప్పుడూ పాపా సక్తి కలిగి ఉంటాడు. మహాధనుర్ధరు డని, గొప్ప శూరు డని కౌరవులనుకొంటూ ఉంటారు. అటువంటి దుఃశాసనుణ్ణి కుశలమడుగు.

సంజయా! బాహ్లికుడు నిత్యం భరతవంశీయులంతా పరస్పరం శాంతిగా ఉండాలని కోరు కొంటాడు. సాధుస్వభావుడు. అతడికి నీవు నమస్కరించు. సంజయా! సోమదత్తుడు అనేక సద్గుణాలు కలవాడు. విజ్ఞాని, పరుషం పల్కనివాడు. మామీద ప్రేమవల్ల మా కోపాన్ని కూడా సహించేవాడు. అటువంటి సోమదత్తుని నీవు గౌరవించు. సంజయా! సోమదత్తుని కొడుకైన భూరిశ్రవుడు కురువంశంలోనే మిక్కిలి పూజ్యుడు. అతడు మాకు మంచి సోదరుడు, మిత్రుడు కూడ. గొప్ప విలుకాడు. రథికులలో ఉత్తముడు. మంత్రులతోబాటుగా అతని క్షేమాన్ని అడుగు. సంజయా! ఇంకా కురువంశీయులలో ముఖ్యులైన యువకులైన మా పుత్రులకు, పౌత్రులకు, సోదరులకు, తక్కిన యోగ్యులందరికి మేము క్షేమంగా, ఆనందంగా ఉన్నామని చెప్పు. సంజయా! ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనుడు మాతోయుద్ధం చేయడానికి పిలిపించిన వశాతి, శాల్వ, కేకయ, అంబష్ఠ, త్రిగర్త దేశాల రాజులు; తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర దిక్కులనుండి వచ్చిన యోధులు; పర్వతప్రాంతాల నుండి వచ్చిన వారు - అంతా దయాశీల సంపత్తికలవారు. వారందనీ మామాటగా కుశలం అడుగు. రథ, గజ, తురగ, పదాతిదళాలను, అక్కడకు జేరిన సజ్జనులను మామాటగా కుశల మడిగి, వారికి మా క్షేమాన్ని తెలియజెయ్యి. రాజహితాన్ని కోరి పనిచేసే మంత్రుల్నీ, ద్వారపాలకుల్నీ, సేనానాయకుల్నీ, ఆయవ్యయాలు చూసే గణకుల్నీ, నిత్యం పెద్ద పెద్ద పనులను గూర్చి ఆలోచించే వారినీ మా మాటగా కుశల మడుగు.

నాయనా! వైశ్యాపుత్రుడైన యుయుత్సుడు కౌరవులలో శ్రేష్ఠుడు,

మహాబుద్ధిమంతుడు, గొప్ప ప్రజ్ఞకలవాడు, అన్ని ధర్మాలు తెలిసినవాడు. కౌరవపాండవుల యుద్ధం అతనికెప్పుడూ ఇష్టం కాదు. అతనిని మా మాటగా కుశల మడుగు. నాయనా! చిత్రసేనుడు ఇతరుల ధనాన్ని అపహరించడంలోను, జూదమాడడంలోనూ అద్వితీయుడు, మోసం తెలియకుండా ఆడగల గొప్ప జూదరి. యుద్ధంలో దేవరథం చేత కూడా జయింపశక్యం కాడు. అతణ్ణి మా మాటగా కుశల మడుగు. నాయనా! పర్వతీయుడు, గాంధారరాజు ఐన శకుని జూదంలో పరులసొమ్ము నపహరించడంలో నేర్పరి. అతడు మిథ్యాబుద్ధి ఐన దుర్యోధనుని గౌరవిస్తాడు. మామాటగా అతనిని కుశల మడుగు. జయింపశక్యంగాని పాండవులను ఒక్క రథంతో జయించాలనుకొంటున్న వీరుడు కర్ణుడు. మోహపడేవాళ్లను మోహపెట్టడంలో అతడి కతడే సాటి. మామాటగా అతణ్ణి కూడా కుశల మడుగు. విదురుడు లోతైన బుద్ధి, దూరదృష్టి కలవాడు. మమ్మల్ని ప్రేమించేవాడు. మాకు గురువు, రక్షకుడు, తల్లి, తండ్రి, మిత్రుడూను. మాకు మంత్రికూడ. మా మాటగా అతణ్ణి కుశల మడుగు. సంజయా! రాజగృహాల్లో ఉన్న సద్గుణవతులు, వృద్ధ స్త్రీలంతా మాతల్లులే. వారినందరిని ఒకసారి మా పక్షాన కలిసి నమస్కరించి ఇలా చెప్పు. "తల్లులారా! మీరంతా మీ పుత్రులతో బాగా ఉన్నారా! వారంతా మీ పట్ల దయతో ప్రవర్తిస్తున్నారా!" అని అడిగి, తర్వాత పుత్రులతో బాటు యుధిష్ఠిరుడు కుశలమని చెప్పు. సంజయా! హస్తినాపురంలోని మా సోదరుల భార్యల నందరిని కుశల మడిగి ఇలా చెప్పు - 'మీరంతా మంచిరక్షణ కల్గి పవిత్రంగా, గౌరవంగా అప్రమత్తంగా జీవిస్తున్నారా! మీకు కావలసిన అలంకార సామగ్రి లభిస్తోందా! మామగార్ల విషయంలో మంచిగా దయతో ప్రవర్తిస్తున్నారా! మీ భర్తలు మీకు అనుకూలంగా ప్రవర్తించేందుకు తగిన విధంగా సద్భావంతో మీరు ప్రవర్తిస్తున్నారా! సంజయా! అక్కడున్న మంచికుటుంబాల నుండి వచ్చిన, మంచి గుణాలు కల మా కోడళ్ళను నీవెరుగుదువు. వారి దగ్గరకు వెళ్ళి - ' కులవధువులారా! ప్రసన్ను డైన యుధిష్ఠిరుడు మీ కుశల సమాచారాన్ని అడుగుతున్నాడు' అని చెప్పు. సంజయా! అంతఃపురంలో ఉన్న కన్యలనందరిని నా మాటగా కుశలాన్ని అడిగి 'పుత్రికలారా! మీకు అనుకూలుర్రైన భర్తలు లభించుగాక! మీరూ మీ భర్తలకు అనుకూలంగా ఉండెదరుగాక' అని నా మాటగా చెప్పు. సంజయా! అందమైన అలంకారాలు, వస్త్రాలు ధరించి; మంచి పరిమళాలతో మనోహరంగా

ఉండి; మాట, దర్శనం సులభంగా ఉండే వేశ్య స్త్రీలను కుశల మడుగు. కౌరవులను సేవిస్తున్న దాసదాసీ జనాన్ని, వారినాశ్రయించి జీవిస్తున్న గూని, చెవిటి వంటి అంగవికలులను కుశల మడుగు. వారికి మా క్షేమాన్ని కూడ చెప్పు. "ధృతరాష్ట్రుడు అంగహీనులపట్ల, దీనులపట్ల దయగా వ్యవహరిస్తున్నాడా! వారికి రక్షణ కల్పిస్తున్నాడా! పోషణకు తగిన సామగ్రిని దుర్యోధనుడు ఇస్తున్నాడా! వారు వారి ప్రాచీనవృత్తులను నిర్వహిస్తున్నారా!" హస్తినాపురంలోని అంధులకు, వృద్ధులందరికి, మావటివారికి మా క్షేమాన్ని తెలియజేయి. మా మాటగా వారి క్షేమాన్ని అడిగినట్లు చెప్పు. వారితో ఇలా చెప్పు- 'ఇప్పుడున్న కష్టాల్ని, దైన్యమైన జీవితాన్ని చూసి భయపడకండి. ఇది తప్పక పూర్వజన్మలో చేసిన పాపమే అయి ఉంటుంది. శత్రువులను దండించి, మిత్రులను రక్షించి, మీకు అన్న వస్త్రాలను మేము భరిస్తాము.' రాజైన దుర్యోధనుడితో ఇలా చెప్పు -"నేను కొందరు బ్రాహ్మణులకు వార్షికమగు జీవన వృత్తిని కల్పించాను. కాని నీ ఉద్యోగులు దాన్ని సక్రమంగా నిర్వహించడం లేదని తెలిసి బాధపడుతున్నాను. మరల ఆ బ్రాహ్మణులను వారి వారి వృత్తులలో చూడగోరుతున్నాను. 'నేమా నీలాగనే ఆ వృత్తులన్నిటినీ సముచితరీతిలో సాగిస్తున్నాను' అని ఎవరయినా దూతచేత కబురంప వలసినది' అని రాజుతో చెప్పు. నాయనా! ఎల్లకాలం తమ శరీరపోషణకోసమే ప్రయత్నిస్తూ ఉండే అనాథలను, దుర్బలులను, మూఢులను మా మాటగా అన్ని విధాలా కుశల మడుగు. సూతపుత్రా! ఇంకా దుర్యోధనుని ఆశ్రయాన్ని కోరి నానాదేశాలనుండి వచ్చి ఉన్నవారిని కలిసి 'బ్రతుకు బాగా సాగుతోందా, కుశలమేనా' అని అడుగు. ఇదే విధంగా అభ్యాగతులను, ఇతర దేశాలనుండి రాజుదగ్గరకు వచ్చిన దూతలను కుశల మడిగి తరువాత నా క్షేమాన్ని వారికి చెప్పు. దుర్యోధనుడు సమకూర్చుకొన్న యోధులు మహావీరులు, వారితో సమానమైనవారు ఈ భూమండలం లోనే లేరు. కాని ధర్మం శాశ్వతమైనది, శత్రువులను ఓడించడానికి నా దగ్గరున్న గొప్పబలం ధర్మమే. సంజయా! ధృతరాష్ట్ర కుమారుడైన సుయోధనునికి ఈ మాటను మళ్లీ ప్రత్యేకంగా చెప్పు- 'కురుదేశాలకు (కౌరవులకు) శత్రువులు లేకుండా చెయ్యాలి అనే నీ మనస్సులోని కోరిక నీ శరీరాన్ని బాధిస్తోంది. అది సిద్ధించడానికి తగిన ఉపాయం ఏమీలేదు. నీకిష్టమైనట్లుగా మేం ఉండలేము- ఇంద్రప్రస్థాన్ని నాకు తిరిగి ఇయ్యి. లేదా భారతవీరా! యుద్ధానికి సిద్ధంగా ఉండు."

31. యుధిష్ఠిరుడు అతిముఖ్యులైన కురువంశీయులకు సందేశ మిచ్చుట.

"సంజయా! మంచివాడైనా, చెడ్డవాడైనా; బాలుడైనా; వృద్ధుడైనా, బలవంతుడైనా, బలహీనుడైనా ఎవరినైనా సరే విధాత తన అధీనంలో ఉంచుకుంటాడు. ఈశ్వరుడు ప్రాణులకు పూర్వజన్మ కృతమైన కర్మానుసారంగా ఫలాన్నిస్తాడు. మూర్ఖుని విద్వాంసునిగా, విద్వాంసుని మూర్ఖునిగా చేయగలడు. దుర్యోధన ధృతరాష్ట్రులు మా బలాన్ని గురించి అడిగితే ఉన్నదున్నట్లుగా చెప్పు. తరువాత వారు ఆప్తులతో సమాలోచన చేసి కర్తవ్యాన్ని నిర్ణయించుకొంటారు. నీవు తిరిగి హస్తినాపురానికి వెళ్లాక, మహాబలుడైన ధృతరాష్ట్రుని పాదాలుపట్టి మా నమస్కారాలు తెలియజేసి, వారి కుశలాన్ని అడుగు. ఆ తరువాత కౌరవులతో బాటుగా సుఖాసీనుడై ఉన్న మహారాజుతో "రాజా! నీ సామర్థ్యం చేత పాండవులంతా సుఖంగా జీవిస్తున్నారు. నీ అనుగ్రహం వల్ల నీ కుమారులు బాలురైనా రాజ్యాన్ని పొందారు. మొదట రాజ్యాధికారంలో కూర్చోబెట్టి తరువాత వారు నశిస్తూ ఉంటే చూస్తూ ఊరుకోవద్దు." సంజయా! ఇంకా ఇలా చెప్పు- "తండ్రీ! ఈ రాజ్యమంతా ఇచ్చినా ఒకనికి చాలదు. చాలునని సంతృప్తిపడడు. మనమంతా కలిసి జీవిద్దాం- మన శత్రువులకు లోబడకు" అని చెప్పు. అదేవిధంగా భరతవంశ పితామహుడైన భీష్మునికి, నా పేరు చెప్పి శిరస్సు వంచి అభివాదం చేసి ఇలా చెప్పు- 'తాతా! నీవు నశించిపోతున్న శంతనుని వంశాన్ని ఉద్ధరించావు. నీ మనుమలైన కౌరవ పాండవులు పరస్పరం ప్రేమతో జీవించే విధంగా నీకిష్టమైన రీతిగా చెయ్యి.' అదే విధంగా కౌరవుల మంత్రియైన విదురునితో ఇలా చెప్పు- 'సౌమ్యుడా! యుధిష్ఠిరుని హితాభిలాషిగా నీవు యుద్ధం వద్దనే సలహా చెప్పు.' తర్వాత కౌరవుల మధ్య అసహనంగా కూర్చొని ఉన్న ధృతరాష్ట్ర మహారాజు కుమారుడైన దుర్యోధనుని మళ్ళీ మళ్లీ అనునయించి ఇలా చెప్పు.

"నీవు ఏ పాపం చెయ్యని ద్రౌపదిని నిండుకొలువులోకి రప్పించి ఎంతటి అవమానం చేసినా, ఆ దుఃఖాన్నంతా సహించాం. కౌరవులను మేము చంపుకోం. ఈ విధంగా పాండవులు ముందు వెనుకల కష్టాలు అనుభవించారు. బలవంతులైనప్పటికి వాటిని సహించారు. ఆ సంగతంతా కౌరవులు ఎరుగుదురు. సౌమ్యుడా! మమ్మల్ని నారబట్టలతో అడవులకు పంపినా, కౌరవులను చంపాలనుకోక ఆ కష్టం అంతా సహించాం. నీ అనుమతితో దుఃశాసనుడు తల్లి కుంతిని కూడ లక్ష్యపెట్టకుండా,

అతిక్రమించి ద్రౌపది జుట్టుపట్టుకొని అవమానించాడు. దాన్ని కూడా మేము ఉపేక్షించాం. ఏమైనప్పటికి మాకు రావలసిన రాజ్యభాగం మేం పొందాలి. ఇతరుల సొత్తును ఆశించే బుద్ధిని మళ్లించుకో. రాజా! ఇలా అయితే శాంతి ఏర్పడుతుంది. పరస్పరం ప్రీతికూడా ఏర్పడుతుంది. శాంతిని కోరుతున్న మాకు రాజ్యంలో కొంత భాగమైనా ఇయ్యి. అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం అనే నాలుగింటితో బాటు చివరి ఐదవది ఏదో ఒకటి కలిపి మాకు రాజ్యభాగం ఇయ్యి. సుయోధనా! మా ఐదుగురు సోదరులకు ఐదుగ్రామాలు అయినా ఇయ్యి." సంజయా! ఇలా జరిగితే మాజ్ఞాతులతో మాకు శాంతి కలుగుతుంది. మహాప్రాజ్ఞా! మాకు శాంతి కావాలి. సోదరుడు తన సోదరునితో కలిసుండాలి. తండ్రి తన కొడుకుతో కలిసుండాలి. పాంచాల దేశీయులు, కౌరవులు కలిసుండాలి. కురుపాంచాల దేశీయులు ఎటువంటి హానీ లేకుండా ఉండాలని కోరుకొంటున్నాను. 'దుర్యోధనా! మనమంతా మంచిమనస్సు కలవారమై శాంతి పొందాలి. నీవా విధంగా చెయ్యి.' సంజయా! నేను శాంతికొరకు సమర్థుడను. అలాగే యుద్ధానికీ, ధర్మార్థాల సాధనకూ సమర్థుడిని- మృదువైన పనికి, దారుణమైన పనికి కూడ నేను సమర్థుడనే.

32. సంజయుడు హస్తినకు చేరుట.

సంజయుడు పాండవుల దగ్గర సెలవు తీసికొని, మహాత్ముడైన ధృతరాష్ట్రుని శాసనాన్ని పూర్తిగా పాటించి, అక్కడినుండి వెళ్లాడు. హస్తినాపురం చేరి శీఘ్రంగా అంతఃపురంలోకి ప్రవేశించి, ద్వారపాలకుడితో ఇలా అన్నాడు. "పాండవుల దగ్గరనుండి సంజయుడు వచ్చాడని ధృతరాష్ట్ర మహారాజుకు చెప్పు. ఆలస్యం చేయకు. ద్వారపాలక! మహారాజు మెలకువగా ఉంటే నా నమస్కారాన్ని తెలియజెయ్యి. రాజానుమతితో లోనికి ప్రవేశిస్తాను. అత్యవసరంగా ఆయనకు నివేదించవలసిన దుంది". ఆ మాటలు విని ద్వార పాలకుడు రాజు దగ్గరకు వెళ్లి "మహారాజా! నమస్కారం. మిమ్ములను చూడటం కోసం సంజయుడు ద్వారం దగ్గర వేచి ఉన్నాడు. పాండవుల దగ్గరనుండి వచ్చిన దూత అతడు. రాజా! నేనేం చెయ్యాలో శాసించు." అన్నాడు. ధృతరాష్ట్రుడు అప్పుడు "సంజయునికి స్వాగతం పలికి నా కుశలాన్ని చెప్పు. ఇప్పుడతనిని కలవడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రవేశపెట్టు. అసలు నన్ను కలవడానికి

అతని కెప్పుడూ అడ్డులేదు. మరెందుకు అక్కడే ఉన్నాడు?" అన్నాడు.

సంజయుడు రాజు అనుమతి తీసికొని ప్రాజ్ఞులైన శూరులచే సురక్షితమైన విశాల భవనంలోకి ప్రవేశించి, సింహాసనంపై కూర్చున్న ధృతరాష్ట్రమహారాజుకు చేతులు జోడించి నమస్కరించాడు. సంజయుడు ఇలా విన్నవించాడు. "రాజా! నమస్కారం. నేను సంజయుణ్ణి, పాండవుల నుండి వచ్చాను. ధర్మరాజు నీకు నమస్కారం చేసి మీ క్షేమాన్ని అడిగాడు. అతడు ప్రేమతో మీ పుత్రుల క్షేమసమాచారాన్ని అడిగాడు. 'రాజా! నీవు నీ కుమారులతో, మనుమలతో, మునుమనుమలతో, స్నేహితులతో, మంత్రులతో, ఆశ్రితులతో కలిసి ఆనందంగా ఉన్నావా!' అన్నాడు. ధృతరాష్ట్రుడు పలికాడు. "సంజయా! నిన్ను అభినందించి అడుగుతున్నాను. అజాతశత్రువైన ధర్మరాజు కుశలమేకదా! కౌరవుల సోదరుడైన ధర్మరాజు పుత్రులతో, సోదరులతో కుశలమేకదా!" సంజయుడు పలికాడు - "పాండునందనుడు తన మంత్రులతో క్షేమంగా ఉన్నాడు. మునుపటి వారి రాజ్యసంపదలు కోరుతున్నాడు. అతడు ధర్మార్థాలను సరిగా పాటిస్తాడు. దయాళువు, విద్వాంసుడు, దూరదర్శి, శీలవంతుడూను. పాండునందనుడి దృష్టిలో అన్ని ధర్మాలకంటే కరుణయే పరమధర్మం. ధనార్జనకంటె ధర్మపాలనయే గొప్పదని అతడు భావిస్తాడు. అతని బుద్ధి ధర్మహీనమూ, వ్యర్థమూ ఐన సుఖాలపట్ల, ప్రియాల పట్ల ప్రవర్తింపదు. తాడుతో కట్టబడిన కొయ్యబొమ్మ ఇతరుల చేత ఆడింపబడుతూ ఎలా నృత్యంచేస్తుందో, అదే విధంగా మనిషి పరమాత్మచే ప్రేరేపింపబడి పనిచేస్తూంటాడు. యుధిష్ఠిరుని కష్టం చూశాక 'మానవుని ప్రయత్నం కంటె దైవ సంకల్పమే గొప్పద'ని అనిపిస్తోంది.

అలాగే పాపాన్ని కలిగించే నీకర్మదోషాన్ని చూసి 'విధి ఎంతవరకూ ఇష్టపడగలదో అంతవరకే మానవుడు ప్రశంసను పొందగల్గుతాడు' అని కూడా భావిస్తున్నాను. సర్పం చివికిపోయిన (పాతచర్మాన్ని) కుబుసాన్ని విడిచి ప్రకాశించినట్లుగా అజాతశత్రువైన యుధిష్ఠిరుడు పాపాన్ని మీలో విడిచిపెట్టి తాను సదాచారంతో ప్రకాశిస్తున్నాడు. రాజా! ధర్మార్థాలతో కూడి యుండే పెద్దవారి నడవడికకు వ్యతిరేకంగా ఉన్న మీరు చేసిన పనులను గూర్చి బాగా తెలిసికోండి. వాని వల్ల ఇహలోకంలో మీరు నిందలపాలవడమే కాక పరలోకంలో పాపమయమైన నరకదుఃఖాన్ని అనుభవించవలసి వస్తుంది. నీవు పుత్రాధీనుడవై సంశయించకుండా పాండవుల రాజ్యాన్ని కోరుకొంటున్నావు.

అలాగే కనుక జరిగితే ఈ భూమిమీద ఈ అధర్మంవల్ల నీకు పెద్ద నింద కలుగుతుంది. అది నీకు మంచిది కాదు. బుద్ధిహీనుడు, చెడ్డకులంలో పుట్టినవాడు, క్రూరుడు, దీర్ఘవైరం కలవాడు, క్షత్రియోచితమైన యుద్ధవిద్య తెలియనివాడు, పరాక్రమహీనుడు, శిష్టుడు కానివాడు ఇటువంటి ఆపదలనే పొందుతాడు. ఉన్నతవంశంలో పుట్టినవాడు, బలవంతుడు, కీర్తికలవాడు, అన్నీ తెలిసినవాడు, సుఖంగా జీవించేవాడు, మనస్సును అదుపు చేయగలవాడు, ధర్మాధర్మాలు బాగా తెలిసినవాడు, భాగ్యవశం వల్ల మంచి గుణసంపదను పొందుతాడు. నీకు గొప్ప మంత్రులున్నారు. నీవు బుద్ధి కుశలుడవు. ఆపత్కాలంలో ధర్మాధర్మాలను ఎరిగి ప్రవర్తించేవాడివి. అన్నివిధాలా మంచి సలహాలను పొందగలవాడివి. నీవంటి సాధన సంపత్తిగల విజ్ఞుడు ఇటువంటి క్రూరమైన పనిని ఎలా చెయ్యగలడు? మంత్రాంగం తెలిసిన కర్ణాదిమంత్రులందరూ ఒకచోట కలిసి చేయవలసిన పనులను నిర్ణయిస్తారు కదా! కౌరవుల నాశనానికి కారణమైన 'పాండవులకు రాజ్య మియ్యకూడదు' అని దృఢమైన నిర్ణయం ఏదైనా తీసికొన్నారా! రాజా! అజాతశత్రువైన యుధిష్ఠిరుడు పాపాన్నంతా మీనెత్తినవేసి, పాపులను తొలగించే పాపపుపనికి ఒడిగడితే కౌరవులంతా అకాలమరణం పొందుతారు. అపుడు లోకమంతా నిన్ను నిందిస్తుంది.

లోకపాలుర ఆధిపత్యంలో లేనిదే ముంటుంది? అర్జునుడు పరలోకాన్ని చూడటానికి వెళ్లాడు. అయినా అతడు కష్టాలు పడుతూనే ఉన్నాడు. అందువల్ల **దైవబలంతో సమానమైన మానవుని పురుషకారం ఏమీలేదు.** ఇందులో సందేహం లేదు. శౌర్యవిద్యాదిగుణాలు పూర్వకర్మానుసారంగా లభిస్తాయి. ప్రాణులకు ఇప్పుడున్న ఔన్నత్యం, అవమానం అనిత్యమైనవే. ఇవన్నీ ఆలోచించే బలిచక్రవర్తి వీని ఆవలిఒడ్డు తెలిసికోలేక, కాలానికి మించిన వేరే కారణం లేదని గ్రహించాడు. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం ఈ ఐదు ప్రాణుల జ్ఞానానికి స్థానాలు. కోరిక నశించాక ఇవన్నీ ఆనందంగా ఉంటాయి. మానవుడు బాధలు, దుఃఖాలు లేకుండా ఉండాలంటే ఇంద్రియాలను తన వశంలో ఉంచుకోవాలి. తల్లిదండ్రుల ప్రయత్నంవల్ల కలిగిన పుత్రుడు విధిపూర్వకంగా భోజనాదులతో వృద్ధినొందినట్లుగా, మానవుడు పురుషార్థాలను సరిగా నిర్వహిస్తేనే అవి మంచి ఫలితాల నిస్తాయంటారు. కాని నేనలా భావించటం లేదు. ఇందులో కూడ దైవమే ప్రధానమంటాను. రాజా! ఇష్టానిష్టాలు,

సుఖదుఃఖాలు, నిందాప్రశంసలు, మానవుడు పొందుతూ ఉంటాడు. తప్పుచేసినవానిని, లోకం నిందిస్తుంది. మంచి చేస్తే వానినే పొగడుతుంది.

అందువల్ల భరతవంశీయుల ఈ విరోధం వల్ల తప్పనిసరిగా ప్రజానీకం నశిస్తుంది. దీనికి నిన్నే నిందిస్తున్నాను. నేను సూచించిన ప్రకారం చేయకపోతే అగ్నిజ్వాల అడవినంతా తగులబెట్టినట్లు, నీ అపరాధం వల్ల జరిగే ఈ పని (యుద్ధం) కౌరవులందరినీ దహిస్తుంది. రాజా! అందరిలో నీవొక్కడివి మాత్రమే స్వేచ్ఛగా ప్రవర్తించే పుత్రునికి అధీనుడవై, జూదసమయంలో అతణ్ణి ప్రశంసించావు. అందువల్ల శాంతి పొందలేకపోయావు. ఇపుడు దాని విపరీత పరిణామాన్ని చూడు. నరేంద్రా! ఆప్తులు కాని శకుని, కర్ణుడు వంటివారిని చేరదీయడం వల్ల, ఆప్తులైన వారిని దండించడం వల్ల దుర్బలుడవైన నీవు విశాలమై, అనంతమైన ఈ భూమిని రక్షించడానికి సమర్థుడవు కావు. నరశ్రేష్ఠా! రథవేగంవల్ల బాగా బడలిక చెందాను. నీవు అనుమతిస్తే నేను వెళ్లి విశ్రాంతి తీసికొంటాను. రేపు ఉదయం సభలో కౌరవులంతా అజాతశత్రువైన ధర్మజుని మాటలు వినగలరు". ధృతరాష్ట్రుడు "సూతపుత్రా! సంజయా! నేననుమతిస్తున్నాను. నీవు నీ ఇంటికి వెళ్లి నిద్రించు. నీవు చెప్పినట్లుగా రేపు ఉదయం సభలో కౌరవులు ధర్మరాజు మాటలను వింటారు" అన్నాడు.

33. ధృతరాష్ట్ర విదుర సంవాదము.

ధృతరాష్ట్రమహారాజు ద్వారపాలకునితో "విదురుని చూడాలనుకొంటున్నాను. అతనిని ఇక్కడకు త్వరగా తీసుకురా" అన్నాడు. అతడు వెళ్లి విదురునితో "మహాప్రాజ్ఞా! ప్రభువైన మహారాజు నిన్ను చూడాలను కొంటున్నాడు" అన్నాడు. ఆ మాట విని విదురుడు రాజభవనానికి చేరుకుని "ద్వారపాలకా! ధృతరాష్ట్రునికి నా రాక గురించి చెప్పు" అన్నాడు. ద్వారపాలకుడు "మహారాజా! నీ ఆజ్ఞతో విదురుడు వచ్చాడు. నీ పాదాలను దర్శించుకోవా లనుకొంటున్నాడు. ఏమి చెయ్యాలో నన్నాదేశించు." అన్నాడు. ధృతరాష్ట్రుడు చెప్పాడు. "గొప్ప తెలివి, ముందు చూపూ కల విదురుని ప్రవేశపెట్టు. నేను ఈ విదురుని చూడటానికి ఎప్పుడూ అడ్డు చెప్పను." (కాదనను) ద్వారపాలకు డన్నాడు. "విదురా ! బుద్ధిశాలి అయిన మహారాజుయొక్క అంతఃపురంలోనికి ప్రవేశించు. రాజు నిన్ను చూడటానికి ఎప్పుడూ అడ్డు చెప్పనని నాతో అన్నాడు."

విదురుడు ధృతరాష్ట్రుడి మందిరంలో ప్రవేశించి చేతులు జోడించి, చింతిస్తున్న రాజుతో "మహామనీషీ ! నేను విదురుణ్ణి. నీ ఆజ్ఞ వల్ల వచ్చాను. కర్తవ్యమేమిటో ఆజ్ఞాపించు. ఇక్కడ సిద్ధంగా ఉన్నాను". అన్నాడు. ధృతరాష్ట్రుడు ఇట్లన్నాడు. "విదురా! బుద్ధిశాలి అయిన సంజయుడు నన్ను నిందించి వెళ్ళాడు. అతడు రేపు సభలో అజాతశత్రువు (ధర్మరాజు) మాటల్ని చెప్తాడట. ఆ కురువీరుడైన ధర్మరాజు మాటలేవో నాకు ఇప్పటికీ తెలియలేదు. అది నా అవయవాలను కాల్చివేస్తోంది. నిద్ర పట్టనియ్యటం లేదు. నాయనా ! నీవు ధర్మార్థాలలో నిపుణుడివి. నిద్రపట్టక తపిస్తున్న నాకు మేలయినది చెప్పు. సంజయుడు పాండవుల దగ్గర నుండి వచ్చింది మొదలు నా మనస్సుకు మునుపటి ప్రశాంతత లేదు. ఇంద్రియాలన్నీ సరిగా పనిచెయ్యడంలేదు. ఏం చెప్తాడో అని నాకిప్పు డెంతో చింతగా ఉంది". విదురుడు ఇలా చెప్పాడు. "బలవంతుడు పై బడుతున్న బలహీనుడికి, సొమ్ము పోగొట్టుకొన్న వానికి, కాముకుడికి, దొంగకు నిద్ర పట్టదు. ఈ పెద్ద తప్పు లేవైనా చేయలేదు కదా ! ఇతరుల సొమ్ముకు ఆశపడి పరితపించటం లేదు కదా !"

ధృతరాష్ట్రుడు చెప్పాడు. "ధర్మబద్ధమై, ఉత్తమశుభాన్ని కలిగించే నీ మాటను వినాలనుకొంటున్నాను. ఈ రాజర్షి వంశంలో నీవొకడివే పండితులమన్నన పొందినవాడివి".

(విదురుడు ఇలా అన్నాడు. "ధృతరాష్ట్ర! మంచి లక్షణాలు గల యుధిష్ఠిర మహారాజు మూడులోకాలకు ప్రభువు కాదగినవాడు. నీ ఆదేశాన్ని పాలించేవాడు. అలాంటివాడిని అడవులకు పంపావు. నీవు ధర్మాత్ముడివి, ధర్మతత్త్వ మెరిగినవాడివి. కంటి చూపు లేకపోవటంతో (అతనిని గుర్తించలేక అతని విషయంలో) ఎంతో విపరీతంగా ప్రవర్తించావు. రాజ్యభాగం ఇవ్వటానికి సమ్మతించలేదు. క్రూరత్వం లేని దయ, ధర్మం, సత్యం, పరాక్రమం, నీ పెద్దరికం, వీని వల్ల ధర్మరాజు చాలా కష్టాల్ని ఓర్చుకొంటున్నాడు. దుర్యోధనుడు, శకుని, కర్ణుడు, దుశ్శాసనుడు - వీళ్ళమీద రాజ్యభారాన్ని పెట్టి మేలు కలగాలని నీవెలా అనుకొంటున్నావు?

ఆత్మజ్ఞానం, ప్రయత్నం, దుఃఖాలను ఓర్చుకొనేశక్తి, ధర్మానికే కట్టుబడి ఉండటం, ఇవి ఎవనిని పురుషార్థం నుండి మళ్ళించవో అతడు పండితుడు.)

మంచిపనులను చేస్తాడు. నిందింపదగిన పనులను చెయ్యడు. నాస్తికుడు కాడు. శ్రద్ధకలిగి ఉంటాడు. ఇది పండితుని లక్షణం. కోపం, సంతోషం, గర్వం, సిగ్గు, బిగుసుకుపోవటం, తనకు తానే పూజ్యుణ్ణనుకోవటం - ఇవి ఎవనిని పురుషార్థం నుండి దూరం చెయ్యవో, అతడే పండితుడు. తాను చెయ్యాలనుకున్న పనిని,

ఆలోచనను ఇతరులు తెలుసుకొనలేరు. అతడు చేసిన పనిని మాత్రమే తెలుసుకోగలరు. అతడే పండితుడు. తాను చేయబోయే పనిని చలి-వేడి; భయం-రాగం; కలిమి-లేమి; అనేవి ఆటంక పరచలేని వాడే పండితుడు. ప్రసరించే అతని బుద్ధి ధర్మాన్ని అర్థాన్ని అనుసరిస్తుంది. శారీరక సుఖానుభవం కన్నా పురుషార్థాన్నే అతడు కోరుతాడు. అతడే పండితుడు. వివేకంతో పండిన బుద్ధి గల మానవుడు తమశక్తిననుసరించి చెయ్యాలనుకొంటాడు. తమశక్తికి తగ్గట్లు చేస్తాడు కూడా. దేనినీ చులకన చెయ్యడు. ఏ విషయాన్నైనా వెంటనే అర్థం చేసుకొంటాడు. ఎంతసేపైనా వింటాడు. ప్రయోజనాన్ని కోరికతో కాక, చక్కగా గమనించి పొందగోరతాడు. ఇతరులు అడుగకుండా ఇతరుల విషయంలో మాటలాడడు. పండితు డనటానికి ఇది మొదటి గుర్తు. **పండితబుద్ధిగల మానవుడు పొందదగని దాన్ని కోరడు. పోయినదాన్ని గూర్చి వీడవడు. ఆపదల్లో చిక్కుకొన్నప్పుడు కంగారు పడడు.*** తాను సాధించగలనని నిశ్చయించుకొనిన పనికి పూనుకొంటాడు. పనిని మధ్యలో విడువడు. సమయాన్ని వృథా కానియ్యడు. మనసును అదుపులో ఉంచుకొంటాడు. అతడే పండితుడు. భరతవంశోత్తమా! పండితుడు శుభకర్మలపై ఆసక్తి కలిగి ఉంటాడు. సంపదలనిచ్చే పనుల్ని చేస్తాడు. మంచి చేసే వారిని తప్పుపట్టడు. తనను సత్కరించినప్పుడు పొంగిపోడు. అవమానానికి కుంగిపోడు. గంగమడుగులా నిశ్చలంగా ఉంటాడు. అలాంటివాడు పండితుడు. అన్నిప్రాణుల యథార్థస్థితి తెలిసినవాడు, అన్ని పనులు చేసే నేర్పు తెలిసినవాడు, ఉపాయమెరిగిన వాడు పండితుడు. మాటలు ఆగకుండా సాగేవాడు, జనంలో ప్రచారంలో ఉన్న కథలు తెలిసి, ఊహ, సమయస్ఫూర్తి కలవాడు. అప్పటికప్పుడు ఏగ్రంథాన్నైనా చెప్పగలవాడు పండితుడు. శాస్త్రజ్ఞానం బుద్ధిని, బుద్ధి శాస్త్రజ్ఞానాన్ని అనుసరిస్తూ, పెద్దవారి కట్టడిని అతిక్రమించనివాడు పండితుడు. చాలా ధనాన్నీ, చదువునూ, అధికారాన్నీ పొందికూడ మిడిసిపాటు లేకుండా సంచరించేవాడు పండితుడు.

చదువులేకుండా, మిడిసి పడుతూఉంటాడు. వేదవాడయి గొప్ప గొప్ప కోరికలు కలిగి ఉంటాడు. పనిచెయ్యకుండా సొమ్ముల్ని పొందాలనుకొంటాడు. ఇలాంటి వాడు పండితులచే మూఢుడు అనిపించుకొంటాడు. తన పని అశ్రద్ధచేసి ఇతరుల పని చేసేవాడు, స్నేహితుడిని మోసగించేవాడు మూఢు డనబడతాడు. తనను ఇష్టపడని

---

* నా ప్రాప్యమభివాంఛంతి నష్టం నేచ్ఛంతి శోచితుమ్ ।
ఆపత్సు చ న ముహ్యంతి నరాः పండితబుద్ధయः ॥ 23

వాళ్ళను ఇష్టపడతాడు. ఇష్టపడేవాళ్ళను దూరం చేసుకొంటాడు. బలవంతుడితో విరోధం పెట్టుకొంటాడు. అతణ్ణి మూఢబుద్ధి అంటారు. శత్రువును మిత్రుడిగా భావిస్తాడు. మిత్రుణ్ణి ద్వేషిస్తాడు. హింసిస్తాడు. చెడ్డపని మొదలుపెడతాడు. అలాంటివాణ్ణి మూఢబుద్ధి అంటారు. తన పనుల్ని ఇతరులకు పురమాయిస్తాడు. అన్నిచోట్ల సందేహిస్తూంటాడు. తొందరగా ముగిసే పనిని సాగదీస్తాడు. అతడు మూఢుడు. పితరులకు శ్రాద్ధం పెట్టడు. దేవతల్ని పూజించడు. మంచి హృదయం గల మిత్రుణ్ణి పొందడు. అలాంటివాణ్ణి మూఢబుద్ధి అంటారు. పిలవకుండా లోపలికి ప్రవేశిస్తాడు. అడగకుండానే ఎక్కువగా మాట్లాడతాడు. నమ్మ తగని వాళ్లను నమ్ముతాడు. ఇలాంటి నరాధముడు మూఢుడు. తాను తప్పుచేస్తూ ఆ తప్పును ఇతరులలో ఎత్తిచూపుతాడు. అసమర్థుడై కూడా కోపం ప్రదర్శిస్తాడు. అలాంటి మనిషి మహామూర్ఖుడు. తన బలమెంతో గుర్తించడు. పని చెయ్యకుండానే దుర్లభమైన దాన్ని కోరుతాడు. ధర్మార్థాలకు విరుద్ధమైనది కోరుతాడు ఈ లోకంలో మూఢుడు. రాజా! అర్హత లేనివాడికి ఉపదేశిస్తాడు. దరిద్రుని సేవిస్తాడు. లోభిని పట్టుకుని వ్రేలాడుతాడు. అలాంటివానిని మూఢుడు అంటారు.

తాను పోషించవలసిన వాళ్ళకు కల్పించకుండా తానొక్కడు చక్కగా భోంచేస్తాడు. ఒక్కడే అందమైన గుడ్డలు కడతాడు. తన్ను ఆశ్రయించిన వారికి కూడా విదపడు. వాడికన్న గొప్ప క్రూరు డెవడుంటాడు? ఒకడు పాపాలు చేస్తాడు. చాలామంది ఆ ఫలాన్ని అనుభవిస్తారు. అనుభవించినవారు విడుద లౌతారు. చేసిన వాణ్ణి మాత్రం ఆ దోషం అంటుకొనే ఉంటుంది. విలుకాడు విడచిన బాణం ఒకణ్ణి చంపుతుందో లేదో గాని తెలివైనవాడు ప్రయోగించిన బుద్ధి (నీతి) రాజుతోపాటు దేశాన్ని కూడా నాశనం చేస్తుంది. ఒకదానితో (బుద్ధితో) రెండు (చెయ్యతగినది, చెయ్య తగనిది) నిశ్చయించుకుని ముగ్గురిని (శత్రువు, మిత్రుడు, తటస్థుడు) నాలిగింటితో (సామ, దాన, భేద, దండోపాయములతో) (మనసును) అదుపులోకి తెచ్చుకో. ఐదింటిని (ఇంద్రియములను) జయించి, ఆరింటిని (సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయములను) తెలుసుకొని, ఏడింటిని (స్త్రీ జూదం, వేట, మద్యపానం, పరుషముగా మాట్లాడుట, కఠినంగా దండించుట, డబ్బును చెడుగా ఖర్చు చేయుట) విడచి సుఖం కలవాడివగుము. విషరసం ఒక్కణ్ణి (తాగినవాణ్ణే) చంపుతుంది. ఆయుధం

ఒక్కణ్ణి (ఎవడిమీద పడితే వాణ్ణే) చంపుతుంది. రాజు-మంత్రుల రహస్యాలోచన (మంత్రివర్గ నిర్ణయం) దేశం, ప్రజలతో సహా రాజును నశింపజేస్తుంది.

రుచిగల పదార్థం ఒక్కడే తినరాదు. ఏ విషయాలయినా ఒక్కడే నిశ్చయించరాదు. ఒంటరిగా మార్గంలో పోకూడదు. అందరూ నిద్రిస్తూ ఉండగా తానొక్కడే మేలుకోరాదు. రాజా! సముద్రం దాటటానికి నావలాగా సత్యమొక్కటే స్వర్గానికి మెట్టు. రెండవది లేదు. దాన్ని తెలుసుకోకుండా ఉన్నావు. ఓర్పుగలవారిని ప్రజలు చేతకానివా డంటారు. ఓర్పుగల వారి విషయంలో తప్పు ఇది ఒక్కటే. రెండోది దొరకదు. ఆ తప్పు ఓర్పుకలవాడి దనుకోకూడదు. ఎందుకంటే ఓర్పు గొప్పబలం. అసమర్థులకు ఓర్పు గుణం (మంచిది). సమర్థులకు ఓర్పు అలంకారం. ఈ ప్రపంచంలో ఓర్పు వశీకరణ మంత్రం లాంటిది. ఓర్పుతో దేన్నయినా సాధించవచ్చు. చేతిలో శాంతి రూపమైన కత్తి ఉన్నవాడిని దుర్జనుడు ఏమీ చెయ్యలేడు. గడ్డి మొలవని చోట పడ్డ నిప్పు దానంతటదే చల్లారుతుంది. ఓర్పులేనివాడు తననూ, ఇతరులనూ తప్పులతో జతపరుస్తాడు. ధర్మమొక్కటే పరమ శ్రేయస్సును కలిగిస్తుంది. ఓర్పు ఒక్కటే ఉత్తమమైన శాంతి నిస్తుంది. చదువొక్కటే మిక్కిలి తృప్తినిస్తుంది. అహింస ఒక్కటే సుఖాన్ని చేకూరుస్తుంది.

సముద్రం దాకా ఉన్న ఈ భూమిమీద అధములైన పురుషు లీ ఇద్దరే. గృహస్థుడై పనిచేయక కాలక్షేపం చేసేవాడొకడు, సన్యాసియై పనులలో మునిగి తేలే వాడింకొకడు. పుట్ట (కన్నం)లో ఉండే ప్రాణుల్ని (ఎలుకలను) పాములాగా, శత్రువుపై పగసాధించనిరాజును, ఇతర దేశాలను చూడని బ్రాహ్మణునీ ఈ భూమి మింగేస్తుంది. (పుట్టినచోటే నశిస్తారు. కీర్తిని పొందరు.) కొంచెంకూడా కఠినంగా మాట్లాడకపోవటం, అట్లాగే చెడ్డవాళ్లను సేవించక పోవటం ఈ రెండు పనులు చేసే మానవుడు లోకంలో ఎంతో ప్రకాశిస్తాడు. పురుషశ్రేష్ఠా! ఇతర స్త్రీలు కోరిన వానిని కోరే స్త్రీలు, ఇతరులు పూజించిన వానిని పూజించే వ్యక్తి- ఈ ఇద్దరూ ఇతరుల నమ్మకాన్ని బట్టి నడుచుకొంటారు. డబ్బులేకుండా కోరుకొంటాడు. అసమర్థుడై కోపగిస్తాడు - వీళ్లిద్దరూ పదునైన ముళ్ళలాగా, తమ శరీరాల్ని తామే శుష్కింప చేసికొంటారు. పనిచేయని గృహస్థుడు, పనులుగల సన్యాసి - ఈ ఇద్దరూ తమ విపరీత ప్రవృత్తి చేత ప్రకాశించరు. రాజా! శక్తిమంతుడై ఓర్పుకలవాడు, దాతయైన దరిద్రుడు - ఈ ఇద్దరూ స్వర్గానికి

పైన నిలుస్తారు. న్యాయంగా కూడబెట్టిన డబ్బుకు రెండు విధాల చేటు కలుగుతుంది. అనర్హుడికి ఇవ్వటం, అర్హుడికి ఇవ్వకపోవటం. దానం చెయ్యని ధనవంతుని, తపస్సు చేయని దరిద్రుని ఈ ఇద్దరినీ మెడకు బండరాయికట్టి నీళ్లలో ముంచెయ్యాలి. యోగరతుడైన సన్యాసి, యుద్ధంలో శత్రువుకెదురొడ్డి పోరాడి చనిపోయినవాడు - ఈ ఇద్దరూ సూర్యమండలాన్ని భేదించుకొని ఉత్తమగతిని చేరుకొంటారు.

మనుష్యులకు పని సాధించడంలో ఉత్తమ, మధ్యమ, అధమాలనే మూడు ఉపాయా లున్నవని వేదవేత్త లంటారు. రాజా! ఉత్తములు, మధ్యములు, అధములు అని మానవులు మూడు రకాలుగా ఉంటారు. వారిని వారి అర్హత ననుసరించి మూడు విధాలైన ఆ యా పనుల్లోనే నియమించాలి. రాజా! భార్య, సేవకుడు, కొడుకు ఈ ముగ్గురు ధనానికి అధికారులు కారు. ఎవరి అధీనంలో వారున్నారో అతడికే వారు సంపాదించుకొన్నది చెందుతుంది. ఇతరుల సొమ్మును దొంగిలించటం, ఇతరుల భార్యలతో సంపర్కం, మంచి మనసుగల స్నేహితులను వదులుకొనడం, ఈ మూడు దోషాలు మానవుని క్షీణింపచేస్తాయి. కామం, క్రోధం, లోభం- ఇవి తనను నశింపచేస్తాయి. ఇవి మూడు నరక ద్వారాలు. కావున ఈ మూడింటిని విడిచిపెట్టాలి. వరమివ్వడం, రాజ్యపాలనం, కొడుకును పొందటం ఈ మూడింటితో "శత్రువును కష్టం నుండి తప్పించటం" అనేది సమానం. భక్తుడు, సేవిస్తున్నవాడు, నీవాడ నన్నవాడు- తన శరణు చేరిన ఈ ముగ్గురిని తాను కష్టంలో ఉన్నప్పుడు కూడ విడువరాదు.

తెలివి తక్కువవారితో, పని సాగదీసేవారితో, తొందరపాటుతో చేసేవారితో, స్తోత్రపాఠకులతో రహస్య సమాలోచన చెయ్యకూడదు. ఈ నలుగురిని బలవంతుడైన రాజు విడిచిపెట్టాలి. పండితుడు వాళ్ళను గుర్తించాలి. సంపదకలిగి గృహస్థధర్మంలో ఉన్న నీ ఇంట 1) ముసలివాడైన దాయాది, 2) కష్టంలో ఉన్న ఉత్తమ కులజుడు, 3) పేదయైన మిత్రుడు, 4) సంతానం లేని సోదరి - ఈ నలుగురూ ఉండాలి. మహారాజా! ఇంద్రుడు అడిగితే అప్పటికప్పుడు ఫలాన్నిచ్చే నాలిగింటిని బృహస్పతి పేర్కొన్నాడు. వాటిని చెపుతా వినుు. దేవతల సంకల్పం, బుద్ధిమంతుల ప్రభావం, విద్వాంసుల అణకువ, పాపుల వినాశం ఈ నాలుగూ సద్యఃఫలితాన్ని ఇస్తాయి. నాలుగు పనులు భయాన్ని తొలగిస్తాయి. కూడని విధంగా ఆచరిస్తే భయాన్ని

కలుగజేస్తాయి. (అవి) ఆదరంతో అగ్నిని ఉపాసించటం, ఆదరంతో మౌనం వహించటం, ఆదరంతో అధ్యయనం చెయ్యటం, ఆదరంతో యజ్ఞాన్ని ఆచరించటం. ఇవే ఆర్భాటంతో, అనాదరంతో చేస్తే భయం కలిగిస్తాయి.

తండ్రి, తల్లి, అగ్ని, ఆత్మ, గురువు ఈ ఐదు అగ్నులను మానవుడు ప్రయత్న పూర్వకంగా సేవించాలి. దేవతలను, పితరులను, మనుష్యులను, సన్యాసులను, అతిథులను, ఈ ఐదుగురినీ పూజిస్తే చాలు, మానవుడు ఈ లోకంలో కీర్తిని పొందుతాడు. స్నేహితులు, శత్రువులు, తటస్థులు, ఆశ్రయమిచ్చేవారు, ఆశ్రయం పొందేవారు - ఈ ఐదుగురు నీ వెంట వస్తారు. ఐదు జ్ఞానేంద్రియాలు గల మానవుడికి ఒక్క ఇంద్రియం పాడైనా దానివల్ల అతని తెలివి అంతా తోలు తిత్తి నుండి కారే నీళ్ళలా కారిపోతుంది.

ఈ లోకంలో ఐశ్వర్యాన్ని కోరే వ్యక్తి నిద్ర, కునికిపాట్లు, భయం, కోపం, సోమరితనం, సాచివేత - ఈ ఆరు దోషాలూ విడవాలి. పగిలిననావను సముద్రంలో వదిలేసినట్లు బోధించని గురువును, మంత్రోచ్చారణ చెయ్యని ఋత్విక్కును, ప్రజలను కాపాడని రాజును, ప్రియంగా మాట్లాడని భార్యను, గ్రామంలో ఉండాలనుకొనే గోపాలకుని (ఆవులను మేపేవాడు), అడవిలో ఉండగోరే మంగలిని - ఈ ఆరుగురినీ మానవుడు విడిచి పెట్టాలి. నిజం చెప్పటం, దానం చేయటం, సోమరితనం లేక పోవడం,అసూయ లేకపోవడం, ఓర్పు, చాంచల్యం లేక పోవడం - అనే ఆరుగుణాలను మనిషి ఎప్పటికీ విడువరాదు. రాజా! ధనలాభం, ఆరోగ్యం, అనుకూలవతియైన భార్య, ప్రియంగా మాట్లాడే భార్య, అదుపులో ఉండే కుమారుడు, ధనమిచ్చే చదువు - ఈ ఆరూ మనుష్య లోకంలో సుఖకరాలు. మనస్సులో ఎల్లవేళలా ఉండే ఆరింటిపై (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములపై) అదుపు కలిగిన ఇంద్రియనిగ్రహ సంపన్నుని పాపాలు దగ్గరకు కూడా చేరవు. ఇక పాపాల వల్ల కలిగే అనర్థాలు ఎలా కలుగుతాయి? ఆరుగురు ఉన్నందువల్ల ఈ ఆరుగురు ఎప్పుడూ బ్రతుకుతున్నారు. ఏడవవాడు దొరకటం లేదు. ఏమరుపాటు కలిగిన వాడివల్ల దొంగలు, రోగులవల్ల వైద్యులు, కాముకులవల్ల కామినులు, యజ్ఞకర్తల వల్ల పురోహితులు, తగవులాడుకొనేవారి వల్ల రాజులు, మూర్ఖులవల్ల పండితులు జీవిస్తున్నారు. గోవులు, సేవకవృత్తి, వ్యవసాయం, భార్య, చదువు, అధర్మపరులతో కలయిక - ఈ ఆరు ముహూర్తకాలం

పట్టించుకొనకుండా ఉంటే చాలు, నశిస్తాయి. చదువు పూర్తిచేసిన శిష్యులు గురువును, పెళ్ళయిన కొడుకులు తల్లిని, కోరికలు తీరిన వాళ్ళు స్త్రీని, పనిసాధించినవాళ్ళు సహాయపడ్డవాళ్లను, ఏరుదాటిన వారు పడవను, రోగం నయమైనవారు వైద్యుణ్ణి- (ఈ ఆరుగురు ముందు ఉపకారం చేసిన వారిని) విడిచిపెడతారు. రాజా! రోగాలేవీ లేకపోవటం, అప్పు లేకపోవటం, దేశంకాని దేశంలో నివసించకపోవటం, మంచి మనుషులతో కలయిక, స్వతంత్ర వృత్తితో జీవించటం, భయం లేకుండా నివసించడం - ఈ ఆరూ ఈ లోకంలో సుఖకరాలు. ఈర్ష్యపడేవాడు, దీనుడు, సంతోషం లేనివాడు, ముక్కోపి, ఎప్పుడూ శంకించేవాడు, ఇతరుల భాగ్యంమీద ఆధారపడి బ్రతికేవాడు - ఈ ఆరుగురూ ఎప్పుడూ దుఃఖిస్తూ ఉంటారు.

దుఃఖాల్ని కలిగించే స్త్రీలపై ఆసక్తి, జూదం, వేటాడటం, మద్యపానం, కఠినంగా మాట్లాడటం, చాలా కఠినంగా శిక్షించటం, డబ్బును అనవసరంగా ఖర్చు చెయ్యటం- అనే ఏడు దోషాలనూ రాజు విడిచిపెట్టాలి. బాగా స్థిరపడ్డ రాజులు కూడా తరచుగా వీటివల్ల నశిస్తారు.

నశించబోయే మానవుడికి, ముందు శకునాల్లాంటివి ఎనిమిది ఉన్నాయి. 1) మొదట బ్రాహ్మణులను ద్వేషిస్తాడు. 2) బ్రాహ్మణులతో తగవుపడతాడు. 3) బ్రాహ్మణుల సొమ్ము కాజేస్తాడు. 4) బ్రాహ్మణులను చంపాలనుకొంటాడు. 5) వారినిందచే ఆనందిస్తాడు. 6) వారి ప్రశంసను మెచ్చుకొనలేడు. 7) యజ్ఞయాగాదులందు వారిని స్మరించడు. 8) ఏదైనా అడిగినప్పుడు దోషారోపణ చేస్తాడు. బుద్ధిశాలి అయిన మానవుడు వీటిని దోషాలుగా గుర్తించాలి. గుర్తించి విడిచి పెట్టాలి. మిత్రులతో కలయిక, ధనలాభం, కొడుకు కౌగిలింత, రతి సుఖం, సమయానికి తగినట్లు ప్రియంగా మాటలాడటం, తన వారిలో ఉన్నతస్థితి, కోరుకొన్న వస్తువును పొందటం, జన సమూహంలో సత్కరింపబడటం- ఈ ఎనిమిదీ సంతోష కారణాలు. అవే తనకు సుఖకరాలు కూడా. తెలివితేటలు, సత్కులంలో పుట్టడం, ఇంద్రియ నిగ్రహం, శాస్త్రజ్ఞానం, పరాక్రమం, మితంగా మాట్లాడటం, శక్తిననుసరించి దానం చేయడం, చేసిన మేలు మరువకపోవడం - అనే ఈ ఎనిమిది గుణాలూ మానవుని కీర్తిని పెంచుతాయి.

తొమ్మిది ద్వారాలు (తొమ్మిది రంధ్రాలు), మూడు స్తంభాలు (సత్త్వ, రజ,

స్తమోగుణాలు మూడు), ఐదుగురు సాక్షులు (ఐదు జ్ఞానేంద్రియాలు) కల, ఆత్మకు (క్షేత్రజ్ఞునకు) నివాసమైన ఈ శరీరరూపమైన ఇంటిని తెలుసుకొన్నవాడు గొప్ప జ్ఞాని.

ధృతరాష్ట్రా! మత్తెక్కినవాడు, జాగరూకత లేనివాడు, పిచ్చివాడు, ఆలసిపోయినవాడు, కోపంతో ఉన్నవాడు, ఆకలి గొన్నవాడు, తొందరపాటు కలవాడు, పిసినారి, భయస్థుడు, కాముకుడు– ఈ పదిమంది ధర్మాన్ని గుర్తించలేరు. కాబట్టి పండితుడు వీరితో కలవకూడదు.

ఈ విషయంలోనే రాక్షసరాజు ప్రహ్లాదుడు సుధన్వుడితో కలిసి తన కొడుకు కోసం చెప్పిన పురాతనమైన ఇతిహాసాన్ని ఉదహరిస్తున్నారు. కామక్రోధాల్ని విడిచిన రాజును, అర్హత కలవాడికి ధనమిచ్చేవానిని, విశేషంగా తెలిసిన వానిని, శాస్త్రాలు తెలిసిన వానిని, కర్తవ్యాన్ని త్వరగా పూర్తిచేసే వానిని లోకమంతా ప్రమాణంగా పెట్టుకొంటుంది. మనుష్యుల్ని నమ్మించటం తెలిసిన వానిని, నేరం రుజువైన వాళ్ళకు తగినశిక్ష విధించే వానిని, శిక్ష యొక్క స్థాయి తెలిసిన వానిని, అలాగే ఓర్పు గురించి తెలిసిన వానిని సమగ్రమైన సంపద చేరుకొంటుంది. బలహీనుని అవమానించడు. జాగరూకుడై బుద్ధిపూర్వకంగా శత్రువుతో వ్యవహరిస్తాడు. బలవంతులతో వైరం ఇష్టపడడు. తగిన సమయంలో పరాక్రమం చూపుతాడు. ఇలాంటి వాడు ధీరుడు. కార్యభారం గల మహాత్ముడు ఆపదలో చిక్కుకొన్నా ఎపుడూ బాధ పడడు. జాగరూకుడై కార్యసాధనకై ప్రయత్నిస్తాడు. సమయాన్ని బట్టి దుఃఖాన్ని అదుపు చేసుకొంటాడు. అతడు శత్రువులను జయించి తీరుతాడు. ఇల్లు విడచి ప్రయోజనం లేకుండా విదేశాల్లో నివసించడం, పాపులతో కలవటం, పరస్త్రీల పొందు, డాంబికత (డాబు), దొంగతనం, పిసినారితనం, మద్యపానం – వీటికి దగ్గరకాని వాడు ఎప్పుడూ సుఖపడేవాడే.

కోపంతో ధర్మ, అర్థ, కామాల్ని మొదలుపెట్టనివాడు, అడిగినప్పుడు యథార్థాన్నే చెప్పేవాడు, స్నేహితులతో వివాదం పెట్టుకోనివాడు, గౌరవింపబడకపోయినా కోపగించుకోనివాడు, వివేకం కోల్పోనివాడు, ఇతరుల తప్పు లెన్ననివాడు, అందరిపై దయ చూపేవాడు, బలహీనుడై ఇతరులతో తగవు పడని వాడు, కొంచెంకూడ అధిక ప్రసంగం చెయ్యనివాడు, వివాదంలో ఓర్పు చూపేవాడు అంతటా ప్రశంసింపబడతాడు.

ఒకప్పుడైనా తీవిని ప్రదర్శించే వేషం వెయ్యని వానిని, పరాక్రమం కలిగి కూడ ఇతరుల ఎదుట ఆత్మస్తుతి చేసుకొనని వానిని, ఒళ్ళు తెలియనివాడై కఠినమైన మాటలు కొద్దిగా కూడా మాట్లాడని వానిని జనం ఎప్పుడూ ప్రేమిస్తారు. చల్లారిన వైరం రగిలించని వానిని, పొగరెక్కని వానిని, క్రుంగిపోని వానిని, నాకు చెడుదాపురించిం దనుకొంటూ చెయ్యకూడని పని చెయ్యని వానిని, శుభమైన ప్రవర్తన కలవానిని పెద్దలు అందరిలోను శ్లాఘ్య డంటారు. తన సుఖానికి పొంగిపోడు. ఇతరుల దుఃఖానికి పొంగిపోడు. దానం చేసి పశ్చాత్తాపపడడు. అతడు సజ్జనులలో సత్ప్రవర్తన కలవాడు. ఆయా దేశాచారాలను, కట్టుబాట్లను, జాతుల ధర్మాలను (మతాల్ని) అవగాహన చేసుకొన్నవాడు. హెచ్చు - తగ్గు తేడా తెలుసుకొన్న వాడు ఎక్కడికి వెళ్లినా, ఎప్పుడూ జనసమూహంపై తన ఆధిపత్యాన్ని స్థాపించుకోగలుగుతాడు. ఆడంబరం, భ్రాంతి, ద్వేషం, పాపపుపని చెయ్యటం, రాజద్రోహం తలపెట్టడం, పిసినారితనం, సంఘవైరం, పొగరుబోతులతో, పిచ్చివాళ్ళతో, చెడ్డవాళ్ళతో వాదం– ఇవన్నీ వదులుకొన్నవాడు ప్రజ్ఞాశాలి. దానం, హోమం, దేవతార్చన, శుభకార్యాలు, ప్రాయశ్చిత్తాలు, అనేకవిధాలైన లోకాచారాలను దైనందిన కార్యక్రమాలుగా పెట్టుకొన్న వాడికి దేవతలు దీప్తి నిస్తారు.

హీనులను విడిచి సమానులతోనే వివాహం, స్నేహం, వ్యవహారం, సంభాషణ చేస్తూ, విశిష్టవ్యక్తులను ముందుంచుకొనే పండితుని నీతులు ప్రయోజనాలను సిద్ధింపచేస్తాయి. తనను ఆశ్రయించిన వాళ్ళకు పంచి ఇచ్చి, మితంగా తింటాడు. ఎక్కువ పనిచేసి తక్కువ నిద్రిస్తాడు. అడిగితే శత్రువులకైనా ఇస్తాడు. అలాంటి ఆత్మగుణ సంపన్నుణ్ణి అనర్థాలు విడిచిపెడతాయి. ఆ ఆత్మవంతుడు తనకు ఇష్టమైన దానికి పూనుకొన్నా, శత్రువుకు అనిష్ట కార్యం చేయదలచుకొన్నా ఎవరికీ తెలియనివ్వడు. అతని మంత్రాలోచనం కాని, ఆచరణం కాని కొద్దిగా కూడా వ్యర్థం కాదు. ప్రాణు లన్నింటికి శాంతిని కలిగించే ఆసక్తితో, సత్యాన్నే పలుకుతూ, మృదు స్వభావంతో ఇతరులను గౌరవిస్తూ, పవిత్రమైన ఆశయం కలవాడు సాటివారిలో జాతిరత్నం వలె చాలా ప్రసిద్ధిని పొందుతాడు. (ఇతరులచే గుర్తింపబడనివైనా) తన తప్పులకు తానే మిక్కిలి సిగ్గుపడే మానవుడు లోకమంతటికీ గురు వౌతాడు. అంతులేని తేజస్సు, శుద్ధమైన మనస్సు, ఏకాగ్రత కల అతడు తన కాంతితో

సూర్యుడిలా ప్రకాశిస్తాడు. అంబికా కుమారా! (మృగరూపాన్ని ధరించిన కిందముడు అనే ఋషి యొక్క) శాపదగ్ధుడయిన పాండురాజు కుమారులైదుగురు అడవిలో పుట్టారు. ఐదుగురు ఇంద్రుల్లాంటివారు. చిన్నతనంలో నీవే పెంచావు. విద్యాబుద్ధులు నేర్పించావు. నీ ఆజ్ఞను వారు పాటిస్తున్నారు. తండ్రీ! అలాంటి వాళ్ళకు తగిన విధంగా రాజ్యమిచ్చి నీ కొడుకులతో కలసి ఆనందిస్తూ సుఖపడు. రాజా! అలా చేస్తే నిన్ను దేవతలూ, మనుషులూ కూడ శంకించరు."

34. విదురుడు నీతి ఉపదేశించుట.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "నాయనా! మనలో నీవు ధర్మార్థాల్లో నిపుణుడవు. నిద్రపట్టక తపించిపోతున్న నాకు నీవనుకొంటున్న కర్తవ్యాన్ని చెప్పు. ఉదార బుద్ధిగల విదురా! బుద్ధిపూర్వకంగా నాకు చెప్పాలనుకొన్న దంతా తప్పకుండా ఉపదేశించు. ధర్మరాజుకు ఏది మేలో, కౌరవులకు శుభాన్ని కలిగించే దేదో, నీవనుకొంటున్నది చెప్పు. కీడును శంకిస్తూ కళ్ళకు కట్టినట్లున్న నాతప్పుల్ని గమనిస్తూ కలవరపడుతున్న మనసుతో, నేను నిన్నడుగుతున్నాను. కాబట్టి విదురా! అజాతశత్రువు కోరుకొంటున్నదంతా ఉన్నది ఉన్నట్లు నాకు చెప్పు.

విదురుడిట్లా అన్నాడు - మంచో, చెడో, కష్టమో, ఇష్టమో అడగకపోయినా ఎవనికి పరాభవం కూడదని తాను అనుకొంటాడో వాడికి చెప్పాలి. కాబట్టి రాజా! కౌరవుల కేది మేలో నీకు చెప్తాను. శుభాన్ని కలిగించే, ధర్మబద్ధమైన నా మాటల్ని వినుము. కపటోపాయంతో పొందిన ద్యూతజయం మీద దృష్టి పెట్టకు. అలాగే జాగరూకతతో, ఉపాయంతో చేసిన పని సిద్ధించనపుడు తెలివైనవాడు మనసు పాడు చేసుకోకూడదు. సానుబంధాలయిన పనుల్లో అనుబంధ ప్రయోజనాన్ని ముందు గుర్తించాలి. నిలదొక్కుకొని ఆలోచించి మరీ చెయ్యాలి. తొందర పడి చేయకూడదు. ధీరుడు (ముందు) అనుబంధ ప్రయోజనాలను, తదనంతర పరిణామాన్ని, తనకు కలిగే ఉన్నతిని బాగా ఆలోచించి ఆ పనిని చెయ్యవచ్చు, చెయ్యకపోనూ వచ్చు.

కోట, లాభనష్టాలు, ధనాగారం, దేశం, దండనల స్థాయి ఎలా ఉందో తెలుసుకోలేని వాడు రాజ్యంలో, అధికారంలో స్థిరంగా ఉండలేడు. ఇలా వీటి స్థాయిలను చక్కగా గుర్తించినవాడు ధర్మార్థ జ్ఞానంలో మనసు నిలిపి రాజ్యాన్ని పొందుతాడు. రాజ్యం

దక్కింది గదా అని తగని విధంగా నడుచుకోకూడదు. ముసలితనం రూపాన్ని కమ్మేసినట్లు మిడిసిపాటు సంపదను నశింపచేస్తుంది.

చేప చక్కని తినుబండారంలాగా కనపడే ఇనుపగాలాన్ని దురాశకు లోనై మ్రింగుతుంది. దానివల్ల జరుగబోయే కీడును గమనించదు. తినటానికి వీలైనదే తినాలి, తింటే జీర్ణమయ్యేదే తినాలి. జీర్ణమైన తర్వాత మేలు చేసే దాన్నే తినాలి. చెట్టునుండి పండని పళ్లు కోసుకొనేవాడు వాటి నుండి రసాన్ని పొందలేడు సరిగదా దాని విత్తనం కూడా నశిస్తుంది. చక్కగా కాలపక్వమయిన పండు తిన్నవాడు పండునుండి రసాన్ని పొందుతాడు. దాని విత్తనం నుండి మళ్ళీ పండునూ పొందగలుగుతాడు. పూలు కందకుండా తుమ్మెద తేనెను గ్రహించినట్లు మనుష్యుల్ని బాధించకుండా రాజు సంపదలను గ్రహించాలి. పూలదండలు కట్టేవానిలాగా తోటలో ఒక్కొక్క పువ్వునీ, పువ్వునీ పోగుచేసుకోవాలి. (చెట్లు తగలబెట్టి) బొగ్గు తయారు చేసే వానిలా మొదలంట నరకకూడదు. మానవుడు "ఇది చేస్తే నాకేమౌతుంది. చెయ్యకపోతే ఏమౌతుంది?" అని బాగా ఆలోచించి పనులు చెయ్యవచ్చు, మానుకోవచ్చు. ఎప్పటికీ ఫలించని పనులు మొదలుపెట్టకూడదు. వాటికోసం చేసిన పురుష (మానవ) ప్రయత్నం వ్యర్థమౌతోంది కదా!

స్త్రీలు నపుంసకుణ్ణి భర్తగా ఇష్టపడనట్లు ఫలించని అనుగ్రహమూ, వ్యర్థమయ్యే కోపమూ కలవాడిని ప్రజలు ప్రభువుగా ఇష్టపడరు. తెలివిగల మానవుడు ప్రయత్నం తక్కువ, ఫలితం ఎక్కువ గల పనుల్ని వెంటనే మొదలుపెడతాడు. అలాంటివాటికి ఆటంకం రానీయడు. రాజు అందరినీ కంటితో ఆస్వాదిస్తున్నట్లు సమానంగా చూస్తే, ఊరకే కూర్చున్నా ప్రజలు అతని పట్ల అనురాగం కలిగి ఉంటారు. బాగాపూచినా పండ్లులేని చెట్టులాంటి వాడవ్వాలి. పండ్లున్నా ఎక్కటానికి వీలుపడని చెట్టులాంటి వాడవ్వాలి. పచ్చిగా ఉన్నా పండిన (చెట్టులాంటి) వాడవ్వాలి. ఇలా చేస్తే రాజు ఎన్నటికీ శిథిలం కాడు. (కృశించిపోడు). చూపుతో, మనస్సుతో, మాటతో, పనితో నాలుగు విధాలుగాను లోకాన్ని (ప్రజలను) ఆకట్టుకోగలిగే వానిని లోకం అనుగ్రహిస్తుంది. వేటాడే బోయవాడికి మృగాలు బెదిరినట్లు ప్రాణులన్నీ ఎవడికి భయపడతాయో, అతడు, సముద్రం హద్దుగా గల భూమినంతా చేజిక్కించుకొన్నా (ప్రజలచే) నామ రూపాల్లేని వాడౌతాడు. తండ్రితాతల నుండి సంక్రమించిన రాజ్యాన్ని, అవినీతి

పరుడు తన చేష్టలవల్ల, గాలి మబ్బును చెదరగొట్టినట్లు, చేజార్చుకొంటాడు. సజ్జనులచే మొదటినుండి ఆచరించబడుతున్న ధర్మాన్ని ఆచరించే రాజుకు, సంపదలతో నిండి భూమి పెంపొందుతుంది. అతడి ఐశ్వర్యాన్ని పెంచుతుంది. ధర్మాన్ని విడనాడి అధర్మాన్ని ఆచరించే రాజు యొక్క భూమి నిప్పులో వెయ్యబడ్డ తోలులా ముడుచుకుపోతుంది. శత్రుదేశాల నణచటంలో ప్రయత్నించినట్లే, తన దేశాన్ని పరిపాలించటంలో కూడా ప్రయత్నం చెయ్యాలి. ధర్మంతో రాజ్యాన్ని పొందాలి. ధర్మంతో పరిపాలించాలి. ధర్మాన్ని ఆధారంగా చేసుకొంటే లభించిన సంపద విడిచిపెట్టదు. తరిగిపోదు.

నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న పిచ్చివాడి నుండి అయినా, అలాగే పొంతన లేకుండా వాగే బాలుడినుండి అయినా, రాళ్ళనుండి బంగారాన్ని లాగినట్లు (సారాన్ని) గ్రహించాలి. చక్కగా చెప్పిన సూక్తుల్ని, మంచి పనుల్ని ఆయా వ్యక్తులనుండి, సందర్భాలనుండి పరిగ ఏరుకొని తినేవాడిలా సేకరించుకొంటూ ఉండాలి. పశువులు వాసనతో గ్రహిస్తాయి. బ్రాహ్మణులు వేదాలతో చూస్తారు. రాజులు గూఢచారులతోను, ఇతర జనులు కేవలం కళ్లతోను చూస్తారు. పాలు పితకనివ్వని ఆవు ఎన్నో యాతనలు పడుతుంది. రాజా! తేలికగా పాలిచ్చే ఆవును ఎంత మాత్రమూ బాధించరు. కాల్చకుండా వంగేదాన్ని మంటలో కాల్చరు. తనకు తానుగా వంగిన కొయ్యనూ వంచరు. ఈ పోలిక ననుసరించి ధీరుడు బలవంతుడి ఎదుట వంగాలి. బలవంతుడికి తలవంచేవాడు ఇంద్రుడికి నమస్కరిస్తున్నట్లే. పశువులకు మేఘుడు రక్షకుడు. రాజులకు మంత్రులే చుట్టాలు. స్త్రీలకు భర్తయే బంధువు, బ్రాహ్మణులకు వేదాలే చుట్టాలు. సత్యం చేత ధర్మం కాపాడబడుతుంది. విద్య యోగం (ఏకాగ్రత, అభ్యాసం) చేత కాపాడబడుతుంది. శుభ్రపరచు కోవటం చేత అందమైన రూపం కాపాడబడుతుంది. కులం (వంశం) మంచి నడవడిచేత కాపాడబడుతుంది. కొలతచే ధాన్యం కాపాడబడుతుంది. వెంబడింపు గుర్రాల్ని కాపాడుతుంది. మాటిమాటికి చూచుకోవటం వల్ల ఆవులు, మలినవస్త్రాల వల్ల స్త్రీలు కాపాడబడుతారు.

సత్ప్రవర్తన లేనివాడికి కులం మాన్యత నియ్యదని నా అభిప్రాయం. తక్కువ కులంలో పుట్టినవాళ్ళకైనా సత్ప్రవర్తనే విలువనిస్తుంది. ఇతరుల ధనానికీ, అందచందాలకూ, బలానికీ, వంశగౌరవానికీ, సుఖానికీ, అదృష్టానికీ, గౌరవానికీ ఓర్చుకోలేని వాని

రోగానికి అంతులేదు. మద్యం త్రాగిన వాళ్ళు చెయ్యకూడని పనులు చేస్తారు. చేయవలసిన పనులను విడుస్తారు. పనికాక ముందే ఆలోచనను బయటపెడతారు. అందువలన మత్తెక్కించే వాటిని తాగకూడదు. విద్యామదం, ధనమదం, వంశమదం, ఈ మూడూ పొగరుబోతు జనులకు మదా లౌతాయి. ఈ మూడే సజ్జనులకు దమా (మనస్సును అదుపు చేయు సాధనాలు) లౌతాయి. ఒకప్పుడు ఏదో పనికై మంచివారు దుర్జనులను సాయమడుగుతారు. దానివల్ల ఏమాత్రం సజ్జనులకు ఉపకారం జరగకపోయినా చెడ్డవాళ్ళు, (చెడ్డవారుగా ప్రసిద్ధమైన) తమను మంచివారుగా భావిస్తారు. బుద్ధి (ఆత్మ) మంతులకు మంచివారు దిక్కు. మంచివారే మంచివారికి గతి. చెడ్డవారికీ మంచి వారే దిక్కు. చెడ్డవారు మాత్రం మంచివారికి దిక్కు కానేకారు. చక్కని దుస్తులు గలవాడు సభలో జయించి రాణిస్తాడు. గోవులు కలవాడు తిండి ఆశను జయిస్తాడు. వాహనం కలవాడు మార్గాన్ని జయిస్తాడు. సత్ప్రవర్తన కలవాడు సర్వమూ గెలుస్తాడు.

వ్యక్తికి శీలం (సత్ప్రవర్తన) చాలా ముఖ్యమైంది. ఈ లోకంలో అది లేని వాడికి జీవితంతో, డబ్బుతో, బంధువులతో ప్రయోజనమే లేదు. భరతవంశోత్తమా! ధనవంతుల భోజనంలో మాంసం ప్రధానమైంది. మధ్యతరగతి వారి భోజనంలో పాలు, నెయ్యి మొదలైనవి, దరిద్రుల భోజనంలో నూనె ప్రాధాన్యం వహిస్తాయి. పేదవాళ్ళెప్పుడూ రుచికరమైన భోజనమే చేస్తూంటారు. ఆకలి రుచిని పుట్టిస్తుంది. అటువంటి ఆకలి ధనవంతులకు లభించటం చాలా కష్టం.

రాజా! సాధారణంగా లోకంలో ధనవంతులకు తినే శక్తి ఉండదు. దరిద్రులకు కట్టెలు కూడా జీర్ణమౌతాయి. మానవులలో అధములకు బ్రతుకు తెరువులేకపోతే భయం కలుగుతుంది. మధ్యములకు చావువల్ల భయం కలుగుతుంది. ఉత్తములకు అవమానం వల్ల ఎంతో భయం కలుగుతుంది. త్రాగుడు వల్ల మదం కలుగుతుంది. మదాలలో చాలా నిందించ తగ్గది ఐశ్వర్యమదం. ఐశ్వర్యమదంతో మత్తెక్కినవాడు పతనమైనాక గాని తెలుసుకోలేడు. గ్రహాలచేత నక్షత్రాల్లాగా, అదుపులేక విషయాల్లో తిరిగే ఇంద్రియాలచేత ఈ లోకం కాల్చబడుతుంది. తనతో పాటు పుట్టి తనను వశపరచుకొనే పంచేంద్రియాలనూ జయించని వానికి శుక్లపక్షంలో చంద్రుని వలె ఆపదలు వృద్ధిచెందుతాయి. ఇంద్రియాలనూ, మనసునూ గెలవక మంత్రులను

జయించాలనుకొనేవాడూ, మంత్రులను జయించకుండా శత్రువులను జయించా లనుకొనేవాడూ అవశుడై భ్రష్టుడవుతాడు. మొదట ఇంద్రియాలనూ, మనస్సునూ శత్రువుగా తలచి జయించినవాడు తరువాత మంత్రులను, శత్రువులను జయించాలనుకొంటే, ఆ కోరిక వ్యర్థం కాదు. ఇంద్రియాలను అదుపు చేసుకొన్న వాణ్ణి, మనస్సును గెలిచినవాణ్ణి, విరుద్ధ కార్యాలు చేసేవారిని దండించే వాణ్ణి, పరీక్షించి పనులు చేసేవాణ్ణి, పరిస్థితులకు మారని ధీరుని లక్ష్మి (సంపద) వదలకుండా సేవిస్తుంది.

రాజా! మనుష్యుడి శరీరం రథం. ఆత్మ (బుద్ధి) సారథి. ఆ రథానికి గుర్రాలు ఇంద్రియాలు. జాగరూకతతో నిపుణుడైన ధీరుడు తనకు వశమైన ఆ గుర్రాలతో రథికుడి వలె సుఖంగా ప్రయాణిస్తాడు. శిక్షణపొందని, అదుపులోకి రాని గుర్రాలు మూర్ఖుడైన సారథిని మార్గమధ్యంలో కూలద్రోసినట్లు అదుపుచేయబడని ఈ ఇంద్రియాలు, మనస్సూ మానవుని చంపివేయగలవు. ఇంద్రియాలపై అదుపులేని మూర్ఖుడు అర్థంనుండి అనర్థాన్ని, అనర్థంనుండి ప్రయోజనాన్ని చూస్తూ ఎంతో దుఃఖాన్ని సుఖంగా తలుస్తాడు. ధర్మాన్ని, అర్థాన్ని విడిచి ఇంద్రియాలకు లొంగిపోయినవాడు త్వరలో సంపద, ప్రాణం, డబ్బు, భార్య - వీనిని కోల్పోతాడు. ఎంత ధనవంతు డయినా ఇంద్రియాలపై పట్టు లేనివాడు, ఇంద్రియాలపై అదుపులేని కారణంగా ఐశ్వర్యం నుండి భ్రష్టు డౌతాడు. అదుపుగల మనస్సు, బుద్ధి, ఇంద్రియాలతో, తనకు తానుగా తన ఆత్మను పొందాలి. తనకు తానే చుట్టం. తనకు తానే శత్రువు. బుద్ధి చేత ఆత్మను జయిస్తే, అతడికి ఆత్మయే బంధువు. అదుపు ఉంటే ఆత్మే బంధువు, అదుపు లేకపోతే ఆత్మే శత్రువు. రాజా! రెండు పెద్దచేపలు సన్నని చిల్లులు గల వలలో పడి దానిని ఎలా కొరుకుతాయో, కామక్రోధాలు రెండూ అలాగే (అదుపు చెయ్యబడక) వివేకాన్ని లోపింప చేస్తాయి. (కామక్రోధాలు చేపలవలె శత్రువులు - కాని అవి వలలో పడినపుడు మిత్రభావంతో కలిసి వలను కొరుకుతాయి. - అలాగే కామక్రోధాలు రెండూ కలిసి వివేకాన్ని కొరికివేస్తాయి). ఈ లోకంలో ధర్మాన్ని, అర్థాన్ని చక్కగా గుర్తించి విజయానికి కావలసిన సామగ్రిని సేకరించుకున్న వాడెప్పుడూ సుఖంగా అభివృద్ధి చెందుతాడు.

మనస్సుకు ప్రతిరూపాలైన ఐదు ఇంద్రియా లనే లోపలి శత్రువులను గెలవకుండా,

ఇతర శత్రువుల్ని జయించా లనుకొనేవాడిని శత్రువులు అణగద్రొక్కేస్తారు. ఇంద్రియాలపై అదుపులేక రాజభోగాలతో రాజులు, తమ కర్మలచేత బంధింపబడి కనిపిస్తున్నారు గదా! పాపపు పనులు చేసే వాళ్ళతో కలియడం వల్ల పాపం చెయ్యనివారికి, చేసిన వారితో సమానమైన శిక్షే పడుతోంది. కలయిక చేత ఎండుకట్టెతో తడికట్టె కూడా కాల్చబడుతుంది. అందువల్ల పాపులతో చెలిమి చెయ్యకూడదు. (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధా లనే) ఐదు విషయాలను ప్రయోజనాలుగా చేసుకొన్న తన ఐదుగురు శత్రువులను (ఇంద్రియాలను) మోహంతో అదుపు చేసుకోని మనిషిని ఆపద మింగేస్తుంది. 1) అసూయ లేకపోవడం, 2) సరళ స్వభావం, 3) పవిత్రత, 4) తృప్తి, 5) ప్రియంగా మాట్లాడటం, 6) ఇంద్రియాల నణచుకోవటం, 7) నిజం పలకటం, 8) చంచలత లేకపోవటం అనేవి (ఎనిమిది) దురాత్ములకు కలగవు. భరతవంశీయుడా! ఆత్మజ్ఞానం, స్థిరత్వం, ఓర్పు, ధర్మ పరాయణత్వం, మాటను రక్షించుకోవటం, దానం చెయ్యటం అధములల్లో ఉండవు. మూర్ఖులు పండితులను తిట్లతో, నిందలతో హింసిస్తూ ఉంటారు. నిందించే వాడు పాపాన్ని మూటగట్టుకొంటాడు. క్షమించే వాడు పాపంనుండి విముక్తు డౌతాడు. చెడ్డవారికి హింసయే బలం. రాజులకు బలం (అపరాధులకు) తగిన శిక్ష విధించటం. స్త్రీలకు బలం సేవ చెయ్యటం. గుణవంతులకు బలం సహనం.

రాజా! మాటను అదుపు చేసుకోవటం చాలా కష్ట మనిపిస్తోంది. అర్థవంతంగా, చమత్కారంగా ఎక్కువ మాట్లాడటం సాధ్యం కాదు. రాజా ! చక్కగా మాట్లాడిన మాట అనేక విధాల శుభాన్ని చేకూరుస్తుంది. ఆ మాటే చెడుగా పలికితే అనర్థాలకు దారితీస్తుంది. బాణాలతో, గొడ్డలితో నరుకబడ్డ వనం మళ్లీ మొలకెత్తుతుంది కాని పరుషవాక్కుల గాయం మానదు. కర్ణి, నాలీక, నారాచాలనే బాణాల్ని శరీరం నుండి బయటకు లాగగలుగుతారు కాని మాట అనే బాణం బయటకు లాగటానికి కుదరదు. అది హృదయంలో ఇరుక్కొంటుంది గదా ! మాట లనే బాణాలు నోటినుండి వెలువడుతాయి. అవి ఇతరుల మర్మస్థానాలలో గ్రుచ్చుకొంటాయి. గ్రుచ్చుకొన్నవాడు రాత్రింబవళ్ళు కుమిలిపోతాడు. అందుచేత వాటిని పండితుడు ఇతరులపై ప్రయోగించరాదు. దేవతలు అవమానం కలిగించా లనుకొన్నవాడి బుద్ధిని క్రిందికి లాగేస్తారు - అపుడు వాడు నీచమైన పనుల మీద దృష్టి నిలుపుతాడు. వినాశం దాపురించినప్పుడు, బుద్ధి పాడై పోయి, న్యాయంలా అనిపించే అన్యాయం హృదయంలోంచి

తొలగిపోదు. భరతవంశోత్తమా! నీకొడుకుల బుద్ధి పాండవుల మీద విరోధంతో నిండి ఉంది. వారిని సరిగా గుర్తించలేకపోతున్నావు. ధృతరాష్ట్రా! యుధిష్ఠిరుడు రాజలక్షణాలతో నిండినవాడు, మూడు లోకాలకు రాజు కావలసినవాడు నీ ఆజ్ఞను పాటించే వాడు. అతడు రాజగుగాక! అతడు ధర్మార్థాల యథార్థ స్వరూపం తెలిసినవాడు, తేజస్సుతో, బుద్ధితో కూడినవాడు, అదృష్టవంతుడు, నీకొడుకులందర్నీ మించినవాడు. రాజేంద్రా! ధర్మాన్ని ఆచరించేవాళ్లలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజు దయ, క్రూరస్వభావం లేకపోవటం, నీ పట్ల గౌరవం- వీటి వల్ల ఎన్నో కష్టాల్ని ఓర్చుకొంటున్నాడు."

35. విదురుడు నీతి నుపదేశించుట.

"పుణ్యజలా లన్నింటిలో స్నానం చెయ్యడం, అన్ని ప్రాణులపట్ల సరళంగా ప్రవర్తించడం, ఈ రెండూ సమానమే అయినా అందరిపట్ల సరళ భావం విశిష్టమైంది. ప్రభూ! కుమారుల విషయంలో ఎల్లప్పుడూ సమభావాన్ని పాటించు. ఈ లోకంలో కీర్తిని పొంది, మరణించిన తర్వాత స్వర్గాన్ని పొందగలుగుతావు. పురుషశ్రేష్ఠా! మనిషియొక్క కీర్తి ఈ లోకంలో కొనియాడబడినంత కాలం అతడు స్వర్గలోకంలో గొప్పగా ఉంటాడు.

పూర్వం కేశినికోసం సుధన్వునితో విరోచనుడికి జరిగిన సంభాషణను, ఈ విషయంలో ఉదాహరణగా చెపుతున్నారు. సాటిలేని అందం కల కేశిని అనే కన్య విశిష్టమైన వ్యక్తిని భర్తగా పొందాలని స్వయంవరంలో నిలిచింది. అప్పుడక్కడికి ఆమెను పొందాలనే కోరికతో విరోచను డనే రాక్షసుడు వచ్చాడు. అపుడామె రాక్షసునితో ఇలా అంది. "విరోచనా! బ్రాహ్మణులు శ్రేష్ఠులా? రాక్షసులు శ్రేష్ఠులా? అయితే, ఏ కారణం చేత సుధన్వుడు నా పానుపు ఎక్కకూడదు?". విరోచనుడు చెప్తున్నాడు. "కేశినీ! మేం ప్రజాపతి సంతానం కాబట్టి శ్రేష్ఠులం, అందరికన్న ఉత్తములం. ఈలోకాలన్నీ మావి కదా! (మాముందు) దేవతలెవరు? బ్రాహ్మణులెవరు?" అపుడు కేశిని అన్నది- "విరోచనా! మనమిద్దరం ఇక్కడే ఎదురుచూద్దాం. సుధన్వుడు రేపు ప్రొద్దుటే వస్తాడు. ఒక చోట కలిసిన మీ ఇద్దర్నీ చూస్తాను." వెంటనే విరోచనుడు "పిరికిదానా! నీ వన్నట్లే చేస్తాను. ఒకే చోట కలిసిన సుధన్వునీ, నన్నూ రేపు ప్రొద్దున చూద్దువుగానిలే." అన్నాడు. విదురుడు ఇలా అన్నాడు. రాజశ్రేష్ఠా! ప్రభూ! రాత్రి

గడిచి సూర్యుడు ఉదయించిన పిమ్మట కేశిని, విరోచనుడూ ఉన్న చోటుకు సుధన్వుడు వచ్చాడు. సుధన్వుడు విరోచనునీ, కేశినినీ చేరుకొన్నాడు. వచ్చిన బ్రాహ్మణుని చూసి కేశిని లేచి ఎదురుగా వెళ్లి ఆసనాన్నీ, కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు, పూజా ద్రవ్యాలు సమర్పించింది.

సుధన్వుడు ఇలా అన్నాడు. "ప్రహ్లాదకుమారా! నీకు శ్రేష్ఠమైన బంగారు ఆసనాన్ని అమరుస్తాను. సమానుడ ననే భావంతో నీతో కలిసి కూర్చోను." విరోచను డన్నాడు. "సుధన్వా! నీకు చెక్కపీట గాని దర్భాసనం గాని సరిపోతుంది. నాతో కలసి సమానంగా ఆసనం మీద కూర్చోటానికి నీవు తగవు." సుధన్వుడన్నాడు. - "తండ్రీకొడుకులు, ఇద్దరు బ్రాహ్మణులు, ఇద్దరు క్షత్రియులు, ఇద్దరు ముసలి వైశ్యులు, ఇద్దరు ముసలి శూద్రులు కలసి కూర్చోవచ్చు. ఇతరులు ఇద్దరు కలిసి కూర్చోకూడదు. ఆసనంపై కూర్చున్న నన్ను నీ తండ్రి క్రింద కూర్చొని సేవిస్తాడు. పసివాడివి ఇంట్లో సుఖంగా పెరిగావు. ఈ విషయం కొంచెం కూడా నువ్వెరగవు. సుధన్వా! మారాక్షసుల దగ్గరున్న సేన, గో హయాది ధనాన్ని అంతా పందెం పెడుతున్నాను. మన మిద్దరం వెళ్లి ఈ విషయం తెలిసిన వారిని "మా యిద్దరిలో ఎవరు గొప్ప" అని అడుగుదాం." సుధన్వుడన్నాడు.- "విరోచనా! బంగారం, ఆవులు, గుర్రాలు, నీకే ఉండనీ. మన ఇద్దరి ప్రాణాల్ని పందెంగా పెట్టి తెలిసిన వారి నడుగుదాం." విరోచనుడు అన్నాడు.- "మన మిద్దరం ప్రాణాలను పందెం పెట్టిన తర్వాత ఎక్కడకు వెడదాం? నేనా దేవతల దగ్గరికి, ఎవరో మనుష్యుల దగ్గరికి ఎప్పటికీ వెళ్ళను." సుధన్వుడన్నాడు.- "ప్రాణాల్ని పందెం పెట్టిన మన మిద్దరం నీ తండ్రి దగ్గరికి వెడదాం. ఆ ప్రహ్లాదుడు కొడుకుకోసం కూడా అబద్ధం చెప్పడు."

విరోచనుడన్నాడు - "తండ్రీ ప్రహ్లాదా! నాకు సుధన్వుడితో స్నేహం లేదు. మేమిద్దరం ప్రాణాలను పందెంగా పెట్టుకున్నాం. నిజం (తెలుసుకోవాలని) అడుగుతున్నాను. నేను వేసిన ప్రశ్నకు అబద్ధం చెప్పకు." ప్రహ్లాదుడన్నాడు "సుధన్వుడికోసం నీళ్ళను, మధుపర్కాన్ని తీసుకురండి. బ్రహ్మస్వరూపా! పూజింపతగిన వాడివి. బలిసిన తెల్లని ఆవు నీకోసం (దానమివ్వటానికి) సిద్ధం చెయ్యబడింది." సుధన్వుడడిగాడు - "ప్రహ్లాదా! నాకు నీళ్ళు, మధుపర్కం దారిలోనే అందాయి. నీవు నేనడిగే ప్రశ్నకు నిజంగా సమాధానం చెప్పు. బ్రాహ్మణులు శ్రేష్ఠులా? లేక విరోచనుడా?" ప్రహ్లాదుడు

చెప్పాడు "బ్రహ్మస్వరూపా! నాకు ఒక్కడే కొడుకు. నీవు స్వయంగా ఇక్కడ ఉన్నావు. తగవులాడుకొంటున్న మీఇద్దరిప్రశ్నకు నాలాంటివాడు ఎలా సమాధానం చెప్పగలడు?" సుధన్వుడన్నాడు - "బుద్ధిమంతుడా ! ఆవునూ లేదా ఇష్టమైన సంపదను నీ కన్న కొడుక్కి ఇచ్చుకో. కాని తగవు లాడుకొంటున్న మా ఇద్దరికి నీవు నిజమే చెప్పాలి." ప్రహ్లాదుడడిగాడు "సుధన్వా! ఒకవేళ నిజమో, అబద్ధమో ఏదీ చెప్పడనుకో - అలా చెడుగా చెప్పేవాడు ఏమౌతాడో అడుగుతున్నాను." సుధన్వుడు చెప్పాడు - "(వేరొక స్త్రీ మోజులో పడ్డ) భర్త యొక్క నిరాదరణకు గురియైన స్త్రీ, జూదంలో ఓడిపోయినవాడు, బరువు మోసి జ్వరం వచ్చినవాడూ పొందే వేదనాభరితమైన రాత్రిని దుర్వక్త, అసత్యవాది పొందుతాడు. తప్పుడు సాక్ష్యం చెప్పేవాడు నగరంలో నిర్బంధించబడి, వెలుపల వాకిలి వద్ద ఆకలి బాధతో నిలిచి శత్రువుల్ని చూసే వాని దురవస్థను పొందుతాడు. పశువులకోసం అబద్ధమాడేవాడు ఐదుతరాలను, ఆవులకోసం అబద్ధమాడేవాడు పదితరాలను, గుర్రాలకోసం అబద్ధం ఆడేవాడు వంద తరాలను, మనుష్యులకోసం అబద్ధమాడేవాడు వెయ్యి తరాలను నరకంలో పడేస్తాడు. బంగారం కోసం అబద్ధమాడేవాడు పుట్టినవాళ్ళను, పుట్టనివాళ్ళను కూడా నరకంలో పడేస్తాడు. భూమికోసం అబద్ధమాడేవాడు అంతా నాశనం చేసుకొంటాడు. (కేశిని భూమి లాంటిది). భూమికోసం అబద్ధం చెప్పకు."

ప్రహ్లాదుడు చెప్పాడు- "విరోచనా! అంగిరుడు నాకంటె గొప్పవాడు. నీ కన్న సుధన్వుడు గొప్పవాడు. ఇతని తల్లి నీ తల్లికన్న గొప్పది. కాబట్టి నీవు సుధన్వుడికి ఓడిపోయావు. విరోచనా! నీ ప్రాణాలకే సుధన్వుడు అధిపతి. సుధన్వా! నీవిస్తే విరోచనుని తిరిగి పొందాలనుకొంటున్నాను." సుధన్వుడన్నాడు - "ప్రహ్లాదా! నీవు ధర్మాన్ని వరించావు. కోరికలకు లోనై అబద్ధం చెప్పలేదు. అందువల్ల దుర్లభుడయిన కొడుకును మళ్ళీ నీకు ఇస్తున్నాను. ప్రహ్లాదా! నీకు నేనిచ్చిన కుమారు డీ విరోచనుడు కుమారి కేశిని సమక్షంలో నాపాదాలను కడగాలి." విదురుడు చెప్పాడు - "కాబట్టి రాజేంద్రా! భూమికోసం అబద్ధం చెప్పకు. కొడుకు కోసం (మంచిమాట చెప్పటం మాని) కొడుకులు, మంత్రులతో కలసి నాశనంకావద్దు.

పశువులకాపరిలాగా కర్ర పట్టుకుని దేవతలు కాపాడరు. రక్షించాలనుకొన్నవాడికి మంచిబుద్ధినిచ్చి (ఇతరుల నుండి) వేరుచేస్తారు. మానవుడు ఎలా మంచి విషయంలో

మనసు లగ్నం చేస్తాడో అతడికి ఆలాగే అన్ని ప్రయోజనాలూ సిద్ధిస్తాయి. ఇందులో సందేహం లేదు. కపటంతో మెలగే మాయావిని వేదాలు పాపం నుండి విడిపించవు. రెక్కలు వచ్చిన పక్షులు గూడు వదలి వెళ్ళినట్లు మరణకాలంలో వేదాలు అతణ్ణి వదలిపోతాయి. కల్లుత్రాగడం, తగవులాడటం, పదిమందితో వైరం, భార్యాభర్తలను విడదీయడం, దాయాదుల మధ్య పొరపొచ్చాలను సృష్టించడం, రాజుతో వైరం, స్త్రీ పురుషుల మధ్య కలహం పెట్టటం, చెడుమార్గంలో ప్రవర్తించటం - వీటిని విడువ తగినవిగా చెప్తారు. చేతిరేఖలు చూసి జోస్యం చెప్పేవాడు, దొంగిలించిన సొత్తుతో వ్యాపారం చేసేవాడు, పుల్లమొదలైనవాటితో మోసగించి జూదమాడేవాడు, వైద్యుడు, శత్రువు, స్నేహితుడు, నాట్యమాడేవాడు ఈ ఏడుగురిని సాక్ష్యానికి ఉపయోగించుకోరాదు. ఆదరంతో అగ్నిహోత్రాన్ని అనుష్ఠించటం, ఆదరంతో మౌనాన్ని వహించటం, ఆదరంతో వేదాధ్యయనం, ఆదరంతో యజ్ఞాలను అనుష్ఠించటం - ఈ నాలుగు అభయాన్ని కలిగిస్తాయి (భయాన్ని దూరం చేస్తాయి). (ఆదరం లేక) శ్రద్ధగా అనుష్ఠించక పోతే భయాన్ని కలుగచేస్తాయి. ఇంటికి నిప్పుపెట్టేవాడు, విషంపెట్టేవాడు, అక్రమసంతానం యొక్క సంపాదన తినేవాడు, సోమ రసాన్ని అమ్మేవాడు, ఆయుధాలు తయారుచేసేవాడు, చాడీలు చెప్పేవాడు, స్నేహితుడికి ద్రోహం చేసేవాడు, పర భార్యాలోలుడు, కడుపులోని పిండాన్ని చంపేవాడు, గురువు భార్యతో గడిపేవాడు, బ్రాహ్మణుడై ఉండి మద్యపానం చేసేవాడు, ఎంతో దుడుకు స్వభావం కలవాడు, కాకిలాంటివాడు (కాకి ముక్కుతో పుండును పొడుచునట్లు, బాధలో ఉన్నవారిని బాధించేవాడు), పరలోకం లేదనేవాడు, వేదాలను నిందించేవాడు, గ్రామ పురోహితుడు (సదాచారం లేక అందరికీ పౌరోహిత్యం చేయించేవాడు), వ్రాత్యుడు (సకాలంలో ఉపనయన సంస్కారం జరుగనివాడు), పాపపు పనివల్ల లభించే దానితో బ్రతికేవాడు, రక్షింపగల శక్తి ఉన్నా శరణన్నవాడిని చంపేవాడు- వీరంతా బ్రహ్మహత్యచేసిన వాడితో సమానులు. చీకటిలో గడ్డిమంటతో వస్తు స్వరూపం తెలుస్తుంది. శీలంతో/ ప్రవర్తనతో ధర్మం తెలుస్తుంది. వ్యవహారం చేత మంచితనం బయట పడుతుంది. భయ సందర్భాల్లో శూరుడు తెలుస్తాడు. కష్టాల్లో ధీరుడు తెలుస్తాడు. మిత్రులు - శత్రువులూ ఆపదల్లో బయట పడతారు. ముసలితనం అందాన్ని హరిస్తుంది. ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాలనూ, అసూయ ధర్మాచరణాన్నీ,

క్రోధం సంపదను, నీచసేవ శీలాన్ని, కామం సిగ్గునూ, అభిమానం అన్నిటినీ హరిస్తుంది.

శుభప్రవర్తన నుండి సంపద పుడుతుంది. ఆ సంపద నేర్పుతో పెరుగుతుంది. సామర్థ్యం వల్ల వేళ్ళూనుతుంది. సంయమనం వల్ల స్థిర పడుతుంది. ఎనిమిదిగుణాలు మానవుని ప్రకాశింపచేస్తాయి. అవి ఇవి 1. ప్రజ్ఞ, 2. సద్వంశంలో జన్మించడం, 3. ఇంద్రియ నిగ్రహం, 4. చదువు, 5. పరాక్రమం, 6. మితంగా మాట్లాడటం, 7. యథాశక్తిగా దానం చేయడం, 8. కృతజ్ఞత కలిగిఉండటం. నాయనా! ఈ ఎనిమిది మహాగుణాలనూ ఒక్క సుగుణం వెంటనే ఆశ్రయిస్తుంది. అది రాజసత్కారం – రాజా సత్కరిస్తే ఈ గుణాలన్నీ వెలుగు చూస్తాయి.బాగా రాణిస్తాయి. రాజా! ఇపుడు చెప్పబోయే ఈ ఎనిమిది గుణాలూ ఈమర్త్యలోకంలోనే స్వర్గం చూపిస్తాయి. వీటిలో నాల్గు సజ్జనులను అవే అనుసరిస్తాయి. మిగిలిన నాల్గింటిని సజ్జనులు అనుసరిస్తారు. యజ్ఞం, దానం, అధ్యయనం, తపస్సు – ఈ నాలుగూ సజ్జనులను అనుసరిస్తాయి. నిగ్రహం, సత్యం, ఆర్జవం, దయ– ఈ నాలుగు సజ్జనులు ప్రయత్నంతో అనుసరిస్తారు / సాధిస్తారు. యజ్ఞం, అధ్యయనం, దానం, తపస్సు, సత్యం, సహనం, జాలి, లోభం లేకపోవడం– ఈ ఎనిమిదీ ధర్మసాధనకు లక్షణాలు, మార్గాలు. అందులో మొదటి నాల్గింటిని కొంతమంది ఆడంబరంకోసం ఆచరిస్తారు. కాని చివరినాల్గు గుణాలు మాత్రం సద్బుద్ధిలేని వారి దగ్గర ఉండవు.

వృద్ధులు లేని సభ సభకాదు. ధర్మం చెప్పకపోతే వారు వృద్ధులేకారు. సత్యం లేకపోతే అది ధర్మం కాదు. కపటంతో కూడిన సత్యం సత్యమూ కాదు. సత్యం, రూపం, అధ్యయనం, ఉపాసన, ఉన్నతవంశంలో పుట్టడం, సత్ప్రవర్తన, బలం, ధనం, పరాక్రమం, యుక్తియుక్తంగా మాట్లాడటం – ఈ పదీ స్వర్గానికి నిచ్చెనలు. పాపాసక్తి కల మానవుడు పాపమే చేస్తాడు. పాప ఫలితాన్నే అనుభవిస్తాడు. పుణ్యాసక్తి కల మానవుడు పుణ్యమే చేసి దాని ఉత్తమ ఫలం పొందుతాడు. అందుచేత నియమప్రవర్తన కల మానవుడు పాపం చేయకూడదు. ఎందుచేతనంటే పాపకృత్యం మనిషి యొక్క తెలివిని నశింపచేస్తుంది. పలుమారులు అదే మళ్ళీ మళ్ళీ చేస్తాడు. అలా ప్రజ్ఞ పోగొట్టుకుని నిత్యమూ పాప కార్యమే చేస్తూ ఉంటాడు. పుణ్యకార్యం తెలివితేటల్ని పెంచుతుంది. నిత్యమూ పుణ్యకార్యాలు చేసేవాని ప్రతిభ పెరుగుతూ ఉంటుంది. దానితో నిత్యమూ అదే పని మళ్ళీ మళ్ళీ చేస్తాడు. పుణ్యాసక్తి కలవాడు పుణ్యకార్యాలు

చేస్తూ పుణ్యస్థానమయిన స్వర్గం పొందుతాడు. అందుచేత మానవుడు సతతమూ ఏకాగ్రతతో పుణ్యమే చేయాలి. అసూయ కలవాడు, మర్మస్థానాల్లో కొట్టేవాడు, నిష్ఠురంగా మాట్లాడేవాడు, కలహాలు పెట్టేవాడు, మోసగాడు - వీళ్లు పాపం చేస్తూ ఎంతో దుఃఖం పొందుతూ ఉంటారు.

అసూయలేనివాడు, ప్రజ్ఞ కలవాడు, సదా సత్కృత్యాలు చేసేవాడు -అందరికీ ఇష్టుడై ఎంతో సుఖాన్ని పొందుతాడు. ప్రజ్ఞ కలవారినుండి ప్రజ్ఞనే తీసుకునేవాడు పండితుడు- అతడు ఆ ప్రజ్ఞతో ధర్మార్థాలను సాధించే సుఖం పెంచుకొంటాడు. రాత్రిపూట సుఖపడటం కోసం పగటి పూటనే ప్రయత్నించాలి. వర్షాకాలంలో సుఖపడటం కోసం మిగిలిన ఎనిమిది నెలలూ కష్టించాలి. ముసలితనంలో సుఖపడటం కోసం వయసులో పరిశ్రమించాలి. మరణానంతరం సుఖపడటం కోసం యావజ్జీవం పరిశ్రమ చేయాలి. చక్కగా జీర్ణమయిన అన్నాన్ని మంచిదని ప్రశంసిస్తారు. యౌవనం గడచిన భార్యను అంతా ప్రశంసిస్తారు. యుద్ధంలో జయించిన వీరుని అంతా శ్లాఘిస్తారు. పారంగతుడై తత్త్వమెరిగిన తపస్విని ప్రశంసిస్తారు. అధర్మ మార్గంలో సంపాదించిన ధనంతో దోషం దాచుదామన్నా దాగదు సరిగదా మిగిలిన తప్పు కూడా బయటపడుతుంది. మనసు అదుపులో ఉన్నవాడిని గురువు శాసిస్తాడు. దుర్మార్గులను రాజు శాసిస్తాడు. రహస్యంగా పాపాలు చేసేవాడిని యముడు శాసిస్తాడు.

ఋషులు, నదులు, వంశాలు, మహాత్ములు, స్త్రీల దుశ్చరితలు - వీని పుట్టుకలు ఎవరికీ తెలియవు. ద్విజ పూజారతుడైనవాడు, దాత, జ్ఞాతులను వంచింపనివాడు, సత్ప్రవర్తన కలవాడు అయిన క్షత్రియుడు చిరకాలం రాజ్యం పాలిస్తాడు. శూరుడు, చక్కని విద్యలు నేర్చినవాడు, సేవించే నేర్పుకలవాడు - వీరు ముగ్గురూ భూమి మీద బంగారు పూలను పండిస్తారు. మానవుల కృత్యాలు నాలుగు రకాలు. అందులో బుద్ధితో చేసే పనులు శ్రేష్ఠాలు, బాహుబలంతో చేసే పనులు మధ్యమాలు- పిక్కలతో కాళ్లతో చేసేవి అధమాలు- మోత మోసేవి (బరువులుమోయడం మొదలయినవి) అధమాధమాలు. దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు-వీరిమీద ఐశ్వర్యమంతా పెట్టి నీవెట్లా వైభవం పొందాలని భావిస్తున్నావు? పాండవు లయితే సర్వసద్గుణాలూ కలవారు. నీ పట్ల వారు తండ్రివలె ప్రవర్తిస్తున్నారు. అందుచేత నీవు వారి పట్ల పుత్రభావంతో ప్రవర్తించు."

36. విదురుని నీతి వాక్యములు.

"ఈ సందర్భంలో పూర్వం జరిగిన ఒక కథ చెపుతారు. అది ఆత్రేయునికీ, సాధ్యులకూ జరిగిన సంవాదం అని విన్నాం. మహాజ్ఞాని, నిష్ఠాపరుడూ అయిన ఆత్రేయ మహర్షి సన్యాసిరూపంలో తిరుగుతూ ఉంటే ఒకసారి సాధ్యులు ఆయనను ఇలా ప్రశ్నించారు. "మహర్షీ! మేము సాధ్యులం. దేవజాతి మాది. మిమ్మల్ని చూసి మేము గుర్తుపట్టలేకపోతున్నాం. మీరు వేదవిజ్ఞానం కల ధీరులు, బుద్ధిమంతులు. విజ్ఞాన పూర్వక మయిన మంచిమాట ఏదైనా చెప్పండి." పరమహంస ఇలా చెప్పాడు. "దేవతలారా! ఇది కర్తవ్యం అని నేను గురువుల వల్ల విన్నాను. ధైర్యం, శమం, సత్యం, ధర్మం వీనిని నిరంతరంగా పాటించాలి. హృదయంలోని ముడి విప్పుకొని అప్రియాన్ని కూడా ఆత్మసమంగా లాగుకొని తీసుకొని రావాలి. తనను ఇతరులు నిందిస్తున్నా తాను వారిని నిందించ కూడదు. అలా సహించే వానిలోని కోపమే ఆ తిట్టేవానిని దహించి వేస్తుంది. అంతేకాదు. ఆ తిట్టేవాని పుణ్యం ఈ సహనశీలికి సంక్రమిస్తుంది. ఇతరులను నిందింపకూడదు.అవమానింపరాదు. మిత్రద్రోహం చేయకూడదు. నీచుని సేవింపరాదు. అభిమానం పనికిరాదు. నీచప్రవర్తన కూడదు. కోపంతో పరుషవాక్కులు మాట్లాడరాదు. పరుషవాక్కులు మానవుల మర్మస్థానాలనూ, ఎముకల్ని, హృదయాన్ని, ప్రాణాలనూ దహించివేస్తాయి. అందుచేత అలా దహించివేసే పరుషవాక్కులను ధర్మపరుడు నిత్యమూ విడిచి పెట్టాలి. దరిచేరనీయరాదు. మర్మచ్ఛేదకంగా పరుషవాక్కులు పలికే వాడిని, మాటల ఈటెలతో మనుష్యుల్ని పొడిచేవాడిని, నాలుకమీద జ్యేష్ఠాదేవిని ధరించిన పరమ దరిద్రుడిగా భావించాలి. అగ్ని లాగా, సూర్యుని లాగా మండిపోయే వాడియైన మాటల బాణాలతో కొడుతూ ఉన్నా,తాను ఆ దెబ్బలు తింటూనే, కాలిపోతూనే పండితుడు "నా పుణ్యం ఫలింపజేస్తున్నా"డని భావిస్తాడు. మానవుడు సజ్జనుని కాని, దుర్జనుని కాని, తపస్విని కాని, దొంగను కాని -ఎవరిని సేవిస్తే వారికే వశుడవుతాడు. వస్త్రానికి రంగు అంటినట్లు వారి భావం అంటుకుపోతుంది. సంక్రమిస్తుంది.

హద్దు మీరి మాట్లాడరాదు. మాట్లాడింపరాదు. ఎదుటివాడు కొట్టకుండా కొట్టకూడదు. కొట్టింపకూడదు. పాపం చేసిన (ముందుగా కొట్టిన) వాడిని కూడ కొట్టాలని అనుకోని వాని రాకను దేవతలు కూడ అభిలషిస్తారు. మాట్లాడటం

కంటె మౌనం మేలు - మాట్లాడితే సత్యమే మాట్లాడటం రెట్టింపు మేలు. ఆ సత్యం ప్రియంగా మాట్లాడటం మూడు రెట్లు మేలు. ఆ సత్యమూ ప్రియమూ ధర్మంతో కలిసిఉంటే అది నాల్గురెట్లు మేలు. మానవుడు ఎటువంటి వారితో సహవాసరి చేస్తాడో అటువంటి వాడే అవుతాడు. ఎటువంటి వారిని సేవిస్తాడో అటువంటి వాడే అవుతాడు. ఎటువంటివాడు కావాలని కోరుకొంటాడో అటువంటి వాడే అవుతాడు. మానవుడు దేని నుండి మరలుతాడో దానినుండి విముక్తుడవుతాడు. అన్నిటినుండి నివృత్తి పొందటంవల్లనే నలుసంతైనా దుఃఖం తెలియదు. తాను ఓడిపోడు. ఇతరులను ఓడించా లనుకోడు. విరోధం పెట్టుకోడు. ప్రతీకారం చెయ్యడు. నిందా స్తుతులను సమంగా స్వీకరిస్తాడు. అటువంటివాడు దుఃఖించడు, సంతోషించడు. ఉత్తమ పురుషుడు అందరికీ అభ్యుదయాన్ని కోరుతాడు. ఎవరికీ కీడు తలపెట్టడు. సత్యం పలుకుతాడు. మృదుస్వభావంతో ఇంద్రియ నిగ్రహం కలిగిఉంటాడు. మధ్యమ పురుషుడు అప్రయోజకుని బ్రతిమలాడడు. ఇస్తా నన్నది తప్పక ఇస్తాడు. శత్రువు యొక్క లోపాలను తెలుసుకొంటాడు. అధముడు దుష్టంగా శాసిస్తాడు. దెబ్బలు తింటాడు. నిందలు పొందుతాడు. వచ్చినకోపం తగ్గించుకోడు. చేసిన మేలు మరిచి పోతాడు. ఎవరితోనూ స్నేహం చెయ్యడు. తనమీద తనకే నమ్మకం ఉండదు. కనుక ఇతరులు కూడ తనకు శుభం కలిగిస్తారని నమ్మడు. తాను ఎవరికీ ఉపకారం చెయ్యడు కనుక మిత్రులను నిరాకరిస్తాడు. వాడే అధముడు. తన అభ్యుదయాన్ని కోరుకొనేవాడు ఉత్తములనే సేవించాలి. ఆపత్కాలంలో మాత్రం మధ్యములను సేవింపవచ్చు. అధములను మాత్రం సేవింపరాదు. మానవుడు ధనాన్ని కపటద్యూతాదుల వల్ల కూడా పొందవచ్చు. నిరంతర ప్రయత్నం చేత, నేర్పుతో చేసే సేవ చేతకూడా ధనం సంపాదించవచ్చు. కాని చక్కని ప్రశంసను పొందలేడు. ఉత్తమ వంశ సంజాతుల ప్రవర్తనను పొందలేడు." వెంటనే ధృతరాష్ట్రుడిలా ప్రశ్నించాడు. "నిత్యం ధర్మమూ, అర్థమూ కల్గి, చాలా పాండిత్యం కల దేవతలు మహాకులీనులను /ఉత్తమ వర్గీయులను కాంక్షిస్తారట కదా ! విదురా! నిన్ను ఒక ప్రశ్న అడుగుతున్నాను. అసలు మహాకులాలేవి ?" విదురుడిట్లా అన్నాడు. "తపమూ, దమమూ (ఇంద్రియ నిగ్రహం), వేద విజ్ఞానం, యజ్ఞకృత్యములు విధి పూర్వక శుభంకర వివాహాలు, సతతమూ అన్నదానం, సత్ప్రవర్తన అనే ఈ ఏడు గుణాలూ ఉండే వారే మహాకులంవారు. స్థిరమైన సత్ప్రవర్తన

కలవారు, తన్నుచూసి సంతోషించే తల్లితండ్రులు కలవారు, ప్రసన్నహృదయంతో ధర్మం ఆచరించేవారు, తమ వంశంలో విశిష్టమైన కీర్తిని అపేక్షించేవారు, అసత్యాన్ని విడిచిన వారు ఈ అయిదుగురు మహావంశజాతులు.

యజ్ఞాలు చేయకపోవడం వల్లనూ, విధివిధానంగా చేసికొనని వివాహాల వల్లనూ, వేదాన్ని విడిచిపెట్టడం చేతనూ, ధర్మం అతిక్రమించడం చేతనూ సత్కులాలు చెడిపోతాయి. దేవుని సొమ్ము పాడుచేయడం వల్లనూ, బ్రాహ్మణ ధనం దొంగిలించటం వల్లనూ, బ్రాహ్మణుని పట్ల హద్దు మీరడం వల్లనూ సత్కులాలు చెడిపోతాయి. బ్రాహ్మణులను అవమానించడం వల్లనూ, అపనిందల వల్లనూ, న్యాసాన్ని అపహరించడం వల్లనూ కులాలు చెడిపోతాయి. విద్యల చేతను, సత్పురుషుల చేతను,ధనం వల్లనూ వంశాలు పుష్టినొందుతాయి. సత్ప్రవర్తన లేకపోతే వంశాలుగా పరిగణింపబడవు. కొద్దిపాటి సంపదలే ఉన్నా, సత్ప్రవర్తన వదలకపోతే కులాలుగానే పరిగణింపబడతాయి. అంతేకాదు మంచి పేరు తెచ్చుకొంటాయి (సత్కులాలు అనిపించుకొంటాయి). మానవుడు తన నడవడిని ప్రయత్నపూర్వకంగా రక్షించుకోవాలి. ధనం వస్తుంది, పోతుంది. ధనం లేని వాడు క్షీణుడు కాడు. సత్ప్రవర్తనలేనివాడే క్షీణుడు, మృతుడు కూడ. సత్ప్రవర్తన లేని కులాలు గోవుల(విద్యల)తో, కాని పశువులతో కాని, గుర్రాలతో కాని, సస్యసమృద్ధి కల వ్యవసాయంతో కాని మళ్లీ పైకి లేవవు (అభ్యుదయం పొందవు). మన వంశంలో వైరం పెట్టేవాడు ఒక్కడయినా లేకుండుగాక. ఇతరుల సొమ్ము నపహరించే రాజుగాని మంత్రికాని లేకుండు గాక. మిత్రద్రోహి కాని, వంచకుడు కాని,'అబద్దాలకోరు' కాని లేకుండు గాక. అలాగే పితరులకు, దేవతలకు, అతిథులకు పెట్టకుండా ముందే భుజించేవాడు లేకుండు గాక. బ్రాహ్మణులను హింసించేవాడూ, ద్వేషించేవాడూ, మనకృషిని ధ్వంసం చేసేవాడూ మన సభలో ప్రవేశింపకుండును గాక. తృణాలు, భూమి, నీరు, సత్యవాక్కు ఈ నాలుగూ సన్మార్గుల ఇళ్లలో ఎన్నడూ తరిగి పోవు. రాజా ! ధార్మికులయిన పుణ్యాచారుల సత్ప్రవర్తనలు ఎంతో శ్రద్ధతో సత్కరింప దగినవి. రథం చిన్నదయినా పెద్ద బరువు మోస్తుంది. కాని చెట్లు అలా మోయలేవు. అలాగే మహాకుల సంజాతు లయిన వారు పెద్దభారం సహింపగలరు.అలా ఇతరులు మోయలేరు.

తన కోపంతో ఇతరులను భయపెట్టేవాడు మిత్రుడు కాడు. అనుమానంతో

సేవచేసేవాడు మిత్రుడు కాడు. తండ్రిని నమ్మినట్లు నమ్మకం ఉంచదగినవాడే మిత్రుడు. మిగిలిన వారంతా బంధువు లవుతారు కాని మిత్రులు కారు. బంధుత్వం లేకుండానే స్నేహభావంతో ప్రవర్తించే వాడే బంధువు, వాడే మిత్రుడు, వాడే గతి, వాడే చివరికి చేరదగినవాడు. చపల చిత్తుడు, పెద్దలను సేవింపనివాడు, చంచలబుద్ధి కలవాడు అయిన మానవునికి మైత్రి శాశ్వతంగా నిలవదు. నీరు తరిగి పోయిన చెరువు చుట్టూ పైపైని హంసలు తిరిగినట్లు చంచలచిత్తుడై, ఇంద్రియాలకు వశుడై తిరిగే నీచాత్మునికి సంపదలు అంటకుండా చుట్టూ తిరుగుతాయి. ఉన్నట్లుండి కోప్పడతారు. నిష్కారణంగా ప్రసన్నులవుతారు. గాలికి కొట్టుకుపోయే మేఘం లాంటిది దుర్మార్గుల శీలం. మిత్రుల వలన సత్కారాలు పొంది, తమ పనులు నెరవేర్చుకొన్నాక, ఆ మిత్రుల హితం కోరని కృతఘ్నుల శవాలను క్రూరమృగాలు కూడా తినవు. ధనం ఉన్నా లేకపోయినా మిత్రులను తప్పక ఆదరించాలి. ఏ కోరిక లేనివాడు మిత్రుల కలిమిలేములను తెలిసికొనడు.

సంతాపం వలన రూపం నశిస్తుంది. ఏడుపు వలన బలం తగ్గిపోతుంది. జ్ఞానం తరిగిపోతుంది. అంతే కాదు రోగం ప్రబలుతుంది. ఏడుపు వలన కోరినది రాదు. అంతేకాదు శరీరం ఉడికిపోతుంది. శత్రువులు సంతోషిస్తారు. అందుచేత ఏడుపుమీద మనసు పెట్టకు. మానవుడు మరణిస్తాడు. మళ్లీ జన్మిస్తాడు. అలాగే కృశిస్తాడు. పెరుగుతాడు; తాను ఇతరులను యాచిస్తాడు. ఇతరులచేత యాచింపబడతాడు. అలాగే శోకిస్తాడు, ఇతరులు శోకించేటట్లు చేస్తాడు. సుఖ దుఃఖాలు, శుభాశుభాలు, లాభాలాభాలు, అలాగే మరణమూ జీవితమూ ఇవి అందరికీ వంతుల వారీగా వస్తూ ఉంటాయి. అందుచేత ధైర్యం కలవాడు వానికోసం పొంగిపోరాదు, క్రుంగిపోరాదు. మనసు, పంచేంద్రియాలూ చంచలాలు - వీటిలో ఏ యింద్రియం ఏ విషయంలో బాగా ప్రసరిస్తుందో దాని ద్వారా సతతమూ బుద్ధి జారిపోతూ ఉంటుంది. ఎలా అంటే... చిల్లుపడిన కుండలోనుండి నీరు కారిపోయినట్లు.

అపుడు ధృతరాష్ట్రుడిలా అన్నాడు. 'ధర్మరాజు దాగిఉన్న నిప్పు. వానిని నేను రిత్త ఉపచారాలతో ఉడికించాను. తెలివితక్కువ వారయిన నా పుత్రులను యుద్ధంలో చంపివేస్తాడు. ఈ నా పరిస్థితి అంతా భీతితో నిండిఉంది. నా మనస్సు కూడ భయంతో కలత చెందుతోంది. విదురా! అభయప్రదమయిన స్థితిని నాకు చెప్పు.

విదురు డిట్లన్నాడు. "పుణ్యాత్మా ! విద్య, తపస్సు, ఇంద్రియనిగ్రహం, లోభత్యాగం వీనిని మించి యెచ్చటను నీకు శాంతి దొరకదు. మానవుడు బుద్ధిబలంతో భయం తొలగించు కొంటాడు. తపస్సు చేత గొప్పదనం పొందుతాడు. గురు శుశ్రూష చేత జ్ఞానం పొందుతాడు. అలాగే శాంతిని యోగం చేత పొందుతాడు. దానంవల్ల కలిగిన పుణ్యాన్ని, వేదోక్తకర్మలు చేయడం వల్ల కలిగిన పుణ్యాన్ని ఆశ్రయించకుండా,రాగ ద్వేషాలు విడిచినవారు జీవన్ముక్తులై ఇక్కడే సంచరిస్తూ ఉంటారు. ఆసక్తితో చదివిన చదువు, ధర్మబద్ధంగా చేసిన యుద్ధమూ, చక్కగా (నిష్కామంగా) చేసిన సత్కర్మ, నియమంతో చేసిన తపస్సు ఈ నాలుగూ కడకు సుఖం చేకూరుస్తాయి.

జ్ఞాతులతో భేదదృష్టి కలవారికి పట్టుపరుపుల మీద పడుకొన్నా నిద్రపట్టదు. స్త్రీలపై ప్రీతి, ఆసక్తి కలుగదు. వందిమాగధులు స్తుతిస్తూ ఉన్నా తృప్తి కలుగదు. భేదబుద్ధి కలవారు ఎప్పుడూ ధార్మికంగా ప్రవర్తింప లేరు. ఇక్కడ సుఖాన్ని, గౌరవాన్ని పొందలేరు. ప్రశాంతత పొందలేరు. వారికి హితమయిన మాటలు రుచింపవు. వారికి యోగక్షేమాలు కలగవు. భేదదృష్టి కలవారికి వినాశం తప్ప మరోగతి ఏ మాత్రం కనపడదు. గోవులలో సంపదను భావింపవచ్చును. బ్రాహ్మణునిలో తపస్సు భావింపవచ్చును. స్త్రీలలో చాపల్యం ఊహించవచ్చు. జ్ఞాతుల నుండి అలాగే భయం ఊహించవచ్చు. చాలా తంతువులు (దారాలు) నిత్యమూ చాలాకాలం కలిసి ఉండటం చేతనూ, చాలాఉండటంచేతనూ ఎంతో బరువును సహిస్తాయి. సజ్జనులకు ఇదే ఉపమానం.

ధృతరాష్ట్ర ! జ్ఞాతులు కొఱవుల వలె (కాలిన కట్టెలవలె) వేరు వేరుగా ఉంటే పొగలు కక్కుతారు. కలిసి ఉంటే వెలిగిపోతారు / ప్రకాశిస్తారు. బ్రాహ్మణుల మీద, స్త్రీల మీద, జ్ఞాతుల మీద, ఆవులమీద పరాక్రమం చూపించే వారు తొడిమ నుండి పండు రాలినట్లు పతనం చెందుతారు. విడిగా ఉంటే లోతుగా వేళ్లు పాతుకుపోయిన పెద్ద చెట్టును కూడా వాయువు ఒక్కక్షణంలో మానుతో, వేళ్లతో సహా పెల్లగించగలదు. అవే వృక్షాలు కలిసికట్టుగా వేళ్లూని ఉండి ఒకదాని నొకటి పరస్పరమూ అల్లుకొని ఉంటే తీవ్రమయిన వేగం కల గాలులను సయితం తట్టుకొని నిలుస్తాయి. ఇలాగే గుణవంతు లయినా ఒంటరి అయితే గాలి ఒంటరి చెట్టును పెల్లగించి నట్లు పెల్లగించ వచ్చునని శత్రువులు భావిస్తారు. ఒకరి కొకరు అండగా

ఉండటం వల్లనూ, అన్యోన్యంగా కలిసి ఉండటం చేతనూ జ్ఞాతులు చెరువులోని పద్మాల వలె వృద్ధి పొందుతారు. బ్రాహ్మణులు (బ్రహ్మవేత్తలు), గోవులు, జ్ఞాతులు, పసిపిల్లలు, స్త్రీలు, అన్నంపెట్టినవారు, శరణుకోరినవారు వీరు చంపదగని వారు. ధనవంతుడవడం, ఆరోగ్యంగా ఉండటం ఈ రెంటినీ మించిన గుణం లేదు. రోగులు చనిపోయిన వారి వంటివారు. నీకు శుభమగు గాక. రోగం లేకుండానే కలిగేది, ఘాటయినది. తలనొప్పి కలిగించేది, పాపాల పరంపర పుట్టించేది, కఠినమయినది, తీక్ష్ణము, వేడి అయినది, సజ్జనులు మ్రింగేది, దుర్జనులు మ్రింగలేనిది అయిన కోపాన్ని దిగమ్రింగి ప్రశాంతుడవు కా ! రోగపీడితులు ఫలాలను (పుత్రులు, పశ్వాది సంపదలు) పొందలేరు. విషయాల తత్వాన్నీ పొందలేరు. రోగులకు సతతమూ దుఃఖమే కలుగుతూ ఉంటుంది. ధనంవల్ల పొందే భోగాలు కానీ సుఖం కానీ, వారికి తెలియరాదు.

జూదం నాడు పరాభవింపబడిన ద్రౌపదిని చూసి," రాజా! దుర్యోధనుని వారింపు" మని నేను చెప్పాను. కాని నా మాట నీవు పాటించలేదు. పండితులు జూదంమీద ఆసక్తిని త్యజిస్తారు. మెత్తని వానితో విరోధించే బలం నిజమైన బలం కాదు. సూక్ష్మమయిన ధర్మాన్ని శీఘ్రంగా ఆచరించాలి. క్రూరుని సంపద నశించి పోతుంది. మృదుస్వభావుల దగ్గర వృద్ధినొందిన సంపద పుత్రపౌత్రాదులకు చేరుతుంది. రాజా! పాండవులను నీకుమారులు రక్షించాలి. పాండుకుమారులు నీపుత్రులను రక్షించాలి. ఇద్దరికీ ఒకడే శత్రు వయినా మిత్రు డయినా కావాలి. ఇద్దరికీ కర్తవ్యం ఒకటే కావాలి. అలా సంపత్సమృద్ధితో సుఖులై జీవించాలి. ఇపుడు ఈకురువంశస్థులందరకు నీవే కట్టుకొయ్య వంటివాడవు. కురువంశమంతా నీకు వశమై ఉంది. అజమీఢ వంశంలో పుట్టినవాడవు. బాలురు, అరణ్యవాస సంతాపంతో ఉన్న కౌంతేయులను రక్షించి నీకీర్తిని నిలబెట్టుకో. కౌరవనాథా! నీవు పాండుపుత్రులతో కౌరవులను కలిపి ఉంచు. శత్రువులు నీ లోపాలను వెదక కుందురు గాక. వారు (పాండవులు) సత్యం మీద నిలబడి ఉన్నారు. నీవు దుర్యోధనుని సత్యం మీద నిలుపు."

37. విదురుడు ధృతరాష్ట్రునకు హిత ముపదేశించుట

"రాజా ! స్వాయంభువ మనువు ఈపదునేడుగురిని 1) ఆకాశాన్ని పిడికిళ్లతో పొడిచే వారిగాను 2) వంచటానికి శక్యం కాని యింద్రధనుస్సును వంచేందుకు ప్రయత్నించేవారిగాను 3) పట్టటానికి శక్యంకాని సూర్యకిరణాలను పట్ట ప్రయత్నించే వారిగాను చెప్పాడు. ఇవి చేయలేని పనులు - ఆపనులు చేయాలను కోవడం మూర్ఖత్వం. అనగా ఈ 17 గురు మూర్ఖులని భావం. 1) ఆజ్ఞాపించకూడని వానిని ఆజ్ఞాపించేవాడు 2) (స్వల్పలాభంతో) అనవసరంగా సంతోషించేవాడు 3) శత్రువును హద్దుమీరి సేవించేవాడు 4) స్త్రీలను రక్షించి దానితో లాభపడాలనుకొనేవాడు 5) యాచింపదగని వానిని యాచించేవాడు 6) కొంచెం చేసి గొప్పగా చెప్పుకొనేవాడు 7) సద్వంశంలో పుట్టి చేయరాని పనులు చేసేవాడు 8) బలహీనుడై కూడ బలవంతునితో నిత్యమూ వైరం పెట్టుకొనేవాడు 9) శ్రద్ధ లేని వారికి ఉపదేశించే వాడు 10) కోరకూడని వాటిని కోరేవాడు 11) కోడలితో వెకిలి మాటలు ఇష్టంగా భావించేవాడు. 12) కోడలి దగ్గర భయం పోగొట్టుకొని మళ్లీగౌరవం కావాలనుకొనేవాడు. 13) ఇతరుని క్షేత్రంలో విత్తనం నాటేవాడు 14) స్త్రీని హద్దుమీరి నిందించేవాడు 15) ఉపకారం పొంది గుర్తులేదని వాదించేవాడు 16) వాగ్దానం మాత్రం చేసి ఇవ్వకుండానే దానం చేశానని పొగడుకొనేవాడు 17) దుర్జనుని నుండి మంచితనం పొందాలనుకొనేవాడు. ఈ 17 గురిని యమభటులు నరకానికి లాగుకొని పోతారు. **ఇతరుల పట్ల తానెట్లు ప్రవర్తిస్తే వారు కూడా తన పట్ల అలాగే ప్రవర్తిస్తారు. అదేధర్మం కూడ. మాయావి పట్ల మాయతోనే ప్రవర్తిస్తారు. సజ్జనుని పట్ల సన్మార్గంతోనే ప్రవర్తించాలి.*** ముసలితనం రూపాన్ని హరిస్తుంది. అలాగే ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాలను, అసూయ ధర్మాచరణను, కామం లజ్జను, నీచసేవ సత్ప్రవర్తనను, క్రోధం సంపదను, అభిమానం సర్వాన్ని చెడగొడతాయి."

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "వేదాలన్నీ మానవునికి నూరేళ్లు ఆయువని చెపుతున్నాయి. కాని ఆ ఆయువంతా మానవుడు ఎందుకు పొందలేక పోతున్నాడు?' విదురుడు చెప్పాడు. 'రాజా ! దురభిమానం, అతిగా మాట్లాడటం, దానం చేయకపోవడం,

---

* యస్మిన్ యథా వర్తతే యో మనుష్యః తస్మింస్తథా వర్తితవ్యం స ధర్మః ।
మాయాచారో మాయయా వర్తితవ్యః సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః ॥ 7

క్రోధం, తన్నుమాత్రమే పోషించుకోవాలనుకోవడం, మిత్రద్రోహం - ఈ ఆరూ పదునైన కత్తులు. మానవుల ఆయువులను తెగకోస్తాయి. ఇవే నిజానికి మానవులను చంపుతాయి. మృత్యువు కాదు మహారాజా ! శుభమస్తు. నమ్మిన వాని భార్యను పొందేవాడు, గురుపత్నిని పొందేవాడు, ద్విజుడై శూద్రవనితను పెండ్లియాడే వాడు, మద్యపానం చేసేవాడు, విప్రులను ఆజ్ఞాపించేవాడు, విప్రుల జీవనోపాధిని పాడుచేసేవాడు, విప్రులను సేవకవృత్తిలో పెట్టేవాడు, శరణువేడిన వానిని చంపేవాడు - వీరంతా బ్రహ్మ హత్యచేసిన వారితో సమానం. వీరితో సహవాసం చేసిన వారు కూడా ప్రాయశ్చిత్తం చేసుకోవాలని వేదం చెపుతోంది. పెద్దల మాటను ఆదరించే వాడు, నీతివేత్త, దాత, దేవతలకు అతిథులకు పెట్టి మిగిలిన అన్నం తినేవాడు, హింస చేయనివాడు, కీడు కలిగించే పనులతో కలత పడటం ఎరగని వాడు, చేసిన మేలు మరువని వాడు, సత్యశీలి, మెత్తని స్వభావం కల పండితుడు స్వర్గం పొందుతారు. **రాజా ! సదా ప్రియంగా మాట్లాడే వారు తేలికగా దొరుకుతారు. అప్రియ మయినా హితం చెప్పేవాడు, దాన్ని వినేవాడు దొరకడం దుర్లభం (కష్టం).*** ప్రియమా - అప్రియమా అనేది వదిలివేసి, ధర్మం మాత్రమే గ్రహించి రాజుకు అప్రియ మయినా మేలు కలిగించే మాటలు చెప్పేవాడు రాజుకు నిజమైన సహాయుడు.

కులం కోసం ఒకరిని విడిచి పెట్టవచ్చును. గ్రామం కోసం కులమంతా విడవవచ్చు. దేశం కోసం గ్రామం విడవ వచ్చు. తనకోసం భూమినంతటినీ కూడా త్యజించవచ్చు. **ఆపదల కోసం (ఆపదలు వస్తే ఆదుకొనేందుకు) ధనాన్ని రక్షించుకోవాలి. సంపదలన్నీ ఖర్చుపెట్టి అయినా భార్యను రక్షించుకోవాలి.**** భార్యను, ధనాన్ని ఉపయోగించి యైనా తనను రక్షించుకోవాలి. పూర్వం ఈ జూదం రాజులకు వైరం కలిగించింది. అందుచేత తెలివైనవాడు నవ్వులాటకు కూడా జూదం ఆడకూడదు. మహారాజా ! ఆనాడు జూదం ఆడేటప్పుడే 'ఇది మంచిది కా' దని నేను చెప్పాను. రోగికి మేలు చేసే మందులాగా నీకు అది రుచించలేదు. రాజా !

---

* సులభాః పురుషా రాజన్ ! సతతం ప్రియవాదినః ।
అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥ 15

** ఆపదర్థే ధనం రక్షేద్ దారాన్ రక్షే ద్ధనైరపి ।
ఆత్మానం సతతం రక్షేద్ దారైరపి ధనైరపి ॥ 18

చిత్రమైన చక్కని పించాలున్న నెమళ్ళ లాంటి పాండవులను కాకుల వంటి నీ కొడుకులతో ఓడించగలవా? సింహాలను విడిచిపెట్టి నక్కలను చేరదీసుకొని సమయం వచ్చే సరికి ఏడుస్తున్నావు.

ప్రభువు యొక్క హితం మీదనే దృష్టిపెట్టి భక్తితో సేవించే సేవకునిపై ఎన్నడూ కోపించని రాజును సేవకులు నమ్ముతారు. ఆపదలలో ఆ రాజును విడిచిపెట్టరు కూడ. సేవకుల జీవికను పోగొట్టి, ఇతరుల రాజ్యాన్ని, ధనాన్ని లాగుకొనరాదు. అలా మోసగిస్తే, మునుపు తనతో స్నేహం కల మంత్రులు మొదలయిన వారంతా భోగాలు లేక ఆ రాజును విడిచి పోతారు. ముందుగానే చేయదగిన పనులు అన్నీ నిశ్చయించుకొని, ఆదాయవ్యయాలు లెక్క కట్టుకొని, సేవకులకు అనురూప మయిన జీతాలు కూడా లెక్కించుకొని తనకనుకూల మయిన వారి నుండి రాజు సహాయం పొందాలి. తనకు అసాధ్యమయిన దానిని సహాయుల ద్వారా సాధ్యపరచుకోవాలి. రాజు యొక్క అభిప్రాయం తెలిసి, ఏమరకుండా పనులన్నీ చేసేవాడు, హితంగా మాట్లాడేవాడు, రాజుమీద భక్తి కలవాడు, సన్మార్గుడు, తనశక్తి తాను ఎరిగినవాడు అయిన సేవకుని రాజు తనలాగానే దయతో కటాక్షించాలి. రాజు ఆజ్ఞను ఆదరించని వాడిని, పని చెపితే ఆచరించకుండా ఎదురు చెప్పే వాడిని, తన తెలివిమీద మాత్రమే అభిమానం కలవాడినీ, వ్యతిరేకంగా మాట్లాడే వాడినీ వెంటనే కొలువు నుండి తొలగించాలి. దూత ఎనిమిది సద్గుణాలు కలిగి ఉండాలి. 1. గర్వం లేనివాడు 2. సమర్థుడు 3. త్వరగా పని నెరవేర్చేవాడు 4. దయగలవాడు 5. అందరికీ హితుడు 6. ఇతరులు ఆశ చూపితే లోబడనివాడు 7. రోగరహితుడు 8. ఉదారంగా మాట్లాడే వాడు అయి ఉండాలి అని చెపుతున్నారు. తెలివైనవాడు కానిసమయంలో (సాయంకాలం మునుమాపువేళ) శంకాశీలుని యింటికి వెళ్ళకూడదు. నాలుగు రోడ్ల కూడలిలో రాత్రిపూట రహస్యంగా నిలువ రాదు. రాజు కోరుకొనే స్త్రీని అడగరాదు. చాలామంది దుర్మార్గులు కలిసి చేసిన కుతంత్రాన్ని చటుక్కున వ్యతిరేకించరాదు. "నిన్ను నమ్మను" అని కూడా అనరాదు. ఏదో నెపం పెట్టి అక్కడ నుండి తొలగిపోవాలి. 1. దయగలవాడు 2. రాజు 3. శీలం లేని స్త్రీ, 4. రాజసేవకుడు, 5. కొడుకు, 6. సోదరుడు, 7. విధవ, 8. చిన్నపిల్లలున్న తల్లి, 9. సేనలో జీవించువాడు 10. అధికారం పోయినవాడు - వీరి నందరినీ వ్యవహారాల్లో విడిచి పెట్టాలి. (వ్యవహారాలంటే ధనం ఇచ్చిపుచ్చుకోవడాలు).

తెలివి తేటలు, సత్కులం, సద్విద్య, ఇంద్రియ నిగ్రహం, పరాక్రమం, మితంగా మాట్లాడటం, శక్తిననుసరించిన దానం, కృతజ్ఞత - ఈ ఎనిమిది గుణాలు మానవుని వెలుగులోకి తీసుకువస్తాయి. ఈ ఎనిమిది గుణాలూ చాలా గొప్పవే అయినా ఒకగుణం వీటిని పట్టినిలుపుతుంది. రాజు ఆ మానవుని సత్కరించినపుడు పై గుణాలన్నిటికీ ఈ ఒక్క గుణమే నిండుదనం తెస్తుంది. బలం, రూపం, శుద్ధమైన కంఠస్వరం, స్పష్టమైన వర్ణోచ్చారణ, మృదుశరీరం, సువాసన, శరీరశుద్ధి, శోభ, లావణ్యం, ఉత్తమస్త్రీలు- ఈ పది స్నానశీలం కలవానికి లభిస్తాయి. మితంగా తినే వానికి ఆరు గుణాలు కలుగుతాయి. 1. ఆరోగ్యం 2. ఆయువు, 3. బలం, 4. సుఖం, 5. రోగరహితమైన సంతానం. 6. 'తిండిపోతు' అని ఆక్షేపణకు గురికాక పోవడం. సోమరిని, తిండిపోతును, లోకులను ద్వేషించే వానిని, మాయల మారిని, క్రూరుని, దేశకాలాలు తెలియని వానిని, అసహ్యకరమయిన వేషం వేసుకొనే వానిని ఇంటిలో ఉండనీయకూడదు. పిసిని గొట్టును, వదరు బోతును, శాస్త్రమెరుగని మూర్ఖుని, అడవిమనిషిని, జూదగాడిని, నీచులను గౌరవించే వాడిని, క్రూరస్వభావుని, పగబట్టిన వానిని, చేసిన మేలు మరచిన వానిని ఎంత కష్టంలో ఉన్నా యాచింపరాదు. నీచుని, ఎప్పుడూ ఒళ్లు మరచి ఉండే వాడిని, నిత్యమూ అబద్ధాలాడే వాడిని, దృఢమైన భక్తి లేని వానిని, స్నేహం విడిచి పెట్టేవాడిని, తానే గొప్పవాడని భావించే వానిని - ఈ ఆరుగురు నరాధములమా ఎన్నడూ సేవింపరాదు. సంపదలు సహాయులతో ముడిపడి వస్తాయి. సహాయులు కూడా సంపదలతో ముడిపడి వీర్యడుతారు. సంపదలు, సహాయులు ఈ రెండూ పరస్పరం కూడి ఉంటాయి. వేరుగా ఉంటే ఫలించవు.

మానవుడు పుత్రులను కని, వారికి అప్పు మిగల్చ కుండా తగిన వృత్తిని కల్పించి, పుత్రికలను తగినవరుల కిచ్చి ఆ తరువాత అడవి కేగి ముని వృత్తి నవలంబించాలి. ప్రాణు లన్నిటికీ హిత మయినదీ, తనకు కూడా సుఖకర మయినదీ దైవం పట్ల చెయ్యాలి. సర్వప్రయోజనాలూ కలగటానికి మూలం అదే. అభివృద్ధి, ప్రభావం, తేజస్సు, సత్త్వం, ప్రయత్నం నిశ్చయం - ఈ ఆరూ కలవానికి జీవనోపాధిని గురించి భయం ఉండదు.

పాండవులతో వైరం వల్ల వచ్చే దోషాలను చూడు. వారితో వైరానికి దేవతలూ,

ఇంద్రుడూ కూడా తల్లడిల్లి పోతారు. పుత్రులతో వైరం, నిత్యమూ దుఃఖంతో బ్రతకటం, కీర్తి పోవటం, శత్రువులకు సంతోషం తప్ప మరేమీ లేదు. ఇంద్రసమానుడా ! భీష్ముడు, నీవు, ద్రోణుడు, ధర్మరాజు - వీరికోపం బాగా పెరిగి ఆకాశంలో అడ్డంగా తోచిన తోకచుక్కలాగా ఈ లోక మంతటినీ రూపుమాపుతుంది. నీ వందమంది కొడుకులూ, కర్ణుడూ, పాండవు లయిదుగురూ కలిసి సముద్రంతో చుట్టిన భూమి నంతటినీ పాలింతురు గాక. పులులు లేకపోతే అడవి నిలవదు (నరికివేస్తారు). అడవి లేకపోతే (బయటకు వస్తే) పులులు బ్రతకవు. అనగా పులులు అడవిని నిలబెడతాయి. అడవి పులుల్ని రక్షిస్తుంది. పాపాత్ములు ఇతరుల గుణహీనతను (దోషాన్ని) తెలుసు కోవాలనుకొంటారు కాని సద్గుణాలను తెలుసుకోవాలనుకోరు. పరమార్థం పొందాలనుకొనేవాడు ముందుగా ధర్మాన్నే ఆచరించాలి. అమృతం స్వర్గాన్ని విడవనట్లుగా అర్థం ధర్మాన్ని విడిచిపెట్టదు. అందువలన ధర్మపూర్వకంగా అర్థ సాధనం చెయ్యాలి. పాప కృత్యాలు చేయకుండా శుభప్రదములయిన పనులు మాత్రమే చేసేవానికి ప్రకృతి ఇది, వికృతి ఇది అని సర్వమూ బోధపడుతుంది. దేశకాలానుసారంగా ధర్మార్థకామాలను సేవించే వానికి ఇహపరాలు రెండిట అవి సిద్ధిస్తాయి. కోప సంతోషాల వేగాన్ని అదుపు చేసుకొనగలిగిన వాడు సంపదలను పొందుతాడు. ఆపదలలో మునిగిపోడు. రాజా ! బలం అనేది మానవులకు అయిదు విధాల ఉంటుంది. చెపుతా విను. మొదటిది భుజబలం. అది మిక్కిలి తక్కువది. చక్కని మంత్రులు దొరకడం రెండవది. మూడవ బలం ధనం. అభిజాతబలం నాల్గవది. అది తండ్రి తాతల నుండి వంశపారంపర్యంగా వచ్చేది. ఈ అన్ని బలాల మొత్తం కంటే శ్రేష్ఠం ప్రజ్ఞాబలం. అది అయిదవది. అన్ని బలాలకూ అది బలం. చాలా అపకారం చేయగల శత్రువు దూరంగానే ఉన్నాడుగా అని ఆదమరచి ఉండకూడదు. స్త్రీల మీద, రాజుల మీద, పాముల మీద, వేదాధ్యయనం మీద, సమర్థునిమీద, శత్రువుమీద, భోగం మీద, ఆయువు మీద, నమ్మకం ఏ బుద్ధిమంతుడు పెట్టుకొంటాడు ? ప్రజ్ఞ అనే బాణపు దెబ్బ తగిలిన ప్రాణికి వైద్యులు లేరు. మందులు లేవు. హోమాలు చేసే మంత్రాలు లేవు. మంగళ కృత్యాలు లేవు. అథర్వ వేద మంత్రాలు లేవు. ప్రసిద్ధమయిన సిద్ధౌషధాలు లేవు (పాదరసం మొ॥). పాము, అగ్ని, సింహం, జ్ఞాతి ఇవన్నీ మిక్కిలి తేజస్సు కలవి. మానవుడు వీనిని చులకన చేయకూడదు.

లోకంలో అగ్ని గొప్ప తేజస్సు. అది కట్టెలలో గూఢంగా దాగి ఉంటుంది. అది మరోకట్టెతో రాపిడిపొంది ప్రజ్వలించేంత వరకు ఆ కట్టెలో దాగిన అగ్ని ఉపయోగపడదు. కట్టెల రాపిడి వల్ల అగ్ని మండుతుంది. అదే అగ్ని అడవి నంతటినీ శీఘ్రంగా మంటలతో దహించి వేస్తుంది. ఇలాగే నీ వంశంలో పుట్టిన పాండవులు అగ్నివంటి తేజస్సు కలవారు. సహనంతో గూఢంగా కట్టెలో నిప్పులాగా నిద్రిస్తున్నారు. రాజా ! పుత్రులతో కూడిన నీవు లతవంటి వాడవు. పాండవులు సాలవృక్షాల వంటివారు. పెద్ద పెద్ద వృక్షాలను ఆశ్రయించకుండా లత ఎన్నడూ వృద్ధి పొందదు. రాజా ! నీపుత్రుడు (లు) అడవి అనీ, పాండవులు సింహాలనీ తెలుసుకో. సింహాలు లేని అడవి తరిగిపోతుంది. అలాగే వనంలో లేకపోతే సింహాలూ నశించి పోతాయి."

38. విదురుడు ధృతరాష్ట్రునకు నీతి నుపదేశించుట.

విదురుడు ఇలా చెప్పాడు. "పెద్దలు వస్తున్నపుడు చిన్నవారి ప్రాణాలు పైకి లేస్తాయి. ఎదురుగా వెళ్లి నమస్కారం చేస్తే మళ్లీ ఆ ప్రాణాలను చిన్నవాడు పొందుతాడు. వచ్చిన సజ్జనుడికి ధీరుడు ఆసనం ఇచ్చి, కూర్చుండ బెట్టి, నీళ్లు తీసికొని వచ్చి, పాదాలు కడిగి, కుశల మడిగి తెలుసుకొని, తన పరిస్థితిని నివేదించి, తరువాత అతనికి భోజనం పెట్టాలి. లోభంవల్ల కాని, భయంవల్ల కాని, జాలివల్ల కాని గృహస్థు వేదవేత్త అయిన ఆభ్యాగతుడికి ఉదకం, మధుపర్కం, ఆవును ఇవ్వకపోతే వాని బ్రతుకు వ్యర్థం అని పెద్దలు చెపుతారు. వైద్యుడు, బాణాలు తయారు చేసేవాడు, బ్రహ్మచర్యం తరిగిన వాడు (నియమంలేనివాడు), దొంగ, క్రూరుడు, త్రాగుబోతు, గర్భంలోని పిల్లలను చంపేవాడు, సేనలో బ్రతికేవాడు, వేదం అమ్ముకొని జీవించేవాడు- వీరు వస్తే ఉదకం ఇవ్వకూడదు. ఉప్పు, అన్నం, పెరుగు, పాలు, తేనె, నూనె, నెయ్యి, నువ్వులు, మాంసం, పండ్లు, దుంపలు, కూర, ఎర్రని వస్త్రాలు, గంధాలు, బెల్లం ఇవి అమ్మరాదు. కోపం లేనివాడు ; మట్టి, రాయి, బంగారం వీటిని సమంగా చూసేవాడు; శోకం తరిగిన వాడు : స్నేహం - విరోధం లేనివాడు ; నింద - ప్రశంస రెంటికీ చలనం లేనివాడు ; ప్రియాన్ని, అప్రియాన్ని వదిలిపెట్టినవాడు ; ఏదీ అంటనివాడు సన్యాసి అవుతాడు. (అతడే భిక్షుకుడు). నీవార ధాన్యంతో, దుంపలతో, కూరలతో జీవించేవాడు, మనోనిగ్రహం, అగ్నికార్యాల మీద శ్రద్ధ కలిగి

అడవిలో ఉన్నా అతిథులపట్ల అప్రమత్తుడై, బరువు బాధ్యతలున్నా పుణ్యకార్యాలు చేసేవాడు - అతనిని తాపసు డంటారు.

తెలివైన వానికి అపకారం చేసి దూరంగా ఉన్నాను కదా అని ఏమరుపాటుతో ఉండకూడదు. తెలివి వల్ల బుద్ధిమంతుని చేతులు చాలా పొడవుగా ఉంటాయి. వాటితో తన కపకారం చేసిన వాడిని హింసిస్తాడు. నమ్మదగని వారిని నమ్మకూడదు. నమ్మ దగిన వారిని కూడ అతిగా నమ్మకూడదు. నమ్మకంతో పుట్టిన భయం వేళ్లనుకూడ పెకలిస్తుంది. మానవుడు ఈర్ష్యారహితుడు, భార్యను రక్షించుకో గలిగినవాడు, తన సొమ్మును న్యాయబద్ధంగా పంచేవాడు, ప్రియంగా మాట్లాడేవాడు, మృదుస్వభావుడు కావాలి. స్త్రీల విషయంలో మధురంగా మాట్లాడాలి కాని వారికి వశం కాకూడదు. స్త్రీలు పూజింప దగ్గవారు. మహిమ కలవారు. పుణ్యాత్మలు. ఇంటికి వెలుగులు, ఇంటిలోని లక్ష్ములు. అందుచేత వారిని శ్రద్ధతో రక్షించాలి. తండ్రికి అంతఃపురాన్ని, తల్లికి వంటింటిని, సోదర, పుత్రాదులకు గోసంరక్షణను అప్పజెప్పవచ్చును. కాని వ్యవసాయానికి తానే వెళ్లాలి. సేవకుల చేత వాణిజ్యం చేయించాలి. కొడుకుల చేత ద్విజసేవ చేయించాలి. నీటినుండి అగ్ని పుట్టింది. బ్రాహ్మణత్వం నుండి క్షత్రియత్వం పుట్టింది. రాతినుండి లోహం పుట్టింది. అంతటా ప్రసరించే వీటి తేజస్సు తమ జన్మస్థలాల్లో మాత్రం అణగిపోతుంది. సద్వంశంలో పుట్టి. అగ్ని సమానమయిన తేజస్సు కలిగినా సహనంకలవారు బయటపడకుండా కట్టెలోని నిప్పులాగా ప్రశాంతంగా ఉంటారు.

బాహ్యపరివారానికి గాని, ఆభ్యంతర పరివారానికి గాని తెలియకుండా ఆలోచన చేసే రాజు సర్వత్ర తన చూపులు ప్రసరింపజేస్తూ చిరకాలం ఐశ్వర్యం పొందుతాడు. ధర్మార్థ కామాలకు సంబంధించిన పనులు చేస్తున్నపుడు చెప్పరాదు. చేసిన తరువాతనే చెప్పాలి. అలా అయితే మంత్రం భేదించదు. (ఆలోచన కార్యరూపం చెందుతుంది). రహస్యంగా కొండ ఎక్కిగాని, భవనం ఎక్కిగాని, నిర్జన మయిన అరణ్యంలో కాని రాజు ఆలోచన చేయాలి. మిత్రుడు కానివాడు రహస్యాలోచన తెలిసికొనదగడు. పండితుడు కాని స్నేహితుడు, చపలచిత్తు డయిన పండితుడు - వీరికి కూడా రహస్యం తెలియరాదు. పరీక్షించకుండా రాజు తనకు మంత్రిని నియమించుకొనరాదు. ధనప్రాప్తి, రహస్యం రక్షించడం ఈ రెండూ అమాత్యునిలో ఉంటాయి. ధర్మార్థకామాలకు

సంబంధించిన పనులన్నీ అయిపోయిన తరువాతనే సభ్యులకు తెలియాలి. అలా చేసే రాజు శ్రేష్ఠుడు. మంత్రరక్షణం చేసే రాజుకు నిస్సంశయంగా కార్యం సిద్ధిస్తుంది.

మోహవశాత్తు నిందింపదగిన పనులు చేసేవాడు వాటి విపరీత పరిణామాల వల్ల జీవితం కూడా పోగొట్టుకొంటాడు. ప్రశస్త మయిన పనులు చేస్తే సుఖం కలుగుతుంది. చేయకపోతే పశ్చాత్తాపం కలుగుతుంది. వేదాధ్యయనం చేయని విప్రుడు శ్రాద్ధానికి యోగ్యుడు కాడు. అలాగే షాడ్గుణ్యం తెలియని వాడు మంత్రం (రహస్యం) వినటానికి తగడు. తనస్థితి యొక్క వృద్ధి క్షయాలు, షాడ్గుణ్యమూ తెలిసిన వానికి, అవమానింపబడని శీలం కలవానికి ఈ భూమి అంతా స్వాధీన మవుతుంది. వ్యర్థం కాని కోపమూ, సంతోషమూ కలిగి, తనపనిని తానే విమర్శించుకొంటూ, తానే కోశాగారాన్ని రక్షించుకొనే రాజుకు ఈ భూమి సర్వసంపదలనూ ఇస్తుంది. రాజు అనే పేరుతోనూ, ఛత్రంతోనూ రాజు సంతోషించాలి. తానొక్కడే సర్వాన్ని హరించకూడదు. సేవకులకు సంపదలు పంచాలి. బ్రాహ్మణుని గురించి బ్రాహ్మణునికి తెలుస్తుంది. భార్యను గురించి భర్తకు తెలుస్తుంది. మంత్రిని గురించి రాజుకు తెలుస్తుంది. కాని రాజునుగురించి రాజుకే తెలుస్తుంది.

చంపదగిన శత్రువు తనకు చిక్కితే వదిలిపెట్టకూడదు. తనకంటే అధికుడయితే అణగిమణిగి సేవించాలి. బలం పుంజుకొన్నాక చంపివేయాలి. లేకపోతే త్వరలోనే వానివల్ల భయం ఏర్పడుతుంది. దేవతల పట్ల, రాజులు, బ్రాహ్మణుల పట్ల, వృద్ధులపట్ల, బాలురపట్ల, రోగుల పట్ల కోపాన్ని ప్రయత్న పూర్వకంగా అణచుకోవాలి. లోకంలో మూఢులు మాత్రమే వ్యర్థంగా కలహిస్తారు. దాన్ని తెలివిగలవాడు విడిచి పెట్టాలి. అలా విడిచి పెడితే మంచిపేరు కలుగుతుంది. కీడు కలగదు. నపుంసకుని స్త్రీలు భర్తగా కోరనట్లుగా నిష్ఫల మయిన అనుగ్రహమూ, వ్యర్థ మయిన కోపమూ కలవానిని ప్రజలు రాజుగా కోరుకోరు. బుద్ధిగలిగినంత మాత్రాన సంపద రాదు. మూఢు డయినంత మాత్రాన దారిద్ర్యం కలగదు. లోకంలో తారుమారు పరిస్థితులను ప్రాజ్ఞుడే గమనిస్తాడు. ఇతరులకు తెలియదు. విద్య, శీలం, బుద్ధి, ధనం, వంశం వీనిచేత వృద్ధులయిన వారిని మూఢుడు నిత్యమూ అవమానిస్తూ ఉంటాడు. సత్ప్రవర్తన లేని వానికి, తెలివిలేని వానికి, అసూయాపరునికి, ధర్మపూర్వకమైన నడవడి లేనివానికి నోరు మంచిదికాని వానికి, కోపం కలవానికి త్వరగా కష్టాలు వస్తాయి.

వంచన లేని దానం, హద్దు (మర్యాద) మీరక పోవడం, హితంగా మాట్లాడిన మాట ఈ మూడూ ప్రాణులను తనవైపుకు త్రిప్పుకొంటాయి. మోసం చేయని వాడు, సమర్థుడు, కృతజ్ఞుడు, బుద్ధిమంతుడు, నిష్కల్మషుడు, ఎపుడయినా ధనం తగ్గినా పరివారం (అండదండలు) కలిగే ఉంటాడు. ధైర్యం, శమం, దమం, శుచిత్వం, కరుణ, మృదువయినమాట, మిత్రద్రోహం చేయకపోవడం ఈ ఏడూ సంపదను వృద్ధి పొందిస్తాయి.

రాజా !తన వారికి పెట్టకుండా తినేవాడు, దుష్టుడు, కృతఘ్నుడు, సిగ్గులేనివాడు అయితే ఆ రాజును విడిచిపెట్టాలి. తాను తప్పులు చేస్తూ తప్పులు చేయని తనవారికి కోపంకలిగేటట్లు ప్రవర్తించేవాడు పాముున్నయింటిలో లాగా సుఖంగా నిద్రపోలేడు. ఎవరికి చేటు కలిగితే తన యోగక్షేమాలకు చేటుకలుగుతుందో వారిని ఎల్లప్పుడూ దేవతలలాగా ప్రసన్నులను చేసుకోవాలి. స్త్రీలు, ప్రమత్తులు, పతితులు, దుర్జనులు- వీరి వల్ల కావలసిన పనులన్నీ ఫలితాన్ని ఇస్తాయా అనేది సంశయమే. వనిత, జూదగాడు, బాలుడు శాసించే వారయితే ఆ ప్రజలు రాతినావలు నదిలో మునిగిపోయినట్లు శీఘ్రంగా మునిగిపోతారు. అవసరమయినపుడు మాత్రం ఆదుకొని, మిగిలిన సమయంలో దూరంగా ఉండే సేవకులే పండితు లని నా అభిప్రాయం. అనవసర సమయాల్లో చేసే సేవ వల్ల ఘర్షణ, త్రొక్కిసలాట తప్ప వేరే ప్రయోజనం ఉండదు. జూదరులచే మాత్రమే ప్రశంసింపబడేవాడు, అలాగే చారణుల చేత, వేశ్యల చేత పొగడ్తలు పొందేవాడు ఎంతో కాలం బ్రతకడు. రాజా ! మేటి విలుకాండ్రు, మిక్కిలి తేజస్సుకల పాండవులను వదలి నీ సంపద నంతనూ దుర్యోధనుని మీద పెట్టావు. ఐశ్వర్య మదమత్తు డయిన దుర్యోధనుడు త్వరలో ఆ పదవినుండి భ్రష్టుడు కావటం చూస్తావు. బలి చక్రవర్తి లోకత్రయం నుండి భ్రష్ట డయినట్లు దుర్యోధనుడు రాజ్యభ్రష్టుడవుతాడు.

39. విదురుడు ధృతరాష్ట్రునకు - నీతి నుపదేశించుట - 2

ధృతరాష్ట్రుడిట్లన్నాడు. "కలిమిలేముల విషయంలో మానవుడు స్వతంత్రుడు కాడు. త్రాటితో లాగబడే కొయ్య బొమ్మలాంటివాడు. బ్రహ్మ దానిని దైవానికి వశం చేశాడు. అందుచేత నీవు చెపుతూ ఉండు. నేను వింటూ ఉంటాను." విదురుడిలా

చెపుతున్నాడు. "సమయానికి తగని మాట బృహస్పతి మాట్లాడినా అతడు బుద్ధిహీను డనిపించుకొంటాడు. అవమానం పొందుతాడు. ఒకడు దానం చేసి ప్రియు డవుతాడు. మరొకడు ప్రియంగా మాట్లాడి ప్రియు డవుతాడు. ఇంకొకడు మంత్రబలంచేత కాని మూలబలంచేత కాని ప్రియు డవుతాడు. కాని సహజంగా ప్రియమైనవాడు ఎపుడూ ప్రియుడే. మానవుడు ఎవరి నయినా ద్వేషిస్తే వానిలోని నేర్పరితనంకాని, తెలివితేటలు కాని, పాండిత్యం కాని పరిగణించడు. ప్రియునిలో అన్నీ మంచిపనులే కనిపిస్తాయి. శత్రువులో అన్నీ పాపపు పనులు గానే గోచరిస్తాయి. రాజా ! దుర్యోధనుడు పుట్టినపుడే చెప్పాను. "వీడిని ఒక్కడినీ విడిచిపెట్టు - వీడిని వదిలితే వందమంది పుత్రులు వృద్ధి చెందుతారు. వీడిని ఒక్కడినీ వదలకపోతే వందమంది పుత్రులూ నశిస్తారు" అని. తరువాతి కాలంలో నశించి పోయే వృద్ధిని ఎక్కువగా భావించరాదు. అనంతర కాలంలో వృద్ధిని పొందే (ప్రస్తుత) తరుగుదలను కూడ ఎక్కువగా భావించాలి. మహారాజా ! తరువాత వృద్ధి కలిగించే క్షయం క్షయం (క్రింద లెక్క) కాదు. కొద్దిగా వృద్ధిచెంది తరువాత మిక్కిలి నశింపజేసేదే క్షయ మనిపించుకొంటుంది. కొందరు సద్గుణాలతోనే సంపన్నులు. మరికొందరు ధనంతోనే సంపన్నులు - అందుచేత మహారాజా! ధనసంపన్నులై గుణహీనులయిన వారిని విడిచిపెట్టు." ధృతరాష్ట్ర డిట్లన్నాడు. "నీవు విద్వాంసు లంగీకరించేటట్లు భవిష్యత్తులో మేలు చేసే వానినే చెపుతున్నావు. కాని నేను కొడుకును విడవలేను. ధర్మం ఎటు ఉంటుందో జయమూ అటే ఉంటుంది."

విదురు డిట్లన్నాడు. "మిక్కిలి సద్గుణాలు, వినయమూ కలిగినవాడు ప్రాణులకు కలిగే కొద్దిపాటి కష్టాన్ని కూడా ఉపేక్షింపడు. కొంతమంది పరులపై సతతమూ అపనిందలు వేస్తూ, దుఃఖం కలిగిస్తూ, పరస్పర విరోధాలు పెట్టటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. వారిని చూస్తేనే పాపం కలుగుతుంది. వారి నుండి ధనం తీసుకొన్నా చాలా పాపం. వారికి ధనమివ్వటం చాలా భయం కలిగిస్తుంది. విరోధాలు పెట్టేవారు, స్వార్థపరులు, సిగ్గులేనివారు, మూర్ఖులు, పాపపు పనులు చేసేవారు వీరితో సహవాసం విడిచి పెట్టాలి. (వీరితో కలిసి ఉండరాదు). మహాపాపాలు చేసే వారిని, వారితో సంబంధం కలవారిని విసర్జించాలి. స్నేహం తొలగిపోతే నీచునికి ప్రీతి నశించి పోతుంది. అంతే కాదు స్నేహఫలమూ, స్నేహసుఖమూ కూడా నశించి పోతాయి.

నీచుడు అపనిందలు వేసేందుకు ప్రయత్నిస్తాడు. మన వినాశానికి ప్రయత్నిస్తాడు. మోహంతో స్వల్పమయిన అపకారంతో శాంతించడు. క్రూరులై, ఎదగని మనసులు కల నీచులతో స్నేహాన్ని తెలివైనవాడు బుద్ధితో ఆలోచించి, దూరంగా వదలాలి. దరిద్రుడు, దీనుడు, రోగాతురుడు అయిన జ్ఞాతిపట్ల అనుగ్రహం చూపేవాడు పుత్రవృద్ధినీ, పశువృద్ధినీ పొంది అనంత మయిన శ్రేయస్సును కూడా పొందుతాడు. తనమేలు కోరేవాడు జ్ఞాతులనూ, కులాన్నీ వృద్ధిపొందించుకోవాలి. అందుచేత మహారాజా ! ఆ పని చక్కగా చెయ్యి. జ్ఞాతులను సత్కరించేవానికి శ్రేయస్సు కలుగుతుంది. రాజా ! జ్ఞాతులు గుణహీనులయినా రక్షింప దగిన వారే. సద్గుణవంతులై నీ అనుగ్రహం కోరే (పాండవుల) వారి మాట వేరుగా చెప్పాలా ? రాజా ! వీరు లయిన పాండవులపై అనుగ్రహం చూపించు. వారి జీవనానికి కొన్ని పల్లె లయినా ఇయ్యి.

మహారాజా ! ఇలా నీకు లోకంలో కీర్తి కలుగుతుంది. పెద్దవాడవయిన నీవు నీ కొడుకులను శాసించాలి. నేను కూడా నీకు హితమే చెప్పాలి. నేను నీకు శ్రేయోబిలాషి నని తెలుసుకో - శుభం కోరేవాడు జ్ఞాతులతో విరోధం పెట్టుకోరాదు. మహారాజా ! సుఖాలు జ్ఞాతులతో కలసి అనుభవించాలి. కలిసి భోజనం చేయడం, కలిసి సంభాషించు కోవడం, కలిసి ప్రీతిగా పనులు చేసుకోవడం ఇవి జ్ఞాతులు చేయదగినవి. అంతేకాని ఎన్నడూ విరోధపడరాదు. జ్ఞాతులు తరింపజేస్తారు. ముంచేస్తారు కూడ. మంచి జ్ఞాతులు కష్టాలు తరింపజేస్తారు. దుర్మార్గం కల జ్ఞాతులు ముంచేస్తారు. రాజా ! పాండవుల పట్ల మంచిగా ఉండు. వారితో కలసి ఉంటే శత్రువులు నిన్ను తిరస్కరించలేరు. ఎదిరించలేరు. విషం పూసిన బాణంతో కొట్టబడిన మృగంలాగా శ్రీమంతుడయిన జ్ఞాతితో మరో జ్ఞాతి చితికి పోతే ఆ పాపం ఆ శ్రీమంతుడు పొందుతాడు. రాజా ! పాండవులో, నీ కొడుకులో చనిపోయాక నీకు తాపం కలుగుతుంది. దాన్ని ఆలోచించు. నీవు చేసిన పనివల్ల నీవు మంచాన పడి పరితపించకూడదు. ముందుగానే ఆలోచించి ఆపని మానుకోవాలి. జీవితం శాశ్వతం కాదు గదా! శుక్రాచార్యుడు తప్ప ఇంకెవరూ తప్పు చేయరని ఎక్కడా లేదు. అందరమూ ఎపుడో ఒకప్పుడు తప్పు చేస్తాం. కాని మిగిలిన పనిని గురించి మంచి, చెడు విచారణ మాత్రం తెలివైన వారే చేస్తారు. పొరపాటు పడినా తరువాత సరిదిద్దుకొంటారు. దుర్యోధనుడు పాండవులకు పూర్వంచేసిన అపకారం కులంలో పెద్దవయిన నీవు

సరిదిద్ది, ఉపకారం చెయ్యాలి. పాండవులను నీవు రాజ్యపదవిలో ప్రతిష్ఠిస్తే పాపరహితుడ వవుతావు. బుద్ధిమంతులు అపుడు నిన్ను పూజిస్తారు.

ధీరుల మంచి మాటలను ఫలితం దృష్టితో ఆలోచించి, కార్యం నిశ్చయించేవాడు చాలాకాలం మంచిపేరు పొందుతాడు. నిపుణులుపదేశించిన జ్ఞానం కూడా ఒక్కొక్కప్పుడు పనికిరాదు. నేర్పరులు చెప్పినది తనకు తెలియకపోయినా, తెలిసినా, సరిగా ఆచరించకపోయినా ఆ జ్ఞానం నిష్ఫలమే అవుతుంది. దుష్ఫలితాన్ని ఇచ్చే పాపకర్మను ఆరంభించని వాడు వృద్ధిలోకి వస్తాడు. పాపాన్ని చేసి మంచి చెడులు విమర్శించు కోకుండా మళ్లీ మళ్లీ చేసే దుష్టబుద్ధి కలవాడు అగాధమయిన బురదలో కూరుకుపోతాడు. మంత్రభేదం (రహస్యం బయటపడటం) కలగటానికి ఆరు ద్వారాలున్నాయి. నిత్యమూ అర్థవృద్ధిని కాంక్షించేవాడు వీటిని దరిచేరనీయ రాదు. 1. మదం, 2. పగటి కలలుకనడం, 3. విజ్ఞానం లేకపోవడం 4. బయటపడే తన ముఖకవళికలు 5. దుష్టమంత్రుల మీది నమ్మకం 6. నేర్పు లేని దూత - ఈ ఆరూ రహస్యం బయటపడే ద్వారాలు. ఈ ఆరు ద్వారాలూ సతతమూ తెలిసికొని మూసివేసి, ధర్మార్థ కామాలు నిర్వహించే వాడు శత్రువులను అణగద్రొక్కుతాడు. శాస్త్రమయినా తెలియాలి. లేదా పెద్దలను సేవించి అయినా తెలుసుకోవాలి. ఈ రెండూ లేకుండా బృహస్పతి లాంటి తెలివిగల వారు కూడా ధర్మార్థాలు తెలుసుకోలేరు. సముద్రంలో పడినది నిష్ఫలం. అలాగే వినిపించు కోని వానికి చెప్పిన వాక్యం నిష్ఫలం. ఆత్మజ్ఞానం లేని వాని శాస్త్రజ్ఞానం నిష్ఫలం. అలాగే అగ్నిలో పడని హోమద్రవ్యం నిష్ఫలం.

తెలివిగల మానవుడు ముందు తన బుద్ధితో కారణాలను పరీక్షించాలి. చాలాసార్లు అనుభవంతో నిశ్చయించాలి. అలా పరులవల్ల విని, తాను చూసి, బాగా తెలిసికొని అపుడు బుద్ధిమంతులతో స్నేహం చెయ్యాలి. వినయం అపకీర్తిని పోగొడుతుంది. పరాక్రమం కీడును తొలగిస్తుంది. సహనం కోపాన్ని చంపుతుంది. సదాచారం అవలక్షణాన్ని పోగొడుతుంది. భోగ్యవస్తు సామగ్రి చేతనూ, జన్మస్థానం చేతనూ, ఇంటి చేతనూ, ఆచారవ్యవహారాల చేతనూ, అన్న వస్త్రాల చేతనూ వంశాన్ని పరీక్షించాలి. దేహాభిమానం వదలుకొన్నవాడే ఆశించకుండా వచ్చిన వాటిమీద ఆశ వదల లేకపోతున్నాడు. ఇక కామానురక్తుడయిన వాని విషయం చెప్పాలా ? ప్రాజ్ఞులను మన్నించే విద్వాంసునీ,

ధర్మప్రవర్తన కల వానినీ, చూడముచ్చటయిన వానినీ, పెక్కుమంది మిత్రులు కలవానినీ, చక్కగా ప్రియంగా మాట్లాడే వానినీ, స్నేహితునీ రక్షించుకోవాలి. హద్దుమీరని వాడు, ధర్మాసక్తి కలవాడు. మృదుత్వమూ సిగ్గూ కలిగిన వాడు దుష్కులీను డయినా నూరుగురు కులీనులకంటే మేలు. మనసుతో మనసు, రహస్యంతో రహస్యం, ప్రజ్ఞతో ప్రజ్ఞ కలిస్తే ఆ యిద్దరి మైత్రి తరగదు,క్షీణించదు. దుర్మార్గుడై, పరిపక్వం కాని ప్రజ్ఞ కల స్నేహితుని తెలివిగల వాడు విడిచిపెట్టాలి. గడ్డితో కప్పిన నూతిలాగా విడవాలి. వానితో స్నేహం నశించి పోతుంది. గర్వితులతో, మూర్ఖులతో, కోపులతో, తొందర పాటు కలవారితో, ధర్మం విడిచిన వారితో పండితుడు స్నేహం చేయరాదు. మిత్రు డెప్పుడూ కృతజ్ఞుడై ఉండాలి. ధార్మికుడు, సత్యసంధుడూ కావాలి. నీచుడు కారాదు. దృఢమైన భక్తి కలిగి, ఇంద్రియ నిగ్రహం కలిగి, హద్దు మీరని వాడు కావాలి. ఆపదల్లో విడవని వాడు కావాలి. ఇంద్రియాలను జయించడం మృత్యువును జయించడం కంటే గొప్పవిషయం. ఇంద్రియాలను ఇష్టం వచ్చినట్లు వదిలి వేయడం మంచిదికాదు. అది దేవతలకు కూడా వినాశం చేకూరుస్తుంది.

అన్ని ప్రాణులపట్ల మృదుత్వం, అసూయ లేకపోవడం, సహనం, ధైర్యం, మిత్రులను అవమానించకపోవడం – ఈ అయిదూ ఆయువును వృద్ధి పరుస్తాయని పెద్దలు చెప్పారు. అన్యాయంగా లాగుకొనబడిన అర్థాన్ని చక్కని నీతితో, దృఢబుద్ధితో పొందాలనుకొనడం సత్పురుషుల వ్రతం. రాబోయే అనర్థాలకు విరుగుడు తెలిసిన వాడూ, వర్తమాన (ప్రస్తుత) కార్యాలలో దృఢనిశ్చయం కలవాడూ, జరిగిన పనుల్లో మిగిలిపోయినదాన్ని గుర్తించే మానవుడు ఏ ప్రయోజనాన్నీ కోల్పోడు. చేష్టలతో, మనసుతో, మాటలతో మానవుడు ఏ విషయాన్ని ఎల్లప్పుడూ సేవిస్తూ ఉంటాడో అదే మానవుని లాక్కుపోతూ ఉంటుంది. అందుచేత మానవుడు శుభాలనే త్రికరణ శుద్ధిగా చేస్తూ ఉండాలి. మంగళద్రవ్యాలు (పెరుగు, గరిక, గోవు మొ॥) స్పృశించడం, మిత్రుల (యోగం) సహాయం, శాస్త్రవిజ్ఞానం, ప్రయత్నం, కుటిలత లేని ప్రవర్తన, పలుమార్లు సజ్జన దర్శనం – ఇవి మానవునికి శుభం (ఐశ్వర్యం) కలిగిస్తాయి. నిర్వేదం చెందకపోవడం సంపదకూ, లాభానికీ, శుభానికీ మూలం. ప్రయత్నం విడవని వాడు గొప్పవాడవుతాడు. అనంతమయిన సుఖం కూడా పొందుతాడు. సమర్థుడికి అన్నిచోట్ల, అన్ని వేళలా సహనం కంటె సంపత్కరం మరొకటి లేదు.

అది అన్నిటి కంటే చాలా హితంకరం. అసమర్థుడు అన్ని విషయాలలోనూ సహనం వహించాలి. సమర్థుడు కూడా ధర్మం కోసం సహనం వహించాలి. అర్థానర్థాలు (లాభాలాభాలు) సమానంగా చూసుకొనే వాడికి సహనం హితంగా ఉంటుంది. ధర్మానికీ, అర్థానికీ హాని కలగని సుఖాన్ని మానవుడు ఇష్టం వచ్చినట్లు అనుభవింపవచ్చు. అంతేకాని మూఢునిలా అనుభవించరాదు. (ధర్మార్థహాని విషయంలో మూఢుడు కారాదు). దుఃఖార్తుల దగ్గర, మత్తెక్కిన వారి దగ్గర, నాస్తికుల దగ్గర, సోమరుల దగ్గర, ఇంద్రియనిగ్రహం లేనివారి దగ్గర, ఉత్సాహ రహితుల దగ్గర లక్ష్మి ఉండదు. ఆర్జవమూ, దాని వల్ల కలిగిన లజ్జాశీలమూ కలిగిన మానవుని దుర్మార్గులు అసమర్థుడనుకొంటూ బెదిరిస్తూ ఉంటారు. తిరస్కరిస్తూ ఉంటారు. అతి మంచితనం కలవాని దగ్గరకు అతిగా దానం చేసే వాడి దగ్గరకు, అతి పరాక్రమవంతుడి దగ్గరకు, అతిగా వ్రతాలు చేసే వాడిదగ్గరకు, తన తెలివిమీద వల్లమాలిన అభిమానం కలవాడి దగ్గరకు లక్ష్మి భయంతో చేరదు. లక్ష్మి అతిసద్గుణవంతుల దగ్గరా ఉండదు. ఏమాత్రం గుణంలేనివారి దగ్గర కూడా ఉండదు. ఆమె గుణాలను కోరదు. అంతమాత్రాన నిర్గుణులపట్ల అనురాగం లేదు. పిచ్చిపట్టిన ఆవువలె గ్రుడ్డిదయిన లక్ష్మి ఎక్కడెక్కడో నిలిచిపోతూ ఉంటుంది. వేదాధ్యయనానికి ఫలం అగ్నిహోత్రాన్ని అర్చించడమే. శాస్త్రానికి ఫలం సత్ప్రవర్తన. స్త్రీ సంగమానికి ఫలం సుఖ సంతానాలు కల్గడమే. ధనానికి ఫలం దానం చెయ్యడమూ, అనుభవించడమూను.

అధర్మంతో సంపాదించిన ధనంతో పరలోక సుఖానికి అవసరమయిన క్రియలు (దానాదికం) చేసిన వాడికి చనిపోయాక దాని ఫలం రాదు. ఎందుచేతనంటే ఆ ధనం అన్యాయంగా సంపాదించింది గనుక. అడవుల్లో కాని, దుర్గమస్థలాల్లో కాని, ఘోరమయిన ఆపదల్లో కాని, క్లిష్ట సమయాల్లో కాని, ఆఖరికి కత్తి మీదపడుతున్నా కాని సత్త్వ గుణం కలవారికి భయం ఉండదు. ప్రయత్నం, ఇంద్రియ నిగ్రహం, సమర్థత, పోరపాటు పడకపోవటం, ధైర్యం, స్మృతి, బాగా పరిశీలించి ప్రారంభించటం ఇవి సంపదకు మూలం. తాపసులకు తపస్సు బలం. బ్రహ్మవేత్తలకు వేదం బలం. పాపాత్ములకు హింస బలం. గుణవంతులకు సహనం బలం. నీరు, దుంపలు, పండ్లు, పాలు, హోమద్రవ్యం, విప్రుని ఆజ్ఞ, గురువు ఆజ్ఞ, ఔషధము – ఈ ఎనిమిది వ్రతానికి / దీక్షకు భంగం కలిగించవు. సంగ్రహంగా ధర్మం ఏమిటంటే.....

తనకు అప్రియమయినది ఇతరులకు చేయకపోవడమే ధర్మం. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడమే అధర్మం. క్రోధాన్ని శాంతంతో జయించాలి. దుర్మార్గాన్ని మంచితనంతోనూ, లోభాన్ని దానంతోనూ, అసత్యాన్ని సత్యంతోనూ జయించాలి.

స్త్రీలపట్ల దుడుకుగా చరించే వానిని, సోమరిని, పిరికి వానిని, కోపిని, పౌరుషంతో గర్వించే వానిని, దొంగను, కృతఘ్నుని, నాస్తికుని నమ్మరాదు. పెద్దలకు నమస్కరిస్తూ నిత్యమూ సేవించే స్వభావం కలవానికి 1. కీర్తి 2. ఆయువు3. యశస్సు, 4. బలం, వృద్ధిపొందుతాయి. అతికష్టంతో సాధించే వాటిమీద, ధర్మాన్ని దాటి సాధించేవాటిమీద, శత్రువుకు లొంగి సాధించేవాటి మీద మనసు పెట్టుకోకు. చదువు రాని పురుషుడు, బిడ్డలు లేని సంసారం, తిండిలేని సంతానం, రాజులేని రాజ్యం ఈ నాలుగూ శోకింప దగినవి. శరీరులకు అధిక ప్రయాణం, పర్వతాలకు ఎడతెగని నీరు, స్త్రీలకు సంభోగం లేకపోవడం, మనస్సుకు వాగ్బాణాలు ముసలితనం చేకూరుస్తాయి. అభ్యాసం లేకపోవడమే వేదాలకు దోషం. వ్రతం (దీక్ష) లేకపోవడమే బ్రాహ్మణునకు దోషం. భూమికి బాహ్లికులు దోషం. పురుషునికి అసత్యం దోషం. సాధ్వికి కుతూహలం దోషం. స్త్రీకి ఎడబాటు దోషం.

బంగారానికి మలం (కాలుష్యం) వెండి, వెండికి మలం తగరం, తగరానికి మలం సీసం, సీసానికి మలం మలమే. నిద్రను స్వప్నంతో జయించలేము. స్త్రీలను కామంతో జయించలేము. కట్టెలతో అగ్నిని జయించలేము. పానంతో మద్యాన్ని జయించలేము. దానంతో మిత్రుని సంతృప్తి పరచినవాడు, యుద్ధంలో శత్రువును జయించినవాడు, అన్నపానాలతో భార్యను జయించినవాడు – ఈ ముగ్గురి జీవితమూ సఫలమైనట్లే. వేలకొద్దీ డబ్బు ఉన్నవారూ బ్రతుకుతున్నారు. వందలున్న వారూ బ్రతుకుతున్నారు. ధృతరాష్ట్ర ! ధనం మీద ఆశ వదలు. బ్రతకలేము అనేది లేదు. ఎలాగో అలా జీవిస్తాం. భూమి మీద ఉన్న ధాన్యం అంతా, బంగారం, పశు సంపద, స్త్రీ సంపద అన్నీ కలిపినా ఒక్కడికి చాలవు. దీన్ని తెలిసిన మానవుడు మోహపడడు. రాజా! నీకు మళ్లీ చెపుతున్నాను. నీకు నీ కొడుకుల మీద, పాండురాజు కొడుకుల మీద సమభావం ఉంటే అందరినీ సమానంగా చూడు.

40. విదురుడు ధర్మమహత్వమును చెప్పుట.

విదురు డిట్లన్నాడు. "సజ్జనులు అడిగితే గర్వించకుండా, శక్తి వంచన లేకుండా కార్యం ముగించిన సుజనునికి వెంటనే కీర్తి లభిస్తుంది. ఎందుచేత నంటే సజ్జనుల అనుగ్రహం సుఖం కలిగిస్తుంది. ఎంతగొప్ప పనిఅయినా ధర్మవిరుద్ధమయితే ఇతరులు వద్దనకుండానే విడిచిపెట్టేవాడు కుబుసాన్ని విడిచిన పాములాగా దుఃఖాలను విడిచి సుఖంగా నిద్రిస్తాడు. అసత్యం వల్ల పొందిన గెలుపు, రాజసొమ్ము మీద దురాశ, గురువులను (తల్లి తండ్రి గురువు మొ॥ వారిని) నెపంతో నిర్భంధించటం - ఈ మూడు బ్రహ్మహత్యతో సమాన మయినవి. అసూయ ఒక్క అంగలో వచ్చే మృత్యువు. అతిగా మాట్లాడటం సంపదను హత్యచేయడమే. గురుశుశ్రూష లేకపోవడం, తొందరపాటు, ఆత్మస్తుతి - ఈ మూడూ విద్యకు శత్రువులు. సోమరితనం, మదమోహాలు, చపలత్వం, వ్యర్థప్రసంగాలు, ఔద్దత్యం, దురభిమానం, లోభం అనే ఏడూ విద్యార్థుల దోషాలు. ఇవి విడిచిపెట్టాలి. సుఖం కోరేవాడికి విద్య ఎక్కడి నుండి వస్తుంది? విద్యార్థికి సుఖం లేదు. సుఖం కావాలనుకొంటే విద్యను త్యజించాలి. విద్య కావాలనుకొంటే సుఖం త్యజించాలి. కట్టెలతో అగ్ని సంతృప్తి చెందదు. నదులతో సముద్రం, ప్రాణులతో యముడు, పురుషులతో స్త్రీ తృప్తిపడరు.

రాజా! ఆశ ధైర్యాన్ని చంపుతుంది. యముడు పుత్రకళత్ర సమృద్ధిని చంపుతాడు. కోపం సంపదను చంపుతుంది. లోభం కీర్తిని చంపుతుంది. అపాలనం (రక్షణలేకుండుట) పశువులను చంపుతుంది. కోపించిన ఒకే ఒక బ్రాహ్మణుడు రాష్ట్ర మంతటినీ చంపుతాడు. మేకలు, కంచు, వెండి, తేనె, విషాన్ని హరించే మణి, పక్షి, వేదవేత్త, వృద్ధు డయిన జ్ఞాతి, ధనహీను డయిన కులీనుడు, ఎల్లపుడు ఇంటిలో ఉండాలి. మేక, ఎద్దు, మంచిగంధం, వీణ, అద్దం, తేనె, నెయ్యి, జలం, రాగిపాత్రలు, శంఖం, సాలగ్రామం, గోరోచనం - ఈ మంగళ ద్రవ్యాలు దేవ, బ్రాహ్మణ, అతిథుల పూజకోసం ఇంటిలో ఉంచుకోవాలి అని మనువు చెప్పాడు. ఇదిగో ! అన్నిటికంటె ఉత్తమం, చాలా విశిష్టం పుణ్యప్రదమూ అయిన మాట చెపుతున్నాను. కామం వల్ల కాని, భయం వల్ల కాని, లోభం వల్లకాని, చివరకు ప్రాణం పోతున్నాసరే ధర్మం విడిచిపెట్టకూడదు. (ఎందుకంటే) ధర్మం నశించదు. సుఖ దుఃఖాలు నశించిపోతాయి. జీవుడు నిత్యుడు, (జీవు డిక్కడికి రావటానికి) కారణం మాత్రం అనిత్యం. అనిత్యం

విడిచిపెట్టి నిత్యం మోద నిన్ను నీవు ప్రతిష్ఠించుకో. సంతోషం పొందు. లాభమంటే చివరకు సంతోషమే గదా ! చూడు! ఎంతోమంది బలవంతులు, మహానుభావులు ధనధాన్య సంపన్న మయిన భూమిని పరిపాలించి, చివరకు రాజ్యాలను, గొప్ప భోగాలను వదిలి యమునికి వశమై పోయారు.

ఎంతోకష్టపడి పెంచిన కొడుకు చచ్చిపోతే మానవులు తమ యిళ్లల్లో నుండి (వారి శవాలను) బయటకు ఎత్తి పారేస్తున్నారు. వాని కోసం జుట్టు విరబోసుకొని జాలిగా ఏడుస్తూనే చితిమధ్య కట్టెలాగా పడవేస్తున్నారు. చనిపోయిన వాని ధనం మరొకడు తింటున్నాడు. వాడి శరీర ధాతువులను పక్షులూ, అగ్నీ తింటున్నాయి. కాని జీవుడు మాత్రం పుణ్యం పాపం అనే రెంటితో చుట్టుకొని పరలోకానికి పోతున్నాడు. పూలు పండ్లు లేని చెట్లను పక్షులు వదిలిపోయినట్లు జ్ఞాతులు, స్నేహితులు, కొడుకులు చనిపోయినవానిని వదిలి వెనుదిరిగి పోతారు. చితిలో పడిన మానవుని తాను చేసుకొన్న కర్మ ఒక్కటే అనుసరించి వస్తుంది. అందుచేతనే మానవుడు ప్రయత్నం చేసి మెల్లమెల్లగా ధర్మం కూడబెట్టుకోవాలి. ఈ లోకానికి పైని, పరలోకానికి క్రింద పెద్ద చీకటి ఉంది. అదే మన యింద్రియాలను బాగా మోహపెడుతుంది. రాజా! తెలుసుకో. అది నిన్ను పొందకుండును గాక. ఈ మాట నీవు విని, ఉన్నదున్నట్లు అర్థం చేసుకోగలిగితే నీకు జీవలోకంలో గొప్ప కీర్తి కలుగుతుంది. ఇహ పరాలు రెండిట నీకు భయం ఉండదు. ఆత్మ అనేది ఒకనది. పుణ్యం దాని రేవు. సత్యం దాని నీరు. ధైర్యం దాని ఒడ్డు. దయయే కెరటం. అందులో స్నానం చేసిన పుణ్య కర్ముడు పవిత్రు డవుతాడు. పుణ్యసహిత మయిన ఆత్మ అంటే ఎల్లపుడూ లోభం లేక పోవడమే. కామక్రోధా లనే మొసళ్లు, పంచేంద్రియా లనే నీరూ కల నదిని ధైర్యపూర్ణ మయిన నావను చేపట్టి జన్మకష్టాలను దాటు.

ప్రజ్ఞచేత, ధర్మంచేత, విద్యచేత, వయసుచేత వృద్ధు డయిన తన బంధువును పూజించి, ప్రసన్నుని చేసికొని, కర్తవ్యాకర్తవ్యాలు అడిగే వాడు ఎప్పుడూ పొరపడడు. ధైర్యంతో గుహ్యాన్ని, పొట్టను రక్షించుకోవాలి. అలాగే కాలుచేతులను కంటితో; కన్ను, చెవులను మనసుతో; మనస్సును, మాటను సత్కర్మతోను రక్షించుకోవాలి. నిత్యమూ స్నానసంధ్యాదు లాచరిస్తూ యజ్ఞోపవీతం ధరించినవాడు, నిత్యమూ వేదాధ్యయనం చేసేవాడు, పతితుల అన్నం తిననివాడు, సత్యమే పలికేవాడు, గురుశుశ్రూష

చేసేవాడు- ఈ లక్షణాలు కల బ్రాహ్మణుడు బ్రహ్మలోకం నుండి పతనం చెందడు. వేదాధ్యయనం చేసి, అగ్నికి నాలుగు వైపుల దర్భలు పరచి యజ్ఞాలు చేసి, ప్రజలను పరిపాలించి, శస్త్రాలతో పవిత్ర మయిన అంతరంగంతో గోబ్రాహ్మణుల కోసం యుద్ధంలో చనిపోయిన క్షత్రియుడు స్వర్గం పొందుతాడు. వైశ్యుడు వేదశాస్త్రాధ్యయనం చేసి, బ్రాహ్మణులను, క్షత్రియులను, తన్ను ఆశ్రయించుకొన్న వారిని, సమయంలో ధనంతో ఆదుకొని, త్రేతాగ్ని ధూమం ఆఘ్రాణించే పుణ్యమూర్తియై, మరణించి స్వర్గంలో దివ్య సుఖాలు అనుభవిస్తాడు. బ్రహ్మక్షత్రియ వైశ్యుల్ని న్యాయబద్ధంగా గౌరవిస్తూ, తృప్తిపరుస్తూ, పాపక్షాళనం చేసుకొంటూ సుఖంగా శరీరం వదిలి వెళ్ళిపోయిన శూద్రుడు స్వర్గ సుఖాలు అనుభవిస్తాడు. నాలుగు వర్ణాల ధర్మాలూ నీకు చెప్పాను. కారణం చెపుతా విను. ధర్మరాజు క్షత్రియధర్మంనుండి తొలగి ఉన్నాడు. రాజా ! నీ వాతనిని రాజధర్మంలో నియోగించు." అనగానే ధృతరాష్ట్ర డిట్లన్నాడు. "నీవు నాకు సదా ఉపదేశం చేస్తూనే ఉన్నావు. నీవు చెప్పినట్లే నా బుద్ధికి కూడా అలాగే అనిపిస్తుంది. పాండవులను గురించి నాకు ఎల్లపుడూ అదే బుద్ధి కలుగుతూ ఉంటుంది. కాని దుర్యోధనుని కలిశాక మళ్లీ మారిపోతుంది. ఏ ప్రాణికీ కూడా దైవాన్ని దాట శక్యం కాదు. అందుచేత దైవమే స్థిరమైనది. పురుషప్రయత్నం వ్యర్థ మయినదని నా భావన."

41. అధ్యాత్మవిద్య నుపదేశింపుమని విదురుడు సనత్సుజాతుని కోరుట.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "విదురా ! నీవు ఆశ్చర్యకర మయిన విషయాలు చెపుతున్నావు. ఇంకా చెప్పనివి ఏవయినా ఉంటే అవి వినాలనుకొంటున్నాను చెప్పు." విదురుడు చెప్పనారంభించాడు. "ప్రాచీనుడూ, నిత్యుడూ, కుమారుడూ అయిన సనత్సుజాతుడు "మృత్యువు లేదు" అని చెప్పాడు. ప్రజ్ఞావంతు లందరిలోనూ సనత్సుజాతుడు ఉత్తముడు. అతడు నీకు రహస్యములూ, ప్రకాశములూ అయిన ధర్మాలన్నీ చెపుతాడు." అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "విదురా! ఆ సనత్సుజాతుడు చెప్పేవి నీకు తెలియవా ? నీకు తెలిస్తే నీవే చెప్పు." విదురుడిలా జవాబు చెప్పాడు. "సనత్సుజాతుడు చెప్పే శాశ్వత విద్య నాకూ తెలుసును. కాని నేను శూద్రస్త్రీకి పుట్టినందువల్ల చెప్పను. బ్రాహ్మణుడు గుహ్య విశేషాలు చెప్పినా

దేవతలు వానిని నిందింపరు. అందుకోసం నీకు అలా చెప్పాను."

అపుడు ధృతరాష్ట్రుడు "ఆ సనత్సుజాతుడు చాలా పూర్వుడు కదా ! ఈ శరీరంతో ఇక్కడే ఆయనను కలవడం ఎలా కుదురుతుంది? చెప్పు" అన్నాడు. వెంటనే విదురుడు ప్రశస్తమైన వ్రతం కల ఆమహర్షిని మనసులో తలచుకొన్నాడు. విదురుని మనసెరిగి సనత్సుజాతుడు ప్రత్యక్షమయ్యాడు. అపుడు విదురుడు సనత్సుజాతునికి యథాశాస్త్రంగా స్వాగతం చెప్పాడు. సనత్సుజాతుడు సుఖంగా కూర్చుని విశ్రాంతి తీసుకొంటుండగా విదురు డాయనతో ఇలా అన్నాడు. "స్వామీ! ధృతరాష్ట్రుని మనస్సులో ఒక సందేహం కలిగింది. అది నేను తీర్చలేను. మీరే వీనికి చెప్పాలి. మీ ఉపదేశం విని, ఈ మహారాజు సర్వదుఃఖాలూ విడిచిపెడతాడు. లాభాలాభాలు, ప్రియాప్రియాలు, జరామరణాలు, భయం అసహనం, ఆకలిదప్పులు, గర్వం సంపద, విరక్తి ఆలస్యం, కామక్రోధాలు, పాపపుణ్యాలు ఇతనిని బాధించవు."

42. ధృతరాష్ట్రుని ప్రశ్నలు - సనత్సుజాతుని సమాధానము.

వెంటనే మంచి తెలివి గల ధృతరాష్ట్ర మహారాజు విదురుని మాటను గౌరవిస్తూ జ్ఞానకాంక్షతో ఏకాంతంగా సనత్సుజాతుని ఇలా అడిగాడు.

"మీరు మృత్యువు అనేది లేదని చెపుతూ ఉంటారట. మరి అయితే దేవతలూ, రాక్షసులూ మృత్యువు రాకూడదని బ్రహ్మచర్యవ్రతం ఆచరించారట. ఈ రెండింటిలో ఏది నిజం?"

సనత్సుజాతుడు ఇలా చెప్ప నారంభించాడు. "రాజా ! బ్రహ్మచర్యంతో మృత్యువు లేకుండా పోతుందా ? లేక అసలు మృత్యువే లేదా ? అని గదా నీ ప్రశ్న. ఇవి రెండూ విరుద్ధంగా ఉన్నాయని అనుకోకు. చెపుతా - విను. రాజా ! ఒకమనిషికే ఈ రెండూ- సత్యాలే అని తెలుసుకో. మోహం (అజ్ఞానం) వల్లనే మృత్యువు కలుగుతుందని ప్రజ్ఞకలవా రనుకొంటారు. కాని ప్రమాదమే మృత్యువని నేనంటాను. అలాగే జ్ఞానమే (వస్తుతత్త్వం సరిగా తెలియటమే) అమృతత్వం అని నా అభిప్రాయం. అసురులు ప్రమాదం వల్లనే మృత్యువుకు వశమయ్యారు. అప్రమాదం (జ్ఞానం) వల్ల బ్రహ్మమే అవుతారు. ఈ అజ్ఞానరూప మయిన మృత్యువు పెద్దపులిలాగా జంతువులను మ్రింగదు. ఆ మృత్యువుకు రూపమే లేదు గదా !

కొంతమంది ఆత్మలో కల్పించుకొన్న యముని మృత్యువని అంటారు. బ్రహ్మచర్యమే నిజానికి మోక్షకారణం. యముడు పుణ్యం చేసుకొన్న వారికి శుభమూ, పాపం చేసుకొన్న వారికి అశుభమూ కలిగిస్తాడు. అతడు పితృలోకం పాలించే దేవుడు. ఈ యముని ఆజ్ఞవల్లనే మానవుల్లో క్రోధమూ, పొరపాటు, లోభమూ అనే వాటితో బయటపడే మృత్యువు కలుగుతోంది. ఆ అహంకారంతో జీవుడు అపమార్గంలో తిరుగుతూ ఆత్మతో కలియటం లేదు. అలా కలియక పోతే మానవులు మోహం పొందుతారు. మోహితులై క్రోధాదిరూ మయిన మృత్యువుకు వశమై ఇక్కడ నుండి యమలోకానికి వెళ్లి, అక్కడి నుండి ఇక్కడకు పడుతూ ఉంటారు. వాని ననుసరించే ఇంద్రియాలూ (దేవాఃు) ప్రవర్తిస్తాయి. అందుకే మృత్యువుకు మరణమనే పేరు ఏర్పడింది. జీవికి పుట్టుకతోనే కర్మ పుడుతుంది. ఆ కర్మ ఫలాలు అనుభవించాలని అనురాగం పుడుతుంది. అది భోగవాసన. దానితో స్వర్గాదులకు పోతున్నారు మానవులు. కాని మృత్యువు నుండి తప్పించుకొనడం లేదు. పరబ్రహ్మ స్వరూపం తెలుసుకోవడానికి అవసర మయిన యోగం తెలియక దేహి భోగాసక్తితో అంతటా తిరుగుతున్నాడు. అసత్య విషయాల మీద ఆసక్తి నిత్యమూ ఉండటం అనేదే ఇంద్రియాలకు పెద్ద మోహం కలిగిస్తుంది. ఈ ఆసక్తినే మిథ్యాభియోగం అంటారు. దీనితో మానవుని అంతరాత్మ దెబ్బతింటుంది. అపుడు మానవుడు ఆ విషయాలనే స్మరిస్తూ, సేవిస్తూ, ఉంటాడు. విషయస్మరణ మంటే అభిధ్య - ఇదే ముందు లోకులను దెబ్బతీస్తుంది. తరువాత కామక్రోధాలు రెండూ పడగొడతాయి. ఇలా విషయస్మరణ, కామ, క్రోధాలూ- ఈ మూడూ వివేకంలేని వారిని (బాలురను) మృత్యువుకు అప్పగిస్తాయి. ధీరులు (ధైర్యం, వివేకం, కలవారు) ధైర్యంతో మృత్యువును దాటిపోతారు.

మృత్యువును తరించా లనుకొన్నవాడు ఆత్మపదార్థాన్ని ధ్యానిస్తూ ఉప్పొంగే కామాదులను ఆదరింపడు (సేవింపడు). వాటిని గుర్తింపక అనాదరంతో రూపుమాపుతాడు. ఇలా కామాదులను చంపేవానిని మృత్యువు వశం చేసుకోలేదు. ఇతరులను తిన్నట్లు వీనిని తినలేదు. కామం లేని వాడికి మృత్యుభయం లే దన్నమాట. కామాదుల వెంటపడే పురుషుడు కామాదులతో పాటు తానూ చనిపోతాడు. అలా కాక కామాదులను ముందు గెంటివేస్తే ఏమాత్రం దుఃఖం మిగిలినా దాన్ని కూడా వదిలించుకొంటాడు. అసలీ కామం కారుచీకటి. ఇందులో ఏమాత్రం వెలుగు లేదు. ప్రాణులకు ఇది

నరకంగా కనిపిస్తుంది. కాని త్రాగి మైకంలో ఉన్నవారు గుంటల్లో పడిపోయినట్లు సంసారం సుఖ మనుకొని పరుగులు పెడుతున్నారు. తెలివిగల మానవుడు కాముని ఆయువును చితకగొట్టాలి. సుఖా లనుకొనే వాటిని మనసులోకి రానివ్వ కూడదు. విషయాలను స్మరించరాదు. అలా అజ్ఞానం పోతే మృత్యువు ఇక గడ్డిపులి లాంటిదే. అదేమీ చేయదు గదా! నీ శరీరంలో మోహవశమై క్రోధలోభరూపంతో ఉన్న అంతరాత్మయే మృత్యువు. ఇలా యముడు మనసులోనే పుడుతున్నా డనే జ్ఞానమెరిగినవాడు యమునికి భయపడడు. ఎలా అంటే లోకంలో మృత్యువుకు వశమయిన శరీరం నశించిపోతోంది. అలాగే జ్ఞానం కలగగానే అజ్ఞానం అనే మృత్యువు కూడా నశించి పోతుంది."

ధృతరాష్ట్రుడు : ద్విజులకు యజ్ఞయాగాది కర్మల ద్వారా శాశ్వత పుణ్య లోకాలు కలుగుతాయంటారు. అవి శ్రేష్ఠమని వేదాలూ చెపుతున్నాయి. ఈ విషయం తెలిసినవాడు కర్మమార్గం ఎందుకు పొందడు?

సనత్సుజాతుడు : నీ వన్నట్లు విద్వాంసుడు కానివాడు అక్కడకు చేరుతాడు. భోగమోక్షం అనేదాన్ని వేదాలూ చెపుతున్నాయి. జీవుడు నిష్కాముడై నిర్గుణ పరమాత్మను చేరుతాడు. మిగిలిన మార్గాలను తొలగించుకొని సుషుమ్నా మార్గం ద్వారా (నిర్గుణ) మోక్షాన్ని పొందుతాడు.

ధృతరాష్ట్రుడు : మహాత్మా! చావూ పుట్టుకా లేని పురాణపురుషుడయిన పరమాత్మను ఎవరు నడుపుతారు ? ఎవరూ లేరు, అతడే అన్నింటినీ ప్రవర్తింపజేస్తున్నాడంటే అసలు అతనికి ఈ పని ఎందుకు? దీనివల్ల అతనికి కలిగే సుఖం ఏమిటో ఉన్నదున్నట్లు చెప్పండి.

సనత్సుజాతుడు : జీవాత్మ పరమాత్మల మధ్య భేదకల్పనం దోషం. అనాది అయిన మాయతో సంబంధం వలన జీవునకు కామసుఖాదులతో సంబంధ మేర్పడుతుంది. అంతమాత్రం చేత పరమాత్మ ఆధిక్యానికి నష్టం లేదు. అనాది అయిన మాయ వలన జీవులు మరల ఏర్పడుతున్నారు. కనిపించే యీ జగత్తు ఆ పరమాత్మయే. అతడు నిత్యుడు. అతడే మాయతో విశ్వాన్ని చేస్తున్నాడు. ఆ మాయయే పరమాత్మశక్తి అని వేదాలు భావిస్తున్నాయి. అలా శక్తికీ, శక్తిమంతునికీ అభేదాన్ని వేదాలే చెపుతున్నాయి.

ధృతరాష్ట్రుడు : ఈ మోక్షం కోసం కొంతమంది ఇక్కడ ధర్మాలను

ఆచరించరు. అలాగే కొందరు ధర్మాలను ఆచరిస్తారు. అటువంటపుడు ధర్మం పాపంచేత నశిస్తుందా? లేక పాపం ధర్మంచేత నశిస్తుందా?

సనత్సుజాతుడు : మోక్షానికి రెండు మార్గాలూ ఉపకరిస్తాయి. ధర్మానికీ, పాపానికీ ఫలం తప్పకుండా వస్తుంది. మోక్ష విషయంలో సన్యాసం, కర్మం రెండూ నిత్యాలే. విద్వాంసుడు జ్ఞానంతో సిద్ధమైన మోక్షం పొందుతాడు. కర్మలతో పుణ్యాన్ని పొందవచ్చు. అలాగే పాపాన్ని పొందవచ్చు. సన్యాసంచేత మోక్షం తప్పక లభిస్తుంది. కర్మలచేత దేవత్వం, తద్ద్వారా మోక్షం పొందవచ్చు. లేదా భ్రష్టుడు కావచ్చు. అందుచేత జ్ఞానం మంచిది. కర్మఫలం అనుభవంతో నశిస్తుంది. అంటే శుభకర్మ ఫలితమూ, దుష్కర్మ ఫలితమూ రెండూ నశిస్తాయి. తరువాత కూడా జీవుడు అలవాటుగా మళ్లీ కర్మ లాచరిస్తాడు. కాని విద్వాంసు డయితే ధర్మంతో పాపం పోగొట్టుకుంటాడు. అంటే ధర్మం కర్మ కంటే బలీయమైనది. అందుకే కాలక్రమేణ కర్మయోగికి కూడ సిద్ధి కలుగుతుంది.

ధృతరాష్ట్రుడు : ధర్మాచరణం చేసేవారికి పుణ్యంవల్ల సనాతనలోకాలు కలుగుతాయని వేదశాస్త్రాలు చెపుతున్నాయి గదా ! వాటిక్రమాన్నీ, ఇంకా ఇతరమైన మోక్షమార్గాన్ని చెప్పండి. నాకీ కర్మను గురించి తెలుసుకోవాలని లేదు.

సనత్సుజాతుడు : బలం విషయంలో బలవంతులకు స్పర్ధ ఉంటుంది. అలాగే బ్రహ్మవేత్తలలోకూడ. వారు చనిపోయాక బ్రహ్మలోకం చేరి ప్రకాశిస్తారు. యజ్ఞాది ధర్మాల్లో దీక్ష కలవారికి ఆ దీక్షయే జ్ఞానమిస్తుంది. అట్టి వారు స్వర్గాన్ని చేరుతారు. కొందరు వేదవేత్తలు ఆ ధర్మాచరణం చక్కగా చేస్తారు. అదే మంచిదని చేస్తారు. అలా బహిర్గతంగా, అంతర్ముఖంగా అనుకొనే వారిని గురించి పెద్దగా పట్టించుకో నవసరం లేదు. వర్షాకాలంలో ఎక్కువగా గడ్డి మొలుస్తుంది. అలాగే అన్నపానాలు పుష్కలంగా ఉన్నయింటిని ఆశ్రయించి బ్రహ్మజ్ఞాని జీవించాలి. అంతేకాని ఆకలితో ఆత్మను బాధింపరాదు. బ్రహ్మవేత్త తాను అశుభంకరమయిన దేశంలో ఉన్నా, భయంకర ప్రదేశంలో ఉన్నా దాన్ని గురించి గొప్పగా చెప్పుకోరాదు. తనకు సామర్థ్యం ఉన్నా ఆ గొప్పతనం ప్రకటించుకోరాదు. అతడే శ్రేష్ఠుడు. ఒకవేళ ఎవరయినా అలా చెప్పుకొన్నా గృహస్థుడు పరితాపం చెందకూడదు. అసూయ పడకూడదు. బ్రహ్మస్వాన్ని ఉపయోగించని అటువంటి గృహస్థుని భోజనాన్ని స్వీకరించటమే సన్యాసికి

తగినది. కుక్క తాను కక్కిన కూటినే మళ్లీ తింటుంది. అది దానికి అనర్థమే కలిగిస్తుంది. అలాగే సన్యాసి తన సామర్థ్యాన్ని, పాండిత్యాన్ని ప్రదర్శించి బ్రతకకూడదు. అలా ప్రదర్శిస్తే కక్కిన కూడు తిన్నట్లే. పాండిత్యం ప్రదర్శించి భిక్ష స్వీకరించరాదు. జ్ఞాతుల మధ్య ఉన్నా సన్యాసి తాను అజ్ఞాతంగానే (తనయోగశక్తి చెప్పుకోకుండా) ప్రవర్తించాలి. అపుడే పండితు లతనిని బ్రహ్మవేత్త అని అంటారు. ఈ సత్ప్రవర్తన లేకపోతే ఏ బ్రాహ్మణుడూ పరమాత్మను పొందలేడు. ఆ పరమాత్మ అడ్డుగోడలు లేనివాడు. అనుమానాది ప్రమాణాలకు లొంగనివాడు. అంతటా స్థిరంగా ఉన్నవాడు. పరిశుద్ధుడు. ద్వైతభావా లేవీ లేనివాడు. ఆ సత్ప్రవర్తన లేని బ్రాహ్మణుని కంటె ఉత్తమ క్షత్రియుడు మేలు. అతడిని కూడ పరబ్రహ్మము తన ప్రకాశంతో నింపుతుంది. దర్శిస్తుంది. అనగా అజ్ఞాత చర్యారూపమయిన సత్ప్రవర్తన ముఖ్య మన్నమాట. దేహాదుల కంటే వేరయిన ఆత్మను దేహాది రూపాలతో భావించేవాడు ఆత్మను అపహరించే దొంగ అవుతాడు. వాడు అన్ని పాపాలూ చేసినట్లే. బ్రహ్మతత్త్వం తెలుసుకోవాలనుకొన్నవాడు అలసట ఎరుగకుండా ప్రయత్నించాలి. ఎవరి నుండీ ఏమీ స్వీకరింపరాదు. అందరికీ ఇష్టుడై ఉండాలి. ఏ కష్టమూ తాను పడకూడదు, ఇతరులకు కలిగింపకూడదు. సత్ప్రవర్తన కలిగి ఉండాలి. కాని ప్రకటించుకోరాదు. అపుడే క్రాంతదర్శియై బ్రహ్మజ్ఞాని అవుతాడు. ఆ బ్రహ్మజ్ఞానులు లౌకిక మయిన ధనం లేనివారు. దైవసంబంధ మయిన ధనం విషయంలో ఉన్నవారు. అలాగే ఉపాసన విషయంలో కూడా ధనవంతులు. ఎవరూ వారిని వశపరచుకోలేరు. కదపలేరు. వారు బ్రహ్మస్వరూపులని తెలుసుకోవాలి. స్విష్టకృత్తులయిన దేవతలను తెలిసికొన్నవాడు కూడ బ్రహ్మజ్ఞానితో సమానుడు కాడు. ఎందుచేత నంటే అతడు స్విష్టం కోసం స్వయంగా ప్రయత్నిస్తాడు. కాని జ్ఞానఫల మయిన మోక్షం స్వతఃసిద్ధమయినదీ, నిత్యమూ. ప్రయత్నం లేకుండానే మన్నన పొందేవాడే మాన్యుడు. అతడు మన్నన పొందినా తన్ను మాన్యుడని భావింపడు. అవమానం పొందినా బాధపడడు. లోకం మన్నించినపుడు అది విద్వాంసుల స్వభావం అనుకొంటాడు బ్రహ్మజ్ఞాని. కనులు మూతపడటం, తెరచుకోవడం లాంటి లోకస్వభావం అనుకొంటాడు. అంటే సమ్మానానికి పొంగిపోడు. అవమానానికి కుంగిపోడు. మూర్ఖులు అధర్మంలోనూ, మోసంలోనూ అరితేరి మాన్యులను కూడా మన్నించరు. పరిగడా అవమానిస్తారు. మానమూ

(అహంకారం), మౌనమూ ఎప్పుడూ కలిసి ఉండవు. ఎందుచేతనంటే... అహంకారానికి ఈ లోకం నివాసం. మౌనానికి పరలోకం నివాసం. రాజా ! లోకంలో సంపద సుఖానికి నిలయం. కాని అది పరలోకానికీ, తత్త్వజ్ఞానానికీ శత్రువు. బ్రహ్మజ్ఞాన సంపద ప్రజ్ఞారహితునికి లభించదు. ఈ బ్రహ్మజ్ఞాన సంపదకు చాలా సాధనాలు ఉన్నాయి. అవి చాలా జాగ్రత్తగా రక్షించుకోవాలి. అవి ఇవి. 1. సత్యం, 2. ఆర్జవం, 3. తప్పుపనులకు సిగ్గుపడటం, 4. దమం 5. శౌచం, 6. విద్య. ఇవి మోహం కలిగించవు. అనగా అజ్ఞానం అనే మృత్యువును కలిగించవు."

43. గుణదోష నిరూపణము.

అవ : సన్యాసంతో కూడిన మునిధర్మం మౌనం - దాన్ని గూర్చి ప్రశ్నిస్తున్నాడు.

ధృతరాష్ట్రుడు ఇలా ప్రశ్నించాడు. "మునీ ! ఈ మౌనం ఏ ప్రయోజనం కోసం ? 2. మౌనం అంటే మాట్లాడక పోవటమా ? లేక నిదిధ్యాసనమా ? ఈ రెంటిలో ఏది ? 3. మౌనం యొక్క లక్షణాలేవి ? 4. మౌనం చేత నిర్వికల్పస్థితి కలుగుతుందా ? 5. మౌనం ఎలా ఆచరిస్తారు ?" సనత్సుజాతుడు ఇలా చెప్పాడు. "రాజా ! వేదాలు కానీ మనసు కానీ పరబ్రహ్మాన్ని ప్రవేశించలేవు. అందువల్ల పరబ్రహ్మమే మౌనం. మౌనం నుండియే వైదిక లౌకికశబ్దాలు వచ్చాయి. అందుచేత భూతాత్మ శబ్దస్వరూపంతో ప్రకాశిస్తుంది."

ధృత : ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, తెలిసినవాడు పాపాలు చేస్తే వానికి దాని ఫలితం అంటుతుందా ? అంటదా?

సన : ఋగ్వేద మైనా, యజుర్వేద మయినా, సామవేద మయినా అవివేకిని కర్మఫలరూపమైన పాపం నుండి రక్షించలేవు. నీకు నేను అసత్యం చెప్పటంలేదు. కపటమనస్సు, కపట చేష్టలు, కలవానిని వేదాలు పాపం నుండి రక్షించలేవు. రెక్కలు, వస్తే పక్షులు గూటిని వదలి వెళ్లి పోయినట్లు మరణ సమయంలో వేదాలు పాపకర్ముని వదలి వెళ్లిపోతాయి. అనగా వానికి స్ఫురించవు.

ధృత : ధర్మం ఆచరింపకపోతే వేదాలు రక్షింపలే వని గదా అంటున్నావు. అపుడు అనాదిగా విప్రులు చెప్పే మాటలకు విలువ ఏమిటి?

సన : మహానుభావా ! ఆ పరమాత్మయొక్క నామరూపాత్మకంగానే యీ

జగత్తు భాసిస్తుంది. వేదాలు ఈ విషయం నిరూపించి చెపుతాయి. అంతేకాదు, విశ్వంకంటే పరమాత్మ విలక్షణ మైనదని కూడా చెపుతాయి. ఆ బ్రహ్మమును పొందటానికి తపస్సు, యజ్ఞము రెండు సాధనాలు. వీటివల్ల విద్వాంసుడు పుణ్యం పొందుతాడు. దానితో ముందు పాపం నశిస్తుంది. తరువాత జ్ఞానంతో ఆత్మజ్యోతి వెలుగుతుంది. విద్వాంసుడు జ్ఞానంతో పరమాత్మను పొందుతాడు. ఇతర మార్గం పట్టితే... కోరికతో చేసిన కర్మఫలం అంతటిని గ్రహించి పరలోకంలో అనుభవిస్తాడు. ఇంకా మిగిలిన దాని అనుభవం కోసం మళ్లీ ఈ మార్గం పడతాడు. జ్ఞానరహితులు ఈ లోకంలో చేసిన తపస్సు యొక్క ఫలితం పరలోకంలో అనుభవిస్తారు. జ్ఞానంతో కర్తవ్యంగా చేసిన తపస్సుయొక్క ఫలితం ఈ లోకంలోనే అనుభవించబడుతుంది.

ధృత : సనత్సుజాతా ! ఒకే తపస్సు ఒకరికి సమృద్ధమూ, మరొకరికి అసమృద్ధమూ ఎలా అవుతుంది ? ఆ రెండూ నాకు తెలిసేటట్లు చెప్పు.

సన : నిష్కల్మషమైన తపస్సును కేవల మంటారు. కల్మషమంటే కోరిక. కోరిక లేని తపస్సు కేవల తపస్సు. కోరికతో చేసే తపస్సు రెండు విధాలు. 1. సమృద్ధము 2. బుద్ధము 1. ఏదయినాకోరికతో చేసేది సమృద్ధం 2. ఇతరుల మెప్పుకోసం, గొప్ప కోసం, ఆడంబరం కోసం చేసే తపస్సు బుద్ధం. రాజా ! నీవడిగేది అంతా అనగా ఈ లోకపుభోగాలన్నీ తపస్సు వల్లనే కలుగుతాయి. కాని వేదవేత్త లయిన జ్ఞానులు మాత్రం తపస్సుతో ముక్తిని పొందుతున్నారు.

ధృత : నిష్కల్మషమైన తపస్సు అంటే ఏమిటి ? అసలు తపస్సుకు కల్మష మేమిటి ? చెప్పు - అది వింటే సనాతన మయిన సత్యం తెలుస్తుంది.

సన : రాజా! తపస్సును చెరిచే క్రోధం మొ॥ దోషాలు పన్నెండు ఉన్నాయి. అలాగే పదమూడు క్రూరలక్షణాలూ ఉన్నాయి. ఇవన్నీ కల్మషాలు. అలాగే మన్వాదులు చెప్పిన గుణాలూ శాస్త్రంలో ఉన్నాయి. అవి ధర్మం మొ॥నవి. దోషాలు పన్నెండు ఇవి. 1. క్రోధం, 2. కామం, 3. లోభం, 4. మోహం, 5. మితిమీరిన స్వార్థచింత, 6. నిర్దయ 7. అసూయ, 8. మానం, 9. శోకం, 10. లౌకికవిషయవాంఛ. 11. ఈర్ష్య, 12. జుగుప్స. వీనిని మానవుడు సదా వదిలిపెట్టాలి. ఈ దోషాల్లో ఏ ఒకటి ఉన్నా వేటకాడు మృగాలను హింసించినట్లు మానవుల బలహీనతలను పొంచిచూసి హింసిస్తాయి. ఇక అన్నీ ఉంటే వేరే చెప్పాలా ? ఇక క్రూరులు పదమూడు రకాలు 1. గొప్పలు

చెప్పేవాడు 2. చెడ్డకోరికలు కలవాడు. 3. దురభిమాని, 4. కోపి, 5. చపలుడు, 6. సమర్థుడై రక్షించనివాడు. వీరు ఆపత్సమయాల్లో కూడా పాపకార్యాలు చేస్తారు. 7. స్త్రీ సంగమమే పరమార్థం అనుకొనేవాడు, 8. అతిగర్వి, 9. దానం చేశాక బాధపడేవాడు, 10. పిసినారి, 11. బలవంతంగా పన్నులు లాక్కునేవాడు, 12. పాపంచేసి గొప్పగా చెప్పుకొనేవాడు. 13. పతివ్రతాస్త్రీలను ద్వేషించేవాడు.

ఇక గుణాలు, 12 ఇవి. 1. ధర్మం, 2. సత్యం, 3. దమం, 4. తపస్సు, 5. మాత్సర్యం లేకుండటం, 6. లజ్జ, 7. సహనం, 8. అసూయ లేకపోవడం, 9. యజ్ఞం, 10. దానం, 11. ధైర్యం, 12. వేదజ్ఞానం. ఇవి బ్రహ్మజ్ఞానం పొందేవాని గుణాలు. ఈ పన్నెండు గుణాలూ కలవాడు ఈ భూమినంతటినీ పరిపాలింపగలడు. ఇందులో కనీసం ఒకటో, రెండో, మూడో ఉన్న వాడు కూడా సంపన్నుడే అని తెలుసుకోవాలి.

దమం, త్యాగం, పొరబడకపోవటం అనేగుణాల్లో ముక్తి ఉంది. ఇవి సత్యప్రధానంగా లభిస్తాయని బ్రహ్మజ్ఞానులు చెపుతారు.

ఈ దమం 18 దోషాలు లేనప్పుడే 18 గుణాలు కలదవుతుంది. ఆ 18 దోషాలు ఇవి. 1. వేదవిహితకర్మలపట్ల, ఉపవాసాదికాలపట్ల వ్యతిరేకంగా ప్రవర్తించడం 2. అసత్యం 3. అసూయ 4. కామం 5. అర్థం 6. వాంఛ 7. క్రోధం 8. శోకం 9. అతివాంఛ 10. లోభం 11. చాడీలు చెప్పడం, 12. మాత్సర్యం 13. ఇతరులను పీడించడం 14. దుఃఖం 15. సత్కార్యప్రీతి లేకపోవడం 16. కర్తవ్యం మరచిపోవడం 17. పరనింద 18. తాను గొప్పవాడ ననుకోవడం. ఈ 18 దోషాలు లేనివాడే దాంతుడు (అనగా దమగుణం కలవాడు). ఈ 18 దోషాలు కలిగి ఉండటమే మదం. త్యాగం ఆరు రకాలు – దాని వ్యతిరేకగుణాలు ఆరు. ఆ పద్దెనిమిది, ఈ ఆరూ మొత్తం ఇరవైనాలుగు మదదోషాలు. త్యాగం ఆరు విధాలు – చాలామేలు కూర్చుతుంది త్యాగం. అందులో మూడవ గుణం దుష్కరం. ఆ మూడవ గుణం ఆచరిస్తే భేదభావం పోతుంది. దానితో దుఃఖాన్ని తరించవచ్చు.

ఆరు రకాల త్యాగం చాలా మేలైనది. 1. సంపద కలిగి కూడా పొంగి పోకుండా ఉండటం 2. నిత్యవైరాగ్యభావంతో ఇష్టం, పూర్తం అనే సత్కర్మ లాచరించడం, 3. నిత్యవైరాగ్యభావంతో కోరికలు విడిచిపెట్టడం, ఇది మూడవది. దీన్ని గొప్పగా

చెప్పుకోరాదు. నిష్కామత్వం అనేది విషయాలను పూర్తిగా వదలినపుడే కలుగుతుంది. అంతేకాని పూర్తిగా అనుభవించినంత మాత్రాన కలుగదు. సర్వ సద్గుణాలూ, సంపదలూ కలవానికి కూడా ఒక్కొక్కపుడు కార్యాలు సిద్ధించవు. అపుడు దుఃఖ పడరాదు, దానితో క్రుంగిపోరాదు. 4. అప్రియం కలిగినా ఎన్నడూ వ్యథ చెందకూడదు. 5. ఇష్టులయిన భార్యాపుత్రులను కూడా యాచింప కూడదు. 6. తగినవాడై తన్ను అడిగినవానికి ఇవ్వడం శుభంకరమవుతుంది. ఇటువంటి గుణాలలో పొరబడరాదు. దీన్ని అప్రమాదం అంటారు.

అవ :ఈ అప్రమాదం ఎనిమిది విధాలు

1. సత్యం, 2. ధ్యానం, 3. సమాధి, 4. తర్కం, 5. వైరాగ్యం, 6. దొంగతనం లేకపోవడం, 7. బ్రహ్మచర్యం, 8. సంపద కూడబెట్టకుండటం. ఇలాగే మదం యొక్క దోషాలు కూడా చెప్పారు. వాటిని వదలిపెట్టాలి. అలాగే త్యాగం, అప్రమాదం అనే వాని స్వరూపమూ చెప్పాను. అది ఎనిమిది గుణాలు కలది. ప్రమాదానికి (అశ్రద్ధ) ఎనిమిది దోషాలున్నాయి. వానిని విడిచిపెట్టాలి. అయిదు ఇంద్రియాల వల్ల అయిదు, మనసు వల్ల ఒకటి. ఇప్పటికే వచ్చినది ఒకటి. ఇకముందు రాబోయేది ఒకటి ఇలా మొత్తం ఎనిమిది. వీనిని విడిచిపెడితే వాడు సుఖం పొందుతాడు. (దమ, త్యాగ, అప్రమాదాలు సత్యమూలాలని చెప్పాడు. దాని వివరణ ఇది.) రాజా ! సత్యం మీద మనసు పెట్టు. సత్యంలోనే లోకాలు నిలుస్తున్నాయి. దమ, త్యాగ, అప్రమాదాలు సత్య ముఖాలని అందుకే అన్నారు. సత్యంలోనే మోక్షం ఉంది. దోషాలు వదలి తపోవ్రతాన్ని ఆచరించాలి. ఇది విధి చేసిన నియమం. సజ్జనులకు సత్యమే వ్రతం. ఈ దోషాలు విడిచి, ఈ గుణాలతో కూడి చేసిన వాని తపస్సే సమృద్ధమై కైవల్యం చేకూరుతుంది. రాజా ! నీ వడిగిన దాన్ని నీకు సంక్షేపంగా చెప్పాను. ఇది పాపం హరించి పుణ్యం కలిగిస్తుంది. అంతేకాదు. జనన మరణాలు, ముసలితనమూ లేకుండా చేస్తుంది.

ధృత : ఇతిహాస పురాణాలతో కలసిన నాలుగు వేదాలూ చెప్పే పరబ్రహ్మం అంటే జగత్తే అని కొందరంటారు. అసలు కొందరు నాలుగు వేదా లంటారు. మరికొందరు మూడువేదాలు అంటారు. కొందరు ద్వివేదులు. మరికొందరు ఏకవేదులు. అసలు ఋక్కు అనేదే లే దనే వారు కొందరు. వీరిలో ఎవరు బ్రహ్మవేత్త అని నేను

భావించాలి?

సన : రాజా ! తెలుసుకోవలసినది ఒకటే. అది సత్య మయిన బ్రహ్మము. ఒక్క సత్యం కోసం ఎన్నో వేదాలు తయారయ్యాయి. సత్యమందు నిలిచే వాడొకడే. బ్రహ్మమును పొందడం కష్టం అని భావం. ఇలా పరబ్రహ్మస్వరూపం తెలియకుండానే నేను తెలివిగల వాడ ననుకొంటాడు మానవుడు. (బాహ్యసుఖ) లోభంతో దానం, అధ్యయనం, యజ్ఞం ఆచరిస్తున్నాడు మానవుడు. సత్యంనుండి జారిపోతున్న వారికి (ఊహలు) సంకల్పాలు కూడా అటువంటివే (జారుపాటు ఊహలే) కలుగుతాయి. ఒకనికి మనసు చేతనే యజ్ఞం ఏర్పడుతుంది. మరొకనికి వాక్కు చేత, ఇంకొకనికి కర్మచేత యజ్ఞం సిద్ధిస్తుంది. సంకల్ప సిద్ధు డయిన పురుషుడు సంకల్పాలను పొందుతాడు. పరబ్రహ్మం మీద ఈ సంకల్పం దృఢంగా నిశ్చలంగా నిలవదు. దానికోసం దీక్ష, వ్రతమూ పూనాలి. అందుచేత సన్మార్గులకు సత్యమే శ్రేష్ఠం. జ్ఞానఫలం ప్రత్యక్షంగా కలుగుతుంది. తపఃఫలం పరోక్షంగా కలుగుతుంది. ఎక్కువగా వేదాలు చదవడం మాత్రమే చేసే ద్విజుడు 'బహుపాఠి' అనబడతాడు కాని జ్ఞానికాడు. రాజా ! కేవలం వేదాలు వల్లించినంతమాత్రాన ద్విజుడని అనుకోకు. సత్యం నుండి తొలగని వాడే బ్రాహ్మణు డని తెలుసుకో.

రాజా ! అథర్వమహర్షి పూర్వం వేదాలు కీర్తించాడు. తరువాత ఋషులసముదాయం గానం చేశారు. పఠించి, అర్థం తెలిసినంతమాత్రాన వారిని ఛందోవేత్త లనలేము. వేద వేద్యమయిన పరమాత్మ యొక్క తత్త్వం తెలిస్తేనే వేదం తెలిసినట్లు - వారే వేదవేత్తలు. మానవోత్తమా ! పరమాత్మ విషయంలో వేదాలు స్వతంత్రంగా ప్రవర్తిస్తాయి. అందువలన కేవలం వేదంవల్లనే ఆత్మ తత్త్వాన్ని పొంద రనేదీ లేదు. వేదరహస్యం అందరికీ తెలియదు. వేదాలతత్త్వం ఒకానొకనికి తెలుస్తుంది. కేవలం వేదాలు వల్లించితే తత్త్వం తెలిసినట్లుకాదు. సత్యమెరిగిన వారికే పరతత్త్వం తెలుస్తుంది. మనస్సు మొదలయినవి మనం తెలుసుకోవలసివే కాని అవి వేటినీ తెలుసుకోలేవు. అనగా వేద్యములు. మనసుతో ఆత్మను ఎవరూ తెలుసుకోలేరు. ఆత్మకంటె ఇతరమయిన జగత్తూ వారికి తెలియదు. కేవలం ఆత్మ నెరిగిన వారికే తద్భిన్న మయినదీ తెలుస్తుంది. అనాత్మను మాత్రమే తెలుసుకొన్నవారికి పరతత్త్వం తెలియదు. ప్రమాణాలన్నీ తెలిసినది చిదాత్మ - దానికే పరతత్త్వం

తెలుస్తుంది. ఆ చిదాత్మను ప్రమాణాలు తెలుసుకోలేవు. అయినా ఒకమార్గం ఉంది. వేద రహస్యాలు తెలిసి, అంతఃకరణశుద్ధితో బ్రహ్మజ్ఞానులు మాత్రం తెలుసుకొంటారు. అదికూడా ఆ వేదవాక్యంతోనే.

చంద్రరేఖను చూడటానికి చెట్టుకొమ్మ సూచక మవుతుంది. (అనగా చెట్టుకొమ్మను ముందుచూచి దాని ప్రక్కనే ఉంది చంద్రరేఖ చూడమంటారు. అపుడు చంద్రరేఖకు చెట్టుకొమ్మ సూచకమంటారు) అలాగే వేదాలు పరమాత్మ విషయంలో సూచకా లవుతాయి.

సందేహాలు నశించి, ఇతరుల సందేహాలు తీర్చగలవాడు, వ్యాఖ్యానం చేయగల నిపుణుడై, వివేకం కలవాడు బ్రహ్మవేత్త అని నేను భావిస్తాను. ఆ పరమాత్మకోసం తూర్పు, దక్షిణం, మూలలకు వెళ్లవలసిన పనిలేదు. ప్రక్కలకూ వెదకవలసినపనిలేదు. అతడు అంతటా ఉన్నవాడు. చూడాలని తపనతో వెదకితే పరమాత్మను వ్యతిరేక ప్రదేశాల్లో చూడాలి. వేదాల్లో పట్టుబడని ఆ పరమాత్మను తపస్సు చూస్తుంది. శరీరాన్ని, వాక్కును, మనస్సును పని చేయనీయకుండా కూర్చుని హృదయంలో ప్రసిద్ధుడయిన ఆ పరబ్రహ్మను చేరాలి. మౌనంతో మానవుడు ముని కాలేడు. అడవిలో ఉన్నంతమాత్రాన ముని కాడు. ఆత్మలక్షణం తెలిసినవాడే మునిశ్రేష్ఠ డనిపించుకొంటాడు. సర్వార్థాలను విడమరిచి చెప్పడం వల్ల బ్రహ్మజ్ఞానికి వైయాకరణుడని కూడ పేరు. మూల కారణమయిన పరబ్రహ్మను పొంది అతడు సర్వమునూ వ్యాకరిస్తున్నాడు. లోకాలన్నీ తిరిగి చూడగలిగిన మానవుని సర్వదర్శి అంటారు. అలాగే సత్యమందే నిలిచి బ్రహ్మజ్ఞానం పొందిన విద్వాంసుడు సర్వజ్ఞుడవుతాడు. రాజా ! ధర్మాదులలో నిలిచిన వాడూ, వేదాలను క్రమంగా అధ్యయనం చేసిన వాడూ పరమాత్మ దర్శనం చేయగలుగుతారు. నేను నిశ్చయించుకొన్న ఈ అంశాన్ని నీకు తెలియజేస్తున్నాను."

44. బ్రహ్మచర్యము, బ్రాహ్మణుని నిరూపించుట.

ధృత : సనత్సుజాతా ! ఇపుడు చెప్పిన మాటల కంటె శ్రేష్ఠమైన బ్రహ్మప్రాప్తికరా లయిన మాటలు ఎరుగుదువు. విశ్వమంతటినీ అది ప్రకాశింపజేస్తుంది. తేలికగా లభించనిది. అయినా చెప్పుకోదగినది. అటువంటి వాక్కును నాకు ఉపదేశించు.

సన : రాజా ! నీవు చాలా సంతోషంతో అడుగుతున్న బ్రహ్మవిద్య అంత త్వరగా లభ్యంకాదు. ముందు మనస్సు బుద్ధిలో లీనమై పోయాక భావించవలసిన విద్య అది. అది కేవలం బ్రహ్మచర్యం చేతనే లభ్యమవుతుంది.

ధృత : మహాత్మా! బ్రహ్మవిద్య సనాతనమైనది కదా. అంటే సర్వకాలాల్లోనూ ఉండేదే కదా ! బ్రహ్మచర్యం చేత మాత్రమే తెలుస్తుంది అన్నావు గదా ! అది వేరుగా ఇపుడు కలగ వలసిన పనిలేదు. ఆరంభించవలసిన పనిలేదు. కార్యకాలంలో ఇక్కడే ఆత్మలోనే ఉంటుంది గదా ! అపుడు బ్రహ్మజ్ఞానికి అమృతత్వం ఎలా లభిస్తుంది ? దానికోసం బ్రహ్మచర్యాది ప్రయత్నాలెందుకు ?

సన : నీ వన్నట్లు ఆ విద్య సనాతనమే. అది అవ్యక్త విద్య (పూర్వం నుండి ఉన్నదే కాని వ్యక్తంగా లేదు). అనగా బ్రహ్మవిద్య బుద్ధితో, బ్రహ్మచర్యంతో సిద్ధిస్తుంది. దాన్ని చెపుతాను విను. (సామాన్యంగా) ఆ విద్య పొందినవారు ఈ మనుష్యలోకం వదిలేస్తారు. అయినా ఆ విద్య గురువృద్ధుల దగ్గర నిత్యమూ ఉంటుంది.

ధృత : బ్రాహ్మణోత్తమా ! బ్రహ్మచర్యంతో ఆ విద్య తెలుసుకోవడం శక్యమవుతుందన్నావు గదా ! ఆ బ్రహ్మచర్యం ఎలా ఆచరించాలి? త్వరగా చెప్పు నాకు.

సన : గురువుదగ్గరకు వెళ్లి, నిష్కపటప్రవర్తనతో బ్రహ్మచర్యం చేసేవారు ఇక్కడే శాస్త్రకారు లవుతారు. దేహాన్ని విడిచి పరమాత్మతో ఐక్యాన్నీ పొందుతారు. అన్ని కష్టాలూ సహిస్తూ బ్రహ్మానుసంధానం చేసేవారు కామా లన్నిటినీ గెలుస్తారు. సత్త్వగుణప్రవర్తనతో ఉండి గడ్డిదుబ్బునుండి గడ్డి పరకను వేరుచేసినట్లు దేహం నుండి ఆత్మను వేరుపరుస్తారు. భారతా ! తల్లిదండ్రులు ఈ శరీరాన్ని ఇస్తున్నారు. ఆచార్యుడూ జన్మనిస్తున్నాడు. కాని ఆచార్యుడిచ్చే జన్మ పుణ్యప్రదం. దానికి జరామరణాలు లేవు. ఆచార్యుడు సత్యమయిన చిదాత్మనూ, బ్రహ్మమునూ, తన ఉపదేశంతో అనుభవానికి తెస్తాడు. అలా నాలుగు వర్ణాల వారికీ మోక్ష మిస్తాడు. అందుచేత అతనిని తల్లి, తండ్రి అని అనుకోవాలి. అతడు చేసిన మేలును మరువరాదు. అతనికి ద్రోహం చేయరాదు.

శిష్యుడు గురువుకు రోజూ పేరు, గోత్రం చెప్పుకొని నమస్కరించాలి. పరిశుద్ధుడై, ప్రమాదరహితుడై ప్రవర్తించాలి. గర్వం కాని, కోపం కాని దగ్గరకు రానీయకూడదు.

ఇది బ్రహ్మచర్యం యొక్క మొదటి పాదం. శిష్యుడు శుచియై భిక్షాటనం చేస్తూ విద్యను నేర్వాలి. బ్రహ్మచర్యవ్రతంలో ఇది కూడా మొదటి పాదమే. ప్రాణాలతో, ధనంతో, క్రియతో, మనసుతో, వాక్కుతో గురువుకు ప్రీతి కలిగించాలి. ఇది బ్రహ్మచర్యంలో రెండో పాదం. గురువు పట్ల ప్రవర్తించినట్లే గురుపత్నియందు, గురుపుత్రుని యందు కూడా ప్రవర్తించాలి. ఇది కూడా బ్రహ్మచర్యం యొక్క రెండో పాదమే. తనకు ఆచార్యుడు చేసిన మేలును తెలుసుకోవాలి. అర్థం తెలుసుకోవాలి. ఇంతమేలు వీనివల్ల కలిగిందని భావించాలి. ఆచార్యుని పట్ల సంతోషంతో ప్రవర్తించాలి. ఇది బ్రహ్మచర్యం యొక్క మూడవ పాదం. గురుదక్షిణ ఇవ్వకుండా వేరే చోటికి పోరాదు. గురుదక్షిణ ఇచ్చాక "నేను ఇచ్చాను" అనుకోరాదు. ఎక్కడా చెప్పకూడదు. ఇది బ్రహ్మచర్యం యొక్క నాలుగవ పాదం.

విద్య నాలుగు విధాల సిద్ధిస్తుంది. కాలపరిపాకాన్ని బట్టి (అనుభవాన్ని) ఒక పాదం (1/4), మరొక పాదం గురూపదేశం వల్ల, మరోపాదం తన బుద్ధిబలాన్ని బట్టి, మిగిలినది శాస్త్ర విచారం చేత లభిస్తుంది విద్య. ఈ బ్రహ్మచర్యం వేదతత్త్వభావన చేత గురువు యొక్క సంబంధంతో ఫలిస్తుందని చెపుతారు. దీనికి ధర్మం మొదలయిన పన్నెండు స్వరూపాలు. ఆసన ప్రాణాయామాదులు అంగాలు. నిశ్చల మయిన యోగమే బలం. ఇలా ప్రవర్తిస్తూ బ్రహ్మవిద్యను సాధించాలి. తరువాత శిష్యుడు తన శక్తికొలది ధనాన్ని గురువుకు ఇవ్వాలి. దానివల్ల శిష్యుడు బహుసద్గుణాలు కల సజ్జనప్రవృత్తిని పొందుతాడు. గురుపుత్రుడు కూడా ఇలాగే ప్రవర్తించాలి. (తండ్రి అనుకోరాదు - తండ్రిని గురువుగా భావించాలి). ఇలా బ్రహ్మచర్యం ఆచరించేవాడు అన్ని విధాల అభివృద్ధి చెందుతాడు. చాలామంది పుత్రులను, కీర్తిప్రతిష్ఠలను పొందుతాడు. అతనికి అన్ని దిక్కులూ ధనం వర్షిస్తాయి. వానిని ఆదర్శంగా ప్రజలు భావించి బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. ఈ బ్రహ్మచర్యం తోనే దేవతలు దేవత్వం పొందారు. పుణ్యాత్ములు, వివేకులు అయిన మహర్షులు బ్రహ్మ సాక్షాత్కారం పొందారు. ఈ బ్రహ్మచర్యం వల్లనే గంధర్వులకూ, అప్సరసలకూ రూపమూ; సూర్యునకు తేజస్సూ కలిగాయి. బ్రహ్మచర్యం చింతామణి లాగా కోరిన వారి కోరికలన్నీ తీరుస్తుంది. వారి వారి ఇష్టాలనుబట్టి దేవతలు మొదలగువారు దేవత్వం మొదలయినవి పొందారు. రాజా ! ఇలా నాలుగు పాదాల బ్రహ్మచర్యం ఆచరించినవాడే తపస్సుతో శరీరాన్ని పవిత్రం

చేసుకొంటాడు. ఆ విజ్ఞాని బ్రహ్మచర్యంతో బాల్యాన్ని (నిర్మలత్వాన్ని, విద్యార్థిత్వాన్ని) పొందుతాడు. చివరికి మృత్యువును జయిస్తాడు. జనులు నిర్మలమైన కర్మ మార్గంతో నశించిపోయే స్వర్గాది లోకాలను పొందుతారు. కాని జ్ఞాని బ్రహ్మచర్యంతో అక్షయమైన బ్రహ్మమును పొందుతాడు. మోక్షానికి దీన్ని మించిన మార్గం లేదు.

ధృత :- జ్ఞాని బ్రహ్మం యొక్క రూపాన్ని చూస్తున్నాడు గదా ! అది తెల్లనిదా! ఎఱ్ఱనిదా? కాటుకవలె నల్లనిదా ? నల్లని పొగరంగుదా ?

సన :- ఆ బ్రహ్మపదార్థం తెల్లగానూ, ఎర్రగానూ, నల్లగానూ, సూర్యతేజస్సు లాగానూ కనిపిస్తుంది. కాని దానిరూపం నేలమీద కాని, ఆకాశంలో గాని ఉండదు. సముద్రంలో నీటిలాగాను ఉండదు. పరమాత్మ రూపం నక్షత్రాల్లో కాని, మెరుపుల్లో కాని, మేఘాల్లో కాని, గాలిలో కాని, దేవతల్లో కాని, చంద్రసూర్యుల్లో కాని కన్పడదు. అనగా ఆత్మకు స్వరూపాదులు లేవు. రాజా! ఆ పరబ్రహ్మ ఋగ్యజుస్సామాథర్వణ వేదాల్లో కనపడదు. రథంతర బార్హద్రథ సామాల్లో కన్పడదు. మహావ్రతంలో కనపడదు. ఇది నిశ్చయం. ఆ పరబ్రహ్మం దాటరానిది. అజ్ఞానాంధకారానికి అవతలిది. యముడు కూడా ప్రళయ కాలంలో అక్కడికే చేరుతాడు. దానిరూపం చాలా (అణువువలె) సూక్ష్మం. చురకత్తి అంచులాంటిది. కాని పర్వతాలకంటే గొప్పది. 'అణోరణీయాన్ మహతో మహీయాన్'. అది అన్నిటికీ ఆధారం. దానికి మార్పులు లేవు. లోకాలన్నీ దానిరూపమే. అదే బ్రహ్మపదార్థం. యశస్సు. దానినుండే భూతాలన్నీ పుడతాయి. తిరిగి దానిలోనే లీనమవుతాయి. ఆ పరబ్రహ్మమునకు సుఖం కాని దుఃఖం కాని ఉండదు. అది చాలా గొప్పది. జగత్తుగా ఉద్భవించింది. అందమైనది. వాగ్రూపంగా ఉద్భవించిందని (శబ్దబ్రహ్మం) కవులంటారు. దానిలోనే జగత్తు నిలిచి ఉంది. దీన్ని తెలుసుకొన్న వారే ముక్తులు. మోక్షం పొందినవారు.

45. గుణదోషముల లక్షణము - బ్రహ్మవిద్యానిరూపణము.

సనత్సుజాతుడు ఇలా అన్నాడు. శోకం, క్రోధం, లోభం, కామం, మానం, మత్తు, ఈర్ష్య, మోహం, స్వార్థం, కృప, అసూయ, జుగుప్స - ఈ పన్నెండూ మహాదోషాలు. మానవుల ప్రాణాలు తీస్తాయి. రాజేంద్రా ! వీటిలో ఒక్కొక్కటి మానవులను బాధిస్తాయి. వీటికి వశమైతే ఆ మానవుడు పాపకృత్యాలు చేస్తూ

మూఢుడవుతాడు. తీవ్రమైన కోరికలున్నవాడు, నిర్దయుడు, పరుషంగా మాట్లాడేవాడు, వాచాలుడు, మనసునిండా కోపం కలవాడు, ఆత్మస్తుతిపరుడు – ఈ ఆరుగురూ క్రూరకర్ములు. వారు ఇతరుల నుండి ప్రయోజనం పొందికూడా వారిని గౌరవించరు. 1. స్త్రీ సంగమమే పరమార్థం అనుకొనేవాడు, 2. అతిగర్వి, 3. దానం చేశాక బాధపడేవాడు, 4. పిసినారి, 5. బలవంతంగా పన్నులు లాక్కునేవాడు, 6. పాపంచేసి గొప్పగా చెప్పుకొనేవాడు. 7. పతివ్రతాస్త్రీలను ద్వేషించేవాడు – ఈ ఏడుగురు కూడా క్రూరులు.

ఇక గుణాలు, పన్నెండు. అవి. 1. ధర్మం, 2. సత్యం, 3. దమం, 4. తపస్సు, 5. మాత్సర్యం లేకుండటం, 6. లజ్జ, 7. సహనం, 8. అసూయ లేకపోవడం, 9. యజ్ఞం, 10. దానం, 11. ధైర్యం, 12. క్షమ. ఇవి బ్రహ్మజ్ఞానం పొందేవాని గుణాలు. ఈ పన్నెండు సద్గుణాలూ విడువని వాడు భూమినంతటినీ శాసించగలడు. కాని ఇందులో మూడో, రెండో, ఒకటో జారిపోతే ఇక వాడిదంటూ ఏదీ ఉండదని తెలుసుకో!

దమం, త్యాగం, శ్రద్ధ – ఈ మూడింటిలోనే మోక్షం ఉంది. బ్రహ్మజ్ఞానం పొందే బుద్ధిమంతులకు ఇవే చాలా దీక్షతో చేపట్టవలసిన వ్రతాలు. అది సత్య మయినా, అసత్య మయినా ఇతరుల దోషాలను ఎత్తి చూపడం బ్రాహ్మణునికి మంచిదికాదు. అలా చేసేవారు నరకానికి పోతారు. మదం పదునెనిమిది దోషాలు కలిగి ఉంటుంది. ఇంతకుముందు సరిగా చెప్పలేదు. ఇపుడు చెపుతున్నాను. 1. లోకులు నిందించే పనులు 2. ధర్మవ్యతిరేకత 3. అసూయ, 4. అబద్ధపుమాటలు 5. కామం, 6. క్రోధం, 7. మద్యపానాదులకు వశమవడం, 8. ఇతరులను నిందించడం, 9. కొండెములు చెప్పడం, 10. వ్యసనాల్లో డబ్బు పోగొట్టుకోవడం, 11. వివాదం, 12. వైరభావం, 13. ప్రాణిహింస, 14. ఓర్వలేనితనం, 15. గర్వం. 16. మర్యాద అతిక్రమించి మాట్లాడటం, 17. పేరు పోగొట్టుకోవడం, 18. ఇతరుల తప్పులు వెదకటం. ఈ పదునెనిమిదింటి పట్ల ఏమరుపాటు పనికిరాదు. వీటిని నిందించాలి. దరిచేరనీయరాదు.

ఆలాగే మంచితనంలో కూడా తెలుసుకోదగినవి ఆరు సద్గుణాలున్నాయి. అవి మిత్ర లక్షణాలు 1. ప్రియంకలిగితే సంతోషిస్తాడు. 2: అప్రియంకలిగితే దుఃఖిస్తాడు. 3. మిత్రుడు అడిగితే తనకు ఇష్టమైన పదార్థాలను కూడా పుత్రుల

నయినా, సంపద లనయినా, సరే ఇస్తాడు. 4. తన సొమ్ము మిత్రునికిచ్చి "నావల్ల ఉపకారం పొందాడు" అనే భావంతో అతని దగ్గర నివసించడు. 5. స్వార్జిత మైనదాన్నే అనుభవిస్తాడు. 6. తనకు కోరదగినది అయినా మిత్రునకు బాధకలిగించే దయితే ఆ పని చేయడు. ఇట్టి సద్గుణ సంపన్నుడు త్యాగియై సత్త్వగుణ ప్రధాను డయితే అతడు పంచేంద్రియాలను వాటి విషయాల నుండి మళ్లిస్తాడు. ఇలా ఇంద్రియనిగ్రహం ఏర్పడినా, ధైర్యం జారిపోతే వారితపస్సు సంకల్పంతో ఏర్పడినది కాబట్టి ఊర్ధ్వగతి మాత్రం ఏర్పడుతుంది. అంతమాత్రపు తపస్సే అవుతుం దది.

సంకల్పంవల్లనే యజ్ఞాలు అభివృద్ధి చెందుతున్నాయి. సంకల్పం నిలబడాలి. పోషింపబడాలి. అపుడే సాధకుడు యోగి అవుతాడు. ఒక్కొక్కనికి మనసు వల్లనే యజ్ఞం సిద్ధిస్తుంది. ఇంకొకనికి వాక్కుతో సిద్ధిస్తుంది. మరొకనికి కర్మతో సిద్ధిస్తుంది. (ఇందు మానసయజ్ఞం ఉత్తమం). సంకల్పం సిద్ధించిన పురుషుని (అసంకల్పం) జ్ఞానం ఆక్రమిస్తుంది. అందులో ముఖ్యంగా బ్రహ్మజిజ్ఞాస కలవానిని మరింత ఆక్రమిస్తుంది. ఇంకో విషయం చెపుతా విను. బ్రహ్మను చేర్చే / పొందించే ఈ యోగశాస్త్రాన్నే జ్ఞానులు శిష్యులకు చెప్పాలి. మిగిలిన బోధలన్నీ వాగ్వికారాలే అని కవులు చెపుతున్నారు. ఈ యోగంలోనే సర్వమూ ఉన్నది. దీన్ని తెలుసుకొన్నవారు ముక్తు లవుతారు. హోమాలు చేయవచ్చు. యజ్ఞాలు చేయవచ్చు. ఎంత శ్రద్ధగా చేసినా కర్మతో బ్రహ్మమును పొందలేడు. ఆ కర్మాదులు మోక్షం ఇవ్వలేవు. జ్ఞానంలేనివాడు చివరకు మోక్షం పొందడు. అన్ని పనులూ విడిచి ఒంటరిగా బ్రహ్మానుసంధానం చెయ్యాలి. మనసుతో కూడా ఏపనీ చేయరాదు. అంతేకాదు. ఇతరులు స్తుతిస్తే పొంగిపోరాదు. నిందిస్తే క్రుంగిపోరాదు. రెండూ– ప్రీతినీ, రోషాన్నీ విడిచిపెట్టాలి. రాజా ! ఒక క్రమంలో ఈ మార్గంలో స్థిరంగా నడిచినవాడు ఈ దేహాంతోనే బ్రహ్మమును దర్శిస్తాడు. దర్శించడమేమిటి ? తానే బ్రహ్మ మవుతాడు. వేద విచార ఫలితంగా నేనెరిగిన దానిని నీకు చెపుతున్నాను."

46. పరమాత్మ స్వరూపము - సాక్షాత్కారము.

సనత్సుజాతుడు కొనసాగిస్తున్నాడు. "ఆ పరబ్రహ్మం శుక్రస్వరూపం. బీజరూపం. ఒక పెద్ద జ్యోతి చక్కగా వెలుగుతూ ఉంటుంది. దాన్ని వేదాలు మహద్యశమని

పేర్కొన్నాయి. దాన్నే దేవతలు ఉపాసిస్తారు. దాని వల్లనే సూర్యుడు ప్రకాశిస్తాడు. ఆ వెలుగు సనాతనమైనది. అటువంటి భగవంతుని యోగులు చక్కగా దర్శిస్తారు. ఆ శుక్రం నుండి బ్రహ్మ మేర్పడుతుంది. సర్వ సమర్థమవుతుంది. శుక్రం వల్లనే వృద్ధి పొందుతుంది. ఆ బ్రహ్మం సూర్యాదులయిన పెద్ద పెద్ద వెలుగుల మధ్య ఉంటుంది. అయినా అది తపించదు. పరిగదా తపింపజేస్తుంది. ఇతరాన్ని ప్రకాశింపజేస్తుంది. అటువంటి సనాతనమైన భగవంతుని యోగులే చక్కగా దర్శిస్తారు. జలముల మధ్య పంచభూతాలతో (అద్భ్య) ఏర్పడిన దేహాన్ని ఆశ్రయించి జీవతత్త్వం, ఈశ్వర తత్త్వం ఉన్నాయి. సృష్టికర్తను కూడా కప్పివేయగలవాడు పరమాత్మ. అతడు జీవునీ, ఈశ్వరునీ, భూమ్యాకాశాలను భరిస్తున్నాడు. నిలుపుతున్నాడు. అటువంటి సనాతను డయిన భగవంతుని యోగులు చక్కగా దర్శిస్తారు.

ఆశుక్రం (పరమాత్మ) జీవేశ్వరులనూ, భూమ్యాకాశాలనూ, దిక్కులనూ, బ్రహ్మాండాన్ని భరిస్తోంది, నిలుపుతోంది. దిశలు, నదులు దానిలోంచే ప్రవహిస్తున్నాయి. అంతం లేని సముద్రాలు కూడా దాని నుండి ఏర్పడుతున్నాయి. ఆ సనాతనుడు అయిన భగవంతుని యోగులే దర్శిస్తారు. శరీరం రథం వంటిది. శిథిలమయ్యే స్వభావం దానిది. కాని అది నశించినా అది చేసిన కర్మం మాత్రం నశించదు. ఆ కర్మం కారణంగా ప్రవర్తిస్తున్నాయి ఇంద్రియాలనే గుర్రాలు. అవి ప్రజ్ఞావంతు డయిన జీవుని హృదయ మనే ఆకాశంలో దివ్యుడూ, వికారహితుడూ అయిన పరమాత్మ వైపు లాగుకొని పోతాయి. ఆ పరమాత్మను యోగులు దర్శిస్తారు. ఆ పరమాత్మరూపం ఇలా ఉంటుంది అని పోలిక చెప్పలేము. ఎవరూ చర్మచక్షువులతో (కళ్లతో) చూడలేరు. బుద్ధితో, మనసుతో, హృదయంతో చూస్తారు. వారు అమృతు లవుతారు. అట్టి పరమాత్ముని యోగులే దర్శిస్తారు. అజ్ఞాన రూప మయినది ఈ సంసారం. అది పన్నెండింటి సముదాయం. అది దేవ (ఇంద్రియాలచే) రక్షితం. దాని మధువుకు (మధురఫలాలకు) ఆశపడి జీవులు అందులో క్రిందా, మీదా పడుతూ ఉంటారు. యోగులు దాన్ని దర్శించగలరు.

తేనెటీగ 15 రోజులు తేనెను కూడబెట్టి 15 రోజులు త్రాగుతుంది. అలాగే తిరిగేవాడు జీవుడు. అతడు కూడబెట్టిన కర్మఫలంలో సగభాగం ఉత్తమ లోకంలో అనుభవిస్తాడు. మిగిలిన సగభాగం అనుభవించేందుకు మళ్లీ యీ లోకానికి వస్తాడు.

అందుకే ఈశ్వరుడు సర్వభూతాల్లోనూ హవిర్భావం కల్పించాడు.

ఈశ్వరు డయిన జీవుడు బంగారు ఆకులున్న అశ్వత్థవృక్షాన్ని ఆశ్రయించాడు. రెక్కలు లేని జీవుడు అక్కడ రెక్కలు వచ్చి పక్షులుగా మారాడు. తరువాత తనకు తోచిన దిక్కుకు ఎగిరిపోతున్నాడు. (రెక్కలు వచ్చి ఎగిరిపోవడం అంటే ముక్తిని పొందడం. సనాతన రూపం పొందడం. అటువంటి సనాతనుడయిన భగవంతుని యోగులు దర్శిస్తారు.) పూర్ణమయిన పరమాత్మనుండి వేరయి (ప్రతిబింబాలుగా) పూర్ణము లయిన జీవరూపాలు వచ్చాయి. పూర్ణం నుండి విడివడినా పూర్ణమే అవుతాయి. (ప్రతిబింబాలు కనుక). ఇలా (పూర్ణమై) సనాతన మయిన భగవంతుని యోగులు చక్కగా దర్శిస్తారు. ఆ పరబ్రహ్మం నుండే వాయువు వచ్చింది. సర్వభూతాలూ కూడా దానిలోనే ఎల్లప్పుడూ పట్టుబడి ఉన్నాయి. దాని నుండే అగ్ని, చంద్రుడు, వచ్చారు. ప్రాణమూ దాన్నే వ్యాపించి ఉంది. (దేహమూ, ఇంద్రియాలూ) అన్నీ దానినుండే వచ్చాయి. దాన్ని 'తత్' అంటారు. దాన్ని గురించి చెప్పలేము. యోగులు ఆ పరమాత్మను చక్కగా దర్శిస్తారు. అపానాన్ని ప్రాణం, ప్రాణాన్ని మనస్సు, మనస్సును బుద్ధి, బుద్ధిని పరమాత్మ తమలో లయం చేసుకొంటాయి. ఆ పరమాత్మను యోగులు స్పష్టంగా దర్శిస్తారు.

పరమాత్మ హంసరూపం దాల్చి, నీళ్లలోంచి పైకి లేస్తూ, ఒకపాదం మాత్రం పైకిలేపదు. (నీళ్లనగా గంభీరమయిన ప్రకృతి. ఈ హంసకు నాలుగు పాదాలు. మూడు పాదాలతో సంచరిస్తుంది.) కాని పైకే ఎప్పుడూ వ్యాపించి ఉంటుంది. దాన్ని దర్శించిన వానికి ఆ దశలో మృత్యువూ లేదు, అమృతత్వమూ లేదు. ఆ పరమాత్మను యోగులు దర్శిస్తారు. అందరి హృదయాల్లోనూ పూర్ణరూపుడై ఆ పరమాత్మ బొటన వ్రేలంత రూపంతో ఉంటాడు. లింగశరీరసంబంధం చేత నిత్యుడై ఉంటాడు. నిత్యమూ ఇహ పరలోకాలకూ, జాగ్రత్స్వప్న దశలకూ తిరుగుతూ ఉంటాడు. అతడే ఈశ్వరుడు. స్తుతింపదగినవాడు. సమర్థుడు. మూలకారణుడై వెలిగిపోతూ ఉన్నా మూఢులు మాత్రం చూడలేకపోతున్నారు. వానిని యోగులు భగవంతునిగా దర్శిస్తారు.

దేహాభిమానం గల మనుష్యుల్లో కొందరు (శమ దమాది) సాధన సంపత్తి కలవారుంటారు. కొందరు ఆ సంపత్తి లేని వారుంటారు. కాని బ్రహ్మం మాత్రం అందరిలోనూ సమానంగానే ఉంటుంది. కాని ముక్తులు మాత్రమే బ్రహ్మానందాన్ని

పొందుతారు. జ్ఞాని జ్ఞానంతో రెండులోకాల్లోనూ వ్యాపించి తిరగగలడు. అతడు హోమం చెయ్యకపోయినా చేసినట్లే. ఈ లక్షణాలు కల పరమాత్మను యోగులు దర్శిస్తారు. రాజా ! నేను చెప్పిన యీ మాటల వల్ల నీకు తక్కువతనం రాకుండుగాక. ధీరులు పొందే జ్ఞాని అనే పేరునే పొందుదువు గాక. ఆ పరమాత్మే జీవుని జీవభావాన్ని పోగొడతాడు. ఆ పరమాత్మను తెలుసుకొన్నవానికి పురుషార్థం చెడదు. అటువంటి పరమాత్మను యోగులు దర్శిస్తారు.

వేల కొద్దీ రెక్కలు దాల్చి మనోవేగంతో ఎగిరిపోయేవాడు కూడా శరీరంలోని హృదయంలోని పరమాత్మను చేరవలసిందే. జీవుడు దూరంలో ఉన్నా హృదయస్థునికి సన్నిహితుడే. అటువంటి పరమాత్మను యోగులు దర్శిస్తారు. ఆ ఫరమాత్మ రూపం కంటికి దొరకదు. (ఇంద్రియాలకు అందదు). స్వచ్ఛమయిన మనసు కలవారు మాత్రమే చూడగలరు. అందరిపట్ల హితమైన ప్రవర్తనతో, మనసునిలుపుకోగల శక్తిమంతుడు, మానసికంగా దుఃఖ పడనివాడూ, స్వచ్ఛసత్త్వ డవుతాడు. అలా సన్యాసం స్వీకరించినవారు అమృతులు, బ్రహ్మస్వరూపు లవుతారు.అట్టి అమృతకారణమైన పరమాత్మను యోగులు దర్శిస్తారు. కొందరు మానవులు తన బోధవల్లనో, ప్రవర్తన వల్లనో పాపకృత్యాలు చేస్తూ అవి బయట పడకుండా పాములాగా జాగ్రత్తపడుతూ ఉంటారు. మోసగాళ్లు బాటసారుల్ని మోసగించినట్లు వీరు తెలివితక్కువ వారిని మోసగిస్తారు.

నేను ఎన్నడూ అసత్తుతో ఏర్పడిన వాడిని కాదు. నాకు మృత్యువులేదు, జన్మలేదు. మోక్షం ఎక్కడిది? సత్యమూ, అసత్యమూ రెండూ సత్యసమాన మయిన పరబ్రహ్మంలోనే ఉన్నాను. సత్తుకు, అసత్తుకూ జన్మ ఒక చోటనే కదా. మానవుల్లోనే కర్మఫలాలు భిన్నంగా ఉంటాయి. పరబ్రహ్మ సత్కర్మతో గొప్పదైపోదు. అసత్కర్మతో తక్కువదైపోదు. ఈ బ్రహ్మం కైవల్యంతో సమానం. ఇలా యోగసాధన చేసినవాడు బ్రహ్మాన్ని పొందా లనుకోవాలి. ఇతరులు నిందిస్తే అవి అతనికి బాధ కల్గించవు. అధ్యయనం చేయ లేదని కాని, అగ్నిహోత్రం చేయలే దని కాని అతని మనసు పరితపించదు. ఈ బ్రహ్మవిద్య అటువంటివానికి చురుకుగా ప్రజ్ఞనిస్తుంది. ధ్యాననిష్ఠులు ఆ ప్రజ్ఞను పొందుతారు. తాపమెరుగని విద్వాంసునితో అభిన్నుడయిన పరమాత్మను యోగులు దర్శిస్తారు. ఇలా సర్వభూతములందూ ఆత్మనే దర్శించే జ్ఞానికి దుఃఖం

కలగదు. సంసారాసక్తు లయిన ఇతరులను చూసినా వారి కోసం అతనికి దుఃఖం కలగదు. ఆత్మ కంటె ఇతరంగా దేన్నీ అతడు చూడడు. దప్పికతో ఉన్నవాడు పొంగిపొర్లే మంచినీటి చెరువులో పడితే వానికి అంతటా నీరే కనిపిస్తుంది. కాని ఇతర మేదీ కనిపించదు. అలాగే అంతటా ఆత్మను చూసేవానికి సర్వవేదాల్లోనూ పరమాత్మే కనిపిస్తాడు. పరమాత్మ వ్రేలెడంత హృదయంలోనూ ఉంటాడు. విశ్వమంతటా వ్యాపించీ ఉంటాడు. కనపడడు. జన్మలేదు. రాత్రింబవళ్లు జ్ఞానరూపుడై తిరుగుతూ ఉంటాడు. అలా పరమాత్మను తెలిసినవాడు ప్రసన్నుడై, కవియై, నిష్క్రియుడై ఉంటాడు.

ఈ విశ్వాని కంతటికీ నేనే తల్లిని, తండ్రిని, కొడుకునూ నేనే. నేనే ఆత్మను. రానున్నదీ, ఉన్నదీ కూడా నేనే. వృద్ధు డయిన తాతను నేనే, తండ్రిని నేనే, కొడుకును నేనే. మీరంతా నా ఆత్మీయులే. అయినా మీరు నాకేం కారు. మేమూ మీ వారము కాము. నా స్థానమే ఆత్మ. ఆత్మ నుండే నేను పుట్టాను. పడుగుపేకల్లాగా అంతా ఆత్మయే. నాకు ఏ వికారాలు లేవు. స్థిరుణ్ణి. నిత్యమూ చైతన్యంతో సంచరిస్తాను. ఇలా నన్ను తెలిసిన వాడు కవి అవుతాడు. ప్రసన్నతను పొందుతాడు. పరమాత్మ అణువుకంటె సూక్ష్మ మయినది, దివ్య దర్శనం కలది. సర్వభూతాల్లోనూ ఉంటుంది. సర్వభూతాలు దాని నుండే పుట్టాయి, సర్వుల హృదయాల్లోనూ ఉంటుంది, అని బ్రహ్మవేత్తలు ఎరుగుదురు.

47. కౌరవ సభలోనికి సంజయుడు ప్రవేశించుట.

వైశంపాయనుడు ఇలా అన్నాడు. 'ఇలా సనత్సుజాతునితోను ధీమంతుడయిన విదురునితోను కలిసి ప్రసంగిస్తున్న ధృతరాష్ట్రునికి ఆ రాత్రి గడిచి పోయింది. తెల్లవారిన తరువాత రాజులంతా సంజయుని చూడాలని ఉత్సాహంతో సభలోనికి ప్రవేశించారు. పాండవుల ధర్మార్థ సహిత మయిన మాటలు వినాలని ధృతరాష్ట్రుడు మొదలయిన వారంతా రాజసభలోనికి చేరారు. ఆ సభ విశాలంగా సున్నపు తెల్ల దనంతో బంగారు ప్రాంగణంతో/ ముంగిలితో విరాజిల్లుతోంది. వెన్నెల విరిసినట్లు వెలిగిపోతోంది. సభ నంతటినీ మంచి గంధపు నీటితో తడిపి, తుడిచారు. సభలో బంగారంతో, చెక్కతో, రత్నాలతో, దంతంతో చేసిన ఆసనాలు పరిచారు. వాటిమీద

మెత్తని వస్త్రాలు పరిచారు. రాజా! భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, శల్యుడు, కృతవర్మ, సైంధవుడు, అశ్వత్థామ, వికర్ణుడు, యుయుత్సుడు, మొదలయిన శూరులంతా ధృతరాష్ట్రునితో సహా శుభప్రద మయిన ఆ సభలో ప్రవేశించారు. దుశ్శాసనుడు, చిత్రసేనుడు, శకుని దుర్ముఖుడు, దుస్సహుడు, కర్ణుడు, ఉలూకుడు, వివింశతి-వీరంతా క్రోధనుడయిన దుర్యోధనుని పురస్కరించుకొని, దేవతలు ఇంద్రసభలోనికి ప్రవేశించినట్లు రాజసభలోనికి ప్రవేశించారు.

రాజా! పరిఘల వంటి భుజాలు కల శూరులు ప్రవేశిస్తూ ఉంటే ఆ సభ సింహాలు ప్రవేశిస్తున్న గిరి గుహలాగా ప్రకాశించింది. ధనుర్ధారులు, మహాబలులు, సూర్యతేజస్వులు అయిన రాజులంతా చిత్రవర్ణాలు కల ఆసనాలపై కూర్చున్నారు. రాజులంతా ఆసనాల మీద కూర్చున్న తరువాత సంజయుడు వచ్చినట్లు ద్వారపాలకుడు విన్నవించాడు. ఇంతలో ఆ సంజయుడు వేగంగా వచ్చి, రథం దిగి, మహాత్ము లయిన రాజులతో నిండిన ఆ కొలువులోనికి ప్రవేశించాడు. సంజయుడు అన్నాడు. "కౌరవులారా! పాండవుల దగ్గరకు వెళ్లి వచ్చాను. పాండవులు వారి వయసులకు తగినట్లు కౌరవు లందరినీ కుశల మడిగారు. పాండవులు వృద్ధులకు అభివాదం చేశారు. సమవయస్కులను స్నేహితుల వలె అభినందించారు. యువకులను వయసుల ననుసరించి అభినందించారు. ఇక్కడ నుండి ధృతరాష్ట్రుడు పంపితే వెళ్లి అతడు ఆజ్ఞాపించినట్లు నేను చెప్పినది చెప్పుతున్నాను" శ్రీకృష్ణార్జునులు అక్కడ ధర్మ సహితంగా పలికిన మాటలు కూడా చెపుతున్నాను వినండి.

48. అర్జునుని మాటలు సంజయుడు కౌరవసభలో చెప్పుట.

ధృతరాష్ట్రుడు "సంజయా! రాజుల ఎదుట నిన్ను అడుగుతున్నాను. అర్జును డేమన్నాడు? అతడు తరగని బలం గల యుద్ధ నాయకుడు. దురాత్ముల జీవితాలను త్రుంచగల మహాత్ము డతడు." సంజయుడు చెపుతున్నాడు. "ధర్మరాజు అనుమతితో యుద్ధానికి సిద్ధపడే మహాత్ముడు అర్జునుడు, కృష్ణుడు వింటూ ఉండగా చెప్పిన యీ మాటల్ని దుర్యోధనుడు వినాలి. తనభుజశక్తి ఎంతటిదో తెలిసిన అర్జునుడు నిర్భయంగా కృష్ణుని సమీపంలో ఉండి నాతో "ఈ మాటలు కౌరవ సభా మధ్యంలో దుర్యోధనునితో చెప్పాలి" అన్నాడు. ఆ మాటలివి. సంజయా! దుర్భాషి,

దురాత్ముడు, నాతో ఎపుడూ యుద్ధానికి సిద్ధపడే మందబుద్ధి, కాలం దగ్గర పడిన మూఢుడు అయిన సూతపుత్రుడు (కర్ణుడు) వింటూ ఉండగా ఈ మాటలు దుర్యోధనునకు చెప్పాలి. పాండవులతో యుద్ధంచేయటానికి తీసుకు వచ్చిన రాజు లంతా వింటూఉండగా నేను చెప్పిన దంతా అమాత్యులతో కూడిన ఆ రాజుకు వినిపించు. వజ్రహస్తుడైన యింద్రుని మాటలు దేవతలంతా శ్రద్ధతో విన్నట్లు అర్జునుడు చెప్పిన శక్తిమంత మయిన మాటల్ని పాండవులూ, సృంజయులూ విన్నారు.

యుద్ధానికి సిద్ధపడుతూ ఎఱని పద్మాలవంటి కన్నులతో గాండీవి ఇలా అన్నాడు. "అజమీఢ వంశీయు డయిన ధర్మరాజుకు ఆ దుర్యోధనుడు రాజ్యం ఇవ్వకపోతే... ఆ ధృతరాష్ట్ర పుత్రులు పూర్వం చేసిన పాపం ఇంకా వారు అనుభవించలేదు. వారి కిపుడు భీమార్జునులతో, నకుల సహదేవులతో, శ్రీకృష్ణునితో యుద్ధం వస్తోంది. ఆయుధం ధరించిన సాత్యకితో, ధృష్టద్యుమ్నునితో, శిఖండితో, ఇంద్ర సమాను డయిన ధర్మరాజుతో యుద్ధం వస్తోంది. ఆ ధర్మరాజుకు అపకారబుద్ధి కలిగితే చాలు భూమ్యాకాశాలు దహించుకొనిపోతాయి. ఈ వీరితో యుద్ధం చేయాలని దుర్యోధనుడు అనుకొంటే పాండవుల ప్రయోజనం పూర్తిగా సిద్ధించినట్లే - పాండవులకు మేలు జరుగుతుందని మాత్రం రాజ్యభాగం ఇవ్వకు- (రాజ్యభాగం ఇవ్వకపోతేనే పాండవులకు పూర్తి మేలు). యుద్ధం మేలని నీకు తోస్తేనే చెయ్యి. ధర్మాచరణ శీలి అయిన ధర్మరాజు నిర్వాసితుడై అడవిలో దుఃఖశయ్యను ఎక్కాడు. అంతకంటె దుఃఖకర మయిన చివరి శయ్యను యుద్ధంలో చచ్చి, ఎక్కుతాడు దుర్యోధనుడు. అన్యాయప్రవృత్తితో దుష్టాత్ము డయిన దుర్యోధనుడు ఆక్రమించిన రాజ్యాన్ని వినయం, జ్ఞానం, తపస్సు, ఇంద్రియ నిగ్రహం, శౌర్యం, ధర్మరక్షణం, ధనం - అనేవాటితో ధర్మరాజుకు వశం చెయ్యి. మా మహారాజు వృద్ధసేవతోనూ, ఆర్జవంతోనూ, తపస్సు, నిగ్రహంతోనూ, ధర్మరక్షణబలంతోనూ, సత్యం మాట్లాడుతూ ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నా (ఇతరుల) కపట చేష్టల్ని సహించాలనే భావిస్తున్నాడు.

ధర్మరాజు మనసు నదుపు చేసికొని ఎన్నో ఏళ్లు ఉన్నాడు. అణచుకొన్న ఘోరమయిన క్రోధాన్ని వశం తప్పిన మనసుతో కౌరవుల మీద గుప్పిస్తే అప్పుడు దుర్యోధనుడు యుద్ధాన్ని గూర్చి పరితపిస్తాడు. వేసవిలో అంటుకొని రాజుకొన్న అగ్ని అడవిని దహించివేసినట్లు, క్రోధాగ్నితో ధర్మరాజు దుర్యోధనుని సేనను చూసి

దహించివేస్తాడు. భయంకరమైన వేగంతో, దీర్ఘద్వేషంతో క్రోధమనే విషం క్రక్కుతూ, గద చేపట్టి భీమసేనుడు రథం మీద కనపడితే...అప్పుడు దుర్యోధనుడు యుద్ధం గురించి పశ్చాత్తాపం చెందుతాడు. సేనకు ముందు కవచం ధరించి, ఎవరికీ చూడ శక్యం కానట్లుగా, యమునిలాగా శత్రుసేనను భీముడు చంపుతూ ఉంటే అప్పుడు ఆ దురభిమాని – దుర్యోధనుడు నా మాటలు తలచుకొంటాడులే! కొండ శిఖరాల్లాగా ఉన్న ఏనుగులను భీముడు నేల గూల్చితే తలలు బ్రద్దలై నెత్తురు క్రక్కుతున్న ఆ ఏనుగుల్ని చూసి అప్పుడు ఆ ధృతరాష్ట్ర పుత్రుడు యుద్ధాన్ని గూర్చి పరితపిస్తాడు. మహాసింహం పశువులలో ప్రవేశించినట్లు రుద్ర రూపు డయిన భీముడు గద దాల్చి కౌరవులను చావమోదుతుంటే.. అపుడు యుద్ధం గురించి దుర్యోధనుడు పశ్చాత్తాపం చెందుతాడు. యుద్ధంలో నిర్భయుడు, అస్త్రవిశారదుడు, శత్రు సైన్యాన్ని నుగ్గు చేసే భీముడు ఒంటి రథంతో ఎన్నో రథసమూహాలనూ, గదతో పదాతిదళాలనూ చావమోదుతూ, ఖడ్గంతో ఏనుగులను శీఘ్రంగా నరుకుతూ, గండ్రగొడ్డలితో అడవిని నరికినట్లు కౌరవ సైన్యాన్ని నరుకుతుంటే... అపుడు ఆ దుర్యోధనుడు యుద్ధం గురించి పశ్చాత్తాపం పొందుతాడు. పూరిళ్ల గల గ్రామం అగ్నితో దగ్ధమైనట్లుగా, పండిన చేను పిడుగుపడి మాడిపోయినట్లుగా, కురుసైన్యమంతా భీముని బాణాగ్నికి దగ్ధమైపోయి, చిందరవందరగా మిగిలిన వారంతా భయంతో పారిపోతుంటే... అపుడు తన సైన్యాన్ని చూసి యుద్ధం గురించి దుర్యోధనుడు పరితపిస్తాడు. విచిత్రగతులతో పోరాడే, రథికశ్రేష్ఠుడు నకులుడు తూణీరాలను కుడిప్రక్కకు మార్చుకొని ఎడమ చేతితో కూడా బాణ ప్రయోగం చేస్తూ రథికుల తలలను గుట్టలుగా కూల్చితే.... అపుడు దుర్యోధనుడు యుద్ధం గురించి పరితపిస్తాడు. సుఖార్హుడయిన నకులుడు అడవుల్లో చాలాకాలం దుఃఖశయ్యపై పడుకొన్నాడు. అందుచేత అతడు బుసకొట్టే పాములాగా విషం క్రక్కుతూ ఉంటే... అపుడు దుర్యోధనుడు యుద్ధం గురించి విచారిస్తాడు.

ధర్మరాజు ఆదేశంతో యుద్ధానికి వచ్చి నిర్భయంగా పోరాడే రాజులు శుభ్రమైన రథాలతో కురుసేనను తరుముతూ ఉంటే... ఆ దృశ్యం చూసి దుర్యోధనుడు పశ్చాత్తప్తు డవుతాడు. బాలురయినా మహావీరుల వలె విజృంభించే అస్త్రవేత్తలు – ఉపపాండవులు ప్రాణాలకు తెగించి కౌరవులను తరుముతూ ఉంటే... ఆ దృశ్యం

చూసి యుద్ధం గురించి దుర్యోధనుడు పరితపిస్తాడు. కుదుపు లేకుండా చప్పుడు కాని ఇరుసుతో, బంగారు త్రాడుతో, అదుపుగల గుర్రాల రథం ఎక్కి సహదేవుడు బాణవర్షంతో రాజుల శిరస్సులను ఎగురకొడతాడు. అటువంటి మహాభయంకర యుద్ధంలో రథంమీదనుండి అస్త్రవేత్త సహదేవుడు అన్నిదిక్కులకూ వచ్చి మీద పడుతుంటే.. ఆ యుద్ధం చూసి అపుడు దుర్యోధనుడు పరితపిస్తాడు. సహదేవుడు లజ్జా శీలి, నిపుణుడు, సత్యవాది, మహా బలవంతుడు, అన్ని ధర్మాలు తెలిసినవాడు, యుద్ధంలో చురుకైనవాడు, వేగంతో తరుముతూ ప్రజలను చెదర గొట్టగలడు. ద్రౌపదీ పుత్రులు మహాధనుర్ధారులు, శూరులు, అస్త్రవేత్తలు, రథ యుద్ధంలో ఆరితేరినవారు. వారు విషసర్పాల లాగా వచ్చి శత్రువులపై పడుతూ ఉంటే... అపుడు దుర్యోధనుడు పశ్చాత్తాపం పొందుతాడు.

శత్రుమర్దనుడు, అస్త్రవేత్త, కృష్ణసమానుడు అయిన అభిమన్యుడు కురువీరులపై మేఘంలాగా బాణవర్షం కురిపిస్తూ ఉంటే... అపుడు దుర్యోధనుడు యుద్ధం గురించి పశ్చాత్తప్తు డవుతాడు. బాలు డయినా ప్రౌఢ పరాక్రమంతో కురుసేన మీద మృత్యువులా దూకుతున్న అభిమన్యుని చూస్తే... అప్పుడు దుర్యోధనుడు పశ్చాత్తాప పడతాడు. చురుకైన యువకులు, అస్త్రవిశారదులు, సింహంతో సమానమయిన పరాక్రమం కల ప్రభద్రకులు (యాదవులలో ఒక వర్గం) సైన్యంతో సహా కౌరవులను చెదరగొడుతూ ఉంటే.. అపుడు యుద్ధం గురించి దుర్యోధనుడు పశ్చాత్తాపం పొందుతాడు. వృద్ధులూ, మహారథులూ అయిన విరాట, ద్రుపదులు వేర్వేరుగా తమ తమ సైన్యాలతో విహరిస్తూ, కౌరవుల సైన్యంపై దృష్టిసారిస్తే అపుడు దుర్యోధనుడు యుద్ధం గురించి పరితపిస్తాడు. అస్త్రవేత్త అయిన ద్రుపదుడు యుద్ధంలో రథం ఎక్కి, కోపంతో (తన వింటినుండి వదిలిన) బాణాలతో యువకుల తలలు తరుగుతూ ఉంటే.. అపుడు యుద్ధం గురించి దుర్యోధనుడు పరితపిస్తాడు. శత్రువీరులను సంహరించే విరాటుడు యుద్ధంలో మృదురూపులయిన మత్స్యులతో కలిసి శత్రుసేనలో ప్రవేశిస్తూ ఉంటే... అపుడు యుద్ధం గురించి దుర్యోధనుడు పరితాపం చెందుతాడు. వినయం, మృదుస్వభావం కల విరాటుని పెద్దకొడుకు (శంఖుడు) పాండవులకోసం కవచం దాల్చి రథమెక్కి ఎదురు పడితే... అపుడు దుర్యోధనుడు పశ్చాత్తాపం చెందుతాడు.

కౌరవ వీరసత్తముడు భీష్ముడు శిఖండి చేత యుద్ధభూమిలో పడిపోతే...

ఇక మాకు శత్రువులుండరు. ఇందులో సందేహం లేదు. నిజం చెపుతున్నాను. శిఖండి దివ్యాశ్వాలు గల రథాన్ని ఎక్కి, శత్రురథికులను ఏరిఏరి చంపుతూ, చితకగొట్టుతూ భీష్ముని ఆక్రమించినప్పుడు దుర్యోధనుడు యుద్ధాన్ని గురించి పశ్చాత్తాపపడతాడు. సృంజయుల సేనలో ముందు భాగాన వెలుగొందే ధృష్టద్యుమ్నుని చూస్తే... దుర్యోధనుడు పరితపించక మానడు. ధీమంతు డయిన ద్రోణుడు అతనికి రహస్యమైన అస్త్రం చెప్పాడు. పాండవసేనాపతి ధృష్టద్యుమ్నుని బలం లెక్కింపరానిది. ఎంత శత్రువు నయినా నిలబెట్టగల అతడు కౌరవులను బాణాలతో పిండిచేస్తూ ద్రోణునిపై పడినపుడు... ఆ దుర్యోధనుడు యుద్ధం గురించి పశ్చాత్తప్ప డవుతాడు. లజ్జాశీలుడు, బుద్ధిమంతుడు, బలవంతుడు, మనసు గలవాడు, సంపన్నుడు అయిన ఆ (ధృష్టద్యుమ్నుని) శత్రువు లెవరూ నిలువరించలేరు. అతని ముందు భాగాన వృష్ణిసింహుడైన సాత్యకి ఉంటాడు. ఈమాట కూడ చెప్పాలి. "రాజ్యం ఆశపడకు" అని. ఎందుచేతనంటే లోకంలో కాని, యుద్ధంలో కాని రథ మెక్కితే సాటిలేనివాడు సాత్యకి - అతడు మాకు సహాయుడు - భయమెరుగని బలశాలి. అస్త్రవిద్యలో నిపుణుడు. విశాలమైన వక్షఃస్థలం, దీర్ఘ భుజాలు కలిగి, దివ్యాస్త్రవేత్త అయిన సాత్యకి యుద్ధంలో సాటిలేనివాడు. తాటి చెట్టంత ఆయుధంతో శత్రు మర్దనం చేస్తాడు. ఆ మహారథుడు భయరహితుడు.

ఆ సాత్యకి మేఘం వర్షం కురిసినట్లు శత్రువులపై బాణాలు కురిపిస్తూ శత్రుయోధుల నందరిని కప్పివేస్తూ ఉంటే... అప్పుడు యుద్ధం గురించి దుర్యోధనుడు పరితపిస్తాడు. పొడవైన భుజాలు, దృఢమైన విల్లు కల ఆ మహాత్ముడు యుద్ధంలో కొద్ది ధైర్యం చూపితే చాలు, సింహం వాసన తగిలిన పశువుల్లాగా శత్రువులు పరువు లెత్తుతారు. ఆ సాత్యకి పర్వతాలను సయితం పిండి చేస్తాడు. లోకాలన్నిటినీ సంహరించగలడు. అస్త్రనిపుణుడు, హస్తలాఘవం కలవాడు. ఆకాశంలో సూర్యునిలా వెలిగిపోతూ ఉంటాడు. వృష్ణిసింహుని అస్త్రలాభం చిత్రమూ, సూక్ష్మమూ అయినది. ప్రశస్తమూ, నిపుణమూ అయినది. ప్రశస్తమయిన యోగం ఎలా ఉండాలో అటువంటి సర్వగుణాలతోనూ కూడిన నైపుణ్యం కలవాడు సాత్యకి. నాలుగు తెల్లని గుర్రాలు పూన్చిన బంగారు రథంలో ఉన్న సాత్యకితో యుద్ధంలో కౌరవులు తలపడితే అపుడా మందబుద్ధి అయిన దుర్యోధనుడు పరితపిస్తాడు. బంగారంతో, మణులతో ప్రకాశిస్తూ, శ్వేతాశ్వాలు కపిధ్వజం కల నా రథం మీద కృష్ణుడు కూడా ఉండగా

చూసి మందబుద్ధి అయిన దుర్యోధనుడు పరితపించక తప్పదు. యుద్ధంలో నేను వింటినారిని లాగితే పిడుగుపడినట్లు ధ్వని వస్తుంది. భయంకర మయిన నా గాండీవధ్వనిని ఆ మందబుద్ధి తప్పక వింటాడు. రణాంగణం అంతా నా బాణవర్షంతో చీకటి అయిపోతే... ఆ చీకటిలో పశువుల మందలా తన సైన్యం పారిపోతూ ఉంటే... దుర్మార్గుడు ఆ ధృతరాష్ట్రపుత్రుడు పరితపిస్తాడు.

నా బాణాలు మేఘం నుండి వెలువడే భయంకరమయిన పిడుగు రవ్వల వంటివి. యుద్ధంలో వేలకొద్దీ శత్రువులను చంపుతాయి. ఎముకలనూ, మర్మస్థానాలనూ ఛేదిస్తాయి. గజ, తురగ, పదాతి దళాలను మట్టుపెడతాయి. ఆ నా బాణాలు గాండీవం నుండి వెలువడినపుడు... ఆ దుర్యోధనుడు పరితపిస్తాడు. తన సైన్యం వదలిన బాణాలు నా బాణాలతో అడ్డం తిరిగి విరిగి పడుతూ ఉంటే.. చూసి ఆ దుర్యోధనుడు యుద్ధం గురించి పరితాపం చెందుతాడు. నా భుజాల నుండి వెలువడిన బాణాలు, పక్షులు చెట్ల కొనకొమ్మల నుండి పళ్లను కొరుక్కుపోయినట్లుగా యువకుల శిరస్సులను త్రుంచి వేస్తూ ఉంటే... అపుడు ఆ దుర్యోధనుడు యుద్ధం గురించి పరితపిస్తాడు. యుద్ధరంగంలో నా బాణాలు తగిలి రథాల నుండి, ఏనుగుల మీదనుండి, గుర్రాల మీద నుండి పడుతున్న యోధుల్ని చూస్తే... అపుడు ఆ దుర్యోధనుడు యుద్ధం గురించి పరితాపం చెందుతాడు.

శత్రుబాణాల మార్గంలో పడకుండానే (శత్రు బాణం తగల కుండానే) చేష్ట లుడిగి చచ్చిపోతున్న కౌరవులను చూచి అప్పుడు యుద్ధం గురించి దుర్యోధనుడు పరితపిస్తాడు. నోరు తెరచుకొని వచ్చే యముని లాగా, విస్తృత బాణాలు కల నేను మండే బాణాలతో శత్రువుల పదాతి దళాలనూ, రథ సముదాయాలనూ సమగ్రంగా విసరికొడుతూ ఉంటే మందబుద్ధి అయిన దుర్యోధనుడు అపుడు పరితపిస్తాడు.

రణరంగంలో లేచిన దుమ్ము అన్ని దిక్కులా వచ్చి పడుతూ ఉంటే... గాండివంతో కౌరవసైన్యం ముక్కలు ముక్కలవుతూ ఉంటే... తన సైన్యం మూర్ఛపోతూ ఉంటే.. అపుడు మందబుద్ధి అయిన దుర్యోధనుడు పశ్చాత్తాప పడతాడు. దుర్యోధనుని సేన చెల్లా చెదురుగా పారిపోతూ, అవయవాలు విరిగి, మూర్ఛపోయి ఉండగా తానూ చూస్తాడు. గుర్రాలు, యోధులు, రాజులు, ఏనుగులు చచ్చిపడి ఉంటే, సేన అంతా భయంతో దప్పికతో ఉండి, వాహనాలు కదలలేని పరిస్థితిలో దుర్యోధనుడు

చూస్తాడు. శోకారావాలతో చనిపోతున్నవారు కొందరు, చనిపోయినవారు కొందరు, చెల్లా చెదురుగా పడి ఉన్న కేశాలు, ఎముకలు, పుట్టెలు ఇవి అన్నీ బ్రహ్మ సృష్టికార్యానికి పూర్వం చేకూర్చుకొన్న అవయవ సముదాయంలా ఉంటాయి. ఆ పరిస్థితిని చూసి మందబుద్ధి అయిన దుర్యోధనుడు పరితపించక మానడు. రథం మీద నా గాండీవాన్ని, కృష్ణుని దివ్యమైన పాంచజన్య శంఖాన్ని, తెల్లగుర్రాల్ని, అక్షయ తూణీరాలను, నా దేవదత్తశంఖాన్ని, నన్ను చూస్తే.... యుద్ధంలో దుర్యోధనుడు అపుడు పరితపిస్తాడు. కూడి వచ్చిన దాయాదులను వెనుదిరిగేటట్లు చేస్తూ యుగాంతం అయ్యాక మరో యుగం ప్రవర్తింపజేస్తూ, అగ్నిలాగా కౌరవులను దహించి వేస్తూ ఉంటే అపుడు ధృతరాష్ట్రుడు పుత్రులతో కలిసి పరితపిస్తాడు. తమ్ములతో, సైన్యంతో, సేవకులతో కూడి సంపద కోల్పోయి, క్రోధంతో మందబుద్ధి అయి, గర్వం చచ్చి, నేల మీద పడినపుడు ఆ దుర్యోధనుడు పశ్చాత్తప్తుడవుతాడు.

ఒకరోజు ఉదయం నేను జపం ముగించి సంధ్యావందనం పూర్తి అయ్యాక ఒక విప్రుడు వచ్చి మనోహరంగా ఇలా అన్నాడు. "సవ్యసాచీ! కష్టమైన కార్యం ఒకటి నీవు చేయాలి. శత్రువులతో యుద్ధం చేయాలి. ఉచ్చైఃశ్రవాన్ని ఎక్కి వజ్రంతో శత్రు సంహారం చేస్తూ ఇంద్రుడు నీ ముందు నడుస్తాడు. లేదా సుగ్రీవం మొదలైన గుర్రాలు పూన్చిన రథమెక్కి కృష్ణుడు వెనుక ఉండి నిన్ను కాపాడుతాడు." వజ్రహస్తుడయిన ఇంద్రుని వదలి నేను ఈ యుద్ధంలో కృష్ణుని సహాయంగా కోరుకొన్నాను. ఈ దొంగలను చంపటానికి కృష్ణుడు నాకు సహాయంగా లభించాడు. ఇది అంతా నాకు దైవ విహితమని భావిస్తున్నాను. యుద్ధం చేయకపోయినా కృష్ణుడు ఏ పురుషుని జయాన్ని మనసా కోరుకొంటాడో అతడు శత్రువులను – వారు ఇంద్రాది దేవతలయినా– జయిస్తాడు. మనుష్యులయితే ఆలోచించ నక్కరలేదు. తేజస్వి, శూరుడు అయిన వాసుదేవుని యుద్ధంలో జయించా లనుకొనేవాడు, అంతులేని జలాలతో నిండిన సాగరాన్ని కేవలం చేతులతో ఈది దాటాలనుకొన్నవాడే అవుతాడు. (తప్పక నశిస్తాడు). అరచేతితో వెండికొండను బ్రద్దలు చేయాలనుకొంటే వాని చేయి గోళ్లతో సహా పిండి పిండి అవుతుంది తప్ప వాడు ఆ కొండను ఏమీ చేయలేడు. యుద్ధంలో వాసుదేవుని జయించాలనుకొనేవాడు మండే అగ్నిని చేతులు కప్పి ఆర్పాలి అనుకొనేవాడు, సూర్య చంద్రుల గతులను ఆపాలి అనుకొనేవాడు, దేవతల అమృతాన్ని బలవంతాన అపహరించాలి అనుకొనేవాడు.

ఆ కృష్ణుడు కేవలం ఒక్క రథమాత్ర సహాయంతో భోజవంశీయు లందరినీ బలంతో తరిమివేసి, సౌందర్యంతో వెలుగుతున్న రుక్మిణిని భార్యగా గ్రహించాడు. ఆమె యందే ఆ మహాత్ముడు ప్రద్యుమ్నుని కన్నాడు గదా! దేవతలకు రత్నం లాంటి సుదర్శనమహారాజును నగ్నజిత్తు పుత్రులు బంధించినపుడు, అతడు మొరవెడుతూ ఉంటే కృష్ణుడు ఆ నగ్నజిత్తు కొడుకుల నందరినీ జయించి సుదర్శనుని విడిపించాడు. ఇతడు పాండ్యరాజును పిడికిలి గ్రుద్దుతో రొమ్ముమీద కొట్టి చంపాడు. అలాగే కళింగులను యుద్ధంలో చంపాడు. కృష్ణుని వలననే కాశీపట్టణం చాలా సంవత్సరాలు అనాథ అయింది. ఏకలవ్యుడనే నిషాదరాజు యుద్ధంలో అజేయుడని కృష్ణుడే అనుకొనే వాడు. ఆ ఏకలవ్యుడు కొండను తాకినట్లు కృష్ణుని ఎదిరించాడు. చివరకు జంభాసురుని వలె ప్రాణాలు విడిచి పడ్డాడు. కంసుడు ఉగ్రసేనుని కొడుకు, దుష్టుడు, అతడు వృష్ణి, అంధక వంశస్థుల సభలో ఉండగా, బలరామునితో కలిసి వెళ్లి కృష్ణుడు కంసుని చంపి, రాజ్యం ఉగ్రసేనునికిచ్చాడు. ఈ కృష్ణుడు భయంకరుడైన సౌభుని (సాల్వరాజును) ఆకాశంలో మాయతో పోరాడనిచ్చాడు. పట్టణ ద్వారం దగ్గర అతడు ప్రయోగించిన శతఘ్నిని బంతిలాగా చేతులతో పట్టుకొన్నాడు. ఏ మానవుడు ఇంక ఇతనిని సహించగలడు?

ప్రాగ్జ్యోతిషం అసురుల దుర్గపురం - ఎవరికీ అది వశంకాదు. దాని రాజు నరకుడు. భూమి కుమారుడు - బలశాలి - అదితి మణికుండలాలు రెండూ అతడు అపహరించాడు. మృత్యువుకు కూడ జంకని ఇంద్రునితో సహా దేవతలంతా కలిసి వాడిని జయించలేకపోయారు - కృష్ణుని బలం, పరాక్రమం తెలిసి దేవతలు ఆ దొంగను వధించుమని ప్రార్థించారు. దుష్కర కృత్యాలు కూడా సిద్ధింప జేసుకోగల శక్తితో వారికి కృష్ణుడు మాట యిచ్చాడు. నిర్మోచన మనే నగరం దగ్గర ఆరువేలమందిని చంపి, చురకత్తులు కట్టిన పాశాలను ఒక్క దెబ్బతో ఛేదించి, మురాసురుని, ఓఘాసురుని చంపి కృష్ణుడు నిర్మోచన నగరం ప్రవేశించాడు. అక్కడే మహాబలుడైన నరకునితో అతిబలుడయిన కృష్ణునికి యుద్ధం జరిగింది. పెద్దగాలి దెబ్బకు పడిపోయిన కొండగోగు పువ్వులాగా కృష్ణుని దెబ్బకు నరకుడు క్రిందపడి ప్రాణాలు విడిచాడు. అలా నరకుని, మురుని చంపి, మణికుండలాలు తీసుకొని, కీర్తి సంపదలు సంపాదించి, సాటిలేని మహిమతో కృష్ణుడు తిరిగివచ్చాడు. యుద్ధంలో అతడు చేసిన భయంకరకృత్యం చూసి దేవతలు "యుద్ధం చేసే నీకు శ్రమలేకుండు గాక" "ఆకాశంలోనూ, నీటిలోనూ

నీవు ప్రవేశించుదువుగాక" "నీ శరీరంలో బాణాలు గ్రుచ్చుకొనకుండును గాక" అంటూ వరాలిచ్చారు. దానితో కృష్ణుడు చరితార్థు డయ్యాడు. మహాబలుడు, అప్రమేయుడు అయిన వాసుదేవునిలో ఎప్పుడూ సద్గుణసంపద అవిచ్ఛిన్నంగా ఉంటుంది. అంత భరింపరాని పరాక్రమం కల కృష్ణుని కూడ ఈ దుర్యోధనుడు జయించా లనుకొంటున్నాడు. దురాత్ము డయిన దుర్యోధనుడు ఎప్పుడూ ఇదే ఆలోచిస్తాడు. దీన్ని కూడా కృష్ణుడు మమ్మల్ని చూసి సహిస్తున్నాడు. నాకూ, కృష్ణుడికీ కలహం వచ్చేసినట్లే భావిస్తూ ఉంటాడు దుర్యోధనుడు. కృష్ణుడికి పాండవుల మీద ఉన్న మమకారం ఆ కలహంతో పోతుందని అనుకొంటాడు. అదేమిటో ఆ కురుక్షేత్ర యుద్ధంలో తెలుస్తుంది పాపం!

భీష్మునికీ, ద్రోణాశ్వత్థామలకూ, ఎదురులేని కృపునికీ నమస్కరించి రాజ్యం కోరి యుద్ధం చేస్తాను. పాపబుద్ధి కలిగి ఎవడయినా పాండవులతో యుద్ధం చేస్తే వాడికి చావు తప్పదని నా భావం. ఆ క్రూరులు కపట ద్యూతంలో పన్నేండేళ్లపాటు ఈ రాజపుత్రులను జయించారు. అడవుల్లో చాలా కాలం కష్టాల పాలయ్యాం. ఒక సంవత్సరం అజ్ఞాతవాసమూ చేశాం. ఇక ఈ పాండవులు బ్రతికి ఉండగా ఆ ధృతరాష్ట్ర పుత్రులు ఎలా పదవుల్లో నిలిచి ఆనందిస్తారు? ఇంద్రాది దేవతలు తోడుగా వారు మమ్ము జయిస్తే ధర్మం కంటె అధర్మమే గొప్పదని తేలుతుంది. ఈ లోకంలో మంచిపని అనేది ఉండదు. మానవుడు కర్మానికి బద్ధుడు. మా కష్టాలకు కారణం కర్మమే అని మేము అనుకొంటున్నాం. ఈ విషయం దుర్యోధనుడు తెలుసుకోలేకపోతే కృష్ణునితో కలిసి, నేను సహచరులతో సహా దుర్యోధనుని చంపుతాను. రాజా! ఇప్పటికర్మ నిష్ఫలం కాకపోయినా (రాజ్యం ఇవ్వకపోవడం) పూర్వం చేసిన (రాజ్యం నుండి మమ్మల్ని వెడలగొట్టడం) కర్మ నిష్ఫలం కాకపోయినా ఇప్పటి కర్మలూ, పూర్వపు కర్మలు సమీక్షించి చూస్తే దుర్యోధనునికి పరాజయమే మంచిది.

కౌరవులారా! ప్రత్యక్షంగా చెపుతున్నాను - ధృతరాష్ట్ర పుత్రులు యుద్ధం చేస్తే మిగలరు - యుద్ధం కాకపోతే మిగిలితే మిగలవచ్చు అంతే కాని యుద్ధంలో మాత్రం మిగలరు. నేనయితే కర్ణుడితో సహా ధార్తరాష్ట్రుల నందరినీ చంపి రాజ్యం పూర్తిగా జయిస్తాను. మీమీ వైభవాలకు తగినట్లు చేయవలసిన పనులు చేసుకోండి. ప్రియ భార్యలతో భోగించండి. అంతేకాదు. మాకు వృద్ధులు, పండితులు,

సత్ప్రవర్తనులు, సద్వంశజులు, సంవత్సరాలు లెక్కకట్టగలవారు, జ్యోతిశ్శాస్త్ర మెరిగినవారు, నక్షత్రాల కలయికల ఫలితాలు చెప్పగల పంచాంగకర్తలు అయిన బ్రాహ్మణు లున్నారు. వారు రహస్యమైన దైవనిశ్చయమైన ఔన్నత్య పతనాలు చెపుతున్నారు. దివ్యప్రశ్నలు, మృగచక్రాలు, ముహూర్తాలు వీటన్నిటిని బట్టి కౌరవులకు, సృంజయులకు పెద్ద వినాశం దాపురించిందనీ, పాండవులకు జయం కలుగుతుందనీ చెపుతున్నారు. శత్రుసంహారం కోసం అజాతశత్రువు ఏర్పాట్లు చేసికొని సంసిద్ధుడు కాకముందే, వృష్ణివీరుడై, దివ్యదృష్టి కల జనార్దనుడు జయాన్ని నిస్సందేహంగా చూస్తున్నాడు. నేను కూడా అలాగే వికాసబుద్ధితో భవిష్యత్తును చూస్తున్నాను. నా దృష్టి ఏ మాత్రం చలించటం లేదు. యుద్ధం చేస్తే ధార్తరాష్ట్ర లిక లేరు.

పట్టుకోకుండానే గాండీవం గంతులు వేస్తోంది. మీట కుండానే నారి కంపిస్తోంది. నా అమ్ముల పొదిలోంచి బాణాలు పైకి వచ్చి, మాటిమాటికీ ముందుకు దూకుతున్నాయి. పాము కుబుసాన్ని వదిలినట్లు ప్రేరణ లేకుండానే నా కత్తి ఒరలోంచి బయటికి వస్తోంది. ధ్వజంమీద "కిరీటీ ! నీరథం ఎప్పుడు సన్నద్ధం చేస్తున్నావు ?" అనే రౌద్ర వాక్కులు వినబడుతున్నాయి. రాత్రిపూట నక్కల మూకలు అరుస్తున్నాయి. ఆకాశం నుండి పిశాచాలు నేల కురుకుతున్నాయి. మృగాలు, నక్కలు, నెమళ్లు, కాకులు, గ్రద్దలు, కొంగలు, సివంగులు అరుస్తున్నాయి. తెల్లని గుర్రాలు కట్టిన నా రథం చూసి, బంగరు రెక్కల పక్షులు వెంటపడుతున్నాయి. నేను ఒక్కడినే అందరు రాజులనూ, యోధులనూ మృత్యు లోకానికి పంపుతాను. వేర్వేరు మార్గాల్లో వెళ్లే స్థూణాకర్ణం, పాశుపతం, బ్రహ్మాస్త్రం, ఇంద్రుడిచ్చిన ఐంద్రాస్త్రం మొదలయిన అస్త్రాలు గ్రహించి, వేసవిలో అడవిని అగ్ని దహించి వేసినట్లు బాణాలు ప్రయోగిస్తూ, వారి చావుకోసం నిలిచి, ఎవరినీ మిగలనివ్వను. సంజయా! అలా అందరూ చచ్చాకనే నాకు శాంతి. ఇది నాస్థిర నిశ్చయం. వారికి చెప్పు. ఇంద్రాది దేవతలు ఎదురయినా సరే ఎవరు జయిస్తారో వారితోనే మూర్ఖంగా కలహం కోరుతున్నాడు దుర్యోధనుడు. వాని మోహం ఎంతటిదో చూడు సంజయా! వృద్ధుడయిన భీష్ముడు, కృపుడు, ద్రోణుడు, అశ్వత్థామ, ధీశాలి విదురుడు, వీరంతా ఏమంటారో అదే అగుగాక - కురువంశస్థు లంతా ఆయుష్మంతు లగుదురు గాక.

49. భీష్ముడు సభలో కృష్ణార్జునులను ప్రశంసించుట.

రాజులంతా కూడి ఉన్నపుడు భీష్ముడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "ఒకసారి బృహస్పతి, శుక్రుడు, మరుత్తులు, ఇంద్రుడు, వసువులు, అగ్ని, ఆదిత్యులు, సాధ్యులు, సప్తర్షులు, విశ్వావసుడనే గంధర్వుడు, అప్సరసల సముదాయాలు బ్రహ్మదేవుని-సేవిస్తూ ఉన్నారు. తమ శక్తితో అందరి మనస్సులనూ, తేజస్సునూ ఆకర్షిస్తున్నట్లు సనాతనులయిన నరనారాయణులు అందరినీ మించి ఉన్నారు. అపుడు బ్రహ్మతో బృహస్పతి "పితామహా! వీరిద్దరూ ఎవరు? నిన్ను ఎందుకు సేవించటం లేదు? నాకు చెప్పు" అని అడిగాడు. బ్రహ్మ ఇట్లన్నాడు – 'భూమ్యాకాశాలను వెలిగిస్తూ, బలంతో కాంతితో ప్రకాశిస్తూ, అందరికీ ఇష్టులై, అందరినీ మించిన ఈ తాపసులు నరనారాయణులు. మానవలోకంనుండి బ్రహ్మలోకానికి వచ్చారు. తపోమహిమ, మహాసత్త్వం, పరాక్రమం కలిగినవారు. వీరిద్దరూ తమ సత్కృత్యాలతో లోకాన్ని ఆనందపరచారు.. ఒక్కరే నిజానికి – అయినా ఇద్దరుగా అయ్యారు. మహాప్రాజ్ఞులు, శత్రు సంహారకులు. రాక్షసులను సంహరించమని దేవతలచేత, గంధర్వులచేత పూజింపబడినవారు.

అది విని ఇంద్రుడు, బృహస్పతిని ముందుంచుకొని దేవతలందరితోనూ వారు తపస్సు చేసుకొనే చోటికి వెళ్లాడు. దేవదానవ యుద్ధంలో దేవతలకు భయం వేసింది. మహాత్ములయిన నరనారాయణులను అపుడు ఇంద్రుడు ఒకవరం కోరాడు. భరతసత్తమా! వారిరువురూ "కోరుకో" అన్నారు. అపుడు ఇంద్రుడు "మాకు సహాయం చేయండి" అని నరనారాయణులను అడిగాడు. అపుడు వారిద్దరూ "నీవు కోరినది చేస్తాం" అన్నారు. వారితో కలిసి ఇంద్రుడు దితి సంతతిని, దనువు సంతతిని జయించాడు.

నరుడు ఇంద్రుని యుద్ధంలో పౌలోములు, కాలఖంజులు అనే వారిని వందలు వేలమందిని సంహరించాడు. యుద్ధంలో జంభుడు తనను మింగబోతుంటే రథంమీద ఉన్న ఈ అర్జునుడు భల్లంతో వాని శిరసును ఖండించాడు. ఇతడు సముద్రతీరాన ఆరువేల మంది నివాతకవచుల్ని యుద్ధంలో ఓడించి, హిరణ్యపురాన్ని బాధించాడు. శత్రుపురాలను గెలిచే ఈ అర్జునుడు ఆజానుబాహువు – ఇంద్రునితో సహా దేవతలను జయించి అగ్నిహోత్రుని సంతృప్తి పరిచాడు. అలాగే ఈ నారాయణుడూ చాలామంది

శత్రువులను సంహరించాడు. అలా మహావీర్యులయిన వీరిద్దరూ ఇపుడు కలిసి వచ్చారు- చూడు. కృష్ణార్జునులు మహారథులు - కలిసి ఉంటారు. పూర్వం నరనారాయణులని ప్రసిద్ధులయిన దేవతలే వీరు అని వింటున్నాం. వీరు మానవలోకంలో కాని, ఇంద్రాది దేవతలకు, రాక్షసులకు కాని జయింపశక్యం కాని వారు. ఈ కృష్ణుడే నారాయణుడు - అర్జునుడే నరుడు - నిజానికి నరనారాయణులు ఒకేతత్త్వం. రెండు రూపాలుగా అయింది అంతే.

వీరిద్దరూ తమ కర్మతో అక్షయములూ, స్థిరములూ అయిన లోకాలను వ్యాపించి ఉంటారు. యుద్ధ సమయాల్లో మళ్ళీ మళ్లీ పుడుతూ ఉంటారు. అందుచేత యుద్ధ కర్మయే కర్తవ్యమని వేదవేత్త అయిన నారదుడు వృష్ణి వంశస్థులకు దీనినంతా చెప్పాడు. శంఖం, చక్రం, గద చేతుల్లో దాల్చిన కేశవునీ, భయంకరమైన వింటితో అస్త్రాలు వెదజల్లే అర్జునునీ అనగా సనాతనులయిన నరనారాయణులను ఇద్దరినీ ఒకే రథం మీద చూస్తే ... అపుడు దుర్యోధనా! నా మాట గుర్తుకు వస్తుంది. అలాగే గుర్తుకు రాకపోతే ఈ కౌరవ నాశనం దగ్గర పడినట్లే - అందుకే నీ బుద్ధి అర్థం నుండి, ధర్మం నుండి కప్పదాట్లు వేస్తోంది. నా మాట వినకపోతే నీ వారు చాలామంది చచ్చినట్లు వింటావు - మరి ఈ కౌరవులంతా నీ మాటనే పట్టుకు వ్రేలాడుతున్నారు కదా ! పరశురాముని చేత శపింపబడిన సూతపుత్రుడు కర్ణుడు - సుబలపుత్రుడు శకుని - నీచుడు, పాపి అయిన నీ తమ్ముడు దుశ్శాసనుడు - ఈ ముగ్గురి మతాన్నే నీవు అనుసరిస్తున్నావు."

అపుడు కర్ణుడిట్లా అన్నాడు - "తాతా! నీవు నన్ను అన్న మాటలు ఆయుష్మంతుడు పలుక దగినవి కావు. నేను క్షత్రియ ధర్మంలోనే నిల్చి, స్వధర్మం నుండి తొలగనివాడను. నాలో ఏ తప్పుపని చూసి నన్ను నిందిస్తున్నావు? కొద్దిపాటి పాపం కూడా నాలో ధార్తరాష్ట్రులు చూసి ఎరగరు - దుర్యోధనునికి నేను ఎప్పుడూ, ఏ కొద్దిపాటి ద్రోహమూ చేయలేదు. యుద్ధంలో నిలిస్తే పాండవు లందరినీ నేనే చంపగలను. ఎంత సజ్జను లయినా పూర్వమే విరోధించిన వారితో మళ్లీ శాంతి ఎలా చేకూరుతుంది? రాజయిన ధృతరాష్ట్రుని పని అంతా నాకు ఇష్టమే. అలాగే దుర్యోధనుని కార్యం కూడా. అతడే కదా రాజ్యమందు నిలుపబడినాడు."

కర్ణుని మాటలు విని భీష్ముడు ధృతరాష్ట్రుని సంబోధించి మళ్లీ ఇలా అన్నాడు.

"పాండవులను నేనే చంపుతానని వీడు నిత్యమూ ప్రగల్భాలు పలుకుతూ ఉంటాడు- మహాత్ములయిన పాండవుల పదహారో వంతుకు కూడా వీడు పోలడు. దుర్మతులయిన నీ కొడుకులకు వచ్చిన చేటు అంతా దుష్టుడయిన ఈ సూతపుత్రుని పని అని తెలుసుకో. వీడిని నమ్ముకొనే మందబుద్ధి అయిన దుర్యోధనుడు దేవపుత్రులూ, శత్రుసంహారకులూ అయిన పాండవులను అవమానించాడు. ఆ పాండవులలో ఒక్కొక్కరు చేసిన ఘనకార్య మొక్కటయినా ఈ కర్ణుడు పూర్వం చేశాడా? విరాటుని నగరంలో తన ముద్దుల తమ్ముడు అర్జునునిచేత చస్తే అపుడు వీడేమి పరాక్రమం చూపించాడు? ఆ అర్జునుడు కౌరవుల నందరినీ వెంటాడి చావగొట్టి తలపాగలు కోసుకుపోయాడు. అపుడు అక్కడ లేడా వీడు? గంధర్వులు ఘోషయాత్రలో నీ కొడుకును అపహరించుకొని పోయినపుడు ఈ సూతపుత్రుడు ఎక్కడకు పోయాడు? ఇక్కడ ఇపుడు ఎద్దులాగా రంకెలు వేస్తున్నాడు. అక్కడ కూడా భీమార్జునులు, నకుల సహదేవులు కలిసి కదా గంధర్వులను ఓడించారు. రాజా! ఇవన్నీ అసత్య ప్రగల్భాలు. వీటిలో ధర్మార్థాలు రెండూ లేవు. నీకు శుభమగు గాక."

భీష్ముని మాట విని అపుడు ఉదాత్తమనస్వి అయిన ద్రోణుడు సభామధ్యంలో ఆ మాటలను ప్రశంసిస్తూ ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "రాజా! భరతవంశోత్తముడయిన భీష్ముడు చెప్పినట్లు చెయ్యి. ధనలోభం కలవారి మాటలు ఏమాత్రం లెక్క చేయకు. యుద్ధానికి పూర్వం పాండవులతో సంధి మంచిది అనుకొంటున్నాను. అర్జునుని వాక్యాలుగా సంజయుడు చెప్పిన దానిలోని విశేషం నేనెరుగుదును. అర్జునుడు చెప్పినంతా చేస్తాడు. వానితో సమానుడయిన విలుకాడు మూడు లోకాల్లోనూ లేడు."

అర్థవంతమయిన ద్రోణ భీష్ముల మాటలను అనాదరించి ధృతరాష్ట్రుడు పాండవుల గురించి సంజయుని అడగడం మొదలు పెట్టాడు. భీష్మద్రోణులతో మాట్లాడక సంజయునితో మాట్లాడటంతోనే కౌరవులందరికీ జీవితం మీద ఆశ పోయింది.

50. సంజయుడు ధర్మరాజుసహాయులను వర్ణించుట.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "మా ప్రీతి కోసం వచ్చిన వివిధ సేనలను గూర్చి విన్నాక ధర్మరాజు ఏమన్నాడు? సూతా! యుద్ధం చేయదలచిన యుధిష్ఠిరుడు

(ముందుగా) ఏం చేద్దామనుకొంటున్నాడు? వాని సోదరుల యొక్క, పుత్రుల యొక్క ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్న వారెవరు? మందబుద్ధుల చేత కోపం ఎక్కింపబడిన ధర్మజ్ఞు డయిన ధర్మరాజును యుద్ధం నుండి ఉపశమించు మని మాటి మాటికి నివారించే వారెవరు లేరా ?"

సంజయుడు సమాధానం చెపుతున్నాడు. "రాజా! నీకు శుభమగుగాక - పాండవులతో పాటు పాంచాలురు ధర్మరాజు ఆజ్ఞకోసం అతని ముఖం చూస్తున్నారు. అతడే అందరినీ శాసిస్తున్నాడు. యుద్ధానికి వచ్చే యుధిష్ఠిరుని వేర్వేరుగా పాండవుల రథాలు, పాంచాలుర రథాలూ అభినందిస్తున్నాయి. కుంతీపుత్రుడు ఒక పెద్ద తేజోరాశిలా వెలిగి పోతున్నాడు. అతనిని చూసి పాంచాలురు ఆకాశంలో ఉదయించిన సూర్యుడని ప్రశంసిస్తున్నారు. గోపాలురు, గొల్లెల కాపరులు కూడా ధర్మరాజును అభినందిస్తున్నారు. పాంచాలురు, కేకయులు, మత్స్య దేశస్థులు ధర్మరాజును మెచ్చుకొంటున్నారు. బ్రాహ్మణ స్త్రీలు, రాజపుత్రికలు, వైశ్యపుత్రికలు యుద్ధానికి సిద్ధమయిన ధర్మరాజును చూడటానికి ఆడుతూ పాడుతూ వస్తున్నారు."

అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "సంజయా! ఏ సహాయంతో పాండవులు మాతో యుద్ధానికి సిద్ధమవుతున్నారు? ధృష్టద్యుమ్నుని సైన్యం, పాంచాలుర బలం- ఇంతే కదా!" కౌరవ సభలో ఇలా అడిగేసరికి సంజయుడు, దీర్ఘంగా నిట్టూర్చి, మళ్లీ ఏదో ఆలోచిస్తున్నట్లు నిష్కారణంగా దైవవశాత్తు మూర్ఛపోయాడు. అపుడు ఆ రాజసభలో విదురుడిట్లా చెప్పసాగాడు. "మహారాజా! ఈ సంజయుడు మూర్ఛపోయి క్రింద పడ్డాడు. అతని నోటివెంట మాట రావటం లేదు. స్పృహలేదు. కదలు మెదలు లేదు." అనగానే ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. "సంజయుడు కుంతీపుత్రులను నిజంగా మహారథు లనుకొన్నాడు. ఆ పురుష సింహులవల్ల వీని మనసు కలత చెందింది." ఇంతలో సంజయునికి స్పృహవచ్చింది. అతడు మనసు చిక్కబట్టుకొని కౌరవసభలో ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

"మహారాజా! విరాటుని యింట్లో అజ్ఞాతవాసంతో కృశించి పోయి ఉన్న మహారథులు- కుంతీపుత్రులను చూశాను. రాజా! విను. పాండవులు ఎవరితో కలిసి యుద్ధానికి వస్తున్నారో చెపుతున్నాను. వీరుడయిన ధృష్టద్యుమ్నునితో కలిసి వారు యుద్ధానికి సిద్ధమయ్యారు. రోషంచేత కాని, భయంచేత కాని, లోభం చేత కాని,

ధనంవల్ల కాని, హేతువాదంతో కాని ఆ ధర్మరాజు ఏ సందర్భంలోనూ సత్యం విడిచిపెట్టడు. ధర్మ విషయంలో అతడే ప్రమాణం. ధార్మికులలో అతడు ఉత్తముడు. అటువంటి ధర్మరాజుతో పాండవులు సంసిద్ధు లయ్యారు.

బాహుబలంలో ఈ భూమిమీద భీమునితో ఎవరూ సాటిరారు. ధనుర్ధారియై రాజులందరినీ తన వశం చేసుకొన్నాడు. యుద్ధంలో కాశీరాజును, అంగరాజును, మగధ, కళింగరాజులను జయించాడు. ఆ భీమునితో కలిసి పాండవులు యుద్ధసన్నద్ధులయ్యారు. అతని భుజబలంతోనే పాండవులు నలుగురూ లక్క యింట్లోంచి బయటపడ్డారు. మనుష్య భక్షకు డయిన హిడింబాసురుని బారినుండి పాండవులను అతడే రక్షించాడు. తరువాత సైంధవుడు ద్రౌపదిని అపహరించినపుడు ఈ వృకోదరుడే వారిని రక్షించాడు. వారణావతంలో కాలిపోవలసిన పాండవులను అందరినీ విడిపించాడు. ఆ భీమునితో కలిసి పాండవులు మీ మీదికి వస్తున్నారు. ద్రౌపదితో కలిసి ప్రియంగా విహరిస్తూ విషమమయిన గంధమాదన పర్వతం మీద క్రోధవశు లనే రాక్షసులను చంపాడు. అతని భుజాలకు వేయి ఏనుగుల బలం ఉంది. ఆ భీమసేనునితో కలిసి పాండవులు మీ మీదకు వస్తున్నారు.

అగ్ని హోత్రుని సంతృప్తి పరిచేందుకు కృష్ణునితో కలిసి దేవేంద్రుని కూడ గెలిచిన వీరుడు అర్జునుడు. ఇంద్రునే కాదు సాక్షాత్తు శూలం పట్టిన పరమేశ్వరునే జయించాడు. లోకపాలురందరినీ జయించాడు. అట్టి అర్జునునితో కలిసి పాండవులు మీ మీదికి రానైయున్నారు.

మ్లేచ్ఛగణాలతో నిండిన పడమర దిక్కును వశపరచుకొన్నాడు నకులుడు. చిత్రంగా నిలదొక్కుకుని యుద్ధం చేస్తాడు. చూడముచ్చటైనవాడు. విల్లుపట్టిన వీరుడు. అటువంటి నకులునితో కలిసి మీమీదకు యుద్ధానికి సిద్ధపడుతున్నారు.

కాశీరాజును, అంగరాజును, మగధ కళింగరాజులనూ యుద్ధంలో జయించిన సహదేవునితో కలిసి పాండవులు మీ మీదకు యుద్ధానికి సిద్ధమవుతున్నారు. అశ్వత్థామ, ధృష్టకేతుడు, రుక్మి, ప్రద్యుమ్నుడు - వీరు నలుగురే ఈ భూమిపైన సహదేవునితో సమాన పరాక్రమం కలవారు. పాండవులలో చిన్నవాడూ, మాద్రి పిన్న కొడుకు అయిన సహదేవునితో మీకు మహావినాశకర మయిన యుద్ధం వస్తోంది మహారాజా!

పూర్వం కాశీరాజు పుత్రిక అంబ భీష్ముని వధను కోరి ఘోరమయిన తపస్సు

చేసింది. చచ్చి, ఆమె ద్రుపదునికి కూతురై పుట్టి దైవవశాత్తు మళ్లీ పురుషు డయింది. అతనికి స్త్రీ పురుషుల గుణదోషాలు తెలుసును. ఆ శిఖండి యుద్ధంలో విజృంభించి, కళింగులను జయించాడు కూడ. అస్త్ర విద్యానిపుణు డయిన ఆ శిఖండితో పాండవులు మీ మీదికి వస్తున్నారు. భీష్ముని చంపాలని యక్షుడు ఆమెను పురుషునిగా చేశాడు గదా! రౌద్ర మయిన ఆ మహాధనుస్సు కల ఆ శిఖండితో కలిసి పాండవులు సంసిద్ధమై ఉన్నారు. పెద్ద పెద్ద ధనుస్సులూ, కవచాలూ ధరించిన కేకయ రాజకుమారులు అయిదుగురితో పాండవులు యుద్ధానికి సిద్ధమవుతున్నారు. పాడవైన చేతులతో త్వరత్వరగా బాణాలు వేసే సత్యపరాక్రముడు, ధైర్యశాలి, అయిన వృష్ణివీరుడు సాత్యకితో మీకు యుద్ధం వచ్చింది. మహాత్ము లయిన పాండవులకు ఆపత్కాలంలో ఆశ్రయమిచ్చిన విరాట మహారాజుతో యుద్ధంలో మీకు సమాగమం కలుగుతోంది. వారణాసిలో మహారథుడు కాశీరాజు వారి పక్షాన యోధుడైనాడు. వానితో కలిసి పాండవులు ఎత్తివస్తున్నారు. ద్రౌపది పుత్రులు పసివాళ్లు - అయినా వారి నెవరూ జయింపలేరు. పైగా మహాత్ములు. వారి స్పర్శ త్రాచు పాముతో చెలగాటం. అటువంటి ఉపపాండవులతో పాండవులు ఎత్తి వస్తున్నారు.

పరాక్రమంలో కృష్ణునితోనూ, నిగ్రహంలో ధర్మరాజుతోనూ సమానుడైన అభిమన్యునితో కలిసి పాండవులు ఎత్తి వస్తున్నారు. పరాక్రమంలో సాటిలేనివాడు, కీర్తిశాలి, యుద్ధంలో కోపిస్తే ఎదిరింపరానివాడు, శిశుపాలుని కొడుకు అయిన ధృష్టకేతువు మహారథుడు. అతడు అక్షౌహిణి సేనతో పాండవులను కలిశాడు. వానితో పాండవులు దండెత్తి వస్తున్నారు. దేవతలకు ఇంద్రుని లాగా పాండవులకు కృష్ణుడు రక్షకుడు - ఆ వాసుదేవునితో పాండవులు ఎత్తి వస్తున్నారు. భరతవంశోత్తమా! అలాగే చేదిరాజు యొక్క తమ్ముడు శరభుడు తన తమ్ముడు కరకర్షునితో కలిసి ధర్మరాజు పక్షాన చేరాడు. వారిద్దరితో పాండవులు వస్తున్నారు. జరాసంధుని కొడుకులు సహదేవుడూ, జయత్సేనుడూ ఇద్దరూ సాటిలేని యుద్ధవీరులు. వీరు పాండవుల కోసం సిద్ధంగా ఉన్నారు. మహాతేజస్వి ద్రుపదుడు పెద్దసేనతో కలిసి పాండవుల కోసం ప్రాణాలర్పించి అయినా యుద్ధం చేయటానికి సిద్ధమై ఉన్నాడు. వీరే కాదు. ఇంకా చాలామంది, తూర్పు, ఉత్తరదేశ మహారాజులు వందల కొద్దీ ధర్మరాజు పక్షాన చేరారు. వారి సహాయంతో ధర్మరాజు యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు."

51. ధృతరాష్ట్రుడు భీముని బలమును గురించి పరితపించుట.

ధృతరాష్ట్ర డిట్లనినాడు - "నీవు చెప్పిన వారంతా మంచి ఉత్సాహపరులు - కాని వీరంతా ఒక ఎత్తు, భీముడొక్కడూ ఒక ఎత్తు. అణచరాని కోపంతో మీదపడే పెద్దపులి వల్ల పెద్ద మృగానికి దడపుట్టినట్లు భీముని వల్ల నాకు మాటిమాటికి భయం కలుగుతోంది. సింహానికి భయపడిన మృగం లాగా భీముడికి భయపడి వేడిగా నిట్టూరుస్తూ ఎన్నో రాత్రులు నిద్రపట్టక జాగరణం చేస్తున్నాను. ఇంద్రతేజస్వి అయిన ఆ దీర్ఘభుజుడిని యుద్ధంలో నిలువరింపగలవాడు ఈ సేనలో నాకు కనపడటంలేదు. ఆ భీముడు మహా కోపి, (నా కొడుకులపై) తరగని పగ- పెద్దగా ఉన్మాదంతో వికటాట్టహాసం చేస్తాడు. వంకర / ప్రక్క చూపులు చూస్తాడు. గొప్పవేగం, ఉత్సాహం, బలం కలవాడు, దీర్ఘభుజుడు భీముడు. నా తెలివి తక్కువ కొడుకులను ఈ యుద్ధంతో అంతం చేస్తాడు. కురువంశ పుంగవు డయిన భీముడు దండం ధరించిన యమునిలాగా గదను దాల్చి పెద్దఉచ్చులో చిక్కుకొన్న నా తనయులను యుద్ధంలో అంత మొందిస్తాడు. ఎత్తిన బ్రహ్మదండంలా ఉన్న, బంగారం పొదిగిన, ఎనిమిది కోణాలు / అంచులు కల ఉక్కు గదను దాల్చిన భీముడు సదా నా మనసులో కనిపిస్తున్నాడు. బలంతో ఉప్పొంగే సింహం మృగసమూహాల మీద విహరించినట్లు మా సైన్యాలమీద భీముడు సంచరిస్తాడు. నా పుత్రు లందరిలో వాడొక్కడే కఠిన పరాక్రమం కలవాడు. బాగా తినగలవాడు - చిన్నప్పటి నుండి మాకు వ్యతిరేకి - ఎప్పుడూ దుడుకూ, దూకుడూ కలవాడు. చిన్నప్పుడు కూడా భీముడు నా దుర్యోధనాదులను ఏనుగులాగా యుద్ధంలో మర్దించేవాడు. ఆ విషయం నా మనసుకు దడ పుట్టిస్తోంది.

నాకుమారులు నిత్యమూ వాని వీరత్వంతో ఎంతో కష్టపడేవారు - భయంకర పరాక్రమం కల ఆ భీముడే అసలు భేదానికి కారణం. ఒళ్లు తెలియని కోపంతో యుద్ధంలో యోధులనూ, ఏనుగులనూ, గుర్రాలనూ క్రుంగి వేస్తున్న భీముడు నా ముందు నిల్చినట్లుంటాడు. అసలే కోపి- పైగా భయంకరసైన్యం ఉంది ఇపుడు. ఆ భీముడు అస్త్ర విద్యలో ద్రోణునితో, అర్జునునితో సమానుడు. వేగంలో వాయు సమానుడు. క్రోధంలో మహేశ్వర సముడు. ఆటువంటి భీముని యుద్ధంలో కొట్టగల వాడెవడు? వెనుకటికి ఘోషయాత్రలో యక్షులనూ, రాక్షసులనూ మాత్రమే చంపాడు

ఆ శత్రుఘాతి..నా కొడుకులను చంపలేదు. అదే పెద్ద లాభం. ఆ క్రోధి ధాటికి సామాన్య మానవుడు తట్టుకోలేడు. వాడు చిన్నతనంలోనే ఎపుడూ నా వశంలో లేడు. ఇపుడు దుర్మార్గులయిన నా పుత్రులు ఇంకా కష్టపెట్టారు. వేరుగా ఇక చెప్పాలా? కఠినుడు, అతిక్రోధనుడు – విరుగుతాడే కాని వంగడు – ప్రక్క చూపులు, చూస్తూ ఉంటాడు. కనుబొమలు ముడిపడి ఉంటాయి ఎప్పుడూ. ఆ భీముడు ఎలా శాంతిస్తాడు? శూరుడు, ఎదురు లేనివాడు. తెలుపు – పసుపు కలిసిన రంగు. తాటి చెట్టంత ఎత్తయిన వాడు. అర్జునుని కంటె 12 అంగుళాలు ఎత్తయిన వాడు. వేగంలో గుర్రాలనూ, బలంలో ఏనుగులనూ మించిపోతాడు– తెలియకుండా ఏవేవో మాట్లాడుతూ ఉంటాడు. తేనెవంటి (మెరిసే) కనులు కల భీముడు చాలా బలవంతుడు.

పూర్వం వాడి చిన్నతనంలో వ్యాసుడు చెపితే విన్నాను. రూపంలోను, పరాక్రమంలోనూ భీముడు సరిగా అలాగే ఉన్నాడిపుడు. యుద్ధంలో కోపంతో క్రూరపరాక్రమం కల భీముడు రథాలనూ, ఏనుగులనూ, వీరులనూ, గుర్రాలను ఇనుప గుదియతో చావబాదుతాడు. క్రోధం కలిగి, సదా ఉద్రేకంతో ఉండే యోధుడు భీముడు. సంజయా! అతనికి వ్యతిరేకపు పనులు చేసి పూర్వం అవమానించాను. నిటారుగా బరువుగా ఉండి, చక్కని బంగారు అంచులు కలిగి, వందల మందిని చంపే పిడుగుల శబ్దం కల భీముని ఉక్కు గదను నా కొడుకు లెట్లా తట్టుకోగలరు? భీమసేన మయమయిన సముద్రం అంతులేనిది– దాటలేనిది – లోతయినది – బాణాల పోట్లు కలిగినది. సంజయా! ఈ మందబుద్ధులు ఆ సముద్రాన్ని దాటాలనుకొంటున్నారు. నేను మొరపెడుతున్నా వినటం లేదు. చిన్నవాళ్లు తెలివిగల వాళ్లమనుకొంటున్నారు. తేనెపట్టు మీదనే చూపుకాని లోయలో పడిపోతున్నాం (మధ్యలో) అనుకోవటం లేదు. మహామృగాలు సింహంతో తలపడినట్లు, బ్రహ్మ తోలుతూ ఉన్న నరరూప మృత్యువుతో వీళ్లు యుద్ధానికి సిద్ధపడుతున్నారు. ఆరు అంచులు, మిక్కిలి గట్టిదనం కలిగి, తగిలితే చాలు బాధ కలిగిస్తూ, చిక్కంలో ఉండే నాలుగు మూరల గదను నాకుమారులు ఎలా తట్టుకోగలరు సంజయా!

గద త్రిప్పుకొంటూ, దానితో ఏనుగుల తలలు పగులగొడుతూ, పెదవుల మూలలు నాకుతూ, మాటిమాటికీ ఆనందబాష్పాలు విడుస్తూ ఉంటాడు భీముడు. ఏనుగుల మీద పడుతూ భయంకర ధ్వనులు చేస్తూ, మీదకు వచ్చే మదపు

టేనుగుల మీదికి గర్జిస్తూ, దుముకుతూ ఉంటాడు భీముడు. యోధులను చంపాలని రథమార్గాల్లో ప్రవేశించి, ప్రజ్వలించే అగ్నిలాంటి భీముని నుండి నా సంతతి తప్పించుకోగలదా? త్రోవ చేసుకుంటూ, ముందుకు పోతూ, నా సేనను తరుముతూ, గద చేతబట్టి నాట్యం చేస్తున్నట్లు భీముడు ప్రళయం చూపిస్తాడు. మదించిన ఏనుగులాగా పూచిన చెట్లను విరుగ గొట్టుతూ యుద్ధంలో భీముడు నా కుమారుల సేనలో ప్రవేశిస్తాడు. సంజయా! రథాల మీద పురుషులనూ, సారథులనూ, గుర్రాలను, ధ్వజాలను లేకుండా చేస్తూ, రథికులను, సారథులను మట్టుపెడుతూ, నీటిలోను, ఒడ్డున ఉన్న వివిధ వృక్షాలను గంగా ప్రవాహం కూలద్రోసినట్లు యుద్ధంలో ఆ పురుషశ్రేష్ఠుడు భీముడు నా పుత్రుల సేనను కూలద్రోస్తాడు. సంజయా! నా పుత్రులు, సేవకులు, రాజులు భీమసేనుని వల్ల భయంతో దిక్కులు పట్టి పారిపోతారు - తప్పదు.

పూర్వం వీడు వాసుదేవ సహాయంతో అంతఃపురంలో ప్రవేశించి జరాసంధుని వధించాడు. తెలివి తేటలు, బలమూ కల మగధరాజు జరాసంధుడు భూదేవి నంతటినీ తన వశం చేసుకొన్నాడు. అలా భూమి తపించింది. భీష్మప్రతాపం వల్ల కురువంశం వారూ, నీతి వల్ల అంధక వృష్ణి వంశాల వారూ ఆ జరాసంధునికి వశం కాలేదు. అది కేవలం అదృష్టమే. ఆ జరాసంధుని ఆయుధం లేకుండా బాహుబలశాలి అయిన భీముడు చంపివేశాడు. అంటే... అంతకంటె గొప్ప ఏమిటి? సంజయా! చాలాకాలంగా నిలుపుకొన్న విషాన్ని పాము ఒక్కసారిగా క్రక్కినట్లు భీముడు తన పరాక్రమం అంతా నా పుత్రుల మీద క్రక్కుతాడు. దేవేంద్రుడు వజ్రంతో రాక్షసులను సంహరించినట్లు భీముడు గద చేతధరించి నా పుత్రులను చావమోదుతాడు. ఆ భీముని పరాక్రమవేగం తట్టుకోలేము. ఆపలేము, ఎర్రని కళ్లతో భీముడు మీద పడుతున్నట్లే అనిపిస్తుంది. గద లేకుండా ధనుస్సు లేకుండా, రథం, కవచం లేకుండా కేవలం భుజబలంతోనే పోరాడే ఆ భీముని ముందు నిలవగల వాడెవడుంటాడు? భీష్ముడూ, విప్రుడయిన ద్రోణుడూ, కృపుడూ కూడ నా వలెనే ధీమంతుడైన భీముని పరాక్రమం ఎరుగుదురు. ఉత్తము లయిన వీరంతా ఆర్యప్రవృత్తి నెరిగినవారు. నా వారయిన వీరు లంతా సేనాముఖాన నిలిచి మాకోసం ప్రాణా లయినా అర్పించుతారు.

దైవమే అంతటా బలీయమైనది. పురుషుని విషయంలో మరీను - ఆ పాండవుల

విజయం గమనిస్తూ ఉన్నా నా కుమారులను అదుపు చేయలేక పోతున్నాను. గొప్ప ధనుర్ధరులైన ఈ వీరులు ప్రాచీనమయిన స్వర్గ మార్గాన్ని అనుసరిస్తారు. క్షత్రియ ధర్మం రక్షించుకొంటూ ప్రాణా లయినా విడుస్తారు. సంజయా ! వీరికి మా వారెట్లో పాండవులూ అట్లే. భీష్మునికి మనుమలు - ద్రోణునికీ, కృపునికీ శిష్యులు. సంజయా! వారికి మేము ఆశ్రయమిచ్చాము. వారికిష్ట మయినదీ కొద్దిగా ఇచ్చాము. సజ్జనులు కాబట్టి పెద్దవాళ్లు ముగ్గురూ ఆ ఋణం తీర్చుకోవాలని (మా పక్షాన) ఉన్నారు. శస్త్రం పట్టి క్షత్రియ ధర్మం కోరుకొనే క్షత్రియుడికి యుద్ధంలో మరణించడమే ఉత్తమమని, మేలని అంటారు. పాండవులతో యుద్ధం చేయాలనుకొంటున్న వారందరి కోసం నేను ఏడుస్తున్నాను. మొదటి నుండీ విదురుడు మొరపెడుతూనే ఉన్నాడు. ఆ భయం రానే వచ్చింది. సంజయా ! జ్ఞానం దుఃఖాన్ని పోగొట్టుతుందని నేను భావించను. దుఖం బలీయమైనది. జ్ఞానాన్ని కూడ అది చంపుతుంది. జీవన్ముక్తులై లోక వ్యవహారం గమనించే ఋషులు కూడ సుఖాలతో సుఖపడుతున్నారు. దుఃఖాలతో దుఃఖపడుతున్నారు. ఇక కొడుకులు, రాజ్యం, భార్యలు, మనుమలు, బంధువులు- అని వేయి విధాల మోహంలో పడిపోతున్న వారి గురించి వేరే చెప్పడ మెందుకు?

ఇది పెద్ద సందేహ సమయం. ఇప్పుడు నేను చేయగల కర్తవ్య మేమిటి? ఎంత ఆలోచించినా నాకు కౌరవుల నాశనమే గోచరిస్తోంది. జూదం దగ్గర నుండే కౌరవులకు గొప్ప భయం/ కష్టం కనపడుతోంది. ఐశ్వర్యం కోరుతున్న నా తెలివితక్కువ కొడుకు యొక్క లోభంతో ఈ పాపం చేయబడింది. నిరంతరంగా నడిచే కాలంయొక్క క్రమధర్మం ఇది అనుకొంటాను. చక్రానికి అంటుకొన్న పట్టా లాగా కాలానికి తగుల్కొన్నవాడు (దాని నుండి) పారిపోలేడు. ఏం చెయ్యను? ఎలా చెయ్యను? ఎక్కడకు పోను? సంజయా! ఈ తెలివి తక్కువ కౌరవులు కాలానికి వశ లయి నశించిపోతారు. సంజయా! నా వందమంది కొడుకులూ చనిపోయాక అవశుడనైన నేను కౌరవస్త్రీల ఏడుపులను ఎలా వినగలను? నాకు (ఇపుడే) మరణం సంభవించును గాక. వేసవికాలంలో గాలితో విజృంభించే అగ్ని అడవిని దహించి వేసినట్లు భీముడు గద చేతపట్టి అర్జునునితో కలిసి నా కుమారుల నందరినీ చంపి వేస్తాడు."

52. ధృతరాష్ట్రుడు అర్జునుని పరాక్రమమును గురించి విలపించుట.

ధృతరాష్ట్ర డిట్లన్నాడు. "అర్జునుడు ఎన్నడూ అబద్ధమాడినట్లు వినలేదు- అతడు యుద్ధం చేస్తే ముల్లోకాలూ వాడివే. గాండీవం దాల్చిన అర్జునుని యుద్ధంలో ఎదిరించే రథికుడు ఎంత ఆలోచించినా నాకు కనపడటం లేదు. యుద్ధంలో గుండెలు బ్రద్దలు చేసే గుట్టపు చెవుల వాడి బాణాలు వేసే గాండీవికి సమానమైన వీరు డెవడూ లేడు. ఒకవేళ వీరయోధులు, అస్త్ర విద్యావిశారదులు, బలిష్ఠులూ, యుద్ధాలలో ఓటమి నెరుగని ద్రోణ కర్ణులు ఏమయినా ఎదిరించగలరేమో! అయినా వారు ఎదిరించినా లోకంలో పెద్ద సంశయం ఒకటి ఉంది. నాకు విజయం రాదు. ఎందుచేతనంటే కర్ణుడు జాలిగుండె కలవాడు. ప్రమాద పడతాడు (మరచిపోతాడు). గురువు ద్రోణుడు ముసలివాడు. అర్జునుడు బలవంతుడు సమర్థుడు. దృఢమైన ధనుస్సు (గాండీవం) కలవాడు. శ్రమ ఎరుగనివాడు. ఎంతటి దొమ్మి యుద్ధంలో కూడా ఏ ప్రక్కనుండీ పరాజయం ఎరుగడు. వారంతా అస్త్రవేత్తలు, శూరులు, చాలా కీర్తి గడించినవారు, ఇంద్ర సంపద నయినా వదులుతారు గాని జయం మాత్రం వదలరు. ద్రోణ కర్ణులో- ఆ అర్జునుడో చనిపోతేనే శాంతి లభిస్తుంది. కాని అర్జునుని చంపగలవాడు కాని, జయంపగలవాడు కాని లేడు. మందబుద్ధులయిన వారి (నా కొడుకుల) మీదకు విజృంభించిన ఆ అర్జునుని కోపం ఎలా చల్లారుతుంది? ఇతరులకు అస్త్రాలు తెలియవచ్చును. వారు గెలువనూ వచ్చు, ఓడిపోనూ వచ్చు. కాని అర్జునునకు సదా విజయమే కలుగుతుందని వింటూ ఉంటాము.

ముప్పది మూడు వేలమందిని పిలిచి, వారందరితో కూడిన ఇంద్రుని గెల్చి, ఖాండవవనంలో అగ్నిహోత్రుని సంతృప్తి పరచాడు. అసలు వానికి పరాజయమే లేదు. పైగా ఇపుడు వానికి కృష్ణుడు సారథి. వారిద్దరూ స్వభావంలోనూ, నడవడిలోనూ అంతటా (ఆత్మనా - శరీరేణ) సమానులు. ఇంద్రునికి వలె ఆ అర్జునునికీ జయం నిశ్చయం. ఎందుచేతనంటే ఒకే రథం మీద నిలిచిన వారు ఇద్దరు కృష్ణులు. (కృష్ణుడు - అర్జునుడు. అర్జునునికి కూడా కృష్ణుడు అనే పేరు ఉంది), సంధింపబడిన గాండీవ ధనుస్సు. ఇపుడు మూడు తేజస్సులు ఒక చోట చేరాయని వింటున్నాము. మనకు అటువంటి ధనుస్సూ లేదు. అటువంటి యోధుడూ లేడు. అటువంటి సారథీ లేడు. (మూడు తేజస్సులు = 1. గాండీవం. 2. అర్జునుడు. 3. కృష్ణుడు.)

ఆ విషయం దుర్యోధనుని వశమై తిరిగే ఈ మందబుద్ధులకు తెలియటం లేదు. మంటలు క్రక్కుతూ నెత్తిమీద పడిన పిడుగు (వజ్రాయుధం) అయినా ఏమయినా మిగులుస్తుందేమో కాని కిరీటి వేసిన బాణాలు ఏమాత్రం మిగల్చవు. ఆ అర్జునుడు బాణాలను విసరుతూ (శత్రువులను) చంపుతున్నట్లే ఉంటుంది. బాణ వర్షంలో (నావారి) తలలను శరీరాలనుండి ఎగరగొడుతున్నట్లే అనిపిస్తూ ఉంటుంది. యుద్ధంలో గాండీవం నుండి వెలువడిన బాణ తేజస్సు నా కుమారుల సేనను కాల్చివేస్తున్నట్లు తోస్తోంది. సవ్యసాచి యొక్క సారథ్యమోషకే భారతీయమైన ఈ సేన అంతా భయంతో చెల్లా చెదరయినట్లు నాకు అనిపిస్తోంది. గాలితో విజృంభించిన దావాగ్ని పెద్దపెద్ద మంటలతో అన్ని వైపులా క్రమ్ముకొంటూ అడవి నంతటినీ కాల్చివేసినట్లు ఆ గాండీవం నుండి వెలువడిన బాణాగ్ని నా వారి నందరినీ దహించివేస్తుంది. ఆ అర్జునుడు యుద్ధంలో పదునైన బాణ పరంపరలతో శత్రువులను చంపటానికి మీదకురుకుతూ ఉంటాడు. అపుడు అతడు సర్వమూ హరించటానికి బ్రహ్మ సృష్టించిన యముడే అనిపిస్తుంది. ఆ సమయంలో అతడిని ఎవరూ ఆపలేరు / అడ్డుకోలేరు. కౌరవులంతా అనేకవిధాల యుద్ధంలో పడిపోయినట్లు చావుకబురులన్నీ ఇంటిలో కూర్చుని వినాలి కాబోలు. అయ్యో! రణ రంగంలో భరత వంశస్థులందరికీ సర్వనాశనం జరుగుతుంది కాబోలు."

53. పాండవ బలమును గూర్చి ధృతరాష్ట్రుని విలాపము.

ధృతరాష్ట్రుడిట్లు అన్నాడు. "పాండవులు జయంకోసం విక్రమిస్తున్నట్లే వారికి సహాయపడటానికి వచ్చినవారు కూడా జయం కోసం ప్రాణాలు వదలటానికయినా సిద్ధపడుతున్నారు. అలా విక్రమించే పాంచాలురు, కేకయులు, మగధ దేశీయులు, వత్సరాజులు, వీరిని గురించి చెప్పావు గదా! నాకు. అనుకొంటే చాలు ఇంద్రునితో సహా లోకా లన్నిటినీ వశపరుచుకోగల బలవంతుడు, జగత్కర్త అయిన కృష్ణుడు పాండవుల విజయం మీద ధైర్యంతో ఉన్నాడు. శిని మనుమడు సాత్యకి అర్జునుని దగ్గర విద్యనంతనూ చురుకుగా నేర్చాడు. ఆ సాత్యకి ఇపుడు విత్తనాలు చల్లినట్లు యుద్ధరంగంలో బాణాలు అలవోకగా విసురుతాడు. పాంచాలరాజు కుమారుడు ధృష్టద్యుమ్నుడు క్రూరకర్ముడయిన మహారథుడు. దివ్యాస్త్రవేత్త. వాడు మా సేనలతో

యుద్ధం చేస్తున్నాడు. ధర్మరాజు కోపం వల్లనూ, అర్జునుని పరాక్రమం వల్లనూ, నకులసహదేవుల వల్లనూ, భీముని వల్లనూ, సంజయా! నాకు భయం కలుగుతోంది. ఈ మానవేంద్రులు అమానుషమయిన పెద్దవల విసిరారు. అందులోనుండి నా సైన్యాలు బయట పడలేవు. సంజయా! అందుకు ఏడుస్తున్నాను.

పాండురాజకుమారు డయిన ధర్మరాజు చూడముచ్చటయిన వాడు. మనసు గలవాడు. ఐశ్వర్యం కలవాడు. బ్రహ్మవర్చస్సు కలవాడు. మేధావి, ఫలవంత మయిన తెలివి కలవాడు. ధర్మాత్ముడు. మిత్రులూ, మంత్రులూ పుష్కలంగా ఉన్నారు అతనికి. యుద్ధనిపుణుల సహాయం అతనికి ఉంది. మహారథులైన తమ్ములు, వీరులైన మామలు అతని కున్నారు. పురుషశ్రేష్ఠ డయిన ధర్మరాజు ధైర్యం కలవాడు. రహస్యం రక్షించుకోగలవాడు. క్రూరుడు కాడు. దానపరుడు, లజ్జాశీలి, సత్య పరాక్రముడు. చాలా శాస్త్రజ్ఞానం కలవాడు – పుణ్యాత్ముడు, వృద్ధులను సేవిస్తాడు. ఇంద్రియాలను జయిస్తాడు. సర్వ సద్గుణ సంపన్ను డయిన ధర్మరాజు మండే అగ్నిలాగా కాల్చి వేస్తాడు. అటువంటి ధర్మజాగ్నిలో మిడుతలాగా ఏ తెలివి తక్కువవాడు పడతాడు? ఆర్పరాని పాండవాగ్నిని ఆర్పవలె ననుకొనే ఆయువు మూడిన వాడెవడు? ధర్మరాజు మెల్లగా రాజుకొనే నిప్పు. వానిపట్ల దొంగ ప్రేమలు నటించాను. (ద్యూతంతో మోసం చేశాను). నా తెలివి తక్కువ కొడుకులను యుద్ధంలో తుదముట్టిస్తాడు. కౌరవులారా! వారితో యుద్ధం రాకపోవడమే మంచిది. తెలుసుకోండి. యుద్ధమే వస్తే కులమంతా నశించి పోతుంది. నిస్సందేహం. ఇది నాకు తోచిన మంచి ఊహ. దీనివల్ల నా మనసు శాంతిస్తుంది. మీకు కూడా యుద్ధం ఇష్టం లేకపోతే మనం శాంతికోసం ప్రయత్నించుదాం. ఇలా నలిగిపోతున్న మనలను ఆ ధర్మరాజు ఉపేక్షింపకుండును గాక. దీనికంతకూ కారణం నేనే అని ధర్మరాజు నన్ను అధర్మంతో అసహ్యించుకొంటాడు."

54. సంజయుని మాటలు.

సంజయుడిలా అన్నాడు. "మహారాజా! నీవు చెప్పినది నిజం. గాండీవంతో క్షత్రియ వంశమంతా నశించిపోయేటట్లే కనిపిస్తోంది. అర్జునుని శక్తిలోని తత్త్వం తెలిసికూడా నీ కొడుకుకు వశమవుతున్నావు. నిత్యమూ నీకీ ధైర్యమెక్కడి నుండి వస్తోందో నాకయితే తెలియటం లేదు. మహారాజా! మొదటి నుండీ నీవు పాండవులకు

కీడు కలిగిస్తూనే ఉన్నావు. ఎప్పుడూ కీడు చేసే నీకు ఇపుడు ఈ బుద్ధి నిలవదు. ఉత్తము డయిన తండ్రి మంచిమనసు కలిగి చక్కగా స్థిరబుద్ధితో కొడుకులకు హితం చెప్పాలి. అంతేకాని ద్రోహం చేసే వానిని గురు వని పిలవరు. మహారాజా! జూదం సమయంలో "ఇది గెలువబడింది. ఇది పొందబడింది" అని పరాజితులయిన పాండవులను గురించి విని, పిల్లలవలె (నీ కొడుకులవలె) పొంగిపోయావు. అపుడు (జూదం నాడు) పాండవులను (నీ కొడుకులు) పరుషవాక్కులు పలుకుతూ ఉంటే రాజ్యం అంతా పూర్తిగా దక్కుతోంది కదా అని ఉపేక్షించావు కాని రాబోయే ఘోర వినాశాన్ని గమనించలేకపోయావు. ఈ కురు, జాంగల దేశాలన్నీ వారి తండ్రి (పాండురాజు) సంపాదించినవి. ఇంకా ఆ వీరులు (పాండవులు) భూమినంతటినీ జయించారని తెలుసుకో. తమ భుజబలంతో సంపాదించిన భూమి నంతనూ పాండవులు నీకు సమర్పించారు. రాజోత్తమా! నీవేమో ఇదంతా (నా చేతనే చేయబడింది) "నా సుకృతమే" అని భావిస్తున్నావు. గంధర్వరాజుకు చిక్కి, నావ లేకుండా నీటిలో మునిగిపోయే నీ కొడుకులను ఆ ధర్మరాజే (అర్జునుడే) మళ్లీ (నావగా అయి) ఉద్ధరించాడు. పాండవులు జూదంలో ఓడిపోయినపుడు, అడవులకు వెడుతున్నపుడు కూడ నీవు పిల్లలలాగా/ నీ కొడుకుల లాగా సంతోషించావు. (ఏమనుకోవాలి?)

అర్జునుడు వాడి బాణపరంపరలను వర్షిస్తూ ఉంటే సముద్రాలు కూడా ఎండిపోతాయి. ఇక మానవుల మాట చెప్పాలా? విలుకాండ్రలో అర్జునుడు ఉత్తముడు. ధనుస్సులలో గాండీవం శ్రేష్ఠమయినది. సర్వభూతాలలో కేశవుడు శ్రేష్ఠుడు. ఆయుధాలలో సుదర్శన చక్రం శ్రేష్ఠం. ధ్వజాలలో వానరుడు ప్రకాశించే కపిధ్వజం శ్రేష్ఠమయినది. వీని నన్నిటినీ రథంమీద పెట్టుకొని తెల్లని గుర్రాలు రథానికి పూన్చి రాజా! కాలచక్రం లాగా అర్జునుడు మనల నందరినీ నరికి పారేస్తాడు. రాజా! ఇపుడు భూమి అంతా అతనిది. భీమార్జునులు ఎవరి యోధులో అతనిదే రాజ్యం. అతడే(ధర్మరాజే) రాజు. అలా భీముని చేత సగం చచ్చి మునిగిపోతున్న నీ సేనను దుర్యోధనాదులు చూసి, చచ్చి ఊరుకొంటారు. భీమార్జునులకు భయపడిన నీ కొడుకులూ, వారి సహచరులయిన రాజులూ విజయం పొందలేరు. మత్స్యరాజులు, పాంచాలురు, కేకయులు, శాల్వేయులు, శూరసేనులు ఇపుడు నిన్ను సేవించడం లేదు. సరిగదా వారంతా నిన్ను అవమానిస్తున్నారు. ధీమంతు డయిన ధర్మరాజు యొక్క శక్తి పెరిగి ఈ రాజులంతా ధర్మరాజును

చేరారు. ధర్మరాజు మీది భక్తితో వారు నీ పుత్రులతో విరోధిస్తున్నారు. ధర్మసహితులూ, వధకు తగని వారూ అయిన పాండవులను అవమానించి కష్టపెట్టినవాడు, ఇప్పటికీ వారిని ద్వేషించేవాడూ, అయిన నీ కొడుకును వాడి స్నేహితులతో పాటు అన్ని ఉపాయాలతో అదుపు చెయ్యాలి. అంతేకాని ఇపుడు ఏడవరాదు. ఇది జూదం నాడే మహామేధావి అయిన విదురుడూ నేనూ, కూడా చెప్పాము. రాజా! పాండవులను గూర్చి ఇప్పటిదాకా అసమర్థునివలె ఏడ్చిన ఏడుపు అంతా వ్యర్థం."

55. దుర్యోధనుడు తన శక్తిని గూర్చి చెప్పుకొనుట.

దుర్యోధనుడు ఇలా అన్నాడు. "మహారాజా! భయపడవలసిన పనిలేదు. మమ్మల్ని గూర్చి మీరు విచారించవద్దు. మేము శత్రువులను జయింపగలం. మేము యుద్ధంలో బలవంతులమే. వనవాసానికి పోయిన పాండవులను తీసికొని ఇతర రాష్ట్రాలను ఇబ్బందిపెట్టే పెద్దసేనతో కృష్ణుడు వచ్చాడు: కేకయరాజులు, ధృష్టకేతుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు - ఇంకా ఇతర రాజులూ ఆ పాండవులను అనుసరించారు. ఆ మహారథులంతా ఇంద్రప్రస్థానికి దగ్గరగా వచ్చి, కలిసి, నిన్నూ కౌరవులనూ కూడా నిందించారు. నార బట్టలు కట్టుకొని కూర్చున్న ధర్మరాజును కృష్ణుడు మొదలయిన వారంతా సేవించారు. రాజ్యం తిరిగి పొందడాన్ని గురించి, నిన్ను బంధువులతో సహా పెకలించి వేయటానికి ఆ రాజులు కర్తవ్యబోధ చేశారు. ఇదంతా నేను విని, బంధునాశాన్ని, భయాన్ని దృష్టిలో పెట్టుకొని భీష్మద్రోణ కృపులతో ఇలా అన్నాను.

పాండవులు మాటమీద నిలుస్తారని నా అభిప్రాయం. కాని ఆ కృష్ణుడు మాత్రం మనల నందరినీ పెల్లగించివేయా లనుకొంటున్నాడు. విదురుడు తప్ప మిగిలిన మీరంతా చంపదగిన వారే. (కృష్ణుని అభిప్రాయం). ధృతరాష్ట్రుడు మాత్రం కురూత్తముడు ధర్మజ్ఞుడు. అవధ్యుడు. మనల నందరినీ పూర్తిగా చంపి ఈ కౌరవుల ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ఆ ధర్మరాజుకు కట్టబెట్టాలని కృష్ణుడనుకొంటున్నాడు. ఇపుడు మన కర్తవ్యం ఏమిటి? కాళ్లమీద పడటమా? పలాయనం చిత్తగించడమా? లేక ప్రాణాలకు తెగించి శత్రువులతో యుద్ధం చేయడమా? యుద్ధం చేస్తే మనకు పరాజయం తప్పదు. రాజులంతా ధర్మరాజుకు వశమయి ప్రవర్తిస్తున్నారు గదా! రాష్ట్రాలకు మనమీద విరక్తి కలిగింది. మిత్రులు కూడా మన మీద కోపించారు.

మిగిలిన రాజులూ, మనవారూ కూడా అన్ని విధాలా మనల్ని ధిక్కరిస్తున్నారు. కాళ్లమీద పడటం వల్ల తప్పులేదు. పైగా సంధి శాశ్వతంగా ఉంటుంది. కాని ప్రజ్ఞయే కనులుగా గల మా మహారాజు, తండ్రిని గురించి విచారిస్తున్నాను. నాకోసం మాతండ్రి చాలా బాధపడుతున్నాడు. అంతులేని కష్టం పొందాడు. రాజా! నీ పుత్రులు కూడా శత్రువులను అడ్డగించారు. ఇదంతా పూర్వం నాకోసం జరిగింది. ఇది నీకు తెలుసును. అందుచేత మహారథులైన ఆ రాజులూ, పాండవులూ, మంత్రి సహితమైన ధృతరాష్ట్ర మహారాజు యొక్క వంశాన్ని సమూలంగా నాశనం చేసి ప్రతీకారం తీర్చుకొంటారు."

ఇలా అనగానే ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, అశ్వత్థామ 'నాకు పెద్ద వ్యథ ఏర్పడిందని, నా మనసు బాధపడుతోం' దని అనుకొంటూ ఇలా అన్నారు. "శత్రుంజయా! శత్రువులకు మనం ద్రోహం చేసినా సరే నీవు భయపడ నవరసం లేదు. రణరంగంలో నిలిస్తే మనలను పరులు జయించలేరు. మనం ఒక్కొక్కరమూ రాజు లందరినీ జయించగలం. రానియ్యి. వాడిబాణాలతో వారి గర్వం అణుచుదాం. తండ్రి చనిపోయినపుడు రాజు లందరూ దండెత్తితే భీష్ముడొక్కడే కేవలం రథమాత్ర సహాయుడై రాజు లందరినీ జయించాడు. కురుసత్తముడైన భీష్ముడు కోపంతో వారిలో చాలా మందిని సంహరించాడు. మిగిలినవారు భయంతో భీష్ముని శరణు కోరారు. దుర్యోధనా! చక్కని సమర్థు డయిన భీష్ముడు యుద్ధంలో మన ప్రక్కనుంటాడు. శత్రువులను జయిస్తాడు. అందుచేత నీ భయం పోవుగాక." ఇలా ఈ మహాతేజస్వు లంతా అపుడు నిశ్చయించారు. శత్రువుల భూమి అంతా ఎపుడో పూర్వమే మన వశమయింది. రెక్కలు తెగి శక్తి లేని పాండవులు ఇపుడు మనలను యుద్ధంలో జయింప సమర్థులు కారు. భూమి అంతా మన వశమయి ఉంది. సుఖదుఃఖాల్లో సమానంగా పాలుపంచుకొనే మిత్రరాజు లంతా ఇక్కడకు రానే వచ్చారు. నా కోసం ఈ రాజులంతా అగ్నిలోనయినా, సముద్రం లోనయినా దూకుతారు. మహారాజా! ఇది తెలుసుకో. శత్రుగుణాలను పొగడుతూ, భయపడుతూ, ఏడుస్తూ పిచ్చివానిలా మాట్లాడుతున్న నిన్ను చూసి ఇక్కడ నవ్వుతున్నారు. ఈ వచ్చిన రాజులందరూ తానొక్కొక్కడే పాండవుల కెదురు నిలవటానికి సమర్థులమని భావిస్తున్నారు. నీకు వచ్చిన భయ మేమీ లేదింక. సమగ్రమైన నా సేనను జయించటానికి ఇంద్రుడు కూడా చాలడు. స్వయంభువు అయిన బ్రహ్మ కూడా అక్షయమైన నా సేనను చంపలేడు.

రాజా! నా సేనకూ, నా ప్రభావానికీ భయపడి గదా! ధర్మరాజు పురం వదలి అయిదు గ్రామాలను అడుగుతున్నాడు. ఆ వృకోదరుడు (భీముడు) సమర్థుడని అనుకొంటున్నావు కాని అది నిజం కాదు. రాజా! నీకింకా నా ప్రభావం పూర్తిగా తెలియదు. గదా యుద్ధంలో నాతో సమానుడు ఈ భూమి మీద లేడు. పూర్వం లేడు- ఇక ముందు ఉండడు. నేను గురుకుల క్లేశంతో, పట్టుదలతో చదివి, విద్యలో తుది చూసినవాడను. అందుచేత నాకు భీముడన్నా, ఇతరులెవరన్నా భయం లేదు. బలరాముని దగ్గర శిష్యునిగా ఉన్న రోజుల్లోనే "గదా యుద్ధంలో దుర్యోధనునకు సమానుడు లే"డని నిశ్చయం ఏర్పడింది. యుద్ధంలో కాని బలంలో కాని నేను బలరామునితో సమానుడను. నా గదా ప్రహారాన్ని భీము డెప్పుడూ తట్టుకోలేడు. నేను కోపించి ఒక్క దెబ్బ కొడితే చాలు ఘోరమయిన ఆ దెబ్బ భీముని మరుక్షణంలో యముని యింటికి ఈడ్చుకొని పోతుంది. చేతితో గద దాల్చిన వృకోదరుని చూడాలను కొంటున్నాను. రాజా! ఎంతోకాలంగా నేను నిత్యమూ కోరుకొనే కోరిక ఇదే. గదతో నేను యుద్ధంలో కొడితే చాలు భీముని శరీరం పిండి పిండి అయిపోతుంది. ప్రాణాలు పోయి భీముడు నేల మీద పడతాడు. నేను ఒక్కసారి గదతో కొడితే హిమవత్పర్వతం కూడా వందల వేల (లక్ష) ముక్కలుగా పగిలిపోతుంది. ఈ విషయం భీమునికీ తెలుసును - కృష్ణార్జునులకూ తెలుసును. "గదలో దుర్యోధనునితో సమానుడు లేడ"ని నిశ్చయమే. అందుచేత భీముని వల్ల భయం విడచిపెట్టు. మహాయుద్ధంలో వానిని నేనే సంహరిస్తాను. రాజా ! నీవు మాత్రం మనసు పాడు చేసుకోకు.

భీముడు నాచేత చనిపోయాక వెంటనే అర్జునునితో సమానులూ, అధికులూ అయిన రథికులు అర్జునుని ఎగరతన్నుతారు. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు, భూరిశ్రవుడు, ప్రాగ్జ్యోతిష నగరాధిపతి భగదత్తుడు, శల్యుడు, సింధు దేశపు రాజు సైంధవుడు... వీరిలో ఎవరయినా ఒక్కొక్కరే పాండవులను సంహరించగలరు. ఇక అంతా కలిస్తే ఒక్క క్షణంలో యమలోకానికి పంపుతారు. సమగ్ర మయిన ఈ రాజుల సేన అంతా కలిసి ఒక్క అర్జునుని జయించలేక పోవటానికి కారణం లేదు. భీష్మద్రోణ కృపాశ్వత్థామల వందల బాణపరంపరలతో స్పృహతప్పి అర్జునుడు యమలోకానికి పోతాడు. ఈ పితామహుడు గంగా శంతనుల పుత్రుడు. బ్రహ్మర్షితో సమానుడు. దేవతలకు కూడ అసాధ్యుడు. రాజా ! భీష్ముని చంపగలవా డెవడూ

లేడు. "నీవు కోరుకోకుండా నీకు మరణం రా"దని ప్రసన్న డయిన తండ్రి వర మిచ్చాడు గదా! బ్రహ్మర్షి అయిన భరద్వాజునకు ద్రోణుడు ఒక ద్రోణి/ దొప్పలో పుట్టాడు. అశ్వత్థామ ద్రోణునికి పుట్టాడు. అతడు దివ్యాస్త్రవేత్త. ఆచార్య ముఖ్యుడయిన కృపుడు శరస్తంభం / రెల్లు నుండి గౌతమ మహర్షి వలన పుట్టాడు. కృపాచార్యుడు ఎవరి వల్లనూ చావడని నా అభిప్రాయం. అశ్వత్థామ తండ్రి ద్రోణుడు, తల్లి కృపి, మేనమామ కృపుడు - ఈ ముగ్గురూ అయోనిజులు. అంతటి వీరుడు అశ్వత్థామ నా పక్షాన ఉన్నాడు. మహారాజా! వీరంతా దేవతల్లాంటి వారు - మహారథులు - యుద్ధంలో దేవేంద్రుని కూడా బాధించగలరు. వీరిలో ఏ ఒక్కరినైనా సరే అర్జునుడు తేరిపారి చూడలేడు. ఇక అందరూ కలిస్తే ఈ మానవోత్తములు అర్జునుని చంపిపారేస్తారు. కర్ణుడు భీష్మద్రోణ కృపులతో సమానుడని నా అభిప్రాయం - "నీవు నాతో సమానుడ వయ్యావు" అని పరశురాముడు కర్ణుని అంగీకరించాడు గదా ! కర్ణునికి సహజమైన చక్కని కవచకుండలా లుండేవి. వాటిని శచీదేవి కోసం ఇంద్రుడు యాచించి గ్రహించాడు. మహారాజా! అమోఘమూ, భయంకరమూ అయిన (ఇంద్రుడిచ్చిన) శక్తి కల కర్ణుని ముందు నిలిచి అర్జునుడు జీవించగలడా? విజయం నాకు కరతలామలకం- ఇది ధ్రువం. శత్రువులకు పూర్తిగా పరాజయమే కలుగుతుందని భూమిపై చెప్పుకొంటున్నారు. ఈ భీష్ముడొక్కడే రోజుకు పదిలక్షల మందిని సంహరించగలడు. గొప్ప విలుకాండ్రయిన ద్రోణాశ్వత్థామలూ కృపుడూ కూడా భీష్మునితో సమానులే. క్షత్రియులైన సంశప్తక సమూహాలు "మేము అర్జునుని కాని, అర్జునుడు మమ్మల్ని కాని చంపాలి" అనుకొంటూ అర్జునవధకు తాము సమర్థులమని నిశ్చయం చేసుకొన్నారు. రాజులంతా అలా అనుకొంటూ ఉంటే నీకు అకస్మాత్తుగా పాండవు లంటే ఎందుకు భయం కలగాలి? ఆ భీముడొక్కడూ చనిపోతే ఇక వారిలో యుద్ధం చేసే వాడెవడున్నాడు. అసలు వారిలో నీకు తెలిస్తే వీరుడెవడో నాకు చెప్పు- పాండవులు అయిదుగురు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, మొత్తం ఇంతా కలిసి ఏడుగురే కదా! మనకయితే ప్రసిద్ధులు చాలామంది - భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, సూర్యపుత్రుడు కర్ణుడు, సోమదత్తుడు, బాహ్లికుడు, ప్రాగ్జ్యోతిషరాజు భగదత్తుడు, శల్యుడు, అవంతి రాజు లిద్దరు, సైంధవుడు, దుశ్శాసనుడు, దుర్ముఖుడు, దుస్సహుడు, వివింశతి, భూరిశ్రవుడు, నీ కుమారుడు వికర్ణుడు, మొదలయిన వారు ఎంతోమంది ఉన్నారు. రాజా! నాకు పదకొండు

అక్షౌహిణులసేన చేరింది. శత్రువులకు చాలా తక్కువ... ఏడే అక్షౌహిణులు- నాకింక దేనివల్ల పరాజయం కలుగుతుంది? మూడువంతుల తక్కువ గల సేనతో యుద్ధం చేయవచ్చునని బృహస్పతి చెప్పాడు. నాకిపుడు శత్రువుల కంటే మూడు వంతులు సేన ఎక్కువగానే ఉన్నది. రాజా! శత్రుబలం చాలా గుణ హీనంగానూ, నా బలం బహుగుణ సహితంగానూ కనపడుతోంది. ఇదంతా తెలిసికొని నా బలాధిక్యం, పాండవుల బలహీనతను అంతా తెలిసికొని నీవు మోహం చెందకు." ఇలా అని సమయోచిత కృత్యాలు తెలిసికొన గోరి, దుర్యోధనుడు మళ్లీ సంజయునితో ఇట్లన్నాడు.

56. సంజయుడు పాండవుల దివ్యశక్తులను వర్ణించుట.

దుర్యోధనుడు ఇట్లన్నాడు. "యుద్ధకాంక్షి యుధిష్ఠిరుడు ఏడక్షౌహిణులు సంపాదించాడు గదా! ఆ రాజులతో ఏం చేద్దా మనుకొంటున్నాడు?" సంజయుడు ఇట్లన్నాడు. "రాజా! యుద్ధకాంక్షి యుధిష్ఠిరుడు చాలా సంతోషిస్తున్నాడు. భీమార్జునులూ అంతే - నకుల సహదేవులు కూడా ఏమీ భయపడటం లేదు. తన మంత్రశక్తి నొకసారి పరీక్షించుకోవాలని అర్జునుడు దిక్కులన్నీ వెలిగిపోయేటట్లు తన దివ్యరథాన్ని సిద్ధం చేసుకొన్నాడు. అలా సన్నద్ధ మయిన అర్జునుడు మెరుపుతో కూడిన మేఘంలా కనపడ్డాడు. సమగ్రంగా ధ్యానం చేసి సంతోషిస్తూ అత డిట్లన్నాడు. "సంజయా! ఇదిగో చూడు శకునం - మేము జయిస్తాము" అన్నాడు. ఆ అర్జును డన్నట్లే అవుతుందని నాకూ తెలుసు."

దుర్యోధనుడు ఇలా అన్నాడు. "జూదంలో(నే) ఓడిపోయిన పాండవులను తెగ పొగడుతున్నావు కాని అర్జునుని రథానికున్న గుర్రాలూ, ధ్వజాలూ ఎలా ఉన్నాయో చెప్పు." సంజయుడు ఇలా చెప్పాడు. "ఇంద్రునితో సమానంగా విశ్వకర్మ, త్వష్ట ప్రజాపతి (రథం మీద) బహుచిత్రంగా సదా ఎన్నోరూపాలు సృష్టిస్తూ ఉంటారు. వారు దేవమాయతో అర్జునుని ధ్వజం మీద అమూల్యమయిన దివ్యరూపాలు, పెద్దవిగాను, చిన్నవిగాను సృష్టిస్తూ ఉంటారు. భీమసేనుని అనుసరించడం కోసం వాయుపుత్రు డయిన హనుమంతుడు ఆ అర్జునుని ధ్వజం మీద తన రూపాన్ని కల్పిస్తాడు. ఆ కపిధ్వజం యోజనం దూరం అడ్డంగా నిలువునా అన్ని దిక్కులకూ తన తేజస్సును వ్యాపింప జేస్తుంది. చెట్లు అడ్డం వచ్చినా ఆ తేజస్సు ఆగిపోదు.

విశ్వకర్మ అటువంటి మాయ కల్పించాడు. ఆకాశంలో ఇంద్రధనుస్సు ప్రకాశిస్తున్నట్లు ఒక రంగు కాదు, ఎన్ని రంగులో ఆ రూపంలో కనిపిస్తాయి. విశ్వకర్మ ఆ ధ్వజం అలా సృష్టించాడు. అగ్ని పొగలతో తేజోరూపా లయిన చిత్రవర్ణాలు ధరిస్తూ ఆకాశాని కెగసినట్లు విశ్వకర్మ ఆ ధ్వజాన్ని సృష్టించాడు. ఆ రథం మీద అది బరువు అనిపించదు. ద్వారాదుల దగ్గర ఆగిపోదు. రాజా! ఆ రథానికి కట్టిన గుర్రాలు వాయువేగం కలవి. తెల్లటివి. అవి పూర్వం చిత్రరథు డిచ్చిన దివ్యాశ్వాలు. నేలమీద కాని, ఆకాశాన కాని, స్వర్గంలో కాని వాటి గమనం తగ్గదు (వేగం తగ్గదు). ఒకవేళ కొన్ని చనిపోయినా మళ్లీ నూరు సంఖ్యకు తగ్గవు. ఇది ఆ చిత్రరథు డిచ్చిన వరం.

అలాగే ధర్మరాజు యొక్క రథాశ్వాలు దంతాల వలె తెల్లనివి, పెద్దవి, అర్జునుని గుర్రాల వంటి పుష్టి కలవి. ఇక భీముని గుర్రాలు సప్తర్షిమండలం వంటివి (అంత తేజస్సు కలవి). వాయువేగం కలవి. సహదేవుని గుర్రాలు నలుపుకలిసిన తెలుపుగలవి. తీతువు పక్షి వీపులాగా చిత్రవర్ణపు వీపు కలవి. వాటిని ప్రీతితో అర్జును డిచ్చాడు. అవి అర్జునుని గుర్రాలతో సమామయినవి. సంతోషంతో అవి సహదేవుని వహిస్తాయి. రాజా! నకులుని గుర్రాలు ఇంద్రు డిచ్చినవి – వాయువేగం కలవి. బలిష్ఠాలు, చురుకైనవి. వృత్రాసురుని చంపిన ఇంద్రుని వలె ఆ గుర్రాలు నకులుని వహిస్తూ ఉంటాయి. వయసులోనూ, పరాక్రమంలోనూ వీటితో సమాన వేగం కల్గి చిత్ర వర్ణాలు కల ఉత్తమాశ్వాలను చిత్రరథుడు ఇచ్చాడు. అవి అభిమన్యుడు, ఉపపాండవులు మొ॥ కుమారులను వహిస్తూ ఉంటాయి.'

57. సంజయుడు పాండవుల బలమును ధృతరాష్ట్రునికి తెలుపుట.

ధృతరాష్ట్రుడిలా ప్రశ్నించాడు. "సంజయా! పాండవ పక్షాన వారికోసం నా కుమారుల సేనలతో యుద్ధం చేద్దామనుకొంటున్న వారిని ఎవరిని అక్కడ చూశావు?"

అనగానే సంజయుడు ఇలా అన్నాడు. "వృష్ణి అంధక వంశాలకు ముఖ్యు డయిన కృష్ణుని చూశాను. అలాగే అక్కడ చేకితానుని, యుద్ధకాంక్షి అయిన సాత్యకిని చూశాను. వీరిద్దరూ ఒక్కొక్క అక్షౌహిణి సేనతో పాండవులను చేరినవారు. మహారథులని ప్రశస్తి వహించిన పౌరుషం కలవారు. సత్యజిత్తు మొదలయిన పదిమంది పుత్రులతో ధృష్టద్యుమ్నుని ముందుంచుకొని ద్రుపదుడు ఒక అక్షౌహిణి సేనతో వచ్చి పాండవులను

చేరాడు. ధర్మజుని గౌరవం పెంచుతూ శిఖండి రక్షణలో సైన్యాలను (కవచాలతో) కప్పుతూ ద్రుపదుడు వచ్చాడు. విరాటమహారాజు శంఖుడు, ఉత్తరుడు అనే కొడుకులతోనూ; సూర్యదత్తుడు, మదిరాక్షుడు మొదలయిన తమ్ముళ్లతోనూ కలిసి ఒక అక్షోహిణి సేనతో వచ్చి పాండవులను చేరాడు. మగధదేశపురాజు జరాసంధుని కొడుకు సహదేవుడూ, చేదిదేశపు రాజు ధృష్టకేతుడూ వేర్వేరుగా ఒక్కొక్క అక్షోహిణి సేనతో వచ్చి చేరారు. కేకయరాజులు (పదిమందిలో) అయిదుగురు సోదరులు ఎట్టని జెండాలతో, ఒక అక్షౌహిణి సేనతో వచ్చి పాండవులను చేరారు. పాండవుల కోసం దుర్యోధనుని సేనతో యుద్ధం చేయటానికి వచ్చిన వారిని నేనింతమందినే చూశాను. మానవులకు, దేవతలకు, గంధర్వులకు, రాక్షసులకు సంబంధించిన వ్యూహాలు తెలిసిన మహారథుడు ధృష్టద్యుమ్నుడు సేనకు అగ్రభాగాన నిలిచాడు.

భీష్ముని శిఖండి పాలుగా నిర్ణయించాడు. శిఖండికి సహాయంగా విరాటుడు మత్స్య దేశపు యోధులతో వెంట నడుస్తాడు. ధర్మరాజు పాలు శల్యుడు. కాని వీరిద్దరూ సమానులు కారని కొంద రన్నారు. కొడుకులు, తమ్ములతో పాటు దుర్యోధనుడూ, తూర్పు దక్షిణ దిక్కుల రాజులూ భీముని పాలు. కర్ణుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సింధురాజు జయద్రథుడు అర్జునుని పాలు. ఇంకా వీరుల మనుకొనే వారు ఎంతమంది ఉన్నా వారంతా అర్జునుని పాలుగా నిశ్చయించారు. రాజకుమారులు, విలుకాండ్రు అయిన కేకయ సోదరులు అయిదుగురు మనవైపు ఉన్న కేకయ సోదరులు అయిదుగురితో యుద్ధం చేస్తారు. ఆకేకయ సోదరుల పాలు మాలవీయులూ, శాల్వకులూ, త్రిగర్త ముఖ్యులు, సంశప్తకులూను. దుర్యోధనుని కొడుకులూ, దుశ్శాసనుని కొడుకులూ, బృహద్బలుడనే రాజూ అభిమన్యుని పాలు. మహాధనుర్ధా రులయిన ఉపపాండవులు బంగారు ధ్వజాలతో ధృష్టద్యుమ్నుని ముందు నిలుపుకొని ద్రోణుని ఎదిరిస్తారు. చేకితానుడు సోమదత్తునితో ఒంటరి పోరుకు సిద్ధపడుతున్నాడు. కృతవర్మతో సాత్యకి యుద్ధం చేయగోరుతున్నాడు. మాద్రి కొడుకు సహదేవుడు యుద్ధంలో పెద్దగా ధ్వనిచేస్తూ శకునిని తన వంతుకు వేసుకొన్నాడు. జూదరి యైన ఉలూకునీ, సారస్వత గణాలనూ మాద్రి కొడుకు నకులుడు తన భాగంలో వేసుకొన్నాడు. ఇంకా యుద్ధానికి వస్తున్న రాజులందరినీ పేర్కొని పాండవులు తమవంతు చేసుకొన్నారు. ఇలా సేనలన్నిటినీ వారు పంచుకొన్నారు. ఇక నీవూ, నీకుమారులూ త్వరగా తగిన

పని చేయండి."

ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. "నా పుత్రులంతా ఇక లేనట్లే - తెలివి తక్కువ వారు. కపట ద్యూతమాడారు. దానితో బలవంతుడయిన భీమునితో రణరంగంలో యుద్ధం దాపురించింది. యముడు రాజులందరిమీద నీటిని ప్రోక్షించాడు. మంటలో పడే మిడతలవలె వారంతా గాండీవాగ్నిలో ప్రవేశిస్తారు. శత్రుత్వం పెంచుకొన్న పాండవులు మాసైన్యాన్ని పారద్రోలినట్లే అనిపిస్తోంది. పాండవులు భగ్నం చేసిన మా సేనను వెనుకనుండి రక్షించే నాథుడెవడు? వారంతా అతిరథులు. శూరులు, యశస్వులు, ప్రతాపం కలవారు. తేజస్సులో సూర్యునితో అగ్నితో సమానులు - యుద్ధంలో జయించేవారు. వారి నాయకుడు యుధిష్ఠిరుడు - రక్షకుడు కృష్ణుడు- వీరయోధులు అర్జున భీమసేనులు - నకులుడు సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, ద్రుపదుడు, పాంచాలరాజు ఉత్తమౌజుడు, యుధామన్యుడు, శిఖండి, క్షత్రదేవుడు, విరాటుని కొడుకు ఉత్తరుడు, కాశి, చేది, మత్స్య సృంజయరాజులు, విరాటుని కొడుకు బభ్రువు, పాంచాల దేశీయులు ప్రభద్రకులు, వీరు పాండవపక్ష యోధులు - వారి యిష్టం లేకుండా రణధీరు లయిన ఈ రాజుల భూమిని ఇంద్రుడు కూడా హరింపలేడు. సంజయా! వీరు కొండలను కూడా పిండిచేస్తారు. నేనెంత ఏడుస్తున్నా నా మాట వినకుండా సర్వసద్గుణ సంపన్నులూ, అమానుష పరాక్రములూ అయిన పాండవులతో యుద్ధం చేయాలనుకొంటున్నాడు నా దుష్పుత్రుడు."

దుర్యోధనుడు చెప్పాడు. మేము ఇద్దరమూ ఒకే జాతి వాళ్లం - ఇద్దరమూ భూమి మీది వాళ్లమే. అటువంటప్పుడు పాండవుల కొక్కరికే జయం కలుగుతుందని ఎందుకు అనుకొంటున్నావు? భీష్ముని, ద్రోణుని, కృపుని, కర్ణుని, సైంధవుని, సోమదత్తుని, అశ్వత్థామనూ దేవతలంతా కలిసి వచ్చినా ఇంద్రుడు కూడా జయించలేడు. తండ్రీ! ఇక పాండవులు గెలవగలరా? నాకోసం వచ్చిన యీ రాజులంతా ఆర్యులు, శస్త్రధారులు, శూరులు, పాండవులను త్రిప్పికొట్టగల సమర్థులు. ఆ పాండవులు నా వాళ్ల ఎదుట నిలిచి చూడలేరు కూడా - యుద్ధంలో కొడుకులతో సహా పాండవులను నేను ఒక్కడినే ఆక్రమించగలను. నాకు ప్రియం కోరి వచ్చిన రాజులంతా ఉచ్చులో లేడి పిల్లల్ని బిగించినట్లు పాండవులను బిగిస్తారు. నా రథ సమూహాలచేతనూ, బాణ పరంపరలచేతనూ పాండవులతోపాటు పాంచాలురు కూడా పారిపోతారు. అనగానే

ధృతరాష్ట్రుడు అన్నాడు - "సంజయా! నా కుమారుడు పిచ్చివాని వలె వాగుతున్నాడు. యుద్ధంలో స్థిరంగా నిలవగల ధర్మరాజును వీడు జయింపలేడు. పాండవులు మంచి పేరుగలవారు - ధర్మం తెలిసిన మహాత్ములు - వారి బలం ఏపాటిదో ఈ భీష్మునికి తెలుసును గదా! అందుకే ఇతడు ఆ మహాత్ములతో విరోధానికి ఇష్టపడడు. అవునుగాని సంజయా! ఇంకా ఆ పాండవులు ఏం చేస్తున్నారో చెప్పు. వేగమూ, తేజస్సు కలిగి మహాధనుర్ధారు లయిన పాండవులను హవిస్సుతో అగ్నులను ప్రజ్వలింపచేసినట్లు ఎవరు ప్రజ్వలింపచేస్తున్నారు?"

సంజయుడిలా అన్నాడు. "రాజా! ధృష్టద్యుమ్నుడు భరత సత్తములారా! యుద్ధం చెయ్యండి - యుద్ధానికి భయపడకండి" అంటూ వారిని సదా రెచ్చగొడుతూ ఉంటాడు. దుర్యోధనుడు సమకూర్చుకొన్న రాజులంతా ఆయుధ సహితమైన యుద్ధంలో ఒకచోట కలుస్తారు. క్రోధంతో వచ్చిన స్నేహితులతో సహా వారినందరినీ తిమి నీటిలో నుండి చేపలను లాగి వేసినట్లు నేనొకడినే విసిరి పారేస్తాను. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, దుర్యోధనుడు వీరందరినీ కూడా సముద్రాన్ని చెలియలికట్టలాగా ఆపివేస్తాను. అలా అంటున్న, ధృష్టద్యుమ్నునితో ధర్మరాజు ఇలా అన్నాడు. "మహాభుజుడా! నీ ధైర్యమూ, పరాక్రమూ పాంచాలురూ, పాండవులూ కూడా బాగా ఎరుగుదురు - ఈ యుద్ధం నుండి మమ్మల్ని ఉద్ధరించు. నీవు క్షత్రియ ధర్మం పాటించే వాడవు గదా! ఉరకలు వేస్తూ యుద్ధానికి వచ్చే కౌరవులను నిగ్రహించటానికి నీవే సమర్థుడవు. నీవు చేయాలనుకొన్నదే మాకు శ్రేయస్కర మయినది. యుద్ధం నుండి పారిపోయే వారికి, దెబ్బతిన్నవారికి, శరణుకోరిన వారికి పౌరుషం ప్రదర్శిస్తూ ముందు భాగాన నిలువగల పురుషుని వేయిమంది నిచ్చి అయినా కొనుక్కోవాలని నీతి వేత్తల అభిప్రాయం. అటువంటి శూరుడవు, వీరుడవు, పరాక్రమశాలివి నీవే. యుద్ధాల్లో భయార్తులకు రక్షకుడవు నీవే. నిస్సందేహం.

ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుడు ఇలా చెపుతూ ఉంటే ధృష్టద్యుమ్నుడు నిర్భయంగా నాతో ఇలా అన్నాడు. "సూతా! నీవు వెళ్లి దుర్యోధనుని యోధులతోనూ, జానపదులతోను, ప్రతీప వంశస్థులు, బాహ్లిక దేశస్థులూ అయిన కౌరవులతోనూ, కృపాచార్యునితోనూ, కర్ణునితోనూ, పుత్రసహితుడయిన ద్రోణునితోనూ, సైంధవునితోనూ చెప్పు. ఇంకా దుశ్శాసనునితో, వికర్ణునితో అలాగే దుర్యోధనునితో, భీష్మునితో

కూడా వెళ్లి చెప్పు- నీవు త్వరగా వెళ్లు. ఆలస్యం చేయకు. ధర్మరాజు కేవలం మంచిమాటలచేతనే పొందదగిన వాడు. దేవతల రక్షణ కల అర్జునుడు మిమ్మల్ని చంపకుండునుగాక - వెంటనే ధర్మరాజుకు రాజ్యం ఇవ్వండి, లోకైకవీరు డయిన అర్జునుని శరణుకోరండి. సవ్యసాచి లాంటి యోధుడు ఈ భూమిమీద మరొకడు లేడు. అతడు సత్యపరాక్రముడు. అర్జునుని రథం దేవతల రక్షణ కల దివ్యరథం - మానవ మాత్రుడు వానిని జయించలేడు. యుద్ధం మీద మనసు పెట్టండి."

58. దుర్యోధనుని అభిప్రాయము - ధృతరాష్ట్రుని భయము.

ధృతరాష్ట్రుడిట్లన్నాడు. "ఆ అర్జునుడు చిన్నప్పటి నుండీ క్షత్రియతేజస్సు కల బ్రహ్మచారి. నేనెంత కాదంటున్నా వినిపించుకోక మందబుద్ధులైన నాకొడుకులు వానితో యుద్ధానికి సిద్ధపడుతున్నారు. దుర్యోధనా! యుద్ధం నుండి వెనుదిరుగు ! ఎట్టి పరిస్థితుల్లోను యుద్ధాన్ని మంచిదిగా చెప్పరు. నీవూ, నీ సోదర మంత్రులూ బ్రతకటానికి ఈ రాజ్యంలో సగం చాలును. పాండవులకు తగినంత భూమి నియ్యి! కురువంశంలోని వారంతా ఇదే ధర్మ సమ్మతమయిన పద్ధతి అనుకొంటున్నారు. మహాత్ము లయిన పాండు పుత్రులతో నీవు ప్రశాంతినే కోరుకోవాలి. ఇదే ధర్మం. అయ్యో! పుత్రా నీ సేననే చూడు. నీ అభావమే మిగిలింది. (నీవు లేవు). అజ్ఞానంతో నీవు దాన్ని తెలుసుకోలేక పోతున్నావు. నేనయితే యుద్ధం కోరటం లేదు. అలాగే బాహ్లికుడూ, భీష్ముడూ, ద్రోణుడూ, అశ్వత్థామ, సంజయుడు, సోమదత్తుడు, శల్యుడు, కృపుడు, సత్యవ్రతుడయిన పురుమిత్రుడు, జయుడు, భూరిశ్రవుడూ కూడా యుద్ధం కోరుకోవటం లేదు. శత్రు పీడితులయినపుడు కురువంశీయులను ఆదుకొనే వారు కూడా యుద్ధం కోరుకోవటం లేదు. నాయనా! అదే నీవూ ఇష్టపడాలి. నీవు ఇష్టపడి ఈ పని చేయటం లేదు. నీచేత చేయిస్తున్నవాడు కర్ణుడు. ఇంకా దుశ్శాసనుడు, పాపాత్ముడయిన శకుని నిన్ను ప్రేరేపిస్తున్నారు."

అపుడు దుర్యోధనుడు ఇలా అన్నాడు. "నేను నీమీద కాని, ద్రోణుడు, అశ్వత్థామ, సంజయుడు, భీష్ముడు, కాంభోజరాజు (సుదక్షిణుడు) కృపుడు, బాహ్లికుడు, సత్యవ్రతుడయిన పురుమిత్రుడు, భూరిశ్రవుడు- వీరిమీదకాని భారం పెట్టి పిలవలేదు. తండ్రీ! నేనూ, కర్ణుడు (ఇద్దరమూ) యుద్ధం అనే యజ్ఞం ప్రారంభించాము. ధర్మరాజును

యజ్ఞపశువుగా చేసి దీక్ష వహించాము. ఈ రణ యజ్ఞంలో వేదిక రథం ; స్రువం కత్తి; స్రుక్కు గద; యాగశాల కవచం, చాతుర్హోత్రం నాగుర్రాలు నిర్వహిస్తాయి. (నలుగురు హోతలు – ఋత్విక్కులు చేసే పని చాతుర్హోత్రం) దర్భలు శూరులు, హోమద్రవ్యం కీర్తియే. రాజా! ఆత్మయజ్ఞంతో యుద్ధరంగంలో యమున అర్చించి, శత్రుసంహారం చేసి, జయలక్ష్మితో కూడి వస్తాము. తండ్రీ! నేనూ, కర్ణుడూ, దుశ్శాసనుడూ ముగ్గురమూ యుద్ధంలో పాండవులను చంపగలం. పాండవులను చంపి నేనే ఈ భూమిని పాలిస్తాను. లేదా పాండవులు నన్ను చంపి ఈ భూమిని అనుభవిస్తారు. మహారాజా! నా జీవితాన్ని, రాజ్యాన్ని, ధనాన్ని, సర్వమూ విడుస్తాను కాని పాండవులతో కలిసి మాత్రం ఎన్నడూ జీవించను. ఆర్యా! **వాడి సూదిమొన మోపినంత భూమికూడా పాండవులకు విడిచిపెట్టను.**"

వెంటనే ధృతరాష్ట్రుడు ఇలా మొదలుపెట్టాడు. "నేను ఈ దుర్యోధనుని వదిలేశాను. కాని యముని ఇంట్లోకి వెళ్లే యీ మందబుద్ధి వెనుక పడిపోతున్న మీకోసం ఏడుస్తున్నాను. పాండవులు కౌరవసేనలో ప్రవేశించి పులుల లాగా బలిష్ఠులను ఏరి చంపుతారు. సాత్యకికి చిక్కిన భరతసేన నీచుడి వశమయిన సాధ్విలాగా చెదిరిపోయినట్లు నాకు వ్యతిరేకంగా భాసిస్తోంది. సాత్యకి అర్జునుని బలాన్ని పూరిస్తూ విత్తనాలు చల్లినట్లు యుద్ధంలో నిలిచి బాణాలు చల్లుతాడు. సేనకు అగ్రభాగాన యుద్ధం చేసే వీరులకు భీముడు నిర్భయంగా ప్రాకారంలా నిలుస్తాడు. అందరూ వానిని ఆశ్రయిస్తారు. భీముని గదాప్రహారాలకు దంతాలు విరిగి, కుంభస్థలాలు పగిలి, నెత్తురు కారుతూ నేలగూలిన ఏనుగులు పగిలి పడ్డ కొండలవలె కనపడితే అపుడు భీమునికి భయపడి నా మాట తలచుకొంటావు. భీముడు అగ్నిహోత్రుడిలా ప్రజ్వలించి సైన్యాన్ని, రథాలను, గుర్రాలను, ఏనుగులను దహించి వేస్తూ ఉంటే ఆ దృశ్యం చూసి నా మాట తలచుకొంటావు. పాండవులతో శాంతి కోరకపోతే మీకు మహా భయం కలుగుతుంది. చివరకు భీముని గదతో చచ్చి శాంతిస్తారు. పెద్దఅడవి విరిగి పడినట్లు భీముని చేత నేలగూలిన కౌరవసేనను చూసి... అపుడు నామాట గుర్తు తెచ్చుకొంటావు." వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు. ఆ రాజులందరి గురించి చెప్పి ధృతరాష్ట్రుడు మళ్లీ సంజయుని ఇలా అడిగాడు.

59. కృష్ణుని మాటలను సంజయుడు చెప్పుట.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "సంజయా ! మహాత్ములయిన కృష్ణార్జునులు ఏమన్నారు? చెప్పు. నాకు నీనోట వినాలని ఉంది."

సంజయుడు చెప్పాడు. "రాజా! ఆ కృష్ణార్జునులను ఎలా దర్శించానో వాళ్లు ఏమన్నారో చెపుతా విను. రాజా! ఆ కృష్ణార్జునుల పాదాలవ్రేళ్లు పవిత్రదృష్టితో చూస్తూ అంజలించి, వారితో మాట్లాడటానికి అంతఃపురంలోకి ప్రవేశించాను. కృష్ణార్జునులు, సత్యభామ, ద్రౌపది ఉన్న ఆ ప్రదేశానికి అభిమన్యుడు కాని, నకుల సహదేవులు కాని వెళ్లరాదు. ఆ యిద్దరూ మధుపానంతో మదించి ఉన్నారు. మంచి గంధం పూసుకొని, మాలలు దాల్చి, చక్కని వస్త్రాలు, దివ్యాభరణాలు దాల్చి ఉన్నారు. కృష్ణార్జును లున్నచోట పెద్ద బంగారు ఆసనం ఉంది. అది చాలా రత్నాలు పొదిగిన విచిత్ర వర్ణం కలది. దానిమీద ఎన్నో పరుపులు పరిచారు. కృష్ణుడు తన పాదాలను అర్జునుని ఒడి మీదుగా చాచుకొని సత్యభామ ఒడిలో ఉంచుకొన్నాడు. అర్జునుడు తన పాదాలను ద్రౌపది ఒడిలో ఉంచుకొన్నాడు. సువర్ణ ఖచిత మయిన పాదపీఠం అర్జునుడు నాకు చూపించాడు. దాన్ని నేను చేతితో తాకి, నేలమీదనే కూర్చున్నాను. శుభలక్షణాలు, ఊర్ధ్వరేఖలు కల అర్జునుని పాదాలను అతడు పాదపీఠం నుండి తీస్తున్నపుడు చూశాను. కృష్ణార్జునులిద్దరూ, నీల వర్ణంతో నిండయిన రూపంతో, సాలవృక్షపు కొమ్మలవలె ఎగుబుజాలు కలిగి ఉన్నారు. ఒకే ఆసనం మీద ఉన్న వారిద్దరినీ చూచేసరికి నాకు చాలా భయం వేసింది. ద్రోణ భీష్ముల ఆశ్రయం వల్లనూ, కర్ణుని ప్రగల్భాలతోను మందబుద్ధి అయిన దుర్యోధనుడు ఇంద్ర, విష్ణు సమానులయిన నరుని, కృష్ణునీ తెలిసికొన లేకపోతున్నాడు. "ఈకృష్ణార్జునులు వశవర్తులయి ఉన్న ధర్మరాజు యొక్క సంకల్పం నెరవేరక ఏమవుతుంది?" అనిపించింది నాకు.

ఆహార పానీయా లిచ్చి నన్ను సత్కరించారు. ఆ మన్నన పొంది కూర్చున్నాను. చేతులెత్తి వారికి నమస్కరించి, వారు సందేశం ఇచ్చేటట్లు ఎదురుచూస్తూ నిలిచాను. వింటినారి దెబ్బలతో కాయలు కాచిన చేతితో శుభ లక్షణాలు కల కృష్ణుని పాదాలకు నన్ను మ్రొక్కిస్తూ, అర్జునుడు కృష్ణుని (మాట్లాడటానికి) ప్రేరేపించాడు. సర్వాభరణాలూ అలంకరించుకొని, ఇంద్ర సమానమయిన శక్తి కల కృష్ణుడు ఇంద్ర ధనుస్సులాగా

వంగి, లేచి, చక్కగా కూర్చుని, నాతో మాటాడాడు. వాక్చతురుడైన కృష్ణుడు ఆహ్లాదకరమూ, సముచితమూ అయినట్లు మాట్లాడాడు. ఆ మాట మొదట్లో మృదువుగానూ, రానురాను దారుణంగానూ కౌరవులకు భయం కలిగేటట్లు ఉంది. ఎలా మాట్లాడాలో నేర్పుతున్నట్లున్న ఆ మాటలు అతడే చెప్ప దగినవాడు. ఇష్టమైన అర్థం కలిగిన మనోహరమైన మాట కృష్ణుని నుండి విన్నాను. వాసుదేవుడు అన్నాడు. 'సంజయా! కురువంశంలో ముఖ్యుడు భీష్ముడు, ద్రోణుడూ వినేటట్లు గొప్ప తెలివిగల ధృతరాష్ట్రునితో ఈ మాట చెప్పు. సంజయా! పెద్దలకు నమస్కారాలు చెపుతూ, పిన్నలను కుశల మడుగుతూ మా యిద్దరి మాటగా ఇలా చెప్పు. విప్రులకు భూరి దక్షిణలిచ్చి, చేయగలిగి నన్ని యజ్ఞాలు చేయండి. భార్యాపుత్రులతో ఆనందంతో గడపండి. మీకు పెద్ద ముప్పు వచ్చి పడింది. పాత్రులకు ధనం, దానం చెయ్యండి - కోరినట్లు అనుభవించి కొడుకులను పొందండి - ఇష్టులకు ప్రియం చెయ్యండి. ధర్మరాజు విజయంకోసం త్వరపడుతున్నాడు.

ఎక్కడో దూరంగా ఉన్న నన్ను ద్రౌపది గోవిందా! అని మొరపెట్టుకొంది కదా! ఆ అప్పు పెరిగిపోయి నామనసు లోంచి పోవటం లేదు. అర్జునుని గాండీవం అసలే తేజోమయం, ఆపలేము. పైగా అతడు సవ్యసాచి, నాతో కలిసి వస్తున్నాడు. ఇంతవైరం వచ్చిపడింది మీకిప్పుడు. నాతో కలిసిన అర్జునుని ఎదుర్కొనాలని అనుకొనేవాడు కాలం చెల్లినవాడేనా అయి ఉండాలి లేదా సాక్షాత్తు వాని తండ్రి ఇంద్రుడైనా కావాలి కాని మరొకడు ఉండడు. యుద్ధంలో అర్జునుని జయింపగలవాడు చేతులతో భూమి నెత్తిపట్టుకోగలడు. ఈ ప్రజలందరినీ దహించి వేయగలడు. దేవతలను నేలమీదకు పడగొట్టగలడు. యుద్ధంలో అర్జునుని ఎదిరించగల వానిని దేవతలలో కాని, రాక్షసులలో కాని, మనుష్యుల్లో కాని, యక్ష, గంధర్వుల్లో కాని, నాగుల్లో కాని, ఎవరినీ ఇంతవరకు నేను చూడలేదు. ఎందుచేతనంటే విరాటనగరంలో పెద్ద అద్భుతం - ఒక నరునికి ఎంతోమంది ఓడిపోయారని విన్నాం గదా! ఆ నిదర్శనం ఒకటి చాలు. పాండురాజు పుత్రులలో ఒక్కనికి-అర్జునునికి-మహామహులంతా ఓడి దిక్కులు పట్టి పారిపోయిన సంగతి చాలును. బలం, ఉత్సాహం, శక్తి, చురుకుదనం, లాఘవం, స్తిమితత్వం, ధైర్యం ఇవి అన్నీ అర్జునునిలో తప్ప, మరెక్కడా కనిపించవు, మాటలతో అర్జునుని వేడెక్కిస్తూ, తగినకాలంలో వర్షించే ఇంద్రునిలాగా కృష్ణుడు గర్జిస్తూ ఇలా అన్నాడు. కృష్ణుని మాటలు విని శ్వేతవాహనుడూ, కిరీటీ అయిన

అర్జునుడు ఆ మహాత్ముని మాటలనే ఒళ్లు పులకరించేటట్లు అనువదించాడు/మళ్లీ అన్నాడు."

60. ధృతరాష్ట్రుడు కౌరవ పాండవుల బలములను వివేచించుట.

సంజయుని మాట విని ప్రజ్ఞాచక్షువైన ధృతరాష్ట్రుడు ఆ మాటలలోని గుణదోషాలు లెక్కించడం మొదలు పెట్టాడు. సూక్ష్మంగా గుణదోషాలు లెక్కించగల ధీమంతుడు ధృతరాష్ట్రుడు తన బుద్ధికి తోచినంతగా కొడుకుల జయం కోరి, బలాబలాలను నిశ్చయిస్తున్నాడు.

(సంజయుని మాటలలోని గుణదోషాలను బట్టి మళ్లీ కౌరవ పాండవుల బలాబలాలను ధృతరాష్ట్రుడు భావించాడు)

వారి శక్తి సామర్థ్యాలను లెక్కగట్ట నారంభించాడు ధృతరాష్ట్రుడు. పాండవులు దేవమానుష శక్తుల చేతను, తేజస్సు చేతను అధికులనీ, కౌరవులు మిక్కిలి తక్కువ శక్తిగల వారనీ భావించి ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "దుర్యోధనా! ఈ బాధ నాకు ఎప్పటికీ తగ్గటం లేదు. ఇది ప్రత్యక్ష సత్యం అని నా అభిప్రాయం. ఊహించి చెప్పటం లేదు.

(ఇపుడు భూమి నశించేటంత ధర్మవిరుద్ధమూ, అపకీర్తికరమూ అయిన దారుణపరిస్థితి ఏర్పడింది. ఇటువంటి అభినివేశం కల నాకు పాండవులతో విరోధం అన్ని విధాలా పనికిరాదని తోస్తోంది.)

ప్రాణులన్నీ తమ సంతానం మీద చాలా ప్రేమ పెట్టుకొంటాయి. తమశక్తి కొద్దీ వానికి ప్రియమూ, హితమూ చేస్తూ ఉంటాయి. అలాగే తమ కుపకారం చేసినవారికి సజ్జనులు ఎంతో ప్రీతి, ప్రత్యుపకారం చేయాలని భావిస్తారు, ప్రయత్నిస్తారు. ఖాండవ వన దహన సమయంలో అర్జునుడు చేసిన ఉపకారం స్మరిస్తూ, భయంకరమైన ఈ కురుపాండవ యుద్ధంలో అగ్ని అర్జునునికి సాహాయ్యం చేస్తాడు. పాండవుల ఆహ్వానంతో ధర్మదేవత మొదలయిన దేవతలంతా పుత్రస్నేహంతో ఎన్నో విధాల సహాయ పడటానికి పాండవులను చేరుతారు. భీష్మద్రోణ కృపాదుల వల్ల భయపడకుండా రక్షిస్తూ ఆ దేవతలు వజ్ర సమాన మయిన దృఢమైన కోపం పొందుతారని నా అభిప్రాయం.

అసలే పాండవులు మానుషశక్తి కల నరోత్తములు - అస్త్రవేత్తలు, పరాక్రమం

కలవారు. దేవతాసహాయం కూడా పొందితే ఇక వారిని తేరిపార చూడలేము. అర్జునుని విల్లు ఉత్తమ మయిన గాండీవం - అది దివ్య మయినది. దాన్ని ఎవరూ ఎత్తి పట్టలేరు/ఎక్కు పెట్టలేరు. అలాగే అతని అమ్ముల పొదులు రెండూ దివ్యాలే - అవి బాణాలతో ఎల్లప్పుడూ నిండుగానే ఉంటాయి. అవి అక్షయ తూణీరాలు. వాని ధ్వజం కూడా దివ్యమైనదే. దానిమీద హనుమంతుడు ఉంటాడు. సముద్రాల దాకా ఆ రథం చరిస్తుంది. పొగలాగా దాని గమనానికి అడ్డులేదు. అందుకే అర్జునునితో ఎవరూ సాటిరారు. ఆ రథఘోష పెద్ద పిడుగు పడినట్లు వినపడుతుంది. శత్రువులకు భయం కలిగిస్తుంది. లోకమంతా 'అతనిది మానవాతీత పరాక్రమం' అంటుంది. అర్జునుడు దేవతలనైనా జయిస్తాడని రాజు లందరికీ తెలుసు. అతడు ఒక్కసారిగా అయిదు వందల బాణాలను తెప్పపాటు కాలంలో చాలా దూరానికి వేస్తూ ఉంటే వానిని చూడలేము. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, మద్రదేశపు రాజు శల్యుడు, వీరే కాకుండా మధ్యస్థులంతా "యుద్ధానికి నిలిచిన నరోత్తము డయిన అర్జునుని జయించడం మానవాతీతులకు కూడా శక్యం కా"దని చెపుతూ ఉంటారు. అర్జునుడు ఒకేసారి ఒకే వేగంతో అయిదువందల బాణాలు వేయగలడు. అతడు భుజశక్తిలో కార్తవీర్యార్జునునితో సమానుడు. ధనుర్ధారి అయిన ఇంద్రుడో, విష్ణువో అన్నట్లు యుద్ధంలో అందరినీ చంపుతున్నట్లు కనపడుతున్నాడు. కురువంశస్థులకు శాంతి ఎలా కలుగుతుందా? అని రాత్రింబవళ్లు చింతిస్తూ నిద్రలేక దుఃఖిస్తూ ఉన్నాను. కౌరవులకు ఇపుడు పెద్ద వినాశకాలం దాపురించింది. ఈ కలహానికి అంతం ఉంటే అది శాంతి తప్ప మరొకటి లేదు. నాయనా! పాండవులతో శాంతియే నాకు సదా ఇష్టం. యుద్ధం కాదు- ఎపుడయినా కౌరవులకంటె పాండవులే బలవంతులని నా అభిప్రాయం."

61. పాండవులకు దైవబలము లేదని తన బలమధికమని దుర్యోధనుడు చెప్పుట

అసహనశీలి అయిన దుర్యోధనుడు తన తీవ్ర క్రోధాన్ని అణచుకొని ఇలా అన్నాడు. "మహారాజా! పాండవులు దేవతల సహాయం కలవారనీ, జయింప శక్యం కానివారనీ నీవనుకొంటున్నావు. ఆ భయం విడిచిపెట్టు కామం, ద్వేషం, స్నేహం, లోభం, ద్రోహం లేకుండాను, పట్టించుకోకుండాను ఉండటం చేతనే దేవతలకు

దేవత్వం కలిగింది. ఇలా అని ఎపుడో మాకు వ్యాసుడు, నారదుడు, పరశురాముడు మొ॥ మహాతపస్సులు చెప్పారు. కామంతో, క్రోధంతో, లోభంతో, ద్వేషంతో ఎన్నటికీ దేవతలు మనుష్యుల వలె ప్రవర్తింపరు. అగ్ని, వాయువు, యమధర్మరాజు, ఇంద్రుడు, అశ్వినీ దేవతలు కూడా కామాదులతో ప్రవర్తించే వారయితే పాండవులకు ఈ దుఃఖం కలిగేదే కాదు. అందుచేత ఈ విషయమై నీకు ఏ విధ మయిన చింత అవసరంలేదు. ఎపుడయినా దేవతలు దైవభావాలనే అపేక్షిస్తారు. అలా కాక కామాదుల వల్ల దేవతల్లో ద్వేషం, లోభం కనపడితే వారికి ప్రామాణ్యం లేనట్లే - వారి సాయం పాండవులకు ఉపయోగపడదు.

చుట్టూరా క్రమ్ముకొని లోకాలన్నీ దహించి వేసే అగ్ని కూడా నేను మంత్రిస్తే చల్లబడిపోతుంది. రాజా! దేవతల కున్న పరమ తేజస్సు నాకూ ఉందని తెలుసుకో. బ్రద్దలయ్యే భూమిని, గిరిశిఖరాలను అందరూ చూస్తూ ఉండగా మంత్రించి బ్రద్దలు కాకుండా ఆపగలను. చైతన్యం ఉన్నవి కొన్ని, లేనివి కొన్ని, కదిలేవి కొన్ని, కదలనివి కొన్ని - ఇలా ఉన్న వీటి నాశనం కోసం భయంకర శబ్దంతో కురిసే రాళ్లవానను, గాలినీ కూడా అందరూ చూస్తూ ఉండగా భూతదయతో శమింపచేయగలను / తగ్గింప జేయగలను. నీళ్లను స్తంభింపజేసి వాటిమీద రథాలను సైనికులను నడిపిస్తాను. దేవతానవుల భావాలన్నిటినీ తెలిసి, నేను ఆచరణలో పెట్టగలను. (దివ్యశక్తులు, రాక్షసశక్తులు నేనొక్కడనే చెయ్యగలను) ఏదైనా కార్యవశాత్తు అక్షౌహిణులతో ఏ దేశాలకు వెళ్లినా (కొత్త చోటుల్లో కూడా) అక్కడ నాయిష్టం వచ్చినట్లు గుర్రాలు నడుస్తాయి. నా దేశంలో పాములు మొదలయినవి భయానకాలు కావు- మంత్ర రక్షణలో నున్న ప్రాణులను భయంకర ప్రాణులు హింసించవు. రాజా! నాదేశ ప్రజలకు పర్జన్యుడు కోరినట్లు వర్షిస్తాడు. ప్రజలంతా ధర్మవర్తనులు - ఈతి బాధలే లేవు. అశ్వినీ దేవతలు, వాయువు, అగ్ని దేవతలతోపాటు ఇంద్రుడు, ధర్మదేవత వీరంతా నేను ద్వేషించేవారిని రక్షించటానికి ఉత్సాహం చూపరు. వీరు నాశత్రువులను రక్షింపగలిగితే పాండవులు పదుమూడు సంవత్సరాలు దుఃఖం అనుభవించే వారు కాదు. నేను ద్వేషించిన వానిని రక్షించటానికి దేవతలు కాని, గంధర్వులు కాని, అసురులు కాని, రాక్షసులు కాని సమర్థులు కారు- నీకు నిజం చెపుతున్నాను. ఎపుడయినా నేను మిత్రులకు శుభం కాని, శత్రువులకు అశుభం కాని తలపెట్టితే

అది ఇంతవరకు చెడిపోలేదు. "ఇది ఇలా జరుగుతుంది" అని నేను చెపితే అది మరోలా పూర్వం ఎప్పుడూ జరగలేదు. నన్ను "సత్యవాక్కు" అని అంటారు.

నా గొప్పదనం అన్ని దిక్కులా లోకు లందరికీ తెలుసు. రాజా! ఇది నిన్ను ఊరడించటానికి చెప్పానుకాని ప్రశంస కోసం కాదు. రాజా! నేనెప్పుడూ ఆత్మస్తుతి చేసుకోలేదు. తన్నుతాను ప్రశంసించుకోవడం దుర్జనులు చేస్తారు. పాండవులు, మత్స్యదేశస్థులు, పాంచాలురు, కేకయులు, సాత్యకి, కృష్ణుడు - అంతా నాచేతిలో ఓడిపోయారని నీవు వింటావు గదా! నదులు సముద్రంలో పడి అన్నివిధాలా రూపుమాసి పోయినట్లే నన్ను చేరిన వారంతా నాలో లీనమైపోతారు. రాజా! నాకు వారి (పాండవుల) కంటె వృద్ధి యెక్కువ. తేజ మెక్కువ. అలాగే వీర్యమూ, విద్య, యోగమూ కూడా ఎక్కువే. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, శల్యుడు, శలుడు వీరంతా అస్త్ర విషయంలో ఎరిగినదంతా నేనూ ఎరుగుదును." జనమేజయా! దుర్యోధనుడు ఇలా చెప్పాక ధృతరాష్ట్రుడు యుద్ధాన్ని కోరుతున్న తన కొడుకు పనులు తెలిసికొని మళ్లీ ఆ సమయానికి తగిన కృత్యాల గురించి సంజయుని అడిగాడు.

62. కర్ణ - భీష్మ సంవాదము.

అలా అర్జునుని గురించి అడుగుతున్న ధృతరాష్ట్రుని గురించి పట్టించుకోకుండా కర్ణుడు కురుసభలో దుర్యోధనుని సంతోషపరుస్తూ ఇలా అన్నాడు. "అబద్ధం చెప్పి పరశురాముని నుండి నేను బ్రహ్మాస్త్రం పొందినపుడు అతడు తెలిసికొని ఇలా అన్నాడు. "చివరి సమయంలో నీకు స్ఫురించదు" అని. చాలా ఘోరమైన అపరాధం చేసినా మా గురువయిన మహర్షి నన్ను శపించలేదు. తీవ్రతేజస్వి అయిన ఆ మహర్షి సముద్రంతో సహా భూమినంతనూ దహించగలడు. నాశుశ్రూషచేతనూ, పౌరుషం చేతనూ తన మనస్సు ప్రసన్నమయింది. నాకింకా ఆయువు మిగిలి ఉంది. అందుచేత ఆ బ్రహ్మాస్త్రం నాకు ఉన్నట్లే. అందుచేత నేను సమర్థుడనే - ఈ భారమంతా నాదే. ఒక్క నిమిషంలో ఆ మహర్షి అనుగ్రహం పొంది, పాంచాల, కరూశ, మత్స్య రాజులనూ, పుత్రపౌత్రులతో పాండవులనూ చంపి శస్త్ర విజయంతో పొందే లోకాలను పొందుతాను. ఈ భీష్ముడు నీదగ్గరే ఉండుగాక - ద్రోణుడూ, రాజముఖ్యులంతా కూడా. (అక్కరలేదు) ప్రధాన సేనతో వెళ్లి పాండవులను చంపివేస్తాను.

ఇది నా బాధ్యత."

ఇలా అంటున్న కర్ణునితో భీష్ముడిలా అన్నాడు. "కర్ణా! నీకు ఆయువు మూడింది. ఎందుకట్లా ప్రగల్భాలు పలుకుతున్నావు? ప్రధానుడు చనిపోతే కౌరవులు చనిపోతారని ఎరుగవా? ఖాండవ దహన సమయంలో కృష్ణునితో కలిసిన అర్జునుడు చేసిన పనిని విన్నాక అయినా బాంధవులతో కలిసి నీవు నీ మనసును అదుపులో పెట్టుకోవడం మంచిది. స్వర్గాధిపతి అయిన మహేంద్రుడు నీకిచ్చిన ఆశక్తి శ్రీకృష్ణుని చక్రంతో ముక్కలు ముక్కలయి యుద్ధంలో భస్మ మయిపోతుంది. ఇక నీకున్నది సర్పముఖ బాణం - దాన్ని చక్కని పూలమాలలతో శ్రద్ధగా పూజిస్తున్నావు కాని అది అర్జునుని బాణాల దెబ్బతిని నీతో సహా వ్యర్థం అవుతుంది. బాణుని, నరకుని సంహరించిన కృష్ణుడు అర్జునుని రక్షిస్తాడు. అతడు నిన్నేకాదు, నిన్ను మించిన శత్రువుల నయినా యుద్ధంలో చంపగలడు."

ఆ మాటలు విని కర్ణుడిలా అన్నాడు. "నిజమే, కృష్ణుడు అంతటివాడే - కాదు అంతకన్న ఎక్కువ వాడు కూడా. కాని భీష్ముడు నన్ను కొన్ని పరుషవాక్కులు పలికాడు. దాని ఫలితమేమిటో వినాలి. ఇక యుద్ధంలో శస్త్రం ముట్టను. విడిచిపెడుతున్నాను. సభలో మాత్రమే భీష్మునికి కనిపిస్తాను. భీష్మా! నీవు అణగారిన తరువాతనే నా ప్రభావాన్ని రాజులంతా చూస్తారు." ఇలా అని కర్ణుడు సభను విడిచి తన భవనానికి వెళ్లిపోయాడు. భీష్ముడు కురుసభలో నవ్వుతూ దుర్యోధనునితో ఇలా అన్నాడు. "ఈ సూతపుత్రుడు సత్యప్రతిజ్ఞుడు కదా! ఈ భారం అంతా ఎలా మోస్తాడో! వ్యూహానికి ప్రతివ్యూహం పన్ని భీముడు అందరి తలలు పగులగొట్టి చేసే లోకవినాశం చూద్దురుగాని. అవంతిరాజులు, కళింగరాజులు, సైంధవుడు, చేదిరాజు, బాహ్లికుడు - అంతా ఉండగా వేలకొద్దీ, పదివేల కొద్దీ శత్రు యోధులను చంపుతాను. మచ్చలేని వాడు, భగవంతుడు అయిన పరశురాముని నుండి 'బ్రాహ్మణుడ నని చెప్పుకొని' బ్రహ్మాస్త్రం పొందిన రోజునే ఈ అధముని యొక్క ధర్మమూ, తపస్సూ నశించిపోయాయి." వైశంపాయనుడు అన్నాడు. రాజా! భీష్ముడట్లా అనగానే కర్ణుడు అస్త్ర సన్యాసం చేసి వెళ్లాక, ధృతరాష్ట్రపుత్రుడు, అల్పబుద్ధి అయిన దుర్యోధనుడు భీష్మునితో ఇలా అన్నాడు.

63. విదురుని ఉపదేశము.

"మేమూ, మా జన్మలూ సమానం. కానీ (మాలో) పాండవులకు మాత్రమే జయం కలుగుతుందని నీవు ఎలా అనుకొంటున్నావు.? వీర్యం, పరాక్రమం, శమం, వయస్సు (వర్చస్సు) ప్రతిభ, (సమయస్ఫూర్తి) పాండిత్యం - అనే వాటి విషయాల్లో మేము (కౌరవులు, పాండవులూ) సమానులమే. అస్త్రాలచేత, యోధ సంపాదనంచేత, చురుకుదనంచేత, నేర్పుచేత అందరమూ సమానులమే. అందరమూ మానవ జన్మ ఎత్తిన వారమే. పితామహా! పాండవులకే విజయం కలుగుతుందని నీకెలా తెలుసు? నేను నీమీద కాని, ద్రోణ కృపుల మీద కాని, బాహ్లీకుని మీద కాని, ఇతర రాజుల మీద కాని ఆధారపడి యుద్ధానికి సిద్ధపడటం లేదు. నేనూ, కర్ణుడూ, నా తమ్ముడు దుశ్శాసనుడూ యుద్ధంలో వాడిబాణాలతో పాండవు లయిదుగురినీ చంపగలం. రాజా! తరువాత భూరిదక్షిణలిచ్చి ఎన్నో యజ్ఞాలు చేసి గోవులతో, గుర్రాలతో, ధనంతో బ్రాహ్మణులను సంతృప్తి పరుస్తాను. రక్షించే వాళ్లు లేక నీటిలో మునిగిపోయే లేడి పిల్లల్ని త్రాడుతో లాగి ఉద్ధరించినట్లు, రథగజాలతో మునిగిపోయే పాండవులను అంతా చూస్తూ ఉండగా నా వాళ్లు ఉద్ధరిస్తున్నపుడు పాండవులూ, ఆ కృష్ణుడూ గర్వాన్ని వదులుతారు."

అపుడు విదురుడు ఇలా అన్నాడు. "నిశ్చితమయిన జ్ఞానం కలవానికి ముఖ్యంగా బ్రహ్మజ్ఞానం కలవానికి నిగ్రహమే సనాతన ధర్మం అనీ, పర(మ) సుఖాన్ని ఇస్తుందనీ పెద్దలు చెపుతారు. దమం కలవాని దానం, క్షమ, సిద్ధి యథార్థలాభం పొందుతాయి. ఎందుచేతనంటే దానం, తపస్సు, జ్ఞానం, స్వాధ్యాయం అనువానిని దమమే సంపాదిస్తుంది. దమం తేజస్సును వృద్ధిపరుస్తుంది. దమం పవిత్రమైనది, ఉత్తమమైనది. పాపరహితుడై, తేజో వృద్ధి నొందిన వాడు మహత్త్వం పొందుతాడు. క్రూరమృగాలవల్ల ప్రాణులు భయపడినట్లు దమం లేని వారి వల్ల నిత్యమూ భయం కలుగుతుంది. వాటిని తొలగించటానికే బ్రహ్మ క్షత్రియజాతిని సృష్టించాడు. నాలుగాశ్రమాల వారికీ దమమే ఉత్తమమైన వ్రతం. దమం యొక్క లక్షణాలు చెపుతున్నాను - ఇవి దమం కలగటానికి హేతువులు. సహనం, ధృతి, అహింస, సమత్వం, సత్యం, ఆర్జవం, ఇంద్రియజయం, ధైర్యం,మృదుత్వం, సిగ్గు, చాపల్యం లేకపోవడం, కార్పణ్యం లేకపోవడం, కోపం లేకపోవడం, సంతోషం, శ్రద్ధ... రాజేంద్రా! ఇవి కలవాడు దాంతుడు. కామం,

లోభం, గర్వం, కోపం, నిద్ర, ఆత్మస్తుతి, దురభిమానం, ఈర్ష్య, శోకం – ఇవి దాంతునికి కలగవు. దాంతుని లక్షణం ఏమంటే నిష్కపటత, మొండిపట్టుదల లేకపోవడం, దోషరాహిత్యం.

అనాసక్తి, అత్యాశలేకపోవడం, కామ సంకల్పాలు లేకపోవడం, సముద్రం వంటి గాంభీర్యం – ఇవి కలవాడు దాంతుడని కీర్తింపబడతాడు. సత్ప్రవర్తన, శీలసంపద, ప్రసన్నమైన మనస్సు కలిగి ఆత్మవేత్త అయిన పండితుడు ఇహలోకంలో సమ్మానం పొంది మరణించాక సుగతిని పొందుతాడు. **ఇతర ప్రాణుల వల్ల తవకు భయం లేనివాడు, తనవల్ల ఇతరులకు భయం కల్గించని మానవోత్తముడు పరిణత ప్రజ్ఞు డని ప్రసిద్ధి కెక్కుతాడు.** సర్వప్రాణుల పట్ల హితంగా మెలిగేవాడు, మిత్రుడు, ఇతరులకు భయం కలిగించనివాడు, సముద్రంలా గంభీరుడు అయిన ప్రజ్ఞావంతుడు తృప్తుడై శాంతిస్తాడు. తన పూర్వసుకృతంవల్ల కలిగిన దానిని స్వీకరిస్తూ, సదాచారం పాటిస్తూ, సంతోషం పొందే వారే దాంతులు, వారే శమ పరాయణులు. **నైష్కర్మ్యం పాటించి, జ్ఞానంతో సంతృప్తిపడి, జితేంద్రియుడై, కాలం కోసం ఎదురుచూసేవాడు బ్రహ్మభావం పొందుతాడు. ఆకాశంలో ఎగిరే పక్షుల పాదచిహ్నాలు కనపడనట్లే జ్ఞానానందంచేత సంతృప్తినొందిన మునియొక్క మార్గం కూడా కనపడదు.*** గృహస్థాశ్రమ ధర్మాలు విడిచి మోక్షం మాత్రమే ఆదరించేవాడు ఊర్ధ్వలోకాల్లో తేజోమయ మయిన సనాతన స్థానం పొందుతాడు."

64. జ్ఞాతివిరోధము తగదని విదురుడు బోధించుట.

విదురుడు చెపుతున్నాడు. "నాయనా! ఇది నేను పూర్వుల నుండి విన్నాను. బోయవాడొకడు పక్షుల్ని పట్టుకొనడానికి నేలమీద వల పన్నాడు. కలిసి తిరిగే పక్షులు రెండు ఒక్కసారిగా అందులో పడ్డాయి. వెంటనే అవి రెండూ ఆ వలను ఎత్తుకొని ఆకాశానికి ఎగిరి పోయాయి. ఎగిరిపోతున్న పక్షుల్ని బోయవాడు చూసి, అవి వెళ్లే చోటికి నిరాశపడకుండా వెంటపడ్డాడు. అలా పక్షుల కోసం పరుగెత్తే బోయవానిని ఒక ఆశ్రమంలోని ముని ఒకడు చూశాడు. అప్పుడే అతడు పగటి

---

* శకునీనామివాకాశే పదం నైవోపలభ్యతే ।
ఏవం ప్రజ్ఞానతృప్తస్య మునే ర్వర్త్మ న దృశ్యతే ॥ 23

అనుష్ఠానం పూర్తి చేసుకున్నాడు. పైన ఆకాశంలో వేగంగా పోయే పక్షుల్నీ, క్రింద వెంటపడిపోతున్న బోయవానిని చూసి ఇలా పలుకరించాడు. బోయవాడా! ఇది చాలా ఆశ్చర్యంగా కనిపిస్తోంది నాకు. పక్షులు ఆకాశంలో ఎగిరిపోతున్నాయి.- నీవేమో నేలమీద వెంటాడుతున్నావు. అనగానే బోయవాడిలా చెప్పాడు. ఇవి రెండూ కలిసి ఒకే అభిప్రాయంతో నావల ఎత్తుకొని పోతున్నాయి. ఎక్కడ అభిప్రాయ భేదంతో వాదు లాడుకొంటాయో అక్కడ (క్రిందపడి) నాకు వశమవుతాయి."

విదురుడిలా అన్నాడు. "అలాగే ఆ పక్షులకు మృత్యువు దగ్గరపడి వివాదం కలిగింది. ఏమాత్రం తెలివిలేని ఆ పక్షులు రెండూ నేలమీద పడ్డాయి. మృత్యుపాశానికి లోబడి ఆ పక్షులు రెండూ కోపంతో దెబ్బలాడుకొంటున్నాయి. ఇంతలో ఆ వేటగాడు తెలియకుండా (పక్షులకు) దగ్గరచేరి వాటిని పట్టుకొన్నాడు. దెబ్బలాడుకున్న ఆ పక్షుల వలె జ్ఞాతులు సంపద కోసం తమలో తాము కలహిస్తే వారు శత్రువులకు వశ మవుతారు. కలిసి భోజనం చేయడం, కలిసి సంభాషించుకోవడం, ఒకరియోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకోవడం, చక్కగా రాకపోకలు సాగించడం... ఇవి జ్ఞాతులు చేయదగిన పనులు - అంతే కాని ఎన్నడూ విరోధించకూడదు. సమయానికి తగినట్లు మంచిమనసుతో కలిసి ఉంటూ, పెద్దలను సేవించే వారంతా సింహాలు రక్షించే అడవిలాగా ఇతరులకు వశంకారు. (సింహాలుండే అడవిని ఎవరూ కొట్టలేరు). సతతమూ ధనం సంపాదించి దీనుల వలె ఉండేవారు శత్రువులకు తమ సంపదను చక్కగా ఇస్తారు. ధృతరాష్ట్ర! జ్ఞాతులు విడివిడిగా ఉంటే కొరకంచులవలె పొగలు కక్కుతారు- కలిసి ఉంటే చక్కగా వెలుగుతారు. ఒక కొండమీద నేను చూసిన సంఘటన మరొకటి చెపుతున్నాను - రాజా! అది కూడా విని ఏది మేలో దాన్ని చెయ్యి. మేము ఒకసారి మంత్రాలను గురించి, ఓషధులను గురించి చెప్పే దేవసమాను లయిన బ్రాహ్మణులతోను, బోయవారితోను కలిసి ఉత్తరాన ఉన్న కొండ దగ్గరకు వెడుతున్నాము. అది గంధమాదన పర్వతం - చుట్టూరా పొదలూ, దివ్యమయిన ఓషధులూ ఉన్నాయి- సిద్ధులూ, గంధర్వులూ తిరిగే ఆ చోటుకు మేము చేరాము. అక్కడ మేమంతా ఒక తేనె పట్టును చూశాము. ఎగుడు దిగుడుగా ఉన్న ఒక కొండలోయలో పట్టింది. పెద్ద కుండంత ఉంది ఆ తేనెపట్టు. దాన్ని పాములు చుట్టుముట్టిఉన్నాయి. అది కుబేరునికి చాలా ఇష్టం. దాన్ని త్రాగితే మానవునికి మరణం ఉండదట. గ్రుడ్డివానికి

కళ్లు వస్తాయిట - ముసలివాడు యువకు డవుతాడుట. ఓషధీ సాధకులయిన బ్రాహ్మణులు అలా చెప్పారు. ఆ మాటలు విని కిరాతు లా తేనె పట్టును చూసి దాన్ని కోరి పరుగెత్తి విషమ మయిన, పాములున్న ఆ కొండలోయలో పడి చచ్చిపోయారు.

అలాగే నీకొడుకు భూమి అంతా ఒక్కడే అనుభవించా లనుకొంటున్నాడు. అజ్ఞానంతో తేనెపట్టునే చూస్తున్నాడుకాని లోయను / పతనాన్ని చూడటం లేదు. దుర్యోధనుడు సవ్యసాచితో యుద్ధం చేయాలనుకొంటున్నాడు. ఆ అర్జునుని తేజస్సు, అటువంటి పరాక్రమమూ ఎక్కడా చూడను. ఒక్క రథ సహాయంతో అర్జునుడు భూమిని గెలిచాడు. విరాటనగరంలో భీష్మద్రోణాదు లంతా భయపడి అవమాన పడ్డారు. నీకక్కడ చూసేందుకు ఏముంది? ఆ నీ చూపును ఎదురు చూసే వీరుడే (కర్ణుడే) చూడగలడులే! ద్రుపదుడు, విరాటుడు, అర్జునుడు వీరంతా వాయువుతో కూడిన అగ్నులవలె యుద్ధంలో ఏమీ మిగల్చరు. (రణశేషం ఉంచరు). ధృతరాష్ట్రా! యుధిష్ఠిరుని ఒడిలో కూర్చుండబెట్టుకో ! యుద్ధం చేసే ఇద్దరిలో ఎప్పుడూ ఒక్కనికే జయం లభించదు."

65. సంధికి అంగీకరింపుమని ధృతరాష్ట్రుడు పుత్రునకు చెప్పుట.

ధృతరాష్ట్రుడు అన్నాడు. "పుత్రా ! దుర్యోధనా ! నేను చెప్పేది తెలుసుకో. త్రోవ తెలియని బాటసారి లాగా నీవు అపమార్గాన్ని సన్మార్గం అనుకొంటున్నావు. (ధర్మమార్గం అతిక్రమిస్తున్నావు). లోకాలకు ఆధారమయిన పంచభూతాలవంటివారు పంచపాండవులు. వారి తేజస్సును నీవు అపహరించాలనుకొంటున్నావు. (ఇది సాధ్యమా ?) యుధిష్ఠిరుడు ఉత్తమ ధర్మాన్ని ఆశ్రయించి ఉన్నాడు. నీవు మరణం పొందకుండా అతనిని ఇక్కడ జయించలేవు. భీమునికి బలంలో సమాను డెవరూ లేరు. అతడు యుద్ధంలో యముడే. మహాబలు డయిన వాయువును చెట్టు బెదిరించినట్లు నీవు భీముని బెదరిస్తున్నావు. శస్త్రం పట్టిన వారందరిలో అర్జునుడు శ్రేష్ఠుడు. పర్వతాల్లో మేరువు వంటివాడు. ఆ గాండీవధారిని యుద్ధంలో బుద్ధి గలవా డెవడు ఎదుర్కొంటాడు? ధృష్టద్యుమ్నుడు దేవేంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించినట్లు శత్రుమధ్యంలో బాణాలు వేస్తూ ఎవరిని నరకకుండా ఉంటాడు? సాత్యకి ఎదిరింపరానివాడు. అంధక వృష్ణివంశాల్లో గణింపదగ్గవాడు. పాండవులకు హితం చేయాలనుకొనేవాడు. అతడు నీ సేనను

ధ్వంసం చేస్తాడు.

పోలికలో మూడు లోకాల్నీ మించిపోయే కృష్ణుని ఏ తెలివైనవాడు ఎదిరించగలడు? ఆ కృష్ణుడికి భార్యలు, జ్ఞాతులు, బంధువులు, తాను, ఈ భూమి అన్నీ ఒక ఎత్తు. అర్జును డొక్కడూ ఒక ఎత్తు. సంయమం కల అర్జును డున్న చోటనే అసాధ్యు డయిన వాసుదేవు డుంటాడు. కృష్ణుడున్న వైపు బలాన్ని భూమి కూడా భరించలేదు. నాయనా! మన మేలు కోరే సజ్జనుల మాటను పాటించు. పెద్దవాడు, తాత అయిన భీష్ముని సహించు. కౌరవుల హితం చెప్పే నన్ను, ద్రోణుని, కృపుని, వికర్ణుని, మహారాజు బాహ్లికుని, ఆదరించు. వీరంతా నావంటి వారే అని భావించు. అందరూ ధర్మవేత్తలే. నాతో సమానమైన స్నేహం నీ మీద కలవారే. విరాటనగరంలో నీ సోదరులతో పాటు సేన అంతా ఆవుల్ని వదలి, చాలా భయపడి, చెల్లాచెదరయింది. అదే పట్టణంలో ఒక్క (అర్జును)నికి చాలా మందితో జరిగిన అద్భుత సన్నివేశం విన్నాం గదా ! ఆ నిదర్శనం చాలు. ఆ పని అంతా అర్జును డొక్కడే చేశాడు. ఇక అందరూ కలిస్తే వేరే చెప్పాలా ? ఆ సోదరులను తెలుసుకో. అతని పాలు అతని (ధర్మజుని) కిచ్చి సత్కరించు."

66. అర్జునుని మాటలను సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పుట.

మిక్కిలి తెలివైన ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో అలా చెప్పి మళ్లీ సంజయుని ఇలా అడిగాడు. "సంజయా ! వాసుదేవుని తర్వాత అర్జునుడు చెప్పినది ఏమిటో చెప్పు. వినాలని నాకు చాలా కుతూహలంగా ఉంది." సంజయుడు ఇలా అన్నాడు. "వాసుదేవుని మాటలు విని అర్జునుడు కృష్ణుడు వినేటట్లు సమయోచితంగా ఇలా అన్నాడు. సంజయా ! భీష్ముని, ధృతరాష్ట్రుని, ద్రోణుని, కృపుని, కర్ణుని, దుశ్శాసనుని, శల్యుని, పురుమిత్రుని, వివింశతిని, వికర్ణుని, చిత్రసేనుని, జయత్సేనుని, అవంతిరాజకుమారులు విందాను విందులను, కౌరవు డయిన దుర్ముఖుని, సైంధవుని, దుస్సహుని, భూరిశ్రవుని, భగదత్తుని, జరాసంధుని మొ॥ వారందరికీ వారికి తగినట్లు నమస్కారాలు చెప్పు. కుశలమడిగినట్లు చెప్పు. ఇక కౌరవుల ప్రియంకోరి, దుర్యోధనుడు హోమం చేసే పాండవాగ్నిలో పడాలని వచ్చిన రాజు లందరికీ తగినట్లు నామాటగా కుశలమడుగు పాపులకు మూలమయిన ఆ దుర్యోధనునితో రాజసభలో ఇలా

చెప్పు. సహనంలేని దుష్టబుద్ధి, పాపాత్ముడు, లోభి అయిన దుర్యోధనునికి, మంత్రులతో సహా సంజయా! నేను చెప్పే మాటలన్నీ వినిపించు. ఇలా నన్ను నిలిపి అర్జునుడు కృష్ణుని వైపు చూసి ధర్మార్థ సహితంగా ఇలా అన్నాడు. అపుడా బుద్ధిమంతుని విశాలనేత్రాల తుదలలో ఎఱ్ఱజీరలు కనపడ్డాయి. 'కృష్ణునిమాట సమాహితమనస్సుతో విన్నావుగా. రాజులంతా ఉన్న కొలువులో నా మాటను కూడ అలాగే చెప్పాలి. బాణాలనే అగ్నుల పొగలతో, రథచక్రాల మంత్రనాదంతో, అస్త్రబలంతో ముందుకు సాగే ధనుస్సు అనే హోమపాత్రతో మేము యుద్ధమనే యజ్ఞం చేయకుండామీరంతా కలిసి ప్రయత్నించండి. శత్రు సంహారకు డయిన యుధిష్ఠిరుని భాగం అతడు కోరినట్లుగా ఇవ్వకపోతే మిమ్మల్నీ, మీ గజతురగ పదాతి దళాలనూ నా వాడిబాణాలతో అశుభంకరమయిన దక్షిణ దిక్కుకు తోలుతాను. (చంపి పారేస్తాను) అన్నాడు.' ఆ తరువాత ధనంజయుని వీడ్కొని, కృష్ణునికి నమస్కరించి, వేగంగా వారి మాటలు నీకు చెప్పడానికి ఇక్కడకు వచ్చాను."

67. వ్యాస గాంధారుల రాక.

దుర్యోధనునికి ఆ మాట రుచించలేదు. అందరూ మౌనం వహించారు. అపుడు రాజులు లేచి నిలిచారు. వచ్చిన రాజులంతా లేచి వెళ్లిపోయాక ఏకాంతంలో రాజా సంజయుని ఇలా అడగడం ప్రారంభించాడు. పుత్రవశమై నడచే ధృతరాష్ట్రుడు తన కొడుకుల విజయం కోరుతూ, తన కర్తవ్యం, పరుల (తటస్థుల) నిశ్చయం, పాండవుల నిశ్చయం గురించి అడగ నారంభించాడు. "సంజయా ! మన సైన్యంలో సారం ఏది? అసారం ఏది? పాండవుల సేన గురించి కూడా నీకు సర్వమూ తెలుసును. ఈ రెంటిలో ఏది గొప్పది ? ఏది తక్కువది ? ఈ రెండు సేనల్లోని సారమెరిగి అన్నీ తెలిసినవాడవు. ధర్మమూ, అర్థమూ నేర్పుగా నిశ్చయింప గల సమర్థుడవు. అడుగుతున్నాను. అంతా చెప్పు, ఉదాసీను లెవ రెవరు?"

సంజయుడు ఇలా చెప్పాడు. "రాజా ! ఒంటరిగా ఉంటే నీకు ఏమీ చెప్పను. నీలో అసూయ కలుగుతుంది. మహావ్రతుడయిన నీ తండ్రి వ్యాసుని, పట్టపురాణి గాంధారిని రప్పించు. వారిద్దరూ నీ అసూయను నివారించగలరు. ధర్మం తెలిసినవారు, నేర్పరులు, నిశ్చయం చేయగలవారు. వారి ముందు కృష్ణార్జునుల అభిప్రాయం

అంతా నీకు చెపుతాను." ఇలా అనగానే గాంధారి, వ్యాసుడూ అక్కడకు వచ్చారు. వెంటనే వారిని విదురుడు సభలోనికి ప్రవేశపెట్టాడు. సంజయ, ధృతరాష్ట్రుల అభిప్రాయం తెలిసి వచ్చిన మహాబుద్ధిశాలి కృష్ణద్వైపాయనుడు ఇలా అన్నాడు. "సంజయా! ధృతరాష్ట్రుడు నిన్ను అడిగే విషయమంతా చెప్పు. ఈ పక్షంలోనూ, ఆ పక్షంలోని వాసుదేవార్జునులలోను ఉన్నది ఏమిటో / ఉన్నదున్నట్లు చెప్పు. నీకు తెలిసినంత చెప్పు."

68. ధృతరాష్ట్రుని ప్రశ్నకు సంజయుని సమాధానము.

సంజయుడిలా చెప్పాడు. "అర్జునుడూ, వాసుదేవుడూ ఇద్దరూ జగన్మాన్యులయిన ధనుర్ధారులు. (వారు సదా కలిసి ఉండే నరనారాయణులు అయినా) లోక కళ్యాణ కాంక్షతో వేర్వేరుగా జన్మించారు. వారు ఏ పని చేయటానికైనా సమర్థులు. కృష్ణుని చక్రం బారెడు వ్యాసం కలిగి ఉంటుంది. అతని మనసుకు అనుగుణంగా, మాయతో ప్రవర్తిస్తుంది. ఆ చక్రం కౌరవుల పట్ల గూఢంగా ఉంది. పాండవులంటే ఇష్టంగా ఉంది. బలం యొక్క సారాసారాలు తెలిసి ఒక తేజఃపుంజంలా కనపడుతోంది. ఘోరరూపులయిన నరకుని, శంబరుని, కంసుని, శిశుపాలుని మహాబలశాలి అయిన కృష్ణుడు ఆటలాడినట్లు చంపాడు. ఆ పురుషోత్తముడు భూమినీ, ఆకాశాన్నీ, స్వర్గాన్నీ కేవలం మనసుతోనే తన వశం చేసుకొంటాడు. అంతటి విశిష్టవ్యక్తి అతడు. అందుకే అతడు వశి అయినాడు. రాజా ! పాండవుల గురించి సారాసార బలం గురించి మళ్లీ మళ్లీ అడుగుతున్నావు. సంక్షిప్తంగా చెపుతా విను.

జగత్తు అంతా ఒక ప్రక్క, జనార్దనుడు ఒక ప్రక్క ఉంటే సారాన్ని బట్టి జగత్తు అంతటికంటే జనార్దనుడే ఎక్కువ. జనార్దనుడు ఈ జగత్తు నంతటిని కేవలం మనసుతోనే భస్మం చేయగలడు. కాని జగత్తు మొత్తం కూడినా జనార్దనుని భస్మం చేయలేదు.

సత్యం, ధర్మం, లజ్జ, త్రికరణ శుద్ధి ఎక్కడ ఉంటాయో అక్కడ గోవిందు డుంటాడు. ఎక్కడ కృష్ణుడుంటాడో అక్కడ జయం కలుగుతుంది.* భూమిని, ఆకాశాన్ని, స్వర్గాన్ని పురుషోత్తముడు ఆటలాడుతున్నట్లు ఆవరిస్తాడు.

---

* యతస్సత్యం యతో ధర్మః యతో హ్రీరార్జవం యతః ।
తతో భవతి గోవిందః యతః కృష్ణ స్తతో జయః ॥ 9

అందుకే సర్వప్రాణులకు ఆత్మరూపు డయినాడు. పాండవులను మిషగా చేసుకొని లోకాన్ని మోహింపజేస్తూ మూఢులై అధర్మనిరతులయిన నీ కొడుకుల్ని దహించి వేయా లనుకొంటున్నాడు. కాలచక్రాన్ని, జగచ్చక్రాన్ని, యుగచక్రాన్ని భగవంతు డయిన కృష్ణుడు ఆత్మబలంతో సదా త్రిప్పుతూ ఉంటాడు. కాలానికీ, మృత్యువుకూ, చరాచర ప్రపంచానికీ ప్రభువు భగవంతు డయిన కృష్ణుడొక్కడే. నీకు సత్యం చెపుతున్నాను. మహాయోగి అయిన శ్రీహరి జగత్తు కంతటికీ ప్రభువు. అయినా ధాన్యాదులను వృద్ధి చేసే కర్షకుని వలె సత్కర్మలను ఆచరించటానికి పూనుకొంటాడు. ఆ మాయా ప్రభావంతోనే లోకాలను కేశవుడు మోసగిస్తున్నాడు. కాని అతనినే శరణు పొందిన మానవులు మాత్రం మోసపోరు. ''

69. వ్యాస సంజయుల బోధ.

ధృతరాష్ట్రుడడిగాడు. "సంజయా ! కృష్ణుడు సర్వలోకేశ్వరుడని నీకు ఎలా తెలుసును ? నేను ఎందువల్ల తెలుసుకోలేకపోయానో నాకు చెప్పు." సంజయుడు చెపుతున్నాడు. "రాజా ! విను. నీకు విద్య లేదు. నా విద్య తరగదు. అజ్ఞానాంధకారంతో చెడిపోయిన విద్యా (తత్త్వజ్ఞాన) హీనుడు కేశవుని ఎరగడు. తండ్రీ! త్రియుగరూపుడయిన మధుసూదనుని నేను (ఆత్మ) విద్యచేత ఎరుగుదును. అతడు ప్రాణుల ఉత్పత్తికీ, వినాశానికీ కర్త. కాని అతనికి వేరే కర్త లేడు." అపుడు ధృతరాష్ట్రుడు మళ్లీ ఇలా అడిగాడు. "సంజయా! నీకు జనార్దనుని మీద నిత్యమైన భక్తి ఉంది. ఆ భక్తి ఎటువంటిది? దానితోనే కదా నీవు త్రియుగుడయిన మధుసూదనుని తెలుసుకున్నావు." సంజయుడు ఇలా సమాధానం చెప్పాడు. "నేను మాయను సేవించను. భగవదర్పితం కాని వ్యర్థధర్మం ఆచరింపను. శుద్ధమయిన మనసును పొంది, భక్తితో శాస్త్రం వల్ల జనార్దనుని తెలుసుకొన్నాను." అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. "దుర్యోధనా! ఇంద్రియాలకు ప్రభువు అయిన జనార్దనుని శరణు పొందు. ఈ సంజయుడు మనకు ఆప్తుడు. అతడు చెప్పినట్లు కేశవుని శరణు పొందు." అపుడు దుర్యోధనుడిలా అన్నాడు. "భగవంతుడయిన దేవకీపుత్రుడు లోకాలన్నిటినీ సంహరించవచ్చు. కాని అర్జునునితో స్నేహం ప్రకటించే కేశవుని నేనిపుడు శరణు కోరను."

దుర్యోధనుని మాటలకు ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "గాంధారీ! నీ కొడుకు

దుర్మతియై నరకానికి పోతున్నాడు. వీడు అసూయాపరుడు. దురాత్ముడు. దురభిమాని, శ్రేయోభిలాషుల మాటలను అతిక్రమిస్తున్నాడు. అపుడు గాంధారి ఇలా అంది. 'దుష్టాత్మా ! ఐశ్వర్యం మాత్రం కోరి పెద్దల మాట వినకున్నావు. నన్నూ, మీ తండ్రినీ వదలి, ఐశ్వర్యాన్ని, జీవితాన్ని వదలుకొంటున్నావు. దుర్మార్గులకు ప్రీతి కలిగిస్తూ నాకు దుఃఖం పెంచుతున్నావు. భీముని చేత పడినపుడు తండ్రి మాటలు స్మరిస్తావు." వ్యాసుడిట్లన్నాడు. "రాజా ! ధృతరాష్ట్ర ! నీవు కృష్ణునికి ప్రియుడవు. నా మాట తెలుసుకో. నీకు సంజయుడు దూత. ఇతడు నీకు శ్రేయస్సు కలిగిస్తాడు. సనాతనుడు, పరమాత్ముడు అయిన హృషీకేశుని ఈ సంజయు డెరుగును. ఏకాగ్రతతో సేవించేవారికి కృష్ణుడు మహాభయం నుండి మోక్షం కలిగిస్తాడు. ధృతరాష్ట్ర! క్రోధ శోకాలతో కూడిన పురుషులు, తమకున్న సంపదలతో తృప్తి పడక ఎన్నో పాశాలతో కట్టుబడి పోతారు. అటువంటివారు, కామ మూఢులై నిత్యమూ తమ కర్మలతో లాగబడుతూ ఉంటారు. గ్రుడ్డివాని చేత లాగబడే గ్రుడ్డి వారిలాగా పోతూ చివరకు యముని వశమవుతారు. కాని జ్ఞాన మార్గం పరమాత్మను చేరుస్తుంది. చాలామంది బుద్ధిమంతులు ఈ మార్గంలో వెళ్లారు. ఈ మార్గం చూసినవారు మృత్యువును తరిస్తారు. కాని (సంసారమున) తగుల్కొనరు." అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "సంజయా! నిర్భయమైన ఆ మార్గం నాకు చెప్పు. ఆ మార్గాన వెళ్లి శ్రీ కృష్ణుని చేరి ఉత్తమమైన సిద్ధి పొందుతాను."

సంజయుడు చెప్పాడు. "మనసును వశపరచుకొనలేనివాడు నిత్య సిద్ధుడయిన కృష్ణుని ఎన్నడూ తెలుసుకోలేడు. ఇంద్రియ నిగ్రహం తప్ప పరమాత్మ ప్రాప్తికి మరో ఉపాయం కనపడదు. విజృంభించే ఇంద్రియాలను కోరికల నుండి మళ్లించడం, పారబడకపోవడం, అహింస ఈ మూడూ నిస్సందేహంగా జ్ఞానం కలిగిస్తాయి. అందుచేత రాజా ! ఏమరకుండా ఇంద్రియాలను అదుపు చేయడంలో ప్రయత్నం చెయ్యి. నీ బుద్ధిని జారిపోనీకు. దాన్ని విషయాల నుండి మళ్లించు. ఈ ఇంద్రియ నిగ్రహాన్నే విప్రులు జ్ఞాన మన్నారు. ఈ మార్గం పట్టుకొనే బుద్ధిమంతులు పయనించారు. రాజా! ఇంద్రియ నిగ్రహం లేని మానవులకు కేశవుడు దొరకడు. వేదాలు చదివి, యోగాభ్యాసం చేసి వశపరచు కొన్నవానికి ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. వానికే తత్త్వం ప్రసన్నమవుతుంది."

70. కృష్ణుని వాసుదేవాది నామముల నిర్వచనము.

ధృతరాష్ట్రుడిట్లడిగాడు. "సంజయా ! మళ్లీ పుండరీకాక్షుని గురించి అడుగుతున్నాను. చెప్పు. వాని పేర్లను గురించి, కర్మలను గురించి, వాని ప్రయోజనాలను గురించి తెలిసికొని నేను పురుషోత్తముని పొందుతాను." సంజయుడు ఇలా చెపుతున్నాడు. "శుభప్రదమైన వాసుదేవుని నామముల నిర్వచనం నేను విన్నాను. నాకు తెలిసినంత నేను చెపుతాను. నిజానికి కేశవుడు మన ఊహలకు అందడు. (1) సర్వభూతాలను మాయతో ఆవరించి ఉంటాడు. దేవయోనుల నుండి ప్రకాశిస్తాడు. అందుచేత వాసుదేవుడని తెలుస్తున్నాడు. (2) అంతటా వ్యాపించి ఉండటం చేత విష్ణువని చెప్పబడుతున్నాడు. (3) మౌనం, ధ్యానం, యోగం వీటి వల్ల మాధవుడని పేరు వచ్చింది. (4) సర్వతత్త్వాలూ అతనిలో ఉండటం వలన మధువును చంపడం వల్లను, మధుసూదనుడనీ అంటారు. కృష్ అంటే 'ఉండుట' అని అర్థం. 'ణ' అనగా, నిర్వృతి- సుఖము. ఈ రెంటి భావాల కలయిక వల్ల విష్ణువు కృష్ణుడయ్యాడు. (5) పుండరీక మనగా పరమస్థానం. అది నిత్యం, నశించనిది. తరగనిది. అందులో అక్షయంగా / క్షీణించకుండా ఉండేవాడు పుండరీకాక్షుడు. (6) దస్యుజనులను భయపెడతాడు / హింసిస్తాడు కాబట్టి జనార్దనుడు. (7) హర్ష సుఖాలూ, ఈశత్వమూ కలవాడు హృషీకేశుడు. బాహువులతో భూమ్యాకాశములను మోయువాడు మహాబాహువు.

(8) ఎన్నడూ సంసారంలో పడనివాడు అధోక్షజుడు. (9) నరుల సముదాయం అయనం (స్థానం) గా కలవాడు నారాయణుడు. (10) అన్నిటినీ పూరించడం, నింపడం వల్లనూ, అన్నిటిలోనూ ఉండటం వల్లనూ, పురుషుడు అయినాడు. అసత్తుకు, సత్తుకూ సర్వానికీ సృష్టి సంహారాలకూ కారణమై ఉత్తముడయినాడు. అందుచే పురుషోత్తముడు. సత్యుడు (10) కృష్ణుడు సత్యం మీద నిలిచి ఉంటాడు. సత్యం కృష్ణునిలో నిలుస్తుంది. సత్యం కంటె పరమ సత్యం గోవిందుడు. అందువల్ల అతనికి సత్యమనిపేరు. (12) విష్ణువు = అన్నింటినీ ఆక్రమించే దేవుడు. (13) అన్నీ జయించడం చేత జిష్ణుడు. 3. శాశ్వతంగా నిలిచేవాడు కాబట్టి అనంతుడు. (14) గోవులను పొందడం / ప్రకాశింపజేసే వాడు గోవిందుడు. తత్త్వం కాని దానిని కూడ తత్త్వం చేసి లోకాన్ని మోహింపజేస్తాడు. (తత్త్వం కానిది జగత్తు) ఇంతటి మహానుభావుడు భగవంతు డయిన మధుసూదనుడు. అతడు సదా ధర్మానికి ఆశ్రయుడు. ఆ

మహాబాహుడు ఆనృశంస్యం కోసం మన దగ్గరికి వస్తున్నాడు."

71. ధృతరాష్ట్రుని వచనములు.

ధృతరాష్ట్రుడిట్లన్నాడు. "సంజయా ! కన్నులున్నవారు అదృష్టవంతులు. వారు జ్ఞాన శరీరంతో ప్రకాశిస్తూ దిక్కుల్నీ, మూలల్నీ వెలిగించే కృష్ణుని దగ్గరగా ఉండి చూడగలుగుతున్నారు. శ్రీ కృష్ణుడు భరత వంశీయుల మాటలు మాట్లాడుతాడు. ఆ మాటలు మన్నింపదగినవి. సృంజయులకు శుభప్రదాలు. ఐశ్వర్యకాములు గ్రహింపదగినవి. నిందింపరానివి. కాలం చెల్లిపోయిన వారికి గ్రహింపదగనట్లు తోస్తాయి. కృష్ణుడు సాత్వతుడు. ప్రధానవీరుడు. యాదవులకు నాయకుడు. శత్రువుల నెదిరించి సంహరిస్తాడు. పగవారి కీర్తిని తొలగిస్తాడు. కృష్ణుడు మహాత్ముడు – శత్రు నాశకుడు. కోరదగినవాడు. కరుణతో మాట్లాడుతాడు. నా వారిని మోహింపజేస్తాడు. అటువంటి కృష్ణుని కౌరవులంతా చూస్తారు. అతడు సనాతనుడయిన ఋషి. ఆత్మతత్త్వం తెలిసిన పండితుడు. చక్కని మాటలకు సముద్రం లాంటివాడు. యతులకు కలశం వంటివాడు. పక్షులలో గరుత్మంతుని వంటి వేగం కలవాడు. మర్యాద నెరిగినవాడు. ప్రజలకు హరి. లోకాలకు ఆశ్రయం. అనేక శిరస్సులున్న పురాణ పురుషుడు. ఆది, మధ్య – అంతములు లేనివాడు. అంతులేని కీర్తి కలవాడు. బీజసృష్టి చేస్తాడు. అజుడు. నిత్యుడు. పరాత్పరుడు. అటువంటి కృష్ణుని శరణు వేడుతాను. మూడు లోకాలూ నిర్మించేవాడు. దేవతలు, అసురులు, రాక్షసులు, నాగులు – వీరి పుట్టుకకు కారణం. విధ్వంసులయిన రాజులలో ప్రధానుడు. ఇంద్రుని తమ్ముడయిన ఆ కృష్ణుని శరణు వేడుకొంటున్నాను.

72. ధర్మరాజు శ్రీకృష్ణుని దౌత్యము చేయుమని అర్థించుట.

వైశంపాయనుడిలా అన్నాడు. సంజయుడు వెళ్ళగానే ధర్మరాజు అర్జున, భీమసేన, నకుల, సహదేవ, విరాట, ద్రుపద, కేకయరాజ మహారథులను కలసి "మనం శంఖచక్రగదాధారి అయిన కృష్ణుని దగ్గరకుపోయి కౌరవ సభకు వెళ్ళిరమ్మని ఆయనను ప్రార్థించుదాం. భీష్ముడు ద్రోణుడు, ధీమంతుడైన బాహ్లికాది ఇతర కురువీరులతో మనం యుద్ధం చేయవలసిన అవసరం రానట్లు ఆయన ప్రయత్నిస్తారు. ఇదే మొదటి మార్గం, ఇదే ఉత్తమమూ, మనకు శ్రేయోదాయకమూ కూడా" అన్నాడు. యుధిష్ఠిరుని ఆ మాటలు విని వారంతా శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళారు. అప్పుడు సభాసదులైన

రాజు లందరూ పాండవులతో కలిసి దేవతలు ఇంద్రుని దగ్గరకు వెళ్లినట్లు శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళారు.)

ధర్మరాజు జనార్దనుడి దగ్గరకు పోయి ఇలా అన్నాడు. "మిత్రవత్సలా! మిత్రుల సహాయం కోరవలసిన సమయం ఆసన్నమైనది. మమ్ములను ఆపదలనుండీ గట్టెక్కించటానికి నీవు తప్ప మరెవ్వరూ కనిపించటం లేదు. మాధవుడవైన నిన్ను ఆశ్రయించి, నిర్భయులమై, నిరుపయోగమైన గర్వాన్ని ప్రదర్శిస్తున్న సుయోధనుని, ఆయన మంత్రులనూ కూడా స్వయంగా అర్థిస్తాము. శత్రుదమనా ! వృష్ణివంశస్థులను అన్ని ఆపదల నుండి రక్షించినట్లే పాండవులను కూడా నీవు రక్షించాలి. మహాభయం నుండి మమ్ములను కాపాడు." శ్రీకృష్ణుడిలా అన్నాడు. "నేను సర్వదా సంసిద్ధుడనే. నీవు చెప్పదలచినది చెప్పు. ధర్మజా! నీవు చెప్పిన దంతా నేను చేస్తాను."

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "కృష్ణా ! కొడుకులతో కలిసి ధృతరాష్ట్రుడు చేయదలచిన పనిని నీవు కూడా విన్నావు. సంజయుడు నాతో చెప్పినదంతా ధృతరాష్ట్రుని అభిప్రాయమే. **సంజయుడు ధృతరాష్ట్రుని ఆత్మ.** ధృతరాష్ట్రుని మనస్సునే సంజయుడు బయటపెట్టాడు. దూత స్వామి చెప్పిన మాటలనే చెప్తాడు, దానికి భిన్నంగా మాట్లాడితే మరణశిక్షకు కూడా అర్హుడు అవుతాడు. ధృతరాష్ట్రుడు లోభ పాపచింతనతో తనకు తగనిరీతిలో ప్రవర్తిస్తున్నాడు. మాకు రాజ్యభాగ మివ్వకుండానే మమ్ములను శాంత పరిచే మార్గాన్ని వెతుకుతున్నాడు. కృష్ణా ! మేము ధృతరాష్ట్రుని శాసనం మేరకు పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో నివసించాము. ఒక సంవత్సరం అజ్ఞాతంగా గడిపాము. ధృతరాష్ట్రుడు మాట మీద నిలుస్తాడన్న నమ్మకంతో మేము ప్రతిజ్ఞా భంగం చేయలేదు. ఈ విషయం మాతో ఉన్న బ్రాహ్మణుల కందరకూ తెలుసు. ధృతరాష్ట్రుడు లోభి. స్వధర్మాన్ని గమనించటం లేదు. పుత్రవ్యామోహంతో వానికి లొంగిపోయి ఆ బుద్ధిహీనుడైన సుయోధనుడి మాటనే అనుసరిస్తుంటాడు. జనార్దనా ! ధృతరాష్ట్రుడు లోభియై సుయోధనుడి ఆలోచనల్లోనే నిలుస్తాడు. ఆ రీతిగా తన కిష్టమైన బాటలోనే పయనిస్తూ మాతో కపటంగా వ్యవహరిస్తూ ఉంటాడు. జనార్దనా ! నేను నా తల్లిని, మిత్రులను కూడా సరిగా పోషించలేకపోతున్నాను. ఇంతకన్నా బాధాకరమైన విషయమేమి ఉంటుంది?

కాశీ, చేది, పాంచాల, మత్స్య దేశాల వీరులంతా నాకు సహాయపడుతున్నా,

నీవు దిక్కై నడిపిస్తున్నా నేను అయిదుగ్రామాలను మాత్రమే కోరాను. తండ్రీ! అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం ఈ నాలుగూ, నీ కిష్టమైన మరొక్కటి కలిసి అయిదు నగరాలను కానీ, గ్రామాలను కానీ మాకిమ్ము. మేమంతా కలిసి అక్కడే నివసిస్తాం. మా కారణంగా కురువంశం నశించ కూడదు అనే కదా నే నడిగింది! కానీ దుష్టమనస్కుడైన ఆ దుర్యోధనుడు దానికి కూడా అంగీకరించటం లేదు. సర్వాధికారాలూ తనవే అని భావిస్తున్నాడు. ఇంతకన్నా బాధాకరమైన దే ముంటుంది.? ఉన్నతవంశంలో పుట్టినా, వార్థకంలో అడుగు పెట్టినా పరుల సొమ్ములకు ఆశపడితే ఆ లోభం యుక్తాయుక్త వివేకాన్ని నశింపజేస్తుంది. నశించిన వివేకం సిగ్గును కూడా లేకుండా చేస్తుంది. సిగ్గులేనితనం ధర్మాన్ని బాధిస్తుంది. ధర్మం నశించి సంపదలను నశింపజేస్తుంది. సంపదలు నశిస్తే మనుషుడు నశించినట్లే. ఎందుకంటే మనిషికి డబ్బు లేకపోవటమే మరణం (వధ). కృష్ణా ! పూలూ, పండ్లూ లేని చెట్టుకు పక్షులు దూరమైనట్లు డబ్బులేని వాని నుండి దాయాదులు, మిత్రులు, బ్రాహ్మణులు మరలిపోతారు. ప్రేతశరీరం నుండి ప్రాణాలు వెళ్లి పోయినట్లు, పతితుని నుండి మనుష్యులు దూరమైనట్లు, నా దాయాదులు కూడా నా నుండి దూరమవుతారు. అది నాకు మరణంతో సమానం. నేటికీ, మరునాడు ఉదయానికీ భోజనం లేకపోతే ఆ దారిద్ర్యం కన్న దుఃఖకరమైన అవస్థ లేదని శంబరుడు చెప్పాడు. ధనమే ఉత్తమ ధర్మసాధన మంటారు. అంతా ధనం లోనే ఉంది. లోకంలో ధనవంతులే బ్రతుకుతారు. ధన హీనులు మరణించిన వారిక్రిందే లెక్క.

తమ బలాన్ని తాము నిలుపుకొంటూ, ఇతరుని ధనానికి దూరం చేసే మనుష్యులు ఇతరుని ధర్మాన్ని, అర్థాన్ని, కామాన్నీ చివర ఆ మనుజుని కూడా నశింపజేస్తారు. ఈ దారిద్ర్యమనే దుఃస్థితిని పొంది ఎందరో ఆత్మహత్యకు పాల్పడతారు. కొందరు గ్రామాన్ని వదలిపెట్టి వలసపోతుంటారు. మరికొందరు అరణ్యాలకు వెళ్తుంటారు. ఇంకాకొందరు ప్రాణత్యాగం చేయాలని ఇల్లు విడిచి పోతుంటారు. కొందరు పిచ్చివా రవుతుంటారు. మరికొందరు శత్రువులకు లొంగిపోతారు. కొందరు డబ్బుకోసం ఇతరులకు దాస్యం చేస్తుంటారు. ధనహీని మనిషికి మరణాన్ని మించిన ఆపద. ఎందుకంటే ధర్మకామసిద్ధికి ధనమే కారణం గదా ! మనిషికి ధర్మబద్ధమైన మరణమే పరలోకసిద్ధికి మార్గం. అది సనాతన భావం, సర్వప్రాణులలో ఏ ఒక్కటి అయినా

మృత్యువును ఏవిధంగానూ అతిక్రమించలేదు. కృష్ణా ! శుభప్రదమైన ఐశ్వర్యాన్ని పొంది, సుఖాలతో వృద్ధిపొంది, తరువాత దానిని కోల్పోయినవాడు పడే బాధను పుట్టుకతో దరిద్రుడైన వాడు ఎప్పుడూ పడడు. స్వయంకృతాపరాధంతో కష్టం తెచ్చుకొన్న మానవుడు ఇంద్రాది దేవతలను తిట్టుతూ ఉంటాడు. కాని తాను చేసిన తప్పును మాత్రం తెలుసుకోడు.

సంపదల ననుభవించి దరిద్రు డైనవాడు పడే బాధనుండి తప్పించటానికి ఏ శాస్త్రమూ పనికి రాదు. అటువంటి వ్యక్తి సేవకులపై కోపాన్ని ప్రదర్శిస్తాడు. మిత్రులను దోషదృష్టితో చూస్తూ అసూయపడతాడు. ధనహీనుడిని కోపం ఆక్రమిస్తుంది. దానితో మరల మోహంలో పడి, వివేకాన్ని కోలుపోతాడు. మోహావేశంతో అతడు క్రూరకర్మలు చేయ నారంభిస్తాడు. ఈ విధంగా పాపకర్మలకు లొంగిపోయిన వాడు వర్ణసంకరమైన సంతానాన్ని పొంది పోషిస్తాడు. సాంకర్యం నరకానికే దారితీస్తుంది. పాపిష్ఠమైన పనులకు చివరిగతి అదే గదా ! కృష్ణా ! పాపకర్మల నుండి మరల కర్తవ్యజ్ఞానాన్ని పొందలేకపోతే నరకానికే పోవలసివస్తుంది. ప్రజ్ఞయే కర్తవ్యబోధను కలిగించగలది. ప్రజ్ఞానేత్రం గలవాడే తరించగలడు. ప్రజ్ఞను పొందిన పురుషులు శాస్త్రవిషయాలను పరిశీలించగలుగుతారు. శాస్త్ర నిష్ఠగలవాడు ధర్మాన్ని పాటింపగలుగుతాడు. ధర్మానికి ప్రధానాంశం సిగ్గు (బిడియం). సిగ్గుగలవాడు పాపకర్మలను ద్వేషిస్తాడు. అప్పుడు అతని సంపద వృద్ధిపొందుతుంది. ఎంత ఎక్కువగా సంపదలుంటే అంత గొప్పవాడుగా మనిషి లెక్కింపబడతాడు. ధర్మతత్పరుడై ప్రశాంత మనస్సు గలవాడు ఎల్లప్పుడూ సత్కర్మల యందు ఆసక్తుడవుతాడు. అధర్మం మీద మనసు పెట్టడు. పాపపు పని చెయ్యడు. సిగ్గులేక పోయినా, మూర్ఖత్వానికి లోనయినా ఆ వ్యక్తి మగవాడూ కాదు, ఆడదీ కాదు. అటువంటి వానికి ధర్మకర్మలపై అధికార ముండదు. కేవలం శూద్రునితో సమానం. సిగ్గుగలవాడు తననూ, పితరులనూ, దేవతలనూ కాపాడుకొంటాడు. దానితో అమృతత్వాన్ని పొందుతాడు. పుణ్యకర్మల పరమప్రయోజనం అదే. మధుసూదనా ! నేను ఏవిధంగా రాజ్యాన్ని కోలుపోయానో, రోజులు ఎంత కష్టంగా గడుపుతున్నానో ఇదంతా నీవు ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నావు. అటువంటి మేము ఏ విధంగా చూసినా పైతృకమయిన సంపత్తిని విడిచిపెట్టటం యుక్తం గాదు. సాధించుకొనే ప్రయత్నంలో మేము మరణించినా అది తగినదే.

మాధవా ! మేమూ, ధార్తరాష్ట్రులూ ప్రశాంతంగా ఆ సంపదను సమానంగా అనుభవించాలన్నదే మా మొదటి లక్ష్యం. మేము కౌరవులను సంహరించి ఆ రాజ్యాన్ని చేజిక్కించుకోవటం అంతిమలక్ష్యం. అయితే అది క్రూరకర్మాచారం. వినాశనం ద్వారా మాత్రమే సిద్ధిస్తుంది.

కృష్ణా ! శత్రువులు నీచులైనా, ఏ సంబంధమూ లేని వారయినా కూడా చంపటం తగని పని. ఆ పరిస్థితిలో దాయాదులైన వారిని చంపజూడటం తగినపని అవుతుందా? జ్ఞాతులంతా మిక్కిలి పెద్దవాళ్ళు. వారికి సహాయకులు మా గురువులు- వారిని వధించటం ఎంతో పాపం. యుద్ధం వల్ల ఏం శుభం కలుగుతుంది మాకు ? యుద్ధం చేయట మనే క్షత్రియధర్మం పాపహేతువే కానీ మేము క్షత్రియులం. కాబట్టి అధర్మమైనా సరే క్షత్రియ ధర్మమే మాకు స్వధర్మమవుతుంది. దానిని వీడి మరొక వృత్తిని స్వీకరించటం నిందకు గురి అవుతుంది. శూద్రులు సేవచేస్తారు. వైశ్యులు వ్యాపారంతో జీవిస్తారు. బ్రాహ్మణులు భిక్షాపాత్రను చేపడతారు. మేము ఇతరులను చంపియే జీవిస్తాం. కృష్ణా ! క్షత్రియుడు క్షత్రియుణ్ణి చంపుతాడు. చేప చేపను చంపి బ్రతుకుతుంది. కుక్క కుక్కను తింటుంది. చూశావా ! ఇది పరంపరంగా వస్తున్న ధర్మం. కృష్ణా ! యుద్ధం నిత్యకలహమే. దానితో యుద్ధ భూమిలో ప్రాణాలు ఎన్నో పోతాయి. నైతిక బలాన్ని ఆశ్రయించి యుద్ధం చేస్తాను. గెలుపో, ఓటమో దైవాధీనం. యాదవశ్రేష్ఠా ! **ప్రాణుల జీవన మరణాలు తమ ఇచ్ఛ ననుసరించి యుండవు. సుఖమైనా, దుఃఖమైనా పొందవలసిన సమయంలోనే సమకూడుతుంది.**

యుద్ధంలో ఒకే వీరుడు చాలామందిని చంపవచ్చు. చాలా మంది కలసి ఒక్కడిని చంపవచ్చు. ఒక నీచుడు శూరుని సంహరింపవచ్చు. పేరులేనివారు పేరుగన్నవానిని సంహరింపవచ్చు. యుద్ధంలో ఇరుపక్షాలకూ గెలుపు దక్కదు. ఓటమి కూడా అంతే. హాని, సంపద నశించటం ఉభయ పక్షాలకూ సమానమే. ఒకవేళ రణరంగం నుండి వెనుకకు మరలినా జనక్షయం, ధనవ్యయం రెండూ తప్పవు. హృషీకేశా! యుద్ధం అన్నిరకాలా పాపహేతువే. ఇతరులను చంపినంత మాత్రాన తాను మరొకరి చేత చంపబడటాన్ని ఆపలేడు. యుద్ధంలో మరణించిన వాడికి జయమూ, అపజయమూ రెండూ సమానమే. కృష్ణా ! పరాజయం మరణం కంటె గొప్ప దేమీ కాదు. గెలిచిన వాడయినా జన ధన వినాశనం నుండి తప్పించుకోలే

డన్నది నిశ్చయం. గెలిచినా సరే, గెలుపు సిద్ధించేలోపు శత్రుసైనికు లెందరో తమ ఆప్తుల నెందరినో చంపుతారు. అందువలన పుత్రులనూ, సోదరులనూ కోలుపోయి బలహీనుడైనవాడు అన్నింటిపై విరక్తిని పొంది తుదకు జీవితం మీద కూడా విరక్తుడవుతాడు. జనార్దనా! యుద్ధంలో సాధారణంగా ధీరులూ, సిగ్గుపడేవారూ, పూజ్యులూ, దయామయులే చంపబడతారు. సామాన్యుడు బ్రతికి బయట పడతాడు. శత్రువులను చంపి గెలిచిన తర్వాత కూడా ఎప్పుడూ పశ్చాత్తాపపడ వలసివస్తుంది. పారిపోయే వారిని వెంటాడి చంపటం కూడా పాపమే, అలా పారిపోయిన శత్రువులలో ఎవరో ఒకరు మిగులుతారు. ఆ మిగిలినవాడు బలాన్ని పుంజుకొని విజేతలలో మిగిలినవారిని చంపగోరుతాడు. శత్రువులను అంతమొందించాలన్న ఆలోచనతో సర్వనాశనం చేయటానికి ప్రయత్నిస్తాడు. గెలుపుకూడా వైరాన్నే సృష్టిస్తుంది. ఓడినవాడు దుఃఖంతో కాలం గడుపుతాడు. కాబట్టి జయాపజయాలను విడిచి ప్రశాంతంగా ఉన్నవాడే సుఖంగా నిద్రించ గలుగుతాడు. ఎవరితో నయినా శత్రుత్వం ఏర్పడినవాడు ఇంటిలో పామువో సహజీవనం చేయవలసినట్లు ఎప్పుడూ ఉద్విగ్న మనస్సుతో, కలత నిదుర మాత్రమే పొందుతాడు. శత్రుపక్షంలోని అందరినీ నాశనం చేసిన వాడుకూడా కీర్తిని పొందజాలడు. సర్వప్రాణులలోనూ శాశ్వతమయిన అపకీర్తినే తాను పొందుతాడు.

శత్రుత్వాన్ని చిరకాలం మనస్సులో నిలుపుకొన్నా అది ఉపశమించదు. ఏ ఒక్కరో వంశంలో మిగిలినా అతనికి గతాన్ని గుర్తుచేస్తూ మాట్లాడే ప్రజలు చాలా మంది ఉంటారు. కృష్ణా ! మండుతున్న అగ్నిలో ఆహుతులను వేస్తే అది మరీ ప్రజ్వరిల్లి నట్లు శత్రుత్వంతో శత్రుత్వం పెరుగుతుందే కానీ ఉపశమించదు. కాబట్టి ఉభయ పక్షాలలో ఏదో ఒకటి పూర్తిగా నశించేదాకా స్థిరమైన శాంతి లభించదు. తప్పులు వెతికేవారికి ఈ పరిస్థితి ఎప్పుడూ తప్పదు. పౌరుషంలో మనస్సును కలత పెట్టే చింత ఎల్లప్పుడూ ఉంటుంది. వైరాగ్యంతో దానిని (చింతను) విడిచిపెట్టటం లేదా మరణించటం మాత్రమే దానికి పరిష్కారం. కృష్ణా ! అలా కాకపోతే శత్రువులను మొదలంట నాశనం చేయగలగటం ద్వారా ఇష్టఫలసిద్ధిని పొందవచ్చు. కానీ అది మరీ క్రూరమైన పని. రాజ్యపరిత్యాగం ద్వారా (రాజ్యానికి దూరమై) పొందే శాంతి కూడా మరణంతో సమానమే. అది శత్రువులకు నిత్యమూ అనుమానాలను కల్పిస్తూనే

ఉంటుంది. తాను ఐశ్వర్యాన్ని కోలుపోవడం చేత ఎప్పుడైనా నశించిపోవచ్చు. రాజ్యాన్ని వదలుకోవటం కానీ, వంశం నాశనం కావటం కానీ మాకిష్టం లేదు. వినమ్రతతో పొందగల శాంతియే అన్నింటికన్న గొప్పది. మేము యుద్ధాన్ని కోరుకోవటంలేదు. సామదాన భేదోపాయాలతోనే రాజ్యాన్ని పొందాలని ప్రయత్నిస్తున్నాం. ఒకవేళ మా విన్నపాలు విఫల మయితే యుద్ధం చేయకతప్పదు. పరాక్రమాన్ని పరిత్యజించటం మా అభిమతం కాదు.

శాంతికై చేసిన విన్నపాలు విఫల మయితే దారుణమైన యుద్ధం సంభవిస్తుంది. యుద్ధాన్ని కుక్కల కొట్లాటగా పండితులు భావిస్తారు. తోకనూపటం, గుర్రుపెట్టటం, బదులు అరవటం, ఒకదాని చుట్టూ మరొకటి తిరగటం, దంతాలు చూపించటం, మొరగటం, ఆపై కలియబడటం – ఇది కుక్కల ఘర్షణ పద్ధతి. వాటిలో ఎక్కువ బలం కలది గెలిచి ఆ మాంసాన్ని తింటుంది. మనుష్యులలో కూడా ఇదే స్థితి. విశేషమేమీ లేదు. బలవంతులకు బలహీనులపై ఆదరం లేకపోవటం ఎటుచూసినా తగినదే. వారు బలహీనులతో శత్రుత్వాన్ని కూడా పెట్టుకోరు. లొంగిపోవటానికి సిద్ధపడేవాడు దుర్బలుడు. దుర్బలుడు ఎప్పుడూ ఒదిగియే ఉంటాడు. జనార్దనా ! తండ్రి, రాజు, వృద్ధుడు సర్వ విధాల పూజనీయులే. కాబట్టి ధృతరాష్ట్రుడు మాకు మాననీయుడు, పూజనీయుడు కూడా! ధృతరాష్ట్రునకు పుత్రప్రేమ ఎక్కువ. కొడుకుకు వశమై పోయిన ఆయన మా ప్రార్థనను పరిహసిస్తాడు. మాధవా ! ఈ స్థితిలో ఏంచేస్తే బావుంటుందని నీవు అనుకొంటున్నావు ? మేము ధర్మార్థాలను కోలుపోకుండా నిలువగల మార్గమేది? పురుషోత్తమా ! ఇటువంటి తీవ్ర సంకట స్థితిలో నీతోగాక మరెవ్వరితో నేను సంప్రదించగలను? కృష్ణా ! నీవు మాకు ఇష్టుడవు. శ్రేయోభిలాషివి. సర్వకార్యాల పరిణామాలు తెలిసినవాడవు. సమస్తవిషయాలలో నిశ్చిత బుద్ధి గలవాడవు. నీవంటి మిత్రుడు మాకు మరెవ్వ రున్నారు?"

ధర్మరాజు మాటలు వినిన జనార్దనుడు ధర్మరాజుతో ఇలా అంటున్నాడు. "నేను మీ ఉభయపక్షాల క్షేమంకోసం కురురాజ సభకు వెళ్తున్నాను. రాజా ! అక్కడకు పోయి మీ ప్రయోజనాలకు దెబ్బ తగలనీయకుండా సంధిని చేయగలిగితే నేనెంతో గొప్ప ఫలితాన్ని సాధించినట్టు, మహాపుణ్యకార్యాన్ని చేసినట్టు కూడా అవుతుంది. సంధి చేయగలిగితే పరస్పర విద్వేషంగల కురు-సృంజయ, పాండవ – ధార్తరాష్ట్రులను

సమస్త భూమండలాన్ని కూడా మృత్యుపాశం నుండి విడిపించగలిగినట్లే." అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. "కృష్ణా ! నీవు కౌరవుల దగ్గరకు వెళ్లాలన్నది నా అభిమతం గాదు. నీవెంత మంచి మాటలు చెప్పినా సుయోధనుడు వాటిని వినడు/ ఆచరించడు. కృష్ణా ! అంతేగాక దుర్యోధనుని అధీనమైన సమస్తరాజలోకం ప్రస్తుతం అక్కడ చేరింది. వారి మధ్యకు నీవు వెళ్ళటం నాకు ఇష్టం లేదు. మాధవా ! దుర్యోధనుని కారణంగా నీకేమైనా ద్రోహం గలిగేటట్లయితే ధనమూ, దివ్యత్వమూ, సుఖమూ, సకల దేవతల ఐశ్వర్యమూ అయినా సరే మాకవసరం లేదు."

శ్రీకృష్ణుడిలా అన్నాడు. "మహారాజా! ధార్తరాష్ట్రుడైన సుయోధనుడు ఎంత దుర్మార్గుడో నాకు తెలుసు. కానీ సంధికి ప్రయత్నిస్తే లోకంలోని ఏ రాజుకు కూడా మనలను తప్పు పట్టే అవకాశ ముండదు. అయినా కూడా సింహం ముందు ఇతర జంతువులు నిలువలేనట్లు, నాకు కోపాన్ని కల్గించిన తర్వాత రాజులందరూ ఒకటై ఎదురు నిలిచినా సరిపోరు. ఒక వేళ కౌరవులు నాతో ఏరీతిగా అయినా అనుచితంగా ప్రవర్తిస్తే వారినందరినీ బూడిదచేస్తాను. ఇది నా నిర్ణయం. కౌంతేయా ! నేను సంధికై అక్కడకు వెళ్ళటం ఏ విధంగానూ నిష్ప్రయోజనం కాదు. కార్యసిద్ధి కలగవచ్చు. కార్యభంగమైనా మనలను ద్వేషెత్తిచూపే అవకాశం అప్పుడు ఇతరుల కుండదు. దానిని ధర్మజుడిలా అన్నాడు. "కృష్ణా ! నీ కేది ఇష్టమైతే అదే చేయి. నీకు శుభం కలగాలి. కౌరవుల దగ్గరకు బయలుదేరు. క్షేమంగా, లాభంగా మరలివచ్చిన నిన్ను నేను చూడగలగాలి. విష్వక్సేనా ! నీవు కౌరవుల దగ్గరకు పోయి భరతవంశానికి ఏర్పడిన సంకట స్థితిని పోగొట్టు. మా అందరి మనస్సులలోని కలతలు తొలగిపోయి మేమంతా మంచిగా కలిసి జీవించేటట్లు చూడు. మాకు సోదరుడవు. మిత్రుడవు. అర్జునునకు నాకూ ఇష్టమైన వాడవు. మంచితనంలో శంకింపదగని వాడవు. ఉభయపక్షాల క్షేమం కోసం వెళ్ళిరా. నీకు శుభం జరగాలి. కృష్ణా ! మమ్ములను ఎరుగుదువు. శత్రువులనూ ఎరుగుదువు. అర్థసిద్ధినీ ఎరుగుదువు. మాటాడటం ఎరుగుదువు. ఏయే మాటల వల్ల మాకు మేలు జరుగుతుందో ఆయా మాటలనే సుయోధనుడికి చెప్పు. కేశవా ! లలితమైనా, కఠినమైనా సరే ధర్మబద్ధమై, హితకరమైన పలుకునే తప్పక మాట్లాడు."

73. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని యుద్ధమునకు పురికొల్పుట.

శ్రీకృష్ణుడిలా అన్నాడు. "సంజయుని మాటలు విన్నాను. నీ మాటలూ విన్నాను. వారి అభిప్రాయం నీ అభిప్రాయం కూడా మొత్తం నేనెరుగుదును. నీబుద్ధి ధర్మాన్ని ఆశ్రయించి ఉంది. వారి బుద్ధి శత్రుత్వాన్ని ఆశ్రయించి ఉంది. యుద్ధం లేకుండా పొందగలిగినదే నీకు బాగా ఇష్టంగా కనిపిస్తోంది. రాజా! ఇది క్షత్రియులకు స్వాభావికమైనదిగాదు. అన్ని ఆశ్రమాల (బ్రహ్మచర్యం మొదలగు ఆశ్రమాలు) లోని వారూ క్షత్రియునకు యాచన తగదనే అంటారు. యుద్ధంలో గెలుపో, మరణమో క్షత్రియునకు బ్రహ్మ నిర్దేశించిన సనాతన స్వధర్మం. క్షత్రియునకు దైన్యం పనికిరాదు. ధర్మరాజా! దైన్యంతో క్షత్రియుడు జీవించటం కష్టం. పరాక్రమించి, శత్రువులను సంహరించు. ధార్తరాష్ట్రులు చాలా లుబ్ధులు. ఎందరో రాజులతో జతకట్టి చాలాకాలంగా కలిసి జీవిస్తున్నారు. స్నేహాన్నీ, బలాన్నీ సమకూర్చుకొని ఉన్నారు. వారు నీతో సంధి చేసుకొనగల రనటానికి ఏ ఉపాయమూ/ అవకాశమూ కనిపించటం లేదు. భీష్మద్రోణ కృపాదులను చూచి వారు తమను బలవంతులుగా భావించుకొంటున్నారు. అటువంటి వారితో నీవు మృదువుగా వ్యవహరించినంత కాలం వారు నీరాజ్యాన్ని అపహరించటానికే ప్రయత్నిస్తారు.

రాజా! ధార్తరాష్ట్రులు దయతోనో, నీమీద జాలితోనో, ధర్మార్థాలను పాలించాలన్న దృష్టితోనో, నీ కోరికను తీరుస్తారని అనుకోవద్దు. కౌరవులు సంధికి అంగీకరించ రనటానికి ఇదొక్క కారణం చాలును. ఏమిటంటే మీరు కపటనాలు ధరించి అరణ్యవాస క్లేశాలను అనుభవించినా వారికి ఏమాత్రం పశ్చాత్తాపం/ సానుభూతి కూడ కలుగలేదు. రాజా! నీవు దానశీలుడవు, కోమలుడవు, నిగ్రహం గలవాడవు, ధర్మతత్పరుడవు, నిష్ఠగలవాడవు. అటువంటి నిన్ను కూడా భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, సాధువులు, బ్రాహ్మణులు, మహారాజు ధృతరాష్ట్రుడూ, పురజనులూ, కురుముఖ్యులు అందరూ చూస్తుండగానే కపట ద్యూతంతో (జూదం) మోసగించారు. తాను చేసిన ఆ పనికి ఆ హీనుడు సిగ్గుపడడు కూడా! అటువంటి స్వభావమూ, ప్రవర్తన గల ఆ సుయోధనుడిపై ప్రేమను ప్రదర్శించవద్దు. ఆ ధార్తరాష్ట్రులు లోకులందరి చేతనూ చంపదగినవారే. ఇక నీవు చంపటంలో విశేషమే ముంది? అనుచితమైన మాటలతో నీ తమ్ములతోబాటు, నిన్ను ఆనాడు బాధించాడు, రెచ్చగొట్టాడు. ఇప్పుడు కూడా తనను పొగడుతుంటే

సోదరులతో "ఇక పాండవులకు తమదంటూ ఏదీ ఈ భూమిపై లేదు. గోత్రాలూ, పేరులూ కూడా వారికి మిగలవు" అంటుంటాడట. చాలాకాలం తర్వాత అయినా వారికి పరాభవం తప్పదు. స్వాభావికాలైన వీరత్వాదిగుణాలు నశించి వారు నాచెంత మరణించగలరు. మాయాద్యూతం జరిగినరోజు దుశ్శాసనుడు ద్రౌపది జుట్టుపట్టుకొని, దిక్కుతోచక ఆమె విలపిస్తున్నా, రాజసభకు ఈడ్చుకొని వచ్చి, భీష్ముడు ద్రోణుడు మొదలయిన పెద్దల సమక్షంలోనే ఆమెను పరిహసించాడు. పదేపదే పాండవులను ఎద్దు (గోవు) అంటూ పిలిచాడు. నీ సోదరులు భీకర పరాక్రమశాలులు అయి కూడా నీవు వారించినందువలన ధర్మపాశానికి కట్టుబడి, ఎటువంటి ప్రతీకారాన్ని చేయలేదు. అంతేకాదు. నీవు అరణ్యాలకు బయలుదేరినప్పుడు కూడా దాయాదుల మధ్య నిలిచి పరుష వాక్యాలు పలుకుతూ తన్ను తాను ప్రశంసించుకొన్నాడు. అక్కడ అతిథులుగా ఉన్నవారంతా నిర్దోషివైన నిన్ను చూచి కంటతడిపెట్టుకొని, ఏడుస్తూ సభలో మిన్నకుండి పోయారు. అక్క డున్న రాజులు గానీ బ్రాహ్మణులు గానీ ఎవ్వరూ ఆ సుయోధనుని అభినందించలేదు. సభాసదులు అందరూ ఆ దుర్యోధనుని నిందిస్తూనే ఉన్నారు. మహారాజా! ఉత్తమవంశస్థులకు మాటపడటం, మరణించటం- రెండింటిలో మరణించటమే మంచిది. మాటపడటం జీవితాన్ని దయనీయం చేస్తుంది. లోకంలోని రాజులంతా సుయోధనుని సిగ్గులేనితనాన్ని నిందించిన ఆ రోజే ఆ సుయోధనుడు మరణించినట్లు.

ఇంతగా పతనమైన చరిత్రగల ఆ సుయోధనుని చంపటం చాలా సామాన్య విషయం. వ్రేళ్ళు నరికిన తర్వాత మొదలుపై ఆధారపడి నిలిచి ఉన్న చెట్టును పడద్రోయటం వంటిది. పాములా కుటిలత్వమూ, దుష్టబుద్ధి కల ఆ సుయోధనుడు నీకే కాక సమస్త ప్రజలకూ చంపదగినవాడే, సంశయించవలసిన అవసరం లేదు. ఆ సుయోధనుని సంహరించు. నీవు ధృతరాష్ట్రునిపై, భీష్మునిపై వినయాన్ని ప్రదర్శించటం అన్ని విధాలా నీకు తగినదే. అది నాకు కూడా నచ్చింది. మహారాజా! దుర్యోధనుని విషయంలో ఇంకా అటు ఇటుగా ఉన్న వారందరి అనుమానాలను నేను వెళ్ళి తొలగిస్తాను. కౌరవ సభలో, రాజుల సమక్షంలో నేను నీలోని సర్వసాధారణ గుణాలను ప్రశంసిస్తాను. ఆ సుయోధనుడిలోని దోషాలను ఎత్తిచూపుతాను. ధర్మార్థసహితమై, హితకరమైన నా మాట విని వివిధజనపదాల పాలకు లందరూ అక్కడ నిన్ను

ధర్మాత్ముడవు, సత్యవాదివి అని గ్రహిస్తారు. దుర్యోధనుడు లోభంతో వ్యవహరించాడని కూడా అర్థం చేసుకొంటారు. అక్కడ చేరిన పురజనులు, జానపదులలో చాతుర్వర్ణ్యాలలోని పెద్దలు, పిల్లల సమక్షంలో సుయోధనుని దోషాలను ఎత్తిచూపుతాను. అక్కడ అందరి సమక్షంలో శాంతినే కోరుకొంటున్న నిన్నెవ్వరూ తప్పుపట్టరు. రాజులు ధృతరాష్ట్రుని, ఆయన కొడుకులనే (కౌరవులనే) నిందిస్తారు. అందరూ దుర్యోధనుని వీడిపోతారు. ఆ విధంగా దుర్యోధనుడు లోకానికి దూరమై నశిస్తే ఆపై నీవు చేయవలసిన దేముంటుంది?

నేను అక్కడకు పోయి మీ కార్యసిద్ధికి భంగం కలగని రీతిగా సంధి చేయటానికి ప్రయత్నిస్తాను. వారి ప్రవర్తనను కూడా గమనిస్తాను. భారతా! వెళ్ళి, యుద్ధానికి సిద్ధపడుతున్న కౌరవుల ప్రవృత్తిని కూడా విని, నీ గెలుపు కోసం మరలి వస్తాను. ఏ విధంగా అయినా శత్రువులతో యుద్ధం తప్పదనే నేను అనుకొంటున్నాను. నాకు కనిపిస్తున్న శకునాలన్నీ కూడా ఆ విధంగానే ఉన్నాయి. జంతువులూ, పక్షులూ భయంకరంగా అరుస్తున్నాయి. సంధ్యాకాలంలో ఏనుగులు, గుర్రాల గుంపులలో భయంకరరూపాలు కనిపిస్తున్నాయి. అగ్ని కూడా భయంకరాలైన రకరకాల రంగులను ధరిస్తున్నాడు. రాజా! మనుష్యలోకాన్ని నశింపజేయాలని భీకరమృత్యువు సన్నిహితమైతే తప్ప ఇటువంటి పరిస్థితి కనిపించదు. ఆయుధాలను, యంత్రాలను, కవచాలను, రథాలను, ఏనుగులను, గుఱ్ఱాలను సిద్ధం చేసుకో. అట్లే ఆ ఏనుగులను, గుఱ్ఱాలను, రథాలను పూన్చి యుద్ధం చేసే సైనికులను యుద్ధానికి సిద్ధం కమ్మను. యుద్ధంకోసం నీవు సంపాదించి పెట్టవలసిన సమస్త వస్తువులను పూర్తిగా సంగ్రహించుకో. పాండవశ్రేష్ఠా! జూదానికి ముందు నీదగ్గర ఉండగా జూదంలో అపహరించిన ఆ సమృద్ధమైన రాజ్యాన్ని దుర్యోధనుడు బ్రతికిఉండగా ఏవిధంగానూ నీకివ్వలేడు."

74. భీమసేనుడు సంధిని గురించి ప్రస్తావించుట.

భీముడిలా అన్నాడు. "మధుసూదనా ! కౌరవుల మధ్య సంధి జరగటానికి అవసరమైన విధంగా మాట్లాడు. యుద్ధ ప్రసక్తి తెచ్చి భయపెట్టవద్దు. దుర్యోధనుడు సహనం లేనివాడు. ఆవేశపరుడు. శ్రేయస్సును వ్యతిరేకించేవాడు. మహామనస్వి. అటువంటి దుర్యోధనునితో పరుషంగా మాట్లాడకు. సున్నితంగానే ప్రవర్తించు.

దుర్యోధనుడు సహజంగానే పాపాత్ముడు. దోపిడీదారుల మనస్సు వంటి మనస్సు గలవాడు. ఐశ్వర్య మదంతో మత్తెక్కిన వాడు. పాండవులపై పగబూనినవాడు. దుర్యోధనుడు దీర్ఘదృష్టి లేనివాడు. నిష్ఠూరాలు పలికే వాడు. పరులను నిందించే వాడు, క్రూరమయిన పరాక్రమం కలవాడు. క్రోధాన్ని త్వరగా విడిచిపెట్టడు. మంచిదారిలో పెట్టటానికి వీలుకానివాడు. పాపాత్ముడు. మొండివాడు. కృష్ణా ! సుయోధనుడు చావ నయినా చస్తాడు కానీ లొంగుబాటు నంగీకరింపడు. తన మతాన్ని విడిచిపెట్టడు. అటువంటి వాడితో సంధి చాలా కష్ట మనుకొంటున్నాను. సుయోధనుడు మిత్రులతో సైతం విపరీతంగా ప్రవర్తిస్తాడు. ధర్మాన్ని వీడినవాడు. అసత్యాలనే ఇష్టపడేవాడు. మిత్రుల మాటలనైనా ఖండించి వారి మనస్సులను గాయపరుస్తాడు. ఆ దుర్యోధనుడు క్రోధానికి లోనయి దుర్మార్గాన్ని ఆశ్రయించి ఉన్నాడు. గడ్డి మాటున దాగిఉన్న పాములాగా స్వాభావికంగానే పాపపు పనులు చేస్తుంటాడు. ఇతరులను హింసిస్తాడు.

దుర్యోధనుని సైన్య మెంతో, నడవడి ఎటువంటిదో, స్వభావ మేమిటో, బల మెంతో, పరాక్రమం ఎటువంటిదో నీకు సర్వవిధాలా తెలుసును. గతంలో మేమూ, కౌరవులూకూడా పుత్రులతో బంధువులతో కలిసి ఇంద్రాది దేవతలవలె కలసి మెలసి ప్రశాంతంగా, ఆనందంగా ఉండేవాళ్ళం. కానీ కృష్ణా! దుర్యోధనుడి క్రోధం కారణంగా ప్రస్తుతం శిశిరఋతువు ముగిసిన తర్వాత గ్రీష్మంలో అరణ్యాలు అగ్నితో దహింపబడినట్లు మండుతున్నాం. మధుసూదన ! ఈ పద్దెనిమిది మంది రాజులు బంధువులను, దాయాదులను, మిత్రులను కూడా నాశనం చేసి ప్రసిద్ధి కెక్కిన వారు. కృష్ణా ! ధర్మవిప్లవ కాలం సంభవించినప్పుడు తేజోవంతులై సమృద్ధి చెందిఉన్న రాక్షసులమధ్య భయంకరమైన కలహం ఏర్పడింది. హైహయవంశస్థుడైన ముదావర్తుడు, నీప వంశస్థుడైన జనమేజయుడు, తాలజంఘవంశస్థుడైన బహులుడు, కృమివంశ శ్రేష్ఠుడు వసువు, సువీర వంశస్థుడైన అజబిందువు, సురాష్ట్రవంశస్థుడు రుషద్గికుడు, బలీహవంశస్థుడు అర్కజుడు, చీనవంశస్థుడు ధౌతమూలకుడు, విదేహ వంశస్థుడు హయగ్రీవుడు, మహౌజస వంశస్థుడు వరయువు, సుందర వంశస్థుడు బాహువు, దీప్తాక్షవంశస్థుడు పురూరవుడు, చేదిమత్స్యదేశాల్లో సహజుడు, ప్రవీర వంశంలో వృషధ్వజుడు, చంద్ర వత్స వంశాల్లో ధారణుడు, ముకుట వంశస్థుడు విగాహనుడు, నందివేగవంశస్థుడు శముడు వీరంతా నరాధములైన క్షత్రియులు. ప్రళయకాలం రాబోతోంది. కాబట్టి

వంశనాశనం కోసం ఆయావంశాలలో పుట్టినవారు.

ఈ రాజులలాగా వంశద్రోహకుడూ, నీచుడూ, పాపాత్ముడూ అయిన దుర్యోధనుడు ద్వాపర యుగాంతంలో కాల ప్రేరితుడై కురువంశనాశనానికై పుట్టినవాడు. కాబట్టి కృష్ణా ! దుర్యోధనునితో మృదువుగా, నెమ్మదిగానే మాట్లాడాలి. ధర్మార్థ సహితంగా హితకరంగా మాట్లాడాలి కానీ తీవ్రంగా మాట్లాడకూడదు. నీ మాటలు అతని కోరికకు అనుగుణంగానే వినిపించాలి. కృష్ణా ! అవసరమయితే మేమందరమూ క్రిందువడి, నమ్రులమై దుర్యోధనుని అనుసరించటానికయినా సిద్ధమే. అంతే కానీ మా వలన భరతవంశం నశించకూడదు. వాసుదేవా ! మాకు కౌరవులతో ఉదాసీనభావమూ, తటస్థస్థితి కలగటానికి అనువుగానే నీవు ప్రయత్నం చేయాలి. అంతే కాని కురువంశానికి అన్యాయం జరిగేటట్లు చూడకూడదు. కృష్ణా ! సోదరులలో సౌహార్దం వెల్లివిరిసేటట్లు, సుయోధనుడు శాంతించేటట్లు ప్రయత్నించవలసినదిగా పెద్దవాడైన భీష్మునకూ, అక్కడున్న సభాసదులకూ కూడా నీవు చెప్పాలి. నేను ఈ విధంగా శాంతికోసం మాట్లాడుతున్నాను: యుధిష్ఠిరుడు కూడా శాంతిని గూర్చియే మాట్లాడుతున్నాడు. అర్జునుడు కూడా యుద్ధాన్ని కోరుకోవటం లేదు. అర్జునుడు ఎంతో దయామయుడు."

75. శ్రీకృష్ణుడు భీమసేనుని ఉత్తేజపరచుట.

ఎప్పుడూ లేనట్లు కొత్తగా, మృదువుగా భీమసేనుడు పలికిన పలుకులు విని మహాబాహువైన శ్రీకృష్ణుడు నవ్వసాగాడు. భీమసేనుని మార్దవాన్ని కొండలోని చిన్నతనంలాగా, నిప్పులోని చల్లదనంలాగా భావించాడు శ్రీకృష్ణుడు. గాలి నిప్పును ఉద్దీపింపజేసినట్లు దయతో నిండిన భీమసేనుని రెచ్చగొడుతూ కృష్ణుడిలా మాట్లాడుతున్నాడు. "భీమసేనా! ఇంతకు ముందెప్పుడయినా నీవు హింస వైపే మొగ్గుచూపుతూ, క్రూరులైన ధార్తరాష్ట్రులను చితక కొట్టాలని కోరుకొంటూ, యుద్ధప్రసక్తినే చేసేవాడివి. రాత్రులలో నీవు నిద్రించటమూ లేదు. మేల్కొని ఉండటమూ లేదు. కునికిపాట్లుపడుతూ పడుకొంటున్నావు. అశాంతితో, కోపంతో ఎప్పుడూ ఘోరంగా మాటాడేవాడివి. భీమా! నిట్టూర్పులు విడుస్తూ, నిప్పులాగా నీకోపంతోనే నీవు తపించిపోయేవాడివి. పొగచూరిన నిప్పులాగా అశాంతికప్పిన మనస్సుతో మెదిలేవాడివి. బరువు నెత్తికెత్తుకొన్న బక్కమనిషిలాగా నిట్టూర్పులు విడుస్తూ ఒంటరిగా పడిఉండేవాడివి.

అందుకే ఆ విషయం తెలియని కొందరు నిన్ను పిచ్చివా డనుకొనేవారు. ఏనుగు చెట్లను కూకటివేళ్ళతో పెల్లగించి, పాదాలతో నలగద్రొక్కినట్టు నీవు వేళ్ళతో నేలను తాటిస్తూ, పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టేవాడివి. నీకు ఈ జనమంటే ఇష్టం లేదు. ఒంటరిగా కాలక్షేపం చేస్తుంటావు. పగలైనా, రాత్రయినా ఎప్పుడూ ఎవ్వరినీ అభినందించవు / ఇష్టపడవు. ఉన్నట్టుండి నవ్వుతావు. ఒంటరిగా ఏడుస్తున్నట్టు కనిపిస్తావు. మోకాళ్ళమధ్య తలపెట్టుకొని, కనులు మూసికొని ఎంతోసేపు అట్లాగే ఉండిపోతావు.

మాటమాటికి బొమముడివేస్తూ రెండు పెదవులనూ కొరికివేస్తూ కనిపిస్తూ ఉండేవాడివి. భీమసేనా! ఇదంతా నీలోని కోపం చేయిస్తున్న పని. పరంతపా! 'సూర్యుడు తెలవారగానే తూర్పు దిక్కున తన తేజస్సును ప్రదర్శిస్తూ, సాయంకాలంలో పడమటి దిక్కును చేరి మేరుపర్వతాన్ని చుట్టివస్తాడు. ఈ నియమాన్ని ఎప్పుడూ తప్పడు, నేను కూడా అలాగే కోపిష్ఠి అయిన దుర్యోధనుడి దగ్గరకుపోయి నా గదతో చంపుతాను' అని సత్యప్రమాణం చేస్తూ సోదరుల మధ్యలో మాటాడేవాడివి. అటువంటి నీ బుద్ధి ఇప్పుడు శాంతిపై నిలవటం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. సరిగా యుద్ధం చేయవలసిన అవసరమేర్పడి నప్పుడు రణాభిలాష గలవారి మనస్సులు కూడా మారిపోయి దానికి భిన్నంగా ఆలోచిస్తాయి. భీమసేనా! నీవు భయపడుతున్నట్లు కనిపిస్తోంది. బహుశః నీవు మేల్కొని ఉన్నప్పుడూ, నిదురిస్తున్నప్పుడూ కూడా విపరీత ఫలితాల నిచ్చే శకునాలనే చూస్తున్నావు. అందుకే కాబోలు శాంతిని/ సంధిని కోరుకొంటున్నావు.

అహో! నపుంసకుడిలాగా నీవు ఇప్పుడు కొంచెంకూడా పౌరుషాన్ని నీలో గమనించలేకపోతున్నావు. ఏదో మోహం నిన్ను కప్పివేసింది. అందుకే నీ మనస్సు కలతపడుతోంది. నీ హృదయం చలిస్తోంది. నీ మనస్సు శిథిలమవుతోంది. నీ తొడలు పట్టేశాయి. అందుకే శాంతిని/ సంధిని కోరుకొంటున్నావు. మానవుని మనస్సు చాలా చంచలమైనది. గాలికి ఊగిసలాడే బూరుగు కాయ తొడిమలాగా మనసు ఊగులాడుతూ ఉంటుంది. గోవులు మానవుల భాష మాటాడినట్టు నీ బుద్ధి వికృతమై ఆలోచిస్తోంది. ఇది పడవలు లేకుండా సముద్రంలో మునిగిన మనుష్యుల్లాగా పాండవుల మనస్సులను ఆలోచనల్లో ముంచివేస్తుంది. భీమసేనా! పర్వతం చలించినట్లున్న ఈ నీప్రవర్తన నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ విధంగా మాట్లాడటం

భీమునికి తగినది కాదు. వీరా! పూర్వం నీవు చేసిన పనులను తలచుకో. ఎటువంటి వంశంలో పుట్టావో గమనించు. విచారించవద్దు. వీరుడవై నిశ్చలంగా నీ పని నీవు చెయ్యి. అరిందమా! ఇప్పుడు నీలో కనిపిస్తున్న బలహీనత నీకు తగినది కాదు. తన పరాక్రమంతో సాధించని దానిని అనుభవించటానికి క్షత్రియుడు ఇష్టపడడు."

76. భీమసేనుని సమాధానము.

శ్రీకృష్ణుడు ఆ విధంగా చెప్పిన తరువాత నిత్యకోపి, అసహనశీలి అయిన భీమసేనుడు మేలుజాతి గుర్రంలాగా మోరత్తి మెల్లగా మాట్లాడ నారంభించాడు. "అచ్యుతా! నేను ఒకటి చెయ్యాలనుకొంటుంటే నీవు మరొకటి అనుకొంటున్నావు. దాశార్హా! ఎప్పటినుండో సన్నిహితంగా మసలుతున్నాం. నా గురించి నీకు బాగా తెలుసు. యుద్ధమంటే నాకెంతో ఇష్టం. నా పరాక్రమం కూడా డంబం మాత్రం కాదు. కాకపోతే తెప్పతోడు లేకుండా లోతైన సరస్సులో ఈదులాడేవాడు దాని లోతు తెలిసికొనలేనట్లు నన్ను నీవు అర్థం చేసికొనటం లేదు. అందుకే తగని మాటలతో నన్ను ఆక్షేపిస్తున్నావు. మాధవా! ఈ భీమసేనుని గురించి తెలిసిన వాడెవడైనా సరే ! ఇప్పుడు నీవు మాటాడుతున్నట్టు నాగురించి అనుచితాలూ, అయోగ్యాలూ అయిన మాటలు పలుకగలడా? కాబట్టి నేను నా పౌరుషాన్ని గురించీ, బలాన్ని గురించీ చెప్పవలసివస్తోంది. మరెవ్వరూ నాకు సాటిరారు. తనను తాను పొగడుకొనటం (తన గురించి తానే చెప్పుకొనటం) సర్వవిధాలా నీచమైన పనియే. కానీ నీవు నన్ను అధిక్షేపించి గాయపరిచావు. కాబట్టి నా బలాన్ని నేనే చెప్పుకొనవలసివస్తోంది.

కృష్ణా! నేలనూ, నింగినీ చూడు, ఈ ప్రజ లందరూ వాటిమధ్యనే జీవిస్తున్నారు. అవి అందరకూ తల్లిదండ్రుల వంటివి. అవి కదలనివి, అంతులేనివి, నిరాధారమైనవి కూడా. ఒకవేళ ఈ నేలా, నింగీ కోపించి శిలలలాగా సంఘర్షించటం ప్రారంభిస్తే నేను చరాచర ప్రాణులతో సహా ఆ రెండింటిని నా చేతులతో నిలువరించగలను. పెద్ద గడియలలాగా కనిపిస్తున్న నా బాహువుల మధ్య నున్న ఎడం గమనించు. వాటి మధ్యకు వచ్చి ప్రాణాలతో బయట పడగల వీరు డెవ్వడూ నా దృష్టికి రాలేదు. హిమవంతుడూ, సముద్రుడూ, వజ్రధారి అయిన ఇంద్రుడూ ముగ్గురూ తమ బలాలను

సమీకరించుకొని వచ్చినా నాకు చిక్కినవాడిని కాపాడలేరు. పాండవులకు ద్రోహంచేసి, యుద్ధానికి ఎత్తి వచ్చిన సమస్త క్షత్రియులనూ క్రింద పడవేసి నా అరికాళ్ళతో భూమిలోనికి త్రొక్కివేయగలను. అచ్యుతా! నేను రాజులను ఓడించి లొంగ దీసుకొన్న విషయం, ఆ పరాక్రమం నీకు తెలియనివి కావి కదా!

జనార్దనా! ఒకవేళ నా పరాక్రమం నీకు తెలియకపోతే భీకరంగా శత్రువులను మట్టుబెట్టే యుద్ధం ప్రారంభమైనప్పుడు ఉదయించే సూర్యతేజస్సు వంటి నా పరాక్రమాన్ని తెలిసికొనగలుగుతావు. గాయాన్ని కెలికినట్టు నీ పరుష వాక్యాలతో నన్ను ఆక్షేపిస్తున్నావా? ఇప్పుడు నా బుద్ధికి తోచినట్టు చెప్తున్నాను. వాస్తవంగా అంతకన్న ఎక్కువగానే నన్ను భావించుకో. భీకరమైన యుద్ధం జరుగుతుంటే అందరినీ నరికివేసే రోజున నేనంటే ఏమిటో చూడగలవు. భీకర యుద్ధంలో క్రోధంతో నేను ఏనుగులనూ, రథికులనూ, ఆశ్వికులనూ, క్షత్రియ శ్రేష్ఠులయిన నరులనూ; ఎగరగొట్టి, క్రిందపడవేసి, ఏరి ఏరి, గొప్పవారినందరినీ సంహరించటం నీవూ, ఈ ప్రజలూ కూడా చూస్తారు. నా ఎముకలసారం తరిగిపోవటమూ లేదు. నా మనస్సు చలించటమూ లేదు. లోకమంతా కోపంతో చుట్టుముట్టినా నాకు భయంలేదు. కానీ మధుసూదనా! నేను శాంతిని గురించి మాట్లాడటం నా మంచితనానికి సంబంధించినది. దయతో సమస్తక్లేశాలనూ సహించగలను. మా కారణంగా భరతవంశవినాశనం జరుగకూడదు."

77. శ్రీకృష్ణుడు భీముని ఓదార్చుట.

శ్రీకృష్ణుడిలా అంటున్నాడు. "నేను నీ ఆలోచనలను తెలిసికోవాలని చనువుతో ఇలా అన్నాను కానీ నిన్ను ఆక్షేపించాలనీ కాదు, నా పాండిత్యాన్ని ప్రదర్శించాలనీ కాదు, కోపంతోనూ కాదు, వ్యాఖ్యానం చెయ్యాలనీ కాదు. నీ గొప్పతనం నేనెరుగుదును. నీ బలం నాకు తెలుసు. నీవు చేసిన ఘనకార్యాలూ నేనెరుగుదును. కాబట్టి నేను నిన్ను కించపరచటం లేదు. పాండునందనా! నీవు నీలోని మంచితనాన్ని ఎంతగా భావిస్తున్నావో దానికన్న వేయిరెట్లు ఎక్కువగా నేను నీలోని మంచితనాన్ని భావిస్తున్నాను. భీమసేనా! సకల రాజన్యులు మన్నన చేసే ఉన్నతవంశంలో పుట్టినవాడవు. నీ బంధువులను, మిత్రులను బట్టి కూడా అంతటి ప్రతిష్ఠకు నీవు తగినవాడవు. వృకోదరా! దైవిక, మానుష ధర్మ స్వరూపం అనిశ్చితం. ప్రజలు దైవ పురుషార్థాల పరిణామాలను

తెలిసికోవా లనుకొంటారు. కానీ సరియైన నిర్ణయానికి రాలేరు. పురుషకారం సంశయాస్పదం. పురుషుని కార్యసిద్ధికి అది కారణ మవుతుంది. అయితే వినాశనానికి కూడా అదే కారణమవుతుంది. కాబట్టి దైవిక ఫలం అనిశ్చితమయినట్లు పౌరుష ఫలం కూడా అనిశ్చితమే. దోషజ్ఞ లయిన దార్శనికులు ఒకవిధంగా భావిస్తే అవి గాలివిసురులాగా మరొకవిధంగా మారిపోతుంటాయి. మానవుడు చక్కగా ఆలోచించి, సరిగా ఆచరించి, న్యాయబద్ధంగా చేసిన పౌరుషకర్మకూడా దైవం చేత వ్యతిరేకం చేయబడుతుంది. / నిష్ఫలం చేయబడుతుంది. భారతా! దైవికమైన కర్మ కూడా ఆసాంతం సిద్ధించేలోగా పౌరుషకారణంగా నాశనమవుతుంది. చలి, వెచ్చదనం, వాన, ఆకలిదప్పులు క్రమంగా వస్త్రాలు, వీవనలు, గొడుగు, అన్నం, నీరు - వీటిచే నివారింపబడుతూనే ఉన్నాయి గదా! ప్రారబ్ధమే కాక పురుషుడు తాను స్వయంగా చేసిన సంచిత కర్మ కూడా కార్యసిద్ధిని కలిగిస్తుంది. దానికి ఎన్నో ఉదాహరణాలు కనిపిస్తాయి. పాండుకుమారా! పౌరుషం విడిచి సాధనాంతరంతో - కేవలం దైవికశక్తితో- ప్రజాజీవనం జరగదు. ఈ ఆలోచనతో కర్మ చేసి తీరవలసినదే. **దైవ పురుషకారాల సమన్వయంతోనే ఫలసిద్ధి కలుగుతుంది.** ఈ విధంగా ఆలోచించి కర్మలు చేసిన వ్యక్తి కార్యం విఫలమై, ఫలం సిద్ధించకపోయినా బాధపడడు. అలాగే ఫలం సిద్ధించినా పొంగిపోడు.

భీమసేనా! ఈ విషయంలో నేను నా నిశ్చితాభిప్రాయాన్ని చెప్పదలచుకొన్నాను. శత్రువులతో యుద్ధానికి సిద్ధపడినపుడు గెలిచి తీరుతామని చెప్పటం తగదు, కుదరదు. నేను మరొకవిషయాన్ని కూడా నీకు చెప్తున్నాను. ఆలోచనలు మారినా, ప్రారబ్ధాన్ని అనుసరించి విపరీత సంఘటనలు జరిగినా తేజస్సును కోలుపోకూడదు. నిరుత్సాహపడి, దుఃఖానికి లోనుకాకూడదు. పాండుకుమారా! రేపు ఉదయం ధృతరాష్ట్రుని దగ్గరకు పోయి మీ అర్థసిద్ధికి భంగం కలగని రీతిగా, మీ ఉభయులకూ సంధి చేయటానికి ప్రయత్నిస్తాను. వారు సంధి చేసికొంటే నాకు అఖండకీర్తి లభిస్తుంది. మీ కోరిక నెరవేరుతుంది. వారికి కూడా అది శ్రేయస్కర మవుతుంది. ఒకవేళ కౌరవులు యుద్ధం జరగాలనే పట్టుబట్టి, నా మాటలు లెక్కచేయకపోతే యుద్ధమే జరుగుతుంది. అది చాలా ఘోరమైన కృత్యం. భీమసేనా! ఈ యుద్ధభారమంతా నీమీదే మోపబడి ఉంది. అర్జునుడు కూడా ఈ భారాన్ని భరిస్తాడు. ఇతరుల

భారమంతా మీ ఇద్దరే మోయవలసి ఉంటుంది. యుద్ధమే జరిగితే నేను అర్జునునకు రథ సారథి నవుతాను. అది అర్జునుని కోరిక, కానీ నేను యుద్ధాన్ని కోరుకోవటం లేదని కాదు. కాబట్టి భీమసేనా! నీవు నిరుత్సాహంగా మాట్లాడినందువలన యుద్ధాన్ని గురించి నీ అభిప్రాయాన్ని మార్చుకొంటున్నా వేమో అని సందేహించి నేను నీలోని తేజస్సును ప్రజ్వలింపజేశాను."

78. అర్జునుని మాటలు.

అర్జునుడిలా అంటున్నాడు. "జనార్దనా నేను చెప్పవలసిన విషయమంతా ధర్మరాజే చెప్పాడు. నీ మాటలు విన్న తరువాత ధృతరాష్ట్రుని లోభం, మా దీనస్థితి చూసి సంధి సాధ్యం కాదని నీవు అనుకొంటున్నట్లు నాకు అనిపిస్తోంది. పురుషుని యొక్క పరాక్రమం నిష్ఫలం అని నీ భావన. పూర్వం చేసుకున్న కర్మలు లేకుండా కేవలం పౌరుషం వల్ల ఫలం లభించదని నీ ఊహ. నీవన్న మాట (నేను యుద్ధంకోరటం లేదు అనేది కాదు) కూడ అటువంటిదే. అయినా శాంతిని సాధించటం నీకు కష్టం కాదు అని నాకు తోస్తోంది. మేమంతా నశించిపోయే యుద్ధమనే సంకటం నీవు అంగీకరిస్తావా? ఏ ఫలితాన్నీ సాధించని మానవుల కర్మలు హింసించేవే అవుతాయి కదా. ప్రభూ! చక్కగా చేసిన ఏ పని అయినా సఫల మవుతుంది. కృష్ణా! శత్రువులతో మాకు సంధి జరగటానికి అనుకూలంగానే నీవు ప్రయత్నం చేయాలి. వీరా! దేవతలకూ, రాక్షసులకూ కూడా బ్రహ్మ శ్రేయోభిలాషి అయినట్లు పాండవులకూ, కౌరవులకూ కూడా నీవే మొదటి మిత్రుడివి. కౌరవులకూ, పాండవులకూ కూడా బాధలు తొలగిపోయేటట్లుగా నీవు ప్రయత్నించు. మాకు మేలు చేయటం నీకు కష్టం కాదని నేను అనుకొంటున్నాను. జనార్దనా! ఈ విధంగా చేసినప్పుడే నీవు చేసినట్లవుతుంది. కాబట్టి ఇదే నీ ప్రధాన కర్తవ్యం. నీవు అక్కడకు వెళ్లితే చాలు, కార్యం సఫలమయినట్టే. వీరా! ఒకవేళ దుర్మార్గు డయిన ఆ దుర్యోధనుని విషయంలో నీవు మరో విధంగా చేయదలచుకొంటే కార్యమంతా అలాగే జరుగుతుంది.

కృష్ణా! కౌరవులతో మాకు సంధి జరగవచ్చు లేదా నీకోరిక మేరకే జరుగవచ్చు. బాగా ఆలోచించి చూస్తే నీ కోరికయే మాకు శిరోధార్యం. ధర్మరాజు సాధించుకొన్న సంపదలను చూచి సహించలేకపోయిన ఆ దుష్టుడు- దుర్యోధనుడు కొడుకులు,

బంధువులతో సహా చంపదగినవాడే. మధుసూదనా! అంతేకాదు. ధర్మబద్ధమైన మరే మార్గంలోనూ మా సంపదలను కొల్లగొట్టటం చేతకాని ఆ క్రూరుడు- దుర్యోధనుడు కపటద్యూతంతో మా సంపదలను అపహరించాడు. క్షత్రియవంశంలో పుట్టి, విల్లు చేతబట్టిన తరువాత ప్రాణాలు పోయేటట్లున్నా సరే, ఎవరయినా పిలిస్తే యుద్ధానికి సిద్ధపడకుండా మరలిపోగలుగుతారా? అధర్మమార్గంలో మమ్ములను ఓడించి, ఆ విధంగా అరణ్యాలకు పంపించిన రోజే సుయోధనుడు నాకోపానికి గురి అయ్యాడు. కృష్ణా! నీ మిత్రులమైన మాకోసం ఏదో చేయాలని నీవు భావించటం ఆశ్చర్యకర మేమీ కాదు. నీవు సాధించి తీరాలని సంకల్పించితే (సాధకమైన) ఆ క్రియ మృదువైనా ఫరవాలేదు, కఠినమైనా ఫరవాలేదు. ఒకవేళ కౌరవ సంహారమే తక్షణ కర్తవ్యమని నీవు భావిస్తే, వెంటనే దానికి తగినరీతిగానే చెయ్యి. అది తప్ప మరే మాటను గురించి ఆలోచింపనవసరం లేదు. నీకు తెలుసుగదా! పాపాత్ముడైన ఆ దుర్యోధనుడు కొలువుకూటంలో ద్రౌపదిని ఎంత కష్టపెట్టాడో! దానిని కూడా మేము సహించి మిన్నకుండి పోయాము. ఆ సుయోధనుడు పాండవులతో చక్కగా ప్రవర్తిస్తాడని నాకనిపించటంలేదు. అలా ఆశ పడటం చవిటినేలలో విత్తనాలను నాటడం వంటిదే. వృష్ణివంశనందనా! పాండవులకు తగిన దనీ, మేలు చేయదగిన దనీ నీవు భావించిన దానినే వెంటనే చేయవలసినది. మా తక్షణ కర్తవ్యంగా దానినే నిర్ణయించు.

79. శ్రీకృష్ణుడు అర్జునునకు ప్రత్యుత్తర మిచ్చుట.

శ్రీకృష్ణుడిలా అన్నాడు – "మహాబాహుడవైన అర్జునా! నీవు చెప్పినట్లు చేయటం సముచితమే. పాండవులూ, కౌరవులూ ఇద్దరూ సుఖంగా ఉండేటట్లు ప్రయత్నం చేస్తాను. అర్జునా ! శాంతి-యుద్ధం రెండింటిలో తగినదానిని భావించి, చేయవలసిన భారాన్ని అంతా నా మీదనే ఉంచావు. అయినా కౌంతేయా! పాలాన్ని దున్ని, పదునుచేసి, నీటితో తడిపినా ఒక్కొక్కసారి వాన లేకపోతే సరిగా ఫలించదు. పొలాన్ని దున్ని పదును చేయటం మొదలయిన పని పురుషప్రయత్నం. అయితే అది దైవికంగా ఎండిపోతోంది. అది స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ప్రాచీనకాలంలోని మహాత్ములంతా లోకహిత సాధనం దైవపురుషార్థాల రెండింటి మీదా ఆధారపడి ఉంటుందని తమ బుద్ధితో నిశ్చయించారు. పురుష ప్రయత్నంగా నేను చేయగలిగినదంతా

చేస్తాను. కానీ దైవికమైన ప్రారబ్ధఫలాన్ని నేను ఏ రీతిగానూ చేయలేను. ఫలితాన్ని కల్పించటం కానీ, మార్పు చేయటం కానీ నావల్లకాదు. దుర్మతి అయిన ఆ సుయోధనుడు ధర్మాన్నీ, లోకాచారాన్నీ విడిచి ప్రవర్తిస్తుంటాడు. ఆ విధంగా ధర్మసదాచారాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ కూడా ఎప్పుడూ బాధపడడు. అటువంటి స్థితిలో కూడా సుయోధనునకు మంత్రులైన శకునీ, కర్ణుడు, సోదరుడైన దుశ్శాసనుడు ఆయనలో చెడు తలపులను పెంచుతూనే ఉంటారు. పార్థా! ఆ సుయోధనుడు తన సహచరులు అందరితో సహా చంపబడే దాకా రాజ్యభాగాన్ని ఇచ్చి, సంధి చేసికొనడు. వినయపూర్వకంగా లొంగిపోయినా రాజ్యాన్ని విడువటానికి యుధిష్ఠిరుడు కూడా అంగీకరించడు. దుర్బుద్ధి అయిన ఆ సుయోధనుడు మనం యాచించినంత మాత్రాన రాజ్యాన్ని ఇవ్వడు.

భారతా! కేవలం అయిదు ఊళ్ళు ఇస్తే చాలునని చెప్పమనీ, వినయపూర్వకంగా సంధిని గురించి ప్రస్తావించ మనీ ధర్మరాజు చెప్పిన మాటలను సుయోధనునితో చెప్పటం మంచిది కాదని నాకనిపిస్తోంది. పాపాత్ముడైన ఆ సుయోధనుడు ఆ మాటలను బొత్తిగా లెక్కచేయడు. మన ప్రతిపాదనను అంగీకరించనందువలన ఆయన చంపదగినవాడని లోకం కూడా భావిస్తుంది. భారతా! చిన్ననాడు ఎప్పుడూ మిమ్ములను అందరనూ బాధించి, దురాత్ముడై, క్రూరుడై మీ రాజ్యాన్ని అపహరించాడు. ధర్మరాజు సంపదలను చూచి సహించలేని ఆ పాపాత్ముడు - సుయోధనుడు చంపదగిన వాడని నాకే కాదు లోకాని కంతకూ అనిపిస్తోంది. పార్థా! నన్ను కూడా మీనుండి దూరం చేయాలని ఆ సుయోధనుడు ఎన్నోసార్లు ప్రయత్నించాడు. అయితే నేను పాపపంకిలమైన ఆ సుయోధనుని కోరికను అంగీకరించలేదు. మహాబాహూ! నేను ధర్మరాజుకు మేలు చేకూర్చటానికే ఇష్టపడుతున్నట్టు ఆ సుయోధనుడు గట్టిగా అభిప్రాయపడుతున్నాడు. ఆ విషయం నీకు కూడా తెలుసు. అర్జునా! ఆ సుయోధనుని అభిప్రాయం, నా నిర్ణయం తెలిసికూడా, తెలియనివాడిలాగా నేడు నన్ను నీవు అనుమానిస్తున్నా వెందుకు? పార్థా! పరమమూ, నిత్యమూ అయిన దేవతల విధాన నిర్ణయం కూడా నీకు తెలుసు. ఇక శత్రువులతో సంధి జరుగుతుందని ఎలా అనుకొంటున్నావు. పాండవా! నా మాటలతో, నా చేతలతో నేను చేయగలిగినదంతా చేస్తాను. కానీ శత్రువులతో సంధి జరుగుతుందని మాత్రం అనుకోవటం లేదు. మీరు సంవత్సరకాలం అజ్ఞాతవాసం ముగించిన తర్వాత, గోహరణ సందర్భంలో, మార్గమధ్యంలో భీష్ముడు మీ రాజ్యాన్ని మీకిమ్మని సుయోధనుని యాచించాడు.

అయినా శుభకరం, హితకరం అయిన ఆ అభ్యర్థనను సుయోధనుడు పట్టించుకొనలేదు. కౌరవులను ఓడించాలని నీవు సంకల్పించి నప్పుడే కౌరవులు ఓడిపోయినట్లు. సుయోధనుడు క్షణకాలమైనా, కొంచెమైనా ఆనందాన్ని పొందలేదు. ధర్మరాజు ఆదేశాన్ని నేను సర్వవిధాల మన్నించాలి. (సంధి విఫలమయితే) దుర్మార్గుడైన ఆ సుయోధనుని పాపకర్మలకు తగిన శిక్షను కూడా ఆలోచించాలి."

80. నకులుని మాటలు.

వెంటనే నకులుడు ఇలా అన్నాడు. "మాధవా! ధర్మవేత్త, వదాన్యుడూ అయిన ధర్మరాజు ఎన్నో విషయాలు చెప్పాడు. వాటిని నీవు విన్నావు కూడా! మాధవా! ధర్మజుని అభిప్రాయాన్ని అనుసరించి భీమసేనుడు కూడా ముందు సంధిని గురించి, ఆ తరువాత తన బాహు విక్రమాన్ని గురించీ ఎంతో చెప్పాడు. వీరా! అదేవిధంగా అర్జునుడు చెప్పిన మాటలను కూడా నీవు విన్నావు. నీ అభిప్రాయాన్ని కూడా ఎన్నోసార్లు ప్రకటించావు. పురుషోత్తమా! ఈ అభిప్రాయాలను అన్నింటినీ ప్రక్కనపెట్టి, శత్రువుల అభిప్రాయాన్ని తెలిసికొని, అప్పటికి ఏది తగినదని నీవు భావిస్తే దానిని చేయవలసినది. కేశవా! వేరు వేరు కారణాలను బట్టి అభిప్రాయాలు కూడా వేరువేరుగా ఉంటాయి. కాబట్టి యోగ్యమూ, సమయోచితమూ అయిన పనినే మనుష్యుడు చేయాలి. పురుష శ్రేష్ఠా! ఒక విధంగా ఆలోచించిన అంశం మరలా మరో రీతిగా మారిపోతుంటుంది. లోకంలో మనుష్యుల బుద్ధి స్థిరమైనది కాదు. కృష్ణా! అరణ్యవాసకాలంలో ఆలోచన ఒకరకంగా ఉండేది. అజ్ఞాతవాసకాలంలో మరొకరకంగా ఉండేది. ఇప్పుడు మేము బయటపడిన తర్వాత ఇంకొకరకంగా ఉంది. వృష్ణినందనా! అప్పుడు మేము అరణ్యాలలో సంచరిస్తున్నప్పుడు మాకు రాజ్యం మీద ఇప్పుడున్నంత ప్రేమ లేదు. జనార్దనా! మేము అరణ్యవాసం నుండి బయటపడినట్లు విని, నీ అనుగ్రహం వలన వీడు అక్షౌహిణుల సేన ఇక్కడకు చేరింది. పురుష శ్రేష్ఠులై, అమేయ బలపౌరుషాలూ గల ఈ వీరులు ఆయుధాలు ధరించి రణభూమిలో నిలిస్తే ఎవడు బెదరక నిలువగలడు? ఈ విషయాన్ని నీవు అనునయ పూర్వకంగా ముందు యుద్ధప్రస్తావనతో భయపెడుతూ, తర్వాత మూర్ఖుడైన ఆ సుయోధనుడు బాధపడని రీతిలో చెప్పు. కేశవా! ధర్మరాజును, భీముని, ఓటమి ఎరుగని అర్జునుని, సహదేవుని, నన్ను, నిన్ను, బలరాముని, సాత్యకిని, విరాటుని, మంత్రిమండలితో కూడిన ద్రుపదుని, ధృష్టద్యుమ్నుని, కాశిరాజును, చేది

రాజు ధృష్టకేతుని రక్తమాంసాలు గల ఏ నరుడు యుద్ధంలో ఎదిరించగలడు? మహాబాహూ! నీవు వెడితే చాలు. ధర్మరాజు కోరిక నెరవేరినట్లే. ఈ విషయంలో సందేహం లేదు. అనఘా! విదురుడు, భీష్ముడు, ద్రోణుడు, బాహ్లీకుడు శ్రేయోదాయకంగా నీవు చెప్పే మాటలను అర్థం చేసికొనగలుగుతారు. వారే మహారాజైన ధృతరాష్ట్రునికీ, పాపబుద్ధియైన సుయోధనునికీ, ఆయన అమాత్యులకూ నచ్చ జెప్పగలరు. జనార్దనా! నీవు వక్తవై, విదురుడు శ్రోతయై అర్థసాధనకు ప్రయత్నిస్తే దారిలో పడని కార్య మేముంటుంది?

81. సహదేవుడు, సాత్యకి యుద్ధమునకు ఇష్టపడుట - యోధులు సమర్థించుట.

సహదేవుడు ఇలా అన్నాడు. "అరిందమా! యుధిష్ఠిరమహారాజు చెప్పిన విషయమంతా సనాతనధర్మం. యుద్ధం జరిగేటట్లే నీవు ప్రయత్నించాలి. దాశార్హా! కౌరవులు పాండవులతో సంధి కోరుకొన్నా, నీవు వారితో యుద్ధం జరిగేటట్లే యోజన చేయాలి. కృష్ణా! నాడు సభలో ఆ పరిస్థితిలో ఉన్న ద్రౌపదిని చూసి, సుయోధనునిపై నాకు కలిగిన కోపం సుయోధనుని చంపకుండా ఎలా శాంతిస్తుంది? కృష్ణా! భీముడు, అర్జునుడు, ధర్మరాజు– ఈ ముగ్గురూ ఒకవేళ ధర్మమార్గాన్ని అనుసరించినా నేను మాత్రం ధర్మాన్ని వదిలి యుద్ధంలో పోరాడాలనే కోరుకొంటున్నాను."

సాత్యకి ఇలా అన్నాడు. "మహాబాహూ! మేధావి అయిన సహదేవుడు చక్కగా చెప్పాడు. (సత్యం చెప్పాడు). ఆ నా కోపం శమించటానికి సుయోధనుని చంపట మొక్కటే ఉపాయం. నీకు గుర్తుండే ఉంటుంది. అరణ్యంలో నార చీరలనూ, జింక చర్మాలనూ ధరించి తిరుగుతున్న పాండవులను చూచి నీకు కూడా కోపం వచ్చింది గదా! కాబట్టి పురుషోత్తమా! యుద్ధంలో కర్కశంగా ప్రవర్తించగల శూరుడైన సహదేవుని మాటయే యోధులందరి అభిప్రాయం." మహామతి అయిన సాత్యకి ఈ విధంగా మాట్లాడగానే అక్కడున్న సమస్త సైనికులూ / యోధులూ భీకరంగా సింహనాదం చేయ నారంభించారు. యుద్ధం చేయాలన్న కోరికతో వచ్చి ఉన్న అక్కడి వీరులంతా 'భళా భళా' అంటూ ఆనందిస్తూ సాత్యకి వచనాలను సర్వాత్మనా ప్రశంసించారు.

82. ద్రౌపది శ్రీకృష్ణునితో తన కష్టమును చెప్పుట.

ధర్మార్థ సహితమూ, హితకరమూ అయిన ధర్మరాజు మాట విని నల్లగా, పొడవుగా, వ్రేలాడుతున్న కురులు గల ద్రౌపది దుఃఖిస్తూ, సహదేవునీ, మహారథుడైన సాత్యకినీ ప్రశంసించి అక్కడే కూర్చుని ఉన్న శ్రీకృష్ణునితో ఇలా అన్నది.

భీమసేనుడు కూడా శాంతంగా ఉండటాన్ని చూచిన ద్రౌపది మనస్సు వికలమయింది. ఆ అభిమానవతి కళ్ళలో నీళ్ళు నింపుకొని ఇలా మాటాడింది. "ధర్మజ్ఞా! మంత్రులతో కలసి ధృతరాష్ట్రుని కొడుకు సుయోధనుడు మోసంతో పాండవులను ఏవిధంగా సుఖాలకు దూరం చేశాడో నీకు తెలిసినదే. జనార్దనా! ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరునితో సంప్రతించటానికి సంజయునితో ఎటువంటి రహస్య సమాలోచన జరిపాడో నీకు తెలిసినదే! దాశార్హా! యుధిష్ఠిరుడు సంజయునితో ఏవిధంగా మాట్లాడాడో అదంతా నీ వెరిగినదే! అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం- ఐదవదిగా మరేదైనా గ్రామం మాకిస్తే చాలునని దుర్యోధనునితో, ఆయన సహచరులతో చెప్పవలసినది. కృష్ణా! దాశార్హా! సంధిని కోరుతున్న శ్రీమంతుడైన యుధిష్ఠిరుడు చెప్పిన ఆ మాటను కూడా సుయోధనుడు లెక్క చేయలేదు. కృష్ణా! అక్కడకు నీవు వెళ్ళిన తర్వాత రాజ్యభాగ మివ్వకుండా సుయోధనుడు సంధికి సమ్మతిస్తే ఎట్టి పరిస్థితులలోనూ సంధికి అంగీకరించవద్దు. మహాబాహూ! సృంజయులతో కలిసిన పాండవులు కోల్పోయిన ఆ భీకరసుయోధనసేనను ఎదిరించటానికి సమర్థులే. మధుసూదనా! కౌరవుల విషయంలో సామం కానీ, దానం కానీ అర్థసిద్ధికి సహకరించవు. కాబట్టి వారి విషయంలో నీవు దయ చూప నవసరం లేదు. కృష్ణా! తన జీవితాన్ని రక్షించుకొన వలసినవాడు సామదానోపాయాలతో శాంతించని శత్రువుల విషయంలో దండనీతినే ఉపయోగించాలి. కాబట్టి అచ్యుతా! ఆ ధార్తరాష్ట్రుల విషయంలో నీవూ, సృంజయులూ, పాండవులూ కలిసి వెంటనే తీవ్రంగా దండాన్నే ప్రయోగించాలి.

కృష్ణ! పాండవులకు తగినపని ఇదే. నీకు కూడా ఇది కీర్తిని కల్గించగలది. ఈపని సమస్త క్షత్రియులకు సైతం సుఖకరమైనది. దాశార్హా! స్వధర్మాన్ని పాటిస్తున్న క్షత్రియుడు, లోభానికి లోనయినవాడు క్షత్రియుడు అయినా కాకపోయినా సరే వాడిని సంహరించాలి. తండ్రీ! బ్రాహ్మణుల విషయంలో తప్పమిగిలిన జాతులకు ఈ నియమం వర్తిస్తుంది. బ్రాహ్మణుడు సర్వ పాపాలలో మునిగిఉన్నా ప్రాణదండనకు

తగడు. ఎందుకంటే బ్రాహ్మణుడు సర్వవర్ణాలకూ గురువు. సమస్తదానాలకు ప్రథమ ప్రతిగ్రహీత అతడే (అనుభవించవలసినవాడు). జనార్దనా! చంపదగనివానిని చంపటమెంత తప్పో, చంపదగిన వానిని చంపకుండుట కూడా అంతే తప్పని ధర్మవేత్తలు భావిస్తారు. కృష్ణా! అటువంటి దోషానికి నీవు పాత్రుడవు కానివిధంగా సేనతో కూడిన సృంజయులతో, యాదవులతో, పాండవులతో కార్యాన్ని నిర్వహించు.

కేశవా! నీమీద ఉన్న చనువుతో చెప్పిన విషయాన్ని మరల చెప్తున్నాను. ఈ లోకంలో నావంటి స్త్రీ మరొకతె ఉండదు. కృష్ణా! నేను యజ్ఞవేది మధ్యనుండి పుట్టిన దానను. ద్రుపదరాజుకుమార్తెను. ధృష్టద్యుమ్నుని సోదరిని. నీకు ప్రియసోదరిని. ఆజమీఢ వంశంలో అడుగుపెట్టినదానను. మహాత్ముడైన పాండురాజుకు కోడలను. ఇంద్ర సమాను లయిన అయిదుగురు పాండవులకు పట్టమహిషిని. కృష్ణా! వీరులైన అయిదుగురు భర్తలద్వారా మహారథు లయిన అయిదుగురు కొడుకులు నాకు పుట్టారు. అభిమన్యుడు నీకు మేనల్లుడు అయినట్లు నా అయిదుగురు కొడుకులు కూడా నీకు మేనల్లుళ్ళ వంటివారే. కేశవా! అటువంటి నన్ను కూడా పాండవులు చూస్తుండగా, నీవు బ్రతికి ఉండగా, జుట్టుపట్టుకొని కొలువులోని కీడ్చి పరాభవించారు. పాండురాజకుమారులు, పాంచాలురు, యాదవులు జీవించి ఉండగానే పాపాత్ము లయిన కౌరవులకు దాసినై కొలువుకూటంలో ఆ రీతిగా నిలవవలసివచ్చింది. పాండవులు కోపాన్ని కోల్పోయి నిశ్చేష్టులై చూస్తుండగా "గోవిందా నన్ను రక్షించు" అని మనసా నిన్నే తలచుకొన్నాను. ఆ సభలో పూజ్యు డయిన మా మామ ధృతరాష్ట్ర మహారాజు "పాంచాలి! వరాలను పొందటానికి తగిన దానినిగా నిన్ను భావిస్తున్నాను. వరం కోరుకో" అని అన్నారు. కేశవా! "పాండవులు రథాలు, ఆయుధాలతో పాటు దాస్యం నుండి విముక్తులు కావాలి" అని నేను కోరితే దాస్యం నుండి విముక్తులయ్యారు (పాండవులు). జనార్దనా! మేము పడిన ఇటువంటి పాట్లు అన్నీ నీకు తెలుసు. పుండరీకాక్షా! నా భర్తలను , దాయాదులను, బంధువులను నీవే కాపాడాలి. కృష్ణా! నేను భీష్మునకూ, ధృతరాష్ట్రునికీ కూడా వరసకు కోడలినే గదా! అయినా కూడా (వారి సన్నిధిలోనే) నేను బలాత్కారంగా దాసిని చేయబడ్డాను. కృష్ణా! ఈ స్థితిలో దుర్యోధనుడు ఇక ఒక్క క్షణం బ్రతికి ఉన్నా, అర్జునుని విల్లు, భీమసేనుని బలం రెండూ చీదరించుకొనదగినవే. కృష్ణ! నేను నీ అనుగ్రహానికి తగినదాన ననిపిస్తే, నామీద నీకు దయ ఉంటే, ధార్తరాష్ట్రులపై పూర్తిగా కోపాన్ని ప్రకటించు."

ఆ విధంగా మాటాడి ద్రౌపది చూడముచ్చటై, ఉంగరాలు తిరిగిన తన కురులను ఎడమచేతితో పట్టుకొని పుండరీకాక్షుడయిన శ్రీకృష్ణుని సమీపించి కళ్ళనీరు గ్రుక్కుకొని ఇలా అన్నది. "పుండరీకాక్ష! శత్రువులతో సంధిని కోరుతున్న నీవు ఏ ప్రయత్నం చేస్తున్నా దుశ్శాసనుడు చేతబట్టిలాగిన ఈ కురులను గుర్తుంచుకోవాలి. కృష్ణా! ఒకవేళ దీనులై భీమార్జునులు సంధినే కోరుతున్నా, నా తండ్రి వృద్ధుడైనా, మహారథులైన తన కొడుకులతో కలిసి యుద్ధం చేస్తాడు. మధుసూదనా! మహాపరాక్రమవంతులైన నా అయిదుగురు కొడుకులూ అభిమన్యుని ముందుంచుకొని కౌరవులతో యుద్ధం చేస్తారు. దుశ్శాసనుని నల్లని భుజం విరిగి, దుమ్ములో పొర్లటాన్ని నేను చూడలేకపోతే నా మనస్సుకి శాంతి ఉండదు. మండుతున్న నిప్పులాంటి నా కోపాన్ని హృదయంలో నిలుపుకొని నిరీక్షిస్తున్న నాకు పదమూడు సంవత్సరాలు గడిచిపోయాయి. మహాబాహువైన భీమసేనుడు ఈనాడు ధర్మాన్ని గురించి మాత్రమే మాటాడుతుంటే (సంధికి సన్నద్ధమవు తుంటే) ఆ మాట లనే బాణాలు తగిలి నా హృదయం బ్రద్దలవుతోంది." అపుడు విశాలనేత్రాలు, గల ద్రౌపది కన్నీరు కంఠస్వరాన్ని అడ్డగించగా కంపిస్తున్న స్వరంతో ఏడవసాగింది. ఆమె కన్నీరు రొమ్ములను తడిపేస్తోంది. మనస్సులోని క్రోధాగ్ని ద్రవీభవించిందన్నట్లు ఆమె వేడి కన్నీరు విడుస్తోంది.

శ్రీకృష్ణుడు ఆమెను అనునయిస్తూ ఇలా అన్నాడు. "ద్రౌపదీ! తొందరలోనే భరతవంశంలోని స్త్రీలు కూడా ఈ విధంగా దుఃఖించటాన్ని చూడగలవు" పిరికిదానా! ఎవరిమీద నీవు కోపాన్ని ప్రదర్శిస్తున్నావో వారంతా దాయాదులను, బంధువులను పోగొట్టుకొని, మిత్రులనూ బలాలనూ కోల్పోయి, ఇలాగే రోదిస్తారు. యుధిష్ఠిరుని ఆవేశంతో విధిలిఖితమైన అదృష్టంతో భీమార్జుననకుల సహదేవులతో కలిసి నేనే నీకిష్టమైన ఆ పని చేస్తాను. ఒకవేళ పోగాలం సమీపించిన ధార్తరాష్ట్రులు నామాట లెక్కచేయకపోతే యుద్ధంలో చచ్చి కుక్కలకు నక్కలకూ ఆహారంగా రణభూమిపై పడిపోతారు. హిమాలయం చలించినా, భూమి నూరు ముక్క లయినా, నక్షత్రాలతో కూడా మిన్ను విరిగి పడినా, నా మాట తప్పిపోదు. ద్రౌపదీ! కన్నీటిని ఆపుకో, సత్యప్రమాణంగా చెపుతున్నాను, శత్రువులను చంపి సంపదలను సమకూర్చుకొన్న నీ భర్తలను త్వరలోనే చూస్తావు."

83. శ్రీకృష్ణుడు హస్తినకు బయలు దేరుట - దారిలో మహర్షులను చూచుట.

అపుడు అర్జునుడిలా అన్నాడు- "ప్రస్తుతం కురు వంశస్థుల కందరకూ అందరికన్నా గొప్ప మిత్రుడవు నీవే. ఉభయపక్షాలకూ ఎప్పుడూ ప్రియబాంధవుడవు నీవే. కేశవా! పాండవులతో సహా ధార్తరాష్ట్రులకు శ్రేయస్సును కల్గించటం నీ కర్తవ్యం. ఉభయపక్షాలకూ సంధి చేయటానికి కూడా నీవే సమర్థుడవు. శత్రుసంహారకా! శ్రీకృష్ణా! నీవు ఇక్కడనుండి వెళ్ళి అసహనశీలు డయిన ఆ మా సోదరునితో సంధికి అనువయిన మాటలను చెప్పు. ఒకవేళ ఆ మూర్ఖుడు- సుయోధనుడు- సంతాపనాశకమై, హితకరమై, శుభకరమైన నీ మాటను స్వీకరించకపోతే కాలునికి లొంగిపోతాడు/ బలి అవుతాడు." శ్రీ కృష్ణుడిలా అన్నాడు. "(అర్జునా!) ధర్మబద్ధమై మనకూ, కౌరవులకూ కూడా హితకరమూ, కళ్యాణకరమూ అయిన దానిని సాధించాలన్న కోరికతోనే నేను ధృతరాష్ట్రుని దగ్గరకు పోతున్నాను". ఆ తరువాత చీకట్లు తొలగి నిర్మలాకాశంలో సూర్యుడు ఉదయించాడు. లేప్రొద్దుకిరణాలు అంతటా వ్యాపించే వేళలో, కార్తికమాసంలో, రేవతీ నక్షత్రంలో, మైత్రముహూర్తంలో శ్రీకృష్ణుడు ప్రయాణమయ్యాడు. అది శరత్-హేమంతాల సంధికాలం. అంతటా పొలాలు విస్తరించిన పైరుతో సుఖకరంగా ఉన్నాయి.

శ్రీకృష్ణుడు తెలవారగనే మహర్షుల మంగళపాఠాలను వినే ఇంద్రుడిలాగా ఉత్తమబ్రాహ్మణుల ద్వారా మంగళకరాలయిన పుణ్యాహవచనాలను వింటూ స్నానం చేశాడు. పవిత్రుడై వస్త్రాభరణాల నలంకరించుకొని సూర్యోపాసన, అగ్న్యుపాసన ముగించాడు. అక్కడికి ప్రాతఃకరణీయం ముగిసింది. ఆ తర్వాత గోపృష్ఠాన్ని స్పృశించి, బ్రాహ్మణులకు నమస్కరించాడు. అగ్నికి ప్రదక్షిణం చేశాడు. ఎదుట నిలిచిన శుభశకునాలను గమనించాడు. ఆపై యుధిష్ఠిరుని మాటలను మననం చేసికొంటూ తనదగ్గరగా కూర్చొనిఉన్న సాత్యకితో ఇలా అన్నాడు. "శంఖాన్ని, చక్రాన్ని, గదను, అమ్ముల పొదులను, శక్తులను, మిగిలిన సమస్తాయుధాలను రథంపైకి ఎక్కించు. దుర్యోధనుడు, కర్ణుడు, శకుని దుర్మార్గులు. శత్రువు బలహీను డయినా సరే బలవంతులు వారిని తేలికగా తీసికొనకూడదు." అపుడు చక్రగదాధారి అయిన శ్రీకృష్ణుని అభిప్రాయాన్ని గ్రహించిన అనుచరులు రథాన్ని సన్నద్ధం చేయటానికి బయలుదేరారు. ఆ రథం ప్రళయకాలాగ్నిలాగా ప్రకాశిస్తోంది. విమానంలా వేగంగా పయనించగలది. సూర్యచంద్రులవలె ప్రకాశించే చక్రాలతో అలంకరింపబడినది.

అర్ధచంద్రులు, చంద్రుడు, చేపలు, మృగాలు, పక్షులు, పుష్పాలవంటి ఆకృతులతో అంతటా మణిరత్నాలతో ప్రకాశిస్తున్నది ఆ రథం. అది మధ్యాహ్నకాలంలోని సూర్యుడిలా ప్రకాశిస్తోంది. విశాలమైనది, చూడముచ్చటైనది కూడా. రథమంతా మణులు, బంగారంతో విచిత్రంగా ఉంది. ధ్వజం, మంచి పతాకం రథానికి అమర్చిఉన్నాయి. ఆ రథంలో అవసరమైన సామగ్రి అంతా చక్కగా అమర్చబడింది. పులిచర్మం పరచబడింది. అది శత్రువులకు భరించరానిది. వారి కీర్తికి వినాశాన్ని కల్గించగలది. యదువంశస్థుల ఆనందాన్ని పెంపొందింపజేసేది. శ్రీకృష్ణుని అనుచరులు శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం అనే పేర్లుగలిగిన గుఱ్ఱాలను స్నానం చేయించి, సమస్తాభరణాలతో అలంకరించి రథానికి పూన్చారు. శ్రీకృష్ణుని మహత్వాన్ని మరింతగా పెంచే గరుడధ్వజాన్ని కూడా రథంపై అమర్చారు. ప్రయాణ సమయంలో దాని రెపరెపలు వినసొంపుగా ఉంటాయి. ఆ రథం మేరుపర్వతశిఖరంలాగా ప్రకాశిస్తున్నది. మేఘాలతో, దుందుభులతో సమానమైన ధ్వని గల ఆ రథం కామగమనం గల విమానం వంటిది. శ్రీకృష్ణుడు ఆ రథాన్ని ఎక్కాడు. అటు తరువాత సాత్యకిని కూడా ఎక్కించుకొని, రథఘోషతో, భూమ్యాకాశాలను ధ్వనింపజేస్తూ శ్రీకృష్ణుడు బయలు దేరాడు.

ఆ క్షణంలోనే ఆకాశాన్ని కప్పిఉన్న మేఘాలు కనుమరుగయ్యాయి. మంగళకరంగా గాలి అనుకూలంగా ప్రసరించింది. దుమ్మురేగటం ఆగిపోయింది. శుభసూచనగా మృగాలు, పక్షులు ప్రదక్షిణంగానూ, అనుకూలంగానూ సంచరిస్తూ ప్రయాణవేళలో శ్రీకృష్ణుని అనుసరించాయి. బెగ్గురుపక్షులు, వడ్రంగి పిట్టలు, హంసలు శుభప్రదాలయిన శబ్దాలు చేస్తూ అన్ని వైపులా శ్రీకృష్ణుని వెంట పయనింపసాగాయి. మంత్ర పవిత్రాలయిన ఆహుతులతో హోమం చేయబడుతున్న అగ్ని, పొగలేకుండా, ప్రదక్షిణముఖంగా ప్రజ్వలింపసాగాడు. వసిష్ఠుడు, వామదేవుడు, భూరిద్యుమ్నుడు, గయుడు, క్రతుడు, శుక్రుడు, నారదుడు, వాల్మీకి, మరుత్తుడు, కుశికుడు, భృగుడు మొదలయిన దేవర్షులు, బ్రహ్మర్షులూ ఒక్కటై శ్రీకృష్ణునకు ప్రదక్షిణంగా నిలిచారు. ఈవిధంగా మహాత్ములయిన మహర్షులచేత, సాధువులచేత అర్చించబడి, శ్రీకృష్ణుడు కౌరవుల నివాసమైన హస్తినకు బయలుదేరాడు. యుధిష్ఠిరుడు, భీమార్జునులు, నకులసహదేవులూ, చేకితానుడు, విక్రాంతుడు, చేదిభూపాలుడు ధృష్టకేతువూ, ద్రుపదుడు, కాశిరాజు, మహారథుడైన శిఖండి, ధృష్టద్యుమ్నుడు, కుమారులతో కేకయులతో సహా విరాటుడు మొదలయిన క్షత్రియులు కార్యసిద్ధికై శ్రీకృష్ణుని వెంట నడిచారు. ఈ విధంగా

శ్రీకృష్ణుని అనుసరించిన ధర్మరాజు రాజులందరి సమక్షంలో శ్రీకృష్ణునితో ఇలా పలికాడు. "శ్రీకృష్ణుడు సనాతనుడైన పరమేశ్వరుడు, దేవతలకు కూడా దేవత, సర్వప్రాణులకూ రక్షకుడు, సర్వప్రాణులలోనూ ప్రకాశించేవాడు, ధర్మవేత్త, ధీరుడు, ప్రాజ్ఞుడును. లోభరహితుడై, స్థిరబుద్ధికలిగిన ఆయన కామంవలన గానీ, భయంవలన గానీ, లోభం వలన గానీ మరే విధమయిన ప్రయోజనం వలన కానీ అన్యాయమార్గాన్ని అనుసరించడు." సర్వగుణసంపన్నుడై, శ్రీవత్సలాంఛనుడైన ఆ శ్రీకృష్ణుని కౌగిలించి యుధిష్ఠిరుడు ఈ విధంగా సందేశింపనారంభించాడు.

"శత్రుసంహారా! శ్రీకృష్ణా! అబలయైకూడా చిన్ననాటి నుండి మమ్ములను పెంచి పోషించినది మా తల్లి. ఉపవాసతపస్సులనే స్వభావంగా స్వీకరించి ఎప్పుడూ శుభాన్నే కాంక్షిస్తూ, దేవతాతిథిపూజలలోనూ, గురుసేవలలోనూ ఆసక్తితో పుత్రులపై ప్రేమనూ, వాత్సల్యాన్నీ ప్రదర్శించేది మాకిష్టమయిన మాతల్లి కుంతి. ఆమె సుయోధనునకు భయపడి సముద్రంలో మునిగిపోయే వానిని పడవ రక్షించినట్లు, మమ్ములను మృత్యుసంకటం నుండి రక్షించింది. దుఃఖాలను పొందరానిదైనను, మా కొరకు నిరంతరంగా దుఃఖాలను అనుభవించిన మా తల్లిని కలిసి, క్షేమసమాచారాన్ని అడుగు. నీవు మా సమాచారాన్ని ఆమెకు తెలుపుతూ, నమస్కరించి, పుత్రశోకంతో బాధపడుతున్న ఆమెను మరీ మరీ ఊరడించు. శత్రుదమనా! పెళ్ళి అయిన నాటినుండి మెట్టినింట అడుగుపెట్టి, ఎన్నో బాధలను అనుభవించింది. ఇప్పటికీ అక్కడ ఆమె కష్టాలనే అనుభవిస్తోంది. శ్రీకృష్ణా! మా కష్టాలు తొలగిపోయి, దుఃఖంతో కుమిలిపోతున్న మాతల్లికి నేను సుఖాన్ని కల్పించగలరోజు ఎప్పుడయినా వస్తుందంటావా? మేము వనవాసానికి బయలుదేరినప్పుడు పుత్రప్రేమతో కలతపడుతూ, భయంతో వీడుస్తూ, దీనంగా ఆమె మా వెంట పడింది. అయినా ఆమెను వదలి మేము అరణ్యాలకు వచ్చాం. శ్రీకృష్ణా! మనిషి దుఃఖాలకు భయపడి చనిపోతా డనటం నిశ్చితం కాదు. కాబట్టి ఆమె జీవించియే ఉండవచ్చు. పుత్రశోకంతో పీడింపబడుతూనే ఉండవచ్చు.

శ్రీకృష్ణా! నీవు మా తల్లికి నమస్కరించి, నా మాటగా ధృతరాష్ట్రునకు, సుయోధనునకు, వయోవృద్ధులయిన రాజులకు, భీష్మునకు, ద్రోణునకు, కృపునకు, బాహ్లికమహారాజుకు, నమస్కారాలు తెలుపు. అశ్వత్థామకు, సోమదత్తునకు, భరతవంశస్థులందరకూ, కౌరవ మంత్రాంగ రక్షకుడూ, మర్మవేత్త, మహామేధావి, అగాధబుద్ధి అయిన విదురునకు నమస్కారాలు తెలుపు." ఈ విధంగా అక్కడ

రాజుల సమక్షంలో శ్రీకృష్ణునితో పలికి, ఆయనకు నమస్కరించి, అనుమతి తీసికొని యుధిష్ఠిరుడు వెనుదిరిగాడు.

అయితే అర్జునుడు వెనుకకు మరలుతూనే తన చెలికాడైన శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "గోవిందా! మేము రహస్య సమాలోచన జరిపినప్పుడు అర్ధరాజ్యాన్ని ఇస్తేనే సంధి చేసికోవాలని నిశ్చయించుకొన్నాము. ఇది రాజులందరకూ తెలుసు. మహాబాహూ! దుర్యోధనుడు లోభాన్ని వీడి, అనాదరభావాన్ని వదలి, సత్కారపూర్వకంగా అర్ధరాజ్యాన్ని ఇస్తే అది నాకు నచ్చుతుంది. కౌరవులు భయపడవలసిన అవసరమూ తప్పుతుంది. జనార్దనా! ఉపాయప్రయోగం తెలియని దుర్యోధనుడు దీనికి భిన్నంగా వ్యవహరిస్తే క్షత్రియుల నందరమూ అంతం చేస్తాను. ఇది నిశ్చయం." వైశంపాయనుడిలా అన్నాడు - అర్జునుడు ఇలా అనగానే భీమసేనుడు పరమానందం పొందాడు. క్రోధావేశంతో మాటిమాటికీ ఊగిపోసాగాడు. భీమసేనుడు కంపించిపోతూ పెద్దగా సింహనాదాలు చేశాడు. అర్జునుని మాటలు విన్న భీముని మనస్సు ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఆ భీముని సింహనాదాన్ని విని, ధనుర్ధరులందరూ వణికిపోయారు. వారి వాహనాలు మలమూత్రాలను విసర్జించాయి. కేశవునితో ఇలా మాటాడి, తన నిర్ణయాన్ని కూడా చెప్పి, భీమసేనుడు జనార్దనుని కౌగిలించుకుని, ఆయన అనుమతి తీసికొని వెనుదిరిగాడు. అక్కడున్న రాజులందరూ మరలిపోగానే శైబ్య, సుగ్రీవ వాహనుడయి శ్రీకృష్ణుడు ఆనందంగా ముందుకు సాగాడు. దారుకుడు నడుపుతున్న ఆ శ్రీకృష్ణుని గుఱ్ఱాలు దారినంతా ఆచమనం చేస్తున్నట్టు, ఆకాశాన్ని క్రింగుతున్నట్టు కనిపించాయి.

అటు తరువాత మహాబాహువైన శ్రీకృష్ణుడు బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తూ బాటకిరువైపులా నిలిచి ఉన్న మునులను గమనించాడు. ఆ జనార్దనుడు వెంటనే రథం నుండి దిగి ఇరువైపులా నిలిచి ఉన్న మహర్షులకు నమస్కరించి, వారిని గౌరవిస్తూ ఇలా అన్నాడు. "సమస్తలోకాలూ క్షేమంగా ఉన్నాయా? ధర్మానుష్ఠానం చక్కగా జరుగుతోందా? క్షత్రియులు మొదలుగా గల మూడు వర్ణాలవారూ బ్రాహ్మణుల అనుశాసనంలో ఉంటున్నారా? పితృ దేవ, అతిథిపూజలు చక్కగా జరుగుతున్నవా?" ఆ మహర్షులను పూజించి మధుసూదనుడు "ఆర్యులారా! మీరు ఎక్కడనుండి ఇటు వస్తున్నారు? మీ పని ఏది? మీకై నేను చేయగలిగిన దేది? ఏ పని మీద ఈ భూతలానికి అరుదెంచినారు" అని అడిగాడు.

అప్పుడు దేవదానవ పతులకు మిత్రుడైన పరశురాముడు శ్రీకృష్ణుని సమీపించి, ఆయనను కౌగిలించి ఇలా అన్నాడు. "మహామతీ! కేశవా! పురాతన మయిన దేవాసుర సంగ్రామాన్ని ప్రత్యక్షంగా చూచిన పుణ్యాత్ములయిన దేవర్షులు, బహుశాస్త్రపండితు లయిన బ్రహ్మర్షులు, నిన్ను మిక్కిలిగా మన్నించు రాజర్షులు, అన్నిదిక్కుల నుండి గుమిగూడి చేరిన రాజులను, సభాసదులను సత్య స్వరూపుడ వయిన నిన్ను చూడగోరుతున్నారు. పరమ దర్శనీయమయిన ఈ ఘటనను చూడగోరి మేము హస్తినకు బయలుదేరాము. కౌరవ సభామధ్యంలో, రాజుల సమక్షంలో, నీవు చెప్పబోయే ధర్మార్థసహిత వచనాలను వినగోరుతున్నాము. యాదవశార్దూలా! ఆ కౌరవ సభలో భీష్మద్రోణాదులు, మహామతి అయిన విదురుడు, నీవు కూడా కూడి ఉంటారు గదా!. మాధవా! నీవు, భీష్మాదులు పలుకబోయే సత్య, హిత వచనాలను వినగోరుతున్నాము. ఇప్పుడు మేము నీ దగ్గరనుండి సెలవు తీసికొంటున్నాము. మరల నిన్ను చూడగలము. నీ ప్రయాణం నిర్విఘ్నంగా సాగనీ! సభలో దివ్యమైన ఆసనంలో బలతేజస్సంపన్నుడవై కూర్చొని ఉన్న నిన్ను చూస్తాము."

84. శ్రీకృష్ణుడు హస్తినకు చేరి విశ్రమించుట.

దేవకీసుతుడు ప్రయాణమైన సమయంలో శత్రువీరులను పీడించగల మహారథులు, మహాబాహువులు పదిమందీ, సైనికులు వేయిమందీ, ఆశ్వికులు వేయిమందీ, ఆయుధాలు ధరించి అనుసరించారు. విస్తారమైన భోజన సామగ్రితో, వందల కొలదీ పరిచారకులు కూడా వెంటవచ్చారు. ఆ మహాత్ముని ప్రయాణకాలంలో ఎదురైన శుభాశుభశకునాలను చెప్తాను విను. మేఘాలు లేకపోయినా, ఆకాశంలో మెరుపుతో కూడిన పిడుగుపాటు చప్పుడు వినిపించింది. వెంటనే మేఘాలు లేకపోయినా, పర్జన్యుడు వాన కురిపించాడు. తూర్పుదిక్కుగా ప్రవహిస్తున్న సింధువు మొదలయిన ఏడు నదులు ప్రవాహదిశను మార్చుకొని పడమటివైపునకు ప్రవహించాయి. దిక్కులన్నీ విపరీతమై దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అంతటా మంటలు చెలరేగాయి. భూమి కంపించింది. వందలకొలది జలాశయాలు, కలశాలు నీటిని క్రుమ్మరించసాగాయి. విశ్వమంతా చీకటి క్రమ్మింది. ధూళితో దిక్కులు, మూలలూ తెలియకుండా పోయాయి. పెద్దపెద్ద ధ్వనులు వినిపించసాగాయి. ఆకాశంలో మానవాకృతులు కనిపిస్తున్నాయి. అన్ని ప్రదేశాలలో అది ఆశ్చర్యకర మయింది. నైరుతి వైపునుండి వీచినగాలి హస్తినాపురాన్ని

కలచివేసింది. అది కుప్పలు కుప్పలుగా చెట్లను కూల్చివేసింది. పరుషంగా పిడుగుపాటు చప్పుడు వినిపించింది. శ్రీకృష్ణుడు సంచరిస్తున్న ప్రాంతంలో మాత్రం గాలి సుఖకరంగా ఉన్నది. అన్ని శకునాలూ ప్రదక్షిణం దిశగా వీర్చడుతూ అనుకూలంగా నిలిచాయి. పుష్పవృష్టి కురిసింది. మిక్కిలిగా తామరలు కురిశాయి. బాట దర్భలు, ముళ్ళు లేనిదై సమతలమై సుఖకరంగా ఉన్నది. వేలకొలదిగ బ్రాహ్మణులు అక్కడక్కడ నిలిచి శ్రీకృష్ణుని స్తుతిస్తున్నారు. మధుపర్కాలతో పూజిస్తున్నారు. శ్రీకృష్ణుడు వారికి ధనాన్ని ఇచ్చాడు. స్త్రీలు మార్గంలో గుమిగూడి సర్వభూత హితాన్ని కోరే ఆ మహాత్మునిపై పరిమళభరితమైన వనపుష్పాలను చల్లారు. ఆ శ్రీకృష్ణుడు ధర్మకార్యాలకు ఉపయోగపడే సర్వసస్యాలతో నిండిన పంటపొలాలను చూస్తూ హాయిగా ప్రయాణించాడు. పశుసంపదగలిగి రమణీయమై మనస్సున కానందాన్ని కల్గిస్తున్న అనేక గ్రామాలను, నగరాలను, వివిధరాష్ట్రాలనూ గమనిస్తూ ముందుకు సాగారు.

ఉపప్లావ్యం నుండి వస్తున్న శ్రీకృష్ణుని చూడాలన్న కోరికతో నగరవాసులంతా గుమిగూడి దారిలో నిలిచారు. వీరు భరతవంశస్థుల రక్షణలో, ఎల్లప్పుడూ ఆనందంగా జీవిస్తున్నవారు. మంచివారు. శత్రుసేనలను చూచి భయపడనవసరం లేనివారు. బాధలంటే తెలియనివారు. వారంతా మండుతున్న అగ్నివలె తేజోమూర్తి అయి, తమ దేశానికి అతిథిగా వస్తున్న, పూజనీయుడైన ఆ శ్రీకృష్ణుని పూజించారు. ఆ శ్రీకృష్ణుడు హస్తినను సమీపించి, సంధ్యాకాలంలో రథం నుండి దిగి, గుఱ్ఱాలను విప్పమని ఆదేశించి యథావిధిగా శుచియై సంధ్యోపాసన చేశాడు. దారుకుడు కూడా గుర్రాలను విడిపించి, యథావిధిగా వాటికి పరిచర్యలు చేసి కళ్ళెం మొదలయిన వాటిని ఊడదీసి వాటిని వదిలివేశాడు. శ్రీకృష్ణుడు సంధ్యావందనాది కార్యాలను ముగించి "యుధిష్ఠిరుని కార్యసిద్ధికై ఈ రాత్రి ఇక్కడే విడిది చేద్దామని" పలికాడు. శ్రీకృష్ణుని అభిప్రాయాన్ని గమనించి, సేవకులు అక్కడే శిబిరం ఏర్పాటు చేశారు. క్షణకాలంలో మధురమైన అన్నపానాదులను సమకూర్చారు. రాజా! ఆ గ్రామంలోని ప్రముఖ బ్రాహ్మణులందరూ పూజ్యులు, కులీనులు, బిడియపడేవారు, బ్రాహ్మణోచితమైన వృత్తి నాశ్రయించినవారు. వారు **అరిందముడూ**, మహాత్ముడూ అయిన శ్రీకృష్ణుని సమీపించి ఆశీర్వాదాలతో మంగళ పాఠాలతో యథోచితంగా ఆయనను అర్చించారు. సర్వలోక పూజితుడైన శ్రీకృష్ణుని పూజించి ఆ బ్రాహ్మణులు రత్నసంపన్నాలైన తమ నివాసగృహాలను ఆ మహాత్మునకు విడిదిగా నివేదించారు. అప్పుడు శ్రీకృష్ణుడు

వారి మాటలే చాలునని వారితో అని, వారి ఆనందంకోసం వారి ఇండ్లకుపోయి, మరలా వారితో కూడా తిరిగి వచ్చాడు. అక్కడ శ్రీకృష్ణుడు ఆ బ్రాహ్మణులకు మృష్టాన్నాలను పెట్టి, వారితో కూడా తానూ భుజించి, ఆ రాత్రి సుఖంగా గడిపాడు.

85. శ్రీకృష్ణుని మార్గమున విశ్రాంతి స్థానముల నేర్పరచుట.

దూతల ద్వారా శ్రీకృష్ణుని రాకను తెలిసికొన్న ధృతరాష్ట్రుడు పులకించిపోయి, మహాబాహువయిన భీష్ముని, ద్రోణుని, సంజయుని, ధీమంతుడైన విదురుని యథోచితంగా సత్కరించి, మంత్రి సహితుడైన దుర్యోధనునితో ఇలా అన్నాడు. "కురునందనా! అద్భుతమై, మహాశ్చర్యాన్ని కల్గించే విషయం వినిపిస్తోంది. ఇంటింటా స్త్రీలూ, బాలురూ, వృద్ధులూ కూడా దానిని గురించి మాటాడుతున్నారు. నగరవాసులు, నగరానికై కార్యాంతరంతో వచ్చినవారుకూడా ఆదరపూర్వకంగా ఆ విషయాన్ని గురించియే చెప్తున్నారు. సభలలోనూ, రచ్చబండల మీదనూ ఆ విషయాన్ని గురించే విడివిడిగా చర్చలు జరుగుతున్నాయి. పరాక్రమశాలి అయిన శ్రీకృష్ణుడు పాండవుల పనిపై మన దగ్గరకు వస్తున్నాడు. ఆ మధుసూదనుడు సర్వవిధాలా పూజ్యుడూ, మనం సత్కరింపవలసిన వాడునూ. లోకుల జీవనయాత్ర ఆ మాధవుని అధీనంలోనిది. ప్రాణుల సంరక్షకుడు ఆయనయే. ధైర్యం, పరాక్రమం, ప్రజ్ఞ, తేజస్సు గలవాడు ఆ శ్రీకృష్ణుడు.

ఆయన సనాతన ధర్మస్వరూపుడు. నరశ్రేష్ఠుడైన ఆయన పూజింపదగినవాడు. ఆయనను సత్కరిస్తే మనకు సుఖం కలుగుతుంది. పూజింపకపోతే కష్టం కలుగుతుంది. శత్రుసంహర్త అయిన శ్రీకృష్ణుడు మన సత్కారాలతో సంతోషపడితే ఆయన ద్వారా సమస్త రాజుల విషయంలో మన కోరికలను సఫలం చేసికొనవచ్చు. ఆయన పూజకై నేడే ఏర్పాట్లు చేయి. మార్గంలో విశ్రాంతి స్థానాలను సమకూర్చు. అక్కడ సకల సౌకర్యాలనూ కల్పించు. మహాబాహుడవైన గాంధారీకుమారా! ఆయనకు నీపై ప్రేమ కలగటానికి తగినవిధంగా ఏర్పాట్లన్నీ చేయి. భీష్మా! ఈ విషయంలో నీ అభిప్రాయమేమిటో?"

అప్పుడు భీష్ముడు మొదలైనవారంతా ధృతరాష్ట్రమహారాజు మాటను మన్నించి "చాలా బాగుంది" అని పలికారు. వారందరి ఆమోదాన్ని గ్రహించిన తర్వాత దుర్యోధనుడు అందమయిన సభామంటపాలనూ, విశ్రాంతి స్థానాలనూ నిర్మించవలసినదిగా

ఆజ్ఞాపించాడు. ఆపై శిల్పులు అనేకరమణీయ ప్రదేశాలలో విడివిడిగా సమస్తరత్న సంపన్నాలయిన సభలను ఎన్నింటినో నిర్మించారు. వివిధ సౌకర్యాలతో కూడిన విచిత్రాలయిన ఆసనాలనూ, స్త్రీలనూ, పరిమళద్రవ్యాలనూ, ఆభరణాలనూ, సన్నని వస్త్రాలనూ, గుణవంతాలయిన అన్నపానాలనూ, రకరకాల భోజ్యాలనూ, సుగంధభరితమైన పుష్పమాలలను ఆయా విశ్రాంతి స్థానాలలో ఏర్పాటు చేశాడు సుయోధనుడు. ప్రత్యేకించి వృకస్థలగ్రామంలో, నివాసార్థం దుర్యోధనుడు మనోహరమైన విశ్రాంతి మంటపాన్ని నిర్మించాడు. మానవులకు దుర్లభమై దేవతావాసయోగ్యంగా కనపడే ఈ వ్యవస్థను పూర్తిచేయించి దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తెలియజేశాడు. అయితే దాశార్హుడైన శ్రీకృష్ణుడు ఆ సభలను కానీ, అక్కడ కల్పించిన వివిధ రత్నాలను కానీ కనీసం చూడనైనా చూడకుండా కౌరవ నివాసస్థానమైన హస్తినవైపు సాగిపోయాడు.

86. ధృతరాష్ట్రుడు శ్రీ కృష్ణభగవానుని స్వాగతించుట.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "విదురా ! శ్రీ కృష్ణుడు ఉపప్లవ్యం నుండి ఇక్కడకు బయలు దేరాడు. ఈ రోజు వృకస్థలంలో ఉన్నాడు. రేపు ఉదయం ఇక్కడకు వస్తాడు. ఆ జనార్దనుడు ఆహుక వంశక్షత్రియులకు అధిపతి. యాదవులకు నాయకుడు. ఆయన గొప్పమనస్సు గలవాడు, పరాక్రమశాలి, సత్య సంపన్నుడు. సమృద్ధమయిన వృష్ణిరాష్ట్రానికి మాధవుడు పాలకుడూ, రక్షకుడూ కూడా. మూడు లోకాలకూ ఆ పూజ్యుడు ప్రపితామహుడు. ఆదిత్యులు వసువులు, రుద్రులూ బృహస్పతిబుద్ధిని ఆశ్రయించినట్లు వృష్ణి-అంధకవంశస్థులు ప్రసన్నచిత్తులై, శ్రీకృష్ణుని బుద్ధిని ఆశ్రయిస్తారు. మహాత్ముడైన ఆ శ్రీకృష్ణుని పూజించవలసి ఉన్నది. దాన్ని వినిపిస్తున్నాను, విను. ఒకే రంగూ, సుపుష్టమైన శరీరం గల బాహ్లికజాతికి చెందిన నాలుగు గుఱ్ఱాలను పూన్చిన స్వర్ణరథాలను పదహారింటిని శ్రీకృష్ణునకు కానుక చేస్తున్నాను. కురునందనా! ఎనిమిది ఏనుగులను కూడా శ్రీకృష్ణునకు కానుక చేస్తాను. ఆ ఏనుగులు శత్రువులపై దాడి చేయగలవి. ఒక్కొక్క దానికి ఎనిమిది మంది సేవకులుంటారు. బంగారువన్నెతో అందంగా శుభంగా కన్పించే దాసీలను వందమందిని ఆయన కిస్తాను. వారంతా ఇంకా సంతానాన్ని పొందనివారు. వారితో పాటు వందమంది దాసులనుకూడా ఇస్తాను. గిరిజనులు నాకు కానుకచేసినవి, సుఖస్పర్శ గలవి అయిన పదునెనిమిది వేల కంబళ్ళను కూడా ఆయనకు బహూకరిస్తాను. చీనదేశంలో తయారయిన మృగచర్మాలు

నాదగ్గరున్నాయి. వాటిలో కూడా శ్రీకృష్ణుడు కోరుకొన్నన్ని ఆయనకు కానుకచేస్తాను. ఇదిగో ఈ మణి తేజస్సంపన్నమై నిర్మలమైనది. పగలూ, రేయి కూడా ప్రకాశించేది. దీనిని కూడా శ్రీకృష్ణునకు బహూకరిస్తాను. ఆయన దానికి తగినవాడు. ఒకే రోజులో పదునాలుగు యోజనాల దూరాన్ని చేరగల కంచరగాడిదల రథం ఒకటుంది. దానిని కూడా నేను శ్రీకృష్ణునకు కానుకగా ఇస్తాను. శ్రీకృష్ణునకు ఎన్నివాహనా లున్నవో, ఎంతమంది పరిచారకులు గలరో వారికందరకూ ఎప్పటికప్పుడు అవసరమైన భోజనం కన్న ఎనిమిది రెట్లు ఎక్కువ నేను సమకూర్చిపెడతాను.

దుర్యోధనుడు తప్ప మిగిలిన నా అందరు కుమారులు, మనుమలు వస్త్రభూషణాదుల నలంకరించుకొని అందమైన రథాలతో శ్రీకృష్ణుని స్వాగతించగలరు. చక్కగా అలంకరించుకొనిన వారకాంతలు వేలకొలదిగ, మంగళకరంగా, మహానుభావుడైన శ్రీకృష్ణుని స్వాగతించటానికి నడచి ఎదురు వెడతారు. నగరంనుండి పరదాచాటు అవసరం లేని స్త్రీలు, కన్యలు, సుమంగళులునూ - శ్రీకృష్ణుని చూడ గోరినవారు ఆయనకు ఎదురేగుతారు. ప్రజలు సూర్యుని దర్శించినట్లు స్త్రీ పురుష బాలకులతో కూడిన ఈ సమస్తనగరమూ మహాత్ముడైన మధుసూదనుని దర్శించును గాక ! నగరంలోని అన్నిదిక్కులలో ధ్వజాలను, పతాకాలనూ అలంకరించాలి. రాచబాటపై నీరు చల్లి బాటలో దుమ్ము లేకుండా చూడాలి " అని ఆదేశించాడు ధృతరాష్ట్రుడు. "దుశ్శాసనుని ఇల్లు దుర్యోధనుని ఇంటికన్నా గొప్పది. కాబట్టి వెంటనే దానిని చక్కగా అలంకరించండి. ఈ భవనం అందమయిన ఆకృతి కల ప్రాసాదాలతో శోభిల్లుతోంది. శుభకరమై, అన్ని ఋతుశోభలతోనూ మనోహరమై మహాధనరాశితో విలసిల్లుతోంది. నా దగ్గర, దుర్యోధనుని దగ్గర ఉన్న రత్నాలన్నీ ఇక్కడే ఉన్నాయి. శ్రీకృష్ణుడు అడిగితే వాటిని సంకోచించకుండా ఇవ్వాలి."

87. శ్రీకృష్ణుని ఆజ్ఞను పాటింపుమని విదురుడు ధృతరాష్ట్రునకు జెప్పుట.

విదురుడిలా అన్నాడు. "రాజా ! మూడులోకాలలోనూ నీవు శ్రేష్ఠతముడవు. అంతటా గౌరవం కలవాడవు. లోకంలో గొప్ప ప్రతిష్ఠ, సదభిప్రాయం గలవాడవు. నీవు వార్ధక్యంలో ఉన్నవాడవు. ఈ వయస్సులో నీవు చెప్పినదంతా శాస్త్ర సమ్మతమూ, తర్కసహమూకూడా! ఈ స్థిరభావన వలననే నీవు వృద్ధుడవు. రాజా ! చంద్రునిలో కళలవలె, సూర్యునిలో కాంతివలె, సముద్రంలో పెద్ద అలవలె నీలో ధర్మం సుస్థిరమని మన ప్రజల కందరకూ తెలిసినదే. నీ గుణసమూహం చేతనే ఈ లోకం ఎప్పుడూ

మన్నింపబడుతోంది. అటువంటి నీవు బంధువులతో సహా, ఎల్లప్పుడూ సద్గుణసంరక్షణకై ప్రయత్నించాలి. ఋజుత్వాన్ని ప్రోదిచేసుకో. మూర్ఖత్వంతో కౌటిల్యాన్ని ఆశ్రయించి, నీకు ప్రీతి పాత్రులైన పుత్రులకూ, పౌత్రులకూ, మిత్రులకూ కీడు కల్పించ వద్దు. అతిథిగా రాబోతున్న శ్రీకృష్ణునకు ఎన్నో వస్తువులను ఇవ్వజూపుతున్నావు. ఈ వస్తువులే గాదు, ఈ భూమినంతా శ్రీకృష్ణున కిచ్చినా దానికాయన తగినవారే.

సత్యప్రమాణంగా నా మీద ఒట్టువేసికొని చెప్తున్నాను. నీవు ధర్మమార్గమన్న భావనతో కానీ, శ్రీకృష్ణుని మీద ప్రేమతో కానీ ఇవన్నీ శ్రీకృష్ణున కివ్వాలనుకోవటం లేదు. రాజా ! నేను సత్యం చెప్తున్నాను. ఇదంతా నీ నటన, వంచన మాత్రమే. బాహ్యవ్యవహారంతో కప్పిపుచ్చుకొంటున్న నీ అభిప్రాయం నాకు తెలుసు. రాజా ! పాండవులు అయిదే అయిదు చిన్న గ్రామాలను కోరుతున్నారు. నీవు మాత్రం వారికి వాటిని ఇవ్వదలచటంలేదు. వారితో సంధి చేసికోవాలని నీకున్నట్లు లేదు. మహాబాహువయిన శ్రీకృష్ణుని నీవు డబ్బుతో లొంగదీసుకోవాలనుకొంటున్నావు. ఈ ఉపాయంతో పాండవులనుండి ఆయనను వేరు చేయాలను కొంటున్నావు. నీకొక వాస్తవాన్ని చెపుతున్నాను. డబ్బుఇచ్చి కానీ, మరోవిధంగా ప్రయత్నించి కానీ, నిందించి కానీ, అర్జునుని నుండి శ్రీకృష్ణుని వేరు చేయటం వీలుకానిది. శ్రీ కృష్ణుని మాహాత్మ్యం నాకు తెలుసు. శ్రీ కృష్ణునిపై అర్జునున కున్న దృఢభక్తి కూడా నాకు తెలుసు. ప్రాణ సమానుడైన అర్జునుని శ్రీకృష్ణు డెప్పుడూ విడువడని కూడా నాకు తెలుసు. కాబట్టి నివిచ్చేవస్తువులలో జలపూర్ణమైన కలశాన్నీ, పాదోదకాన్నీ, కుశలప్రశ్నలనూ తప్ప మరి దేనినీ శ్రీకృష్ణుడు స్వీకరించడు. పూజనీయుడైన మహాత్ముడు జనార్దనుడు. ఆయన కిష్టమైన ఆతిథ్యాన్ని సమకూర్చు. ఆయన అందరిచేతనూ అర్చింపదగినవాడు. ఉభయపక్షాలకూ క్షేమాన్ని కోరుతూ శ్రీకృష్ణుడు కురురాజ్యానికి వస్తున్నాడు. కాబట్టి ఆయన కోరుతున్న ప్రయోజనాన్నే ఆయనకు కానుకగా ఇయ్యి. రాజేంద్రా ! శ్రీ కృష్ణుడు నీకూ, దుర్యోధనునకూ పాండవులకు మధ్య సంధిచేసి శాంతిని స్థాపించాలనుకొంటున్నాడు. కాబట్టి ఆయన మాటను పాటించు. రాజా ! నీవు తండ్రివి, వారు పుత్రులు. నీవు వృద్ధుడవు, వారు శిశువులు. తండ్రిలా నీవు ప్రవర్తించు. పుత్రులవలె వారు ప్రవర్తిస్తున్నారు కదా!"

ఇది ఉద్యోగపర్వం మొదటిభాగం

A.C.No 96357

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీక్ష్ణబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.